UNIVERSAL
LIBRARY
OU_204167
UNIVERSAL
LIBRARY

సంసారచిత్రము

(LAKE OF PALMS)

రొమేశచంద్రగుప్త

అనువాదకులు:

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులుగారు

వెంకట... పబ్లికేషన్
సు... బజార్
హై...

ప్రకాశకులు:

కొండపల్లి వీరవెంకయ్య,
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,
రాజమండ్రి.

[కాపీరైటు రిజిష్టరు చేయబడెను]

[వెల 2—0—0.

లక్ష్మీప్రెస్, ఏలూరు.

1947

సుధాకరచ్చంద్రము

మొదటి ప్రకరణము

బంగాళాదేశమునందు నివాసయోగ్యంబైన తాల్పుకూరను గ్రామముకలదు; తాల్పుకూరనఁగా బంగాళీభాషలో తాళ్ళచెరువని యర్థము. ఆ గ్రామమున నొక చెరువు కలదు. ఆ తటాకంబునకు దక్షిణమువైపున చుట్టును కొనచేలు తాటివృక్షములు గలవు. ఈ తాళ్ళచెరువుబట్టియే యాగ్రామమున కానామముకలిగెను. ఆ తటాక ప్రాంతమున వరిచేలు కనుపండువులై యుండును. పట్టుమధ్యాహ్నము ప్రొద్దు కెత్తివిగాక మున్నపుడుతప్ప దక్షిణపవనములందు ముఖ్యముగా నుదయాస్తమయములయందుఁ దటాకజలంబు నిరంతరము తాటిచెట్లనీడచేతఁ గప్పఁబడి యుండుటచే సముద్ర జలంబునుఁబోలి నల్లనై యంధకారపుంజమట్లుండును.

ఒక్కనాఁడు సాయంకాలము భానుఁడపరజలధిని గ్రుంగినపిదప నొక్క యంగన నడుములోతునీట స్నానము చేయుచు నిలిచియుండెను. ఒడ్డుననున్న మెట్లమీఁద తొమ్మిదియేండ్ల ప్రాయముగల యొకబాలిక తన చెల్లెలిం జంకఁబెట్టుకొని తల్లిరాక నిరీక్షించుచుండెను. స్నానము చేయుచున్న యాయింతి ప్రక్కనీరు గొంపోవవలసిన పెద్దకుండ యొకటి యుండెను. స్నానము చేయుచున్న యా వితంతువుయొక్కయు గట్టుననున్న యిరువుర బిడ్డలయొక్కయుఁ జరిత్ర మిక్కిలి దయనీయమైనది. ఆ వనిత గౌరవముగల కాయస్థకుటుంబమున జన్మించి హరిదాస మల్లికుఁ డనువానికిచ్చి వివాహము చేయబడెను. ఆమె తలిదండ్రులు భర్తయు సామాన్యస్థితి గలవారు. ఆమె మగని కాఱెకరముల భూమి యుండెను. కాయస్థుఁడు చేత నాగలిఁబూని దున్నకూడదు. కావున హరిదాసమల్లికుఁడు పాలేళ్ళంబెట్టి తన చిన్నభూమి సేద్యము చేయించుచు వచ్చెను. పండిన ధాన్యమందు దివాణమున కీయవలసిన పన్నులు, పాలేళ్ళకీయవలసిన భాగము పోఁగా మిగిలిన ధాన్యము స్వకుటుంబ పోషణమునకు జాలని హరిదాసు తలు

చుగా ద్రవ్యములేక యిబ్బంది నప్పుడప్పు డితరుల సహాయము నపేక్షింప వలసిన వాఁడ గుచు వచ్చెను. హిందూదేశమున నాలు మగఁడుఁ గంపెడుపిల్లలుగల కుటుంబము లనేకము లీతెఱంగుననే దినమునకు నాలుగైదణాల రాఁబడి గలిగి లోకయాత్ర నెంతో కష్టముగా గడుపుకొనుచుండుట మనమందఱ మెఱిఁగినదేకదా! హరిదాసు సంవత్సరము పొడుగున కష్టపడినను వాని కంతమాత్రమైనఁ జేఁజిక్కుట కష్టమయ్యె. హరిదాసుయొక్క పెదతండ్రి కుమారుఁడు తారుణీమల్లికుఁడు బర్ద్వాను (వర్ధమాన) పట్టణమున మహారాజుగారి కొలువులో నుండెను. అన్నదమ్ములే పరస్పరసహాయము జేసికొనుట యరుదైన యీ దినములలో పెదతండ్రి కుమారులవలన సహాయ మపేక్షించుట యీ కాలవృక్షముయొక్క ఫలముల నపేక్షించుటయే యైన నప్పుడప్పుడు తారుణీమల్లికుఁడు, హరిదాసు సొమ్మున కిబ్బందిపడి తన్నడిగినప్పుడు చేబదులుగ పదిగాని యిరువదిగాని రూపాయలు బదులిచ్చి తిరిగి యతఁడా సొమ్మిచ్చివేయునప్పుడు వడ్డీమాత్రము గ్రహింపక నుపకారము చేయుచుండును. అట్లగుట హరిదాసు జీవనము మొదటినుండియుఁ గష్టజీవనమె యైన నతఁడు సంతుష్టుఁడై కాలక్షేపము చేయుచు వచ్చెను.

వివాహమైన పదియారు సంవత్సరములకు హరిదాసున కొక ముద్దులకూఁతురు పుట్టెను. ఆ ప్రథమ సంతానమునకుఁ దలిదండ్రులు మురిపెమై బిందుదేని యని పేరు పెట్టిరి. లేకలేక పుట్టినబిడ్డయగుటచే బిందు మిక్కిలి గారాబమునం బెరుగుచుండెను. తలిదండ్రుల గారాబము దారిద్ర్యమును రూపుమాప లేదుకదా! అందుచేత బిందు తలిదండ్రు లెంతముద్దుచేసినను నిరర్థకమే యయ్యుండెను. తారుణీమల్లికుఁడు దేవీ నవరాత్రములకు వర్ధమానపట్టణమునుండి స్వగ్రామమగు తాళ్ళచెరువునకుఁ బోయి తన కూఁతురైన యుమకు సన్నసువ్వలువలు బంగారుమురుగులు వెండియందెలు కడియములు మొదలగునవి తెచ్చుచుండును. అదిచూచి తాను పేదవారి బిడ్డనన్నమాట యెఱుఁగక బిందు తనకుకూఁడ నట్టివి తెమ్మని పోరుపెట్టుచు వచ్చినందున తల్లిదండ్రులా పోరు పడలేక యప్పుచేసి బిందు చేతులకు గుల్లమురుగులు, కాళ్ళకు గుల్లకడియములు జేయించిరి. అందుకైన ఋణము హరిదాసు చాలాకాలమునకుఁగాని తీర్పలేక పోయెను. ఋణమైనను నది వస్తురూపముగా నుండుటచేఁ గుటుంబమున కెప్పటికైన నుపయోగించు విలువసొమ్మని చెప్పవచ్చును. హిందూదేశమున పేద కుటుంబములలో స్త్రీలు చేయించుకొను నగలే వారికిఁగల సొత్తగుటచేఁ దఱచుగాఁ గుటుంబమున కెంతో యుపయోగములుగా నుండుట మన మెఱుంగుదుము కదా! అందుచే పేదలు నగలకొఱకై ప్రాకులాడుటగర్హ్యము కాదు. ఉమాబిందులు సమానవయస్కులగుట బిందు తఱచుగా నుమతో నాడుకొనుటకుఁ బోవుచుండును. బిందు సహా

జముగా సాధుస్వభావయు మితభాషిణియు నగుటచే నతని కామెయందు గాఢానురాగముండెను. ఉమకుఁ దల్లిదండ్రులు తినుటకు మిఠాయి పండ్లు మొదలగు మధుర పదార్థము లిచ్చునప్పుడామె తన ప్రక్కను నేకపిల్లవలెకదలక మెదలక పేదచూపులం జూచుచు, నిలిచియున్న బిందున కందు గొంచెము పెట్టుచుండును. తనవారు చేరువ యూరి సంతనుండి తనకు లక్కపిడతలు, బొమ్మలు మున్నగునవి తెచ్చియిచ్చునప్పు డాబాలిక నెనరు గలిగి బిందును జేరఁబిలిచి యప్పుడప్పు డొక బొమ్మయు నొక లక్కపిడతయు నిచ్చుచుండును. దానిం జేకొని బిందు పట్టరాని యానందము నొంది పరుగు పరుగున నింటికిం జని తల్లికిం జూపి మురియుచుండును. నిఱుపేద యగుతల్లి కూఁతు నెత్తికొని ముద్దాడి ముద్దులు మూటగట్టు బిడ్డకు దాకొనియుం గొని యియ్యలేనందుకుఁ గంటఁ దడి పెట్టుకొనుచుండును. బిందు పుట్టిన నాలుగేండ్లకు హరిదాసునకు మఱియొక పుత్రిక పుట్టెను. పెద్దకూఁతురు కొంచెము చామనచాయ గలది. కాని క్రొత్తగాఁ బుట్టిన యీబాలిక మహారూపవతియై యప్సరసవలె నుండెను. ఆమె మేనిచాయ మేలిమి వలె నుండును. కన్నులచ్చముగ తుమ్మెదలే. పెదవులుదొండపండులే. నవ్వులమృతవర్షములే. చక్కనిచుక్కయగు నాబిడ్డకుఁ దల్లిదండ్రులు "సుధ" యని నామకరణముచేసిరి. సుధ యనగా నమృతము. సుధకు జననీ జనకుల ముద్దే కాని మఱియే ముద్దుసౌఖ్యములు లేవు. ఆమె పుట్టినవెనుక కుటుంబమునకు వ్యయ మధిక మగుటచే దండ్రికి మనోవ్యథ యధికమయ్యెను. ఏలయన, బిడ్డకు పాలు కావలసివచ్చెను. కాళ్ళకు చిన్న యందెలు కడియములు గావలసివచ్చెను. ఇరుగు పొరుగమ్మలక్కలకు బిడ్డను జూపవలసి వచ్చినప్పుడు మంచిపరికిణీలు మొదలగునవి కట్టవలసివచ్చెను. వీనికన్నిటికి సొమ్ము కావలసి వచ్చెను. అది లభింపనప్పుడు కన్నతల్లి హృదయ మెంత కరుగునో యెవ్వఁడెఱుంగును. పేదతండ్రి మనోవ్యథ నేకవి వర్ణింపఁజాలును.

ఇట్లు దారిద్ర్యముతోను, మనోవ్యథతోను, హరిదాసు దినమెల్ల శ్రమపడి కుటుంబపోషణ చేయుచుండ వానియిల్లాలు పరమసాధ్వియై మగని పరిచర్యయందును బిడ్డలపోషణయందును రవంతయు నేమఱకవచ్చెడు నిముసములు సుఖముగా నెంచికొనుచు సంసార మొకరీతిగా గడపుచుండెను. ఆమె తెల్లవాఱకమున్నె లేచి వంటచేసికొను నిత్తడిపాత్రలు తోముకొని యిల్లు వాకిలి చిమ్ముకొని పిల్లలకుంబాలుపోసికొని వంటచేసికొను చుండును. మగని భోజనానంతరము కొలువునకుఁబోవు స్నానముచేసి నీరుతెచ్చికొనును. ఆమెమధ్యాహ్నభోజనముచేసి దొడ్డిలోనున్న చెట్లనీడల బిడ్డలుందానును బవళించి యించుకసేపు నిద్రించుచుండును. సాయంకాలము మరల నెప్పటియట్ల వంట మొదలగు గృహకృత్యముల నెఱవేర్చి రాత్రిభోజనముగువఱకు నెడతెగక పనిచేసి భర్తను

బిడ్డలను నిద్రవుచ్చి యనంతరము తాను కూడుగుడిచి కంచములు పళ్ళెములు తోమికొని తలుపులకు గొళ్ళెములుపెట్టి ప్రాణనాథునిప్రక్కఁ బవళించును. భర్తృసేవయే తాపోధనముగా నెంచికొనునది కావున హరిదాసుభార్య నిరుపేదతనము నుండియు దానిని లెక్కసేయక మిక్కిలి భాగ్యముతో దులతూగుచున్నవారికంటె నెక్కువసౌఖ్య మనుభవించుచు సంసారము దిద్దికొనుచుండును. ఆమె నిజముగా పేదరిక మనుభవించు చున్నదా? లేదు. ఆమె కున్న భాగ్యము కోటిలోనొక తెక్కైన దొరకునా? ఎట్లన, సదృష్ట వశమున నామెకు సుగుణాకరుఁడును బరమసాధువునై తన పాలిటి దైవమని చెప్పదగిన భర్త లభించెను. రెండియు వెలలేనిరత్నాలనగలవంటి ముద్దుబిడ్డ లిద్దరుండిరి. ఈభాగ్యము లుండుటంబట్టి యాయిల్లాలు నిర్విచారముగఁ గాపురముసేయఁగలిగెను. పేదరాలై పతివ్రతయైన కులకాంత కింతకంటెఁ గావలసిన దేమున్నది.

కటకటా! యీసౌఖ్య మామె చిరకాల మనుభవింపఁ జాలదయ్యె. పాపపు విధి నిర్ణయ మటు లుండఁ దదన్య మెట్లు కాఁగలదు. సుధ జనియించిన నాలుగు సంవత్సరములకు హరిదాసు మిక్కిలి కాలధర్మము నొందెను. అప్పు డమ్మహాపతివ్రత శోకసంతప్తయై పలుమారు మూర్ఛిల్లి, మొత్తికొని, గుండెలు బాదుకొని గ్రామమంతయుఁ బ్రతిధ్వని నిచ్చునట్లు వినువారిగుండెలు పగులునట్లు విలపించెను. పరమసాధ్వియగు నాయింతి గృహమునకు వల్లభుఁడగు పురుషుని దైవ మంత్రకూటముగా నేల గొంపోవలయును? ఆపేదయింటికిం బ్రకాశతఁగలుగఁజేయు దీపము నతఁ డేలయార్పవలయును? ఊరివా రందఱువచ్చి వారిసంతాపమునుజూచి తాము నించుక విలపించి యామెనూరడించుచు వచ్చిరి. కాఁపువాండ్రు పొలమునకుఁబోవునప్పు డామెయింటిముందొక నిమిషము నిలిచి కంట దడిపెట్టికొని పోవుచుందురు. భర్తృవియోగమైన సంవత్సరమునకు, జ్ఞాతియగు తారుణీమల్లికుఁడు హరిదాసుభూములను సేద్యము చేయింప సమకట్టి స్వాధీనము చేసికొనెను. కాని యతఁ డిచ్చుధాన్యము పాప మావితంతువునకు నామె యిరువురుబిడ్డలకుఁ గడుపునిండ తినుటకుఁ జాల దయ్యెను. ఇంటిచుట్టు కొరడివేయించికొనుటకైన నామెకు సామర్థ్యము లేకయ్యె. ఇల్లు కురియుచున్నను మరల నేయించికొనఁ జాలదయ్యెను. అందుచేత నాపడతి తనచిన్నయిల్లమ్ముకొని వేలువిడిచిన బావగారైన తారుణీమల్లికుని యింటివద్ద రెక్కలకష్టముచేసి బిడ్డలం దానును బ్రతుకఁదలఁచి వాని యింటికిఁబోయి వానిపాలం బడెను. అక్కడ నామె రెండుసారులు వంట జేయుటయే గాక గృహసంబంధమైన కృత్యములు నీచములనక యుచ్చములనక చేయఁజొచ్చెను. తన గారాబుబిడ్డలగు బిందును, సుధను నేలఁగూర్చుండబెట్టి తారుణీమల్లికునికూఁతు నెత్తికొని మోయుచుండును. ఇంటికి గావలసిననీరు దెచ్చుచుండును. అంట్లు తోము

చుండును. కసవుచిమ్ముచుండును. అనాథలై జీవనమునిమిత్త మొకరియాధారమును బడసినవారు మిక్కిలి యోర్పుగలిగి యుండవలయును గావున నీవితంతువు చీవాట్లకు లెక్కసేయక యెన్నఁడు నధరస్పందము చేయకయుండెను. అప్పుడప్పుడు హృదయము దుఃఖపూరితమగుటయు నొంటిగ నొకతావున కలిగి కన్నీరువిడిచి మనంబున నీవిధంబున నీశ్వరప్రార్థనచేయుచుండును. "ఓదీనదయాళూ! నాచిన్నకూనలగు బిందును సుధను రక్షింపుము. వారిద్దరు సుఖపడునట్లు లలాటములమీఁద వ్రాయుము. నీకరుణామృతము వారిపై వెదజల్లుము. సుధకు బిందకు నేను బ్రతికియుండఁగానే వివాహము లగునట్లను గ్రహింపుము. నాకింతకన్న గావలసినది లేదు." చెలువులొ మొలబంటు నీటను దిగి స్నానము చేయుచున్న యాపడఁతియొక్కయు మెట్లపైనున్న యిరువురు బాలికల యొక్కయుఁ బూర్వచరిత్రమిది.

కొంతసేపటి కాయింతి నీరుముంచి కడవ భుజముపైఁబెట్టుకొని "అమ్మా బిందూ! యింక నింటికి పోదములెమ్ము. నీవు చెల్లెలి నెత్తికొనఁగలవా? పాపము యింటివద్దనుండి నడచివచ్చునప్పటికి దాని లేతకాళ్ళు నొప్పులెత్తి యుండును. అది దూరమెట్లు నడవగలదు? అయ్యో! పాపము నిద్రకూడ పోయినదా? యనుచు నీరు వెడలి బిడ్డలవైపు వచ్చెను." "అవునమ్మా! చెల్లెలు నిద్రపోయినది. ఏలాగో నేనెత్తుకొని వచ్చెదనులే" యని బిందు తల్లికి త్తరముచెప్పెను. "నా తల్లీ వద్దువద్దు. నిద్రపోవుటచే బిడ్డ యెక్కువ బరువుగా నుండును. కావున నీవె త్తుకొనఁలేవు. దానిని నాచంక కందిచ్చి నీవు నా చీరకొంగు పట్టుకొని నావెనుక నేరమ్ము. అదిగో మబ్బులు కాలుక్రమ్ముచున్నవి. ఈరాత్రి తప్పక వర్షముకురియును. త్వరగాఁ బోవుదమురమ్ము" అని తల్లి పలికెను. పలుకుటయు బిందు అమ్మా! సుధను నేనె త్తికొని రాఁగలనే. మొన్నరాత్రి మన కాళీగారియింటికి నేను చెల్లెల నెత్తికొని రాలేదా? ఈ కొంచెము దూరమే మోయ లేనా? యని బదులుచెప్పుటయు "సరే! అలాగే యెత్తుకొనిరా, కాని చాల చీఁకటిగా నున్నది. నీవు పడి దానిఁ బడవేయక జాగ్రత్తగా నడువుము. మొన్న మన యుమ తీర్థములోనుండి వచ్చునప్పుడు దారిలో బడెను. పాపము దానికి మొగముమీఁద పెద్ద పెద్దగాయము తగిలి నెత్తురు వచ్చె"నని తల్లి యుపదేశపూర్వకముగాఁ బలికెను. ఆ పలు కులు విని బిందు అమ్మా! ఏటితీర్థమునకే మన యుమ పోయినది? అది కొనితెచ్చికొనిన బొమ్మలు నేను చూచితిని. యెంతబాగున్నవే? అంతమంచి వెక్కడి దొరికినవో! యని యడిగెను. నాతల్లీ! నీవెఱుఁగవటే. అగ్రద్వీపమున నేఁటేట గొప్పతీర్థము జరుగును. అక్కడ [illegible] కొలంది [illegible] నాట్యక్రీడ వైష్ణవుల సంప్రదాయములు [illegible]
[illegible] అనేకులు [illegible] గీతములతోను [illegible]

యుండును. అని తల్లి పుత్రికతో బలికెను. అమ్మా ! నీవెప్పుడైన నాతీర్థమునకు పోయితివంట యని బిందు ప్రశ్నవైచెను. అందుకుఁ దల్లి యిట్లనియె. "నేను నీయంత పిల్లనై యుండఁగా నొక్కసారి యాతీర్థమునకుఁబోయి చూచితిని. మాయమ్మయు, నాయనయు నేను, మాచుట్టాలుకలిసివెళ్ళి మూఁడునాళ్ళక్కడ చెట్లక్రిందనే బసచేసి యుంటిమి. "చెట్లక్రిందనా? ఆయూరిలో ఇండ్లులేవా" యని బిందు మహాశ్చర్యముతో నడుగుటయు "నాతల్లీ ! అందఱకు నిండ్లు దొరకునా? యేఁబదివేలమంది యాతీర్థమునకుఁ వత్తురు. అందుచేత నందఱు చెట్లక్రిందనే యుందురు. అక్కడొక పెద్దమామిడితోట యున్నది. ఆచెట్లక్రిందనే వర్తకులు దుకాణము పెట్టుకొని యన్నిసరకుల నమ్ముకొందురని తల్లి బిడ్డకు బదులుచెప్పెను. "అమ్మా ! ఆ తీర్థము నాకుఁ జూడవలెనని యున్నది. అది నా కొక్కసారి చూపెట్టవే ?" అని బిందు ముచ్చటపడి వేఁడఁ దల్లి సన్నకంఠముతో "అమ్మా తీర్థమును నీకుఁ జూపించుటకు నేనందరివంటి యదృష్టవంతురాలనా ? ఆ ప్రయాణమునకుఁ జాలడబ్బు ఖర్చగునని పలికెను. ఆ మాటల కిష్టపడక బిందు పోనీ, ముందునాటికి నన్నుబంపు. మన యుమ, కాళి, వెళ్ళిచూడఁగా నేనెందుకు వెళ్ళకూడదే ? యని యజ్ఞానవశమున దనస్థితి యెఱుంగక వచియించుటయు జనని యిట్లనియె. "నాతల్లీ ! నీవు మంచిదానవు. మోటపట్టు పట్టగూడదు. ఉమతండ్రి కాళితండ్రి భాగ్యవంతులు. కావున వారెక్కడకైనఁ బోవఁగలరు. మీరు పేదరాలి బిడ్డలు కారా? మీకు ముచ్చటలు, వేడుకలు తక్కిన వారితోఁబాటు తీరునా ! బ్రహ్మదేవుఁడు మీరు సుఖపడవలెనని మీనొసట వ్రాసినపక్షమున నా కడుపున నేల పుట్టుదురు. బంగారపు బొమ్మలవంటి నా చిట్టితల్లులిద్దరు మఱియొకరియింటఁ గడుపుకూఁటి నిమిత్తమై యేలయుందురు ? దైవమా ! నీ నిర్ణయము జరుగుచున్నదిగదా !

కాఱుమబ్బులు, మబ్బుల ననుసరించి గాఢాంధకారములు నలుదిక్కుల వ్యాపించెను. మెఱుపు తళతళమని పడుమపడుమ మెఱయఁజొచ్చెను. మబ్బుపైగాలి చెట్లయాకులను గలగల లాడించుచు వీవఁజొచ్చె. గ్రామమంతయు నిశ్శబ్దముగ నుండెను. నక్కకూఁతలుతప్ప మఱియేధ్వనులు వారిచెవులకు వినఁబడవయ్యె. ఆకసమున నొకటిరెండు నక్షత్రములు దూరమున నేఁటంటనో మిణుకుమిణుకు మనుచున్న చిన్న దీపముతప్ప మఱియు వెలుగు గానబడుటలేదు. ఆ చిమ్మచీఁకటిలో బిందు తల్లి చీరకొంగుపట్టుకొని చెట్లక్రిందనుండి యూరిపొలిమేరలో నడువఁజొచ్చెను. చీఁకటియగుటచేతఁ దల్లి కన్నీరువెట్టుకొని నడుచుచున్నదని బిందు కనుఁగొనలేక పోయెను. ఇట్లుపోయి తల్లి బిడ్డ లిల్లుజేరిరి.

రెండవ ప్రకరణము.

అక్కచెల్లెండ్రు

తాళ్ళచెఱువు గ్రామమున దట్టమగు చెట్లపొదల నడుమ నొకచిన్న కుటీరము కలదు. అది మట్టమధ్యాహ్నము. చుట్టుప్రక్కల పొలములు మండువేసంగిఁ జండతరుఁడైన భాస్కరుని యెండలో మెఱయఁ జొచ్చెను. పాటకాఁపులు రెండు జాములవరకు పొలములలోఁ బనిజేసి నాగళ్ళు భుజములపై వైచికొని పశువులఁ దోలుకొని యిండ్లకుఁ బోవుచుందురు. అతి పరిశ్రమముచేత నలసిసొలసిన కొందఱు కాఁపులు గృహముల కరుగలేక పొలములో నేచెట్టునీడనో బడి నిద్రింపుచుండ వారికొఱకు భార్యయో, బిడ్డయో, తోఁబుట్టునో యింటనుండి యన్నము గొనిపోవుచుండెను. కన్నులు మిరుమిట్లు గొలుపు నా మధ్యాహ్నపుటెండలో నీడగల యా గ్రామమే చల్లనితావు. గ్రామము నందలి ప్రతి ప్రదేశమున విశేషముగఁ బెఱిఁగిన వెదురుపొదలయాకులు గాడ్పునకుఁ గదలజొచ్చె. తరుచుగా రెండుమణుగుల బరువుండు పనసపండ్లు తియ్యని నీరుగల కొబ్బరిబొండములు గ్రామమునఁ బ్రతి పాటి పెరటియందుఁ బ్రతియింటిముంగు బండుచుండును. మూఁడడుగుల పొడవుగల యరఁటిగెలలు నున్నని యాకులనడుమ వ్రేలాడుచు గనులపండువు సేయును. గ్రామమునఁ గొన్నిచోట్ల వీధులకిరుప్రక్కల బొమ్మజెముడు మొదలగు ముండ్లచెట్లు మొలిచి మార్గమును సన్నముగ జేసెను. ఊరిలో సగముభాగ మడవిమొక్కలతో నిండియుండును. ప్రక్కనున్న మామిడితోఁట రెండుమూఁడెకరముల నేల నాక్రమించుకొని చల్లదనమునకు దావై నీడలనిచ్చుచు మనోహరముగ నుండును ఆ మధ్యాహ్నమున సూర్యుఁడు తీక్ష్ణములై శూలములట్లున్న తన ధవళ కిరణములను తోఁటలోని చెట్లయాకుల సందునుండి నేల మెఱయుచుండు పచ్చగడ్డిపై బ్రసరింపఁజేయజొచ్చె. ఆ తోఁపునుండి యావలకు వినఁబడునట్లు నిముసమైన నెడతెగక కూయు పావురముదక్క దక్కిన పక్షులన్నియు నెండవేడిమిచేత నోరెండి పలుకఁ జాలవయ్యె.

ఆయూర నీడగల యొకచోట నొకగృహము గలదు. దాని వీధిచావడికి నలు ప్రక్కలఁ గొబ్బరిమొక్కలు గలవు. దాని వెనుక నొకవాకిలియు దానినంటి యొక గృహమును గలవు. ఈ గృహమే యింటివారికి నివాసయోగ్యమై శయనయోగ్యమై యుండును. దానికి ముందువైపొక పంచపాళిగలదు. ఈ ప్రక్కనొక చిన్న వంటయిల్లు గలదు. దొడ్డిలో నొక పశువులశాల యుండెను. అం దొక్కటే పాడియావున్నది.

ఇవి యన్నియుఁ బ్రాఁతియాకు గృహములే. ఈ గృహమందుఁ వసియించు కుటుంబము లోనివా రప్పుడప్పుడే మధ్యాహ్నభోజనము ముగించియుండిరి. పొయిలోని నిప్పు సయితము మార్పివేయఁబడెను. కొరడిమీఁదఁ గొన్నిబట్ట లెండవేయఁ బడియుండెను. దొడ్డిలోనున్న దిగుడుబావినీటిలో వంటగిన్నెలు, పళ్ళెములు వేయబడి యుండెను. కాని వానినప్పటి కెవ్వరుఁ దోమియుండలేదు. ఆ బావియొద్దన గొన్ని యరఁటిచెట్లుమాత్రమే కలవు. తక్కిన దొడ్డి యంతయు ముండ్లచెట్లతో నిండియుండెను. పండుకొను గదితలుపు మూయఁబడి యుండుటచే గదియంతయు నంధకారబంధురమయ్యెను. ఆ గృహయజమానురాలు గదిలో నిటునటు పచారుసేయుచుండెను. రెండేండ్ల వయసుగల యామె చిన్నబిడ్డ గదిలో నొక చాపమీఁద నిద్రపోవుచుండెను. ఆఱునెలల ప్రాయముగల కొడుకును నిద్రపుచ్చుటకై యామె గదిలో నిటునటు దిరుగుచుఁ జేతితో బాలకుని జోకొట్టుచు నెడనెడ శ్రావ్యముగా జోలపాడుచు వచ్చెను. ఆ యువతి రమారమి యిరువదేండ్ల వయసుగలది. ఆమె కరచరణములు మిక్కిలి కోమలములై యుండెను. ముఖము మంజులమె యగును. కాని యే కారణంబుననో యించుక తెల్లబారియుండెను. ఆ యెలనాగ కన్నులు వెడదలై నీలోత్పలంబులవలె నిగనిగలాడుచు మొగమున కెంతయు వన్నె దెచ్చుచుండెను. అన్యదేశములందలి యువతు లీవయస్సున నీమెకంటె శరీరదార్ఢ్యము కలిగి ముఖలావణ్యము కలిగియుందురు. హిందూదేశమున నువిద లిరువది యేండ్లు వచ్చునప్పటికి గృహిణులై యిద్దరు ముగ్గురు బిడ్డల తల్లులై యుండుటచేతను సంసార సంబంధములగు మనోవ్యథలు వారిం బీడించుచుండుట చేతను సాధారణముగ ముఖవర్చస్సు దొలంగియుందురు.

కొంతసేపటికి బాలుఁడు నిద్రవోయెను. పిమ్మట నామెయుఁ జేయి తలగడఁగాఁ బెట్టుకొని కొండొకసేపు విశ్రమింపఁ బండుకొనెను. అది మట్టమధ్యాహ్నమైనను. ప్రచండమైన యెండవేఁడిమిచేత నొక మధ్యరాత్రమందువలె మాటుమణఁగి యుండెను. బహిఃప్రపంచమువలెనే గదియు నిశ్శబ్దమయి యుండెను. బాలిక యనదగిన యా మాత బిడ్డలప్రక్క నిదురించెను. సంసారబాధ లా సమయమున నామెను విడిచి దవ్వరుగుటచే నా ప్రశాంత సమయమున నామె మొగము మేలుకొన్నప్పటికంటె వికాసవంతమై యలరుచుండెను. ఆమె రమారమి యొక గంటసేపు నిదురించునప్పటి కేదో చప్పుడయ్యెను. ఆ చప్పుడువిని యామె మేలుకాంచె. ఆమె కన్నులు తెఱచి చూచునప్పటికి మెఱయు గన్నుఁగవతోఁ జిఱునవ్వు వెన్నెలలుగాయు ముఖచంద్రమండలముతో ముద్దులు మూటగట్టు నొక బాలిక పెద్ద పిల్లితో నాడుకొనుచు నామె యెట్టయెదుట గానంబడెను. ఆ బాలిక [illegible] బాలికయు

నా వస్తు హామార్జాల కిశోరమును కిద్భుకటియుంటిలోలె నడిచుచున్నది. యూరకొను నవ్వుచు దూరముగ లాగుదు వినోదము జూచుచుండెను. ఆ కోపదృష్టిమీద మనోహరిణి కాని దీర్ఘాలోచన కాని మొలక లెత్తలేదు. ఆమె సమాజాదరణీయము లౌన దేహము గ్రక్కుచుండెను. పెదవులు చిఱునవ్వుతో వెలయుచుండెను. పృథుపుష్టమైన యామె బాహువులు మెత్తని పువ్వుగుత్తులతో నిండిన తీగలలాగున మనోహరములై యుండెను. ఆమెకది పదియారవయేడు. బాల్యమునుండి యౌవనారంభమునకు సంక్రమించిన చాకచక్యము మొదలగున వామె నప్పటికిని బాయలేదు.

అటు లున్న యా ముద్దుగుమ్మను జూచి గృహయజమానురాలు "సుధా ! యెంత సేపైనదే నీవు వచ్చి" యని యడిగెను. అప్పుడా యక్కచెల్లెండ్రకు క్రింది సంభాషణ జరిగెను.

సుధ—చాలా సేపైనదే ! నీవు గాఢముగ నిద్రపోవుచుంటివని లేపలేదు. అక్కయ్యా వినుము. ఈ పిల్లిపిల్ల నే నెక్కడికిపోయిన నక్కడకు నావెంట వచ్చును. నేను వంటయింటి తలుపుమూసి యాటుగిన్నెలందోమి తిరుగుచుండగా కనబడకపోవ నది కూడ నన్ను వెంబడించినది.

అక్క—గిన్నెలం దేమి గదిలో బెట్టితివా ?

సుధ—ఆ. పెట్టితిని. ఆ పని జేసికొని యీ పిల్లిపిల్లను పశులశాలలోన బడవైచితిని. కాని యది తడకల సందునుండి దూఱి మరల నా యొద్దకే వచ్చినది. ఈ వస్తువు దానికి గావలెనట. కాని నేను దానికియ్యను.

అక్క—నీకు రాత్రిగూడ సరిగా నిద్ర లేదు గదా ! నీవు కొంచెము సేపెందుకు నిద్రపోవే ?

సుధ—'అక్కయ్యా ! పగలు నాకు నిద్రరాదే ! అయినను రాత్రి నాకు సరిగానే నిద్రపట్టినది. నీ పిల్లవాడేడ్చినప్పు డొక్కసారిమాత్రము నేను మేలుకొంటిని. పిల్లవాడీపూట నేలాగున నున్నాడు ?'

అక్క—వాని కిప్పుడు నెమ్మదిగానే యున్నది. రాత్రి మొదలు కొంచెము వేడిగా నుండును. తండ్రి కాట్వానుండి యీపూట కొంచము మందు దెచ్చి వేయుదురు. ఆ మందు జ్వరమును తగ్గించి సుఖముగా నిద్ర పట్టించును.

సుధ—అక్కయ్యా ! కాట్వానుండి బావ యెప్పుడు వచ్చునే ?

అక్క—సాయంకాలము వత్తునని చెప్పివెళ్ళినారు. ఎందుకేమిటి ?

సుధ—(నవ్వుచు) ఎందుకా నేను బావను కొంచెము హాస్యము చేయవలెనని యున్నదిలే ! అది యేమిటో నే నిప్పుడు చెప్పను. బావ రాగానే చూడగలవు. ఆ వేళ నా మీద నిరాపాడి వేసినాడు. అందుకు నే నిప్పుడు కసిదీర్చికోవలెను.

అక్క—నీ వేమి చేయఁదలచుకొన్నావో చెప్పరాదఁటే !

సుధ—చెప్పుతా. నీవు ముందుగ నతనితోఁ జెప్పివేయుదువు.

అక్క—చెప్పను లే.

సుధ—చెప్పవుగదా ! నిజముగా చెప్పవు గద ?

అక్క—నిజముగానే చెప్పను.

అంతట సుధ చీరకొంగుముడి విప్పి యొక చిత్ర వస్తువుఁ బైకి తీయ మరల నక్కచెల్లెం డ్రిట్లు సంభాషించిరి.

బిందు—అమ్మాయి ! యిది యేమిటే ?

సుధ—అక్కయ్యా ! చూడఁగానే తెలియ లేదఁటే ?

బిందు—తెలియు చున్నది. ఇది జనపనార కాదఁటే ?

సుధ—అవును. జనపనారయే కాని దానికి నేను కుసుంభవర్ణమువైచితిని.

బిందు—అట్లయిన నీ కీ రంగుపేఁ చెందుకే ?

సుధ—ఎందుకో చెప్పుకో.

బిందు—నేనెట్లు చెప్పుకో గలను.

సుధ—ఇంతే ఇదే చెప్పుకోలేవఁటే. ఈ రాత్రి బావ నిద్రపోవునప్పుడు నేనీ పేఁచాలని గడ్డమునకు గట్టి యుంచుదు. లేచినప్పుడు పెద్దగడ్డం బావజీగారు వచ్చినారని యెగతాళిజేసి నవ్వెదను. ఇది మంచి వేళాకోళము కాదూ ?

అని సుధ తనమాటలకుఁ దానే వికవిక నవ్వెను. బిందు లోపలినుండి వచ్చు చిఱునవ్వు నాపుకొనలేక యొక్కసారి నవ్వి సుధయొక్క ముఖారవిందమునుఁజూచి తనలో నిట్లని విచారించెను. "అయ్యో ! నాతల్లి వెఱ్ఱిసుధ. నీ చిరునవ్వు లెంత మనోహరములుగా నున్నవే ? కటకటా ! నీకర్మము కాలిన దనియు నీ బ్రతుకు వృథయైన దనియు నీవెఱుఁగవుగద. ఆ పాపిష్టిదైవ మింతచిన్నతనములో నీ మొగమున నెక్కడవైధవ్యము వ్రాసెనో గదా."

ఈ గ్రంథారంభమం దొకనాటి సాయంకాలము తల్లియు నిద్దఱుకుమార్తెలు తాళ్ళచెఱువునద్దకు నీరునిమిత్తమువచ్చి యిప్పటికి పదిరెండు వత్సరములైనది. మనము పైన చదివిన కథనుబట్టి యీ నడుమ కాలగతి యెట్లుమారెనో తెలిసికొనవచ్చును. ఈ బాలికలతల్లి జ్ఞాతిగృహమునందుండి బిడ్డలం బెంచెను. మగని మరణానంతరమామె సౌఖ్యమన నెట్టిదో యెన్నఁడెఱుంగక పోయినను దనకుమారికల కిరువురకు నెట్లయిన వివాహమైనంజాలునని యెల్లప్పుడు గోరుచుండెను. ముద్దుకూఁతుల పెండ్లిండ్లు కన్నులార జూచు కుతూహలముచేతనో వివాహము కాకుండఁ గన్యల నిలుపఁగూడదను మత

నిర్బంధముచేతనో చాలకాలమువఱకు నిలిపిన మంచి సంబంధములు దొరకవను భయముచేతనో మనదేశమునఁ దల్లిదండ్రులు కూతులకేడెనిమిదేండ్లు వచ్చినది మొదలు భర్తల వెదకుచుందురు. అందుచేతనే తల్లి బిందునకుఁ బదియవయేఁడు రాఁగానే పెండ్లి నిమిత్తము తొందరపడి వరుని వెదకఁజూచెను. పరువుగల కుటుంబమునఁ బుట్టినను బీదబాలికల కనుకూలసంబంధములు లభించుట యరిదిగదా. పట్టణములందుండు నాగరికులగు తల్లిదండ్రులు కొడుకుల వివాహములప్పుడు వేనవేలు రూప్యములఁ గట్నములుగా నపేక్షించుట యీనాటి యాచారమైయున్నది. పల్లెలలో నీ దురాచారమంతగాఁ బ్రబలి యుండకపోయినను జననీ జనకులు తమకుమారులకు భాగ్యవంతుల కూఁతులం దెచ్చి పెండ్లిచేయుటకై యత్నింతురుగాని మగఁడు మృతినొందఁ జుట్టముల పంచను జేరి రెక్కలకష్టముఁ జేసి యెట్లెట్లో బిడ్డలం బెంచుకొనుచున్న పేదరాలికూఁతు నేతల్లిదండ్రులు తమకుమారునకు నెఱిఁగియెఱిఁగి వివాహము జేయుదురు? దిక్కుమాలిన యాయిల్లాలొక్కతియె బిందు వివాహమును గూర్చి బెంగగొని సంబంధములు వెదకఁ జొచ్చెను. కాని తారుణ్యమల్లికుఁడు పాపము తండ్రిలేని బిడ్డకదాయని జాలిదలచి బిందు పెండ్లినిగూర్చి యేప్రయత్నముఁ జేయలేదు. చుట్టము లంతకంటె నుపేక్షఁ జేసిరి. పేదవాండ్రకు చుట్టములకు జుట్టములు కారుకదా. పేదతనమేగాక బిందునకు సౌందర్యలోపము గూడ కలదు. ఇవి కారణములుగఁ జాలసంబంధములు కాలక్రమమున వచ్చుటయు నవియెల్ల నేదోనెపమునఁ జెడిపోవుటయుఁ దటస్థించెను. తారుణీవల్లికుని భార్య సాయంకాలము లోపలివసారాలోఁ గూర్చుండి ప్రతిదినము బిందు తల్లిచేఁ దలదువ్వించుకొనుచు నప్పుడప్పుడా పేదరాలి నీవిధముగ నూరడించుచుండును.

"అమ్మాయి! పిల్లపెండ్లినిగూర్చి నీకింత బెంగ యెందుకమ్మా? మనయింటి యాడుపడుచు, పెండ్లిండ్లనుగురించి బెంగపెట్టుకొననక్కఱలేదు. వీండ్లకు వివాహములు కాకపోవు. మన కుటుంబస్థితి, మన గౌరవము వర్తమానపట్టణములో మీ బావగారికున్న యుద్యోగము నెవ రెఱుఁగరు? తలక్రిందుగాఁ దపస్సుఁ జేసిన మన సంబంధమువంటి సంబంధము దొరకునా? అందుచేత నీవు బిందు విషయమున విశేషము మనస్తాపము నొందకుము. మీ బావగారు నవరాత్రములకు వచ్చినప్పుడు నేనాయనతో మాటలాడి మన మర్యాదకుఁ దగినసంబంధము వెదకునట్లు చేసెదను. అదియునుఁగాక మాయమ్మాయి యుమకుఁగూడఁ బదియవయేఁడు వచ్చినదికదా! అన్ని ప్రక్కలనుండి దానినిమిత్తము పదులకొలఁది సంబంధములు వచ్చిపడుచున్నవి. దాని కిప్పుడు పెండ్లిచేయుటకు నే నొప్పుకొంటినా కన్నులనద్దికొని దానిని దీసికొని పోవుదురు. కాని యింతలో వివాహము చేయుట నాకిష్టములేదు. మా చిట్టితల్లికిఁ బెండ్లిచేయఁ దలఁచుమేని మనకుటుంబమునకుఁ

తగినసంబంధమే తీసికొని వత్తుముగదా! కాని యీమెకు బిందుకుఁ జక్కఁదనములోఁ గొంచెము భేదమున్నది. ఈమె యెఱుపు. బిందు నలుపు. దానికిఁదోడుగ నీవద్దఁ డబ్బులేదు. నీమగఁ డెల్లవారివలె గడుసరి కానందున నాలుగుడబ్బులు వెనుక వేసికొనలేకపోయెను. కుటుంబ గౌరవము సమానమైనను బిల్లలిద్దరికిఁ గలభేదమిది. అయినను భయపడి అదే బెంగ పెట్టికొనకు. నేను మనసారఁ దలపెట్టితినా నీకార్యము గట్టెక్కింపగలను" అని హస్తకంకణములు ఘల్లుఘల్లున మ్రోయునట్లు తల ముడుచుకొనుచుఁ దోడికోడలు ధైర్యము సెప్ప బిందుతల్లి విచారమును విడిచి కూఁతురు పెండ్లినిమిత్త మువ్విళులూరుచుండును.

అనంతరము దేవీనవరాత్రములు వచ్చెను. తారుణీమల్లికుఁడు వర్ధమానమునుండి స్వగ్రామమునకు వచ్చెను. ఆయన వచ్చునప్పుడు పూజావస్త్రములు నగలు డక్కాచీరలు భార్యనిమిత్తము, మంచి పరికిణీగుడ్డలు మొదలగునవి కూఁతురునిమిత్తము, కొన్నివస్తువులు నౌకర్లనిమిత్తముఁ దెచ్చెను. వర్ధమానమునుండి నాజరుగారు విలువగల బహు పదార్థములతో వచ్చిరనువార్త గ్రామమంతయు వ్యాపించెను. ఆయన దర్శనముఁ జేయుటకు జనులు గుంపులుగుంపులుగాఁ బోయిరి. పోయి వా రుదయాస్తమయము లొక్కవరుసనే వాని నూరక పొగడఁజొచ్చిరి. కొందరు పూజఁజేసికొనుటకు సొమ్ములేక బదులడుగఁ బోయిరి. మఱికొందఱు వ్యవహారపు జిక్కులఁగూర్చి యాలోచన మడుగబోయిరి. ఒకఁడు తన కుమారునకు నుద్యోగమిమ్మని వేఁడబోయెను. మరియొకఁడు వానితోఁ బనియేమియు లేకయే వృద్ధాచార మనుసరించి యాయనదర్శనముఁ జేయుటకుఁబోయి కొంతసేపు పొగడి స్వగృహమునకుఁ బోయెను. ఈ మహోత్సవములలో బిందుమాట యెవరికిఁ గావలెను? పూజలు ముగిసెను. పదునైదు దినములు సెలవులు గతించెను. తారుణీమల్లికుఁడు వర్ధమానపురమున కరిగెను. బిందు వివాహ ప్రసంగ మతనివద్ద రానేలేదు.

చుట్టములసాయ మట్లగుటచేత బిందుతల్లి యిరుగుపొరుగమ్మలక్కలఁ గలిసికొని నపుడు వారిని పుత్రికావివాహవిషయమున నోపినసాయముఁ జేయుఁడని వేఁ చుండును. ఆయమ్మలక్కలామె వేఁడికోలువిని, తలయూఁచి "అమ్మా! దానికేమి; మీయమ్మాయికి సంబంధమే వెదకిపెట్టఁజాలమా? ఈపాటి సాయముఁజేయుటకు నీకంటెను ముఖ్యులెవరమ్మా? కాని యీఁడు పిల్లలకు బెండ్లిఁజేయుట యీదినములలో మహాకష్టమమ్మా. కట్నమిచ్చుటకు నీదగ్గఱసొమ్ము లేదాయెను. ఈయమ్మాయి తండ్రి యెప్పటి సొమ్మప్పుడే సంసారముక్రిందఁ ఖర్చుపెట్టెనే కాని ంచెము తెలివి గలిగి నాలుగుడబ్బులు వెనుకవేయలేక

పోయెను. మీబావగారివలె కొంచెముసొమ్ము నిలువఁజేసినయెడల వివాహమున కింతకష్టమక్కఱలేక పోవునుగదా తల్లీ. అప్పుడు నీపెనిమిటితో ఖర్చులలోఁ గొంచెము మితముగా నుండుమని మేమెన్నివిధములనో చెప్పితిమి. కాని వినలేదు. మగవాఁడేలాగునఁ గర్చుఁజేసినను నీవైన మామాటఁ జెవిని బెట్టితివా? చూడు! మఱియిప్పు డెంతతలమీఁదకువచ్చినదో, పెండ్లియనఁగా మాటలా అయినదేమోయయినది. దానికేమి, ఎక్కడనో యొకచోట సంబంధము తీసికొనిరాలేక పోదుమా, ఎవరివిషయమునసైన నూరకుందుముగాని, చిట్టితల్లి, బిందు విషయమై యశ్రద్ధఁజేయుదుమా? యని చెప్పుచుందురు. మనసులోనున్నకోరిక ఫలముదూరమైనకొలఁది బాధయధిక మగుచుండునుగదా! అందుచేత బిందు తల్లి తనకోరిక గ్రామములో వయసుగడిచినపెద్దలతోఁ జెప్పుకొని సహాయమునువేఁడ చెలువుగట్టున వారిం గలిసికొన్నప్పుడు, త్రోవలో నెదురైనప్పుడు విడ్డువకయదేపనిగా వారింబతిమాలుచుండ వారును దమగొప్పతనము తేటపడునట్లామెతో నిట్లనుచుండిరి.

"బిడ్డా! యిన్నాళ్ళనుండి యీసంగతి మాతో నేల చెప్పకపోయితివి? చెప్పక యూరకుండిన నెట్లు తెలియును? కాళితల్లి సంబంధము వెదకివెదకి వేసారి మొన్నను గానక చిట్టచివర క్రిందటినెల మాకువర్తమానమంపినది. అప్పుడు మే మేవో చిక్కులు పడి యొకసంబంధముఁగుదిర్చితిమి. కాళికిఁగూడ మీఅమ్మాయియీడే. దానికిఁగూడ పదియవయేఁడువచ్చినది. ఎంతమంచిసంబంధము కుదిర్చినామో చూడు. వర్తమానపట్టణమందున్న రాయకుటుంబమువారు కుబేరునియంత ధనవంతులు. సకల భాగ్యభోగ్యములుఁ గలవు. పెండ్లికుమారునకు ద్వితీయము. వయస్సుకొంచెము ముదిరినదనుమాటతప్ప తక్కిన నేలోటుయేమియులేదు. కావలసినంత యైశ్వర్యము. ఆ పట్టణములో వారికున్న గౌరవ మెవరికిలేదు. ఎంతపలుకుబడి! యెంతవ్యవహారము! ఆయన పిలుచుని దొరలకు విందు చేయుచుండును. వారితోఁగలిసి గుఱ్ఱపుబండ్లమీఁద దిరుగుచుండును. వేయేల? ఆతఁడు జమీందారువైభవ మనుభవించుచున్నాఁడు. మేము తలఁచుకోఁబట్టి కాని యాపిల్లతల్లి స్వయముగా వెదకికొనిన నిటువంటి సంబంధము దొరకునా? ఈరోజులలో మనుష్యులకు స్వాతంత్ర్యములు బలిసి పెద్దలతోఁ జెప్పక వ్యవహారములు చేయఁజూతురు కాని యవి నెఱవేఱునా? కాని యిప్పటికైన నీవు తెలివైనపనిఁజేసితివి. మావద్దకువచ్చి యిందులో మమ్మాలోచన మడిగితివి. మామాట జ్ఞాపకమున్నది; కొంతనయమే."

పాపము మాసీదరాలు వారిమాటలు మనఃపూర్వకముగా వచ్చినవే యనుకొని కంటఁ [illegible] తానింతకాలము వా[illegible] [illegible] వారి యాలోచన మ[illegible] [illegible] [illegible] నాటి మఱింత [illegible] వారు

దయార్ద్రహృదయులై మరల నామెతో "నీవిఁక బెండ్లివిషయమున బెంగపెట్టుకొన నక్కఱలేదు. మాచెవిని వేసితివిగనుక నీకార్యము నెఱవేఱినదే యని నిశ్చయముగ నమ్ముకో" యని ప్రత్యుత్తర మిచ్చుచుండిరి. బిందుతల్లి యరచేతిలో వైకుంఠము గనఁబడినట్లు, చందమామ చేతికి దొరికినట్లు, మిక్కిలి యుప్పొంగి పరవశముఁజెంది నిద్రాహారములు సైతము మానుకొనుచు వచ్చెను. క్రమక్రమముగ దినములు వారములు నెలలు గడచెను. రెండు సంవత్సరములు గతించినను గూఁతునకుఁ బండ్రెండవయేఁడు వెళ్ళవచ్చినను సంబంధము వెదకి తెచ్చు వా రెవ్వరు లేకపోయిరి. హరిదాసుమల్లికున కాగ్రామము నందె యొక ప్రియమిత్రుఁ డుండెను. ఆయనకొకపుత్రుఁడు కలఁడు. అతని పేరు హేమచంద్రబోసు. హేమచంద్రుఁడు విద్యాభ్యాసముఁజేసి వర్ధమానపురమునఁ బ్రవేశపరీక్షయందుఁగృతార్థుఁడై పైచదువులఁ జదువునిమిత్తము కలకత్తానగరమునకుఁ బోయెను. కాని దైవవశమునఁ దండ్రి పరలోకగతుఁడు కాఁగా, హేమచంద్రుఁడు విద్య ముగింపకయె స్వగ్రామమునకుఁబోయి యే యుద్యోగమునం బ్రవేశింపక పిత్రార్జితమైన యాస్తితో గౌరవముగఁ గాలక్షేపముఁ జేయసాగెను. హేమచంద్రుఁడు బిందును బాల్యమునుండి యెఱుంగును; కావునఁ జక్కదనముకంటె గుణములయం దధికాసక్తుఁడై యా బాలికను వివాహమాడ నిశ్చయించుకొనెను. అవివిని యూరిలోనిపెద్దలు తండ్రి స్నేహితుని బిడ్డయైనంతమాత్రమున నిఱుపేదలపిల్లను బెండ్లియాడఁ దలఁచుటచేత హేముఁడు బుద్ధిహీనుఁడు నిర్భాగ్యుడు నని తలంచిరి. అందఱు ముక్కలు మూతులు విఱిచినవారే. హేమచంద్రుని చుట్టములు, కుటుంబగౌరవమునకుఁ దగదని సంబంధముఁ జెడగొట్టఁ దలఁచిరి. కాని హేముఁడు స్వతంత్రుఁడు. పట్టుదలగలవాఁడు నగుటచే నెవ్వరిమాటలు సరకుసేయక బిందు తల్లికడకుఁబోయి తానే స్వయముగ వివాహము నిశ్చయించుకొనెను. పెద్దలమాట హేముఁడు త్రోసివైచినాఁడను నీసున నూరిలోని యమ్మలక్కలు నీరాడు రేవులలోఁ జేరినప్పుడు "అక్కయ్యా! విన్నావమ్మా! యీచోద్యము, హేమునికెంత సిగ్గులేదో! వానిసాహసము కాల. పెండ్లి కాకముందే బిందును దఱచుగాఁ జూచుటకు వెళ్ళుచుండెనఁట" యని యొకతెయన మఱొకతె "వదినే అంతేనా చిత్రమువిను. బిందు సాయంకాలము చెఱువుపద్దనుండి వెళ్ళునప్పుడు హేముఁడు త్రోవలోఁగాచికొని దానితో గుసగుసలు గసగసలును. మాయకలి కాలము వచ్చెఁగదా!" యని వింతలు చూచినట్లే చెప్పుచుండును. ఎవరెట్లు చెప్పుకొన్నను సంబంధము నిశ్చయమయ్యెను. తారిణిభార్యకుఁగూడ నీ సంబంధ మిష్టముగా నేయుండెను. ఆమె వెనుక నభయమిచ్చినట్లు బిందు వివాహమునుగూర్చి మగనితో మాటలాడకున్నను భాగ్యవశమున సంబంధము కుదిరినప్పుడు మాత్రము మనసార సంతసించెను. అంతట సుముహూర్తము నిశ్చయమయ్యెను. తారిణీచరణుఁడు భార్యయుఁ గోటలనిండఁ గూఁతునకుఁ గన్యాప్రదాన మొనర్చిరి.

ఈ వివాహమైన కొలఁదికాలమునకే తారుణిపుత్రికయగు సుమకుఁగూడ మిక్కిలి భాగ్యముగల సంబంధము వచ్చుటచే నా దంపతులు మఱింత యానందమునొందిరి. ఉమాబిందులకొక్క సంవత్సరమందే వివాహమయ్యెను. బిందునకు వివాహమైనది మొదలు తల్లి సుధకుఁగూడఁ బదియవయేఁడు వచ్చినందున దాని వివాహమునుగూర్చి మనసున నెంతో యాత్రముపడుచు నెడనెడ నిట్లు తలంచుచుండెను. "నేను బ్రతికియుండఁగానే దీనికిఁగూడ మూఁడుముళ్ళు పడినా నే నేమైనను క్షయము లేదు. అప్పుడు నాకోర్కె సఫలమగును" అటులామె తలంచుచుండఁగనే యొక సంబంధము దొరకెను. వరుఁడు సుధకన్నఁ గొంచెము పెదవాఁడు. వివాహానంతరము తల్లి యిరువురుకూతులఁ జేరియొక ప్రక్కం గూర్చుండబెట్టికొని కన్నుల నానంద బాష్పములుతొలఁగ "నాతల్లులారా! నాజన్మమిప్పటికి తరించిన"దని ముద్దిడి తనయంతటి యదృష్టవంతురా లీలోకమున లేదని బ్రహ్మానందభరితయయ్యెను. పాప మీ యిల్లాలు సుగని మరణానంతరము నేత్రములనుండి యానందబాష్పములువిడిచి మనసార సంతసించిన దీ యొక్కసారియె. ఆహాహా! దైవ మెంత యోర్వలేనివాఁడో కాని సుధకు వివాహమైన కొన్నినెలలకే పుట్టుకలకు లోకము నకు బరువైనదని కాఁబోలు నా పేదరాలు కష్టములుగట్టెక్కి సుఖపడు కాలమున నామె నెత్తికొని పోయెను. బిందు పండ్రెండవయేట దల్లిపోవుటచే నత్తయింటి కరుగవలసివచ్చెను. హేమచంద్రుఁడు ప్రథమమునుండి యామెయందనురాగ మధికమగుటంజేసి నవనాగరికుఁ డగుటచే నెవ్వరికింజంకక యాబాలికకు విద్యయు బుద్ధియుఁజెప్పి దయతో నాదరించి యుక్తవయస్కురాలైనపిదప నామె తనయందుఁ దగినభక్తి విశ్వాసములు కలిగియుండునట్లు చేసెను. ఈఁడువచ్చినపిదప బిందు పరపురుషునిఁజూచి యెఱుఁగదు. భాషించి యెఱుఁగదు. ఆమెకు పతియే దైవము. పతితోడిదే లోకము.

సుధయొక్క చరిత్రము మాత్రము మిక్కిలి దయనీయమైనది. పదియవయేట నామె వధువై పండ్రెండవయేట విధవయయ్యెను. వివాహ మగుటయేమో వైధవ్యము వచ్చుట యేమో యామెకు దెలియదుగదా! దిక్కులేని యాబాలనిత్తవారు తమయింటికి దీసికొని పోయెను. సుధ వివాహాలంకారములం దీసివైచి ధవళవస్త్రములు నందుకొనెనే కాని రా దలచినకష్టము లేవియో యెఱుఁగక తనయీడు బాలికల కిచ్చిమై యాట లాడుచుఁ బాటలపాడుచు గాలక్షేపము సేయఁదొడఁగెను. వెనుకటి ప్రకరణములో జెప్పబడిన తెలుగున నామె పెదకూనతో నాఁడినయాటలే దానికి తాత్కాలికానందములు.

ఇట్లు నాలుగు సంవత్సరములు గడిచెను. బిందున కిరువురు బిడ్డలుకలిగిరి. కాళియు నుమయు భర్తలతో గాపురము జేయఁబోయిరి. వారిప్పుడెప్పుడు స్వగ్రామమునకు వచ్చి చిన్ననాటి చెలికత్తెయు సమానవయస్కురాలునగు సుధతో నాఁటి కష్టసుఖములు జెప్పకొనుచుందురు.

మూఁడవ ప్రకరణము

దంపతులు.

అప్పుడు జాము రాత్రి యయ్యెను. తాళ్ళచెలువుగ్రామము తాళ్ళవృక్షముల నీడలఁ బండుకొని నిద్రపోవుదానివలె నుండెను. చంద్రకిరణములు చెట్లయాకులలోఁబడి క్రిందికిఁ బ్రసరింపలేక యలసి యయ్యాకుపాన్పులఁ బండుకొన్నట్లచటనే నిలిచెను. చెట్లు పొదలు తోఁపులు గృహములు తెల్లని ముసుఁగులు వైచికొనిన చెలువమునఁ నొప్పె. చందమామ కిరణములు తటాకమధ్యమునఁ దళతళ లాడుచు నీటిమీఁద నాట్యముసేయు తెఱంగున శోభనప్రదములై యుండెను. కాలపురుషుఁడను సేవకుఁడు గ్రామమంతటం బఱచిన మల్లెపూల పాన్పుచందంబున వెన్నెల ప్రతిపదార్థమును దెల్లబాఱఁజేసి సకలజంతువులకు బాహ్యతాపహారకముగా నుండెను. గ్రామవాసులలో ననేకులు భోజనముచేసి తలుపులు మూసికొని నిద్రింపఁబోయిరి. అక్కడక్కడ నిదురరామి యొకముసలివాఁడు వీధియరుఁగుపై గూర్చుండి చుట్టద్రాగుచుండెను. ఇంటిపనియంతయు సత్వరముగాఁ జేసికొనలేని యాఁడుదియు నచ్చటచ్చటఁ దొందరతో నంట్లు తోముచు పళ్ళెములు కడుగుకొను చుండెను. నిశ్శబ్దమైన యానిశాసమయమునఁ దూరపుఁబొలములలో నిదురపట్టని కాపుఁ వాడు పాడినపాటమాత్రము సన్నసన్నముగా మేలుకొన్నవారి చెవులం బడఁ జొచ్చెను. తక్కిన ప్రపంచమంతయు నిద్రాపరవశమై నిశ్శబ్దమై యుండెను. బిందు గృహకృత్యము లన్నియు జేసికొని భర్త యెంతసేపటికి రానందున మేలుకొని తన గది యరుఁగుమీఁద గూరుచుండెను. చల్లని చంద్రకాంతి యామె చేఁమీదను విలాసవంతమైన మొగము మీఁదను బడి క్రొత్తసౌందర్యముఁ దెచ్చెను. సుఖము బావగారికి జనపపీఁచుగడ్డము కట్టి హాస్యముఁజేయఁ దలఁచినది. కావునఁ జాలసేపు మేలుకొని క్రమ్ముకొనివచ్చు నిదుర నాపికొనలేక పండుకొనెను. ఆమె పెదవులు చిఱునగవు నవ్వునప్పుడు తెఱచి యున్నట్లే విడి యున్నందున చంద్రకాంతిపైఁ బడినట్లు యేదో మంచికలయు నామె మనంబున బడి యుండ వచ్చునని బిందు తలంచెను. కొంతసేపు కనిపట్టికొని యుండు నప్పటికి వీధితలుపులవద్ద నడుగులచప్పుడు కాఁగా బిందు వేవేగ లేచి పరుగుపరుగున వెళ్ళి కవాటము దెఱచెను. హేమచంద్రుఁడు గృహమును బ్రవేశించెను. అప్పటికి హేమచంద్రుఁ డిరువదినాలుగేండ్ల ప్రాయమువాఁడు. అతనిముఖము సుందరమై తెలివిని వ్యక్తముసేయు చుండెను. అతని లలాట మున్నతముగానుండెను. చాలదూరము నడిచి వచ్చుటచే నతఁడు మిక్కిలి యలసి యుండెను. పాదోష్ఠములు ధూళితో నిండియుండెను. బిందు పీటవేయ హేమచంద్రుఁడు దానిపైఁ గూరుచుండి యామె తననిమిత్తము దెచ్చిన చల్లనినీటితోఁ గాళ్ళు చేతులు మొగము గడిగికొనెను. అంతట వారీవిధంబున మాటలాడిరి.

బిందు—చాల ప్రొద్దుపోయి వచ్చినావే. ఇంకను భోజనము కాలేదనుకొందును.

హేమ—నేను పెందలకడనే బయలుదేరితిని. కాని కాట్వాలో నొక స్నేహితుఁడుండెను. నన్ను తనయింటికి దీసికొనిపోయి ఫలహారముఁ జేయించినపిమ్మట బలవంతముగా పంపెను. మీ రందఱు భోజనము చేసినారా?

బిందు—సుధ భోజనము చేసి పండుకొన్నది. నా భోజనము కాలేదు. నా కేమితోఁచదు. మీకొఱకు ముందు వడ్డించెద నుండుఁడీ!

"నా కంతవిశేషముగా నాఁకలిలేదు. తొందరపడ నక్కఱలేదు" అని భర్త యనుచుండఁగానే బిందు చప్పుచప్పున నట్టింటఁగొంచెమునీళ్ళు చల్లి చిత్రాసనముఁ బఱచి వంటయింటికిఁ జని యొక పళ్ళెములో నన్నము దెచ్చిపెట్టి పప్పు చేపలకూర కొన్ని కాయగూరలు మొదలగునవి వడ్డించెను. ఈవంటకములకుం దోడుగ నామె భర్త నిమిత్తము దొడ్డిలోనున్న నిమ్మచెట్టునుండి రెండునిమ్మకాయలు చెక్కలుగాఁ గోసి సిద్ధముఁ జేసి కొబ్బరిబోండెము దన్నీటఁ బదపైచి యాపు పాలుకాని పంచదార కలిపి యుంచెను, అతఁడు చిత్రాసనమునఁ గూరుచుండి భోజన మారంభింప భార్య ప్రక్కను గూర్చుండి కావలసినవస్తువులు మారు వడ్డించుచుండెను. అప్పుడు వారిరువు రిట్లు సంభాషించిరి.

హేమ—నేను కుఱ్ఱవానికి మందు తెచ్చినాను. అది యిప్పుడు వేయకుము. నిద్ర పట్టక యేడ్చినా వేయవచ్చును. నేను కాట్వా వెళ్ళినపెండవపని యేమి యుం గాలేదు.

బిందు—ఎందుచేతఁ గాలేదు.

హేమ—కాట్వాలోఁ జిరకాలమునుండి నే నెఱిఁగినపెద్ద నొకఁడుండఁగా మీనాన్నగారి పొలములఁ గూర్చి సలహా నడుగుటకు వెళ్ళి యుంటిని.

బిందు—ఆయన యేమన్నాఁడు?

హేమ—కోర్టుకు వెళ్ళినఁ గాని వ్యవహారము తేలదని చెప్పినాఁడు.

బిందు—ఛా! మాపెదబాబయ్యగారిమీఁద కత్తుఁగట్టి నేను కోర్టు కెక్కనా? అయ్యో! మానాన్న పోయినతరువాత నన్ను బెంచి పెద్దదానినిఁ జేసినందుకు మంచి సంబంధముఁ దెచ్చి మీకు పెండ్లి చేసినందుకు నే నాయనమీఁద వ్యాజ్యము వేయనా? మా పెదతల్లి నే నన్న పంచప్రాణములు విడుచును. ప్రతి పండుగకుఁ బ్రతిపర్వమునకు నాకేవో బహుమానములఁ బంపుచునే యుండును. వారిమీఁద వ్యాజ్యము వేయుటకు నా మన సొప్పుకున్నది.

హేమ—(చిఱునవ్వు నవ్వి) నీ వివాహవిషయమై మీ పెదబాబయ్యగారి యుపకారము నే నేమియుఁ బొంద లేదు. నీ వప్పుడు చిన్న పిల్ల వగుటచే జరిగిన సంగతు లెఱుఁగవు. నీ కవి తెలియవలసినంత యవసరము లేదు. ఆయనతో వివాదము లాడుటకు నాకుఁగూడ నెంతమాత్ర మిష్టములేదు. తప్పక వచ్చినపుఁ డేమి చేయవలెను?

బిందు__ఏమయినను సరే కాని మా పెదబాబయ్యగారిమీద వ్యాజ్యములు వేయుట బాగుండదు. అంతేకాక మనకు డబ్బుకూడ లేదు. వ్యాజ్యములకు బోలెడు సొమ్ము కావలయును. ఈస్థితిలో మనము కుటుంబసంరక్షణముం జేసికొని భగవంతుఁ డిచ్చిన యీ యిద్దఱుబిడ్డలను పెంచుకొనుచు, నొకరిని 'దేహి' యని యడుగకుండ గౌరవముగఁ గాలక్షేపము చేసితిమా యదే పదివేలు. మన కేవ్యాజ్యములు వద్దు. ఇతరుల సొమ్ము మన కెందుకు? మీ భూములు రత్నగర్భములు. బంగారము పండును. అవి బాగు చేసికొనినయెడల మనము తిని యొకరికి పెట్టవచ్చును. మన కెందఱిమందియున్నారు తినుటకు? మీతండ్రిగారి ధర్మమున మనకు దివ్యభవన మీయిల్లు దొరకినది. ఇదియే మనకు రాజ్యము. మహారాజులలాగు మనము సుఖముగా నుండవచ్చును.

హేమ__నేను నిన్ను పెండ్లియాడినపుడు మన మెల్లకాలము దారిద్ర్య మనుభవింప వలసి యుండునని యనుకొనలేదు. నీవు పరమ శాంతురాలవు. సంతుష్టికలదానవు. మంచిదానవు. గృహములో నిది యున్నది, యది లేదని విసుగుకొని యెఱుఁగవు. ఈవిషయమున దప్ప నా కెన్నఁడు నెదు రాడినదానవు కావు. నేను మగవాఁడ నగుటచే నీ కున్నంత శాంతము నాకు లేదు.

బిందు__మన మనుభవించుచున్నది దారిద్ర్యమా? చాలులెండి. ఈయిల్లు, యీ దొడ్డి, యీ ఫలవృక్షములు ఉండఁగా మనకేమికొదువ. హాయిగా రాజులలాగున నుండవచ్చును. ఇదిగో మహారాజులైనను దొరకని క్రొత్తవస్తువు మీ కొఱకు చేసి యుంచితిని. తెచ్చెద నుండండి.

హేమ__(చిఱునగవుతో) సరే. నేను రాజును. నీవురాణివి. ఏది రాజుల కయినను దొరకని యాయపురూపవస్తువు చూతము తెమ్ము.

భర్త రాకముందు బిందు దొడ్డిలోనున్న మామిడిచెట్టునుండి కొన్నిపచ్చికాయలు కోసి మెంతులోరుచిగలుగునట్లు కూరవండెను. ఆమాట మగనిభోజనమునడుమ జ్ఞప్తికిరాఁగా నామె లోనికేఁగి యా కూర నొక తెల్లసిరాతిచిప్పలో వైచి మగని ముందఱ బెట్టి 'మహారాజుగారు దీనినారగింప వలయు' నని నవ్వుచుఁ బల్కెను. హేమచంద్రుఁ డాకూర నన్నములోఁ గలుపుకొని యది మిక్కిలి రుచిగానుండుటచే, నిది నిశ్చయముగా మహారాజులకుఁ దగినకూరయే. కాని మిక్కిలిరుచియైన యీకూర దినునదృష్టము మారాజ్యమువలన రాలేదు. మారాణిగారి చాతుర్యమువలననే గలిగినదని మెచ్చుకొనుచుఁ గూరలు మొదలగువానిలోఁ గొంతయన్నము కలుపుకొని తిని కడపట చక్కెర

కలిపినపాలతో మిగిలినయన్నము కలిపికొని తినుచు మంచిపాలిచ్చిన తమ యావును బాలలోఁ జక్కెర సరిగాఁ గలిపిన భార్యను గొనియాడుచు భోజనము ముగించి చేయిఁ గడుగుకొని భార్య యదివఱకే చుట్టి యప్పు డందిచ్చిన తమలపాకులచుట్టలు నోటనిడుకొని నమలుచు భూమివ్యవహారమును గూర్చి ప్రసంగము మఱలరాఁగా వారిట్లు మాటాడిరి.

మా పెదబాబయ్యతో నీవ్యవహారములో రాజీనామా చేసికొనుట బాగుండదా! మనకు మధ్యవర్తులుగా నుండి వ్యవహారముఁ బరిష్కరింపఁ గల పెద్దలు గ్రామములోఁ జాలమంది కలరు కదా!

హేమ—ఆప్రయత్నము నైనది. కాని కార్యకారి కాలేదు. ఆయన పొలముతనదే యనుచున్నాఁడు. అది తనభుక్తములోనే యున్నదఁట. పదియేండ్లనుండి మరమ్మత్తులఁ జేయించి పన్నులు చెల్లించినాడఁట. లెక్కలలోఁ దనపేరు నమోదుజేయించుకొన్నాఁడట. అందుచేత నేమైనను సరే విడిచిపెట్టడఁట. కాని నిన్ను సుధను తనబిడ్డలవలెనే చూచికొనుచుండుటచేత మీ కాభూమిలోఁ గొంతభాగము దయాధర్మభిక్షముగ నిచ్చునఁట. భాగమనఁగా మూఁడవ వంతో నాల్గవ వంతో యని యాశ పడుచున్నావేమో, కళ్ళనీళ్ళు తుడుచుట కేదోయొక చవుటిపఱ్ఱ నిచ్చును. మనము పేదవాండ్ర మేమియుఁ జేయలేమని యతఁడు బాగుగ నెఱుఁగును. అందుచేతనే యీయాటలాడుచున్నాఁడు.

బిందు—నే నాఁడుదానను గదా! ఈ వ్యవహారపు చిక్కులు నాకేమియుఁ దెలియవు. ఏమో పెద్దవాఁడు, చిన్నప్పటినుండియుఁ బెంచి పెద్దవాండ్రను జేసినాడు. అందుచేత నతఁడేమిచ్చునో యది పుచ్చుకొని యూరకుండుట మంచిది. పోనియ్యండి. అతఁడు తిన్నను మంచిదే. పరాయివాఁడు కాఁడుకదా! కోర్టుల కెక్కితిమా బోలెడు సొమ్ముపోయవలెను. మనదగ్గఱ డబ్బులేమిగనుక నెక్కడనైన బదులు తేవలయును. ఆ బదులు తీఱుట యెట్లు? ఒకవేళ మనమే నెగ్గగలమనుకొనుఁడు. వ్యాజ్యమునకయిన ఖర్చులక్రింద భూమి మనచేతులార మనమే యమ్ముకొనవలయును. నేలదక్కదుసరేగదా మా పెద్దబాబయ్యతో యావజ్జీవము నోటిమాట కంటిచూపు లేకుండ నుండవలయును. నెగ్గకపోతిమా భూమికి సొమ్మునకుఁ గూడ చెడుదుము. కొద్దో గొప్పో యాయన యిచ్చినంత పుచ్చుకొని తగవులేకుండ జేసికొందము. నే నాఁడ కూఁతురను. వ్యవహారములు తెలియనిదానను. మీరు మగవారు. అన్నియుఁ దెలిసినవారు కనుక బాగుగ నాలోచించికొని మీకు దోఁచినట్లు చేయుఁడు. వెఱ్ఱో మొఱ్ఱో నాకు దోఁచినమాట చెప్పినాను.

హేమ—(కొంతసేపాలోచించి మెల్లఁగా) అవును; నీవాఁడదానవే. నీవంటి యాఁడది యొకనికి భార్యయై యాలోచన చెప్పుచుండునో యతఁ డదృష్టవంతుఁడు. నేను ముందుగా నిన్నాలోచన నడుగక వెఱ్ఱివాఁడనై యెక్కడికో వెళ్ళి ప్లీడరులసలహా నడిగి వచ్చితిని. నీవు చెప్పినమాట నాకు నచ్చినది. అలాగే చేసెదను. మీబాబయ్యగారు వచ్చినారఁట. రేపువెళ్ళి యాయనతోఁ గలిసి మాటలాడి యేదో విధమున రాజీచేసికొనియెదను. ఇఁకొకసారి నా కేవ్యవహారములోనైన సలహా కావలసి వచ్చినప్పుడు నా గృహదేవతయైన యీ పెద్దప్లీడరు గారినే యడిగెదను; కాని తక్కిన ప్లీడర్ల వద్దకుఁ బోను.

మగఁడు తన్ను గొప్పప్లీడరుగాఁ బ్రశంసించినందుకు బిందు ముసిముసినవ్వులు నవ్వుకొనుచుఁ బ్రసంగము చాలించి గదిలోనికిఁ బోయి పాన్పు సవరించి మఱియొకసారి తాంబూలమిచ్చి మగఁడు పండుకొన్నపిదప నాతనిప్రక్కను గూర్చుండి చాలసేపు గృహకృత్యంబులఁ గూర్చి మాటలాడఁజొచ్చెను. ప్రేమాస్పదులైన దంపతుల సంభాషణముల కంతముండదుగదా! అట్లు కొంతసేపు సంభాషణమైనపిదప భార్య భోజనము చేయలేదన్నమాట జ్ఞప్తికిరాఁగ హేమచంద్రుఁడు ప్రియురాలి నుద్దేశించి నీవింకను భోజనముఁ జేయలేదు కాఁబోలు. వెళ్ళి త్వరగా భోజనము చేయుము. మనమాటలకు తెంపున్నదా. జలయూరినట్లూరుచునే యుండునని యామెను త్వరపెట్టి పంపెను. భర్తకు తనమీఁదఁగల గాఢానురాగముచేత బిందు తనవంటి యదృష్టవంతురాలు లేదని యుబ్బి రెండుజాములరాత్రి దాటినను భోజనమునకు ప్రొద్దుపోయెనని విచారపడక తిని పనిజేసికొని నిదురించుచున్న భర్తప్రక్కను బండుకొని సుఖనిద్రఁ జెందెను.

నాల్గవ ప్రకరణము.

భవిష్యత్కాలసూచనము.

మఱునాఁడుసాయంకాలము హేమచంద్రుఁడు తారుణీమల్లికుని గృహంబున కరిగెను. ఆ గృహావరణమున సింహద్వారము దాఁటగానే రెండుమూఁడు ధాన్యపుగాదెలు కనఁబడెను. ఒక ప్రక్కను పెద్ద పశువులశాలయొకటి యుండెను. దాని నిండ నావులు నెద్దులుగలవు. కొంతదూరమువెళ్ళ దేవతార్చనగృహము కలదు. వేరొకచోట భాగవతములు జలక్రీడలు మొదలగునవి యాడించుటకు స్తంభములమీఁద గట్టిన గొప్ప పాకకలదు. బంగాళాదేశములో ధనవంతులు వినోదములనిమిత్త మిట్టివి గృహావరణములలో నిర్మించుకొందురు. పుణ్యదినములలో గ్రామమందలి జనులందఱువచ్చి యా వినోదములంజూచి సంతసించి పోవుచుందురు. మనవైపున నిట్టి వినోదములు వీధులలోనే పందిళ్ళక్రింద జరుగుచుండును. అప్పటికి రెండేండ్లక్రిందట తారుణీమల్లికుఁడు లోపలి యిండ్లకు సంబంధములేకుండ నిటుకగోడలతో నొక కచ్చేరిగది కట్టించికొనియెను. సూర్యాస్తమయ మగుటచే నొక యిత్తడి స్తంభముమీఁద నా గదిలో దీపము వెలుఁగుచుండెను. ఆ గదిలో నొకప్రక్క నెత్తుగా గట్టఁబడిన దాఱువేదికమీఁద జముఖానముపై బాలీసునకుఁ జేరఁబడి హుక్కా త్రాగుచు తారుణీమల్లికుఁడు కూర్చుండెను. ఇరుగుపొరుగు వారు కొందఱు దర్శనమునకువచ్చి యప్పుడతనితోఁ బ్రసంగించుచుండిరి. హేమచంద్రుఁడు రాఁగానే మల్లికుఁడు దయగమర సేమమడిగి సేవకునిఁబిలిచి లోపలికల్లునిఁ దోడ్కొని పొమ్మని యానతిచ్చెను. స్త్రీలు వసియించుగదుల వసారాలకు నలుప్రక్కలు తడకలు కట్టఁబడియుండెను. మల్లికుని పడకగది విశాలమై మట్టిదిమ్మల మీఁద కట్టఁబడియుండెను. ఆ గదిప్రక్కను విశాలమైన వంటయిల్లు మఱికొన్ని చిన్నగదులు గలవు. దొడ్డిలోనొక నీగుడుబావి యుండెను. దానిచుట్టు మామిళ్ళు నారికేళములు మొదలగు ఫలవృక్షముల తోఁట యుండెను. హేమచంద్రుఁడు సేవకునివెంట లోనికరిగి పెద్దత్తగారింగాంచి నేలఁజారగిలఁబడి యామెకు నమస్కరించెను. ఆమె యల్లునిదీవించి కుశలమడిగి లేచి కూర్చుండుమని చెప్పెను. ఆమె నలువదియేండ్ల వయసుగలది. మొగము కలకలలాడుచుండును. చేతులు గుండ్రనై పొట్టిగనుండును. ఆమె పొట్టిగనుండినను నడకవైఖరి మొదలగునవి వికారముగనుండక యింపుగ గౌరవనీయముగ నుండును. కాళ్ళనందెలు కడియములు మొదలగు వెండిజతలు, చేతులఁ గంకణాలు మురుగులు మొదలగు బంగారపు జతలు [illegible] యుండెను. ఆ నగలామె శరీరమునకుఁ దగియే యుండెను. [illegible] [illegible]లు మృదుభాషిత్వములు తెలుఁగువారి [illegible] భాగ్యయోగమును సూచించెను. అయినను ఆమె యప్పుడప్పుడెంచుక [illegible] చూడినను మొగముమీఁద గలిసి

కట్టుతనము గలిగి వచ్చినవారిని గౌరవించునట్టి మంచి స్వభావము గలదని చెప్పవచ్చును. హేమచంద్రుఁడు లేచి యొక కుర్చీమీఁద గూర్చుండినపిదప, నల్లునకు నత్త[illegible]నీ క్రింది సంభాషణము జరిగెను.

అత్త—నాయనా! మీయిల్లు మాయిల్లు గుమ్మములో గుమ్మములాగున మిక్కిలి చేరువనున్నను నీవొకసారియైన నిన్నాళ్ళనుండి మా గడపఁ దొక్కవైతివిగదా? పెద్దదానను బ్రతికియున్నానో లేదో యింతిమాత్రము కనుఁగొనకూడదా?

హేమ—అత్తయ్యా! మీరాలాగున ననుకొనవద్దు. మీక్షేమము ప్రతి నిమేషము దెలియుచునేయుండును. ఏమో పేదవాండ్రముగద నౌకర్లు చాకర్లు లేనివాండ్రము. రోజల్ల గృహకృత్యములతోను, పిల్లలతోను సరిపోవుచున్నది.

అత్త—మంచివంక దొరికినదిలే; నీమాటయటుంచు. మా బిందుకూడా నా కంట బడుటలేదుకద. దాని నీ చేతులతోఁ బెంచి పెద్దదానినిఁజేసి నీకు పెండ్లిచేసితినిగదా. అది యొక్కసారివచ్చి పెద్దదానినిఁజూచి పోఁగూడదేమా?

హేమ—అత్తయ్యా! రాకేమి. ఉదయా స్తమానము లది మీమాటే పలవరించుచుండును. ఉమ పుట్టినింటికివచ్చినదని విన్నదిమొదలు లిక్కడకు నెప్పుడు వచ్చిపడుదునా యని వేగిరపడుచున్నది. కాని, అత్తయ్యా! తెల్లవాఱి లేచినది మొదలుకొని గంపంత పని. ఆ పయిన యీనడుమ పిల్లవానికి గొంతెము జబ్బుచేసినది దానవీన తీఱికలేక యిల్లు కదలలేదు. పోనీ యొక పరియాయ మా యుమను మాయింటికంపండి. పిల్లలను దానినిఁజూచి యొకఘూటక్కడనుండి తిరిగివచ్చును.

అత్త—అది వీలులేదు. ఉమ భాగ్యవంతుల కోడలయినది. కనుక అత్తవారి కామె యిక్కడికి నక్కడికి వెళ్ళుట యిష్టములేదు. దాని యత్తవారు ధనపురములో మిక్కిలి యెన్నికయైన గొప్ప కుటుంబములోనివారు. వెనుక ధనపురమున నవాబులవద్ద దివాను ధనేశ్వరుఁ డుండెడువాఁడని వినలేదూ? ఆయాయన వంశమువారే వీరు. అంత గొప్పవారీ చుట్టుపక్కలలేరు.

హేమ—అత్తయ్యా! ఆ సంగతిని నేనెఱుఁగుదును.

అత్త—అవును నీవెఱుఁగకేమి! ధనేశ్వరుని కుటుంబమెఱుఁగని వారెవ్వరు? దానములలో నేమి, ధర్మములలో నేమి యాచారసంపత్తిలో నేమి వారికీర్తి వారిగొప్పకుఁ దీసిపోదు. వారింటి యాడపడుచునే నేను మాగారుద్యోగము చేయుచున్న వర్ధమానములో నొకనికిచ్చి వివాహము చేసినారు. నామాట నమ్ముదువో లేదో. ఏఁబదివేలరూపాయలు

ఖర్చుచేసినారు. అంతసొమ్ము ఖర్చయినదని వారికేమైన లెక్కయున్నదా, వారికది యొక ఖర్చా ?

హేమ—(ఇంగ్లీషు చదువుకొని యర్థశాస్త్రము నభ్యసించిన నవనాగరకుఁ డగుటచే నత్తగారిపల్కుల కిష్టపడక మెల్లఁగా) అత్తయ్యా! అది దూబరఖర్చు కాదా ?

అత్త—అది దూబరఖర్చా! సరేలే. వేదబ్రాహ్మణులకు సంతర్పణలక్రింద, సంభావనలక్రింద, వస్త్రదానములక్రింద విశేషముగ ఖర్చుపెట్టినారు. ఒక బ్రాహ్మణులే కాదు. ఆనాటి జనులెల్ల నైదుదినములక్కడనే పడియున్నారు. అది ధర్మగుణమనిపించు కొనునుగాని దూబరగాదు. ఎంతపుణ్యమున్నదిసుమా. వేదములుచదువుకొన్న బ్రాహ్మణులకు, కర్మిష్ఠులకు, శాస్త్రవేత్తలకు విశేషముగ నప్పుడు బహుమానములు దొరికినవి. నాయనా! పిల్లను మాయింటికి తిన్నగా వారు రానీయరు. ఒక్క దేవీనవ రాత్రములకు రానిచ్చుచున్నారు. పని దొరకలేదు. మామగారిప్పుడు వేసంగిలోఁ గొన్నాళ్ళు సెలవుమీద వచ్చినారు. ఆయనవచ్చినదిమొదలు లెక్కలేనన్నిసారులు వర్తమానములు పంపఁగా బంపగా నిప్పుడొకసారి పంపినారు. రెండువారములకంటె నెక్కువ యుంచుటలేదని స్పష్టముఁగాఁజెప్పినారు. పదునాలుగురోజులు కాఁగానే యొకగడియ యుండదు. అందుకయి చీరలు, పండ్లు, పసుపు, కుంకుమ తెచ్చుటకు వర్ధమానమునకు మనుష్యులనంపినాము. రాకరాక వచ్చినదిగనుక వెళ్ళునప్పుడేమయిన నీయవద్దా ?

హేమ—అత్తయ్యా! పోనీ ఉమ మాయింటికి వచ్చుటకు వీలులేనియెడల నేనే మీయమ్మాయిని, పిల్లలను మీయింటికి మిమ్మును జూచుటకు బంపెదను.

అత్త—తప్పకుండబంపు నాయనా! అదియు నా యిష్టమంటినే. కనుక వీలయినప్పు డెల్ల నన్నుజూచుటకు రావలసినదేకదా.

హేమ—అలాగే వచ్చుచుండునులెండి. ఉమ యిక్కడ నింక నెన్నాళ్ళుం డును ?

అత్త—ఎన్నాళ్ళుండునా! ఒక్కనిమిషముండదు. వర్ధమానమునుండి సరకులు రాఁగానే పంపివేయుదుము. షష్టిపూర్తియు దగ్గరకు వచ్చుచున్నది అదియొక పెద్దఖర్చు.

హేమ—అవు నవును.

అత్త—ఆ షష్టినాఁడు పిల్లని దీసికొనివచ్చి కట్నములు కానుకలిచ్చుట యొక యాచార మున్నదిగదా! ఏనాటి పెద్దలేర్పఱచినారో యది మనము మానకూడదు గదా! సరేగానీ నాయనా! మీ పిల్లలు బాగున్నారా!

హేమ—చంటిపిల్లవానికి ఐదారు దినములనుండి జ్వరము వచ్చుచున్నది. కాట్వా నుండి మందుఁదెచ్చి వేయుచున్నాను. కొంచెము నెమ్మదిగా నున్నది.

అత్త—మంచిపనిఁజేసినావు నాయనా! చిన్నప్పుడు పాపము బిందునకుఁ గూడ ఈలాగుననే తరుచుగా జ్వరము వచ్చుచుండెడిది. అది పట్టి యరపేదపిల్ల. ఏదో దైవానుగ్రహమువల్ల దాని కడుపున రెండు కాయలు కాచినవిగాని, మా బిందు మొన్న మొన్నటి పిల్ల కాదఁటయ్యా! ఓడ్డ యెంత నెమ్మదయిన దనుకొన్నావు. ఆఁకలగుచున్నదమ్మా యన్నము పెట్టుమని నోరెత్తి యడిగి యెఱుఁగదుగదా. నే పిలిచిపెట్టిన కద్దు. లేనిచో లేదు. మంచినీళ్ళయిన నంతేసుమా నాయనా! నే నంటే ప్రాణము కాదా దానికి. తండ్రి పోయినతరువాత వాళ్ళతల్లి బెంగపెట్టుకొని వీళ్ళ సంరక్షణము జేయుటయే మానినది. అన్నము తినిపించుట నేనే. బట్టలుకట్టుట నేనే. ఉపయేలాటిదో బిందుకూడ నాకాలాటదె. అందుచేత నొకమారువచ్చి చూచిపొమ్మను నాయనా!

హేమ—అయ్యో! తప్పక వచ్చి చూచును.

అత్త—క్రిందటి నవరాత్రములకు బిందు మాయింటికివచ్చి యానాఁడే వెళ్ళిపోయినది. ఈసారి యట్లుచేయక రెండుదినములుంచు. అది మాయింటి యాఁడపడుచు. పూజా దినములలో మాయింట మాతోపాటుండి పనిపాటలలో సాయము చేయవలసినదే; ఆ తొమ్మిదిరోజు లెంతపని యెంతపని. చుట్టుప్రక్కల రెండుమూఁడుక్రోసుల దూరములో నున్న పల్లెలలోనివాండ్రందఱు దేవీవిగ్రహముఁ జూచుటకు మందమందలుగా వచ్చి పడుదురు. నీవు కచ్చేరిచావడికివచ్చి, యావడినుండియే వెళ్ళిపోవువాఁడవు కనుక లోపల పనిగొందఱలు నీకుఁదెలియవు. తెల్లవాఱుజామున గాడిపొయిలో నిప్పంటించి, హండీ లెక్కించి, మధ్యాహ్నము మూఁడుగంటలవఱకు వార్చిపోసినను నిజముగా నొక్క మెతుకైన మిగిలెడిది కాదు. ఏమిజనము! ఏమియన్నదానము! లెక్కపెట్టశక్యమా?

హేమ—చెప్పవలెనా, నాకుఁదెలియదా? ప్రతి సంవత్సరము జరుగుచున్న దేవీ పూజాదినములలో [illegible] దానము జరుగుట యెవ్వ రెఱుఁగరు?

అత్త—అయోధ్యానాథుడా! పెద్దలమర్యాద నిలువబెట్టినవా. అందుచేత మీమామగారు గోల్లు చేయకున్నను. అందరు పూజలు చేయుచున్నారా? నాకు మనస్సు కలుగ చున్నాను. నీ యింటికి నీవు పూజచేయుటకుపోయినదని చెప్పినచో సరే. కొందరు పేరుప్రఖ్యాతులు గలవారుగనుక మీమామగారు చేయకపోయినప్పటికిని లోకులు నిందింపరు, నవ్వనీ కొరకు గొప్పదిగనుక దాని పూర్వగౌరవము నిలుపవద్దా,

ఈవిధముగ మల్లికవారిగౌరవమునుగూర్చియు, సుమిత్త్రవారగు ధనపురమువారి వైభవమునుగూర్చియు, తనభాగ్యమును గురించియు దేవీనవరాత్రములకు వారియింట జరుగు పూజలగురించియు నెంతసేపటివఱకామె తెంపులేకుండ ప్రసంగించినదో నుడువ చెప్పఁజాలము. పాపము ప్రొద్దుపోవుటచే హేమచంద్రుని కన్నులు నిద్రావశమున మూతలు పడుచుండెను. అందుచేత సత్యదత్తగారి యంతములేని సోదెవంటి సంభాషణమునకు విసుగుఁజెంది, యామె యేమనుచున్నదో యని తెలుసుకొనక సమాధానములు నిచ్చక యావులించెను. ఎంత విసుగుఁజెందిన, నామె తనగోడు మానకపోవుటచే హేమచంద్రుఁడు నడుమనడుమ నామెయడిగిన ప్రశ్నములకు నవ్వు నవ్వుచు యుత్తరమిచ్చు చుండెను, ఆ యుత్తరమునుబట్టి తనమాటలను శ్రద్ధగా వినుచున్నాఁడని, యామాయకుని గుఱ్ఱమువలె తనకథ నామె మఱింత సాగనిచ్చుచు వచ్చెను. అప్పటికి బదిగంటలు దాటెను, నిద్రాపరవశుఁ డయిన హేమచంద్రుని యదృష్టవశమున వారుమాటలాడుచున్న గదితలుపు వద్ద సందెల చప్పు డయ్యెను. ఆ ధ్వని జీవనదివంటి యామె కథాప్రవాహమునకు కట్టు గట్టయ్యెను. ఈమె ధనపురపు ధనేశ్వరకుటుంబమునాఁడు కోడలు కావున వెలలేని బంగారు నగలు, రతనాలపోఁజవ్వులు మేనంతట మెఱయుచుండ జరీ ముద్దవంటి చీరగట్టికొని సొగసులు గుల్కునట్లు మంద మందగమనములతో గది ప్రవేశించి కుశలప్రశ్న మడుగుటకు హేమచంద్రుని యెదుట నిలిచెను. ఆమె యిరువది యేండ్లది. మేలిచాయ శుద్ధసువర్ణమువలె పచ్చనై లావణ్యము గ్రక్కుచుండెను. నవయౌవన ప్రాదుర్భావము చక్కదనమునకుం దోడగుటంజేసి యాగ్రామమున నామెతోఁ బోల్పఁదగిన విలాసవతియే లేదు. కాఱుమబ్బులవంటి తలవెండ్రుకలను సిగ జుట్టికొనియెను. చందమామ నేలు విశాల ఫాలభాగమున రతనపుం బాపటబొట్టు మెఱయుచుండెను. సిగమీఁద వజ్రములుచెక్కిన బంగరుతుమ్మెదయమర్పఁబడెను. చేతులనున్న పోఁచీలు, కంకణాలు మొదలగు బంగారు జతలు వర్ణింపసలవిఁగావు. నడుమున వడ్డాణమునకు బదులు మేలుపసిండి మొలనూలు మెఱయుచుండెను. నవరత్నములు చెక్కిన బంగరుపట్టెడయు నైదుపేటల ముత్యాల హారము మెడనలంకరించెను. ఆమె వేషముజూచి హేమచంద్రుఁడు చిన్ననాడు తన కింగ్లీషుపాఠశాలలో స్త్రీలకు నగలు చేయించకూడదనిన నాగరకుఁడగు నుపాధ్యాయుఁడు

చెప్పినమాట జ్ఞప్తికిఁదెచ్చికొని తనలో "ఎందుకువచ్చినడంబమిది. సొమ్ము పాడునకేగాని" యనుకొనెను. ఆభరణములు హిందూదేశ స్త్రీలకు జీవనాధారములైన యాస్థియని హేమచంద్రునకుఁ దోఁచలేదు. హిందూదేశ స్త్రీలందరు డంబమునకే యీయలంకారములను ధరింపరు. అలంకార రూపకమైనసొత్తు వారికి స్త్రీధనమై స్వాధీనమై పరమపవిత్రమై ఋణప్రదాతకుఁగాని దొరతనమువారికిగాని చేరుకొనుటకు వీలులేక యావజ్జీవ మభయప్రదాయకమైయుండును. ఆఁడుది విధంతువైనను సంతానహీనురాలైనను వేయేల! యెంత దిక్కుమాలిన దైనను స్త్రీధనముజోలికిమాత్ర మెవ్వరు వచ్చుటకువీలులేదు. కృషివలన జీవించు కాఁపుకుటుంబము లనేకములు కరవుకాలములలో నాఁడువాండ్ర వెండిబంగారు నగలమ్ముకొని తినుటవలననే నశింపక నిలువగలిగెను. ఇంక భాగ్యవంతులలో పూర్వార్జితములగు నగ్రహారములు మాన్యములు మేడలు మిద్దెలు మొదలగు సర్వస్వము కాలవశమున నన్యాక్రాంతములైపోయినను వంశపారంపర్యముగఁ బలుతరములనుండి గృహముల నుండెడు రత్నాభరణములను సువర్ణాలంకారములను విక్రయించుకొనుటచేతనే కష్టకాలములలోఁ దొల్లింటిగౌరవముఁ గొంతవరకైన నిలువఁబెట్టికొని జీవించుచున్నారు. నగ లెన్ని యాపదలైన గడుపఁజాలును కావున హేమచంద్రుఁ డనుకొనునట్లు గర్హ్యములు కావు. అంతట సుమా హేమచంద్రు లీ తెఱంగున మాటలాడిరి.

సుమ.—బావా! ఇది సుదినము. ఈవేళ యుదయమున నే నేమంచిమొగముఁ జూచినానో కాని నీదర్శన మైనది.

హేమ.—అదృష్టము నాది. నీది కాదు. ఏమా? మావంటి పేదవాండ్రకు సుకృతము లేనిదే మీవంటివా రగుపడుదురా!

సుమ.—సరి సరి బావా బాగున్నది. నేనిక్కడికి పదిదినములక్రిందట వచ్చినను నీవొక్కనాఁడైన నన్నుఁ జూడవచ్చితివి కావుగద! పోనీ దానికేమిలే. నీవు బాగున్నావుకదా! అక్కయ్య, పిల్లలు బాగున్నారు కదా!

హేమ.—ఆ! మేమందరము నెమ్మదిగా నున్నాము. నీవు కులాసాగా నున్నావు గదా!

సుమ.—ఆ! నీదయవల్ల. నీకు మామీఁద దయ యున్నది గనుక మా క్షేమము విచారింపవచ్చావు. ఈరాత్రి నీవు దర్శనమిచ్చుటచేత నీకు మామీఁద నపారమైనదయకలదు. ఇప్పుడైనను మా బిందక్కయ్య పంపబట్టి నీవు వచ్చియుందువు. చాలప్రొద్దుపోవువఱకు నీ విక్కడ నుండకు. నీవెక్కడికో వెళ్ళినావని యామె యనుమానపడఁగలదు.

హేమ—(గుణవతి హాస్యపుమాటలు విని ముసిముసినవ్వులు నవ్వుకొని) ఉమా! సాధ్యమయినంత త్వరలోనే మీయక్క నిన్నుఁ జూచుటకు వచ్చును. ఆమె ప్రతినిమేషము నీమాటయే స్మరించుచుండును. తెలిపి చేసికొని రావలయునని వగచుచున్నది. రేపు తప్పక వచ్చునులే. అప్పుడు పిల్లలను జూడ వచ్చును.

ఉమ—సరే, రేపుపంపు. ఒక్కసారి పిల్లలను జూడవలయునని యెంతో ముచ్చటగా నున్నది. (ఉమకు బిడ్డలు లేనందున పిల్లలపేరు చెప్పగానే వారినిఁజూచుటకామెకుఁ గుతూహల మెక్కువయ్యెను.)

హేమ—తప్పక రేపే పంపుదును. నీ వత్తవారియింట నున్నపుడుగూడ నీక్షేమ సమాచారములు తెలుచుగా మీయక్క కనుగొనుచునే యుండును.

ఉమ—అది నే నెఱుఁగనా. బిందక్కయ్యకు నేనంటే ప్రాణము కాదా, చిన్నపుడొక్కకంచములోఁదిని యొక్క మంచముమీఁద పండుకొన్నవారము కామా. ఒకనిముసమైన నొకరినొకరము విడిచి యున్నవారమా. పెద్దవారమైనతరువాతగూడ మేమిద్దఱ మొకచోట నేయుండి ప్రతిదిన మొకరినొకరు చూచుచుండునట్లు లొక్కగ్రామముననే యుండవలయునని కోరుకొనుచుండువారము. కాని దైవయత్నమువల్ల నిద్దఱముఁ జెఱియొకయూరను బడిపోయి దూరమైపోయినాము. ఆ చిన్ననాటి యాటలు ముచ్చటలుఁ దలఁచుకొంటిమా యిప్పటికి నెంతో హాయిగ నుండును. రేపు తప్పక యక్కయ్యను పిల్లలను పంపుదువూ?

హేమ—సరే యిన్నిమాటలు చెప్పవలెనా?

ఉమకు బిందును జూచునభిలాష మనసార జనియించెనే కాని నటన నిమిత్తము వచ్చినది కాదు. ఏలయన, గౌరవము సంపాదించుటకై గొప్పవారితో వియ్యమందిన తల్లిదండ్రుల కుటుంబము కాని యెంతసేపైన వినుగు లేక తన గొప్పతనము తనగొడవలుఁ జెప్పికొనుచుండిన అత్తగారియొక్క వట్టిగర్వము కాని యామెకడ లేనందునను మఱింతో చక్కనిదయ్యు బిందు లేనిరతనాలనగలు మేన దాల్చినదయ్యు మహా శ్రీమంతులకోడలయ్యు రవంతయైనను గరువము నందక చిన్ననాఁడు తాను బిందుతోఁ జేసిన నెయ్యమును హృదయమునం దుంచుకొనియె. ఆమె యొయ్యారము నామె యైశ్వర్యముఁ జూడఁగానే యామె చుట్టములనెల్ల మఱచియుండునని మొట్టమొదట హేమచంద్రుఁ డనుమానపడెను. కాని యామె కొండొకతడవు మాటలాడి తన యత్తవారికుటుంబ గౌరవమునకుం దగిన గుణమున కడమీయక హృదయపూర్వకమైన ప్రేమను జూపినతోడనే యా

యనుమానము నశించెను. ఉన్నతస్థితి సంపద మున్నగునవి చిన్ననాటి సహజమైత్రినిఁ దునుముట్టింపక యుండుకేని ప్రపంచము సౌఖ్యభూయిష్టమై భాగ్యవంతమై యుండునుగు కదా. హేమచంద్రుఁ డట్లుపలికి స్వగృహమునకు బోవఁదలఁప నుమ "బావా నీ పాద ధూళితో మా గృహమునుఁ బావనముఁజేసి యనుగ్రహించితివి కాన చిన్న విందారగించి మమ్ము మఱింత ధన్యులఁజేయ వేఁడుచున్నాను. కొంచెము ఫలహారముఁజేసి వెళ్ళు" మని బతిమాలి రమ్మని యందెలు ఘల్లుఘల్లుమని మ్రోయ తాను ముందు నడవసాగెను; హేమచంద్రుఁ డామెమాట త్రోసివేయలేక వెనువెంట వంటయింటికిఁ జనియెను. ఆ యింట రెండు క్రొవ్వువత్తుల దీపములు ధగధగ వెలుఁగుచుండెను. ఒక వెండియాకులోఁ గొన్ని మధుర పదార్థములు రొట్టెలు నుండెను. దానిచుట్టును వెండిగిన్నెలలోఁ గొన్ని కూరలు క్షీరాన్నము పాలు పెట్టబడి యుండెను. భాగ్యవంతులుగూడ సాధారణముగ వట్టియాకులలోను పళ్ళెములలోను భుజియింతురు. కాని యల్లుళ్ళు వచ్చినప్పుడు గొప్ప మిత్రులు చుట్టములు వచ్చినప్పుడు తమవైభవముఁ జూపుటకు వెండియాకులు గిన్నెలుఁ బయటికితీయుదురు. పాపము హేమచంద్రుఁడు జన్మమెత్తిన తరువాత నెన్నఁడు నంతవెలగలపళ్ళెరంబులలో గిన్నెలలో నంతరుచిగల పదార్థములను భుజించి యెఱుఁగఁడు. ఆ పాత్రలకైనధనము తనకుటుంబమున కొకసంవత్సర గ్రాసమగునని యతఁడు తలంచెను. అంతట నుమ చతురమైన యొక చిత్రాసనము వెండియాకువద్ద వేయించి, బావా! కూర్చుండుము. మొగమాటపడక యీ చిన్న విందారగింపుము. మావలన లోపములున్న నవి బుద్ధిపూర్వకముగాఁ జేయలేదు. కావున క్షమియింపుమని పల్కెను. హేముఁడు చిత్రాసనముమీఁదఁ గూర్చుండి భుజియించుచుండ నుమ వాని ప్రక్కనే కూర్చుండి మాటలాడుచుండెను. ఉమ చక్కనిచుక్క. ధనపురముజమీందారుని కుమారుఁడు మిక్కిలి చక్కనిదానినే గాని పెండ్లియాడనని పట్టుపట్టుటచే నాతనితండ్రి తాళ్ళచెఱువు గ్రామమున నతిలావణ్యవతి యైన యీబాలిక యున్నదని కర్ణాకర్ణిని విని యామె నిమిత్తము విశ్వప్రయత్నముఁజేసి పెండ్లిఁజేసెను. తారుణీమల్లికుఁడు సహజముగ గొంచెము మంచిస్థితిగలవాఁ డయినను ధనపురముజమీందారుతో వియ్య మందుటకుఁ దగినభాగ్యవంతుఁడు కాఁడు కావున నీవివాహముచేత నతఁడును, మాయామర్మము లెఱుఁగని వాని భార్యయు మునుపటికంటె నెక్కుడుగౌరవము కలిగి యించుక గర్విష్ఠు లయి యుండిరి.

ధనము సకలసౌఖ్యప్రదాయ మని యుమయు నెఱుంగును. కానియంతటి భాగ్యవంతులకోడలై యామె సౌఖ్యపడుచున్నదో లేదో యిప్పటికి మనకుఁ దెలియదు. ఈ కథాప్రచారమున ముందు ముందు మనము ధనపురముజమీందారును గలిసికొని నప్పు

డావృత్తాంతము నెఱుంగ వచ్చును. కాని ప్రస్తుత మొక మాటమాత్రము చెప్పగలము. ఆ చిన్నజమీందారుఁడు బాల్యమును విడిచి యౌవనముఁ బ్రాప్తించినపిదప చక్కఁదనములమీద నెక్కువమక్కువఁ గలవాడయ్యెననియు, నొకరేఁడు పైఁబడినకొలఁది భోగపరాయణుఁ డగుచున్నాడనియు నొకవాడుక లోకమున వెల్లడియయ్యెను. తాళ్ళచెఱువుపల్లియలో నున్న పేదలచరిత్రల వ్రాయుచున్న మన కిపుడు భాగ్యవంతులు, మదోన్మత్తులు నయిన యాజమీందారులగొడవ లక్కఱలేదు.

ఉమతో హేముఁడు చాలసేప నేకవిషయములను గుఱించి ప్రసంగించెను. ఆ ప్రసంగము రానురాను కొంత తడవున కామె యత్తవారిగొడవలలోనికి దిగెను. అత్తవారి ప్రసంగమువచ్చినప్పు డామె బదులుపలుకక మౌనముతాల్చుచు వచ్చెను. అదిచూచి హేమునిమనస్సునఁ గొంతయనుమానము దానితో వ్యాకులమును గలుగఁ జొచ్చెను. తాళ్ళచెఱువునం బుట్టినయాడపడుచులలో నెల్ల లావణ్యవంతురాలు భాగ్యవంతురాలు సౌఖ్యవంతురాలు నని పేరువడిన యీ ముద్దుగుమ్మ హృదయ మింత లేతవయసున జింత యను నగ్నిహోత్రముచేత గాల్పఁబడుచుండునా యని సందేహముఁ దోప హేముఁ డామెమొగమువంక రెప్పవాల్పక పలుమాఱు చూడ దొడఁగెను. చూడఁజూడ ననేక రత్నాభరణముల యడుగుననున్న యామె మనస్సులో పైకి రాక యడఁగియున్న విషాదము కనుగొలంకులయందు పైకిరాక యడఁగియున్న కన్నీరు వానికిం బొడగట్టినట్లయ్యెను. "ఈమె ముఖారవిందమున గుప్తముగు విషాదము నిజముగా నా కగపడుచున్నదా లేక నాకన్నులు భ్రమఁజెందినవా" యని హేముఁ డొకటి రెండుసారులు తనలోఁ దాను వితర్కించుకొనెను.

ఏదవ ప్రకరణము

మిత్రదర్శనము

అటు హేమచంద్రుఁడు బిందారగించి తారుణీమల్లికునిం గలిసికొని తన వ్యవహార మాయనతో మాటలాడి యింటికిఁ బోవ పయన మగునప్పటి కర్ధరాత్ర మయ్యెను. బిందు తలవాకిట నిలిచి భర్త నిమిత్త మెదురు చూచుచుండఁ గొండొకతడవున కామె కతని దర్శనమయ్యెను. అగుటయు నామె మొగము సంతోషముతో వికసింప "నిప్పటి కైన నింటిమాట జ్ఞాపక ముంచుకొని వచ్చినారు నయామే; యెక్కడనో దాగి తప్పినా రనుకొని భయపడుచున్నాను. పాపము మాయుమ తన యత్తవారిగొడవలు చెప్ప మొదలు పెట్టి యుండును. ఆ తియ్యనిపలుకులు చెవులు దోరపెట్టి వినుచు వదలి రాలేకపోయి నారు కాఁబోలు" నని పరిహాస మాడెను. అనవుడు "బిందూ! యెందు కీమెత్తని మందలింపులు. అంతవిశేషము ప్రొద్దుపోయినదాయేమి" యని హేముఁడు పలుక అబ్బే! యెంతో ప్రొద్దు పోయినదా రెండు యామము లయినది. ఊరు మాటుమణగినది. మీ స్నేహితుఁడు చీకటిపడగానే వచ్చి మీరిప్పుడే వత్తురో యప్పుడే వత్తురో యని మీనిమిత్త మెదురు చూచుచున్నాడని బిందు ప్రత్యుత్తర మిచ్చెను. అనగానే హేముఁడు తొట్రుపడి యెవరువచ్చినా రెవరు వచ్చినారు. ఏడీ యెక్కడ, యన బిందు రండి చూతురుగాని, యని యాతని లోనికిఁ గొంపోయెను.

లోనికిం జనినతోడనే చక్కని మేనిచాయయు సుందరమగు నెమ్మొగముఁగల యొకపడుచువాఁడు హేమచంద్రుని కెదురుగా వచ్చెను. హేమచంద్రుఁ డాతనిని గొంతసేపటివఱకు గానవాలుపట్టలేక కలవర మందుచుండ బిందు చిరునవ్వులు నవ్వఁ జొచ్చెను. కొంతతడవునకు హేముఁడు తనమిత్రుని గుర్తుపట్టి యోహోహో! శరచ్చంద్రుఁడా, యని పలుకరించెను. అంతట వారీ క్రిందివిధమున సంభాషించిరి.

శర—అవును నేనే జ్ఞాపకము వచ్చినదే ?

హేమ—నీవు కలకత్తానుండి యెప్పుడు వచ్చినావోయి. ఎంత మారిపోయినావు. నిన్ను నేను చూచి పదియేండ్లయినదిసుమా. నాఁడు మీయప్ప కాళి పెండ్లిలోఁ గలిసికొనినాము. అప్పుడు నీవు చిన్నపిల్లవాఁడవు. వర్ధమానములోఁ జదువుకొనుచుంటివి. ఇప్పుడు చాల పొడుగైనావు. మీసకట్టు దట్టముగ తిరిగినది. అందుచేత వెంటనే పోల్చలేకపోయినాను.

శర — అవును. మాయప్ప పెండ్లియైన కొద్దికాలములోనే మాతండ్రిగారు పోయినారు. అంతట మాయమ్మ నాతోఁగూడ వర్ధమానమునకు వచ్చినది. అందుచేత నప్పటినుండి యిక్కడకు రావలసిన యవసరము లేకపోయినది. అందుచేత కృతార్థుఁడనైన పిదప ప్రథమశాస్త్రపరీక్షఁ జదువఁ దలచి కలకత్తాకు పోయితిని. మాయమ్మ నాతో రాక నీయూరికి వచ్చి యుండెను. ఇవి వేసవికాలపు సెలవులు గనుక నేనామెను జూడ వచ్చితిని. పదియేండ్ల తరువాత నేనే మాఱిపోవుటయనియొక యాశ్చర్యమా! మీరంతయు మాత్రము మాఱలేదా! మాబింబవదినె నాకంటె నొకయేఁడు పెద్దదన్నమాటయే గాని మేమిద్దఱ మొకయీఁడువాండ్రవలెనె జిన్నప్పుడెంతో సంతోషముతో నాడుకొనువారము. ఒకరిని విడచి యొకరముండువారము కాము. వారియింటికి నేనైనను బోవలయును; నుథ నెత్తుకొని యామెయైన మాయింటికి రావలయును. అప్పుడొకమాఱు మాయింటి ప్రక్కవారి జామిచెట్టునుండి కఱ్ఱకుఁ గొంకిఁగట్టి జామిపండ్లు దొంగతనముగాఁ గోసికొని వచ్చినది. అమ్మా! చిన్నపుడు బిందెంత గజదొంగనుకున్నావు. అలాటిదిప్పుడు పెద్దయారిందయై యిద్దఱు పిల్లలతల్లియై గృహయజమానురాలై కాపురముఁ జేయుచున్నది.

బింద — (చిఱునవ్వుతో) చాలుచాలు! గజదొంగ లేదు గిజదొంగ లేదు. నాజోలికిరాక నీమాట జెప్పుకొనుము. నీవీయూరిలో నున్నంతకాలము మామిడిచెట్ల నెక్కుడనైన నొకపిందియైన నుండినదా? అలాటివాఁడె యిప్పుడు కలకత్తా కాలేజిలోఁ జేరి పెద్దచదువులు చదువుచున్నావు. చాల తెలివైనవాఁడవని యందఱుఁ జెప్పికొనుచున్నారు. ఆదినములలో నీలాగున చెట్లు నవలీలగ నెక్కఁగలవాఁడుఁ దోఁట దొంగతనములు చేయఁగలవాఁడు లేఁడు. ఈదినములలో నీలాగున జదువునకు దేనికి బేరుపడిన వాఁడును లేఁడు. పదియేండ్లలో నెంతమార్పో చూడు!

శర — అబద్ధమాడకు. ఉన్న నిజమంతయు చెప్పు. ఆదొంగతనములు చేయించిన వారెవరు! చాటుననుండి నీవే కాదూ? మీగొడ్డిలో నున్న పచ్చిమామిడి కాయలు తినవద్దని మీ పెత్తల్లి యడ్డుపెట్టుచు వచ్చినందున నేను చీకటిపడఁగానే కోడి దుమికి చెట్టెక్కి కాయలుకోసి వంట యింటివసారాలో నీవు నిలిచి యుండఁగా నేను గిరివాట్లు వైచెడువాఁడను కానా? జ్ఞాపకము వచ్చినదా?

హేమ — (నవ్వుచు) చాలు చాలు. ఒకరిగుట్టు లొకరు బయటపెట్టికొనకండి. మీరు నేఁడే చెప్పుకొన నక్కఱలేదు. మీరిద్దఱెంత గజదొంగలో నేనెఱుంగుదును.

(అని శరచ్చంద్రునితో) చంద్రా ! ఆదినములలో నేనుగూడ మీయింటికి వచ్చుచుండెడి వాడను. జ్ఞాపకమున్నదా ! అక్కడనే సుధాబిందు లిద్దఱు నుండువారు. అప్పటికి సుధ యీ కొండ్లది. (అని సుధవంకఁజూచి) సుధా ! మీయక్కతో గలిసి వీరి యింటికి వెళ్ళెడుదానవు జ్ఞాపకము లేదటే !

సుధ—(తన చిన్ననాటిసహకారి యగు శరచ్చంద్రఘోషు మొగము జూచి కొంచెము సిగ్గుపడి తలవంచి) అవును. జ్ఞాపకమువచ్చినది.

హేమ—అయితే చంద్రా ! నీభోజన మైనదా ?

శర—అయినది. ఈవేళ బిందువదినె మామిడికాయ పచ్చడి యొంతిపసందుగా జేసిన దనుకొన్నావు. ఈలాటిపచ్చడి నెప్పుడు నేను తినలేదు.

బిందు— (పరిహాసముగా) సందేహీంకటిలో మామిడిచెట్లెక్కి కాయలెత్తికొని వచ్చి తిన్నప్పటికన్న బాగున్నదా ?

శర—సందేహమా ? అంతకన్న బాగున్నది. పచ్చికాయలు పలుమాఱులు తిన్నాను. కాని యిట్టిపచ్చ డెప్పుడు తినలేదు. జిహ్వా లేచివచ్చుచున్నది కాదా?

బిందు—అప్పుడు పచ్చడిచేసినదాఁక ఆగుటకు నీ కోపికయేది ?

హేమ—(బిందుతో) సుధయు నీవుగూడ భోజనము చేసినారా ?

బిందు—సుధ యన్నము తిన్నది. నాభోజనము కాలేదు. మీది కడుపునిండిన బేరములాగున్నది. అత్తవారియింట విందారగించి వచ్చినట్లున్నారు. నేనింకఁ బోయి భోజనము చేసివత్తునా ? మీ కీపూట నేమియు నాశ లేదుగదా ?

హేమ—అవును. మా పెదబాబయ్యగారియింటఁ గడుపునిండాతిన్నాను. నీవు భోజనముఁ జేసి రమ్ము.

అంతట బిందు భోజనమునిమిత్తము వంటసాలకుఁ జనియెను. సుధ బావగారు వచ్చువఱకు మేలుకొనియుండి యాయన వచ్చినపిదపఁ గొంతసేపు మాటాడి వసారాలో నొకచాపఁ బఱచికొని పండుకొనియెను. ఆమె లేతమనస్సు విచారములకు నిలయము కానందున బండుకొనినతోడనే మలయమారుతముయొక్కయుఁ బయిపయిం బ్రసరించు వెన్నెలలయొక్కయుఁ జల్లదనముచేత నామెకు హాయిగ నిదురపట్టెను. తొల్లిచెరువు గ్రామ మంతయు నిశ్శబ్దమై నిద్రావశమైయుండెను. శరచ్చంద్రఘోషు హేమచంద్ర

బోసుతో మఱల సంభాషణ మారంభించెను. వా రిరువురుఁ జిరకాలమునకు గలసికొన్న మిత్రు లగుటచే వారి సంభాషణమున కెడతెంపులు లేక పోయెను. ఘోషు కుటుంబము బోసుకుటుంబము సంబంధబాంధవ్యములచేత పూర్వులనాటనుండియు బద్ధములై యుండెను. దానికిం దోడుఁగ నా యుభయ వంశానుకూలురు నగు హేమచంద్ర శరచ్చంద్రులు చిన్ననాటనుండియుఁ బరమ మిత్త్రులు. హేమచంద్రుఁడు శరచ్చంద్రుని తన తమ్మునియట్లభావించి యాతని యౌదార్యమును చిత్తనైర్మల్యమును సంభాషణవలనం గ్రహించి తద్దయు నాదరించెను. శరచ్చంద్రుఁడు హేముని దన యన్నయట్ల భావించి వానియెడ మిక్కిలి గౌరవ ముంచెను. ఎడతెగని యా యిరువుర సంభాషణముఁ జరుగుచుండగనే భోజనముఁజేసి బింబు వచ్చి తన చెల్లెలు సుధ తలగడలేక పండుకొనుటఁ జూచి యామె తలను మెల్లఁగ దన తొడపై నిడుకొని ప్రేమాతిశయమున అలకలు నిమురుచు తానుగూడ సంభాషణములో దిగెను. అంతట వా రిట్లు ప్రసంగించిరి.

హేమ—చంద్రా! నీ విప్పుడు బియ్యేకుఁ జదువుచున్నావుగదా! ఇంక నైదాఱు నెలలోఁ బరీక్షయగును. పరీక్షలోఁ దేఱిన పిదప నేమిచేయుదువు?

శర—ఆ విషయమై నేను యోచింపలేదు. మాయమ్మ కాశీవెళ్ళవలెనని సంకల్పించుకొన్నది. అందుచేత నా పరీక్ష ముగియగానే నన్నిక్కడకు రమ్మనియు మాభూమి పుట్ర చూచికొమ్మనియు నన్నామె బలవంతపెట్టుచున్నది. ఆస్తికొంచెము. దానివలన నేఁడాది కాఱేడు వందలరూపాయలకంటె నెక్కువరాదు. మాయమ్మ కాశీలోనే దన జీవితకాలశేషముఁ గడపఁ దలఁచుకొన్నది గావున నామె నక్కడ ప్రవేశపెట్టి భూముల మీఁద శిస్తామె కిచ్చుచు నేనేదైన తగిన యుద్యోగము సంపాదించికొనవలయునని యున్నది. ఈ సెలవులలో నేను మాయమ్మను గాశికిఁ దీసికొని పోవుటకుం దగు నేర్పాటులు చేసినాను.

హేమ—నీయాలోచన బాగుగ నున్నది. మీ తల్లి కాశిలో నివసింపఁ దలఁచుకొన్నది గావున తప్పక యామె నక్కడ దిగవిడచి తిరిగి కలకత్తాకుఁ బోయి కాలేజీలోఁ జేరి కష్టపడిచదువుము. పరీక్ష చాలాకష్టము. ఇదివఱకు నీవు ప్రవేశ పరీక్షలోను ప్రథమశాస్త్ర పరీక్షలోను కృతార్థుఁడ వైనట్లే, యిందులోఁగూడ గౌరవముగ మొదటి తరగతిలో కృతార్థుడ వగుటకే కృషిచేయుము.

శర—చదువునను మఱికష్టపడి, తరువాతి దైవమున్నాఁడు. కలకత్తాకు సాధ్యమైనంత త్వరగా వెళ్ళుదును. మీరుగూడవచ్చి కలకత్తాలోఁ గొంతకాల మున్నపక్షమున బాగుండును. ఎల్లకాల మీ పల్లెటూరిలో నీవేలాగున నుండగలవయ్యా! పదియేండ్ల

క్రిందట నీవు కాలేజీలోఁ జదివినప్పుడు స్వల్పకాలము మాత్రము కలకత్తాలోనుంటివి. ఓంమవదినె కలకత్తా మొగమే యెఱుఁగదు. అందుచేత మీ కిద్దఱువచ్చి రెండునెలల పాటక్కడ నుండఁగూడదా? ఊడుపులైపోయినవి కదా! అందుచేత నీవు నాతోవచ్చి కొన్నాళ్ళు కలకత్తాలో నుండవచ్చు. అంతగా రావలసి వచ్చిన పక్షమున కోఁతిలరోజులలో రావచ్చును.

హేమ—చంద్రా! నీవెంతో మంచివాఁడవు; కనుక నింత దయతో నన్ను రమ్మని పిలిచినావు సరే! నేనువచ్చి కలకత్తాలో నేమిచేయుదును? నీవంటే రేపు ప్రొద్దున పరీక్షలోఁ దేఱుదువు. మంచియుద్యోగము సంపాదించుకొందువు. అక్కడ నా కేమి పనియున్నదోయి తిని కూర్చుండనా?

శర—నీవు మాత్రము తలఁచుకొంటే నేడైన మంచియుద్యోగము సంపాదించుకొన లేవఁటోయి? ఈ మాఱుమూల పల్లెటూరిలో నెల్లకాలము గడప వలయునా? నీవు ప్రవేశ పరీక్షలోఁ దేఱినావుగదా! అది యటుండఁగా నీవు చదువు మానినప్పటినుండి యొల్లవారివలె కాక యెన్నో పుస్తకములు చదివి చాల జ్ఞానము సంపాదించినావు. నీ కున్నంత యింగ్లీషుపాండిత్యము బియ్యేల నుని బడాయి చెప్పికొను మాలో నెవరికి లేదు. ఇంత పాండిత్యము నింతయోపిక యింతపట్టుదల గల నీవంటివాఁడు ప్రపంచములో గొప్పవాఁడగుట యొకకష్టమా?

హేమ—నా పాండిత్యమెంత. అతిస్వల్పము. నేనెప్పుడైనఁ బుస్తకము చదువుట పాండిత్యము సంపాదించుకొనుటకుఁ గాదు. ఏమియు దోఁచక కలకత్తావంటి పట్టణములలో నెన్నో పెద్దపెద్ద పరీక్షలలో దేఱి గొప్పపండితులై యుద్యోగముల నిమిత్తము మేజువాణీలు చేసికొని యుద్యోగములు లేక విసికి పోవుచున్నవా రెందరో యున్నారు. అక్కడ నా లెక్కయేమిటి! అక్కడ నేనుద్యోగము కొఱకు ప్రయత్నముఁజేయుటవ్యర్థ. చివరకు జరిగెడు దేమనఁగా కొన్నాళ్ళక్కడనుండి చేతులు నలుపుకొనుచు మఱల నీయూరు రావలసివచ్చును.

శర—పోనీ! అలాగే జరుగు ననుకో! వచ్చినచష్టమేమి? వీఁడు నాతో బాటు గంజియో అంబలియో త్రాగియుండవచ్చును. కర్చులకు మీకే యుపద్రవము నుండదు. ఉద్యోగమునిమిత్తము గట్టి ప్రయత్నముఁ జేసినవాఁడ వగుదువు. మనుష్యమహాసముద్ర మని చెప్పఁదగిన యాకలకత్తాలోఁగూడ పేరు దెచ్చికొని మంచియుద్యోగము సంపాదించుకొనుటకు వీలున్నదని నాయభిప్రాయము. ఏదియుఁదొరకక పోయెనా మీయూరికి వచ్చుట యుండనేయున్నది. ఇందువలన నీకు వచ్చినవష్టమేమియు లేదు. వదినెయు సుధయుఁ గలకత్తా జూచినవారగుదురు.

హేమ___(కొంచె మాలోచించి) నా కేకర్చులు లేకుండ నీతో బాటుగ నుండు మన్నావు కాని మేము వచ్చిన పక్షమున వేరే బసలోనుండుటయే మంచిది. ఏలయన మేముండుటవలన నీచదువు తిన్నగా జరగదు. అయినప్పటి కావిషయ మీ రాత్రియే స్థిరపఱచనక్కఱలేదు. మా పెదమామగారు వర్ధమానము నిమ్మనుచున్నారు. నీవు కలకత్తా రమ్మనుచున్నావు. నాకుఁ గూడ కొంతకాలము స్థలముమార్చ వలయునని యున్నది. స్థిమితముగ నాలోచించి నీవు వెళ్ళకముందే యేదో యొకటి చెప్పెదనులే. ఏదైన నీతో నాలోచింపకుండఁ జేయను.

శర___వదినె! నీయభిప్రాయ మేమి టన్నా? కలకత్తావంటి మహాపట్టణముఁ జూడవలెనని లేదూ?

బిందు___చూడవలె నని లేకపోవుటా? నాయనా? ఊరుచేవమాత్రము సాగునా? మహాపట్టణము గాదా? మాటాడితే డబ్బు కావలెను. మేము పేదవాండ్రము. ఇక్కడ నున్నప్పుడే డబ్బు కెంతెంతోఁ జిక్కుపడు చున్నాము. ఇఁక నక్కడ నెట్లు బ్రతుక గలము?

శర___మీకంత డబ్బెక్కువ యుండలే పొదుపైచేసికొన వచ్చును. కాని మీకే కర్చులు యవసరము లేదు. మీరు మాయింటనే యుండవచ్చును. మీరుండుటవలన నాచదువు చెడిపోదు. తఱచుగా నేను రోజంతయుఁ జదువుకొని విసికివిసికి హాయిగ బ్రాణమిచ్చి మాటాడువారు లేక యొంటిగ విచారముగ నుందును. మీరున్న పక్షమున నా చదువు చెడిపోదు. సరే కదా, సంతోషము చేత మఱింత సాగును.

బిందు___(నవ్వుచుఁ బరిహాసముగా) మఱేమి భయము లేదు కాని నీవు చదువు కొనుచు జదువుకొనుచు మధ్యమధ్య చిన్ననాటి ముచ్చటలు జ్ఞాపకము వచ్చినప్పుడు పుస్తకము లక్కడ పెట్టి వంటయింటికివచ్చి తోటలో జేసిన మామిడికాయల దొంగ తనము నాతోఁ జెప్పుచుందువని భయపడు చున్నాను.

శర___ఆలా గనుకొనకపోతే చుట్టుపట్ల తోటలలో మామిడికాయ లేమైన నున్న వేమో దొంగిలించుకొని నమ్మని నన్నె నీవు పిలుతువనుకొనరాదా? ఎట్లయిన మంచి పచ్చడి చేసి పెట్టుదవు కనుక లాభము నాదేలే.

బిందు___నీ వేలాగైన నదృష్టవంతుఁడవే నాయన! నేను నిన్న విన్న మాట నిజమో యబద్ధమో కాని నీ కన్ని పచ్చళ్ళు, నన్నెవంటలు చేసిపెట్టుట కొకమ్మాయి గారు సిద్ధమగు చున్నారని తెలిసినది.

శర — ఆ యమ్మాయిగా రెవరమ్మాయి !

బిందు — ఏమి నంగనాచివోయి ? పాప మేమియు నెఱుఁగవు. మీ యమ్మ నీకు పెండ్లిఁజేయుటకు సంబంధము వెదకుట లేదా? అబద్ధమాడక చెప్పు.

శర — (కొంచెము సిగ్గుపడి) పెండ్లిలేదు. ఏమీలేదు.

బిందు — (నవ్వుచు) నిజమే యైయుండునని నాకుఁ దోఁచుచున్నది. నీవు సిగ్గుపడి చెప్పవు. మీయమ్మ కాశికి వెళ్ళకమునుపు నీసంరక్షణముఁ జేసి నిన్ను బాగుగఁ గనిపెట్టఁగల పెండ్లామును నీకు గట్టిపెట్టియే వెళ్ళునఁట !

శర — ఈవిషయములో మాయమ్మ పట్టుదల యంతగా లేదు. ఆమెవైరాగ్యమేమో యామె యేమోకాని యీగొడవ లామె కక్కఱలేదు ! ఈపట్టుదల యంతయు మాయప్ప కాళిది. ఆమె వర్ధమానములో నాకుఁ దగినసంబంధ మొకటి విచారించినదట. ఇక్కడకు వచ్చినప్పటినుండియు నాసంబంధ మొప్పుకొమ్మని యామె మాయమ్మను బలవంత పెట్టుచున్నది. కాని బి.ఎ., పరీక్షలోఁ గృతార్థుఁడనై కుటుంబపోషణముఁ జేసికొనుటకు మంచియుద్యోగము సంపాదించుకొనువఱకు పెండ్లిచేసికొనననని వారిద్దఱితో స్పష్టముగఁ జెప్పినాను.

బిందు — పాపము కాళినిఁజూచి ఎన్నాళ్ళో యైనది. అదియును, నేను చిన్ననాఁట నెల్లప్పు డొక్కచోటనే యుండువారముగదా ! ఇప్పుడధమపక్ష మాఱు మాసములకొక సారైన నొకరినొకరు చూచికొనుట లేదు. నేను వారిద్దఱను నే నేదో వీలుజేసికొని తప్పక చూచి తీరవలయును.

శర — సరే, మాయక్కయ్య యీమను చూచుటకు నేను వెళ్ళవలె ననుకొనుచున్నది. మీ పెదబాబయ్యగారి యింటికి వెళ్ళితివా, అక్కడ నీ విద్దఱినిఁ జూడఁగలవు.

బిందు — అక్కడికే వెళ్ళెదను. మీ యప్పను జూడవలెనని నాకెంతో యుబలాటముగా నున్నది. పాప మది యెన్నాళ్ళకోగాని రాదు. వచ్చుటకు వీలులేదు. ఏమంటే కుటుంబము పెద్దది. పైగా మగఁడు రోగిష్టి. ఆయన కేబరిగియావపడి వచ్చి నట్లున్నది. చూచి చూచి మీయమ్మ కాళిని దానికంటె నిరుపేదయొండ్లు పెద్దవానికి రెండవపెండ్లివాని కిచ్చినదేమిటోయి !

శర — ఆమాట నన్నడుగ కమ్మా ! మాయమ్మ కాసంబంధము సుతరా మిష్టము లేదు. వారు కులీనబ్రాహ్మణు లఁట ! అందుచేత తమ సొమ్మంత పడిపోయినట్లు మా

చుట్టములు పురోహితులుం జేరి మాయమ్మను మెడలు విరిచి ఈ సంబంధము చేయించినారు. పాపము దానికిరవ్వ మాలాగున నున్నది. అది మేకపిల్లవంటిది గదా. ముసలిమగఁడైనను దానంతే పెట్టి పుట్టినావని తృప్తి జెంది యుండును గదా! అట్టి పెండ్లిచేసినందుకు నొకరిని పల్లెత్తిమాటాడదు కదా. మగనిమీఁద పతిభక్తి కదా.

అంతట నాగియక యీసంభాషణ మితరవిషయములలోనికిం దిగెను. మిక్కిలి ప్రొద్దుపోయిన దని శరచ్చంద్రుఁడు లేచి "వదినె! చాలప్రొద్దు బోయినది. నే నింటికిం బోయెదను. రేపు మరల వచ్చెదను. నేనే కాదు నే నిక్కడ నున్నంతకాలము ప్రతిదినము వచ్చి మామిడికాయ పచ్చడి కొంచెము రుచి చూచి పోవుచుందును. మీరు కలకత్తాకు వచ్చినపక్షమున నేను సుఖముగా రాచబిడ్డవలె నుందును" అని పలికెను. "ఆవిషయము ముందుముందు విచారించికొన వచ్చునులే. అన్నిటికన్న ముందు రేపు మీయమ్మను కలిసికొని ఈ రాచబిడ్డగారికి మామిడికాయపచ్చడిలో నేలోటు రాకుండ చేసిపెట్టగల చిన్నదానిని దీసికొనిరమ్మని గట్టిగ నొక్కి చెప్పెద" నని చిఱునవ్వుతో బిందు ప్రత్యుత్తర మిచ్చెను. శరచ్చంద్రుఁడును మందహాసము చేసి వారికడ సెలవుగైకొని గృహమునకరిగెను.

అప్పటికిని సుధ మేలుకాంచనే లేదు. తెలువపువ్వు నెక్కినక్కి యాడగల నామె ముద్దుమొగము మీఁద ఉదయభాను తనకిరణపుంజముం బ్రసరింపఁజేసి సహజమైన యామె లావణ్యమున కొకవింతలావణ్యముఁ దెచ్చెను. అక్కడనే పెరిగిపెగా నిదుర చూచు సుధ నిదురలో సహితము మందహాససుధాసారముఁ జిలుకరింపఁదొడఁగెను. శరచ్చంద్రుఁడు బయలుదేఱి మనసులో నెన్నెన్నో తలంపులు మల్లడిగొన నామెవంకఁ జూచి నడుచుచు తనలో నిట్లు వితర్కించికొనెను. "నేను కలకత్తాలోను పట్టణములోను గొప్పకుటుంబములను గొప్ప మేడలను మిద్దెలను నెన్నో జూచితిని. కాని యీచిన్న తాటియాకుల యింటిలో నున్నంతసౌఖ్యము, సంతుష్టి, విశ్వాసము నెందుం గనియెఱుంగ. ఆహా! ఆ సోమచంద్రుని హృదయ మెంతదయాపూరితమైనదో! అతనిభార్య యెంత మెత్తనిదో! ఆమెపలుకు లెంతమృదువులో! స్త్రీస్వభావమంతయు నీ బిందురూపము దాల్చిన ట్లున్నది. ఆ సుధాముఖారవింద మెంత ముద్దులు గారుచున్నదో! ఆమె మనస్సు నిష్కలుషము గదా! ఈసాధుజనులతోఁ గలసిమెలసి కొంతకాలము గడియింతునేని బంధుప్రేమ మెట్టిదో తెలియంగని నా కఠినహృదయ మించుక మెత్తపడి యనురాగాస్పదము కాకుండునా? ఏ వేడుకలు లేక పట్టిమొద్దారివలె నుండు నా చదువులగది విడిచి నిజమైన మానవగేహమని చెప్పదగు నీ సాధుజనుల నిలయమునఁ బ్రవేశించి యెన్నఁడైన సుఖింతునే! ప్రాణములేని బొమ్మవలె నున్న నాకు నిజమైన చైతన్య మెన్నఁడైనఁ గలుగునే!"

అశ్రితులు

ప్రభాతకాలము తల్లిచేత సింగారింపబడి బయటకు బంపఁబడిన పెండ్లికూఁతురువలె నుండునని వేదములలో వర్ణింపఁబడి యున్నది. ఆకాశలక్ష్మికిం గారాబుకూతురై తెల్లని దువ్వలువ గట్టినట్లు వెలయు ప్రభాతకన్య తన రాకచే నెల్ల చీకటులను దవ్వుగ దోలి జంతుకోటికి నవనవచైతన్యము గలిగించెను. ఈ ప్రభాతకన్యం బట్టికొని పాణిగ్రహణము చేసికొనుటకు నరుణారుణ ముఖుఁడైన సూర్యుడు సప్తవర్ణము లనియెడు సప్త తురంగములం బూన్చిన యరదము నెక్కి యక్కన్య వెనువెంట దగిలెనో యన దూర్పు దిక్కునం దోఁచె కాని యాతని రాకఁజూచి సిగ్గుపడి యువ్వలకుం దొలఁగెనో యన ధవళ ప్రభాతకన్య యదృశ్యయయ్యె.

బిందు ప్రభాతకాలమున లేచి యిల్లువాకిలి చిమ్మి పెరటిలోనున్న దిగుడు బావిలో రాత్రి వంటజేసినపాత్రలు తోముకొనుటకుఁ బోయెను. ఆమె యాపనిలో నుండఁ గనే యెవ్వరో వీధితలుపు తట్టిరి. అప్పటికి సుధకు హేమచంద్రునకు మెలకువరానందున సగముతోమిన పాత్రల దిగుడుబావిలోనే యుంచి బిందు తలుపు దీయుటకు పోయెను. అవచ్చినది కులమున బెస్తవాఁడై వృత్తిని సేద్యకాఁడైన సోనాతనుఁ డనువాని భార్య. బంగాళా దేశమున బెస్తలను కైవర్తులని వాడుదురు. ఈకైవర్తస్త్రీని బిందు చిన్ననాఁట వరుస కక్కయ్యా యని పిలుచుట కలవాటు పడుటచేనప్పుడును "అక్కయ్యా! ప్రొద్దుననే వచ్చితి వేమమ్మా? ఆచేతిలోని దేమిటి" యని పలుకరించెను. అంతట వారి కీక్రింది సంభాషణ జరిగెను.

కైవర్తస్త్రీ—ఊరక వచ్చినాను. నాచేతిలోనేగ మ కేమిలేదమ్మా! మిమ్మును జూచి యెన్నాళ్ళోయైనది గనుక నొకతూరి యీవేళప్రొద్దున్న జూడాలని నిన్నటి మాపనుకొన్నాను. వచ్చునప్పుడు వట్టిచేతులతో రానేల నని మన సుధకు పెరుఁగిష్టము గనుక గట్టిపెరుఁగు తోడుపెట్టి తెచ్చినాను. చిన్నమ్మాయి లేచినదా?

బిందు—లేవలేదు. అక్కయ్యా! నీ వెప్పుడు మాకోస మేదోకష్టపడి తెచ్చి పెట్టుచునే యుందువు. మీరుమాత్రము డబ్బున్నవాళ్ళా! చేయునది సంసారముగదా. ఈలాగున మాటిమాటికి తేబోకమ్మా! పుచ్చుకొనుటకు నాకు యెంతో కష్టముగా నుండును.

కైవ—ఇదేమంతభాగ్యమమ్మా! వరాలా, మాడలా! ఇవి మాయావుపాలేకాని డబ్బుపెట్టి కొన్నవి కావు. అందులోకొంచెము తోడుపెట్టి మీకిచ్చినంత మాత్రాన

నా సొమ్మంతయు పోవునా? మీరేల యిన్నికాని బ్రతుకుచున్నారుగదా తల్లీ! మా యూరు మీదే. మాయిల్లు మీదే. మా వన్నియు మీవే. ఇలాటి మీకు లేనిపోని మాటలెవరి కిచ్చికొందము? మీరు కామందులు. మేము మీ కాపులము.

బిం——ఇంతగొప్పతో బ్రతికినప్పుడు చెడనగూడదుగదా! అమ్మా! మట్టిబూరు పెట్టి భోజనము చేయునప్పుడు పాసికొందుము. అక్కయ్యా! నీవు పెరుగు తోడు పెట్టినట్లెవ్వరును పెట్టలేరు. నీ పెరుగంటే సుధకంటె యిష్టము. (అని సమీపమునకు వచ్చి) ఇదేమిటక్కయ్యా! కన్నులు తడిగా నున్నవి. ఏడ్చుచున్నావా యేమిటి?

సనాతనుని భార్య యిదివర కెందుకో లోలోపల విచారించుచుండె యుండెను. బిందు కాలమందగనే యది వెల్లివిరిసి పొంగెను. చీకొంగుతో నాపుకొన్న కొంతవఱకుఁ దడిచెను. కాని ప్రవాహ మాగలేదు. అదిచూచి బిందు మాల "యే మక్కయ్యా ఇది? సనాతనుఁడు నెమ్మదిగా నున్నాఁడా" యని యడిగెను. అంతట నీ క్రింది సంభాషణ జరిగెను.

కైవ——ఆయనకేమి! ఆయన సుఖముగానె యున్నాడు.

బిం——మీ పిల్ల నెమ్మదిగా నున్నదా! అమ్మా!

కైవ——మీ దయవల్ల పిల్ల బాగానే యున్నది తల్లీ!

బిం——అందరు నెమ్మదిగా నుంట ప్రొద్దున్నె ఈ దుఃఖమెందుకమ్మా! అంత యేమిమునిఁగి పోయినది?

కైవ——ము ఏమి లేదమ్మా! చీఁకటితోనె మనఘులోకుగారి యింటికి వెళ్ళినాను. అక్కడనే——ఏమి చెప్పనమ్మా! (అని గద్గదకంఠముతో నేడ్వజొచ్చెను.)

బిం——అక్కడ నేమిజరిగినది? ఎవ్వరయిన దిట్టిరా కొట్టిరా?

కైవ——తిట్టుటకుఁ గొట్టుటకు మే మెవరిసొమ్ము తిన్నాము? నాకు గతిలేని మారినవాఁ డైనను మీ దయవల్ల చెమటూడ్చి కష్టపడి నాకింత గంజి తెచ్చి పోయ గలఁడు. మే మెంత లేనివాళ్ళమైనను కొంచెము పతివ్రతాధర్మములకోసము తపించి పడుచుందుము. కనుక నెవరిచేత మాటలు పడము.

బిం—(మగఁడు తెలివిమాలినవాఁడని శైవరత్నస్త్రీ చెప్పినందుకు చిఱునవ్వునవ్వి) అయితే నీకీ యేడుపెందుకమ్మా! పోనీ నిన్ను మగఁడు తిన్నఁగా జూచుటలేదా యేమిటి?

శైవ—అదియున్నదా! నన్ను తిట్టడమే! నన్ను తిడితే అడిగికొంప నూడ్చేవా రెవరు? పొయిలో అగ్గివేసేవారెవరు, కంచములోకి కుంభం రాయడూ! నే లేకపోతే ఆ పీపాటి పిల్లకాట్ల యుండడనో! అడు నన్ను తిట్టి ప్రాణాలతో బతికిపోడువే! రోకలుచ్చుకొని దుమ్ము రేగగ మొడవనూ!

బిం—(మూల చిఱునవ్వు నవ్వి కొంచెము కటువుగా) అయితే నీ బుడిబుడి దుఃఖమునకుఁ గారణ మేమిటమ్మా! ప్రొద్దున్నే యేడువవలసినంత ప్రుట్టేమి మునిగినది?

శైవ—ఏమీ లేదమ్మా! యేమి లేదు. ఆ గోనుగారియింటికాడికి ప్రొద్దున్నే యెళ్లినప్పుడు—అయ్యో! నా కర్మమా యేం జెప్పనుతల్లీ!

బిం—(విసుగుతో) నీయిష్టము వచ్చినంత సేపేడు. సంగతిచెప్ప విదేమిపాపము! అవతల గంపంత పనియున్నది. నేను నీతో నిలిచియుండుటకు పీలులేదు. ఇత్తడి సామానులు కడిగేందుకు తోమలేదు. పాలు దాలిమీఁద పెట్టలేదు. పిల్లలులేవగానే పాలు పాలని పోరుపెట్టుదురు. మాఁటసోదె మొంతకు తెమల్చవైతివి.

అంతలో సుధ మేలుకాంచి యప్పుడప్పుడే వికసించిన తామరపువ్వు చందమున విలాసమును వెదజల్లు మొగముతో నచ్చటికిఁ బోయి తన యక్క ప్రక్క నిలిచెను.

బిం—(సుధతో) అమ్మాయి! ఇంత పెందలకడ లేచినావేమమ్మా! ఇదిగో మన శెట్టెయ్య నీకోసము గట్టిపెరుఁగు ముంతలోఁ దోడుపెట్టి తెచ్చినది. అది కన్నములోఁ బోసికొందువుగాని, నేను వెళ్ళి పాయిరాజవేసికొందును. పిల్లలు లేచువేళ గనుకది.

ఆ పలుకులు విని సుధ యా పెరుఁగుముంత లోనికిం దీసికొనిపోయి యుట్టిమీఁద పెట్టి పరుగుపరుగున దిగుడుబావికిం బోయి తన యప్ప సగము తోమివిడిచిన పాత్రలం గడుగఁబూనెను. ఇక్కడ బింబ సోనారినుని భార్య చెప్పెడు గొడవ తెమలనందున విసికి లోనికిం బోవఁదలచి పెల్లగ మొగ మారవలకుఁ ద్రిప్పుచుండ నంతలో శెట్టియిల్లాలు కన్నులనీరు తుడుచుకొని గొంతు సవరించుకొని "అప్పయ్యగారూ నే నన్నమాట నిజమేనాండీ" యని యడిగెను.

బిం—ఏమి మాట?

కైవ—నేను గోనుగారి యింట్లో విన్న మాటమ్మా

బిం—అక్కడ నేమి విన్నావు?

కైవ—అయితే నే విన్నది నిజమేనమ్మా. ఈ మాట విన్నానికే శామోను దిక్కుమాలినబతుకిన్నాళ్ళు బతికినాను. అయ్యో! అయ్యో! ఎంతపాపమమ్మా! మన సుధముగము జూడకుండ నే నొక్కపూటుండగలనా?

అని మరేమియు బలుకక యా బెస్తయిల్లాలు మహాపదవాటిల్లిన ట్లెలుగెత్తి ఘోరున నేడ్వసాగెను. ఈ రోదనధ్వని నిద్రించుచున్న హేమచంద్రుని గదిలోనికి గొప్ప భూకంపధ్వనివలె వినఁబడినందున నతఁడు కళవళము నందుచు మేలుకాంచి చివాలున లేచి తొట్రుపడుచు గది వెడలివచ్చి బిందుం జూచి "ఆ మనిషి మొగు కట్టు పెద్దపెట్టున నేడ్చుచున్న" దని యడిగెను. "ఏంమనుకులేను. ఆవిడ యెక్కడనో యేదో చెడుమాట విన్నదట. దానికై యేడ్చుచున్న" దని బిందు భర్తకు బ్రత్యుత్తరము చెప్పెను. అది విని హేమచంద్రుఁడు పల్లెయిల్లాలిఁ జూచి "యేమియాపద మూఁడినది? నీకేమి చెడుమాటవిన్నావు? మీవాండ్రందఱలు నెమ్మదిగా నున్నారా?" యని యడిగెను. అనవుడు నాకైవర్తకాంత దుఃఖమునాపి కన్నీరుఁ దుడుచుకొని మగవారిముంగట వట్టి తలతో నిలువగూడదు గావున చీరచెంగుఁ నేమమునుగు వైచికొని నియమమునఁ దల యించుక వంచి దండముపెట్టి మెల్లగఁ "బాబయ్యగారూ! అంతా కుశాలంగా నున్నా మండి. ఇబ్బంది యేమి లేదండి. ఏదో పాడుమాటొకటి వినబడినదండి. అదినిజమేమో కనుగొందామని, అప్పయ్యగారికాడికి వచ్చినానండి" యని బదులు చెప్పెను. అదివిని బిందు భర్తతో "ఆ పాడుమాట యేమిటో చెప్పమని నేనింతసేపటినుండి పీకొని తిను చున్నను, అవిడనోటనుండి యామాట చెప్పించుటకు నా తాతతరమైనది కాదు. మీరు చెప్పింపఁగలరేమో చూడండి" యని పలికెను.

అనవుడు హేమచంద్రుఁడు నవ్వుచు "ఆఁడవాండ్రసోదెల నాఁడవాండ్రకేగాని మాకు దెలియవు. మీసోదెలు మగవాండ్ర కర్థములేకావు. రాత్రి మన మనుకొన్న సంగతుల గూర్చి మాటలాడుటకు నేనిప్పుడు శివప్పగారి యింటికి పోవుచున్నా" నని యక్కడ నిలువక మెల్లఁగ నావలకుఁ బోయెను. అనంతరము బిందు కైవర్తి తెలుఁగున మాటలాడిరి.

కైవ—అదిగో! అదిగో! నేను విన్నమాటనిజమే; బాబయ్యగారక్కడికే పోవుచున్నారు.

బిం—(కోపముతో) నీకీవేళ దయ్యము పట్టినదా యేమి? ఎన్నఁడులేనిది యీలాగున మాటాడ నారంభించినావేమి? నీవేమిమాట విన్నావో చెప్పరాదా?

కైవ—అప్పయ్యగరూ! ఈయాల పొద్దున్నే గోనుగారి యింటికాడికెళ్ళి అక్కడె యిన్నానండి.

బిం—అబ్బబ్బా! చంపుచున్నావుగదా! ఏమి విన్నావు. అడుగలేక నోరుపడుచున్నది.

కైవ—చెపుతా నప్పయ్యగారూ! కోపపడకండి. బుద్ధి నేరనివాళ్ళము. గోనుగారి యింట్లో నౌకరు—ఆడి జిమ్మడ! ఆడి మొకంమండా! ఆడికేం పొయ్యేకాలమో కాని అదు చెప్పినాఁడు. అమా టినఁగానే నావొళ్ళొణుకెత్తింది. నాగుండిప్పటికి దడద కొడుతోంది. చూడం డప్పయ్యగారు. అద్ధమేమో చూడండి.

బిం—అమ్మో! నీ గుండె దడదడలు చూచుటకు నాకు వ్యవధిలేదు. నేను వంట జేసికొనవలెను. (అని లోనికిఁ బోవుటకుఁ గిరుక్కున మరలెను.)

కైవ—(బిందుచీరకొంగు బట్టికొని) వద్దప్పయ్యగారు కోపమువద్దు. ఏమో మన నుండబట్టక మీమీ దాపేక్షమూలాన్ని, ఆ మాట నిజమేమో కనుక్కొందు కొచ్చినాను. మఱొకరైను నాకు కావాలా అప్పయ్యగారు. చిన్నమ్మాయిగారి నొక్కపూట సూడకపోతే కడుపులో యెల్లాగో నుంటది.

ఆ మాటలు వినక బిందు తన దారిం బోవుచుండెను.

కైవ—(చీరకొంగు వదలకయె కూడబోవుచు) అప్పయ్యగారు వినండి. వినండి. గోనుగారి నౌకరు—అణ్ణి మోసుకుపోను. అణ్ణోట్లో నిప్పులొయ్య, అఁడి కొడుకునోట్లో నిప్పులొయ్య, అఁడి కోడలునోట్లో నిప్పులొయ్య, అఁడిల్లు దిబ్బగాను అఁడు చెప్పినాఁడమ్మా!

బిం—వినిపించుకొనకయె వంటసాలకు జనియెను.

కైవ—నే పుట్టించినమాట కాదమ్మా యిది! ఈలాటిపాడుమాటలు అఁడు చెప్పాలి కాని మఱెవరు చెప్పగలరు? మీరు సంచోరు. మీ రాలాంటి పనులు చెయ్యరనుకొని నేను నమ్మలేదు.

బెస్తయిల్లాలు తనవెంట నంటి రా బిందు వంటయింటిలోనికిం జనియెను.

కైవ—అప్పయ్యాగారూ ! ఆమాయచచ్చినోఁడు ఈలాగన్నాడండి. మీరంట మమ్మందఱిని యిక్కడ దిగబెట్టి కలకత్తా కాఁపురమెళ్తారంట ; అమ్మాయిగారూ ! ఈ చేతులతో పెంచినానుకందా మిమ్మల్ని. కంటిసూపు నోటిమాట లేకుండా యెల్లి పోతా రామ్మా ? చిన్నమ్మాయిగారికి నా పేరుగన్నా నేనన్నా పాణంగందా ! ఇఁక నే నెందుకు నా పేరుఁగెందుకు ?

బిం.—(ఆమె ప్రాణము విసిగించినందు కించుక కోపించినను మూర్ఖతకు చిఱునవ్వు నవ్వి) ఈ మాట చెప్పుటకేనా అప్పా ! ఇంతసేపు యెముకలు కొఱికినావు. ఈ మాత్రపు దాని కింత యేడుపెందుకు ? వెళ్ళుటో మానుటో యిప్పటికి మాలో మాకే తేలలేదు. నిన్నరాత్రి శరచ్చంద్రుఁడు వచ్చి కలకత్తా రమ్మని పిలిచినాడు. వెళ్ళుటంటే మాటలా ? అక్కడ ఖర్చునకు సంసారము గుల్లయగును. మేము భాగ్యవంతులము కాము కదా!

కైవ—"అక్కయ్యా! ఛా ? మంచివాళ్ళు మరేద గలోరు కలకత్తా యెల్తారా ? అక్కడవర్ణం, ఈవర్ణం, అని తేడా లుండవంట. మంచిచెడ్డ లేవంట. మాలమాదిగ తురక దూదేకులు బ్యామఁడు అంతా సంకరమంట గాదు! అమ్మా! మీఁదిబంగారమంటిల్లు. చల్లగ యిక్కడే వుండు తల్లీ. ఆ గోనుబాబయ్యగా రెక్కడికైన యెల్తారు. ఆయనకేమమ్మా? పెళ్ళమా బిడ్డా ? ఆయన తెల్లోళ్ళ యినుకోలులో సదువుతున్నాఁడంట. ఆ సదు వవ గానే సీమ కెల్తాడంట. అయ్యా దేవుఁడా ! అలా గెళ్ళినోరు తమరు సల్లగుంటారు. ఉన్న సుట్టాలగొంతులమీఁదికి తెస్తారు. అమ్మా ! సీమయెక్కడుంది? గంగదాటెల్లాలా, లంక దాటెల్లాలా ?

బిం—సీమ వెళ్ళవలసినవారు చాలసముద్రములు దాఁటవలెను. గంగదాటి లంక దాటి యింక బయటికి వెళ్ళవలెను.

కైవ—ఓలమ్మా ! గఁగమ్మతల్లి కొట్టాం దాటి బతకడమే ! లంకదాటెల్లిన మనిషి మళ్ళి బతిగొస్తాఁడా ! ఒచ్చినా, ఆళ్ళ రాచ్చసులై యొస్తారంట. ఒచ్చినోళ్ళు మణుసుల్ని బతిగుండగానే పీక్కు తింటారంటగాదూ. అవు నవును. గోనుబాబయ్య సీమెళ్ళ కేంజేస్తాఁడు. ఆయనకు పెళ్ళమా బిడ్డా నాతల్లి. ఈకొంపకి నీవు మాలచ్చిమిలా గున్నావు. ఈయగా నోదిలిపెట్టి యెల్లకమ్మా, కొంపకనిపెట్టుకుండు.

బిం—అనక మళ్ళీగమ్ము. తరువాత మాటలాడ వచ్చును.

కైవ—అల్లాగే మమ్మా! నూడుండి అమ్మాయిగారు బోకేశిన తరువాత పెరుఁగెల్లాగుందో సెప్పండి.

బిం—అలాగే.

కైవ—(కొంతదూరము పోయి మరల వెనుకకుఁ దిరిగి వచ్చి) అప్పయ్యగారూ! ఈ యింటికి మాలక్షింవి. కూంత నామాట గేపకముంచుకొని యిల్లొదిలిపెట్టి ఎల్లకమ్మా!

బిం—అది మన మాలోచించుకొనవచ్చునులే. మేము వెళ్ళుటనుగూర్చి యింకా నిశ్చయము కాలేదు. వెళ్ళినను గొన్ని నెలలేకాని యెల్లకాల మక్కడ నుండము. కొంతల నాటికి తిరిగి వత్తుము. ఈయిల్లు విడిచి మేముమాత్ర మెక్కడికి పోగలము.

అట్లు బిందు తమ కలకత్తాప్రయాణము నిశ్చయములేదని నాలుగైదుసారులు ధ్రువముగాఁ జెప్పినపిదప నాపల్లెయిల్లాలు మనశ్శాంతి గలిగి మెల్లఁగా వరిగారు. ఆదినముననే హారిమతి యను పేద గొల్లముసలిది వితంతువగు తనకోడలను వెంటఁబెట్టుకొని బిందుంజూడవచ్చెను. ఆ ముసలిదాని కొడుకు బ్రతికియున్నప్పుడు వాండ్రకు గొంతభూమి కొన్ని పశువులు నుండెను. అప్పుడు పాలు పెరుఁగు లమ్ముకొని వాండ్రు సుఖముగాఁ గాలక్షేపము సేయుచువచ్చిరి. హారిమతికుమారుఁడు మృతినొందుటఁజేసి యాఁడువాండ్రిద్దఱు నేలదున్నుకొనలేక యితరుల కమ్మిరి. పాలికాఁపులు వాండ్రకిచ్చుచిస్తు మిక్కిలి స్వల్పము. ఇల్లు గడవక నొకదాని వెనుకనొకటిగఁ బశువులనన్నిఁటిని వాండ్రమ్ముకొనిరి. చివర కొకటి రెండావులు మిగిలెను. అందుచేత నత్తకోడండ్రిద్దఱు బిందు గృహమునకువచ్చి బిడ్డల జబ్బుచేతగాని మఱియే కారణముచేతగాని యామె పనిఁజేసికొన లేనప్పుడు పనియంతయుం జేసిపోవుచుందురు. బిందు వాండ్ర పేదతనము తీరునంత సాయము చేయలేకపోయినను బంటలసమయమున వాండ్రను మఱచిపోక చేతనైన సాయముఁ జేయుచు వచ్చెను. ప్రాఁతఁబట్ట లేవైన నున్నయెడల బిందు చలికాలము ముసలిదియు, నామె కోడలు గప్పుకొనుటకు జాగ్రత్త పెట్టుచుండును. అత్తకోడండ్రలో నెవరికి రోగము వచ్చినను బిందు కనికరముపెంపున వారికి సగ్గుబియ్యము, పటికిబెల్లము సామాన్యములైనమందులు పంపుచుండును. సాధారణముగ బీదవాండ్రు మిక్కిలి చిన్న యుపకారములకుసైతము కృతజ్ఞులై యుందురు. కావున గొల్లముసలిదియు బిందు తనయెడ నప్పుడప్పుడు చూపుచు వచ్చినదయకు నభిమానమునకుఁ గృతజ్ఞత కలదైయుండి బిందు కలకత్తా బోవుననువార్త నామెయు విని చూడవచ్చి కొంతసే పామె ప్రక్కంగూర్చుండి వెక్కి వెక్కి యేడ్చెను.

బిందు హరిమతి నోదార్చి కోడలికొక క్రొత్తచీరనిచ్చి వారిని పంపివైచెను. హరిమతి చనినవెనుక నాయూరి సాలెవాని భార్యవచ్చెను. ఈమె వికారరూపముగల దగుటచే మగఁడామెను సరిగ నేలకపోయెను. దానికిం దోడగ నామె యెల్లప్పుడు రోగముఁ గలదై బలహీనురాలై పనిపాటలు సరిగఁ జేయలేకపోవుటచే నత్తగా రెప్పుడు దిట్టి పోయుచుండెను. కడచిన శీతకాలములో నడుములో నొప్పి బయలుదేరినందున నామె చెలువునకుఁబోయి నీరు తేజాలదయ్యెను. అందుకుఁ గోపించి యత్తగారామెను గొట్టెను. ఏమియుం దోఁచక యామె యవుడేడ్చుచు బిందుకడకుఁబోవ కృపారసపూరితయగు బిందు మందులు తెప్పించి వేయలేకపోయిన నేదో తైలముఁ దెప్పించి యామె నెండలోఁ గూర్చుండఁబెట్టి యా తైలము నడుమునకుఁ గొన్నిరోజులు మర్దనముజేసెను. ఆ రోగ మా చికిత్సతో నుపశమించెను. సాలెపడంతి యా యుపకారమును మఱువక బిందునెడ జాల విశ్వాసము గలిగియుండి యామె గ్రామమును విడిచిపోవునని వినివచ్చి యేడ్చెను. ఆమె యేడ్చి పోయినపిదప హీర యను నొక బోయజాతి యాఁడుదివచ్చెను. హీర మగడు పల్లకులమోసి కావలసినంత డబ్బు గడించుచుండును. కాని తెగ త్రాగి యా సొమ్మెల్ల పాడుచేసి యింటికిఁబోయి పెండ్లామును బాదుచుండును. ఆ కథవిని బిందు జాలినొంది భర్తతోఁజెప్ప నతఁడుబోయి దాని మగనిం బిలిపించి చీవాట్లు పెట్టెను. అది మొదలు కొని వాఁడు భార్యను మునుపటంతగా బాధపెట్టుట మానెను. అందుచేత హీర బిందు పేరుఁ జెప్పిన మ్రొక్కుచు నామెయెడ గడు కృతజ్ఞత గలదైయుండెను. ఆమెయు బిందు ప్రయాణమునుఁ గూర్చి విని తన పసిబిడ్డ కొక క్రొత్తగుడ్డఁ జుట్టబెట్టి యా బిడ్డ నెత్తికొని బిందువద్ద సెలవుపుచ్చుకొనుటకు వచ్చి మీదయవల్ల యీతూరి నాలుగురూపాయలు వెనకేసుకొని యీయేడిల్లు వేయించుకొన్నాము. కుఱ్ఱదానికి కొత్తరుమాలు కొనుక్కున్నాము. మీ రెల్లకమునువు దీవించండమ్మా! నన్ను బిడ్డని దీవించండని వేడికొనెను. బిందు తల్లిని బిడ్డను దీవించెను.

శేషియను బ్రాహ్మణస్త్రీ, భామయను శటగోపస్త్రీయు, శ్యామయను గోరి స్త్రీయు, మోహమాయ యను చాకలిదియు నింక నిట్టిపేదవాండ్రు చాలమంది బిందు దర్శనముఁజేసి యామె తమ్ము విడిచిపోవునని విచారించిరి. పాపము బిందు వారలనందఱ నోదార్చి పంపివేయవలసి వచ్చెను. ఆ గ్రామములో బిందు కుటుంబముకన్న భాగ్యవంతములైన కుటుంబము లనేకము లున్నవి కాని దురదృష్టవంతులు పేదవాండ్రు నగు నిరుగు పొరుగు వాండ్రమీద నీ భార్యాభర్తల కున్నంత కనికరమా యూరిలో నెవ్వరికిని లేదు

ఇంచుకదయ రవ్వంత యభిమానముఁ గల మనుష్యులయందు భయభక్తులుండుట లోకమందంతటఁ గలదు. హిందూదేశమున నీ విధమైన యనురాగము పతిభక్తియెక్కువగాఁ గనఁబడుచున్నది.

— ♦ —

ఆఱవ ప్రకరణము.

చిన్ననాఁటి నెచ్చెలులు.

సాయంకాలము బింబ పెద్దతల్లిగారియింటికిఁ బోయి యచట సుమతిని, కాళినిఁ గలిసికొని కౌఁగిలించుకొనెను. మున్ను చిన్నబిడ్డలయి యాడుకొన్న యీ ముగ్గురిప్పుడత్తింటి కోడండ్రై వేఱువేఱు గ్రామముల వసించుచున్నను వారి హృదయములనుండి చిన్ననాటి ప్రేమ తొలఁగిపోలేదు. చాల కాలముఁ గడచిన పిదప నొండొరులం గలిసికొన్నందున నా ముగ్గురు నా సాయంకాలము ప్రొద్దుపోవువఱకుఁ జిన్ననాటి ముచ్చటలను, ప్రస్తుతపు గృహకృత్యములను కష్టసుఖములను చెప్పుకొనిరి. కాళి నల్లని మేనుకలదై సార్థక నామధేయురాలై యుండెను. ఆమె మొగము సుందరముగా నుండెను. కాని విచారములు, మనోవ్యథలు, నామె వయస్సు చిన్నదైనను ముఖలావణ్యమును తగ్గించెను. ఆమె కన్నులు కొంచెము గుంటలు పడియుండెను. ఆమె సన్నని చేతుల బంగారు మురుగుల జతియుండెను. పృథువైన యామె కంఠమును శుద్ధసువర్ణమయమైన పట్టెడ యలంకరించెను. అప్పుడామె సాధారణమైన చీరఁ గట్టుకొనెను. ఆమె సహజముగఁ బలుచనిదైన తన తలవెండ్రుకలను వెనుక ముడిగా జుట్టుకొనెను. కాళి గడుసుదనము విశేషముగా నెఱుఁగని సాధుస్వభావము కలది. ఆమె ప్రతిదినము గృహకృత్య మంతయు స్వయముగాఁ జేసికొనుచు రెండుసారులు మాత్రమే భుజించుచు దైవవశమున వచ్చుకష్టములను శాంతముతో సహించుచు జనసమ్మతవర్తనముఁ గలిగి కాపురము చేయుచుండెను. అంతట నా చెలికత్తెలు ముగ్గురకు నీ క్రిందివిధమున సంభాషణము జరిగెను

బిం—కాళీ! ఎంతకాలమైనదే నిన్నుఁ జూచి.

కాళి—బిందక్కయ్యా! ఇంతకంటె తెలుచుగా మనమేలాగున కలిసి కొనఁగలము. పెండ్లికాఁగానే నేను వర్ధమానమువెళ్ళి యత్తవారి యింటనే యుంటిని. పుట్టింటి కెప్పుడోగాని నన్ను రానీయరు.

ఉమ—ఎందుచేతనే? నేను ప్రతిసంవత్సరము దుర్గాపూజనాటికి పుట్టింటికి వచ్చుచునేయున్నాను.

కాళి—ఉమా! నీసంగతివేఱు. నీకు మాకుసామ్యమా. ధనపురములో నీకు గావలసినంతమంది నౌకరులున్నారు. ఇంటిపని నీవేమీ చేయనక్కఱలేదు. సవారీలోఁ గూర్చుండి హాయిగ వచ్చెదవు నీకేమమ్మా! నీలాగు మాకెలాగున సాఁగఁ గలదమ్మా! మాది పెద్దకుటుంబము. మావాళ్ళు, మఱఁదులుఁ గలిసియున్నారు. తెల్లవాఱితే బోలెడు చాకిరీ. నేను లేకపోతే పని యేలాగున జరుగును. ఇప్పుడు నేను వచ్చువఱకు పనిచేసి పెట్టుమని మా యాఁడబిడ్డను బతిమాలుకొన్నాను. ఏలాగుననో దయఁదలఁచి యావిడ యొప్పుకొన్నది. కొద్దిరోజులు గనుక నామె చేసిపెట్టును కాని చాలకాలమైన నామె యంగీకరించునా?

బిం—కాళీ! మీకగ్రహారములు భూములు నున్నవని విన్నాను. వాటిమీఁది మంచి రాఁబడియున్నదఁట కాదూ. మీయాయన కెన్నోగుఱ్ఱపు బండ్లున్నవఁట. అన్ని బళ్ళుపెట్టినయాయన యింటిలో నౌకరుల నెందుకు పెట్టఁగూడదు?

కాళి—బిందక్కయ్యా! నౌకరులనుబెట్టి పనిచేయించుట మొదటినుండి యాచారములేదు. మాయత్తగారు చాలనిష్ఠకలవారు. వంటలక్కలు వండినవంటలుతినరు. నౌకరు లేవస్తువు ముట్టుకొనుటకు వల్లకాదు. నౌకరులు చాలమందియున్నారు. వాళ్ళు కచేరీచావడిలోను, మావారిదగ్గఱ పనిచేయుచుందురు. ఇంటిలోపలి పనియంతయు మాయింటి కోడండ్రే యుదయము మొదలు సాయంకాలమువఱకుఁ జేసికొనుచుందురు. అదిగాక మీరనుకొన్నంత రాఁబడికూడ మాకులేదు. కర్చుబోలెడు. అప్పులుగూడ నగుచున్నవఁట. ఏమో లోపలపడియుండి యివి యెప్పుడయినను వినుటయేగాని మేమేమెఱుంగుదుము.

బిం—మీయాయన దొరలకు పెద్దపెద్ద విందులుచేసి చేసినప్పుడెల్ల మిక్కిలి డబ్బు కర్చుచేయునఁట కాదూ. అప్పులగుచున్న మొదట కర్చులు తగ్గించుకోరాదూ. నీ వామాత్రము సలహా మీవారికిఁ జెప్పలేవంటే.

కాళి—ఈలాటి వ్యవహారములలో నే నేమిటి, యాలోచన చెప్పుట యేమిటి. ఆయన కుటుంబయజమాని. నేనో, యొదిగియొదిగి యుండవలసిన కోడలను. అటువంటి సంగతులగురించి యాయనతో నోరెత్తి మాటలాడఁగలనా? మేనత్తలు చాల సారులు కూకలవేయుగా విన్నాను. వాళ్ళమాట లక్ష్యమా ఆయనకు?

ఓం—అయితే మీవా రేమంటారు?

కాళి—అనుట కేమున్నది? కుటుంబము చాలగొప్పది. పేరుప్రతిష్ఠలు కలది. మనము వెనుకటి యన్నదానములు, నిష్ఠలు జరుపుటయే గాక గౌరవము నిలబెట్టికొనఁదలచుకొన్న, వైభవముతో విందులు మొదలగునవి చేయుచుండవలెనని యాయన చెప్పుచుందురు. ఎందుకయ్యా! నీ వెఱుఁగుదువో లేదో కాని, దొరల కాయనంటే ఎంతో యిష్టము. దొరలు ప్రతి కమిటీలోను యాయనను వేయుదురు. ఆయన లేని కమిటీ యే యుండలేదట. ఆయన ప్రతిదినము నుదయమున సాయంకాలమున వారినిఁ జూడఁబోవుచుండును. అన్ని విషయములలో వారేలాగునఁ జెప్పిన నాలాగునఁ జేయుచుందురు. అందుచేత దొరలు మావారిని బూర్వకాలపు పెద్దమనుష్యులని మెచ్చికొనుచుందురు.

ఓం—మీవా రస్తమానము దొరలనే చూచుచుందురంటివి కదా. వారియింటి వ్యవహారము చూచువా రెవరు?

కాళి—మామవారు లేకేమి. మాయత్తగారు లేరూ? ఆవిడ డబ్బదియేండ్లదైన నిప్పటికి నడుము వంగలేదు. తాటిచెట్టులాగున నిప్పటికి నిటారుగా నున్నది. ఇంటి వ్యవహారములు చక్కబెట్టుటలో నామెకున్న యోపిక, యీ పడుచువారిలో నెవ్వరికిని లేదు. ఆవిడదే పెత్తనము. ఆవిడ మాటేమాట. అంతయధికార మావిడదే. మావారిమేనత్తలు ధైర్యముగలవారే కాని మాయత్తగారి మాటంటే గడగడ లాడుదురు. ఇఁక కోదండరామము మామాట చెప్పనేల? ఆమెను మేము పూజింతుము. ఆమె పెత్తనముచేత నింటివ్యవహార మంతయు గడియారము లాగున సరిగా జరుగుచుండును. గడియ రాత్రి యుండఁగానే లేచి యావిడ శీతాకాలమైననుసరే వర్షకాలమైననుసరే చన్నీటస్నానము చేసినట్టు చీరఁగట్టికొని జపము తపము పూజయు రెండుగంటలసేపు చేసికొనును. ఆమె లేచిన వెనుక మేము నౌకరులు లేచి యెవరిపని వారు చేసుకొనుచుందుము. ప్రొద్దు పొడుచునప్పటికి నీళ్ళు తోడువాండ్రు, వాకిలి యూడ్చువాండ్రు, పొయిలో నిప్పువేయువాండ్రు

గజగజలాడుచు బనులు చేయుచుందురు. ఆవిడ జపము చాలించి పిల్లలకుఁ జద్దియన్నములఁ బెట్టించి నౌకరుల కన్నములఁ బెట్టించి వంటలు చేయించి మగవాళ్ళ భోజనమైనతరువాతఁ గోడండ్ర నన్నములు తినుడని చిట్టచివర నామె భోజనముచేసి మధ్యాహ్నము కొంచెము సేపు పరుండును. మధ్యాహ్నము నిద్దురలేచి మరల సాయంకాలపుఁ బనిఁ జేయించి యందఱు దిని పండుకొనువఱకు నెంతరాత్రియైన నామె నిద్దురపోదు. ఇంటిలో నేది యెవరికిఁ గావలసిన నది యామె నడుగవలసినదే. మావారు తల్లి యెంత చెప్పిన నంత. ఆవిడ గీచినగీటు దాటరు. ఇంటిలో నొక సంతర్పణ రానీ సమారాధన రానీ, పెండ్లి కానీ మంచి కానీ చెడ్డ కానీ యేదైన నావిడ చేతులమీదుగా జరగవలసినదే.

బిం — డెబ్బదియేండ్లు దాఁటినయావిడ యింతపనిఁ జేసినదంటే చిత్రముగానే యున్నది. ఆవి డెవరో యసాధ్యురాలు లాగున్నది.

కాళి — బిం దక్కయ్యా ! నీవు వేళాకోళము చేయుచున్నావు కాని యాలాటి యావిడ మనదేశమున నెక్కడను లేదు. ఆవిడ పూర్వకాలపు మనిషి. పూర్వపువాళ్ళు పాళ్ళు పంపుళ్ళు లేకుండ నొకయింటనే కలిసియున్నపు డీలాటి పెద్దవాండ్ర చేతిమీఁదుగా సంసారములు జరుగుచుండునవి. ఇప్పటివాండ్రు నాలుగురూపాయలు తెచ్చుకొనుటకు శక్తిరాగానే తమ పెండ్లాములఁ దాము వేఱింటికాపురములు పెట్టి కుటుంబములోనుండి విడిపోవుచున్నారు. దేశములో విభాగములు కాని కుటుంబములు నూట నాటి నొకటి రెండెక్కడనో మా కుటుంబములవంటివే యున్నవి. కాని తఱుచుగా లేవు.

ఉమ — అయితే మీవారి మేనయత్త లీవిడ యధికారమునకు లోబడి యున్నారా ?

కాళి — ఉన్నారుమరి. ఒక తల పెత్తనము లేకపోతే సంసార మేలాగున జరుగును ? పెద్ద మేనత్త మంచిది. ఏ గొడవలజోలికి రాదు. తక్కిన యిద్దరు ఒక్కొక్కప్పుడు ధుమధుమ లాడినను మా యత్త మాటప్రకారము నడిచి తీరవలయును. మూడవ యావిడ కొంచెము కోపధారి. అత్తగారికంటె నావిడకే మేమందఱ మెక్కువ జడియుదుము.

ఉమ యామాటకు త్తరము చెప్పక కాళి యత్తవారింట వంటయింటిలో దానుండిన పక్షమునఁ బనిచేత, జనసమ్మర్దముచేత నూపిరి సలుపక తాను బాధ పడవలసి యుండునని మనస్సులో ననుకొనెను. ఉమ హిందూసుందరి యయ్యు వేఱింటి కాఁపురమున కలవడిన నగుటచేతను, బట్టణములలో నివసించువారి మనంబులో నుండునట్టి నవ

నాగరకపద్ధతు లామె మనస్సులోఁగూడ దృఢముగ నాటియుండుటచేతను ముప్పది నలువదిమంది యొకయింటనేఁ గలిసియున్నారనియు, నొక ముసలమ్మ పెత్తనము క్రింద సంసారమంతయు జరుగుచున్నదనియు వినఁగానే కాళి కుటుంబస్థితి బాగుండలేదని యామె జాలినొందెను. కాని యుమ పూర్వాచారము లిష్టములైన స్త్రీ లాలోచించినట్లు తాను గూడ నీ విషయ మాలోచించినయెడలఁ గుటుంబము లవిభక్తములుగా నుండుటవల్ల శరీరదార్ఢ్యము విద్య గలిగి ధనసంపాదనముఁజేయు నదృష్టవంతుఁడు తన కుటుంబములో నున్న యప్రయోజకులను, దుర్బలులను సత్రములపాలు జేయక వీథుల పాలుసేయక పోషించుటకు వీలుండునని యామెకుఁ దప్పక తోఁచియుండును. అటు లామె తలపోయుచుండ నంద యొక్కనిమేష మూరకుండి పిమ్మట నీ విధమున సంభాషించిరి.

కాళి—ఉమా! మీ వారు కలకత్తా వెళ్ళినారఁటే?

ఉమ—ఆ! వెళ్ళినారు. పదిపన్నెండు మాసములనుండి యచ్చటనే యున్నారు. ఈమధ్య నన్నుగూడ దీసికొనిపోవఁ దలఁచుకొన్నట్లు తల్లికి వర్తమానము పంపించినారు.

కాళి—ఔను. మా తమ్ముఁడు శరచ్చంద్రుఁడు చెప్పినాడు. మీ యాయన కలకత్తాలో దివ్యభవన మొకటి యద్దెకుఁ బుచ్చుకొన్నారని ఎంతో సొమ్ము ఖర్చుపెట్టి చిత్రవస్తువులతో నింపినారని విన్నాను. ఒక జత నల్లగుఱ్ఱములను మఱియొకజత గోధుమ రంగు గుఱ్ఱములను గొన్నారట. మీ వా రెక్కుడు గుఱ్ఱపుబండ్లవంటివి సాధారణముగా రాజులకైన లేవని మావాఁడు చెప్పినాడు. అంతేగాక యాయనగారు కలకత్తాలోనున్న పేటలలో నెక్కడో యొకచోట బూఁదోటయున్న మేడ యొకటికొని పూలమొక్కలు వేయించి, పొదరిండ్లు కట్టించి మేడయడుగున స్ఫటికపురాయి పరపించి దానిని దేవేంద్ర సభ జేయదలఁచుకొన్నారఁట. ఆహాహా! ఏమే యుమా నీ యదృష్టము!

ఉమ—(చిఱునవ్వు నవ్వి పిదప మొగమున విచారములోప) కాళీ! నల్ల గుఱ్ఱముల జతలు, గోధుమ గుఱ్ఱముల జతలు, పూలతోటలు, స్ఫటికపురాళ్ళు, తాపడము చేసిన మేడలు మొదలగునవే యాఁడుదానికి సౌఖ్యము లేఁజాలినపక్షమున మీయుమయు నదృష్టవంతురాలే. కాని బ్రహ్మదేవుఁడు నుదుట నేమి వ్రాసినాడో యెవ్వరెఱుఁగుదురు. (అని యామె నిట్టూర్పు విడిచెను.)

బిం—(దానినిఁ జూచి) ఉమా? ఏమి వ్రాసినాఁడో యననేల? అదృష్టమే వ్రాసినాఁడనుకొనరాదా?

ఉమ__బిందక్కయ్యా ! జ్ఞాపకమున్నదా ? మన చిన్నతనములో నదృష్టములు చెప్పు బైరాగి వచ్చినాడు. నీకు జ్ఞాపక మున్నదో లేదో వాఁడు మనచేతులు చూచి మన యదృష్టములు చెప్పినాడు.

బిం__నాకు జ్ఞాపకము లేదే.

ఉమ__కాళీ ! నీకైన జ్ఞాపకము లేదఁటే.

కాళి__నాకసలే జ్ఞాపకము లేదు.

ఉమ__వాఁడు చెప్పినమాటలు నామనస్సుమీఁద నచ్చు గ్రుద్దినట్లు నాటినవి. అందుచేతనే నాకెక్కువ జ్ఞాపకమున్నది. పఁద్రెండేఁడ్ల క్రిఁదట మన మీ సెలలోనె యీచుట్టుప్రక్కలనే యాఁడుకొనుచుండఁగా నప్పుడే సాయంకాలమయినది. కొంచెము గ్రుడ్డివెన్నెల వచ్చినది. అప్పుడొక బైరాగి పెద్ద జడలు తాను వచ్చి మనదగ్గఱ నిలుచుండెను. అప్పుడు భయముచే గడగడ వడకితిమి. అప్పుడతఁడు "భయమూలేదమ్మా ! డబ్బులు తెచ్చికొనుడు. మీ యదృష్టములు చెప్పెద" నని కూర్చుండెను. కాళి యొక డబ్బిచ్చి తనచేయి చూపించి కొన్నది. మన కాళి గొప్పనిష్ఠప్రతిష్ఠగల కుటుంబములోనికి వెళ్ళునని యాతఁడు చెప్పెను.

బిం__ఆమహానుభావుఁడు నన్ను గురించి యేమి చెప్పినాఁడే !

ఉమ__ఇదిగోఁ జెప్పుచుండఁగానే__మీ యమ్మప్పుడు చెఱువునకు వెళ్ళినది. చెఱువునకు వెళ్ళకపోయినను మాపిన్ని దగ్గఱ, పాపము డబ్బొకప్పుడున్నదాయేమి ? డబ్బుతేలేక యూరకే నీవు చేయిచూపించి కొంటివి. అప్పుడు నీచేయి చూచి వాఁడిట్లు పల్కెను. 'నా చిట్టితల్లీ ! నీవు భాగ్యము, ప్రతిష్ఠగల కొంపలోఁ బడవు. పేదవాని చెట్టఁబట్టి వానిలోఁ గలిసి యింత కలోగంజో త్రాగుచుందువు.

బిం__ఏమీ ! బాగుగానే యున్నదే. అతఁడు చెప్పినమాట నా కిష్టముగానే యున్నది. అయితే నిన్నుగురించి యేమి చెప్పినాఁడు.

ఉమ__చెప్పుచున్నాను. విను. ఆవేళ మాయమ్మ నాకిచ్చిన నాలుగు డబ్బులు నేను వానిచేతిలోఁ బెట్టితిని. ఆడబ్బులు పుచ్చుకొని వాఁడు నామొగము కేసి చేతికేసి యెగాదిగా చాలాసేపు చూచి నన్నుదగ్గఱగాఁ బిలిచి చెవిలో నిట్లు గుసగుసలాడెను. "అమ్మా ! నీవు భాగ్యవంతుని జెట్టఁబట్టెదవు కాని భాగ్యమే సుఖము తేఁగలిగిన పక్షమున నీవుసుఖపడుదువు. గ్రహస్థితి మాత్రము సరిగ లే" దని పలికి వాఁడు తన దారిం

బోయెను. ఆమాటలు విని భయముచే నిశ్చేష్టురాలనయి యక్కడనే పాతుకు పోయినట్లు నేను నిలిచి యుంటిని. (ఈవృత్తాంత మెఱింగించునపుడు శరీరము వడఁకెను.)

బిం—(తొందరతో) ఏమే యుమా! ఆలాగున వడఁకుచున్నావేమే? ఎన్నఁడో పన్నెండేండ్లక్రిందట నెవఁడో బైరాగివాఁడు వచ్చి ప్రేలిన యవక తవక మాటలు తలచికొని నిజమని నమ్మి నీగ్రహచారము బాగు లేదనుకొనుచున్నావా? ఎంతవెఱ్ఱిదానవే! కష్టములు దుఃఖములు వచ్చునని భయపడెద వేమి? అంతభాగ్యము నంతవైభవముఁ గల దానవు నీవే యిట్లనుకొంటే యింక మే మేమను కొనవలయును.

ఉమ—(కన్నీరు తుడుచుకొని, ధైర్యము దెచ్చుకొని గుంభనముతో) నాకే లోటునులేదు. ఆదేశదిమ్మరి బైరాగివాడు చెప్పినది నేను మాత్రము నమ్మినాననుకొన్నావా? అదేమోకాని కలకత్తా ప్రయాణముమాట తలఁచికొన్నప్పు డెల్ల నాకేదో కడుపులో బెంగగానుండును. కాని బిందక్కయ్యా! మీరు గూడ కలకత్తావారై యున్నారు కదా. మనకాళి వర్ధమానములో నుండును గదా? అది కలకత్తాకు మూఁడు నాలుగుగంటల ప్రయాణము. మనము ముగ్గురము చిన్నతనములో నప్పచెల్లెండ్రవలెఁ బెరిగినాము. యావజ్జీవము మనమాలాగుననే యుండుదము. మనలో నెవరికైనఁ గర్మము చాలక యేదురదృష్ట మయిన సంభవించినను మనలో మన కనురాగము పోకుండనుండిన నదేచాలును.

అని పలుకునప్పు డుమకంఠధ్వనిలో యంతర్గతము లైన దుఃఖములు, నవ్యక్తము లయిన మనస్తాపములు కాళికి, బిందుకుఁ బొడకట్టును. కాళిబిందులు కారణము చెప్పుమని యామెను బలవంత పెట్టక తమ చీఁకొంగులతో నామె కన్నీరు దుడిచి తమ యనురాగ మెన్నఁటికి మందగింపదని ధ్రువముగఁ బలికి యామెకు ధైర్యముఁ గొల్పిరి. ఒక యూరనే పుట్టి పెరిగిన చెలిమికత్తెలైనందున నాముఁవ్వురు చీఁకటి పడగానే యెవరి గృహములకు వారు పోవఁదలఁచి లేచినప్పుడు మువ్వురిహృదయములు చివరి యేకాలమున నెవ్వరి కే కష్టములు మూఁడునోగదా యని భయపూరితము లయ్యెను.

ఏడవ ప్రకరణము.

మాతాపుత్రులు.

కలకత్తానుండి బొంబాయికిఁ బోవునట్టి సాయంకాలపు మెయిలు బండి మఱునాఁడు మధ్యాహ్నమున మొగలుసరాయిమకాము జేరెను. కాశి వెళ్ళఁదలఁచిన బాటసారులా బండిని విడిచి గుంపులు గుంపులుగా నక్కడనుండి కాశికిఁ బోవు వేఱొకబండి నెక్కుటకు మూటలు చేతఁ బట్టికొని బయలుదేఱిరి. ఆరెండవబండి వారిని గంగాతీరము వఱకుఁ దీసికొని పోయెను. ఈకథా కాలము నాఁటికి గంగమీఁద వంతెన కట్టఁబడి యుండలేదు. కావున బాటసారులు చిన్న పొగయోడ నెక్కియో నావల నెక్కియో గంగానదిని దాఁటి యద్దరినున్న కాశి చేరవలసి వచ్చెను. వచ్చిన తీర్థవాసులు నానావర్ణములవారు కదా. ఇట్లు నానాజాతులు సమావేశమగుట హిందూదేశమందే గన్పడును. ఆజానుబాహులు, దృఢశరీరులు నగుబిహార దేశస్థులొకచేత బాణాకఱ్ఱయు, రెండవచేత మూటయుఁ బట్టుకొని కాశిలో దిగిరి. ఈజనులు పాటుపడుటకుఁ గష్టములోర్చుటకు నలవడినవారు. ఒకపూట నన్నము లేనంత మాత్రమున శోషిల్లరు. సాధారణముగా నేయటుకులోఁ దిని కడుపు నిండించికొని పయనములు సలుపఁగలరు. హిందూదేశమునందు నానాభాగములందుఁ దిరిగి వర్తకము సేయుటకుఁ బ్రసిద్ధి కెక్కిన మార్వాడీ వర్తకులు రాజపుత్రస్థానమునుండి బయలుదేఱి, భాగ్యవంతులగు తీర్థవాసుల కమ్ముజూపుటకు సీమమల్లుతానులు, జపానుపట్టుగుడ్డలు, బొంబాయిబట్టలు, చెన్నపట్టణపు చారలగుడ్డలు పూలయద్దకపు గుడ్డలు పెద్ద పెద్ద పెట్టెలతో వారణాసిలో దిగిరి. పొట్టియాకృతులు, గట్టిశరీరములుం గల చోటానాగపూరుజనులు పుణ్యక్షేత్రములకెల్లఁ బుణ్యక్షేత్రమయిన కాశికానగరము వచ్చిరి. బంగాళాదేశమునందలి పల్లియలనుండియు బట్టణములనుండియుఁ బయలుదేఱిన యాఁడువాండ్రు తమ యాజన్మమనోరథమైన కాశికాపుర గోపుర దేవాలయ సందర్శనము నిమిత్తము తహతహ పడుచు, భాగీరథీ పుణ్యజలంబుల బలుమాఱు తనివోవక చూచుచు, బెదరి యిటునటు గనుఁగొనుచు జనుల గుంపులనడుమనుండి యొక్క శ్రేణిగాఁ బోవఁజొచ్చిరి.

శరచ్చంద్రుఁడు గంగయొడ్డున దిగి యప్పటికి సాయంకాల మయినందున నుదయమునుండి నిరాహారిణియైయున్న తన తల్లినిఁ జిన్నా యంగడియొద్దకుఁ దీసికొనిపోయి

ఫలాహారము చేయించెను. శరచ్చంద్రుఁడు తల్లిని, తల్లికి సాయముగా నుండుటకు నొక పనికత్తెను వెంటబెట్టుకొని కాశికిఁ బయనమై, వర్ధమానపురమందు బొగబండి నెక్కి, నడుమ మొగలుసరాయ వద్ద దిగి వేఱొక పొగబండినెక్కి గంగయొడ్డున జేరెను. పూర్వాచార ప్రియులగు హిందువులు పొగబండి ప్రయాణములో నే పదార్థమునైన భుజించుట యనాచారము కావున, శరచ్చంద్రుని తల్లి పయనముచేసిన యెనిమిదిజాములు గూడ నుపవసించెను. ఫలహార మైనపిదప నతఁడద్దెనిమిత్త మేర్పడిన యొక చిన్నయింటికిఁ దల్లిని దీసికొనిపోయి సామాను లోకగదిలోఁ బెట్టించి భోజనము చేయించి పండుకొనుటకుఁ బ్రక్క వేయించెను. తీర్థవాసు లనేకు లాపూటనే రేవుఁదాటి యద్దరినున్న కాశినిఁ జేరుచున్న నారాత్రి యాకసము మబ్బులోఁ గప్పబడియుండుట చేతను, దఱుచుగా మెఱుపులు కన్పడుట చేతను, శరచ్చంద్రుఁడు మరునాఁ డుదయమున, రేవుదాటవచ్చునని రాత్రి యీవలయొడ్డున గడపెను.

రెండుగడియలరాత్రియుండఁగా లేచి ముసలమ్మ కాలకృత్యంబుల దీర్చికొని స్నానమొనర్చి జపముఁ జేసికొని సిద్ధముగ నుండెను. అంతలోఁ గుమారుఁడు మేలుకాంచి తల్లినిఁ దోడ్కొని రేవుదాఁట నదియొడ్డునకుఁ బోయెను. అప్పుడే సూర్యుఁడుదయశైలము నలంకరించి గంగానదిలోఁ బ్రతిబింబితము లగుచున్న యానగరగోపుర దేవాలయ శిఖరసౌధములమీఁద బంగారుమేలిముసుంగుఁ గప్పెనో యన మెల్ల మెల్లఁ దనకాంతిం బ్రసరింపఁజేసె. గంగ కీద్దరినుండి చూచితిమా కాశీ నగరమువలె నయనానందకరముగా భక్తిజనకముగా గనంబడుపట్టణము ప్రపంచమున మఱొకటి లేదు. దేవాలయములయొక్క శిఖరము లాకాశమండలమును భేదించికొని పోవున ట్లున్నతములై చూడ నెంతో ముచ్చటగా నుండును. అడుగున నీటిదరినున్న దేవాలయఁపు మెట్లమీఁద నెక్కువారు,దిగువారునై తీర్థవాసు లెడతెగకయుండురు. విశాలగర్భముగల యమ్మహానదియొక్క పుణ్యజలంబులు గుళ్ళయొక్కయు, గోపురముల యొక్కయు, మేడలయొక్కయు ముందటిభాగములఁ బడిపి పావనముఁ జేయుచుండును. అనేక దేవస్థానములనుండి గంటలమ్రోఁతలు శంఖనాదములు గంభీరముగ నీదరినున్నవారి కా ప్రభాతసమయమున వినవచ్చెను. ఎఱ్ఱని జెక్కలు, తెల్లని గొడుగులు దూరమున దృగ్గోచరములయ్యెను. అదివఱ కెన్నఁడు నట్టిపట్టణముఁ జూచి యెఱుఁగదు కావున శరచ్చంద్రుని తల్లి కాశికానగర దివ్యసౌందర్యమును జూచినతోడనే హర్షమునకుఁ నద్భుతమునకు బరవశత్వమునకుఁ లోనయ్యెను. సంసార సంబంధములను దెగఁగోసి, బంధువుల విడనాడి, భూలోక స్వర్గమయిన

యమ్మహానగరమున ధర్మకార్యములఁ జేయుచు భక్తితత్పరుఁడై తన జీవితమునందలి చరమావస్థ గడుపం దలంచిన హిందూవితంతువునకు సాధారణముగా నిహలోకవైభవమేదియు సంపాదింపలేని లోకసామాన్య సంతోషము కాశీసందర్శనమువలనఁ దప్పక గలుగును. అమాయకురాలయిన యాయవ్వ నదియొడ్డున నిల్చి దాని మహామహిమం దలంచి యానదిలో స్నానముఁ జేయునట్టిభాగ్యము తన్నదీతీరమునఁ గనున్న కాశీనగరముఁ జూచునట్టి భాగ్యము భగవంతుఁడు మహానుగ్రహము పెంపున దనకుఁ గలిగించి జన్మము సఫలముఁ జేసె నందుకుఁ బట్టరాని సంతోషమొంది యానందబాష్పముల విడిచెను.

కాలేజిలో నింగ్లీషుఁ జదువుకొనుచున్న నవనాగరకుఁడయ్యు శరచ్చంద్రుఁడు గూడ నమ్మహానగరవైభవమును మొదటిసారి కనుగొనినప్పుడు మహాద్భుతము నొందెను. ఆర్యుల కళలకు, విద్యలకు, మతములకు పేరుగాంచి చెప్పఁదగిన యాపురముం జూడ మూఁడువేల సంవత్సరముల క్రిందటి జనుల ప్రజ్ఞానులు వాని తలపునఁ బొడమెను. ముప్పది శతాబ్దముల క్రిందట నుత్తర హిందూస్థానము భారత రామాయణాదులగు నితిహాసములతో బ్రసిద్ధికెక్కిన కౌరవపాంచాలుర యొక్కయు కోసల విదేహులయొక్కయుఁ బరిపాలన క్రిందనున్నప్పుడు కాశీరాజులు పాండిత్యమునకుఁ బ్రతాపమునకుఁ బేరుపడి యుండిరి. పురాతనములైన యుపనిషత్తులుఁ గూడ నేఁటికిఁ బ్రసిద్ధులగు కాశీరాజుల చరిత్రములను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి. మహాత్ముఁడగు గౌతమబుద్ధదేవుఁడు మొట్టమొదట సేవనమునందు నిష్కలుషములగు తన సిద్ధాంతములను జనులకు బోధించెనో యాలేడితోఁట సారనాథ మనియెడు పేరుతో నీవారణాసియందే యున్నదని బౌద్ధమత గ్రంథములు చెప్పుచున్నవి. ఈనగరము శివుని త్రిశూలాగ్రమందున్నదనియుఁ బ్రళయకాలమందుఁ బన్నెండుగురు సూర్యులు మింటనొకసారి వెలుఁగుచుఁ బ్రపంచమును భస్మపటలముఁ జేయునాఁడునుఁ బుష్కలావర్తమేఘములు వానను గురిసి యేకసముద్రముగఁ జేసి ప్రపంచమును ముంచునాఁడును, వారణాసికి నెట్టి భయమును లేదని పురాణములు పలుకుచున్నవి. ఆఱువందల యేండ్ల మహమ్మదీయ పరిపాలనము నీ శాస్త్రము నప్పుడప్పుడు తుడిచిపెట్టి యుండవచ్చును. కొన్ని దేవాలయములను నేలపాల్చి యుండవచ్చును కాని దుర్భేద్యమైన యార్యుల మతవిశ్వాసము పరమతసహనము లేని యొకరిద్దఱు మహమ్మదీయ చక్రవర్తుల చేతులలో లేదు. అందుచేతనే యెన్నిసారులు కొల్లపెట్టఁబడినను, యెన్ని దేవాలయములు నేలం గూల్పఁబడిన నీనగరము మూఁడువేల సంవత్సరముల క్రిందట

నెట్లుండెనో, నేడును నట్లులే చెక్కుచెదరక యార్యులకు వందనీయమై, దర్శనీయమై స్మరణీయమై యొప్పుచున్నది. హిందూ దేశమందలి మహారాజులు రాణులు దమజన్మములు చరితార్థములు చేసికొనుటకు దానమున నొండొరుల మించునట్లు లీపుణ్యనగరంబున సత్రములు, చావళ్ళు, గుళ్ళు, గోపురములుఁ గట్టించి నిరతాన్నదానంబులు నిత్యోత్సవంబులు జరుగునట్లు మాన్యముల, నగ్రహారంబుల ధారాదత్తముఁ జేసిరి. నేపాళ భూపాలురు, దక్షిణదేశపుఁ బ్రభువులు, హోల్కారుభార్యయగు నహల్యాబాయియు, శీకుల దొరయగు రణజితసింగును, గాశీనగరంబునకుఁ బ్రస్తుతసౌందర్యము గల్గించిన మాన్యులు. ప్రపంచమునం దనేకరాష్ట్రములు పుట్టిపోయినవి. అనేకమతములు తలయెత్తి నశించినవి. కాని హిందూరాష్ట్రము, హిందూమతము మాత్రము నశింపలేదు. అందుచేతనే హిందూదేశముయొక్క ప్రాచీనమతము, ప్రాచీనవైభవము జనులహృదయముల నేటికిని నాటికొని యున్నది.

శరచ్చంద్రుఁడును, తల్లియు నొకచిన్ననావ నెక్కి గంగదాటి శ్రీవిశ్వేశ్వరాలయమందలిగంట భగవంతుని యుదయకాల సేవలకు రావలసినదని జనులను బిలుచుటకో యన మోఁగుచుండఁగానే స్నానఘట్టములవద్ద దిగిరి. కుమారుఁ డదివరకు జాబులమూలముగా గుదిర్చినయింటికిఁ దల్లిం డీసికొని పోవం దలఁచెను. కాని యామె కానంద పారవశ్యమున నేమాటయు వినఁబడదయ్యె. కన్నులకు మిఱుమిట్లు గొలుపుచున్న విశ్వేశ్వరాలయ శిఖరము తప్ప మఱియేవస్తువు నామెకుఁ గానబడదయ్యె. ఆకోవెల జూచినతోడనే యాయవ్వ దానికి ముమ్మాఱు ప్రదక్షిణముఁ జేసి సింహద్వారమువద్ద ముమ్మాఱు చాగిలఁబడి లేచి యాలయముఁ బ్రవేశించెను. అపుడామె మనసున ప్రపంచమే లేదు. గర్భాలయములోఁ జిరకాలమునుండి యాశ్రయించియున్న చీఁకటులను బోగొట్టనందులకువిచారించి చిక్కెనో యనునట్లు మూఁడునాలుగు దీపములు కళాకాంతులు లేక వెలుఁగుచుండెను. అర్చకుఁడు వేదమంత్రముల జదువుచుండెను. కంగుకంగుమని పెనుగంటలు మ్రోగుచుండెను. నానాజాతుల తీర్థవాసులు కనుపండువుగాఁ జూచుటకు గుంపులుగుంపులుగా విశ్వేశ్వరవిగ్రహముచుట్టుం జేరిరి. ధూపధూమములు గర్భాలయము నావరించి విశ్వేశ్వరు నర్చించువారికన్నులు కనపడకుండఁజేసి మెల్లగ ద్వారమునుండి యావలకు వెడలిపోయి యాకాశమునం గలియుచుండెను. ప్రతిమనుష్యుఁడుఁ దాను తెచ్చిన పుష్పములను సామి యెదుటనున్న పళ్ళెరమునఁ బడవేయఁ జొచ్చెను. అర్చకుఁ డాపువ్వులతో మహేశ్వరుం బూజించి, గంగానదీ పుణ్యజలంబులు తీర్థవాసులపైఁ జల్లి, వారు ప్రార్థనలుమాగించి

మ్రోఁగెడుగంటలు మ్రోఁగుచుండఁగనే వచ్చెడు క్రొత్త తీర్థవాసులు వచ్చుచుండఁగనే జగదీశ్వరుఁడగు విశ్వేశ్వరునకుఁ గడపటి ప్రణామముఁ జేసి పోవుచుందురు.

శరచ్చంద్రుడు డింగ్లీషుకాలేజిలోఁ బట్టపరీక్షకు జరుగుచున్న వాఁడగుటచే గుడిలోనికిం బోక యావలనే తల్లికొఱకుఁ గనిపెట్టుకొని యుండెను. పోవకున్నను మహా గంభీరములైన వేదమంత్రములు చెవినిబడుచుండుటయు, భక్తిపరవశులగు తీర్థవాసుల సాష్టాంగ దండప్రణామములు కంటబడుటయు నతనింగూడ మనసుకరఁగ లోలోపల విశ్వేశ్వరుఁ బ్రార్థించె. క్రైస్తవమతబోధకులయొక్కయు నింగ్లీషు నేర్పు నుపాధ్యాయులయొక్కయు బోధనలు హిందూవిద్యార్థుల మనస్సులను బూర్వాచారములనుండియు బ్రాచీనమతము నుండియుఁ ద్రిప్పి వానిమీఁద ద్వేషముగల్గించెను కాని, యిటీవల నవీనమైన మతము దేశమున బయలువెడలి యతిపురాతనములైన యుపనిషత్తులలోని ధర్మములే యార్యుల ధర్మములనియు నవియే విశ్వసింపఁదగిన ప్రమాణములనియు హిందూబాలురకు బోధించుచున్నది. వేదాంతశాస్త్రమం దనగాఁ నుపనిషత్తులలో గంభీర వాక్యములతోఁ దొలుదొల్తఁ జెప్పఁబడి నదియు నేనాఁటి హిందువు లవలంబించుటకుఁ బ్రయత్నము సేయుచున్నదియు నగు పరిశుద్ధాస్తికమతమును నిర్మూలించుటకు గ్రీకులు, పారసీకులు క్రైస్తవులు పోరాటంబులు సలిపిరి కాని యవియెల్ల వ్యర్థములయ్యె.

శరచ్చంద్రునితల్లి యన్నపూర్ణాలయమునకుఁ దక్కిన ముఖ్యాలయములకుఁ బోయినపిదపఁ గాని బసకేఁగుట కిష్టపడదయ్యె. మాతృవిధేయుఁడైన యా కుమారుఁడు తల్లివెంట జనసమూహముల నడుమనుండి సన్నని సందులలోఁబడి యొకగుడినుండి మఱియొకగుడికిఁబోయెను. ఆ సందుల కిరువంకల మేడలు, మిద్దెలు క్రిక్కిరిసి యుండెను. వానిమీఁద నానాదేశములనుండి వచ్చిన నానాజాతి స్త్రీపురుషులు పలుపలువిధములగు చిత్రవస్త్రముల ధరించి, పలుభాషలు మాటలాడుచుఁ గ్రిందనడచువారిం జూచుచు నిలిచిరి. దుకాణాదారులు తమతమ కాణములలో బియ్యము,పప్పు, కూరగాయలు మొదలగు నవి గంపలలోఁ బోసి యమ్మఁజూపిరి. ఆ సన్నసందులనుండి యాఁబోతులు ప్రక్కయరుఁగులమీఁది యంగళ్ళలో నున్న బియ్యము, ధాన్యము వీలయినపుడు నోరెడు తీసి బొక్కుచు నెవరిజోలికిఁబోక, నెవ్వరిచేత నదవుసేయఁబడక స్వేచ్ఛగాఁ దిరుగుచుండును. ఎఱ్ఱని జరీపట్టుచీరలు కట్టికొని మహారాష్ట్రస్త్రీలు, కొందఱు ప్రేలాడ విలువకోకలు గట్టిన బంగాళీ స్త్రీలు, నేలఁదాఁకునట్లు పావడలఁగట్టియుండు యుత్తరహిందూస్థాన స్త్రీలు దారిలోఁ జెట్లక్రిందను, దేవాలయములలోను గనంబడు దేవతావిగ్రహములకు దబ్బులు,

పళ్ళు సమర్పించుచుఁ గలసి మెలసి తిరిగిరి. దేహమునిండ బూడిదఁ బూసికొన్న సన్యాసులు, గోపిచందనము మొగము నిండ మెత్తుకొనిన భక్తులు, తీర్థవాసులగౌరవంబునకును దానంబులకును, పాత్రులైరి. ఈ విధముగ నెడతెఱపి లేక తీర్థవాసులతో నిండి యున్నను వారణాసియందు నన్ని నగరములందువలె వాణిజ్యము విశేషముగఁ జరుగుచుండును. అంగళ్ళు యూరోపుఖండమందుఁ నాసియాఖండమునందు బండిన సరకులతో నిండియుండును. గొప్పవర్తకుల కోఠీలు హిందూదేశమంతకు హుండీలు వ్రాయుచు నితరవర్తకుల హుండీలు చలామణి చేయుచు నుండును. నూలుగుడ్డలు, పట్టుబట్టలు, వెండి బంగారు నగలు, కట్టాణిముత్యములు, జాతిరత్నములు, జయపురపు నినుపపాత్రలు, కాశీ రాగిసామానులు, మాఱుమూల సందులలో నైతము కొట్లలో నమర్చబడి బాటసారులకు వెలకు దొరకును.

దివ్యస్థల సందర్శనము ముగించి మధ్యాహ్నము తిరిగినపిమ్మటఁ దల్లికొడుకులు మరల నొకసారి స్నానము చేయవలయునని గంగకై పఱిగిరి. గంగలోపలనుండి పైవఱకు నన్ని మెట్లున్నియు స్నానార్థమై వచ్చిన యాత్రవాండ్రతో నిండి యుండెను. పురోహితులు, పండాలు భాగ్యవంతులగు తైర్థికులవెంటఁ బ్రతిదివ్యస్థలమునకుఁ బోవుదురు. బ్రాహ్మణులు స్నానములు చేసి గంగలో మొలబంటి నీళ్ళలో నిలిచి జందెములు చేతఁబట్టుకొని మంత్రములు చదువుచుండిరి. దశాశ్వమేధ ఘట్టమునందున్న మణికర్ణికాక్షేత్రముయొక్క మెట్లు భాగీరథీ పుణ్యజలములలో మునిఁగి బహుజన్మసంచితమైన పాపమును గడిగివేయదలఁచు తీర్థవాసులయొక్క కాళ్ళ రాపుడుచే నలిగిపోయెను. జాము ప్రొద్దువేళకా మాతాపుత్రులు బసఁజేరి యేదోయింత వండికొనితినిరి. పాపమా యిల్లాలు భర్తృవియోగమైన తరువాత నంతటి యానందముఁ బొందిన దినమదే తప్ప యొండులేదు. పతి కాలధర్మము నందిన దినము మొదలామె కాశికానగరమునకుఁ బోయి యచ్చట నుపవాసములు, పుణ్యకార్యములు, దానధర్మములు, దేవతాదర్శనములుఁ జేసి జీవనము గడప వలయునని తలంచిన తలంపు నేఁటికి సఫలమయ్యెనని సంతసించెను.

శరచ్చంద్రుఁడు తల్లితోఁ గలసి మూఁడురాత్రులు, మూఁడుపగళ్ళు, కాశికానగరమున గడపెను. తనయూర నున్నపుడే శరచ్చంద్రుఁడు కాశిలోఁ దన తల్లికొక బసకుదుర్చుమని యొక పండాబ్రాహ్మణునికి వ్రాసి యున్నందున నతఁడు వారువచ్చునప్పటికి నదియొడ్డున నొక మేడలో రెండవయంతస్థు మీఁద రెండుగదులు కుదిర్చియుంచెను. ఆపండాబ్రాహ్మణుఁడు ప్రతిదినమామె వెంట దివ్యస్థలములకన్నిఁటికరిగి, పురోహితుఁ

డయి సహకారియై, హితోపదేశకుఁడై మెలంగుచు వచ్చెను. తీర్థవాసులు పుణ్యక్షేత్రములను జేరఁగానే, పండాబ్రాహ్మణులు వారికి బసలు కుదిర్చి సౌఖ్యము లొనగూర్చి వారిచ్చు స్వల్పధనములు గ్రహించి సంతసింతురు. ఈబ్రాహ్మణులు క్షేత్రములకు వచ్చు తీర్థవాసులపేళ్ళన్నియు వ్రాసికొని వంశపరంపరగాఁ దమ పుత్త్రపౌత్రుల కిచ్చిపోవుచుందురు. ఈజాబితాలలో మనపూర్వులెవ్వరు తీర్థయాత్రలు చేసిరో వారి పేళ్లుండును. ఇట్టిపండాలు, కాశిలో, ప్రయాగలో, మధురలో, బృందావనములో ననేకు లున్నారు.

ఆపండా శరచ్చంద్రుని తల్లినిమిత్త మొకవంటలక్కనుఁ గుదిర్చెఁగాని యాయవ్వయామె చేతివంట దిన నిష్టపడక స్వహస్తపాకము జేసికొని వితంతువులకు విధింపఁబడిన యేకభుక్తమును జరిపెను. అందుచేత నావంటకత్తె పనికత్తె యగుటకుమాఱు ముసలమ్మకుఁ జెలికత్తెవలె నుండి సాయ ముండుట కుపయోగించెను. ఇట్లు మూఁడు రాత్రులు మూఁడు పగళ్ళు గడచుటయు ముసలమ్మ నాలుగవనాఁ డుదయమున స్నానము జపము ముగిసిన పిదపఁ గొడుకుం బంపివేయవలసి వచ్చినందుకు మిక్కిలి విచారగ్రస్తయై కొడుకుం గలిసి విశ్వేశ్వరాలయమునకుఁ జని దేవతాదర్శనకాలము సమీపించినదని తెలుపుటకు మ్రోఁగుచున్న ఘంటానాదము విని తీర్థవాసులు మందమందలుగా లోనఁ జొరఁబడుచుండఁగా నామె లోని కరుగఁ జాలక కొడుకున కెదురుగా నిలిచియుండి ముడతలుపడిన ముదిచెక్కులనుండి కన్నీరుసోనలుగా ప్రవహింపఁ గొండొక సేపూరకుండి విశ్వేశ్వరు నుద్దేశించి యిట్లు వేఁడుకొనియె. "ఓవిశ్వేశ్వరా! సంసారబంధములనుండి విడిపోవుట మిక్కిలి కష్టము. ఈదీనురాలు నీపాదసేవలే యేమఱక సేయునట్లు కటాక్షింపుము. ఈ సేవకురాలి యేకపుత్త్రుఁడు సంసారయాత్రలో గష్టములబారి బడకుండునట్లు దీవింపుము."

అంతట శరచ్చంద్రుఁడు తలవంచి తల్లియెదుట నిలువంబడుటయు నమ్మాతృదేవత కొడుకుతలపైఁ జేయివైచి, నిమిరి, యాశీర్వదించి యిట్లనియె. "నాయనా! వెళ్ళు. మీ నాయనగారు నడచినధర్మమార్గములనే నడువుము. కులగౌరవము పెద్దల పరువుప్రతిష్టలు నిలువం బెట్టుము. పాపము మీయక్క కాళి నోరు వాయి యెఱుఁగనిది. దాని నేలాగున కనిపెట్టెదవో. నేను నీకు నేఁజే చెప్పవక్కఱలేదు. దాని భారమే నీది. హేమచంద్రుఁడు, బిందు, సుధ నీతోఁ జిన్నప్పటినుండియు స్నేహము చేసినవారుకదా! వారందఱికిష్టుఁడవై యెప్పటివలె నుండుము. వెళ్ళు నాయనా! వెళ్ళు. ఈ కాలఁపు చదువులు చదువుకొని, గొప్పవాఁడవై యుద్యోగములు చేసి, బిడ్డలతండ్రివై భగవంతుని పాదములే నమ్ముకొని యుండుము. ఆప్రభువే మన కన్నకష్టముల దాటింపఁగలవాఁడు.

నాయనా! మీయమ్మమాట నీకై తలపెట్టక యామె నీపుణ్యస్థలములో విడిచిపొమ్ము. మనశాస్త్రములలోఁ బెద్దలు విధించిన ధర్మములను, జపతపములను జేసికొని, శుభగంగా మృతమే ప్రతిదినము ద్రావి కాలక్షేపముచేసి మీయమ్మ తనయస్థికల నీగంగలో నేకలుపుము. తండ్రీ! నీ వెక్కడనున్నను మీయమ్మ దీవనలు నీవెంటవచ్చి నిన్ను గాపాడును." అని మఱియు నేదియో యనఁబోయెను. కాని దుఃఖమంతకన్న నామెను బలుకనిచ్చినది కాదు. శరచ్చంద్రుఁడు సహజముగ ధైర్యముగల వాఁడయ్యుఁ దల్లి కడసారి పలుకులకుఁ బ్రత్యుత్తర మీయలేక యామెయడుగులపైఁ బడి వెక్కి వెక్కి యేడువసాగెను. అంతలో విశ్వేశ్వరాలయములోని గంటలు ఖంగుఖంగని మ్రోయఁ జొచ్చెను. వేదమంత్రనాదము లతో గుడి ప్రతిధ్వనులిచ్చెను. అవి వినఁగానే తల్లికొడుకుల హృదయములు దుఃఖమును విడిచి భక్తిపరవశములయ్యెను. తల్లి కన్నీరుఁ దుడుచుకొని "బిడ్డా! నన్ను విడువుము. ఆవల స్వామిసేవాకాల మయినది. నేను గుడిలోనికిఁ బోవలయును. ధర్మము నెఱవేర్చ వలసినప్పుడు పిఱికితనము విడిచి ధైర్యముఁ బూనుము. దయగలవాఁడవై పదిమందిచే మంచి వాఁ డనిపించుకొమ్ము. మీపూర్వులపద్ధతులే యనుసరింపుము పెద్దలయాచారములే నడుపు" మని పల్కెను. అప్పుడు మాతృభక్తి యావేశింప శరచ్చంద్రుఁ డామె కిట్లనియె. "అమ్మా! నీకోరిక ప్రకారమె యెల్లప్పుడు నడచుకొనియెదను. నీయిచ్ఛకు విరుద్ధముగా సంచరించినప్పుడు నేను బ్రతుకక పోవుదును గాక!" అని పలికి మఱల దల్లియడుగులకు మ్రొక్కి యామె పాదములు కన్నులనద్దుకొని యామె సెలవుఁ గైకొని తన నిమిత్తము కని పెట్టుకొనియున్న నావ నెక్కెను. పడవవాండ్రును వెంటనే యానావను ద్రోసిరి. అది క్షణములో నావలియొడ్డు జేరెను.

మఱల దేవాలయఘంటానాదము, వైదికమంత్రధ్వనియు బయలుదేఱెను కాని యవి యాపుత్రవత్సలకు శ్రవణగోచరములు గావయ్యె! సంసారబంధమునఁ జిక్కి యాయిల్లాలు భగవంతుని సేవనైతము మఱచిన దీయొక్కసారియే ఆమె ధ్యాన మంతయు నామె భూలోకసౌఖ్యాధారమై, కనులచందమామయైన యాపుత్రరత్నము మీఁదనే యుండెను. కన్నీటిచే మాంద్యముఁ జెందిన యామెదృష్టి కొడుకెక్కిన యా చిన్నినావ కంటికి కనఁబడినంతవఱకు దానిమీఁదనే నిలిచెను. అనంతరము గంటలు మ్రోఁగుట మానెను. వేదపనస్సోచ్చారణములు ముగిసెను. ఉదయ ప్రభాకరుఁడు గోపు రముమీఁద దేవాలయము మీఁద దనకాంతి పర్వఁజేసెను. అయ్యవ్వ యాలయముఁ జొచ్చు నప్పటి కామెమనసు మనసులో లేకపోయెను. అయినను జాలసేపామె విశ్వేశ్వరస్వామిం బ్రార్థించి పుత్రవియోగమునఁ బరువెక్కిన హృదయముతో మెల్లఁగ బసకుఁ జనియెను.

సుధాశరచ్చంద్రము

రెండవ భాగము

ఎనిమిదవ ప్రకరణము

పట్టణము.

బిం—సుధా! నీ వీలాగున నొకసారి వచ్చెదవా?

సుధ—అక్కయ్యా! పిలుచుచున్నావా?

బిం—అవును. ఆ చీర నుదికినాను. అది యింటిమీదఁ నారవేయుము. నూతి దగ్గఱ నీళ్ళు పోసికొని నిప్పంటించెదను. పాలది వచ్చువేళయైనది. అబ్బా! ఈనూతిదగ్గఱ స్నానముచేయుట నాకెంతో కష్టముగా నున్నది. మనయూరి చెఱువెంత మంచిదే! హాయిగ నీళ్ళలోదిగి స్నానముఁ జేయవచ్చును.

సుధ—(చిఱునవ్వునవ్వి) కలకత్తాలో నేదిచూచినను నీకుఁగిట్టదు. నాకిక్కడ స్వర్గములో నున్నట్లున్నది. ఇది యెంతమంచి పట్టణమే! ఆహాహా! ఆ బజారులు, ఆ దుకాణములు, ఆ పెద్దపెద్ద మేడలు, అంతములేని వీథులు, వేలకొలఁది మనుష్యుల గుంపులు, ఆ గుఱ్ఱపుబండ్లుచూచి యెవరు సంతోషింపరు? మన తాళ్ళచెఱువులో నిట్టివేమైన నున్నవా?

బిం—బజారులకు దుకాణముల కేమిలే. పల్లెటూరైనను మనయూరు మన తాతాతల యిల్లు స్వర్గము కాదఁటే! అక్కడ హాయిగనిట్టటు దిరుగవచ్చును. మంచి గాలి, వెలుతురు. దొడ్డిలో కావలసినన్ని పాదులు కూరలు గదా? తోటలో

మామిడిచెట్లు. ఈకలకత్తా యింటిలో నవి యెక్కడున్నవే? గుఱ్ఱములు బండ్లు భాగ్యవంతులకుఁ గాని మనకెందుకు? మనకీ పెద్దయిటుక యిండ్లెందుకే. సరిగా వెలుతురైన లేదు. శుభ్రమైన గాలిరాదు. చుట్టాలనెవరినైనం జూడవలయునంటే పల్లకీ లెక్కి తలుపులు మూసికొని వెళ్ళవలెను. మనమిక్కడ పంజరములోఁ జిలుకలవలె నున్నాము.

సుధ—అక్కయ్యా! మనము పయికి వెళ్ళునప్పు డెన్ని చిత్రములు చూచుచున్నామో యాలోచించు. మొన్న బావ మనలను బండియెక్కించి మ్యూజియమునకుఁ దీసికొని పోయినాఁడా! ఆహా! యెన్ని చిత్రవస్తువులు చూచినామే యక్కడ. అక్కడ నుండి ఆవేవో తోఁటలలోనికి వెళ్ళినామా! అక్కడ చిత్రమైన పక్షులు, జంతువులు మనము చూడ లేదూ? ఇల్లు కదిలినామంటే అన్నీ చిత్రములే.

బిం—నాకెల్లప్పుడు బండ్లమీఁద తిరుగుట యిష్టములేదు. మనయూరిలో బండి యెక్కవలసిన యవసరమేలేదు. ప్రతిదినము హాయిగనడిచి చెఱువునకు వెళ్ళి స్నానము చేయఁగలముగదా. అక్కడందఱిని మన మెఱుఁగుదుము. మనల నందఱెఱుఁగుదురు. అందఱు మనలం జూడవత్తురు. మన మందఱను జూడఁబోదుము. అక్కడ మనకేగోషా లేదు. పట్టణమన్న పేరేగాని యీమహారణ్యములో నొకరి నొక రెఱిఁగినట్లు కనఁబడదు.

సుధ—అక్కయ్యా! కొంతకాలముంటే యిక్కడ మనుష్యులు పరిచయ మగుదురు. మొన్నను దేవీప్రసన్నుఁడు గారి నౌకరువచ్చి వారియాఁడవాండ్రను జూచుటకు రమ్మని పిలువలేదూ! చంద్రనాథుఁడు నిన్నను కొన్నిపండ్లు మిఠాయిలుఁ బంపినాఁడు కదా!

బిం—సరే కొన్నాళ్ళుంటే ఎవరోకొందఱు పరిచయులు కాకపోదురా యేమిటి? వాళ్ళు భాగ్యవంతులు; మనము పేదవాళ్ళము. వాళ్ళకు మనకు మన సెట్లు కలియఁగలదు? వారు మనతో గౌరవముగా మాట్లాడుటయే మనకుగొప్ప.

సుధ—ప్రతిరో జాదయమున శరచ్చంద్రుఁడు మనయింటికివచ్చి అందరి మనుష్యులను గురించి యన్నిసంగతులం గురించి చిత్రచిత్రముగఁ జెప్పుచుండును గదా! అతఁడు పుస్తకములం జదివి యర్థము జెప్పినపుడు నాకూరకే వినవలయునని యుండును.

బిం—శరచ్చంద్రు నంతమంచివానిని మనము సాధారణముగఁ జూడము. అతఁడు పగలెల్ల పరీక్షకుఁ జదువుకొని పాపము సాయంకాలము తప్పక మనలం జూడవచ్చును.

ఆతఁ డంతసేపు మనవద్ద నెందు కుండు ననుకొన్నావు! మన మొంటిగ నుండి పోదుమని. అతఁడిక్కడ నున్నంతసేపు పుస్తకము లవతల పాఱవేసి మన సౌఖ్యములనే చూచు చుండును. అతనికి డబ్బున్నవాఁడనని, చదువుకొన్న వాఁడనని గర్వము లేదు. అతనిది చాల మెత్తని మనసు. ఈకాలఁపు కుఱ్ఱవాళ్ళలో నటువంటివా రుండరు.

సుధ—అక్కయ్యా! పాలది వచ్చినది.

బిం—(పాలదానిని జూచి) ఈవేళనైన కొంచెము మంచిపాలు తెచ్చినావా? లేక నిన్నటిలాగు సగము నీళ్ళు సగము పాలునా? కలకత్తాలో కావలసినన్ని కుళాయి లున్నవి. నీళ్ళకుఁ గొదవ లేదు కదా. ఇఁక పాల కేమికొదవ నీవు తెచ్చునవి పాలు కావు పాలరంగు నీళ్ళు.

పాలది—అమ్మా! కాచుకొంటె కిల్లాంటి పాలిత్తానండి. పోంచేసి సూడం డమ్మా! మంచియో చెడ్డయో మీకే తెలుస్తాది.

బిం—అవునే పిల్లా! నే నెఱుఁగుదును. మాయింటిప్రక్కటి మాయావు మూఁడు సోలల పాలిచ్చునది. అవే మాయిల్లలకు సరిపోవును. నీవు సేరుపాలిచ్చినను సరిపోవుటయే లేదు. ఎన్ని త్రాగిన పిల్లలకాఁకలి తీరుటయే లేదు. కాచుటకు కుండలోఁ బోసినప్పుడు నీళ్ళు పోసినట్లుండును కాని పాలుపోసి నట్లుండవు.

పాలది— అమ్మా! మీ యింటికి పాలంటివి యిక్కడెల్లాగొస్తాయితల్లీ! అక్కడావులు బయలకెళ్ళి కడుపునిండా మేస్తాయి. మంచి పాలిస్తాయి ఇక్కడావులను సాల్లోకట్టిపెట్టి రోజల్ల మేపుతాము. ఇస్సుంటె మంచిపాలెల్లా గిస్తాయి?

బిం—నిన్న మంచిపెరుగు తెమ్మన్నాను. తెచ్చినావా?

పాలది—ఇదిగో నమ్మా తెచ్చాను. (అంగుప్పిడంత పిడత తీసియిచ్చును)

బిం—అబ్బో! యీ పిడత నాలుగుడబ్బులా?

పాలది—నాలుగు డబ్బులకి మఱెంతొస్తదనుకున్నారు! మీరొకాల్ని యూరికి పంపించి కనుక్కోండి. ఇంతకన్నా నొక్కువైన యిక్కడివిస్తే యిలాగైనే ప్రయ్యుతోంది. మీవాడికుంటనే చాల్నని దేవుళ్ళాడుతాము, ముంగాదగా మీదగ్గరే చేస్తాగుండి!

బిం__సుధా చూడమ్మా! మీ డాబుల కలకత్తా పెరుగు చూడు. ఇది నాలుగు డబ్బుల పెరుగట. కొంచెము నీళ్ళు కలిపి పోసుకో. లేకపోతే నీకైన సరిపోదు. ఎవరు వారు? దాసీదా యేమిటి?

దాసి__(ఎదుటికివచ్చి) అవునమ్మా నేనే.

బిం__ఓసీ! ఈరోజున బజారుకు కొంచెము పెందలకడ వెళ్ళు. ఈవేళ మావారు పదిగంటలకే యెక్కడకో వెళ్ళవలెనట. త్వరగా వంట గావలెనట ఏ చేపలు తీసికొని రాగలవు? మంచి కోయి చేప తేగలవా!

దాసి__లేలేకమ్మా! అయి పిరం. మంచి కోయిచాప రెండు మూడు నాలుగుడబ్బు లుంటది.

బిం__ఏమిటి? అయితే కలకత్తామనుష్యులు తిండి తినకుండ ఊరికే బండ్లకి తిరుగు చుందురా యేమిటి?

దాసి__తినకేమండమ్మా; కరుచు చేసుకుంటారు. తింటారు. మేము నాలుగు డబ్బుల చాపలు తెచ్చుకుంటామండి. అదే సందాలా పొద్దున్న గడుపు కుంటాము.

బిం__అయితే మాగరుచేపధర యెంత?

దాసి__మాగరూ సెత్తకమ్మా! అదొక్కొక్కటి నాలుగు డబ్బులో అయిదు డబ్బులో ఆఱు డబ్బులో. బజారు మండి పోతుందమ్మా. కొనలేము. మేము పల్లెటూ లోళ్ళమే, అక్కడున్నప్పుడు సంతలో చాపలు కొనుక్కునోళ్ళం. అదంకే కలకత్తాలో రమ్మంటే వత్తాయా? రెండుపూటలూ పట్టుడన్నం యెల్లోస్నె రెవలారు గనుక మీపాదా ల్నిడని బతుకుతూవున్నాం గాని లేకపోతే చణముండ గల్నాండి.

బిం__సరే వెళ్ళువెళ్ళు. మట్టగిడసకాని బొమ్మిడాయికాని సీరు తోంచికది మరేదో మంచిది తీసుకురా! ఒకడబ్బు రొయ్యలు తీసుకురా! వాటిలో పులుసు కాచవలెను. ఒకడబ్బుతోటకూరకూడ తీసుకురా. మాయూరిలో నున్నప్పుడు మా దొడ్డిలోఁ గావలసినంత బచ్చలికూర, ఎంతమందికో పెట్టి మేము తినేవాళ్ళము. బంగాళాదుంప లిక్కడ చాల ప్రియము. అవి చాలా తీసికొనరాకు; వాటిబదులు కందో, పెండలమో, చామో, చిలగడదుంపలో తీసికొనిరా! కొంచె మరఁటిదూట అఁటిపువ్వు తీసికొనిరా!

తేమి పాపమువచ్చినదే, అమ్మా! అరఁటిదూఁట అరటిపువ్వు డబ్బుపెట్టి కొనవలసి వచ్చినది. మాయూరిలో నరఁటిచెట్లడవిలాగున పెరుఁగు చుండును.

అని బిందు పాలదానివద్దనుండి పాలుఁ బెరుఁగు దీసుకొని డబ్బులిచ్చి దాసిని బజారున కంపి పాలుఁ గాచి మేడమీఁదికి దీసికొనిపోయెను. అప్పటి కామె బిడ్డలిద్దఱు లేచిరి. ఆ బిడ్డల కన్నముపెట్టి పాలు త్రాగనిచ్చి పక్క లెత్తి యా మొగది యూడ్చుచుకొనెను. అంతలో దాసి బజారునుండి కూరలు తెచ్చినందున బిడ్డల నాడించుమని దానికప్పగించి తాను వంటయిల్లు ప్రవేశించెను. సుధ సాకులందిచ్చి యక్కగారికి సహాయురాలై పైపని చేయుచుండెను. అందుచేత నామె బియ్యము కడిగి యిచ్చి కూరలు తరిగి నూనె యుప్పు మిరపకాయ తాలింపు మసాలాలు చుఱుకుగా నందిచ్చెను. బిందు వంటఁజేసెను.

పైసంభాషణలఁబట్టి హేమచంద్రుఁడు సుధా బిందులం దోడ్కొని కలకత్తా నగరమునకు వచ్చినట్లు చదువరులకుం దెలియునుగదా! అతఁడట్లువచ్చి కొన్ని దినములు శరచ్చంద్రుని యింటనుండి తరువాత రెండంతస్తుల మేడ నద్దెకుపుచ్చుకొని యందులో ప్రవేశించెను. వారిని వేరింటఁ గాఁపురముచేసి సొమ్ము పాడుచేసికొనక తనతోఁ గలిసి యుండుఁడని శరచ్చంద్రుఁడు ప్రతిమాలెను. తమరాక యాతని చదువునకు భంగము కలుఁగఁజేయునని తలంచి వారక్కడ నుండరైరి. అందుచేత శరచ్చంద్రుఁడే వారి నిమిత్తము భవానీపురములో నెలకుఁ బదిరూపాయలయద్దె కొకయిల్లు కుదిర్చెను.

ఆ చుట్టుప్రక్కల మనుష్యుల ననేకుల శరచ్చంద్రుఁ డెఱుఁగును. అందుచేత హేమచంద్రుఁడుఁగూడ వారికి బరిచితుఁడయ్యెను. అందులోఁ గొందఱు కలకత్తా హైకోర్టులో ప్లీడర్లు; కొందఱు గవర్నమెంటు కచ్చేరీలలోను తెల్లవారి వర్తకసంఘములలోను గుమాస్తాలు, కొంద ఱేయుద్యోగములు లేక సొంతయాస్తిమీఁద జీవించువారు. కొందఱు చీనాబజారులోను బారాబజారులోను దుకాణములు పెట్టికొన్నవారు. వీరుగాక యనేకులు తగిన జీవనాధారములేక యెప్పటికప్పుడే వట్టి యాఁకలిగొలుపు నా మహాపట్టణమున కష్టపడి పొట్టగడుపుకొనుచుండిరి. భవానీపురములోనున్న భాగ్యవంతులు పల్లెటూరినుండివచ్చి సుగుణసంపదయు గౌరవమును గల హేమచంద్రుని మిక్కిలి యాదరించి తమ దివ్యభవనముల కప్పుడప్పుడతని బిలుచుచు హృదయపూర్వకమైన మైత్రితో, దయతో, నాతని బలుకరించుచు వచ్చిరి. అప్పుడప్పుడాయనను కొందఱు విందులకుఁ బిలుచుచు వచ్చిరి. ఈ విధముగఁ బరిచయము క్రమముగ నభివృద్ధి పొందుటకు

నతని కక్కడ కొందఱు మిత్రులేర్పడిరి. హేమచంద్రుఁడు తనభార్యవలెనే తన పల్లెటూరు సౌఖ్యము, స్వేచ్ఛ, యిక్కడలేదని విచారపడుచుండును. కలకత్తాలోనున్న సందడి గొడవ వానికి గిట్టక పోవుటఁ దనయూరిస్నేహితులతోఁ గలిసియుండుటకు తనయూరి గొడవలు వినుటకుఁ గుతూహలము పడజొచ్చెను. క్రొత్త మిత్రులు తనయెడఁ జూపిన దయ కతఁడు సంతసించెను. కాని మేడలపట్టణమని చెప్పఁదగిన కలకత్తాలో గొప్పవారికి భాగ్యవంతులకు సాధ్యమయినంతవఱ కతఁడు దూరముగానే యుండెను హిందూదేశపు రాజధానియైన యీనగరమున నున్న గొప్పవారు దొరతనమువారివలన గౌరవములు, బిరుదులు, మెప్పులు బడయఁ దలఁచి పడెడుపాటులను హేమచంద్రుఁ డొకమూల కాఁపుర ముండియు సూక్ష్మబుద్ధి యగుటచేఁ గనిపెట్టి యాశ్చర్య మొందుచు వచ్చెను. ఎక్కడఁ జూచినను గొప్పవారికి విందులు, వన సంతర్పణలు, నాట్యములు, సభలు, ఎక్కడ చూచిన గొప్పకార్యముల నిమిత్తము చందాలు, ఎక్కడచూచిన నున్నత పురుషుల స్తోత్రపాఠములు, జనుల కెడతెగని వినోదములు మహోత్సాహముఁ బుట్టించు వ్యాపారములు గదా! ఈ ప్రయత్నముఁ జేయఁజేయ, నోపికగల వేటకాని గురితప్పక యేటుతగిలి పడెడు జింకవలెనే, మనోరథములైన బిరుదులు మెప్పులు చిట్టచివర కపేక్షించినవారికి వచ్చుచుండును. హేమచంద్రున కట్టియాశలు లేమి యట్టిపోకలం బోక యీ బిరుదుల వేటకాండ్ర చమత్కృతములు మాత్రము కనిపెట్టి యక్కజపడుచు వచ్చెను. అతనికి విశేష లోకానుభవమే యున్నపక్షమున నీ యుత్సాహము కలకత్తా నగరమందేగాక ప్రపంచమునం బ్రతిస్థలమునందుండు ననియు, జ్ఞానవంతులుఁ బ్రశాంతులు పరోపకారార్థము తనవలెనే జీవింపఁ దలఁచువారు పందెపు పరుగులవంటి యీ యాశల పొంతం బోవరనియుఁ దెలిసికొని యుండును.

ఎప్పటివలెనే జూనుసెలలో వర్షములుకురియ నారంభించెను. ప్రపంచమునందలి యితరదేశము లందువలెనే హిందూదేశమునందుఁగూడ గాలిమార్పులు విలక్షణముగ గన్పట్టుచుండును. శీతకాలమందు, అనఁగా నవంబరునెల మొదలు ఫిబ్రవరినెల వఱకు నాకాశము నీలమై మంచుకురిసెడు చలిగాలితో నిండియుండును. ఆకాలమున గోధుమలు మొదలగు ధాన్యములు పండును. పండుగులు వ్రతములు నోములు తీర్థయాత్రలుఁ జేసికొనుచు జనులు తీరి మహానందభరితులై యుందురు. సాధారణముగా మార్చి నెలలో వేసవికాల మారంభమగును. పశ్చిమోత్తర గ్రామములందు వీఁచు వేఁడిగాలుపులు భూములార్చివేయును. నానాఁటికి సూర్యుడు మంటలం గ్రక్కువట్లు తీక్ష్ణుఁడై గ్రామంబులఁ బట్టణంబులఁ దహతహ నొందఁజేయును. పడమటిభాగముల నున్న యెడారులనుండి వేఁడి

గాడ్పులు వీచి శరీరంబుల శోషింపఁజేసి జంతువులను వడపీనుఁగులనుఁ జేయును. కూలివాండ్రలసి పోవుదురు. దుకాణదారులు కునికిపాట్లు పడుచుందురు. పంటకాఁపులు వెచ్చనూర్పు చుందురు. సూర్యుఁడు సహస్రకిరణములతో దేశములు దగ్ధము సేయునట్లుండు కాలమున జంతుజాలమెల్ల చైతన్యము దక్కినట్లుండును. బంగాళాదేశమందు వేడిమిక్కుటమే కాని తేమ యెక్కువగ నుండుటచే నా వేఁడియే మిక్కిలి బాధకరముగ నుండును. జూను నెలలో వానలు కురియఁగానే దేశము చల్లఁబడును. ఈ వర్షములు సుమారమి నాలుగు నెలలవఱకు ననఁగా కార్తిక మాసమువఱకు కుంభవృష్టిగ కురియును. ఈ వర్షములచేత బంగాళాదేశమందు వేలకొలఁది మైళ్ళ నేల జలప్రళయమువం దున్నట్లుండును. పల్లెలు సముద్రమధ్యమందలి దీవులవలె కానబడుచుండును. చెఱువులు మడుగులు సొన్నలు జలపూరితము లగును. నదులు గట్లమీఁదనుండి పొరలి ప్రవహించును. ప్రతి గ్రామమునందు నీడ నొసంగెడి చెట్లతోఁపులు దట్టముగనుండును. వరిచేలు విశాలములగు మైదానములమీఁద మొదట నాకుపచ్చగాను, పండిన పిదప బంగారు పోతబోసినట్లు పచ్చగాను దర్శనీయములై పంటకాఁపుల నానందవార్ధి నోలలాడించును వానలు పట్టణవాసులకు విశేషసౌఖ్యకరములు కవు. కావున మేఘచ్ఛన్నమై నల్లనైన యాకాశమువలెనే హేమచంద్రుని హృదయము విషాదపూరితమై యుండెను. తొలుత భయపడినట్లె యా రాజధానిలోఁ దగిన యుద్యోగము సంపాదించుకొన వలయునని యతఁడు చేసిన ప్రయత్నములు నిష్ఫలములయ్యెను. జీవనాధారములు దొరకక గిజగిజ తన్నుకొనుచు సర్వప్రయత్నములం జేయుచు నొండొరులం గెంటికొనుచు నానా శ్రమలంబడుచుండు జనులమధ్య తన మొగము జూచువారు తనకుఁ దోడ్పడువారు దొరకరని యతఁడు నిరాశఁ జెందెను.

అతఁడు పట్టణమునఁ జూడవలసినవారిం జూచి చేయఁదగు ప్రయత్నము చేసి గృహమునకు వచ్చునప్పటికిఁ బ్రేమపతివ్రతయు సాహసశీలయు నగు బిందు భర్తనిమిత్త మేదో మంచివస్తువుచేసి యుంచును. చెఱకుముక్కలు పుచ్చకాయబద్దలు ఊరవేసిన యుసిరికాయలు నిమ్మపండ్లరసముఁ జక్కెరయు కలిపిన చల్లని నీరు సిద్ధముచేసి బిందు మగనికి వేసవికాలశ్రమ దీర్చుచుండును. అవి త్రాగి సేదదేఱి హేమచంద్రుఁడు మనోవిషాదమెల్లఁ దొలగించెడు బిందు సంభాషణలను విని సకలవ్యధలను భాగములను మఱచిపోవును. సాయంకాలమైనతోడనే బిందు తన యిద్దఱిబిడ్డలం దీసికొని డాబామీఁదికి బోయి భర్త సమీపమునం గూర్చుండి తన ముద్దుమాటలం దలపెట్టి ప్రశాంతమైన యా గ్రామమునకును మనుష్యులగుంపుల నెడు మహాతరంగములతో నిండియున్న

యీ పట్టణ మహాసముద్రమునకునుగల భేదముఁ జెప్పుచు నాతని వినోదపెట్టుచుండును. ఆమె తన యూరనున్నప్పటికంటెఁ గొంచెము చిక్కెను. కలకత్తాలో నెల్లప్పుడు గాలి లేని గదులలో నివసించుటచేత మొగము వివర్ణమై వికాసశూన్య మయ్యెను.

పరమమిత్రుఁడగు శరచ్చంద్రుఁడు మాత్రము ప్రతిసాయంకాలము వారినిఁ దప్పక చూడవచ్చును. అతఁడు రాఁగానే బిందు వంటయిల్లు విడిచి యాముదపు దీపము వెలిగించి చాపపఱచి యొకకడఁ గూర్చుండును. శరచ్చంద్రుఁడు హేమచంద్రుఁడు సుధాబిందులం గలసి యిష్టగోష్టితో సాయంకాలము సుఖముగా గడుపుచుండును. శరచ్చంద్రుఁడు చాకచక్య మధికముగఁ గలవాఁడు కాలేజీలో నేర్పబడి విద్యార్థుల మనస్సుల మీఁద ముద్రితములైనట్లు నాటుకొను ప్రకృతిశాస్త్రములు దేశచరిత్రములు మొదలగు నాంగ్లేయ విద్యలం గూర్చి యతఁడు విసుఁగు విరామము లేక వారితోఁ జెప్పుచుండును. అప్పుడప్పుడు కలకత్తా నగరముయొక్క సంపదలు దారిద్ర్యములు మహాసౌఖ్యములు దుఃఖములు వర్ణించి చమత్కారముగ నుపన్యసించుచుండును అందు ముఖ్యముగ దన దేశస్థులైన మహనీయులు లోకోపకారార్థమై పడెడుపాటులం గూర్చి యుపన్యసించునపు డతఁడు కంఠమెత్తి తీవ్రమైన పలుకులం బలుకుచుండును. ఆ లోకోపకారులలో ముఖ్యముగ నేమహనీయుఁడు సంఘసంస్కరణమునకు బంగాళాభాషాభివృద్ధికిఁ దనజీవితము ధారవోసెనో యావిద్యాసాగరుఁ, తన్మిత్రమే శరీరసౌఖ్యము గోలుపోయి ప్రాణము లర్పించిన యక్షయకుమారునిఁ బలుమఱులు ప్రశంసించుచుండును. బంగాళాదేశమందు శ్రీ రాజారామమోహన రాయలువలెనే యుత్సాహింపుస్థావమంగు బరిశుద్ధాస్తిక మతముం బోధించిన శ్రీదయానంద సరస్వతిం గూడ శ్లాఘించుచుండును. బంగాళాభాషలో ననేక చిత్రవచన కావ్యములు వ్రాసిన బంకించంద్ర చటర్జియు నగ్ర్యమైన కవిత్వముఁ జెప్పిన మధుసూదనదత్తు విద్యావిషయమున జనులకు గ్రొత్తక్రొత్త త్రోవలు గొలిపిన మెచ్చుచుండును. మఱియుఁ బ్రపంచము నందలి యితర భాగములలో బ్రిటిషు వారి పాలనక్రింద నున్న జనుల కేస్వాతంత్ర్యములు గలవో యవియే మనదేశస్థులకు గూడ సంపాదింపఁ జాల బ్రయత్నించిన రామగోపాలుఁడు హరిశ్చంద్ర ముఖర్జీ సుస్వదేశీయు లని భాషించుచుండును. శరచ్చంద్రుఁడు వెనుకటి మహనీయుల ప్రశంసతో దనివినొందక పూర్వులమార్గమునే యనుసరించి దొరతనమువారి కొలువుకూటములలో హిందూదేశస్థుల యభిప్రాయములు గూడ నెఱింగించి స్వాతంత్ర్యముల సంపాదింపఁ దలంచు నాటి సత్పురుషులం గూర్చియు నెడనెడఁ జెప్పుచుండును. అప్పటికిగవర్నరు జనరలుగా రైన

రైపను ప్రభువుగారు దేశపరిపాలనమందు హిందువుల యాలోచనమును సహాయమును స్వీకరించినందు కాయనను బలువిధముల బలుమాఱు కొనియాడుచుండును. శరచ్చంద్రుని యుపన్యాసములను హేమాఁడు తమ్మునిమాటల కెలరు నన్నవలెనే విని సంతసిల్లుచుండును. చిన్నప్పుడు తాళ్ళచెఱువు గ్రామమున మామిడికాయలు జామపండ్లు దొంగిలించిన కుఱ్ఱఁడగు శరచ్చంద్రుఁడు కలకత్తాలో బహువిద్యల నేర్చి యింతవాఁడైనాఁడని పక్షపాతము గదుర, తోబుట్టువట్టు వాతని ప్రజ్ఞకు మెచ్చి ఓందు సంతసించుచుండును. మక మకలాడుచున్న చిన్న దీపము గల యాగదిలో శరచ్చంద్రుని యుపన్యాసములను బిందు హేమచంద్రునే గాక మఱియొకతెగూడ వినుచుండును. వికాసవంతమైన శరచ్చంద్రుని మొగము కనఁబడిన తోడనే సుధ నిద్రాహారములు మఱచి యొకమూల కూర్చుండి యాతని పలుకులే వినుచు నాతనివంకనే చూచుచుండును. దేశసేవలఁజేసెడు లోకోపకారులను మెచ్చుకొనుచు వారివలెనే తన జీవితముంగూడఁ బరోపకారార్థము, గడుప దలంచినట్లు పలికెను శరచ్చంద్రుని మృదుమధుర సంభాషణలను సుధ విని సంగీతము విన్నంత హాయిఁజెంది పరవశ యగుచుండును.

శరచ్చంద్రుఁడు మేటిరేని తన యుపన్యాసముల సందడి ఇడి యొకప్పుడు చదురంతయుఁ గాలి దీప మాఱిపోవువఱకు రమారమి రెండుజాములరాత్రి వఱకు వారి కడనుండి విధిలేక వారివద్ద సెలవుపుచ్చుకొని యెన్నో క్షమార్పణలు చెప్పి బయలుదేఱి నక్షత్రకాంతులు మాత్రమే గల యా నిశీథసమయమున నిశ్శబ్దములగు పురవీధులంబడి తనయింటికిం బోవుచుండును. అప్పుడు హేమచంద్రులు చాలసేపగుటచేతఁ జల్లబడి బిరుసెక్కిన యన్నముఁ దిని పండుకొందురు. సుధ మద్యమువలె పారవశ్యము నొందించు మహానందములో నిద్రించును. నిద్రాసమయములోఁ గూడ నిశ్శబ్దమైన తక్కిన రెండు జాములలో నామె చెవులలో మనోహరుఁడైన యొకానొక పురుషుని శ్రావ్య కంఠధ్వని అమృతబిందువులవలె పడుచుండును.

తొమ్మిదవ ప్రకరణము

కాలము గడచిన కొలఁది శరచ్చంద్రునకు నూతనచైతన్యము గలిగినట్లుండెను. విద్యాభ్యాసము నిమిత్తము పల్లెటూళ్ళనుండి పోయి కలకత్తా మొదలగు పట్టణములలో

నుండెను బాలుర మనోల్లాసము లేక యింటిలో విసుగుతో జీవితము గడుపవల[illegible] ఇంగ్లాండులో నున్నట్లు హిందూదేశములో విద్యార్థులకు విద్యాభ్యాసించు కళాశాల[illegible] బసలుండవు గావున చిన్నతనమునుండి తల్లిదండ్రులకు [illegible] దూరులై విద్యార్థులు గృహసంబంధమైన సౌఖ్యము గాని, కుటుంబములతో కలిసి యుండుటవలన జరుగు[illegible] లాభములను గాని పొందక బడివిడిచి పెట్టగానే సాయంకాలమున గోడుచెందుచు [illegible] ఆడిరో కసరతు చేసిరో బసకుఁబోయి సంవత్సరాంతమునందు రాబోవు పరీక్షకు జరుపుచుందురు. ఆపరీక్షలో విజయము కలుగుటయే జీవనముయొక్క భవిష్యన్నా[illegible] నకు నాధారమై యుండెను. హిందూదేశములో, విద్యార్థులకు నుపాధ్యాయులకు కళా శాలలలోనే కాని యింటివద్ద సంబంధముండదు. పెద్దలు విద్యార్థుల ప్రవర్తనముల [illegible] వారినడతను దిద్దుట కవకాశముండదు. గురుశిష్యుల కన్యోన్య ప్రేమ యల్పము. [illegible] బాలురు కలసి మెలసి చర్చలు చేయుటకు గాని యాటలవినోదములం[illegible] టకు గాని తగిన సంఘములు లేవు. ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాల[illegible] కలిసికొని పాఠములు చెప్పుదురు, అనంతరం మావిద్యార్థులను పెనుగోడవలె గల బజా[illegible] వీధినో, జన బాహుళ్యము లేని సందుగొందులలో యుండు తమ బసలకుఁ బోయి రాత్రి ప్రొద్దుపోవువరకును దెల్లవారు జామునను శ్రమపడి చదివి భవిష్యత్స్వర్గ సాధనమైన పరీక్షయందు దాటివేయుటకు దమశక్తిని కాలమును వినియోగింతురు. దుస్సహమైన యీ విద్యాపరిశ్రమచే ననేకులు పసుపుతనమందే కాలధర్మము నొందుచుందురు. అనే కులు బ్రతికియుండి పరీక్షలయందుఁ గృతార్థులై జీవచ్ఛవంబుల వలె దొరతనమువారి కొలువులోనే చిన్నయుద్యోగమో సంపాదించు కొందురు. బలిష్ఠమైన ప్రవర్తనము ప్రోన్నతమైన బుద్ధి గలకొందఱు దుస్సహములైన యీబాధలలో నడఁగిపోక యీకఠిన జీవనములోనే యుత్తమమైన మార్గము వెదకికొని యుత్సాహ పూరితులై యాదర్శ స్థితులలోనే గొప్పయూహలను హృదయమున నంకురింపఁ జేసికొని పెద్దలై సంసార యాత్రలోఁ బ్రవేశించిన పిదప దమకాలము శరీరము దేశమునిమిత్త ముపయోగింతురు. అట్టి మహనీయులు వృతజీవులై దేశ చరిత్రమందు గనఁబడు చున్నారు.

శరచ్చంద్రుడు పట్టణములో నేకాంత జీవనముచేత ననేకులవలె బలహీనుఁడుగాక దేహదార్ఢ్యము మనోదార్ఢ్యముగలవాఁడై బాగుపడెను. కాని తఱచుగా నెవ్వరితో మాటలాడుట కిష్టములేక యేదోయాలోచించువాఁడు పోలెఁ జూచువారల కగపడు చుండును. తాళ్ళచెఱువుగ్రామమునుండి బంగువిరోగియై వచ్చిన యీపడుచువాని కంటె

కలకత్తా నగరములో నున్న విద్యార్థు లెవ్వరు నెక్కువ పరిశ్రమఁ జేసియుండరు. ఈతని వలె నుల్లాసము లేనివాఁడు నుండరు. విచారమే యాతని స్వభావమున కచ్చముగ సరిపోయి నట్లుండును. సాయంకాలమునఁ దోడి విద్యార్థులు షికారునకుఁ బోవుచున్నప్పుడు నయిత మితఁడిట్లు కదలక దీపములు పెట్టకమునుపు కనుచీఁకటి వ్యాపించుచుండఁగ దనచీఁకటి గదిలో నిట్టటు పచారులు చేయుచు నాంగ్లేయమహాకవులలోఁ దనకిష్టుడైన సత్కవి గ్రంథమునుండి యావేశము దెప్పించునట్టి పంక్తులను గొన్నిటిని గట్టిగ వల్లించుకొను చుండును. ఇట్లు శరచ్చంద్రుఁడు తన హాస్యమునను మనోవ్యథలను లోలోనఁ దాఁచి కొనుచు దాను వేరొక ప్రపంచమున నున్నట్లు జీవించుచుఁ గష్టపడి విద్యాభ్యాసము చేయుచుండెను. చిరకాలవియోగ మైనపిదప వదినెయు నొకసారి చిన్నతనమునందున్నట్లు సుధాబిందు హేమచంద్రులం గలిసియుండెడి భాగ్య మొదవినందుచే శరచ్చంద్రుని జీవనమునకు నూతనతేజము కలిగెను. అతని యుపాధ్యాయులలో నొకమార్పు గలిగెను. చక్కని జవరాలి విలాస మేలుకొలిపిన యుచ్చైస్సులోలోనఁ దగ యున్నదృఢానురాగముగల మనుష్యుని మనసుమీఁద నంటేసిన ప్రీతిమనుష్యుని మనస్సుమీఁద బలిచేయును. స్త్రీజనస్వభావమైన దయతోఁ బలికిన యొక్కమాట యతని హృదయమును మలచును. స్త్రీసామాన్య లక్షణములు నొక్క యాఁడుదాన యతని నాంఛిత పావనుంజేయును. బిందు యొక్క సాధుస్వభావము నామె యాదరము నామె కాతనియందు నాతనిగుణముల యందుఁగల మంచి యభిప్రాయము శరచ్చంద్రునకు కడుపు గన్నఁ దేయాఁడు దానియందు గుణుని గౌరవ మామెయందుఁ గలిగించెను. ఆమె శాంతస్వభావము వానిమనస్సున కొక క్రొత్తవికాసము కలిగించెను. వదినయందలి నానందనిలయమగు నామెగృహము శరచ్చంద్రుని మనసు నాకర్షించెను. ఇట్లనేక మాసము లతఁడీ క్రొత్త యానంద ప్రపంచమున బ్రొద్దులు గడపఁజొచ్చెను. జన్మమెత్తిన తరువాత నతఁడు యోగ్యురాలగు స్త్రీయాదరణ మనిమొదు నెరిఁగె కాఁగుట నిదియే ప్రథమము. హేమచంద్రునకు. కలకత్తా నగరము క్రొత్తతావగుటచేఁ దనయుమాలించు నెప్పుడు శరచ్చంద్రుని తానును గిడు నలరివాసిం దమ్మునికరణి నాదరించుచెచ్చెను. సుధయు నక్కయుతో నిలువున్నప్పుడు నింటికి వచ్చినప్పుడెల్ల నప్పబాపలుం బోలె శరచ్చంద్రుని నాదరించు చుండును.

ఇట్లు లప్రయత్నముగనే సుధమీఁద మృదువైన యనురాగ మాతని హృదయమునం బ్రవేశించెను. ప్రభాతకాలమున నతఁడు గదిలో చదువు నిమిత్తము కూర్చుండు నప్పు డామె సుందర విగ్రహము వానికన్నులయెదుట నిలువఁబడినట్లు

కానబడుచుండును. పుస్తకములమీద ధ్యానము లేనప్పుడామెమీదఁ ధ్యానము నిలుపుచు వచ్చెను. మనోహరములుగ నుండిన ప్రాచీనదేశచరిత్రముల, వంతకంటె రుచిలేని యీకాలతత్త్వశాస్త్రములను జదువ నతఁడు ప్రయత్నించునపుడు మనసు వాటిమీఁద కరుగదయ్యెను. పులకాంకురములు మేనంతయుఁ బొడమఁజొచ్చె. కాలేజి యావరణములో నతఁడొంటిగఁ దిరుగునప్పుడు చెవిలో మృదువైనస్వరము లాతనికి వినఁబడజొచ్చెను. తన మనోరథంబులకుఁ దన యనురాగంబులకు నిలయమైన యాగృహమునకు ప్రతిసాయంకాల మతఁడు పోవుచుండ వాగింజూడ వలయునను కోరికగాక యంతకంటె నెక్కువదేదో యాతనిని ముందుకు గెంటజొచ్చెను. స్వసౌఖ్యప్రదమగు రహస్యాభిలాషను దీర్చుకొన వలయునని మనమేదో పనిఁజేయునప్పుడు నయితము దానిని మఱచిపోయి, పరోపకారము నిమిత్తమే పాటుబడుచున్నట్లు మన మప్పుడప్పుడు తలంచుకొనుచుందుముగదా! అందుచేతనే ప్రతిదినము సాయంకాలము చదువు గట్టిపెట్టి ప్రియాజనదర్శనము చేయఁదలఁచి శరచ్చంద్రుడు [illegible] గృహమునకుఁ బోవునప్పుడెల్ల క్రొత్తపట్టణములో నెవ్వరి నెఱుఁగక నొంటిగనున్న తన [illegible]వారి కుపకారము సేయ బోయినట్లే భావించుకొనుచుండును. ఆ గృహంబునుండి యర్ధరాత్రమున నిర్మనుష్యములగు వీధులలో నడిచి యింటికి బసకుఁ బోవునపుడు తనసహాయము నపేక్షించిన చుట్టాల నిమిత్తము తాను చదువైన మానుకొని వెళ్ళినట్లతని మనస్సు సంతుష్టిఁ జెంది సంతోషముఁ జెందుచుండును.

ఒకనాఁడు శరచ్చంద్రుఁడు సాయంకాలమున మిత్రగృహమునకుఁ బోయినప్పుడు హేమచంద్రుఁ డప్పటి కింటికి రాలేదు. బిందు వంటయింట బనిఁజేసికొనుచుండెను. సుధ డాబామీఁద శరచ్చంద్రుని సమీపమునఁ గూర్చుండెను. అప్పుడు నల్లని యాకాశమండలమున నక్షత్రములు వజ్రములవలె వెలుఁగుచుండెను. మలయమారుతములు చెట్ల కొమ్మలం గదల్చుచు [illegible] వారికి చల్లగాలి యెంతో సౌఖ్యప్రద[illegible] [illegible] దాఁగకొనునో [illegible] సూక్ష్మ[illegible] [illegible] యా [illegible] సుధ [illegible] [illegible]ముతో జూచుచుండెను. ఆ త్తరి చంద్రబింబమువలె వెలుఁగుచున్న సుధ ముఖారవిందముఁజూడ శరచ్చంద్రునకు వలపుకైపులు తలకెక్కెను. అదివఱకు పలుమాఱులు తేజోరాసులగు నక్షత్రముల కాంతిగూర్చి వారిరువురు ముచ్చటించిరి. శరచ్చంద్రు డదివఱ కెన్నోసారులు

గ్రహరాజగు సూర్యునిచుట్టుఁ దిరుగుచు గగనమండలమును తేజోవంతముగఁజేయు గ్రహముల నామధేయముల నామెకుఁజెప్పి మూఁడువేల సంవత్సరముల క్రిందటనే మన పూర్వ జ్యోతిశ్శాస్త్రద్రష్టలీ గ్రహసంచారమును మిక్కిలి నేర్పుతోఁ గనిపెట్టిరని బోధించుచు వచ్చెను. మఱియు నక్షత్రము లనంతకోటు లనియు మనకన్నులకుఁ గనఁబడునవిగాక కానఁబడనివి కోటానుకోటు లున్నవనియు దక్షిణదిక్కునుండి యుత్తరదిక్కునకు వ్యాపించి మనకన్నులకుఁ దెల్లఁగ నగపడు రేఖనే మన పెద్ద లాకాశగంగయని చెప్పుదురనియు బలుమాఱు చెప్పి జ్యోతిశ్శాస్త్ర సంబంధములైన మన పూర్వగాథల ననేకముల నెఱిఁగించుచు వచ్చెను. మఱియు సర్వనియామకుఁడగు భగవంతుని శాసనంబునఁ దమతమ కక్ష్యలలో నించుకేనియుఁ గ్రమము తప్పక సంచారములు చేయు ననంతగ్రహములంగూర్చి యుపన్యసించి యా గ్రహములలో చిత్రవిచిత్రములగు జంతుకోటు లున్నవనియు లేవనియుఁ బండితులు సేయు వాదములఁగూర్చి ప్రసంగించి జ్యోతిశ్శాస్త్రవిషయమునఁ జాల జ్ఞానమును గలిగించెను. ఈ యుపన్యాసమువలన సుధ క్రొత్త ప్రపంచముఁ జూచినట్లు సంతసించెను. నక్షత్రములంగూర్చి క్రొత్తకథ లనేకములు నేర్చికొనెను. ఈ జ్ఞానముఁ గలిగించిన జ్ఞాననిధానమైన బాలకునియందు మునుపటికంటె నెక్కువ ప్రేమము గలిగెను. అట్లు కొంతసేపు చుక్కలవంకఁజూచి యామె సంతసించి "ఈ రాత్రి నీవు నక్షత్రముల గుఱించి చెప్పవలెనేమి? వాటి గూర్చి నీవు చెప్పుచుండఁగా నాకు వినవలెనని యున్న"దని శాస్త్రిగారిని బలుకరించెను. శాస్త్రప్రియుఁడు కలగనుచు నేలొక్కన్న నావిధమునఁ దేనిఁ జెప్పికొని చుక్కల నెంతగున మెఱయుచున్న సుధ నేత్రములవంక జూచి నేనేనే నక్షత్రముల గూర్చి యాలోచించుటలేదని బదులు చెప్పెను. అనవుడు సుధ తన సహజమైన మందహాసముతో "అట్లయిన నీవు దేని గూర్చి యాలోచించుచున్నా"వని యడిగెను "నేనా! ఈ ప్రపంచమును గురించి యింటిలో నా కుటుంబమును గురించి యాలోచించుచున్నా"నని బదులు చెప్పెను. "కుటుంబమును గూర్చి నీవాలోచింప వలసిన దేమున్నది; తల్లి, అప్పగారు కావలసినంత మంది బంధువులు నీ కున్నారు. మీయూరిలో నీకు మంచి యిల్లున్న"దని సుధ నుడివెను. "మాయూరు నాకు మిక్కిలి ప్రియమైనదే కాని యెందరున్నను నాదింకను సంపూర్ణమైన కుటుంబము కాదు గదా? అప్పలు చెల్లెండ్రు తల్లిదండ్రులు మొదలగు చుట్టములవలనఁ గలిగెడు సౌఖ్యముగాక మనుష్యున కితరసౌఖ్యములు గూడ కలవుగదా" యనెను. అనఁగానే సుధ క్షణమూరకుండి యతఁ డేవిషయమును మాటలాడుచున్నాఁడో యని తెలిసికొనలేక ననుమానములేని మనస్సుతో "నీవన్నది నాకుఁ దెలిసినదిలే, నీవు మంచి

యదృష్టవంతుఁడవు. నీకు మంచి కుటుంబసౌఖ్యమే కలుగును. నీకు త్వరలోనే పెండ్లి యగును. నీ పెండ్లామంత యదృష్టవంతురా లెవ్వతెయు నుండదు. నీ పెండ్లియైన తరువాత మేమందరము మీయింటికి వచ్చి నీ పెండ్లామును జూచుచుందు" మని సుధ మాఱు పలికెను. అనవుడు సుధ పలికిన పలుకులకుఁ దగిన యుత్తరము తనమనంబున దోపమి శరచ్చంద్రుఁడు మూఁగ మువ్వలపక్కకుం ద్రిప్పి త చేతిలో నామెచేయిం బట్టుకొనెను. అప్పటికిని సుధ యాతని మనోభావము గ్రహింపలేక "యేమోయి! నీ చేతులు చల్లగ నున్నవేమి. మాటాడవేమి? నామీఁద కోపము వచ్చినదా యేమి. లేక నాకుఁ జెప్పఁగూడదని దీర్ఘాలోచన యేమైన నున్నదా" యని ప్రశ్నవైచెను. వైచుటయుఁ జిరకాలమునుండి మనంబున నణఁగియుండిన యభిలాష పొంగిపొరల నేదోయొకమాట యనదలచి, "అందునా మానుదునా" అని యతఁడు కలవరము పడఁజొచ్చెను. ఎట్టకేలకు మాటయు నోటి చివరకు వచ్చెను. కాని కాలము స్థలము వానిమీఁద శత్రుభావము వహించెను. అంతలో డాబా మెట్లమీఁద నడుగులచప్పుడు వినబడెను.

హేమచంద్రుఁ డింటికిఁ బ్రొద్దుపోయివచ్చి బిందుందోడ్కొని డాబామీఁదికి వచ్చెను. బిందు సుధాశరచ్చంద్రులఁజూచి మగనితో "చూడండీ! యీకుఱ్ఱవాండ్రు. ఈ నక్షత్రముల గొడవలోఁబడి యన్నముగూడ మఱచిపోయినా"రని పలికెను. ఆ దంపతులు మెట్లెక్కి వచ్చుచున్న జాడ గనిపెట్టి శరచ్చంద్రుఁడు దొంగవలె సుధాసమీపము విడిచి డాబాచివరకు బోయి యేమియు నెఱుఁగనివానివలె నక్షత్రములు జూడ నారంభించెను. అతని గుండెలు తటతట గొట్టుకొనెను. అతని కాళ్ళు వణకసాగెను. అప్పుడతడు మనసులో "అమ్మయ్యా! దేవునిదయవల్ల నోటిచివరకు వచ్చినమాట జారవిడువలేదు నయమే; భగవదనుగ్రహమువలన పరువు దక్కినది కాని లేకున్న కొంప త్రవ్వుకొని పోవును. నమ్మి చనువిచ్చినవారియింట నేను ద్రోహము దలపకుండ దైవము కాపాడె" నని తలంచి తనకీయాపద గడువంబెట్టినందుకు భగవంతుని నొక్కనిముసము ప్రార్థించి మనస్సు కుదురు పరచుకొని బిందుకడకువచ్చి యామెతో మెల్లగ నిట్లు మాటాడెను.

'బిందు వదినె! ఔను. నీవన్నట్లు నక్షత్రములవంక జూచుచు నింక నపకరవక ప్రసంగముల జేయుచు తిండి మఱచిపోయి కాలము వృథాగ పాడుచేయుచున్నాము. ఇఁకనైన జాగ్రత్తగ నుండవలయును. పరీక్ష దగ్గరకు వచ్చుచున్నది. పరీక్షలో నెగ్గవలెనన్న గట్టిగాఁ గృషిచేయవలెను. మీకీయిల్లు ప్రస్తుతము సుఖముగ నున్నదిగదా! మీకేమైన సదుపాయములు కావలసివచ్చినప్పుడు మీరు నాతోఁ జెప్పండి. ఇఁక మేము

మునుపటివలె ప్రతి సాయంకాలమును, బహుశః వారమున కొకసారియైన నచ్చుటకు వీలుండదు' అనవుడు హేమచంద్రుడిట్లనియె. 'అది మంచిపని. నీకాలము మామూలమున వృథయైపోవుచున్నదని మేము తలంచుచుగా ననుకొని భయపడుచున్నాము. మాకేమి కావలసినను దప్పక నీకు వర్తమాన మంపుదుము. మాకు నీవు చేయదగినపని యేమున్నను నీసహాయము తప్పక పొందుదుము. మేము మరియొకలాగున ననుకొందుమని తలంపకు. మన మన్నదమ్ములవంటి వాళ్ళమే! పరీక్షకు మాత్రము గట్టిగా జదువుము. నీవు ముందు ముందు వృద్ధి కాగలవాడవు. నీపనిమాత్రము మానుకొనవద్దు. తనకుమాలినధర్మము కలదా!' అనిన తత్క్షణమే వారు విడిపోయిరి. శరచ్చంద్రుడు సుధవంక మఱియొకమాఱు చూచి మాఱుమియుం బలుకక వీధిలోనికిం బోయి చీకటి యను మహాసముద్రమునబడి బసకు బోవజొచ్చెను. అతడు మెట్లదిగి వెళ్ళినతోడనే 'అక్కయ్యా! శరచ్చంద్రునకు మనమీద నెందుకైన కోపము రాలేదుకదా!' యని వ్యాకులచిత్తముతోం బలికెను. పలుకుటయు బిందు 'ఆబ్బె! కోపమెందుకు? అతడు తనపరీక్ష యేమగునోయని బెంగం బెట్టుకొన్నా' డని బదులు చెప్పెను. అనంతర మొకగంట తరువాత హేమచంద్రుడు భోజనముజేసి తన యొప్పటివాడుకచొప్పున వీధిలోనికి షికారుబోయెను; సుధాబిందులు నిద్రపోయిరి. అప్పటికి జంద్రోదయ మయ్యెను. వెన్నెలతో నిండిన వీధులు కలకల నవ్వుచున్నట్లుండెను. హేముడు తనలో దానేదో యాలోచించుకొనుచు సుమారమి యొక గంటసేపు తిరిగెను.

కలకత్తాలో నిశ్శబ్దములైన వీథులన్నియు జంద్రోదయమున దీపితములయ్యెను. హేముడు భవానీపురము దాటి, చాలదూరముపోయి బాలిగంజియను పేటప్రవేశించు నప్పటి కొక గుఱ్ఱపుబండి చప్పుడువలన నతని యాలోచన కంతరాయము గలిగెను. అప్పుడతడు వెనుకకు దిరిగి చూడ ధగధగ మెఱయుచున్న జోడుదీపములు గల తెల్లని జోడుగుఱ్ఱములబండి యొకటి వాని కగపడెను. హేముడు ప్రక్క కొత్తిగిలి నిలువంబడెను. ఆబండి యాతని ప్రక్కనుండి వేగముగం బోయి మంచిదీపములచేత నలంకృతంబై తోటనడుమ నున్న యొక గృహమువద్ద నిలిచెను. ఆబండియాగిన క్షణమునకు నల్లగుఱ్ఱములు గల మఱియొకబండి వచ్చి యాదారినే పోయియాతోటనే ప్రవేశించెను. ఆబండి నడుచుచుండంగా హేమచంద్రునకు లోపల కూర్చుండిన స్త్రీలనవ్వులు వినంబడెను. అది యేమో తెలిసికొనంగోరి యాతండాతోటద్వారముకడకుం బోవ నక్కడ గుమ్మము ముందఱ నిట్టట్టు జరుగుచున్న దీర్ఘకృష్ణకాయుండగు మనుష్యుండొకండు కనంబడెను. లోపల నడుచుటకుం జక్కగం దీర్పబడిన బాటను గలిగి నానావిధములగు మొక్కలుగలిగి

యక్కడక్కడ స్ఫటికవిగ్రహములు కలిగి చిత్రచిత్రముగ నీటిం బయికి వెదజల్లు ధారాయంత్రములు గలిగి యతిమనోహరమగు నొక యుద్యానవనము కనంబడెను. అందందు భవనములలో వెలిగించిన దీపముల కాంతి ప్రతిగవాక్షమునుండి మంటలట్లు గనంబడుచుండెను. అవి యన్నియుం జూచి హేముఁడు మెల్లఁగాను వినయముగాను దర్వాకాజీ! యీతోఁట యెవరిదని యడిగెను. ఆ ద్వారపాలకుఁడు చేతిలో గడ్డము మీసముసవరించుకొని యిట్లుత్తరము చెప్పెను. "అయ్యా! ఈతోఁట, యిల్లు నెవరివో యెఱుఁగవా! ఈపట్టణమునం దున్న గొప్ప వారందఱీతోఁట యిల్లెఱుఁగుదురు. అందఱు నిందు విందారగించిన వారె! నీవు క్రొత్తవాఁడ వని తోఁచుచున్నది" "అవును. నేనీమధ్యనే యిక్కడకు వచ్చినాను కాని యీవైపెప్పుడు రాలే" దని హేముఁడు బదులుచెప్పెను. "అంతే కావచ్చును. ఏమన నీచుట్టుపక్కల నున్న వారందఱు నీ యిల్లెఱుఁగుదురు. గొప్ప బిరుదులు పొందినవారు, జమీందారులు, ప్లీడరులు, వర్తకులు వేయేల? కలకత్తాలో నున్న గొప్పవారంద ఱీతోఁటలోనికి వచ్చి పోవుచుందు"రని ద్వారపాలకుఁ డుత్తరముఁ జెప్పెను. "నీవు చెప్పినది నిజమే. నేను పేదవాఁడ నగుటచేత నీయుద్యానవనము సంగతియు దీని యజమానుని సంగతియు నాకంతగాఁ దెలియదని హేముఁడు పలికెను. అనవుడు ద్వారపాలకుఁడు చిఱునవ్వు నవ్వి యొకవిధమైన ధీవితో "అవును. మా యజమానుఁడు మీవంటి బీదవానిని పిలుచునా? ఈరాత్రి మంచి మేజువాణీ యున్నది మా యజమానుని స్నేహితులందఱు వచ్చుచున్నారు. ఈ యూరినాటకశాలలో నాట్యమునకు మిక్కిలి ప్రసిద్ధికెక్కినదొకర్తుక యామేజువాణి జరుగుటకు వచ్చియును. కలకత్తాలోనున్న పెద్దమనుష్యులనేకులు దాని నగుమోము జూచిన మాత్రముననే తరింపఁ గలమని దానికొఱకే వత్తు"రని పలికెను. "ఈతోఁట యజమానుఁ డెవరో చెప్పవైతి" వని హేముఁడు వానిని మరల నడుగ నతఁడు నవ్వుచు నిట్లనియె. "ఓయి వెఱ్ఱివాఁడా! నీవు నిజముగ నెఱుఁగవె యెఱుఁగవా? ధనవుఁ జమీందారులైన ధనంజయ ప్రభువుగారిదీ తోఁట. ఈమాటలు వినఁగానే హేమచంద్రుఁడు పిడుగుపాటున నడలినట్లు భయపడి చప్పునప్పన వీధిప్రక్కనున్న యొక యరుఁగుమీఁద చతికిలఁబడి తల రెండుచేతులం బట్టుకొని కూర్చుండెను. అప్పు డతనికి నిమిషమొక యుగముపగిదిఁ దోఁచె. కన్నులనుండి వేఁడి బాష్పములు నేల తడుపఁ జొచ్చె. అప్పుడు కొండొక సేపునకు నిట్టూర్పు విడిచి యాతఁడు తనలో నిట్లనుకొనియెను "అయ్యో! ఈనూ! భాగ్యము మేడలు మిద్దెలు నల్లగుఱ్ఱములు తెల్లగుఱ్ఱములు సౌఖ్యము నీయజాలవు గదా? ఇంకవేళనే నీవెల్లప్పుడెంతో చిన్నబోయి మనసులో నేదో బాధపడుచున్నట్లు కనబడుచుందువు" అట్లు తలంచుచు హేమచంద్రుఁ

డరగంటసేపు నోటమాటరాక విచారించి యెట్టకేల కతఁడొక దృఢనిశ్చయముఁ జేసికొనెను. ధనంజయుఁడు వివాహమైనప్పటినుండి తాళ్ళచెఱువు గ్రామమునకు వచ్చుచు పోవుచుండుటఁ జేసి హేమచంద్రునకుఁ బరిచితుఁ డగుటయేగాక యాతనిమీఁద గౌరవము జూపుచువచ్చెను. అందుచేత నాతనికి మంచి సలహానిచ్చి దురాచారములనుండి యాతనిం ద్రిప్పఁ దలఁచెను. ఇట్లు చేయుట కారాత్రియే యాసందడిలోనే ధనంజయుఁ జూచి మాటాడుట మంచిదని హేముఁడు తలంచెను. తలంచి లేచి ద్వారముకడకుఁ బోవ, నీకేమి కావలయు నయ్యా! చాలాసేపటినుండి యేమి పనిపాటులు లేకుండా నీవీ చుట్టుప్రక్కలనే తిరుగుచున్నావని ద్వారపాలకుఁ డడిగెను. "నేను మీయజమానునిఁ జూడవలయును. లోనికి బోవచ్చునా?" యని హేముఁడు మరల నడిగెను. అప్పుడు ద్వారపాలకుఁ డిట్లనియెను. "ఈనాఁడు నిమ్మన్నను వీలుపడదని నేతలంచుచున్నాను. ఇటువంటి మహోత్సవ సమయములయందు మీవంటివారిని సాధారణముగ పిలువరు మీరు లోపలికిఁ బోవుట మాయజమానున కిష్టముండదు" అని హేముఁ డిట్లనియె. నాపేరు హేముఁడనియు నేను తాళ్ళచెఱువునుండి వచ్చితి ననియు మీయజమానునితో జెప్పుము. చెప్పగానే యాయన నాకు సెలవిచ్చును. అప్పలుకులకు ద్వారపాలకుఁ డిట్లు బదులు చెప్పెను. 'చాలమంది పల్లెటూళ్ళవారు తాళ్ళచెఱువునుండి నెల్లెచెఱువునుండి మాయజమానునిఁ జూడవచ్చుచుందురు. అలాంటివారిని జూచుట కాయన కిప్పుడు పట్టణములోఁ దీరుబడియే యుండదు' అని హేముఁ డీక్రింది తెలుఁగున వానికి బదులుచెప్పెను. 'దర్వాంజీ! మీయజమానుని యత్తవారు తాళ్ళచెఱువు. అందుచేత బాల్యమునుండి యెఱిగినవాఁడనగు నన్ను లోపలకు రానియ్యకపోఁడు' ఆమాటలు వినఁగానే ద్వారపాలకునకు కొంచెము జంకు పొడమ 'నీయనను లోపలకు పోనిత్తునా' యని తలంచి సందేహించి మరల తనలో 'ఈయన మాయమ్మగారి పుట్టినింటివంకవాఁడైన పక్షమున నీయన కవమానము జేసితినని మాయజమానుఁడు కోపింపవచ్చు' ననుకొని యాయనకొక కుర్చీనిచ్చి కూర్చుండబెట్టి యాయన రాక యజమానునకు దెలిగింప లోపలకుఁ బోయెను. హేముఁ డరగంట కని పెట్టుకొని యుండ నెట్టకేల కాపరిజనుఁడు వచ్చి "యజమానుని సెలవైనది. లోపలకు దయచేయుఁ" డని చెప్పి తాను ముందుముందు దారిచూపి విశాలములైన మెట్లమీఁదనుండి గొంపోయి మేడ యెక్కించి యొక గదిలోఁ బ్రవేశపెట్టెను.

ధనపూరు జమీందారునైన ధనేశ్వరకుటుంబము వారిలో ధనంజయుఁడే పెద్దవాఁడు. హేముఁడు లోపలి కరుగునప్పటి కతఁడు తన శృంగారపు సేవకాండ్రు పరివేష్టింప నొక

గదిలోఁ గుర్చీమీదఁ గూర్చుండెను. హిందువు లెంతభాగ్యవంతులైన నెంత దురాచారములలోఁబడి భ్రష్టులైనఁ దమచుట్టములను గౌరవించుట మాత్రము మఱవరు. ధనంజయుఁడు కుర్చీమీదనుండి లేచి తన భార్య పినతండ్రికూఁతురు మగఁడగు హేమచంద్రునిఁ బలుకరించి కుశల మడిగి అతలషుమెత్తలుగల కుర్చీమీఁద గూర్చుండబెట్టెను. తోడియల్లుఁడు చేసిన గౌరవమునకు హేముఁడు మిక్కిలి సంతసించి గదివైపుఁ జూచి యచట చేయబడిన యలంకారమును గని యద్భుతము నంది నిశ్చేష్టుడయ్యెను. అతఁడదివరకు కొన్నిసారులు వీధిలో నిలిచియుండి చౌరంగియను పేటలో నున్న దివ్యభవనముల వంటి దొరలమేడలు చూచెను మఱియు గవర్నరు జనరలుగారి మహామందిరముయొక్క సింహద్వారములను గూడ బలుమారు చూచెను. కాని సాహసించి యెన్నడు లోనంజేరలేదు. డాలహౌసీ చౌకులోను హైకోర్టు వీధిలోను మహాశోభతో దీర్చఁబడి యుండు నింగ్లీషువర్తకుల యంగళ్ళు (షాపులు) గూడ కొంత దవ్వునుండి పలుమాఱు తొంగితొంగి చూచెను. కాని జన్మమధ్యమం దెన్నఁడు ధనపుష్టపు జమీందారు తోఁటలోనున్న మందిరమువంటి రాజమందిరమును బ్రవేశించి యెఱుఁగఁడు.

ఆ జమీందారుని స్నేహితులలోఁ గొందఱు చమత్కార సంభాషణలకు దెలివితేటలకుఁ బేరువడిన వారదివరకే యక్కడకు వచ్చియుండిరి. ధనంజయుని కుడిప్రక్క చిఱునవ్వులు నవ్వుచు సుమతి యనునొక నవయౌవన ప్రాయుఁడు నల్లని యంచులు గల ధోవతిగట్టి యట్టియంచులే గల యుత్తరీయ మొకటి వల్లెవాటుగ వేసికొని కూర్చుండెను. ఈయన కేయుద్యోగము లేదు. ఈయన కలకత్తాలో గొప్పబిరుదులు కలవారియొక్కయు భాగ్యవంతుల యొక్కయు నండను నంటిపెట్టుకొని తిరుగు చుండును. ఈతఁడు తేనెటీగవలె భాగ్యవంతుల గృహములనుండి ధనము స్వీకరించి తేనె పట్టువంటి తన యిల్లు నిండ వేసికొనును. ఈయన జోడుగుఱ్ఱపుబండి పురజనుల కందఱకు నానవాలే. ఈయన తనఖా దస్తావేజులు వ్రాయించుకొనియు, ప్రామిస్సరీ నోట్లు వ్రాయించుకొనియు సాధారణముగ వడ్డీ కప్పులిచ్చి ముఖ్యముగ ముందుముందు జమీందారులు కావలసిన మైనర్లకు సలహాలు చెప్పి వారికెంతో యాప్తుడై యుండునని యాయనం జూచినతోడనే చుట్టుప్రక్కలవారు గుసగుస లాడనారంభించిరి. కాని యా మాటలు గట్టిగా నెవరు చెప్పఁగొనలేదు. సుమతి వద్ద చమత్కార సంభాషణలు ప్రజ్ఞలు నోటిమంచితనములు గలవనుటకు సందేహము లేదు. అతని పొరుగున యదునాథుఁ డను పెద్దమనుష్యుఁ డొకఁడు కాపురముండెను. ఆయనయు చిత్రసంభాషణలకు విశేషజ్ఞానమునకు నందెవేసిన చెయ్యియని చెప్పవచ్చును; ఆయన ప్లీడరు. వేషభాషలయందు నాచారములయందు నీతఁ డింగ్లీషువారి పద్ధతుల నవలంబించెను. అందుచేత నాంగ్లేయపద్ధతుల మీఁద నిందలు నతుపునా రాఁజ్ఞ

యము లైన సంగతు లేవి తెలిసికొన వలసివచ్చినను వానికన్నిటికి నీయనయే ప్రమాణము. విదేశపు సారాయములలో నేది మంచిదో యాయనయే చెప్పవలయును. విందులకు బిలుచునపుడు పంపబడు చీటుల విషయమున నాయనమాట ధర్మశాస్త్రమే. ఆయన యుపన్యాసము లిచ్చుటలో మేటి. ఆయన వెనుక నొకసారి హిందూజాతీయత్వము హిందువుల యాచారముల శ్రేష్ఠత్వము ననువిషయములం గూర్చి నగరమందిరమునం దిచ్చిన యుపన్యాసములు విని పురజనులు మహానంద భరితులైరి. ఆయన యదృష్టమేమో కాని పడుచువాండ్ర కందఱ కాయనమాట గురి. భాగ్యవంతుల కాయన పరమమిత్రుడు. వివాహసంబంధములు గావలసినవారి కాయన యాలోచన మత్యావశ్యకము.

ఆయన వెనుక పూర్వపు పద్ధతిలోని వాడగు హరిశంకరుడు కూర్చుండెను. తెల్ల కోటు, కోటుజేబునకంటి తళతళ మెఱయుచున్న దట్టమగు బంగారపు గొలుసుగల పూర్వపద్ధతివేషము నాయన ధరించెను. ఈయన పూర్వకాలపు వాడగుటచే నూహలు మాటలు బూర్వకాలపువై యుండెను. ఆయన కింగ్లీషు భాషలోగల జ్ఞానము విశేషమైనదికాదు. కాని తెలివి మాత్ర మసాధారణమైనది. కావున బుద్ధిసూక్ష్మతకు పేరువడిన పడుచువాండ్రనేకులు హరిశంకరుడు సుఖముగా జేసెడు జీవయాత్రను జూచి లను కట్టిని సంధివింప దయ్యెనని విచారపడుచు వచ్చిరి. నవనాగరికులగు నీకాలపు బంగాళీలవలె బోడితలలతో నీయన కచేరీలకు వెళ్ళక సన్ననిపాగ చుట్టకుముడులాగున జుట్టు తలపై పెట్టుకొని పోవుచుండును. ఈయన మాటలాడునట్టి యింగ్లీషుకూడ పూర్వకాలపు వారి యింగ్లీషువలె మిక్కిలి యొసగానుండును. అందుచేత క్రొత్తపద్ధతులు నేర్చికొని పాడుగాక యున్న పూర్వాచార పరాయణుడని యూరోపియను లతనిమీద దయ గలిగియుండిరి అంతియెగాక పూర్వాచారములకు మతవిషయము లకు నతడే ప్రమాణమనియు నవనాగరికులై పెద్దపిన్న తారతమ్యము లెఱుగక తెల్లవారి యెడ వినయము జూపక యుండునట్టి యీనాటి పడుచుబంగాళీ లందఱు నాయనం జూచి మర్యాదలు నేర్పుకొన వలసినదనియు యూరోపియను లభిప్రాయపడుచు వచ్చిరి. హరి శంకరుఁడు లోక వ్యవహారవేదియై పూర్వకాల వేషము లాభసాటి వ్యవహారమని తోచి నందున దానినే యవలంబించెను. అందుచేత హిందువుల తెల్లవారి వేషభాషల నవలం బించుట యిష్టములేని యూరోపియనులు హరిశంకరుఁడు స్వతంత్రుఁడనియుఁ బాటు కాని వాఁడనియు మెచ్చుకొని యాతనికంటె ఎక్కువ తెలివి, యెక్కువ చిరకాలాను

భవము గలయుద్యోగస్థుల నగేతులను మూలకు ద్రోసి యీయనకే జీతము వృద్ధిజేయుచు వచ్చిరి. ఈయనయు నలుగురతోడిపాటు స్నేహితులు హెచ్చరించుచుండ నొక గ్లాసు చీకటిగదిలోఁ బుచ్చుకొని యప్పటికి గృహమునకుఁ బోయి పిదప పూర్వాచార పరాయణులు కడుపు చెక్కలుగ నవ్వునట్లు నాటిరాత్రి యచ్చట జరిగిన వినోదములెల్ల రసపుష్టిగ జెప్పి త్రాగుబోతులను వెక్కిరించెను.

హరిశంకరుని ప్రక్కను పశ్చిమఖండాచారములు సర్వోత్తమములని, కంకణము గట్టుకొన్నవానివలె వాదించు కర్మకారుఁడు కూర్చుండెను. ఈకర్మ కారుఁడు యూరపు ఖండమునకుఁ బోయి యచ్చటి నాగరికత నంతను దనతోఁ దెచ్చెనో యన్నట్లు ముడుతలు లేనికోటు మెడపట్టి గ్రొత్తమాదిరి సులోచనముల జోడు దాల్చెను. యూరపు ఖండములో నేక్రొత్తసారాయి బయలుదేరినను దాని నీతఁడు చవిచూచి తీరవలసినదే. అతని యాంగ్లేయభాషోచ్చారణము నిర్దిష్టమైనది. ఆయన యింగ్లీషు పద్ధతులు చిత్రములైనవి. వేయేల? ఆయన యింగ్లీషువారికంటె నెక్కుడయింగ్లీషువాఁడు. ఆయనపద్ధతులు చేష్టలు చూచి యాయనకంటె తక్కువ చదువుకొన్న మిత్రులు మెచ్చి కొనియాడుచు వచ్చిరి. అజ్ఞానాంధకారమయమైన మనదేశముమీఁద నీయన పశ్చిమఖండమునుండి తెచ్చిన జ్ఞానతేజస్సును వెదజల్లుచున్నట్లు కొందఱు తలంచిరి. ఒకరిననుసరించు నిష్టము గల కుఱ్ఱవాండ్రు కర్మకారుని యభినయములు సంభాషణలుఁ గొంతవఱకు పట్టుకొని తాము నాగరకతలో మిక్కిలి వృద్ధిపొందినట్లు తలంచుచు వచ్చిరి.

హరిశంకరుని రెండవప్రక్కను దిగంబరుఁడు విశ్వంభరుఁడును గూర్చుండిరి. వీరు తోఁటకు జుట్టుప్రక్కల నున్నవారిలో గొప్పవారు. గొప్పవర్తకులగు ముక్తియారులు, వారివెనుక సన్నని తెల్లకోటులు పట్టురుమాళ్ళు దాల్చి దృఢశరీరములు గల పడుచువాండ్రు కొందఱు కూర్చుండిరి. కమ్మని తావియు మకరందముఁ గల పుష్పగుచ్ఛము మీఁదఁ దుమ్మెదలు వ్రాలినట్లు సొమ్ము నిష్ప్రయోజనముగాఁ బాడుచేయుటలో మితి మెఱుఁగని ధనపురపు చిన్నజమీందారుని చుట్టు నానాపద్ధతుల మనుష్యులు చేరిరి. ఈ విధములైన కలయికలు విందులు మన పల్లెటూళ్ళు విడిచిపోయి చూచితిమా యితర ఖండములయందు మేలులేక కానఁబడు చుండును.

అటువంటి సభలోఁ బాపము హేమచంద్రుఁడు ధనపురపు జమీందారునకెట్లు సలహా చెప్పగలడు? ఆయన నెట్లుచీవాట్లు పెట్టగలడు? ఆయన హితము నుపదేశింపఁ

ప్రయత్నించి వాని కుపోద్ఘాతముగా హేమచంద్రుఁడు తోఁట, తోఁటలోని మేడలు మిక్కిలి దర్శనీయములై యున్నవని పలికెను. పలుకుటయు నచట చేరిన మిత్రులందఱు క్రొత్తగ గొన్న మేడలు దివ్యసుందరములుగా నున్న వని బళిబళియని మెచ్చిరి. ధనంజయుఁడు గూడ వారిని పలుకుల కలరి కొంచెము సేపుండి జరుగఁ దలచిన మేజువాణి జూచి పోవలసినదని హేముని గోరెను. హేముఁడాసందర్భమున నుమయొక్క తండ్రి మాటయుఁ దాళ్ళచెఱువు గారినుము మాటయు నించుక తలపెట్టెను. పేదబంధువుల మాట తలపెట్టుట ధనంజయునకు నొత్తుగ నిష్టములేక పోయెను. జ్ఞానసంపన్నులైన యాతని మిత్రులు హేముని సంభాషణలను ధనంజయునికంటె నెక్కువ యసహ్యించుకొనిరి. కాలమువృధయగుచున్నదని యందఱుతొందఱపడిరి. సమయానుగుణముగశృంగార వేషములు ధరించిన నవవిలాసినుల నవ్వులు ప్రక్కగదినుండి వినంబడి యమ్మహారసికులను వీనుల విందొనరించెను. ఆసభాసదులలో నొకఁడు వీణపై చేయివైచెను. మఱియొకఁడు సారాయిపోసి త్రాగెను గ్లాసులపంక్తి నువ్విళ్ళూరుచుఁ జూడసాగెను. వేరొకఁడు గడియారమువంక చూచెను. ఆసూచన లెఱింగి హేమచంద్రుఁడు ధనంజయునివద్ద సెలవు పుచ్చుకొని విచారగ్రస్తుఁడై పోయెను. ఇప్పటికి పాపము హేమునకుఁ గొంతప్రపంచ జ్ఞానము కలుగఁబోలు. అతఁడు గృహమునకుఁ బోవునప్పటికి రెండుజాములు రాత్రి దాటెను. ఇల్లుజేరి యతఁడు భార్యతో మాటలాడక పండుకొనెను. పాపము దుఃఖాతిశయముచేత నతఁడు పలుకలేక పోయెను.

పదియవ ప్రకరణము.

తెల్లవారఁగానే హేమచంద్రుఁడు మేలుకాంచి తన మనోగత వృత్తాంతము నెవ్వరికిం జెప్పక దాచినందువలన ప్రయోజనము లేదని గ్రహించి తనలో నిట్లనుకొనెను. "కష్టములు వచ్చినప్పుడు డాఁచవాండ్రు కాఁడు నాండ్రే సహాయము చేయవలయును. కావున నాకుఁదోఁచిన దంతయు నాభార్య కెఱిఁగించెద. ఆవిడ యేమిచేయవలయునో యది చేయును" అనియతఁడు తలఁచుచుండఁగానే బుద్ధిమంతురాలగు బిందు విషాదమనియెడు నీడచే నావరింపఁబడిన నగని మొగముఁజూచి "యేమైన దుర్వార్త తెలిసినదా ?" యని యడిగెను. హేమచంద్రుఁడు గడచిన రాత్రి తాను కన్నులారఁ జూచిన

దంతయు బూస్సగుచ్చినట్లు భార్యకు వినిపించి చాల విచారపడెను. అంత సతీ పతులిట్లు మాట్లాడిరి.

హేమ — ధనంజయుఁడు తెలివిమాలి పడుచుతనముచేతఁ జెడుత్రోవలలోఁబడి పాడైనాఁడు. అతనిచుట్టు పచ్చిదొంగలవంటి మోసగాండ్రు చేరినారు. అతని యాస్తి యతని స్వాధీనములో నెంతోకాలముండదేమో యని భయపడుచున్నాను. పాపము భార్యయొంటికత్తెయె. ఏ సంతోషములేక బెంగఁబెట్టుకొని క్రమముగాఁ జిక్కి చచ్చిపోవునని నాకు విచారముగా నున్నది.

బిం — (ఈమాటలు భర్తనోట వెడలఁగానే కన్నుల నీరుపెట్టుకొని కొంతసేపటికి దన చీరకొంగుతో నీరద్ది) ఇంతమట్టుకు వచ్చునని నే నెరుఁగుదు. నేనేకాదు పాపము! ఉమకూడ నెరుఁగును.

హేమ — కలకత్తాకు రాకముందామె యెట్లెరిఁగి యుండును?

బిందు — అది నేను చెప్పఁజాలను. ఇక్కడికి రాకముందె యామెకు మగని దురాచారములు కొన్ని తెలిసి యుండును. కాని యామె గంభీరమైనది. కనుక మనో వ్యధలు పైకిఁ జెప్పుకొనుట కిష్టము పడినదికాదు. వెనుక తాళ్ళచెరువు గ్రామము విడిచి వెళ్ళునప్పుడామె తన ముందుస్థితి విచారకరముగా నుండునని కొంచెము గ్రహించినట్లు తోఁచుచున్నది. ఏమంటే ఊరు విడిచి వెళ్ళునప్పుడేదో పెద్దబెంగ పెట్టుకొన్న వాళ్ళేడ్చిన ట్లేడ్చినది.

హేమ — అయిన నిప్పుడు మన మేమిచేయఁ గలము. నేనువిన్నదానిని బట్టి చూడఁగా ధనంజయుఁడు కొద్దికాలములోనే యైశ్వర్య మంతయుఁ బోగొట్టుకొనును. విశేషించి రోగిష్ఠివాఁడగును. అప్పుడు పాపము అంతచక్కని యుమ డబ్బు కిబ్బందిపడి నానాబాధలు పడవలసి వచ్చును.

బిం — మీరెప్పుడో రెండేండ్ల సంగతిఁగూర్చి విచారించుచున్నారు. నేనుదాని ప్రస్తుత బాధను గురించి విచారించుచున్నాను. ఉమ యెంతో యభిమానముగలది. మగఁడు చేసెడు నిరాదరణమెట్లు భరించుచున్నదో గదా! ధనపురములో నున్నప్పు డెంతోమంది చుట్టాలతోఁ గలసి మెలసి యది యుండినది ఈ కలకత్తాలో రెండవ యాఁడుదాని మొగమైనఁ జూడకుండ ఖైదులో నున్నట్లేలాగున నున్నదో గదా! పోనీ

వాళ్ళ గొడవలోఁ బడియుండుటకు బిడ్డలు పాపలు లేరుగదా! కొంచెముసేపు, ఉబుసు పుచ్చుకొనుటకు చుట్టాలు పక్కాలు లేరుగదా. మనసులోనున్న కష్టము సుఖము వెళ్ళబుచ్చుకొందమంటే ఆప్తులులేరుగదా. పోనీ మీరైన వెళ్ళి యొకపర్యాయము దాని నెందుకు చూడలేరూ?

హేమ — రాత్రి తోఁటలో సంగతులు కన్నులారఁ జూచినతరువాత నాకు వారింటికి వెళ్ళుటకు మనస్కరించుటలేదు. పోనీ నీవువెళ్ళి కొంచె మోదార్చు. తరువాత భగవంతుఁ డున్నాఁడు.

ఆ దినమే మధ్యాహ్నభోజనములైన తరువాత బిడ్డలను సుధ కప్పగించి బిందు సవారిలో గూర్చుండి తలుపులు మూసికొని భాగ్యవంతురాలైన యమునను జూడ బోయెను. సుధయు యమునను జూడవలయునని ముచ్చటబడెను. కాని బిందు "యీవేళ గాదు. వీలైనప్పుడు మరియొక సారి నిన్ను దీసికొని వెళ్ళెదనులే" యని చెల్లెలను వారించెను. బిందు కూర్చున్న సవారీ ధనపురపు జమీందారున్న యింటి వీధిగుమ్మముదాటి తిన్నగా లోపలికిఁ బోయెను. హిందూదేశములోఁ జిరకాలము మహమ్మదీయుల పరిపాలనము నిలిచినందున స్త్రీలకు ఘోషా ప్రబలుటచే నీ దేశ స్త్రీలు ముఖ్యముగా నుత్తర హిందుస్థాన స్త్రీలు సాధారణముగా నొకరినొకరు చూడవలయునన్న నిదే పద్ధతి. దక్షిణ హిందూస్థానములో స్త్రీల కింత ప్రబలమైన ఘోషాపద్ధతి లేదు. బిందు సవారీదిగి మెట్లెక్కి మేడమీఁదికిఁబోయి విశాలమైన పడకటిల్లు గాంచి యందు తలదువ్వుకొనుచుఁ గూర్చుండిన యమునను గనుగొనియెను. కనుగొనినతోడనే భయముచే బిందు మేనించుక వడక "ఏమీ! మా యూరిలోను దేశమంతటను జక్కనిచుక్క యని పేరువడిన యమున యేనా యిది" యని సందియపడెను.

రోగయుత నామె ముఖము తెల్లఁబడి జబ్బుగానుండెను. కన్నులు పూర్వలావణ్యము నెడబాసి విషాదమును సూచించుచుండెను. భుజములయెముక లగపడుచుండెను. చక్కఁదనమునకు నిలయమైన యామెశరీరము శల్యచర్మావశిష్టమై యుండెను. అప్పటికి నాలుగు మాసముల క్రిందట నవనవోన్మేషము గల్గి మెరుగులు గొలుపుచుండిన యా బాలిక యప్పుడు జబ్బుగానుండి నలువదియేండ్ల దానివలె కనఁబడెను. పట్టెవానుపై పెడమీఁదఁ బడుచుండెను. శుష్కించిన హస్తములకు ముడుతలు వడియుండెను. మెట్ల మీఁదనుండి పైకి వచ్చుచున్నప్పుడు చప్పుడు విని యమున తలయెత్తి బిందుంజూచి లేచి

వెళ్ళబోయి మొగమున గొంత సంతోషము మొలకలెత్త దన చిన్ననాటి చెలిమికత్తెను కౌగిలించికొనెను. అంతట వారికీ క్రిందసంభాషణము జరిగెను.

ఉమ—చిట్టచివఱకు మీరిక్కడికి వచ్చినారా? ఈ నాలుగు మాసములనుండి నేనెన్నిమాట్లు నిన్ను దలంచికొన్నానని చెప్పను. నీవు సుఖముగా నున్నావా? పిల్లలు బాగున్నారా?

బిం—(ఉమయొక్క స్థితి యామె ముఖచర్యవల్లను దీర్ఘ చింత దెలియజేయు మాటలవల్లను దెలిసికొని తన మనోవిచారము నడచుకొని) అమ్మాయి! మేము బాగున్నాము. నీవేలాగున్నావమ్మా? నీవింత చిక్కిపోయినావేమే.

ఉమ—దానికేమిలే. నేను కలకత్తాకు రాగానే నీటిక్రొత్తచేత గొంచెము జబ్బుపడినాను. ఇప్పుడు నెమ్మదిగానున్నది. ఇప్పటికి దగ్గు అప్పుడప్పుడు వచ్చుచున్నది. ఈ యూరినీరు పడదేమోయనుటి తెలియదు. ధనపురపుగాలి యింతకంటె మంచిది.

బిం—ఇంతలో నీవు ధనపురము వెళ్ళుటగాని మనయూరు వెళ్ళుటగాని లేదా యేమి? మేము దీపపూజలనాటి కక్కడికి వెళ్ళుదుము. మీరు రారా?

ఉమ—బిందక్కయ్యా; ఆ మాట నేనేలాగున జెప్పగలను. మావారు నన్ను వెళ్ళనిత్తురా?

బిం—అయిన నీసంరక్షణ మిక్కడ కనుగొనువారెవరు? మేమెక్కడో దూరమున నున్నాము. పిల్లలను వదలిపెట్టి వచ్చుట చాల కష్టము. నీకు పాడుదగ్గు పట్టుకొన్నది. చిక్కిశల్యమైపోయినావు. నిన్ను చూచువారెవరు ఉమా?

ఉమ—మీ మఱదిగారు డాక్టరును బిలుచుకొని వచ్చినారు. ఆయన ప్రతిదినము వచ్చి చూచుచున్నారు. ఆయన యిచ్చిన మందు పుచ్చుకొనుచున్నాను.

బిం—కావచ్చును. దాని కేమి. ఇపుటి నీ స్థితిలో నెవరోయొకరు చుట్టాలో మఱొకరో నిను గనిపెట్టుకొని యుండవలెను. మీయమ్మకుత్తరమెందుకు వ్రాసినావు కావు? వ్రాసినపక్షమున నావిడవచ్చి కొన్నివారములు నీవద్ద నుండునుగామా? ఉండి కొంచెమునీకు జబ్బు చేరినతరువాత నిన్ను తాళ్ళచెలువ్రు తీసికొని వెళ్ళును. స్థలము మార్చుటవల్ల కొంతజబ్బు కుదుర వచ్చును.

ఉమ—మాయమ్మ నెందుకు కష్టపెట్టవలెను? డాక్టరువచ్చి యేదో మందిచ్చుచున్నాఁడు గదా? కావలసినంతమంది నౌకరులున్నారు. వాళ్లేకనిపెట్టఁగలరు. ఏమో నా కేలోటు లేదుగదా! ఆవిడకు వర్తమాన మంపుట యెందులకు? విచారము గలుగ జేయుట యెందుకు?

బిం—నీకు వైద్యులు లేకపోలేను. నౌకరులు లేకపోలేరు. తల్లి సంరక్షణమువంటిది మరియొకటి కాదు. ఆలాటిదక్షత నీకిప్పుడు తప్పక యుండి తీరవలయును. నౌకరులే గాని, మీవారు కనుగొనుట లేదా?

ఉమ—(నెమ్మదిగా) కనుగొనకేమి. కావలసినవన్నీ యియ్యనేయిచ్చుచున్నారు.

అనఁగానే తన మనోగత విచారమును లోకమందెవ్వరికిని ప్రాణమిత్రులకైనను చెప్పక యుమ లోలోన బాధపడుచున్నదని బింబ కనిపెట్టెను. "ఈ మౌనమును నే నెట్లు భేదింతు నీరహస్యము నెట్లు తెలిసికొందు నీమె కెట్లు సౌఖ్యము నొడగూర్తు" నని బింబ తనలో వితర్కించుకొని సోదరీ స్నేహము పురికొల్ప వెండియు నిట్లనియె. "ఉమా! నామాట వినవే. మీయమ్మ వచ్చి కొంతకాలము నీవద్దనుండుట మంచిదని నాకుఁదోఁచుచున్నది. అప్పుడప్పుడు మనము రోగములచేత దుఃఖములచేత బాధపడక మానము. అప్పుడాత్మ బంధువుల యాదరణము మన శరీరరోగములను మనోరోగములను మాన్పును. నీవు మిక్కిలి జబ్బుగాఁ గనఁబడుచున్నావు ఆదగ్గుండ గూడదు. నీవు శరీర విషయమై జాగ్రత్త పుచ్చుకొనవలెను. మీయమ్మ కీవేళ జాబు వ్రాయుము. లేదా యింటికిబోయిన పిదప నన్ను వ్రాయనిమ్ము. అమ్మాయి! కొన్ని నెలల క్రిందట నేను నిన్ను జూచినపుడు నీవెంతో బాగుంటివి. ఇప్పుడా మనిషివే కావని తోఁచుచుంటివి. ఎంత మారిపోయి నావే తల్లి!" అని యామె మొగముమీఁద జేయివైచి యామెతల తన హృదయమునకు దగ్గఱగఁ జేర్చుకొనియెను. మౌనమును భేదించుటకు మిక్కిలి ప్రశస్తములైన చులకని యుపాయములను స్త్రీలే యెఱుఁగుదురు గదా! అందుచేత నుమ ప్రేమసంభరితమైన బింబ ప్రసంగముచే మెత్తవడియెను. దయారసశీతలములైన యటువంటి పలుకుల నామె విని చిరకాలమైనది. ఆ పలుకులతో నామె హృదయము నిండిపోవఁ గన్నులు దడిసెను. అంతవారిట్లు ప్రసంగించిరి.

ఉమ—బింబక్కయ్యా! చిన్నప్పటినుండి నీకు నేనంటే పంచప్రాణములుగదా! అమ్మా! (అని మఱి మాటాడ లేక కన్నీరు చీఱకొంగులోఁ దుడుచుకొనఁ జొచ్చెను.)

బిం__వెఱ్ఱిపిల్లా! నీకు నేనంటే మాత్ర మంత ప్రేమ చిన్నప్పటినుండి లేదా; ఇప్పుడు లేదా?

ఉమ__అక్కయ్యా! నీవంటే నాకాలాగే యున్నది. నాకంఠములో ప్రాణ మున్నంత కాలము నీమీఁద ప్రేమ నాకు పొమ్మన్నను బోదు.

బిం__అయిన నీమీఁద నెంతో ప్రేమ నాకున్నప్పుడు నామీఁద నెంతోదయ నీకున్నప్పుడు నీకడుపులో బాధ నాకు తెలియకుండా దాఁచవలె నను ప్రయత్నము నీకెందుకే? నీ మనసులో నెంతక్షోభపడుచున్నావో నాకు తెలియదా? నీయాశ లన్నియు నడుగంటిపోయిన వనియు నీవిప్పుడు తెగించి యున్నావనియు నేను తెలిసి కొనలేదనుకొన్నావు? నీవు క్రొత్తగాఁ గాఁపురమునకు వెళ్ళినప్పుడు నీమగఁడు నిన్ను నేల నడువనీయకుండ నెంతో గారాబముతోఁ జూచుచుండువాఁ డని సంతోషము కడుపులోబట్టలేక నీవెన్నిసారులో నాచెవిలో రహస్యముగాఁ జెప్పితివి. ఆమాటలిప్పుడు జ్ఞాపకములేవా! ఆసంతోష మంతయు నేడు సన్నగిల్లి పోయినదని నేను కని పెట్ట లేదనుకొన్నావా? ఇప్పటికి నాదగ్గఱ నీగుట్టు దాఁచఁ దలఁచుచున్నావా? అమ్మాయీ! నేను నీవు క్రొత్తవాళ్ళవలె యొకరిగుట్టొకరివద్ద దాఁచుకొన్న పక్షమున మన కిక్కడ తల్లితోడు ఎవరుందురు?

ఈపలుకులు హృదయమును జయించుటంజేసి యుమ తాళలేకపోయెను. మానము భేదిల్లెను. అంతట నుమ తన మొగము బిందుకడుపులో బెట్టుకొని కన్నీరు విడిచి కడుపు పగిలి కొంతసేపేడ్చి యవ్వల మొగమెత్తి యిట్లనియె. బిందక్కయ్యా! నేనిదివఱకెన్నఁడు నాగుట్టు నీకడ దాఁచలేదు. ఇఁకముందు దాఁచఁ దలఁచుకోలేదు. నామాటవిని యీవేళ యూరుకో! ఈమాటు వచ్చినప్పుడు నాకథ నంతయు నీకుఁ జెప్పెదను.

బిం__కాదు కాదు. నీకథంతయు నాకీవేళనే చెప్పి తీరవలయును. కడుపులో దిగమ్రింగిన పక్షమున బాధలు దుఃఖము మనస్సును దహించివేయును. తల్లితోడుతో కష్టముఁ జెప్పుకొన్న పక్షమున కొంత మనస్సునకుఁ దేలికగా నుండును.

ఉమ__బిందక్కయ్యా! నే నేమియు దాఁచను. నీదగ్గఱ దాఁచవలసినదే మియు లేదు.

బిం__ఉమా! నీశరీరములో నింకజబ్బుగా నున్నదిగదా! నీమగఁడు, ఈస్థితిలోఁ గనుఁగొనవలసినంత సరిగాఁ గనుగొని నిన్నాదరించుచున్నాఁడా?

ఉమ—నాకు కావలసినదంతయు నిచ్చుచున్నారు. నా చికిత్స నిమిత్తమొక వైద్యుని బెట్టినారు.

బిం—ఉమా! ఈలాగున, ఆకటను అందకుండా పోఁకను పొందకుండా యేవో రెండు కల్లబొల్లిమాటలు చెప్పి నన్ను పంపివేయఁ దలఁచుకొన్నావా? నేను క్రొత్తదాన ననుకొన్నావా? అన్నము, బట్ట, వైద్యుఁడు ఇవియేనా మనము భర్తలను కోరదగినవి? నే నివన్నియు నిన్నడుగ లేదు. నీవు క్రొత్తగాఁ గాపురమునకు వెళ్ళినప్పుడు నీమీద చూపినంతదయ నీభర్తగారిప్పుడు నీమీఁదఁ జూపుచున్నారా? అదినాకు కావలసినమాట! ఆఁడది యాఁడదాని నింతకన్న స్పష్టముగా నడుగవలెనఁటే? మగనియనుగ్రహమే భాగ్యవంతురాలికిఁగూడ భాగ్యము. పేదరాలికిఁ బెన్నిధానము. ఆడవాళ్ళ కందరకుఁబతి యనుగ్రహమే ప్రాణాధారము, బ్రహ్మానందము. అటువంటి యనుగ్రహము నీభర్తగారికిఁ గలదా?

అనవుడు ఉమ నోటినుండి మాటరాక తలయూఁచి బిందుకడుపులోఁ జేర్చెను. బిందు చెల్లెలియవస్థఁ జూచి విషాదపూరితయై మెల్లన నిట్లనియె: ఉమా! పతియనుగ్రహము పోగొట్టుకోఁదగినది కాదు. పెనిమిటికి నీమీఁద దయతప్పి పోకుండ శక్తివంచన లేక చేయవలసిన ప్రయత్నములన్నియు జేసితివా?

ఉమ—అక్కయ్యా! ఆయనదయ నిలుపుకొనుటకు నేపడినపాట్లు పరమాత్మునెఱుఁగునే. ఆయనకు నామీఁద ననుగ్రహము తప్పినను నాకాయనమీఁద దయపోలేదు. ఆయన నొక్కసారి కన్నులారఁ జూడవలయునని నే నెంతో తహతహపడుచుందు. పాపమాయనకు నామీఁద విసుగుపుట్టినది కాఁబోలు (ఈకడపటి పలుకులకు నవ్వు డుము తెంలోచి తత్క్షోభము నొందెను.)

బిందు—నీ కాయనమీఁద ప్రేమ యున్నదన్నమాట చెప్పవలయునఁటే తల్లీ! నాకు తెలియదా? నీమనసు నేనెఱుఁగుదును. నీకంఠములోఁ బ్రాణముండగా నీవాయనమీఁద ప్రేమ తీసివేసుకోలేవు. కాని ఆఁడదానికి భర్తమీఁద ప్రేమయున్నంత మాత్రముచేత చాలదు. మగవాఁడు కూడా, ఆడుదానివద్దనుండి యొక్క ప్రేమమాత్రమే కోరఁడు. గుంభన యెందుకు? ఆడది ఆఁడదానితో మాట్లాడినపుడు తోఁడబుట్టినది తోఁడబుట్టినదానితో మాటలాడినట్లు నేను నీతో మాటలాడెదను. పెనిమిటిని సంతోషపెట్టుటకు, ఆయనకటాక్షము తనమీఁద స్థిరముగా నిలుపుకొనుటకు ఆఁడది యెన్నో నేర్పులు నేర్వవలయును, ఒక్క ప్రేమతోఁ జాలదు.

ఉమ—అక్కయ్యా ! చెప్పుచెప్పు. వినుచున్నాను.

విం—ఉమా ! నీకు తెలియనిది నేనిప్పు డేమియుజెప్పలేను. నీకేగాదు. ఈజ్ఞాన మాడవాళ్ళకందరకు స్వతస్సిద్ధముగానున్నది. మగఁడు మనకు ప్రాణస్నేహితుఁడు, సహకారి గనుక ఆయన వచ్చునప్పటికిల్లు కలకలలాడుచుండు నటులు సంతోషము తాండవ మాడుచుండునట్లు ఆయన మనసులో నుండు విచారము లన్నియు బోవునట్లు మనము చక్కఁజేసి యుంచవలెను. పతికిఁ గోపము వచ్చినప్పుడు మనము శాంతము వహించవలెను. చీవాట్లు పెట్టినప్పుడు మన మవి మఱచి పోవలయును. ప్రతి దినము వచ్చునట్టి కష్టనిష్ఠురములకు మనము మనసు పాడు చేసికొనక భక్తి వినయ ములు గలిగి యుండవలెను. ఈస్వల్పవిషయములు మనము నేర్చుకొన్నపక్షమున మన యిల్లు సంతోషమునకు పుట్టినిల్లయి యుండును. ఇవి నేర్చుకొనకపోతిమా బ్రతుకు పాడు బ్రతుకై యుండును. ఉమా ! అతి భాగ్యములో నుండుటచేత లోకవ్యవహారము నీకంత చక్కగాఁ దెలియదు. పేదసంసారము కలదాన నగుటచే లోకానుభవము నాకెక్కువగా గలదు. నిష్కళంక చరిత్రలుగల మగవారిని పరమపతివ్రతలైన యాడువారిని యెందరనో యెరుంగుదును. పరస్పర ప్రేమలోను వారికిఁ గొఱఁత లేదు. కాని వారి దాంపత్యములు దగ్ధపటలములైనవి. ఎందుచేతనో వారు పడునట్టి క్షోభ యింతంతగాదు. ఎల్లప్పుడు మగ వాని మొగము మటమట. ఆఁడుదాని మొగము కొఱకొఱ. వారి గృహములు సంతోష రహితములై దగ్ధమైపోయిన సౌఖ్యానురాగముల స్మశానము లట్లు కనబడు చుండును. రవంతయోరిమి జీవనమునకెంతో వికాసమును దెచ్చును. ఓరిమిలేక పోయెనా యిల్లు చీకటికోణమట్లుండును. మనస్సులు చెడిపోయిన తరువాత కార్యములేదు. ఎండిన మోళ్ళైనను జిగురించును. గాని విరిగిన మనస్సు లతుకుకొనవు. ఆశ లడుగంటి పోయిన వెనుక అనురాగము లకాలమందే యంతరించిన వెనుక భార్యాభర్తలు తమతప్పులు తెలిసి కొని "అయ్యో, మాలో నెవరివద్దనైనఁ గొంచెము శాంత మున్నపక్షమున సంసారమింత నిస్సారము గాకుండ, నీదినము లన్నియు నెంతోసౌఖ్యముగా వెళ్ళునుగదా" యని పశ్చాత్తాపము నొందుచుందురు. పొందినకార్యమేమి ? పాకము ముదిరిపోయిన తరువాత దేవాయాత్ర నడపుట మఱియొకసారి యాడి చూచుట కాటగాదు. గతించినది గతించు టయే. యౌవనము మరలిరాదు. పోయిన సంసారము కుదురుపడదు.

ఉమ—అక్కయ్యా ! నీవు చెప్పినది కఠినముగానున్నను సత్యమే. ఈప్రపంచమం దనేక గృహములు గతించిన యనురాగములయొక్క ఛాయలచే నల్లబడి కేవలము

స్మశానములవలె నున్నవి. మనచిన్నతనమందు పుస్తకములలో సీతారాములయొక్క దాంపత్యము, సావిత్రీసత్యవంతుల యనురాగమును జదివి వివాహములైన తరువాత మన జీవనములుగూడ నావిధముగానే యెడలేని సౌఖ్యపరంపరలై యుండునని యెంతెంతో యూహ లూరితిమి. కాని పెద్దవాళ్ళమై లోకవ్యవహారములు చక్కఁగా దెలిసికొన్న తరువాత వెనుకటి మనకోరికలు స్వప్నములని తెలియుచున్నవి. ఇప్పటికి కన్నులు తెరచినామని తెలిసికొనఁగలము. శాంత సంతోషములు తప్పక నిలుచు నని తలఁచినచోట్ల ఎడతెగని వైరము నిలుచుట చూడఁగా శరీరము వణకునుగదా. అధికారము కొరకు, డాబులకొరకు ఆడవాళ్ళు, మగవాళ్ళు గిజగిజ తన్నుకొని చచ్చుట చూడఁగా ప్రపంచము మీఁద విసుగుపుట్టును. సజ్జనుల మంచితనములు కనిపెట్టి తాము సౌఖ్యపడు దుష్టమతుల మనము చూచుచుందుము. స్వలాభము జూచుకొనని యోగ్యులయొక్క నెత్తురు పీల్చివేయునట్టి యాత్మలాభ పరాయణులఁ గూడ మనము చూచుచుందుము. తెంపులేని యీకయ్యము రేండ్లు గడచిన కొలది మరింతదట్టమై భయంకరమగును. చిట్టచివర కిద్దరిలో నెవరో యొకరుచచ్చి బూడిదయైన తరువాత కలహమంత మగును. అప్పుడు కొంపమీద పెంకు లెగిరిపోవునట్టు లేడుపులు, పెడబొబ్బలు బయలుదేరును. చచ్చిన వాని కన్నులు చెరదీసి యున్నట్లు పోయినవారలను వేయినోళ్ళఁ బొగడుచు కూనిరాగములు దీయుచుందురు. చచ్చినతరువాతఁ జేసెడు విలాపముల కంటెఁ బ్రతికియున్నప్పుడు రవంతకనికరము జూపినను, ఒక్క మంచిమాట యాడినను, యెంతో బాగుండి యుండును గదా యని యప్పుడు పయివారికిఁ దోఁచును. బ్రతికియున్నప్పుడు కట్టుకొనుటకు జట్టలియ్యనివారు చచ్చినతరువాత శ్రాద్ధభోక్తలకు వస్త్రములిత్తురు. బ్రతికియున్నప్పుడు తిన్నగాఁ దిండియైనఁ బెట్టనివారు చచ్చినతరువాత భోక్తలకు మామిడిపండ్లు వడ్డించి పంచభక్ష్య పరమాన్నములతో భోజనమిడుదురు. ఇవి మన బ్రతుకులలో నున్న విచారభాగము. మన పూర్వకవీశ్వరు లిటువంటికథల నెప్పుడు వర్ణించి యెఱుఁగరు. వారేగాదు, ఈనాటి ప్రబంధవేత్తలు గూడ నీకథల వ్రాయరు. ఇది వ్రాయుటకు వీలులేనంత యరుచిగా నుండునని గాఁబోలు వారు వీటిని ముట్టరు.

బిం_ ఉమా ! నీవు చిత్రముగా మాటలాడు చున్నావేమి ? నా మాటలకు నీవు తప్పర్థము చేసికొన్నట్లు తోఁచుచున్నది. కయ్యాలు ప్రతి గృహమందుఁ గలవు. కొన్నింట్లలో నవి ముఖ్యముగ సంతోషమును గూఁటివేళ్ళతోఁ బెల్లగించివేయును. ఇప్పుడు నేను చెప్పునవి నూటనాట నొకటిగాని యెల్లసంసారములలోను జరుగునవిగావు లోకములో నాఁడవాండ్రు మగవాండ్రు పరిపూర్ణులుగారు కావునఁ గొన్ని లోపము

లుండును. అయినను సంసారములో నొకరికొకరు సహాయముఁ జేసికొనవలసియున్నారు. కాబట్టి యోరిమి గలిగి యొకరితప్పుల నొకరు క్షమించుకొనుచు దేహయాత్ర నడపవలయును. ఉమా! నీవు చాలా బాధలుపడినావు. అందుచేత సంసారము నిస్సారమని తలంచుచున్నావు. నీమాటలు వినఁగా నాకు భయమగుచున్నది. నీ సంగతి నాకు బోధపడినట్లు లేదు.

ఉమ — అక్కయ్యా! నాసంగతి నీకు బోధపడునట్టి కాలము రాకపోవుటయే మేలు. జాలిగుండె గలవానిభార్యవు నీవు. ఆరామములవలె నున్న సంసారముల సంగతి నెట్లు తెలిసికొనగలవు? తాళ్ళచెఱువులో నున్న మీతాటియాకుల యిల్లు భూలోకస్వర్గము. వేరొండ్లకు నది యాలాగుననే యుండవలెను. నాఅదృష్టమువేరు. నేను నీవలెఁ బెనిమిటి కనుకూలముగా నడచుకొను దాననైనాను. ఆయన గూడ నీభర్త వలె శాంతమూర్తిగారు. బిందక్కయ్యా! ఇన్నెందులకు? మాగొడవలు తలచి తలచి యడుగకు. ఈ సంసారపు పందెము మేముగూడ నొక్కసారి వేసిచూచినాము. అందులో గట్టిదెబ్బ తిని యోడిపోయినాము.

బిం — ఉమా! ఓడిపోయినట్లు నీవనుకొనుచున్నావు. కాని నీవోడిపోలేదు. ఏదో మగఁడు చిన్నతనముచేతఁ గొంచెము తప్పుత్రోవపడినాఁడని యిరువదియేండ్ల పిల్లవు సమస్తము మునిఁగిపోయిన దానివలె నన్నియు వదలుకొని కూర్చుండుట బాగులేదు. ఇది నేనొప్పుకొనను. నీకు కావలసినంత యదృష్టము పట్టఁదలఁచి యున్నది. ఏదో సాధనము చేసికొనుటకు వీలులేని యాపదలు లేవు. సరియైన ప్రయత్నముఁ జేసినయెడల మంచి మార్గమునకుఁ దిరుగనిమగవాఁడు లేఁడు. ఎడతెగని ప్రేమచేతను, బతిభక్తిచేతను, ఆఁడుది సుష్టుపఱచుకొనుటకు వీలులేని సంసారముండదు. మన యజమానులు అనఁగా మగవారు తమ కుక్కలమీఁద చూపించినట్లే చిఱునవ్వులు నవ్వుచు నొకప్పుడను రాగమును జూపుదురు. మఱియొకప్పుడు మనము వారిపాదములపైఁ బడి వేఁడుకొనుచున్నను ఆపాదపద్మములతోఁ దన్ని వేయుదురు.

బిం — పైవిధమున నెంత బ్రతిమాలుచున్నను మనస్సుమాత్రము కలక దేఱనందున నామెమాటలన్నియు నప్రియములై దెలుపుచుండెను. ఉమకు గలిగిన యవమానముల నామె నోటినుండి చెప్పించి యామెకు బాధ గలిగించినందుకు బిందు మిక్కిలి విచారించెను. ఏలయన నుమ సహజముగా గర్వము గాంభీర్యము గలది గావున తనయవస్థ

నెవ్వరికిం దెలుపుట కిష్టము లేనిదై డొకసేపు విచారించి బిందు మఱికొంతసేపు మారుమాటాడఁ జాలకపోయెను. అయిన నుమమీఁద నామె కధికప్రేమ యుండుటచేతను, ఆమె మనస్సు స్వస్థపరచగల నను నమ్మకముండుట చేతను దనకు దగ్గఱచుట్టమును ప్రియసఖియు నైన యామెను దుఃఖమహారణ్య మధ్యమున విడిచిపోవుట కిష్టములేక యామెను మఱింత దగ్గఱదీసి యక్కునఁ జేర్చి తలమీఁదఁ జేయివైచి నిమిరెను. ఉమయు మిక్కిలి యలసిపోయిన చంటిబిడ్డవలె తల కడుపులోఁ జేర్చి యామె యొడిలోఁ బండుకొనెను. అప్పుడు బిందు మెల్లగ నిట్లనియె. "అమ్మాయీ! ఉమా! నీవిలాటిమాట లాడకే. నీమాటలు వినఁగా నాకెంతో బాధగానున్నది. బాధలు దుఃఖములు మన కందరకు వచ్చును. మన స్థితిగతులెట్లున్న నాకష్టములను ధైర్యముతో నెదురుకొని మనము వాటిని జయింపవలెను. పూర్వకాలములో నాడవాళ్ళు అత్తమామలలోను, ఆడబిడ్డలలోను, గాఁపురములు చేయుచుండెడివారు. కొడుకులు తమసంపాదనమంతయుఁ దెచ్చి తండ్రిచేతిలోఁ బోసెడివారు. కోడళ్ళందఱు నత్తగారు చెప్పినట్లు నడుచుకొని పనిపాటలు చేసెడివారు. తల్లిదండ్రుల పెత్తనము క్రిందనుండి సంసారము లెంతోగుట్టుగా గౌరవముగా జరిగిపోవుచుండెడివి. ఈమాయకాలములో పెండ్లాలు కాపురానికి రాఁగానే యత్తమామల యదుపాజ్ఞలు లేకుండ, మగఁడు పెండ్లాము వేఱేయుండవలెనని బుద్ధులు పుట్టుచున్నవి. అన్నదమ్ములు వేరేయుండుటయేగాని మునుపటిలాగునఁ గలిసి యున్నకుటుంబ మొక్కటియు లేదు గదా. ఇది యొకందుచేత మంచిదేయై యుండ వచ్చును. కాని క్రొత్తకాపురములు పెట్టినపుడు మగవాఁడు ఇల్లు దిద్దుకొనుటకు సమర్థుఁడై యుండవలెను. ఆఁడది గృహకృత్యములు నేర్చి యుండవలెను. ఉబలాటపడి క్రొత్తకాఁపురములు పెట్టుటయే గాని మనవాళ్ళవిమాత్రము నేర్చికొనుట లేదు. అందుచేత ననురాగ ముండవలసినచోట కలజడి, యైకమత్య ముండవలసినచోట వంతశ్శైతములు బయలుదేఱుచున్నవి. నామాటనమ్ము. మన సుఖదుఃఖములకు మన బుద్ధులు మనము కర్తలము గాని యదృష్టలోపములు గావు.

ఉమ—(కొంతవరకు మనస్సు కలకదేర) అక్కయ్యా! చూడగా నాబుద్ధికి మన పూర్వపుపద్ధతులే యింతకన్న సౌఖ్యములుగాఁ గనఁబడుచున్నవి. పెద్దవారికి జడిసి పడుచు మగవాళ్ళు భయభక్తులు గలిగి యుండెడివారు. కోడళ్ళు పనిపాటలు శ్రద్ధగలిగి చేసెడివారు.

బిం—అమ్మాయీ! మన మాడవాళ్ళము. ఈ మంచిచెడ్డలు విచారింపఁదగిన వాళ్ళము మనము కాము. ప్రపంచ మంతటఁ బూర్వపద్ధతు లణగిపోవుచున్నవనియు

నిప్పటి పద్ధతిప్రకారము మగఁడు పెండ్లాము [illegible]నుండి తమ భార్య నొకరికి తగలనీయకుండఁ దమకష్టసుఖములకుఁ దమరే పూఁచీపడి సంసారఘోరయుద్ధమును జేయుటకు ధైర్యసాహసములు గలిగి యుండవలెనని మీ బావగారు తరుచుగాఁ జెప్పుచుందురు. ఇదియే గాక మఱియొకటికూడ నున్నది. తమకుటుంబములనుండి బంధువులనుండి విడిపోయి యేదోసత్కార్యమును మీఁదవేసికొని దానినిమిత్తమయి తమయావచ్ఛక్తివినియోగించువా రనేకులు కలరు. సకల సంసార బంధములను దెగఁగోసి యీశ్వరారాధనము నిమిత్తమే పాటుపడువారు కొందఱు గలరు.

ఉమ — అక్కయ్యా! ఈశ్వరారాధనమునకై తమజన్మము వినియోగించెడువారు ధన్యులుగదా. అటువంటి మహానుభావులు సంసారములు వదలివేసి చేతనైనంతమట్టుకు లోకుల కుపకారములు చేయుచు నొకచోట నిలువక దేశాటనము చేయుచు నెల్లప్పుడు బ్రహ్మానంద మనుభవించుచుందురనియు వారు వచ్చినపని ముగిసినవెనుక ననాయాసముగఁ బరమపదము పొందుదురనియు మనశాస్త్రములుచెప్పుచున్నవి. ధనపురములో మేమున్నప్పుడు కాషాయవస్త్రముల ధరించుకొని మాయింటి కప్పుడప్పుడు యోగులు యోగినులు వచ్చుచుండెడివారు. నేను వారిని దఱచుగా జూచెడిదానను. అప్పుడు నేను వారినెంతో గౌరవించి భోజనముపెట్టి వారు చూచిన దివ్యస్థలములను గురించి దేవాలయములను గురించి చిత్రచిత్రములుగ వర్ణించి వారు చెప్పుచుండఁగా రాత్రి ప్రొద్దుపోయెడిదనుక మేలుకొని యెంతో ఆసక్తితో వినుచుండెడిదానను. జ్ఞానులైన మన పెద్దలు దుఃఖభాగముచేతఁ గ్రుంకిపోయినవారి కటువంటి జీవనమే యుత్తమమని యేర్పఱిచినారు. అటువంటి నెమ్మది వారికిఁ గూడఁ గలిగిన బాగుండును.

బిం — ఉమా! వారు ధన్యులన్నమాట నిజమే కాని యది మనవంటివారికొరకేర్పడినది గాదు. ఈ లోకములో మనవంటివారముగూడ ధన్యులమగుటకుఁ గొన్ని ధర్మము లేర్పడి యున్నవి. అవి మన నిత్యకృత్యములలోనే యున్నవి. ఈ కృత్యములను మనము భక్తిశ్రద్ధలతోఁ జేసితిమా మనము లోటు లేకుండ భగవంతు నారాధించినవారమే యగుదుము. దయాళుఁడైన భగవంతుఁడు మహామునులయొక్క, ఋషులయొక్క కార్యముల నెంతయాదరించునో మన చిన్నచిన్న పనులఁగూడ నంతిగానె యాదరించును. ఈ విధముగా శ్రమపడి మనధర్మముల మనము నెఱవేర్చితిమా యవసానకాలమందు గత దినములలో మనము జేసిన చర్యల నన్నిఁటి జ్ఞాపకము దెచ్చుకొని నిశ్చయముగా మనము శరీరము విడువవచ్చును. సర్వసాక్షిఅయిన భగవంతుడు గూడ మన చర్యలను మెచ్చును.

ఉమ—చెప్పు అక్కయ్యా! చెప్పు. (అని బాష్పములతో నిండిన తన కన్నులెత్తి యామెవంకఁ జూచి) సంతాపము నొందిన నా మనస్సునకు నీమాట అమృతమువలె నున్నవి. చిన్నపుడు నీమాటలు నే నెంతో ప్రీతిగా వినుచుండెడి దానను. ఇప్పుడు పెద్దదాన నైన తరువాతఁగూడ నీ మాటలు నీ సలహాలే కావలసినదాన నైతిని. నేను పట్టి తెలివి తక్కువ మొద్దును. నాతల్లీ! నీకు దండము పెట్టుదును. గాని నేను చేయవలసినపని యేమిటో తెలియజెప్పి నన్ను నీ కడుపులోఁ బెట్టుకోవే.

బిం—"ఓసీ ఉమా! అలాగంటివా నీకు స్మారకము లేదనుకొనవలసి వచ్చును. నీవంటి నిగర్వులున్నారఁటే. నీకున్న భాగ్యము, నీకున్నదీవి మఱొకరికున్న పక్షమున జిన్నప్పటి స్నేహితులతో, అందులో మావంటి పేదవాళ్ళతో పల్లెత్తి మాటలాడుదురా? ఇంత మంచి మనస్సున్న యాఁడుది అన్నికష్టములుదాటి గట్టెక్కి తప్పక సుఖపడగలదు. ప్రస్తుతము నీకున్న బాధలను బోఁగొట్టుకొనుటకుఁ బ్రయత్నించు. ఆఁడదాని కుండవలసిన శాంతము, విశ్వాసము నీ మనస్సులో నుంచుకో. అటుపిమ్మట పెనిమిటి మనస్సు మెప్పించిన భార్యవై కుమాళ్ళ తల్లివై యెంతో అంత సుఖ పడుదువు" ఈ మాటలు వినఁగానే యుమయొక్క పెదవులమీద పచ్చియు రాని జిరునగవు కొంచెము మొలక లెత్తెను. కాని యామె దానికిఁ బ్రత్యుత్తరముమాత్ర మీయలేదు. అంతలోఁ దలవాకిట, గుఱ్ఱపుబండి చప్పుడు నౌకరుల పరుగులు గడబిడలు వినవచ్చెను. ఆధ్వనియేమో వెనుకటి యనుభవమునుబట్టి యుమ చక్కఁగా నెఱుఁగును. అంతట నామె తన పినతండ్రి కూతురువంకఁ జూచి లోలోపలనుండి వచ్చుచున్న గుబులు నడఁచుకొని మిక్కిలి మెల్లగా నామెతో నిట్లనియె: "బిందక్కయ్యా! ఆ కిటికీలోనుండి యొక్కమారు చూడు: మా సంసారసౌఖ్యము కొంత నీ కగపడును" అనవుడు బిందావంకఁ జూచెను. చూడఁగానే యామెగుండె దడదడ లాడెను. ధనంజయుఁడు కోటలోనుండి యింటికి వచ్చెను. ఆయన కట్టిన వస్త్రములు చెదిరిపోయి యుండెను. ఒంటిమీఁద గుడ్డ యెఱుఁగక స్మారకము లేకయున్న యా పురుష విగ్రహమును సేవకులు పట్టుకొని మేడమీఁదికి దీసికొనిపోయి త్రాగిన సారామత్తు నిద్రలో దిగిపోవుటకై పండు కొనఁ బెట్టిరి. ఆయవస్థ జూడఁగానే బిందుకన్నులు బాష్పపూరితములు కాఁగా నుమవద్దకు వచ్చి కౌగలించుకొని, "తల్లీ ఉమా! ఆడుఁది పడవలసిన బాధలు, అనుభవింప వలసిన యనుభవములు ననుభవించు చున్నావే అమ్మా! నీవెంతబాధపడు చున్నావో దేవునకే తెలియవలెను. నాలుగుమూఁడు మాసములలోనే యెంతో మారిపోయినావు.

నీవు చిక్కి మారిపోయియున్నావు. అయితే అయినదిలేలమ్మా! తొందరపడకు. కోపగించుకొనకు. ఎంత దుఃఖము వచ్చిన నంతదుఃఖము పడకు. ఈబాధలన్నియు నెంతో ఓపికతో పడుము. యిప్పటికిని, ఆయనను సంతోష పెట్టుటకు మంచిమార్గమున ద్రిప్పుటకుఁ బ్రయత్నముఁ జేయుము. ఇంతకంటెను దుర్వ్యసనములలోఁ దగిలి తిన్నగా భ్రష్టులై పోయి తిరిగి బాగుపడి పవిత్రమైన సంసారసౌఖ్యమును మరిగి నడచుకొన్నవారినెందరినో యెఱుఁగుదును. ప్రకాశమానమైన నీబ్రతుకున కడ్డమువచ్చిన దుఃఖమేఘములను దొలగింప జేయుమని నేను దైవమును వేయివిధములఁ బ్రార్థించెదను. ఇది భగవంతుడే చేయవలెను. మనుష్యమాత్రునివలనఁ గాదు.

ఉమ__భగవంతుఁడుగాదు, నామరణమే యీదుఃఖమును దీర్చును. అని మెల్లగాఁ దనలో ననుకొనుచుండఁగా బిందు వెళ్ళెదనని చెప్పి కన్నులనుండి బాష్పములు దొరగ నామెను వదలి వెళ్ళెను.

పదునొకండవ ప్రకరణము

దేవీనవరాత్రములు

దేవీనవరాత్రములు సమీపించినవి. దేశ మంతయు నవనవ వికాసముతో నిండి యుండెను. స్త్రీలుపురుషులు తమకు, బిడ్డలకు నూతనవస్త్రములుసంపాదించియవిధరించుట కెంతో ముచ్చటపడుచుండిరి. పాఠశాలలు కట్టివేసిరి. పూజలు జరుగుచున్న గృహములలో నాటకములాడుటకు, జాతరలు చేయుటకు నేర్పాటు చేయఁబడెను. సింహవాహనము నెక్కిన వీరరసాధిదేవతయగు కాళికాదేవి యొక్క విగ్రహములు కుమ్మరవాండ్రు వేలకొలఁది చేసి యలంకరించి యమ్మఁజొచ్చిరి. గృహయజమానురాండ్రు, భోజనపదార్థములు సంగ్రహించుట మొదలగు ప్రయత్నములు విరివిగా జేయఁజొచ్చిరి. పెండ్లియైన కూతుళ్ళ గలతల్లులు తమ యల్లుళ్ళనిమిత్తమై మంచి మంచి పిండివంటలు వండి సిద్ధము చేసిరి. దూరప్రదేశములలో నుద్యోగములు చేయుచున్న పడుచువాండ్రభార్యలు పుట్టిన యిండ్లనుండి యీపండుగకుఁ దప్పక తమ భర్తలు వత్తురని నిశ్చయించుకొని దినములు లెక్కపెట్టుకొనఁ జొచ్చిరి. "నామగనికి సెలవుదొరకునా ? దొరగా రాయనను నిక్కడికి

రానిత్తురా? ఎందుకు రానీయరు? ఆదొరలు మాత్రము తమ స్వదేశములో నున్న తమ భార్యలను జూడవలయునని అప్పుడప్పుడు తలంచుకొనరా? అని భర్తల యాగమనమును బ్రతీక్షించుచున్న యువతులెంతో దలంపఁ జొచ్చిరి.

భాగ్యవంతులకు విలాసవంతులకు భోగ మనుభవించు కాలమిదె. రహస్య స్నేహములు గలపడుచువాండ్రు తమ ప్రియురాండ్రతో గలిసి పడవ షికారు వెళ్ళుటకై నావలద్దెకు పుచ్చుకొనిరి. నాటకశాలలో నృత్యగానములు సల్పుటకై తగిన యేర్పాటులు చేయఁబడెను. ఈమహోత్సవమునకు సర్వవిధప్రయత్నములు జరుగును గనుక ఇది యున్నదా అది యున్నదా యని వేరుగ నడుగనక్కఱలేదు. ఈపండుగసంతోషము పట్టణములలోకంటెఁ బల్లెలలో విశేషముగానుండును. భగపతియైన భూదేవి శరత్కాలపు పంటలను లోకమున కొసంగెను. రైతులు చేలుకోసి కుప్పలునూర్చుకొని భూయజమానులకు శిస్తులిచ్చివేసి ఋణదాతలకు బాకీమొత్తములుతీర్చి ధాన్యములు గాదులలోను పురులలోను బోసికొనిరి. మంచిపంటలు పండించిన కాఁపుల పడుచుభార్యలు గాదులలోని ధాన్యము కొంతచాటుగఁ దీసికొని దగ్గరసంతలకుఁ బోయి ఆధాన్యమిచ్చి అంచుచీరలు, నల్లపూసలు, గాజులుకొని తెచ్చికొనిరి. స్త్రీలుఁ బురుషులు తమతమస్థితికిం దగినట్లు పోడిమిగఁ బంటపండుగులు చేసికొనిరి. మొత్తముమీఁద నీదేశములో నున్నట్లు పోడిమిగ తనివిగలిగి జీవించు పంటకాఁపులు లోకమందెక్కడను లేరు.

వానలు వెనుక బట్టినవి. మునుపు వందల కొలఁది మైళ్ళస్థలము నాక్రమించి పెచ్చు పెరిగి గట్లకగదాసిన మహానదులు ప్రవాహములు కాలక్రమమున సన్నగిలి నిజగర్భముల మాత్రమే యాక్రమించుకొని యుండెను. భూదేవియుఁ బావనస్నానముజేసి క్రొత్తబట్ట కట్టుకొన్న దానివలెఁ బచ్చనయి చాల రమణీయముగఁ గనఁబడెను. మనోహరమైన యాశరత్కాలమునందు చంద్రమండలము సంపూర్ణ ప్రభావంతమై పొలముల మీఁదను బురములమీఁదను గ్రామములమీఁదను ఆరామములమీఁదను దవకిరణములం బ్రసరింపఁజేసి వెన్నెలలఁ గురియుచు మహానందజనక మయ్యెను. వాయువులు వేడిమియును జలియును లేక సుఖముగ శరీరముల స్పృశియించుచు భోగ్యములై యుండెను. వేయేల? ప్రతివస్తువు పండుగదినములలో నుండవలసిన విధముగ సుఖప్రదముగ శుభసూచకముగ నుండెను. గ్రామములయందలి ప్రతిగృహమందు ధాన్యములను దంపుటవలన చెరుగుటవలనఁ గలుగుచప్పుడులు వినఁబడుచు వచ్చెను, గుడిసెలలోఁ గాఁపురము సేయు

పేదలు గడ్డితోఁ దమయిండ్లను చేసికొనిరి. ఈశరత్కాలపు పూజ పంటకాలపు పూజయే యని చెప్పవచ్చును. ఏలయన, సింహరాశి వెనుకవచ్చెడు కన్యారాశినే సింహము మీఁద నెక్కివచ్చెడు పర్వతకన్య యైన పార్వతిగ జనులుభావించిరని తోఁచు చున్నది. సంతోష కరములైన యీపండుగ దినములు సయితము, ఉమకు సంతోషమును గలిగింపవయ్యె. స్వభావముచేత నామె మితభాషిణి. దానికిం దోఁడుగ మగని యనాదరణమును మనో రథ భగ్నతయు నామె హృదయమున లోఁతుగా నాటుకొనియెను. ధనంజయుఁడు ఉన్నత చిత్తయైన యామెకంట నెప్పుడు పడిన నొకవిధమైన సిగ్గును చిన్నతనమును బొందఁజొచ్చెను. కాని యతనివద్ద నున్న మంచిగూడ మనము చెప్పుకొన వలయును. తప్పుమార్గమును బట్టి సొమ్ము వమ్ము చేయుచున్న యాదూబ యసహ్యకరములైన తన దుర్వ్యసనముల మానవలయు ననియు మానలేకున్న నధమపక్షము పైకంత ఘోరముగఁ గనఁబడకుండ నుండ వలయుననియు హద్దుమీఱకుండ నుండవలయుననియుఁ గొన్నినాళ్ళు ప్రయత్నించెను. కాని యతఁడు దుర్బలుఁడుఁ బరాధీనుఁడు నగుటచేతఁ జిరకాలమునుండి యాశ్రయించిన దురభ్యాసములు వానిప్రయత్నముల నణఁగఁద్రొక్కెను. అదియునుఁగాక, అతనివలన బ్రతికి, అతని నెత్తురుఁ బీల్చుచున్న స్నేహితులతని కొకవేళ మంచిబుద్ధి పుట్టినను మనసు విరిచి దానిని క్షణములో ద్రిప్పివేయఁ జొచ్చిరి. అందుచేత నెప్పుడైన క్షణకాల మతఁడు వ్యసనముల జిక్కక యున్నను వెంటనే మునుపటికంటె నెక్కువ యగాధములోఁ దుముకుచు వచ్చెను. దానిఫలమేమన, తనభార్యకు మనోవ్యథ కలుగునేమో యని తెలివి వచ్చినప్పుడు కొంచెమాలోచించుకొని సాధారణముగ భార్యయున్న లోపలిమందిరమునకు, బోవుటయే మానుకొనెను. ఉమ సంభవించిన దురవస్థం దలంచి లోలోపల కుళ్ళి దుఃఖము దిగమ్రింగుటయే గాని యొకరిని నిందింప లేదు. తనకడుపులో బాధ నొకరితోఁ జెప్పికొనలేదు. బిందు వచ్చి యీమెదురవస్థకు వగచినప్పుడు మీఁదపడి యేడ్చినప్పుడు గూడ ఉమ లేనిచిఱునవ్వు మొగమున దెచ్చి పెట్టుకొని తనగుట్టు చెప్పక యేవోమాటలతో నామెనోదార్చి పంపివేసెను. తనగృహకృత్యముల నెప్పటి యట్లె తప్పక చేసికొనుచు నామె బిందుతో నింతో శాంతముగాను అప్పుడప్పుడు సంతోషముగాను మాటలాడుచు వచ్చెను. అదియునుఁ గాక ఆమె రుచిగల వంటకము లెన్నో స్వహస్తముతోనే వండి, యనురాగబంధమును దెంపివేసి లోపలికి రానొల్లని యాజీవితేశ్వరుని కొఱకై చావడిలోనికిఁ బంపుచుండును.

అట శరచ్చంద్రుఁడు హేమచంద్రుని యింటికి తరచుగ వచ్చుట మానెను. అప్పుడప్పుడు బిందుమాత్ర మతని నొకసారిరమ్మని వర్తమాన మంపుచు వచ్చెను. ప్రతిదినము

మధ్యాహ్నమున బిందుయొక్క పనికత్తె కోసిన చెఱుకుముక్కలు, పంచదార నద్దిన యనాస పండుముక్కలు మఱికొన్ని భక్ష్యములు శరచ్చంద్రుని నిమిత్తము కష్టపడి సుధ సిద్ధము చేయుచున్నదని యాతఁడు స్వల్పకాలములోనే గ్రహించెను. "పాప మీయాఁడువాండ్రు నా నిమిత్త మింతకష్టము లేల పడవలయును? నానిమిత్త మిటమీఁద నీవస్తువుల దీసికొని రావ" ద్దని యతఁడొకటి రెండుసారు లాపనికత్తెతోఁ జెప్పవ వచ్చెను. అట్లనుటయే గాని తెచ్చినప్పుడెల్ల నొక్కముక్కయైన మిగులకుండ నతఁడు భక్షించుచు వచ్చినందున నాబెట్టుసరి పైపయిదేగాని మనఃపూర్వక మైనది గాదని యాపనికత్తె గ్రహించి యెప్పటియట్ల ప్రతి దినము ఫలహారములఁ దెచ్చి పెట్టుచువచ్చెను.

ఇట్లు కొన్నివారములు గడువ దేవీనవరాత్రములు వచ్చెను. భవానీ పురమందు మిక్కిలి సంపన్నుఁ డయిన దేవీప్రసన్నుని గృహమందు గొప్పయుత్సవములు జరిగెను. ఆగృహమందు గొప్పదుర్గావిగ్రహము పూజింపబడెను. అహోరాత్రము లెడతెఱపిలేక గానములు జరిగెను. అచ్చటి జాతరలు నాటకములు చూచుటకు జనులు గుంపులు గుంపులుగ వచ్చిరి. దేవీప్రసన్నునిభార్య ముందు వసారాలో నొక తెరవెనుకఁ గూర్చుండి మూఁడు రాత్రులు దీపములు పెట్టినది. మొదలు తెల్లవారు వఱకు మేలుకొని కన్ను మూయక జాతరలు చూచెను. ఇరుగుపొరుగున నున్న గౌరవము గలయిండ్లలో స్త్రీలందరు వచ్చి యామెచుట్టునుఁ గూర్చుండి యాయుత్సవములం జూచిరి. అక్కడి నాటకపు కథలు రాధాకృష్ణుల శృంగారకథల నుండిదీసికొని వ్రాసినవి. పాడినపాట లెంతో రమ్యముగా పరవశము చేయునవిగా నుండెను. చూడవచ్చిన స్త్రీలు తమబిడ్డలను గూడ దీసికొనివచ్చి రాత్రియంతయుఁ దమలపాకుల నములుచు, కథాభాగముఁ జెవులు దోరబెట్టుకొనివినిరి. ఆనాటకప్రయోగమందు విరహతాపముచేత బాధపడుచున్న రాధ యనురాగ బద్ధుఁడయ్యుఁ దన్నుపంచన జేసి పోయిన యాటక్కరి గోపాలకృష్ణుని లీలలను గూర్చి గానము జేసి యేడ్చినప్పుడు, చూడవచ్చిన స్త్రీలందరు విశేషముగ దుఃఖించిరి. దేవీ ప్రసన్నునిభార్య బిందునుగూడ బిలిచినందున వెళ్ళకపోవుట మంచిదిగాదని యామెకూడ నుత్సవమునకుఁ బోఁ దలఁచి యొకనాటిరాత్రి బిడ్డల నిద్దరను సుధ కప్పగించివెళ్ళి రాధాకృష్ణ నాటకములను జూచెను. ఆమె తిరిగివచ్చి భర్తతోఁ గలిసి మాటలాడునప్పటికి తెల్లవారెను "నాటకము చక్కగా నున్నది. ముఖ్యముగాఁ దనమీఁద మహాకోపము దాల్చినరాధను శ్రీకృష్ణుఁడు బతిమాలినకథపట్టు మిక్కిలి బాగున్నది మీరొక రాత్రి వెళ్ళి యెందుకు చూచి రాఁగూడదు?" అని బిందుభర్తతోఁ బలికెను. "చాలు

చాలు; క్రొత్తగాఁ గాపురమునకు వచ్చినప్పుడు నారాధన నేను బతిమాలువప్పటికే నాప్రాణము విసికిపోయినది. ఆయనుభవము మఱియొకసారి నాకక్కరలేదు" అని హేమ చంద్రుఁడు పరిహాసముగా బదులుచెప్పెను. "లేనిపోనికథలు కల్పించకండి. నాసొత్తిమీద నపవాదులు వేయకండి. మీకు పాపము రాఁగలదు" అని తనచేయి మగనినోటి కడ్డము పెట్టెను.

దేవీపూజ, ఆశ్వయుజ శుద్ధ దశమినాటితో సమాప్తమయ్యెను. ఆదినము గొప్ప యుత్సవము జరిగెను. క్రిక్కిరిసిన వీధులలోను, గృహములలోను కూడలి కొందలగు ప్రదేశములలోను నదీతీరములను మృదంగాది వాద్యముల ధ్వనులు పిక్కటిల్లెను. స్త్రీలు పురుషులు తమకుఁగల సమస్తాభరణములం ధరించి మేలి వస్త్రములను గట్టుకొని సముద్రతరంగములవలె వెనుకకు ముందుకుఁ బోవుచు వీధులు నిండిరి. పేదలలోఁ బేదలు కూడ నెట్లో సంపాదించి క్రొత్తబట్టలఁ గట్టుకొనిరి. భాగ్యవంతులు వైభవములచేతను దానములచేతనుఁ దమభాగ్యముల బ్రకటించిరి. దేవీవిగ్రహములను భేరీమృదంగాది వాద్యములతోను సంగీతములతోను వీధుల వెంబడి నూరేగించిరి. సాయంకాలము కాఁగానే యీయూరేగింపులు కాగడాలతోను, నెరదీపములతోను బచ్చదీపములతోను జరిగెను. ఊరేగింపు కాఁగానే ప్రతి విగ్రహము నదిలో బాఱవేయఁబడెను. అనంతరము చిత్రమై సంతోషకరమై హిందూదేశమందు మాత్రమే వ్యాప్తమయిన యాచారము జరిగెను. అది యేదనఁగా గొన్నిమాసముల క్రిందటను సంవత్సరము క్రిందటను మిత్రులు బంధువులు, తల్లిదండ్రులు, బిడ్డలు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు నొక్కసారి కలిసికొని పరస్పర యోగక్షేమము లడిగి తెలిసికొనుట, పెండ్లియైన యాఁడు పడుచులు మేలిముసుఁగు వేసికొని భర్తలకును బెద్దలకును మ్రొక్కుదురు. చిన్న పిల్లలు గుంపులు గుంపులుగాఁ గూడి బంధువుల దర్శనము చేయఁదలఁచి వారు బసలుదిగి యున్నగృహములన్నిఁటికిఁ బోవుదురు. ముసలమ్మలాబిడ్డలను కౌఁగిలించుకొని కన్నుల నానంద బాష్పములు గారఁ జిరంజీవులు గమ్మని వారిని దీవింతురు. "నాసొత్తి మీఁద నెన్నివెండ్రుకలున్నవో యన్నియేండ్లు బ్రతుకవలెను. లక్ష్మీదేవియు సరస్వతీదేవియు మీయిండ్లలో శాశ్వతముగాఁ బడియుండవలెను. మీరు బంగారపు కలములఁ జేతఁబట్టి పేరుప్రతిష్ఠ సంపాదింప వలయును. కుమాళ్ళతండ్రులై మనుమలను మునిమనుమలను నెత్తి సుఖముగా నుండవలయును" విలువ గలదుస్తులు ధరించి వచ్చి తమ పాదములకు భక్తితో మ్రొక్కిన చిన్నబిడ్డలను తలలు నెగిసివృద్ధస్త్రీలు కొందరు నైవిధమున మనఃపూర్వకముగా

దీవించిరి. ఈయుత్సాహములోఁ బూర్వము మనస్సులో నాటుకొనియున్న కోపము, అసూయ మొదలగునవి యంతరించిపోయెను. అనేకసంవత్సరములనుండి మనస్సులు దిరిగిపోయి మాటలులేక యున్న చుట్టములు స్నేహితులు ఆనాటిరాత్రి సమాధానపడినట్లును, తల్లిదండ్రులమీఁద కోపగించి యిల్లు విడిచి లేచిపోయిన పెంకి పిల్లలు పశ్చాత్తాపపడి యెంతో వినయముతో మరల మాతాపితలను జేరినట్లును అనేక నిదర్శనములు గలవు. సర్వజన సంతోషకరమైన యాదిన మనేకాభిప్రాయ భేదములను నణఁచివేయును. అనేకహృదయ వ్రణములను మాన్పివేయును. మరియు వైరములు శాశ్వతములు కావనియు పొందుగలిగి యున్న యెడల లాభము గలవనియు స్త్రీలకు బురుషులకుఁ దెలియఁ జేయును.

బిందు రాత్రి భోజనము ముగించునప్పటికి రమారమి పదియొకండుగంట లయ్యెను. బిడ్డలు నిద్రపోయిరి. సుధయు భోజనముచేసి పండుకొనఁ బోయెను. హేమచంద్రుఁడు గూడఁ బండుకొనెను. హిందూగృహములలో నున్న వాడుకప్రకారము గృహయజమాను రాలొక్కతెయే భోజనముచేసెను. పనికత్తెయుఁ బగలెల్ల పనిచేసి యింటికి బోయెను. భోజనానంతరము బిందు వంటయింటి తలుపుమూసి గొళ్ళెమువేసి మేడ మీఁదికిఁ బోవఁదలచు చుండఁగా నెవరో తలుపుఁ దట్టినట్లు చప్పుడు వినఁబడెను. "ఇంత ప్రొద్దుపోయిన తరువాత వచ్చువారెవరు చెప్పుమా" అని సందేహించి బిందు తలుపుఁ దీయక యూరకుండెను. అంతలో నాచప్పుడు రెండవమారయ్యెను. "ఎవరాతలుపుదగ్గర" అని యామె బిగ్గరగా నడిగెను. అందుకుఁ బ్రత్యుత్తరములేదు. భర్తగారెవరైన వచ్చియుందురేమో యని యాయన నొకసారి యామె లేపఁదలఁచెను. కాని హేమచంద్రుఁడు మిక్కిలి యలసిఁ పండుకొని నిద్రపోవుటచేత వచ్చిన మనుష్యుని పేరు తెలియకుండ మగనిని లేపుటకామె యిష్టపడదయ్యెను. ఇష్టపడక మెల్లమెల్లఁగా నడుగులు పెట్టుకొనుచు వీధితలుపుదగ్గరకు వెళ్ళి నెమ్మదిగాఁ దలుపుతీసెను. తీయఁగానే యొకమనుష్యుఁడులోపలఁ బ్రవేశించెను. అతఁడెవరో చీకటిలో బిందునకుఁ దెలియలేదు. కాని యొక నిమిషములోనే వచ్చిన యతఁడు శరచ్చంద్రుఁడని యామె తెలుసుకొనెను. కాని యతఁడెంతో మార్పుజెంది యుండెను. అతని తలవెండ్రుకలు చాలకాలమునుండి కత్తిరించుకొనక పోవుటచేత మొగముపై బడజొచ్చెను. అతనికన్ను లెప్పటియట్లుండక మునుపటికంటె మెరయుచుండెను. అతని మొగము తెల్లబడెను శరీరము మిక్కిలి కృశించియుండెను. భుజములపైనున్న యుత్తరీయము ఉండవలసినంత పరిశుభ్రముగా లేదు.

"బిందూ! ఇంతకాలమునుండి నిన్ను జూచుటకు రానందుకు నీవు నన్ను క్షమింపవలెను. ఈవేళ ఆశ్వయుజ శుద్ధ దశమి యగుటచేత నీకు నమస్కారములుచేసి పోవలెనని వచ్చితిని" అని శరచ్చంద్రుడు పలికెను.

"అబ్బాయి! నీవు చిరంజీవివై త్వరగాఁ బెండ్లికొడుకవుగమ్ము. నేను బ్రతికి యుండగా నీవు ఒక యింటివాఁడవై హాయిగా నున్నప్పుడు నిన్ను చూడవలెనని యున్నది. అప్పగారు తమ్మునికింతకంటె నెక్కువ దీవనలేమి యివ్వఁగలదు" అని బిందు బదులు చెప్పెను.

అందుకు శరచ్చంద్రు డేమియు నుత్తర మీయక వంగి బిందు పాదములకు నమస్కారము చేసెను. బిందు వానిని మరల దీవించి లేవనెత్తెను. అప్పుడు వారిట్లు మాటాడిరి.

బిం—నీ క్షేమవర్తమానము మేము ప్రతిదినము వినుచుండుటచేతను మాకేదైన దిక్కు సంభవించినయెడల నీవు తప్పక వచ్చి సహాయము చేయుచుందువని నమ్మియుండుటచేతను నీవిన్నాళ్ళనుండి మాయింటికి రాలేదని నాకుఁ గోపములేదు. కాని నాయనా! రాత్రి పగ లొక్కటేవరుసను జదివి శరీరము పాడుచేసుకొనుచున్నావేమి? ప్రాణములకంటెఁ బుస్తకము లెక్కువా? నీకండ్లు గుంటలు పట్టినవి. మొఁగము తెల్లబడినది. నీవు రాత్రి చాల ప్రొద్దుపోయినదనుక మేలుకొనుచున్నావని తోఁచుచున్నది. నీవు చిన్నప్పటినుండి యుక్తాయుక్తములు చక్కగా నెఱిఁగినవాఁడవు నీకు నేను చెప్పవలసిన యవసరమున్నదా? నామాట విను. రాత్రులు సరిగా నిద్రపో. అన్నము వేళపట్టున తిను. నీవంటి తెలివితేటలు గలవాఁడు పరీక్షలను గురించి భయపడనక్కరలేదు."

శర—(చిఱునవ్వుతో) బిందూ! పరీక్షలలో దేలుటవల్ల మనుష్యునికి సౌఖ్యము కలుగునా? మన హేమచంద్రుఁడు ఏ పరీక్షలయందు తేలినాడు? అతఁడు పొందెడు సౌఖ్యములలో నూరవవంతైనఁ బొందెడివారెందఱున్నారు?

బిం—ఇన్ని సంగతులు తెలిసినవాఁడవు పరీక్షకోసము బెంగపెట్టుకొని శరీరము చెడగొట్టుకోవలసిన యవసర మేమున్నది?

శర—పరీక్షను గురించి నాకు బెంగే లేదమ్మా!

బిం—అట్లయిన నీకీ మనోవేదన, బెంగ దేనివల్ల కలిగినది?

అందుకు శరచ్చంద్రుడు ప్రత్యుత్తరము చెప్పక యెత్తుగానున్న చప్టామీఁద బిందును గూర్చుండఁబెట్టి యామె ప్రక్కను దాను కూర్చుండి యామె రెండు చేతులు పట్టుకొని తన వెంగముమీఁదఁ బెట్టుకొనెను.

బిం__ఇదేమిటోయి కంటనీరు పెట్టుకొను చున్నావారయేమి? నేను వినగూడని బెంగ యేదైన నీ మనస్సులో నున్నదారయేమి?

శర__మనమిద్దరము అప్ప తమ్ముఁడు పెరిఁగినట్లు పెరిగినాము. నీవు వినఁగూడని బెంగలు నా హృదయములో నేమియు లేవు. నీ మనస్సులో నున్నది మర్మము లేకుండ నీవు నాతోఁ జెప్పుదువు. అలాగే నేను నీతోఁజెప్పుదును.

బిం__అది తెలిసియుండియు మన చిరకాల స్నేహము మఱచి నన్ను గ్రొత్త దానివలెఁ జూచుట నీకు ధర్మమా?

శర__నీవే గ్రొత్తదానవైతే ఇఁక నీ లోకములో నావాళ్ళు లను శబ్దము నా కుండనే యుండదు. నాకడుపులో నున్నది దాఁచక నీదగ్గఱ వెళ్ళబోసుకొనుటకే వచ్చినాను. కాని నేను పట్టి దురదృష్టవంతుఁడను. నిర్భాగ్యుఁడను (అని అతఁడు గొంతెము పడఁకను అతని కన్ను లెఱ్ఱబడెను.)

బిం__(ఆతురతతో మెల్లఁగా) భయపడకు. నీ మనస్సులో నున్నదంతయు అప్పగారివంటిదాన నగు నాతోఁజెప్పు.

శర__చెప్పనా? కాని నా మనస్సు పాడుమనస్సు అయిపోయినది. నేను స్నేహమున్నచోట ద్రోహముచేసిన పాపాత్ముఁడనైనాను. మా అప్పవంటివారవునీవు కనఁబరచిన దయకు విశ్వాసఘాతుకుఁడనైతిని. నా హృదయము చీఁకటివలె నల్లగానున్నది. ఇటువంటి పాడుహృదయము నీకుమాత్రమెట్లు వెల్లడిచేయగలను! (అని యతఁడు ఆమె వ్రేళ్ళు ఎఱ్ఱబడునట్లు బిందు చేతులు గట్టిగాఁ బట్టుకొనెను.)

శరచ్చంద్రుఁడు అప్పటికిని గడగడ వడఁకుచుండెను. అతనికన్నులు నిండనిప్పులవలె యెఱ్ఱపడెను. ఇటువంటి స్థితిలో నతని నెన్నఁడును బిందు చూచియెఱుఁగదు. చిన్నతనము నుండియు వానిని సోదరభావముతోఁ జూచుచున్న తన విషయమున నతఁడు చెడ్డతలంపులు తలంచుచుండునా యని యామె యొకసారి సందేహించి, అటువంటిది స్వప్నమందైన జరుగదని మరల నిశ్చయించుకొని మరల భయంకరాకారముతో నొడలు

తెలియనియట్టులున్న యా పడుచువానిని జూచి మనస్సులో భయపడి యా భయమును నివారింపఁ బ్రయత్నించి మునుపటివలెఁ జనువుతోఁగాక కొంచెము కఠినముగా "నేను నిన్ను చిన్నప్పటినుండి నా తమ్మునివలె జూచినాను. మీ యప్పవలె నీవు నన్ను చూచి నావు. అందుచేత అప్పగారితోఁ దమ్ముఁడు చెప్పవలసిన విషయమైనయెడల నీమనస్సులో నున్న సంగతి తప్పక చెప్పుము" అని పలికెను.

శర—అయ్యో! నా మనస్సులో నున్న యూహాలు అప్పగారితోఁ చెప్పఁ దగినవి కావే.

బిం—అయినఁ జెప్పకు. అఁదుదాని చేతు లీ ప్రకారముగాఁ నీవు పట్టుకొన గూడను. అప్పగారియెడల నెంతగౌరవ ముండవలెనో యంతగౌరవముతో మాటాడుము. (అని కోపముతోను దుఃఖముతోను బదులు చెప్పెను.)

అంతట శరచ్చంద్రుఁ డామె చేతులు వదలివైచి తల వంచుకొనియెను బిందు తత్తరపడి "అంతటి దయాళుఁడై అంతటి సత్యవంతుడై అంత శాంతస్వభావుడైయున్న ఈ చిన్నవాఁడు అట్టి చెడ్డతలంపులను మనస్సులోఁ బెట్టుకొనియుండునా?" యని మరల వితర్కించి సందేహమునుండి విముక్తురాలై ధైర్యముతో నిట్లనియె "అబ్బాయీ! నేను వినఁగూడనిది నీ మనస్సులో నేదియునుండదు. నీ మనస్సులో నున్నది స్వేచ్ఛగాఁ జెప్పుము. నేను వినఁదలచుకొన్నాను."

శర—ఈదయఁ జూపినందుకు భగవంతుఁడు నీకు సకల సౌఖ్యములిచ్చుగాక! నేను మర్మమువిడిచి నా మనస్సులో నున్నది నీతోఁజెప్పెదను గాని నేను చెప్పకమునుపు నాకొక అభయప్రదానమిమ్ము. ఈనా కోరిక నెరవేరక భగ్నమై పోయినయెడల నా మాటలు నీ హృదయములోనే స్థాపితములై యుండవలయును. గాని యెన్నఁటికినిఁ బైకి రాగూడదు.

ఆశ లడుగంటిపోవ, దీర్ఘవిచారమగ్నుండనై, బ్రతుకవలసిన దుర్గతి నాకుఁ బట్టవచ్చును. కాని నేను దానికి సహించేయును. నాకంటె పవిత్రయై, గౌరవార్హయైన పడఁతిని గురించి లోకులు కాకులట్లు తేలికమాట లాడుట నా కిష్టములేదు.

"శరచ్చంద్రుఁడా! నీవు నామాట నమ్ముము. నేను నీ రహస్యమును బయటఁ బెట్టను" అని బిందు ప్రత్యుత్తరము చెప్పెను.

అంతట శరచ్చంద్రుఁడు తన యంతరంగ సంక్షోభము నడఁచుకొని యుభయ జేతులను హృదయముమీఁదఁ బెట్టి యదుముకొని ప్రార్థనపూర్వకముగా బిందు హస్తమును బట్టుకొని తన మొగమామె కగపడకుండ చేయుటకై తలవంచికొని స్పష్టముగా వినఁబడని సన్న యెలుగుతో నిట్లనియె : 'శ్రీ చెల్లెలు'. నిర్మలహృదయముగల యా వితంతువు సుధ, భూలోకమునకుం దిగివచ్చిన యప్సర. ఆమె నా భార్యయగున ట్లనుగ్రహింపుము.

శరచ్చంద్రుని హృదయమందలి మోహపు జడివాన నిప్పుడు బిందు గుర్తెరింగెను. కడచిన యారుమాసముల చిత్రచరిత్ర యామెకిప్పు డర్థమయ్యెను. హిందూవితంతు వివాహము పరమ పాతకము, లోకనింద; ఆలోచించుటకు వీలులేని వెఱ్ఱితలంపు.

అట్లుఱిగియు నతఁడు చంచలమైన యామోహము పలికించిన ధోరణి నిట్లు పలుకఁజొచ్చెను. "అక్కా! బిందూ! నామాటవినుము. నమ్మినవారికి ద్రోహముచేసిన దుర్మార్గునిమాట వినుము. మీరు చూపిన యాదరమునకుఁ గృతజ్ఞత లేక విశ్వాసఘాతుకుఁడైన వాని మాట వినుము. తాల్పుకాయగ్రామమున మీయింటి వితంతువైయుండిన మీచెల్లెలు సుధను నేను చూచి యాఱుమాసము లైనది. చూచినతోడనే నా ఛాత్ర జీవనము వెలుఁదేరినట్లు నేను తెలిసికొంటిని. అంతకుముందు నేనేకాకియగు విద్యార్థిని. పుస్తకములుతప్ప నాకు మిత్రులులేరు. చదువు తప్ప వేఱేవ్యాపారములేదు. పడుచువాండ్ర యన్యోన్యానురాగములంగూర్చి నేను పుస్తకములలో మాత్రమే చదివితిని. కాముకులు రంగస్థలము మీఁదినటులని తలంచితిని. ఈశ్వరదత్తములైన సహజమాధుర్య సౌందర్యములు కలిగి తన వైధవ్య మందభాగ్యతయో మో గుర్తెఱుంగక యుండిన యా యమాయకురాలిని, అనవనీతహృదయురాలిని, ఆచిన్నదానిని నేను చూచినప్పుడు నాకదివఱ కెన్నఁడు గలుగని - యిట్టిదని వర్ణింపరాని యొక మనోవికారము కలిగెను. కాలమే క్రమక్రమముగ నట్టివికారము నడంచు నని నేను నమ్మియుంటిని. నావిద్యాగోష్ఠి, తత్సంబంధమగు వ్యాపారములు దానిని తుడిచివేయునని విశ్వసించియుంటిని. కాని నేను కలకత్తాకు వచ్చినకొలఁది, ఇచటిన నామేను జూచుచున్న కొలఁది అదియు మంతకంతకు నాకెక్కినది. అక్కా! బిందూ! దినదినము మీయింటికి వచ్చినప్పుడు నన్ను సోదరప్రేమను జూపి సమాదరించితివి. తమ్ముని గారాము సేయుట యట్ల వలెనే ప్రేముఁడు నన్ను గారవించెను. హృదయమునందు మోహాగ్ని నివుఱుగప్పియుండ, మాటలయందు మాయసేయుచు నేను మీపవిత్రగృహముఁ జొచ్చితిని. అతికాముష

సౌందర్యముగల యాదివ్యవిగ్రహమును కనుల పండువుగా నేను చూచినకొలఁది నిషిద్ధమైన యాప్రేమరసమును నేను జుఱ్ఱుకొన నారంభించితిని. పలుమఱులు సాయంకాలమం దిక్కడకువచ్చి నక్షత్రము లాకాశమున జ్యోతులవలెఁ బ్రకాశించువరకు నేనామె ప్రక్కను గూర్చుండుచు వచ్చితిని. అపుడు నామనస్సున బైలుదేఱినవికాసము నాయంతరంగము నుఱ్ఱూతలూపుచు వచ్చెను. నీకు దయకలదేని పిచ్చివాని విపరీత భావములను క్షమింపుము. నమ్మినవారియెడ ద్రోహముచేసిన మూర్ఖుని దురాలోచనలను మన్నింపుము" అని శరచ్చంద్రుఁ డాగెను. ఆగుటయు బాష్పపూర్ణములైన యాతనినేత్రములు తళతళ మెరసెను. అట్లొక నిముసమాగి ప్రశాంతస్వరముతో మరల నిట్లనియె.

"ఒక నాఁటి సాయంకాలమున నేను కన్నులు తెరచితిని. నేనొక పెద్దగోతిలోఁ బడియుంటినని తెలిసికొంటిని. నేను సుధనుకూడ బాధించుచుంటినేమో యను భయమునఁ బిచ్చియెత్తినట్లయితిని. నాయొనర్చిన యపరాధమునుండి పాపమునుండి భగవంతుఁడామెను గాపాడెనని నేను నమ్మి నా మనస్సులో నేపడుచున్న యపారబాధ యించుకేనియు నామెకుఁ దెలియకుండఁ జేసితిని. ఆదినము మొదలుకొని నేనుమాయిల్లు వదలిపెట్టి తిరిగి గుమ్మము త్రొక్కి చూడలేను. మఱచిపోవుటకై ప్రయత్నించితినిగాని నా ప్రయత్నములు వ్యర్థమయ్యెను. ప్రాణములతో నేగాని తుడిచివేయుటకు వీలులేనిభావములు కొన్నియుండును. పసిబిడ్డఁడు చేతులెత్తి ప్రవాహము నాపుటకుఁ బ్రయత్నములు చేసినట్లు నేనీరెండు మాసములు నాయనురాగ ప్రవాహము నాపఁబ్రయత్నించి వ్యర్థుఁడనైతి. నామనస్సు పుస్తకములమీఁద స్థిరముగ నిలుపుటకుఁ బ్రయత్నించితిని. నాట్యరంగములకుఁ బోయి నా మనస్సును వేఱొకమార్గమునకుఁ ద్రిప్ప సమకట్టితిని. సెలవుదినములలో నా కళాశాలలోని విద్యార్థులతోఁ గలిసి మెలసి, యాడితిని; పాడితిని, ముచ్చటించితిని. ఎన్నో సంగీత సభలకేగి గానమునువింటిని. కాని యొక్కదినము కాదు కదా? యొక్కనిముసమైన నేనీ తలంపుల మరవజాలనైతిని.

ఈ రెండుమాసముల చరిత్రను చెప్పి నీకు విసుగుపుట్టింపఁ దలచుకొనలేను. తలదాచుకొనుటకిల్లులేక వీథిలోనే కాలక్షేపముచేయు నిర్భాగ్యుఁడుసైతము నాపడిన పాటులు పడియుండఁడు.

అక్కా! వినుము! నా మనస్సులోనున్న దున్నట్లు చెప్పుటకు నీవనుమతించితివి గావున నేను నిర్భయముగఁ బలికితిని. ద్రోహిని గర్హింపవలసినట్లు గర్హింపక నా మీఁద మునుపు చూపిన ప్రేమ చూపుము. మైత్రి తగ్గింపకుము. నేనెంతో పాపము చేసితిని.

నేను నిన్ను వంచించితిననుమాట పరమేశ్వరుఁడెఱుఁగును. నీవు నాయెడలఁ దిరస్కారముఁ జూపుదువేని, ప్రపంచములో నిఁక నామీఁద నభిమానముఁ జూపువారెవరు? నేను మునుపు గట్టి మనోధైర్యము కలవాఁడ ననుకొంటిని. ఇప్పుడు పసిబిడ్డకన్న బలహీనుఁడను. అక్కా! బిందు! నన్ననుగ్రహింపుము. నన్ను దిరస్కరింపకుము.”

ఆ పలుకుల కేమని బిందు ప్రత్యుత్తర మీయఁ గలదు? హిందూ వితంతువు యొక్క వివాహము తలఁచుకొనుటయే వెలి. ఆకార్యము మహాపాతకము కంటె ఘోరకృత్యమని హిందూ ప్రపంచమంతయు మీఁద పడును. ఆమాట బిందు శరచ్చంద్రున కప్పుడెట్లు చెప్పఁ గలదు? ఆశాభంగము చేత నా పడుచువాఁడు ఘోరకృత్యమేదయినఁ గావించుకొనవచ్చును, లేదా బ్రతికియుండఁగానే యతిదారుణాశాభంగముచేత నుత్సాహ మెల్ల డీలుపడి మరణదుఃఖ మనుభవింపవచ్చును.

కాని యా యువతి, యువతీజన సామాన్యమైన విజ్ఞానము, వివేకము మెఱయ, లేనిశాంతముఁ దెచ్చిపెట్టుకొని యెంతో సానునయముగ నిట్లు పలికెను.

“శరచ్చంద్రుఁడా! దుఃఖపడకుము. పాపము చేసితినని, నేరము చేసితినని నిన్ను నీవు నిందించుకొనకుము. చిన్ననాఁటనుండియు నాతమ్మునివలె నిన్నుఁ జూచుకొన్న దానను నేను నిన్నుఁ దిరస్కరింతునా? భగవంతుఁడు నాకన్నదమ్ముల నియ్యలేదు. ఆ ప్రేమ విడనాడి యిప్పుడు నేను నిన్ను దిరస్కరింతునా? నేనాలాగున చేయలేను. సాధువైన యాఁడుదిగాని మగవాఁడుగాని తిరస్కరింప వలసినంత మహాపాపము నీవు చేసిన దేదియు లేదు. సంఘసంస్కర్తలు కొందఱు బయలుదేఱి యీ నడుమ వితంతు వివాహములను మిక్కిలి సమర్థించినను, మనయాచారములు వితంతు వివాహములను సమ్మతింపవు. అబ్బాయి! నీవుకోరిన కోరిక మిక్కిలి యసాధ్యమైనది. నేనీవిషయమై భర్తగారితో మాటలాడి, యాయన యిష్టప్రకారము నిర్ణయింపవలెను. కావున దుఃఖింపకుము. నా భర్తగారు దీనిని సమ్మతించినను సమ్మతింపకపోయినను మేము బ్రదికి యున్నంత కాలము నీమీఁద మాకు మునుపటియనురాగమే, మునుపటి దయయే, మునుపటిమైత్రియే యుండునని నిశ్చయముగా నమ్ముము”

శరచ్చంద్రుఁడు — అక్కా! నీవింతదయగా మాటలాడినందుకు పరమేశ్వరుని యనుగ్రహవర్షము నీపైఁ గురియుఁగాక! నేను నాపాపములను దాపక యొప్పుకొనిన యీ పాడుదినమున నాస్నేహితురాలు మహాకోపమున మొగము త్రిప్పుకొనక యెప్పటి మైత్రినే నాపై నెఱపునట్లు చేసిన యీ వాగ్దానమును నేనెన్నఁడు మఱవను.”

బిం—"నీవు మాపైఁ జూపిన ప్రేమకు, మామీఁద గురిసిన దయావర్షమునకు మేము కృతజ్ఞులమై యుండక, యీమాత్రమునకే కోపించి మొగముల ద్రిప్పుకొన్నచో మేము నాశనమై పోవలసినదే. గాని యీరాత్రి యాసంగతి మఱలఁ దలపెట్టకుము. మఱియొక ప్రసంగము చేయుదుము. నీవు భోజనము చేసినట్లు లేదు. ఏమైనా తిందువా? మావారినిమిత్తము పలుచనియట్లు పోసినాను. అందులోఁ గొన్ని మిగిలినవి. కాళ్ళు చేతులు కడుగుకొని నాలుగట్లు భక్ష్యములుతిని యింటికి వెళ్ళుదువు గాని."

శర—అక్కా! నన్ను క్షమింపుము. నాకేమియుఁ దినవలెనని లేదు. తింటినా జబ్బుచేయును. నేనింటికి వెళ్ళెదను. నేను కొంచెము విశ్రమింపవలెను.

బిం—అట్లయిన రే పుదయమున వచ్చి మావారితో నాలోచింపుము. నీ మనస్సులో నున్న దంత వారి యెదుట వాదించి చెప్పుము.

శర—"హేముని యెదుట నా పక్షమున నీవే వహించి వాదింపుము. అంతయు నీకేవదలివేసితిని. ఈ విషయ మేదో తేలువఱకు నే నతనినిఁ గలుసుకొనఁ జాలను."

బిం—"ఇది లోకములో లేని వ్యవహారము గనుక మావారు దీని నిటో యటో తేల్చుటకుఁ గొంత కాలము పట్టును. ఈలోపున నీవెప్పటి వలెనే యప్పుడప్పుడు మాయింటికి వచ్చుచుఁ బోవుచుండుము."

శర—ఈ వ్యవహారము తేలువఱకు హేమునిగాని సుధనుగాని నేను చూడ దలఁచుకొనలేదు. నన్ను క్షమింపుము. కాని యీసంగతి పొంచాటున నైనను, ఆమె చెవి చేరనీయకుము. ఆశాభంగము చేతను, దుఃఖముచేతను గుండెపగిలి నట్లు నావిధి యుండవచ్చును. కాని సుధ బాధ పడవలసిన యవసరము లేదు."

బిం—"అయితే సరే. నీవే వచ్చి మమ్ముఁ జూచుట కిష్టములేక పోయిన పక్షమున మావారేమి నిర్ణయింతురో నీకు జాబువ్రాసి తెలియఁజేసెదను."

శర—"వద్దు వ్రాయవద్దు. నేనే యెప్పుడో వచ్చి యాసంగతి రహస్యముగా దెలిసుకొని పోదును. నే నెప్పుడు రావచ్చునో, యెప్పుడు మీనిర్ణయము తెలిసికొనుటకు వీలుగా నుండునో చెప్పుము."

బిం—"అబ్బాయి! నే నెట్లు చెప్పఁగలను? ఒకపూట రెండు పూటలలో నిర్ణయించ గల విషయము కాదు గదా యిది! ఇది జాగ్రత్తగా నాలోచించ వలసిన

విషయము. అందులో మావారు ఆలోచన చేయుటకుఁ జాల కాలము పట్టును. రెండు మూడు వారములు తరువాత వత్తువా?"

శర—"అలాగే కానిమ్ము అది దీపాలమావాశ్య యగును. ఆదినమున వత్తును."

పండ్రెండవ ప్రకరణము.

అమ్మలక్కల సంభాషణము.

శరచ్చంద్రుఁడు బిందుగృహము విడిచి వెళ్ళుచుండఁగా దేవీ ప్రసన్నుని గృహము నుండి పనికత్తె యొకర్తు దేవికి నివేదనము చేసిన భక్ష్యములు కొన్ని తీసికొని లోపలికి వెళ్లెను.

అప్పుడు బిందుకు దానికి నీ క్రింది సంభాషణము జరిగెను

పనికత్తె—మా అమ్మగారు మిమ్మందఱిని చాలాచాలా అడిగినానని చెప్పిదేవికి నైవేద్యము పెట్టిన పిండివంటలు కొన్ని మీకిమ్మని పంపినది నేను మీయింటికే గాక చాలాయిండ్లకు వెళ్ళి వచ్చినాను. అందుచేత ఆలస్యమైనది

బిం—అపళ్ళెములోఁ బెట్టు; మీ పళ్ళెము నే పంపించెదను

పనికత్తెయట్లు చేసి తన చీరముసుఁగు సవరించుకొని, మొగమొకప్రక్కకుఁ ద్రిప్పి, ఏదో భావగర్భితముగాఁ జిన్నినవ్వు నవ్వెను.

బిం—నీవెందుకే నవ్వుచున్నావు? ఈపూజాదినములలో మీయింట నేమైన వినోదములుగాని చమత్కారములు గాని యున్నవా యేమి?

పని—నా కెఱిఁగినంతవఱకు మాయమ్మగారింట్లో అటువంటి వేమియు లేవు. (అని బిందుకు వినఁబడవలెనని కొంచెము మెల్లఁగాదనలోఁ దానిట్లను కొనెను) ఇదే గొప్ప వినోదము. గొప్పవారిటువంటిపనులు చేసిరా అది వినోదము. మావంటి పేదవారు చేసిరా అమ్మలక్కలాడిపోసికొందురు.

బిం—నీవేమిటి గొణుగుచున్నావు? వినోద మేమిటి?

పని—కాదమ్మా! కాదు; మేము కడుపుకూటికి పనిచేసికొను పేదవాళ్ళము. మా జీతములు తెచ్చికొని మా పొట్ట పోసికొందుమే గాని గొప్పవారి గొడవలెత్తుటకు మాకేమి హక్కున్నదమ్మా!

బిం—ఆమాట కర్థమేమిటి! స్పష్టముగాఁ జెప్పలేవఁటే పిల్లా!

పని—(మఱల మేలిముసుఁగు ఒకప్రక్కకుఁ దొలగించి విషపునవ్వు నవ్వి) లేదమ్మా! మరేమి లేదు. ఇప్పుడే మీలోపలినుండి వెళ్ళిన పడుచాయన యెవరు? పొద్దుపోయిన తరవాత ఈలాటప్పుడు ఎవరైన స్నేహితుఁడు మిమ్ము చూడవచ్చినాఁడా యేమిటి?

బిం—(కొంచెము భయపడి తనలో) వీధితలుపు తీసియున్నది. శరచ్చంద్రునకు నాకు జరిగిన సంభాషణము పొంచుండి యిది వినియుండునా? (ప్రకాశముగాఁ దొట్రుపడుచు) ఏమే? నీకన్నులు పోయినవా యేమిటి? శరచ్చంద్రుని నీవెఱుఁగవా? ఎఱిఁగియుండి యెఱుఁగనట్లు నటించుచున్నావా?

పని—లేదమ్మా! లేను. మీదయవల్ల నాకన్నులు పోలేదు. శరచ్చంద్రుఁడుగారే అనుకొన్నానమ్మా! కాని తల్లీ! గొప్పయింటి పడుచుఅమ్మాయిలు ఈలాగున చేయవచ్చునా? మీయూరిపద్ధతు లేమో నాకుఁ దెలియదమ్మా! కలకత్తాలో నే నిరువది తొమ్మిదియేండ్లు పనిచేసినాను. కాని యిటువంటి సంగతి నే నెక్కడను జూడలేదు. గొప్పవారి పద్ధతులతో నాకేమిపని తల్లీ! మాజీతాలు, రెండుపూటల భోజనాలు మాకు సరిగా నందితేచాలు. ప్రొద్దున్న, సాయంకాలము మాకు కడుపునిండ కూఁడు దొరికినన్నాళ్ళు మాచుట్టుప్రక్కల నేమిజరుగునో చూడవలసిన యవసరము మాకేమున్నది?

దేవీప్రసన్ని యింటిపనికత్తెలు పెంకితనమునకుఁ బేరుపడినట్లు బిందు మునుపే యెఱుఁగును. కాని యిటువంటి యప్రశస్తవాక్యములు పలుకునని యామె యెన్నఁడు తలఁచియుండలేదు. అయినను అటువంటి సమయమున శాంతము విడిచి కోపించుట వ్యవహారము మఱింత పాడుచేయుట యని యామె గ్రహించి లేని చిఱునవ్వు తెచ్చిపెట్టుకొని పలికెను.

బిం__ఏమే పిల్లా! శరచ్చంద్రుని పద్ధతులు పిచ్చివని నీవెఱుఁగవా? అతఁడు కుఱ్ఱవాఁడు. వివాహము కాలేదు. దీక్షగాఁ జదువుటచేతను, ఏకాకిలాగున నొక్కఁడే యుండుటచేతను మతి చెడినది. అతనిమాటలు, చేతలు లక్ష్యపెట్ట నక్కఱలేదు.

పని__అమ్మా! మతిచెడిపోవచ్చును. దానికేమి? కాని యీలాగునఁ జేయవచ్చునా? పెండ్లిపిచ్చ యెత్తినపక్షమున వెళ్ళి వివాహమాడవలెను. కాని నీమీఁదను ఈవిధముగ వెఱ్ఱి వెఱ్ఱి ప్రేలాపనలు ప్రేలుట మంచిదా? అమ్మా! ఆయనకు నిన్ను పెండ్లి చేసికొనవలెనని లేదుకద?

బిం__ఛీ! నీమొగము మండ! యీలాటిమాటలాడుటకు నీకు సిగ్గు లేదఁటే? కాదే పిల్లా! అతఁడొక చక్కని పిల్లను చూచినాఁడు. దానిని పెండ్లిచేసికొనవలెనని కోరుచున్నాఁడు. తల్లి కాశిలో నున్నది గనుక ఆమెతోఁ జెప్పుటకు వీలులేక నాతో జెప్పుటకు వచ్చినాఁడు.

పని__అమ్మా! ఎవరా పిల్ల?

బిం__వివాహము స్థిరపడిన తరువాత నీకే తెలియఁగలదు.

పని__అమ్మా! దాపరిక మెందుకు? చెవులు లేవా, కన్నులు లేవా మాకు! కనఁబడక పోవుటకు వినఁబడక పోవుటకు మాకంత ముసలితనము రాలేదు. గుండె పగిలి పోవునేమో యన్నట్లు మీసుధకోసమాయన మొఱ్ఱఁబెట్టుట నే వినలేదనుకొంటివా? సరే, సరే, దాచుకోతల్లీ! కాకపోతే యింటిగుట్టు బైటపెట్టుకొని అపకీర్తి కొనితెచ్చుకొనువారు గలరా యేమిటి? ముండమోసిన పిల్లకు పెండ్లా? వేదవాని కొంపలో ఇటువంటిమాట పుట్టెనా? కులమువాళ్ళందఱుఁ జేరి ఈపాటికి తప్పు పట్టరా? అధీనము తప్పినపిల్లకు పెండ్లా? చాకలి కొంపల్లో మంగలికొంపల్లో సైతమిటువంటిమాటెప్పుడు వినలేదు.

ఈపలుకు చెవిని పడఁగానే బిందు మొదటిసారి భయపడెను. శరచ్చంద్రుఁడు తన యెడలఁ జూపిన మోటుతనమును గూర్చి అవాడుపనికత్తె మాటలాడి నంతసేపు లక్ష్యము లేక పోయెను. ఒక పెంకిదానిమాటవల్ల తన నిష్కళంక జీవనమునకు మచ్చ కలుగదనియు, తనసదాచార సంపత్తి జగద్విదితమగుటచే నట్టి దెవ్వరు నమ్మరనియు నామె యెఱుఁగును. కాని సుధ చిన్నబిడ్డ, వితంతువు; లోకనింద నలుసంత పుట్టినను యావజ్జీవము దాని పేరు చెడిపోవును. శరచ్చంద్రుని కోరిక పిచ్చి కోరిక యని బిందు

మనసులో నెఱుఁగును. ఆ వివాహము జరుగునది కాదనియు నాకు నమ్మకము. కాని సుధాశరచ్చంద్రుల పెండ్లిమీఁద నపనిందాచ్ఛాయయైన బ్రాఁకెనా, అది కాఱుచిచ్చువలె వ్యాపించి బాలికను, దానికీర్తిని నాశనముచేయును.

ఒక్కనిముసమునం దామె మనస్సు మితిమీఱిన బాధపడెను. బిందు మనోధైర్య మించుకేనియు కదలక చిక్కఁబట్టి పెట్టెతెఱచి యొకనాణెము తీసియిచ్చెను. భిక్ష్యములు మొదలగు నూడిగము తెచ్చిన పరికత్తెలకు రెండుమూఁడణాలు బహుమాన మిచ్చుట సాంప్రదాయ సిద్ధము. అవంకఁబెట్టి బిందు రూపాయతీసి యారాత్రి దానిచేతిలోఁ బెట్టి యిట్లనియె. "నీవు దేవీప్రసన్నుఁడుగారియింట చిరకాలమునుండి పనిచేసిన పరికత్తెవు. ఈ నవరాత్రములలో ఈరూపాయ పెట్టి క్రొత్తచీరకొని కట్టుకో. కాని తుదివిషయమై నీవు విన్నది కన్నది రెండవ కంటివానికిఁ దెలియనీయకు. తెలివితేటలుగల స్త్రీలు పిచ్చివానిమాటలు పాటిసేయరు, ఈ వివాహము జరుగునది కాదు. వితంతువుతో వివాహమన్నది కన్నదా, విన్నదా? కులస్థులలో ఇంతో అంతో పేరుప్రతిష్ఠ గలవాళ్ళము. మావారంటే ఇరుగు పొరుగువారికి, స్నేహితులకు మితిమీఱిన గౌరవము. శరచ్చంద్రుని తల్లి భూదేవతయని మహా పతివ్రతయని కాశీలోవారుసైత మామెనెంతో గౌరవము చేయుచున్నారు. అతని చెల్లెలను ఆచార వ్యవహారములు, మంచి సాంప్రదాయముగల గొప్పయింటివారు చేసికొన్నారు. అన్నిమర్యాదలకు గంటఁద్రొక్కి యిటువంటిపెండ్లి చేయుటకు తరమా? లోకానుభవముగలవారు పిచ్చివాని ప్రేలాపనలు లెక్కసేయరు. అతని పిచ్చిచేష్టలు నీవు రెండవ కంటివానికిఁ దెలియనియ్యఁగూడదు సుమా!"

ఆ పరికత్తె బిల్వకుసుములాగున తెల్లనిరూపాయ చేతిలోఁ బడఁగానే శాంతించి వెనుకటి ప్రసంగము మఱచిపోయెను. ఒక్క నిముసములోనే మారి యామె యెంతో వినయముతో బిందుతో మాటలాడెను.

పరికత్తె — "అమ్మా! మీరన్నమాట నిజము పిచ్చివానిమాటలెవరు పాటిచేయుదురు? శరచ్చంద్రుఁడుగారు నేటిరాత్రి కొంచెము నిద్రపుచ్చుకొన్నారేమో? అది మనలో ఆచారమే కాని తప్పుకాదు. మాయింటిలో మాత్రము పనిచువారేమి చేయుచున్నారనుకొన్నారు? వారు రాత్రి చాటుగా జాతివారిసారాయి తెచ్చి తప్పత్రాగుదురు. అమ్మా! వారిగంతులు, కేకలు నే నేమని మనవి చేయఁగలను! పిల్లలు తల్లిదండ్రుల మాట వినరు. చుట్టాలయెడల, పెద్దలయెడల, ఇటువంటిపనులు చేసినందుకు సిగ్గుపడరు. పాడుకాలము వచ్చినదమ్మా! పడుచువారు తమరు చేయవలసిన పనులు మఱచిపోయి

చెడిపోయి అల్లరిగఁ దిరుగుచున్నారు. శరత్తుగారిమీఁద నేనెందుకు నిందలు మోపవలె? ఆయననడతను గుఱించి నేనొకరితో కొండెములెందుకు చెప్పవలె? నామాట నమ్మతల్లి! నేఁది బయలుపుచ్చుదునని మీమనసులో బెంగ పెట్టుకొనవద్దు."

ఆ పనికత్తె మిక్కిలి సంతుష్టిఁ జెంది యా యిల్లు విడిచిపోయెను. కాని గ్రుడ్లను పెట్టుటకు సిద్ధముగానున్న కోడిపెట్టవలెనే యా రహస్యమెక్కడ క్రక్కునా యని యామె తల్లడిల్లఁ జొచ్చెను. దానిస్వభావము తెలిసికొని తెలివిగలిగి రూపాయ పాటు చేసికొనక పోయినపక్షమున మిక్కిలి బాగుండును. ఎందుచేతననఁగా దాసీవానికి రహస్యము చెప్పి దాచుమనుట విరివిగా వెల్లడిచేయుటకు మొదటిసాధనము. కలకత్తాలో గృహములయందలి పనికత్తెలు తమ యజమానులగుట్టు పుట్టు పైలుపెట్టునంత మహావేగమున విశ్వప్రపంచమందలి నానా భాగములయందుండు ఉత్రాపత్రికలు బహిరంగ వార్తలనైతము వెల్లడి చేయఁజాలవు.

దేవీప్రసన్నునిభార్య మఱునాఁ డుదయమునఁ దనయింట నొక చాపమీఁద గూర్చుండి యిద్దఱు వృద్ధవితంతువులతో మాటలాడఁ జొచ్చెను. స్త్రీ సామాన్యమునకు సహజమైన లోకనిందయే యామె పల్లవిగా నెత్తుకొని, అంతము లేనివ్యాఖ్యానము చేయుచు, నిచ్చవచ్చిన తెఱఁగున ముచ్చటించెను.

అక్కలారా! సరిగా నేననుకొన్నట్లే జరుగుచున్నదమ్మా! ఈ సంగతి జరుగునని నే నెఱుఁగుదును. ఏమంటే ఈ దినములలో గొప్పయింటివాళ్లకు నీమములకు భేదమేమి? అడ్డమైనది ఆపల్లెనుండి వచ్చి నేను కాయస్థజాతి దాననని చెప్పుకొని కాయస్థులతోఁ గలిసి మెలసితిరుగుచుండును. వీళ్లిందఱు పరువుప్రతిష్ఠలుగల కాయస్థులా తల్లి! పదిపది నాలుగుతరములలో వీళ్లెప్పుడైన గొప్ప కాయస్థ కుటుంబములతో సంబంధములు చేసినారా యేమిటి? ఆలాటివాండ్లతోఁ గలసినందులకు మా నోటిలో గడ్డి పెట్టవలెను. వాండ్లతప్పేమున్నదమ్మా! మా వారు కచేరినుండి సాయంకాల మింటికి రానిమ్ము ఆయనతో నీసంగతి చెప్పకమానను. అమ్మా! ఇంతేందుకు? తనవిద్యా, తనగొప్ప, తన పరువు, తనప్రతిష్ఠ మావారు గుర్తెఱుఁగకున్నారు గాని యెఱిఁగినపక్షమున ఇటువంటి వారితో కలసి మెలసి యుండుట కిష్టపడుదురా? ఇది ఈలాగున జరుగునని నే నెన్నాళ్ళ క్రిందటనే తెలిసికొన్నాను. వాండ్రు ధనాసీపూజములో కాపురము చేయుటకు వచ్చిన క్రొత్తలో, మా యింటికి వచ్చి నమ్మకమాటు చూచుటకే తీరుబడి లేకపోయినదట.

దానినిబట్టే వారెటువంటివారో నాకు తెలిసిపోయింది. అంతకన్న చిత్రమైనసంగతి చూచినారా! ఆ విధవపిల్ల అంచుచీరలు కట్టుకొని మగనితో కాపురము చేయుచున్న దానివలె నున్నదమ్మా! అయ్యో! అయ్యో! ఇది యెంతయు జరుగునని నే నెఱుంగుదు నమ్మా! ఏమంటే, మర్యాదలు పుట్టుకతో రావలెనుగాని నేర్చుకొంటే రావమ్మా! కిరస్తానులలోను తురకలలోను విధవవాండ్రకు వివాహములున్నవట గాదు? అమ్మా! అలాగే! అచ్చముగా అలాగే! తురకలకన్న, కిరస్తానులకన్న మనవాళ్ళ కేమంతమర్యాద మండి పోయినది.

అనవుడు వృద్ధవితంతువులలో శ్యామతల్లి యిట్లనియె. "నిజమే అమ్మా! నిజమే. ఇంతెందుకు? విధవపిల్ల అప్పుడా! మంచివితంతువు అందఱు చెప్పినట్లు ఆపిల్ల ఏకాదశినాడుపవాసముండదుసుమా! పుణ్యస్త్రీలవలె చేపలకూడ ఆపిల్ల తినునట! ఈవేళ సుద్ధ ఏకాదశికదా, మన మీరాత్రి పగలు రేపుసాయంకాలము వఱకు కూడ నన్నము నీళ్ళు ముట్టుకోమన్నప్పటికి మనము ముట్టుకొందుమా?"

ఇంతలో భామతల్లి యందుకొని యిట్లు పలికెను. అక్కా! ఈచిత్రము విను. ఆవిధవపిల్లను గుఱ్ఱపుబండిమీఁద నెక్కించి షికారు తీసికొని వెళ్ళెదరు. ఏమి చెప్పను! మ్యూజియం చూచుటకు, పువ్వులతోటలు చూచుటకుఁ గూడ దానిని తీసికొని వెళ్ళినారఁట! ఇంతకన్న ఉన్నదా లోకనింద? ఈసిగ్గు చాలదు?

ఆయిద్దరు వృద్ధవితంతువులు తనమాటాడుటచేత మఱింత యుత్సాహము కలిగి, దేవిప్రసన్నని యిల్లాలు మూతిల విజృంభించి యిట్లనియె. "ఆపిల్లకు, పిల్లనుగన్న తల్లికి ఇంతకంటె అప్రతిష్ఠ యున్నదా? ఆసిగ్గుమాలినపిల్ల తలమీఁద కొంగు ముసుఁగు వేసికొనకుండా బాపుగారితో ఎదుటఁబడి మాటలాడునఁట! శరచ్చంద్రునికి మంచి మంచి పిండివంటలు, వేపుడుకూరలు తయారుచేసి పంపించునఁట! ఇందులో శరచ్చంద్రుని తప్పేమున్నది అక్కా! అతఁడు మగవాఁడు. పైగా పెండ్లికాలేదు. అపైని నెరజాణలు అప్పచెల్లెండ్రిద్దఱు పట్టి లాగుచుండగా పుత్రవాఁడు వలలో పడకపోవునా? ఆఅప్ప చెల్లెండ్రను మాగుమ్మముదాటి రానియ్యను."

ఉత్సాహముతోఁ గూడిన ఈసంభాషణము యొక్కధ్వని దూరముగా నున్న నూతిగట్టునకు వినఁబడెను. ఇచ్చటయాడు పడుచులు, కోడండ్రు పడుచు హృదయములకు [illegible] పుక్కిటిపురాణములు చెప్పుకొనుటలో లోకాపవాదములు వినుటకు

సాధారణముగా నేదో పనిలంకెఁ బెట్టి యక్కడకుఁ జేరుచుందురు. వారీ విధముగా మాటలాడిరి.

"అక్కా! ఏమిటమ్మా! యీగొడవ? ఈరోజున, ఊరంత గోలగా నున్నదే" అని యొకతె యడిగెను.

"ఏమి? నీవు వినలేద? అయ్యోవాళ్లు! అట్లయిన ఏమి విన్నావు?" అని మఱి యొకతె బదులుచెప్పెను.

"చెప్పవమ్మా! ఎవరో మంచిపిల్లను గుఱించి గొప్పమాటలాడుకొను చున్నట్లున్నది."

"చెప్పెద నుండవమ్మా! ఏదోయూరినుండి యీమధ్య హేముఁడని ఒకతఁడు వచ్చి భవానీపురములో కాఁపురము చేయుచున్నాఁడు. ఎఱుఁగుదువా? అతని పెండ్లాము మఱఁదలు ఉన్నారు. విన్నావా? ఆమఱఁదలు విధంతువు. ఆవిధవపిల్ల శరచ్చంద్రుని వివాహమాడునఁట!"

"పుక్కిటి పురాణాలు చెప్పకు. నేనివి నమ్మదననుకొన్నావా యేమిటి? ఇంత చిత్రాలు ఉన్నవా? విధవపిల్ల యేమిటి? పెండ్లిచేసికొనుట యేమిటి? లేనిది పుట్టించకు."

"లేనిదేమిటమ్మా? గొప్పపండితులు విద్యాసాగరుల వారిని గుఱించి నీవు వినలేదు? 'సీతావనవాస' మని ఆయన చేసిన పెద్దపుస్తకము మొన్ననే కాదటమ్మా నీవు చదివినావు; ఆవిద్యాసాగరులవారే మన హిందువులలో విధవలు తిరిగి వివాహము చేసికొనవచ్చునని తీర్పు చేసినారు. ఆయనయే పురోహితులై కొన్ని వివాహములు చేయించినారు. అంతదూర మెందుకు? ఆయనకొడుకే విధవముండను వివాహమాడినాడు."

"అక్కా! నిజమే నమ్మా! నిజమే. విధవముండలకు వెదకి వెదకి మగలను సంపాదించి పెట్టునట్టి ఆవిద్యాసాగరుఁడు గొప్పపండితుఁడే; ఇలాగైన పక్షమున ముసలి ముండల కర్మ మేమికాలింది? వాండ్లుకూడ పెండ్లిచేసికొని హాయిగ ఉండవచ్చును."

"ఉండకేమి? మూడుకాళ్ళపడిన అనుభవముగలవారికి, ఆ కొన్నిరోజుళ్ళను తలచివచ్చు పెండ్లికొడుకు లున్నపక్షమున వారు పెండ్లిచేసికో వచ్చును."

"సరే. అట్లయినయెడల శ్యామతల్లికి, భామితల్లికి తిరిగి కల్యాణయోగము కలుగును కాబోలు! పాపము! ఆడుక్కునాలిన ముండలు వైధవ్యబాధలు పడలేక, ఉపవాసములు చేయలేక నానాశ్రమలు పడుచున్నారు. ఎప్పుడో ఒకనాడు నోరు పట్టలేక ఒక చేపముక్క కొరికి, తినరానివస్తువులు తిని కక్కుర్తిపడి వైధవ్యపీడ మాన్పుకొనుచున్నారు. ఆకక్కుర్తి అక్కఱలేకుండా స్వేచ్ఛగా ఉండవచ్చును. అక్కయ్యా! నిజముగా విద్యాసాగరుడు వారి పాలిటి దేవుడైవచ్చి, వైధవ్య విమోచనముచేయించి, పెండ్లిచేయించి, పుణ్య స్త్రీలనుచేసి మగలతో కాపురా లేర్పఱుప వచ్చును."

"ఆలాగున నోటికి వచ్చినట్లు మాటాడకు. ఈనీమాటలు ఆవిధవవాళ్ళు విన్న పక్షమున నీపని పట్టము చేయుదురు. శరత్తుమాట చెప్పనేల? అతడు తెలివిగలవాడు, ముందరికి రాదగినవాడు అని విన్నాము. మంచిపిల్లవాడని కూడ చెప్పుకొనుచున్నారు. ఇటువంటి అప్రతిష్టపెండ్లి చేసికొని అతడెందు కపకీర్తి పాలు కాదలచుకొన్నాడో"

"వలపు కొలువులో బడినవారికి తెలివితేటలు చచ్చిపోవునని పెద్దలు చెప్పుదురు. వినలేదా! పాపమా చిన్నవాడు శరచ్చంద్రుడు ఆపడుచుముండ మాయలలో బడినాడు. ఆవలపు విషములాగున తలకెక్కినది. ఇక వానిపని చెల్లె"

"ఆవిధవ పిల్లకు వయస్సెంత?"

"పదహారని చెప్పుకొనుచున్నారు. అది యెఱ్ఱగా బల్లగా నున్నది. మాయ నవ్వులు నవ్వుచు శరత్తును పలుకరించి బుట్టలో బెట్టుచున్నది. పానకాలు, మజ్జిగ తేటలు పంపునట. అందులో ఏమిమందులు కలుపుచున్నదో ఎవరెఱుగుదురు? పాపము శరచ్చంద్రుడేమి చేయగలడు? ఎంత చదువుకొన్నప్పటికి మగవాడు కదా! పెద్ద పెనుభూతములాగు ఆవిధవపిల్ల ఎదుర బడగానే ఈకుర్రపాడవ కట్టు లాగ గలడా? అతని మనసు కొడిపోయి దాని స్వాధీనమై పోయినాడు."

"అట్లయిన వారికి అదివఱకే స్నేహ ముండవలెను."

"వారిస్వగ్రామములో కలసి యున్నప్పుడు ఒకరినొకరు ఎఱుగుదురని అదివరకే స్నేహమున్నదని చెప్పలేనా? అక్కడ ఏమిజరిగినదో నాకు తెలియదు. విశ్వము తల క్రిందులు కానీ, వాళ్ళనుగుఱించి ఒక్క అబద్ధపుమాట చెప్పను. వారు కలకత్తాకు వచ్చినది మొదలుకొని ఏమి జరుగుచున్నదో అందఱకు తెలిసియున్నదే. శరత్తు ఆపిల్లను తీసికొని వెళ్ళి తనయింట్లో ఉంచుకొన్నాడు. దానినే కాదు. దానప్పను!

అప్పు చెనిమిటిని గూడ తన దగ్గఱనే పెట్టుకొన్నాఁడు. ఇందుచేతనే కాఁబోలు హేమాఁడు మనసులో అనుమాన మేదో తోఁచి వేఱే ఇల్లొకటి అద్దెకు పుచ్చుకొని పెండ్లామును మఱఁదలును తీసికొని అక్కడకువెళ్ళి పోయినాఁడు. అమ్మా! నాతల్లీ, ఆవిలాస మేమని చెప్పను నీకు? కృష్ణమూర్తికోసము బెంగపెట్టుకొని ఎంతచిక్కిశల్యమైనదో నీవెఱుఁగుదువు కదా! ఆలాగే ఊరిలో లేనప్పుడు ఆవిధవపిల్ల బెంగటిల్లి సగమై పోయినదఁట. అప్పుడు పరుగుపరుగున కరత్తువెళ్ళి ప్రక్కను గూర్చుండి, బుజ్జగించి, రాత్రి పగలు వదలక ఓదార్చినాఁడు. అబ్బో! ఇది పెద్దచిత్రకథ. అక్కా! అంతకథ నేఁజెప్పఁగలనా? విద్యయను చిన్నది సుందరుఁడను చిన్నవాఁడు ఒకరి నొకరెంత మోహించినారో వినలేదా? వారు ఒకరినొకరు విడిచిపెట్టి ఉండలేక పోయినారు. సుందరుఁడు సొరంగములోనుంచి విద్య పడకగదిలోకి చల్లగా వెళ్ళినాఁడు. ఆకథే ఇప్పుడు తిరిగి జరుగుచున్నది. ఈనాఁటి పడుచుపిల్లకాయ లందఱు సుందరుఁడు చేసినటక్కరి తనము చక్కఁగా గుర్తెఱుఁగుదురు గనుక జాగ్రత."

ఈయపవాదము నూతిదగ్గఱనుండి దాసీజనము పనిచేయుచోటికి మెల్లమెల్లఁగా ప్రాఁకెను. ఆపనికత్తెలు కదిపిన తేనెపట్టులోని తేనెటీగలవలె ఎడతెఱపిలేక అఱచుచు పఱచుచు ఝుంకారముతోఁ జెప్పుకొనఁ జొచ్చిరి.

"అప్పా! నిజమేనా? ఆవిధవపిల్ల నిజముగా పెండ్లిచేసికొనునా?"

"అందులో నీకు సందేహ మెందుకు? ప్రధానమై పోయినది. ప్రయత్నమిది వఱకే యైనది. మఱఁదలకు హేమాఁడు పెండ్లిబట్టలు కొన్నాఁడు. నగలు చేయించినాఁడు, నిజమా, నిజమాఅని మూలము తెలియక నీవడుగుచున్నావు."

"గొప్పవారియింట విధవవాళ్ళు పెండ్లి చేసికొనుట తప్పులేకపోతే పేదవాళ్ళ ఇంటివిముండలు గూడ నిర్భయముగా పెండ్లి చేసికోవచ్చును."

"ఏల చేసుకోగూడదు? ఆపల్లెపిల్లవాఁడు నీకు బజారులో కనఁబడినప్పుడు ఎన్నోసారులు నీవతనితో మాటలాడుచుండఁగా చూచినాను. వాఁడు దిట్టమైన విధవముండను చేసికో దలఁచుకొంటే వాఁడునీకు తగినవాఁడేనా?"

"నిర్భాగ్యురాలా! సిగ్గు, సిగ్గు; ఛీ ఆలాటిమాటలు నన్ననకు. నీసంగతి నాకు తెలియదనుకొన్నావా ఏమిటి? ఆ పడుచ కోమటి కీమధ్య భార్య చచ్చిపోయిందికద?

ఏలకులు, లవంగాలు అమ్ముకొనే ఆయన ఆయన కిల్లు చూచిపెట్టఁదగినవారు అన్నము వండిపెట్టువారు ఎవరులేరు. ఏదో యేలకులు లవంగాలు కావలెనని వంకఁబెట్టి, నీవన్ని మాట్లో ఆయనదుకాణమునకు వెళ్ళి, అరగంటసేపేదో గుసగుస లాడుచుండగా నేను చూడలేదా? ఇల్లుచక్కబెట్టుటకు నీలాటి దిట్టమైన పిడిరాయంటిదుండను ఆయన నేను కొంటే బాగుండును గాదు?"

"నీ మొగముమండ! నిన్ను కాటిలోఁబెట్ట! పాడుముండా! పేలకు"

ఈ మఱియొక్కతల్లి యప్పటికిని కొల్పుకారుగ్రామములోనే యుండెను. ఈ యప నింద యామె చెవినిఁగూడ పడెను. పడగానే గ్రుడ్లనీళ్ళు గ్రుక్కుకొని తనలోఁదానే విల పించి, అట్టి అప్రతిష్ఠకార్యము చేసి మల్లికవంశమునకు మచ్చ తేవలదని బావకూఁతురగు బిందుకు జాబిట్లు వ్రాయించెను.

"కూఁతురా! మీ తండ్రిగారు బ్రతికియున్నపక్షమున తన వితంతుపుత్రిక మఱల వివాహము చేసికొనుట కొప్పుకొనునా? నాతల్లీ! నీయమ్మ బ్రతికియున్నపక్షమున ఈ యప్రతిష్ఠకార్యమున కామె సమ్మతించునా? సుధ ఏమియైపోవును? అది చిన్నపిల్ల. తల్లియైనను దండ్రియైనను దానికి నీవేకదా బిందూ! ఈ భూమిమీఁద దానిని కష్టముల పాలుచేయకు. అది విధవయైనను పరువుమర్యాదలతో బ్రతుకకుండ దానికి పెద్దమచ్చ తెచ్చి పెట్టకు. దానిని గంగలోఁ దింపకు దానిని మఱింత నిర్భాగ్యురాలిని చేయకు."

ఈవార్త వర్ధమాన పురమునకుఁ బ్రయాణము చేసెను. అక్కడ కాళీ జబ్బుచేసి మంచమెక్కి భర్తకుపచారములు చేయుచుండెను. ఆమె బిందుకిట్లు విచారముతో జాబు వ్రాసెను.

"మావారు మంచమెక్కినారు. నేను రాత్రి పగలు ఆయన మంచము వదలి పెట్టక యున్నాను. ముందు శీతకాలములో వచ్చుచోటగుటచే రాణిగంజికి, ఆయనను తీసుకొని వెళ్ళవలసిన దని వైద్యులు చెప్పుచున్నారు. మేమక్కడ ఒక యిల్లు కుదుర్చు కొన్నాము. ఒక వారము దినములలో మేమక్కడికి పోవుచున్నాము. నే నెక్క డున్నప్పటికి నీకు సుధకు ప్రేమతో మేలు కోరుచుందును.

ఓసీ! బిందూ! సుధను గురించి కొన్ని చెడ్డవాదులు వినుచున్నాను. ఈ వాదు లేమిటి? మచ్చలేని మన కుటుంబమునకు కీర్తి డాగువేయఁ దలఁచు కొన్నావా?

బిందూ ! నీవు తెలివి గలదానవు నీగుణము బంగారమువంటిది. మాతమ్మునకు పిచ్చియెత్తిన పక్షమున మీ యింటి నుండి వెళ్ళఁగొట్టుఁడు అప్రతిష్ఠపనికి ఒప్పుకొనవద్దు. విధవపిల్లలకు వివాహము చేయవద్దు. మీ రటువంటి పెండ్లిచేసినపక్షమున నా అత్తవారి ఇంటిలోనివారు నా మొగ మింక చూడరు, మీ కాలి మీకిఁక మీఁద కనబడదు ”

ఆ జాబులు బిందు తన భర్తకుఁ జూపి లోలోపల దుఃఖించెను. బిందు కడురహస్యముగా దాఁచఁ దలఁచిన రహస్యము భేరీజిహ్వాగల యపవాదము దేశమంతటను వ్యాపింప జేసినది. పాపము ! అమాయకురాలైన యామె చెల్లెలి పేరు ముంగటి కీడ్చి తెచ్చి జనులు తిరస్కారము చేయ జొచ్చిరి.

శరచ్చంద్రుఁడు కోరిన కోరిక యేదో విధముగ పరిష్కరింపఁ బడువరకా విషయము సుధచెవిని బడకుండునట్లు హేమంతుఁడును బిందు సర్వప్రయత్నములు చేసిరి. ఎన్నఁటికిని మనోనాథుఁ డగుటకు వీలులేని మనుష్యునకు గాఢంపువలపు గలదని వితంతువునకుఁ దెలుపుట, సంతోష శూన్యమైన యామె వ్యర్థజీవనమును మఱింత కష్టభాజనము చేయుట గాక యన్య ప్రయోజన మేమున్నది? ఏ యపనిందతో జనులామెపేరు కలిపి వాడుచున్నారో, యా యపనింద నామె శ్రవణ గోచరము చేయుట వలన నామె కుళ్ళి కుళ్ళి యేడ్చి కృశించిపోక మానునా ?

కొంతకాలము వారు చేసిన ప్రయత్నము సాగినది. కాని పూర్తిగా దాఁచుట యసాధ్యమయ్యెను. అనుమానములు లేని యమాయకురాలయ్యు సుధ గృహములో నేదో చిక్కు సంభవించిన దనియు, గొప్పసమస్యయేదో తన యప్పయొక్కయు, బావయొక్కయు మనస్సుల నాక్రమించిన దనియు జాడకట్టెను. సుధ తన యప్పయొక్క విచార సూచకమైన మొగమును, మౌనభావమును పలుమారు విలోకించి, యిటులుండుటకుఁ గారణమేమని యడుగ దలచియు సాహసించి యడుగలేక పోయెను. మిత్రులనేకులువచ్చి హేమంతుని జూచి మాటలాడుటయు, సదయకాలమందతఁడు పలుజాబులు వ్రాయుటయు, రాత్రి ప్రొద్దుపోవువరకు బిందుతోఁ గలసి యాలోచనలు చేయుటయు నామె కనిపెట్టెను. తనపేరు, శరచ్చంద్రునిపేరు పలుమారెత్తినకొలది తమయింటి పనికత్తెతో వరగంట కంటె ఎక్కువసేపు గుసగుసలాడుట యామెకు వినఁబడెను. వారమున కొక్కసారి వారియింటికిఁ బోవుచుండఁగలిది భావగర్భితముగ సుధనుజూచి చిన్న నవ్వునవ్వి మనసుపట్టలేక యెట్టకేలకు స్వల్పకాలములోనే యింటి యజమానురాలవై యుందువుగా కన్నుల చల్లగా నిన్ను

చూడఁగోరుచున్నానని పరిహాసముగాఁ బలికెను. రహస్యములు బయటపెట్టవద్దని తన కామాట చెప్పినవారెంతో యొట్టుపెట్టించుకొని చెప్పినను, చాకలిది శరచ్చంద్రుని యొక్కయు సుధయొక్కయు బట్టలుతికనకే యుదుకుటకు వేయుమని కోరెను.

ఈయాఁడువాండ్ర యభిప్రాయ మేమైయుండును? పైకి వేఱర్థమిచ్చునట్టి దెప్పుడు మాటలతో నొక పేద వితంతువును వారు పీడించుచున్నారని యన వచ్చునా? అట్లు వారుచేయుదురని సుధ భావింపలేదు. ఏలయన నామె యెవ్వరి మనసు నొప్పించి యెఱుఁగదు అంతకుమును పెవ్వరు మిక్కిలి పేదరాలైన యాబిడ్డను కూట మాటలతో నొప్పింపలేదు. అట్లయిన నిటువంటి మాటల భావమేమై యుండును? ఆపలుకుల భావములు స్పష్టముగఁ దెలుపవలసినదని సుధ నొక్కి యడిగెను. కాని మంగలిది మౌనము వహించి నోరెత్తదయ్యె. చాకలిది మాత్రమిట్లనెను. "శరచ్చంద్రుడు గారు తప్పక యాలస్యముగానో పెండలకడనో యెవరినో యొకరిని పెండ్లిచేసికొనక మానరు. పేదదానను గనుక ఆయింటి వాడుక నాకే యిప్పించవలసినదని యడిగినాను."

సుధ దానిమాటలలో యథార్థము గ్రహించినదో లేదో మన మూహింపఁ జాలము. అనుమానములు లేని యమాయక స్త్రీ లోకప్పు డిటువంటి విషయములలో మన మూహింపఁ జాలనంత దీర్ఘదృష్టిగలిగి లోతుగఁ బరిశీలింతురు. ఈచిత్రకథ యంతయు నామెకు మూలముట్టదెలియక పోయినను, చీఁకటితెఱమఱుగున నిలిచి యావలిగుట్టు తెలిసికొనుటకై గిజగిజ దన్నుకొనుచున్న స్త్రీబుద్ధికుశలత మార్గప్రదర్శియగు ప్రభా కిరణమును గనిపెట్టలేదని చెప్ప వలనుపడదు. అజాగ్రతగా నోట వెలువడు సామాన్యపు మాటల నామె యధికశ్రద్ధతోఁ జెవియొగ్గి వినఁ జొచ్చెను. సాధారణముగా నెవ్వరుగాని సరకుచేయని యల్పసూచనల నత్యంత జాగ్రతతో నామె గమనించుచు వచ్చెను. తన భవిష్యత్కాలస్థితిని, తన యదృష్టమును మఱుగుపఱుచుచున్న యాగహాస్యాంధకారమునఁ బ్రవేశించి చూచుటకు, ఆమె స్త్రీస్వభావము భగీరథ ప్రయత్నము చేయఁజొచ్చెను. ఆమె యెవ్వరి నేప్రశ్న యడుగలేదు. ఏసమాచారమునకైఁ బ్రయత్నింపలేదు. కాని వెల వెల బాఱుచుండిన యామె మొగము, కన్నులలోని తళుకు నిశ్శబ్దమైన యామె యాలోచనమును, హృదయగతమైన సంతోషమును వెలిపుచ్చుచుండెను.

ఎట్టకేలకు యథార్థమంతయు తళుక్కుమని యామెమనస్సు నెదుట మెఱసెను. ఒకనాటి సాయంకాల మామె పండుకొన బోవుచుండగా నేలమీఁద యొక నలిగిన

కాగితము కనఁబడెను. అది యామె తీసి చూచెను. అందలి వ్రాత తన పినతల్లిదని యామె కనిపెట్టెను. అందు రహస్యము లుండునని యనుమానము తోఁచినందునను, తన పినతల్లి యేమి వ్రాయునో చూడవలయునను కుతూహలము పొడముటచేతను, జాబు నామె యాముదపు దీపముకడకుఁ దీసికొనిపోయెను. అది బిందుపేర వ్రాసినజాబు. బిందు చదువుకొని దానిని జాగ్రత్తగాఁ దాఁచివైచెను. ఆజాబులోని సంగతులు చదువుకొన్న కొలఁది సుధరయొక్క చేయి వడఁకెను, గుండె కటకటఁ గొట్టుకొనెను. కాగితము చేతిలో నుండి నేలజారిపడెను. చేష్టలుతగ్గ కొయ్యబారి వెనుకకు మఱి తడబడుచు నెట్టుకొని మంచముపైఁబడెను.

అట్టి సమయమున హిందూవితంతు వనుభవించు లజ్జాదుఃఖములు మొకటి భావములై యామెమనసులో మొలకలెత్తెను. అంత మంచివాఁడు, అంతదయగలవాఁడు, అంతచదువుకొన్నవాఁడు, అంత బుద్ధిమంతుఁడు గదా శరచ్చంద్రుఁడు. అట్టివాఁ డిటువంటి యప్రతిష్ఠకార్యము నేల తలపెట్టెనో? ఆమెను తనకిమ్మని యేల యడుగవలె? ఏల యామె మను కలుగుటలో నవమానపఱచవలెను? ఈసంగతి పినతల్లికిఁ దెలిసినది. శరత్తు తోఁబుట్టువునకుఁ దెలిసినది. ప్రపంచమంతకుఁ దెలిసినది. తనచుట్టములకు, జనకపెద్దలకు నామె తన మొగమింక నేలాగునఁ జూపఁగలదు? అపవిత్రమై, యమంగళమైన విషయము తన పేరుతో సంకేతమైన దన్న జ్ఞానము మితిమీఱిన లజ్జాభావము బాలిక మనసు నావరించెను. తలగడమీఁద మొగము పెట్టుకొని కన్నీరు వెలికిఁ బోకుండ నేడ్చెను.

నిశ్శబ్దమైన యాచీఁకటిరాత్రి యందు నిదుర లేక నిమిషమైన విశ్రాంతి లేక యామె మంచముమీఁద బడుకొనియుండ, బాధకరములైన తలంపు లామె హృదయమును చీల్చివేయఁదొడఁగెను. ఆమె పరాభవ సముద్రములో మునిఁగి పోయెను. తాను పలుమాఱులు చదివియున్న రామాయణ మహాకావ్యమందలి కథానాయికయగు జనక రాజనందనవలె భూదేవి రెండుపాయలుగాఁ బగిలి మానవుల కన్నులకుఁ దానెన్నఁడుఁ గనఁబడకుండ దన్ను నిజగర్భమునకుఁ దీసికొనిపోవు నట్లు చేయుమని దేవుని వేఁడుకొనెను. గంటలు గడచిపోయెను. అర్ధరాత్రమందలి మహాంధకారరాత్రి క్రమక్రమముగా సన్నగిల్లి యుషఃకాలమునందలి మంద మంద తేజోరేఖగా మారఁదొడఁగెను. కాని సుధకు దుఃఖవిమోచనము కాలేదు. తెల్లవారఁగానే దగ్గఱచుట్టములకు, దాపును జరిగి తెలియు వారు వీరననేల, తన యన్నకు మొగ మామె యెట్లు చూపఁగలదు?

ఉదయకాలమందలి యరుణారుణప్రభలు తోఁచిన తోడనే సుధ తన యప్ప మొగముఁ దేఱిపాఱి చూచుటకును, మేడమెట్లు దిగిపోయి యెప్పటియట్ల గృహకృత్యములు నెఱవేర్చుటకును భయపడినదియుంబోలె నప్పుడు చేయకుండ తనమంచము దిగి, దొంగదానివలె లోపలికి వచ్చెను. వెళ్ళి యంట్లుతోమి, చెంబులు తోలిచి, వాకిలియూడ్చి నీళ్ళతోడి మనోవ్యథ మఱచుటకో యన నేదోపని చేయఁజొచ్చెను. తలుపుతెఱచి సేవకుఁడు లోపలఁ బ్రవేశించినప్పుడామె యులికిపడి వడఁకెను. ప్రొయిలో నిప్పు వేయుటకామె వంటయింటిలోనికిఁ బోయినప్పుడు నిత్యము పాలుతెచ్చుగొల్లది వచ్చెను. ఆమెను జూచికూడ సుధ భయపడెను.

ఈ విధముగా దినములు నిశ్శబ్దమైన సంక్షోభముతోఁ గడచెను. గాఢమైన లజ్జాభావ మామెను దిగఁద్రొక్కఁజొచ్చెను. ఆమె లేతహృదయము మహాభారముచేత క్రుంగిపోయెను. ఈ చిత్తక్షోభము చాటున, నీ మహాభయముమాటున నామె హృదయమున నాశయనియెడు రహస్యప్రభారేఖ మెఱయుచుపోయెనే? నీసుధ స్త్రీస్వభావమునకు విరుద్ధలక్షణములు కలది యగును. ధీరస్వభావము గల శరచ్చంద్రుఁడు పిన్నవాడయ్యు ప్రపంచమంతయు నేకమై భిన్నాభిప్రాయముఁ జూపినను సరకు సేయక దయారసపూరితమైన హృదయమున నామెయందు గాఢానురాగమును బెంచి, వారియింటికి రాకపోయినను సుధనే తలంచుచు, వివాహము చేసికొనుటకామెనిమ్మని తెగించి యడిగినాఁడు కదా! ఈ తలంపు లామె మనస్సున దొంగలవలెఁ జొచ్చినప్పుడు యువతీజన సహజమైన రహస్యానందమును బొంది కంపమొందఁజొచ్చెను. ఎడనెడ నది యపవిత్రమై యపరిశుద్ధమైన యానందమని తలంచెను. నవనవోన్మేషభాజనమైన యా యువతి హృదయమందలి యంధకారావకాశము లెల్ల మహాశాసూర్యప్రభలచేత దీపితంబులు కాకపోయిన పక్షమున నామె మానవాంగనకంటె నలితమో యధమమోయైన జంతువై యుండవలయును.

ఒకనాఁడు మధ్యాహ్నము ఒందు సుధ పండుకొను గదిలోనికిఁ బోయెను. అప్పుడు సుధచేతిలో నొకపుస్తకము దాల్చి చదువుచు, గవాక్షములోఁ గూర్చుండెను. అక్కను జూడఁగానే సుధ పుస్తకము మూసివైచెను.

"అమ్మాయి! నీవు చదువుచున్న పుస్తకమేమిటి?" అని తెలిసికొన వలయునను కుతూహలముతో నిట్లడిగెను.

"ఇది బంకించంద్రచటర్జీ చేసినపుస్తకము" అని సుధ సిగ్గునఁగన్నులు వంచి ప్రత్యుత్తర మిచ్చెను.

"ఆ పుస్తకము పేరేమిటి?"

"దీనిపేరు, విషవృక్షము."

అనవుడు బిందు కోపదృష్టితోఁ జూచి కొంచెము కఠినస్వరముతో "ఆ పుస్తకము నాచేతికిమ్ము. అది చదువవద్దమ్మాయీ!" అని మందలించెను.

సుధ పుస్తక మప్పుచేతికిచ్చి "ఇది చదువఁగూడని చెడ్డపుస్తకమా యేమిటప్పా!" అని మెల్లగా నడిగెను.

"సుధా! చెడ్డది కాదు, బంగాలీభాషలో నిది ప్రశస్తమైన చిత్రవచన కావ్యము. నీవు చిన్నదానవు. ఇపుడే యిది చదువఁగూడదు."

"అప్పా! పోనీ, దానికథ సంగ్రహముగాఁ జెప్పు. కథ యెట్లు పరిణమించునో తెలిసికొనవలెనని కుతూహలపడుచున్నాను."

"కథచిన్నదే. ఒక బాలవితంతువు చిత్రకావ్యములోని కథానాయకుని వివాహమాడును. కాని పెండ్లిచేసికొని యామె సుఖపడలేదు. బహుకష్టముల ననుభవించి తుదకు విషము తిని చచ్చినది."

ఈ మాటలు వినఁగానే సుధ మొగము వెలవెలఁబోయెను. వెంటనే మాఱుమాటాడక యామె గది విడిచి యావలకుఁ బోయెను.

పదమూడవ ప్రకరణము

దీపాలమావాస్య

హిందూదేశము చిత్రము లగుపండుగులకుఁ ప్రసిద్ధి కెక్కినది. అవి యెన్నోగలవు. అందు దీపాలమావాస్యవలె మిక్కిలి చిత్రమైనదియు మనస్సునకు నచ్చునదియు మఱే

యొకపండుగ లేదు. అది దేవీపూజలు జరుగు మాసమున ననఁగా నాశ్వయుజమాసమున నమావాస్యనాఁటి రాత్రి జరుగును. పల్లెయనక, పట్టణమనక, కుగ్రామమనక, గొప్ప యూరనక దేశమందంతట ప్రతిగృహమందు దీపములు వెలిఁగింతురు. మహానందముతో బాణసంచ కాల్తురు. ఆ దీపముల యొక్కయు, బాణసంచయొక్కయు దేదీప్యమాన కాంతులయందలి నమావాస్యనాఁటి కాఱుచీఁకటులు పటాపంచలై పోవును. ఆ కాలము నందలి నక్షత్రములు భూమిమీఁది జ్యోతులయందట మినుకుమినుకు మనుచు వెలవెలఁ బాఱును. భాగ్యవంతుల భవనములు బహుదీపపంక్తులతో నలంకరింపఁబడును. నిఱుపేద యైన స్త్రీ సైతము తాను చెమటఁ గారాడ్చి సంపాదించుకొన్న యొకటిరెండు డబ్బులు వ్యయముచేసి చముఁరుగొని పమిదతోఁ దన కుటీరము ముందఱ నొక్కదీపమైన వెలిఁగించును.

ఈ పండుగనాఁటి రాత్రి కలకత్తానగర మెప్పటియట్లే ప్రభాభాసమానమయ్యెను. ధనవంతులు పుణ్యము నిమిత్తమై దానపూర్వకముగాఁ గనకవర్షము గురిపించిరి. ఘన కార్యములు చేయ సమర్థులయ్యున్న చాకచక్యము గవర్తియు నడఁగి పోయిన తరువాత నేలమీద కలక్రిందుగాఁ గూలునట్టి యుత్సాహ పూరిత యువజనంబులవలెనే పేక జువ్వలు నక్షత్రమండల మంటి పెటుక్కున వ్రేలి క్రిందఁ బడఁజొచ్చెను. టోటులు, నేలటపాకాయలు పెటేలున ద్రేలఁ గొప్పధ్వని చేసి యీనాఁటి యనేక యువకవిజనం బులవలెఁ బేరు లేక యదృశ్యము లయ్యెను. లంకాపురులు మహోజ్జ్వలములగు నగ్నిచక్ర ములవలె గిఱ్ఱున దిరిగి కొంతసేపటికి నిముషంబులో గొల్లన కొయ్యముక్కలు మాత్రమే మిగిలెను. వీధులలోను, వాకిళ్ళలోను, డాబాలమీదను పిల్లలు గుంపులు గుంపులుగాఁ గూడి మెఱపుతాబులు, పచ్చమతాబులు కాల్చి సంతోషించిరి. ఎండిన జనపకఱ్ఱ మోపు లంటించి కొందఱు పెద్దపెద్ద సెగడీమంటలు వేసిరి.

శరచ్చంద్రుఁడు వెలయుచున్న దీపములను, మతాబులు మొదలగు బాణసంచలను జూచి చెవులు దిబ్బడివేయునట్లు ప్రేగుచున్న నేలటపాకాయల చప్పుడు, పేలుచున్న పేకజువ్వలచప్పుడు వినక, ప్రతిగృహమందు జనులచేత నాఁటిరాత్రి విధిగాఁ బూజింపఁబడిన కాళికావిగ్రహమును సరకు చేయక, యిల్లు వెడలిపోయెను. చప్పుడు కాకుండ నడుగు లిడుచు, గుండె దడదడఁ గొట్టుకొన నతఁడు హేముని బసఁజేరవలెనని భవానీపురమునందలి సందుగొందులం బడి విసవిసనడచిపోయెను. అనుకొన్న ప్రకారము బిందు వచ్చి తన నిమిత్తము వీధిలో నిరీక్షించు చుండునని యతఁడు తలంచెను. కాని హేముఁడే వచ్చి

యాతనిరాకకెదురు చూచుచుండెను. అతఁడు శరచ్చంద్రుని చేయిపట్టుకొని వెలుపలి గది లోనికిఁ దీసికొనిపోయెను. పాపమీ చిన్నవాఁడతనివెంటఁ దల వంచుకొని కొండంత యాసయుఁ, గ్రుంగఁదీయుభయము హృదయమును మల్లడిఁగొన గ్రుడ్డివాఁడువలె నెటు పోవుచున్నది చూడలేక లోపలఁ బ్రవేశించెను.

హేముఁడు దీప మెగసనఁద్రోసి యిట్లనెను: "శరచ్చంద్రుఁడా! నీవు చెప్పినమాటలు నాభార్య నాతోఁ జెప్పినది."

అన నెట్టెటో మాటలాడుటకు ధైర్యము తెచ్చుకొని శరచ్చంద్రుఁ డీవిధముగ బలికెను "నేనతిసాహసము చేసి యుంటినిగా, నీయుంచితివమునను, నీవు నాయందుంచిన విశ్వాసమునకు దగినట్లు నేను ప్రవర్తింప లేదని నీవెంచిన పక్షమునఁగాని, నీవు చిన్ననాటనుండియు నన్ను మిక్కిలి ప్రేమతో నాదరించితివి. గావున నాసాహసమును నీవు మన్నింపుము"

"అయ్యో! శరచ్చంద్రుఁడా! నీవు చేసినతప్పులేదు. నేను మన్నింపవలసినది లేదు. లోకులందఱు నిన్ను నిందింపనీ, నాకు నీయెడగల గౌరవప్రేమలు మాత్రఁ జెడక యథాప్రకారముగానే యుండును."

ఆమాటల కుత్తర మిచ్చుటకు శరచ్చంద్రునికి మాట రాలేదుగాని యాతని కన్నులు వాగ్రూపముగాని కృతజ్ఞతను దెలుపుచుండెను. అది హేముఁడు చూచి మరల సంభాషణము మొదలు పెట్టెను.

"మీరు చిన్నపిల్లలైన నాటనుండియు నిన్ను నాభార్యయు సోదరునివలెఁ జూచుచువచ్చినది. ఇకముందుఁగూడ నామె నీయెడ వెనుకటిప్రేమ చూపకమానదు. నీవు మమ్మడిగినదానికి మాకు నీపైకోపములేదు. ఎప్పటికిని గౌరవమే కలదు. ఈ విషయమున నీకుఁగల దయకు, ధైర్యమునకు, నిన్ను మేము గౌరవించుచున్నాము.

"నీదయకు, బిందు చూపినదయకు నేనాజన్మాంతము కృతజ్ఞుడనై యుండెదను" అని శరచ్చంద్రుడు పలికెను. హేముడు మనోరథసిద్ధి నూచించు వ్యవహారసరళిలో మాటలాడుచున్నాడని శరచ్చంద్రుడు గ్రహించి దిగులుపడ జొచ్చెను.

అప్పుడు హేముఁ డిట్లనెను "ఈవిషయమై మున్ను నీ తాతగారిముందు సంగతి సందర్భములు చక్కగా విచారించినావా? క్షణికమైన మోహావేశమున నీవు పలుకుట లేదుకద?"

"హేముఁడా! నామాటవినుము. నేను మిమ్మడుగకముందే చాలకాలము మిక్కిలి జాగ్రత్తగా ఆవిషయమై విచారించితిని. నేను మిక్కిలి చక్కఁగాఁ బనిచేసితినని నాయభిప్రాయము"

"నీవు నాకంటె నెక్కువ చదువుకొన్నావు. శరచ్చంద్రుఁడా! అయినప్పటికి నాకన్న వయసులో నీవు చిన్నవాఁడవు. ఒకటి రెండు విషయములు నీకుఁ దోఁచక పోవచ్చును. అటువంటివి నన్నుఁ జెప్పనీ. నీవు చేసికొనఁదలఁచుకొన్న వివాహము పూర్వాచారపరాయణుల కందఱకు నసహ్యము."

"మూఢవిశ్వాసముచేత దురభిప్రాయము పెట్టుకొని గ్రుడ్డివారివలె సన్మార్గముఁ గానక మాటలాడువారి యభిప్రాయములను నేను లెక్కచేయను. మనసులో నేవిధమైన బాధపడక, ఇటువంటి నిందల నే నిదివఱకే భరించినాను. యావజ్జీవసుఖము నిమిత్త మిటువంటినిందలను నే నవలీలగా భరింపఁగలను."

"శరచ్చంద్రుఁడా! దీనికి నిన్ను వెలివేయుదురని యెఱుఁగుదువా?"

"మన పూర్వాచార పరాయణులు కావలెనంటే వెలివేయనియ్యి"

"మిక్కిలి పరువుప్రతిష్ఠలు గల నీకుటుంబమున కిది కళంక మగునని యెఱుఁగుదువా?"

"హేముఁడా! ఇది పాపకార్యము కాదు కాఁబట్టి కళంకముగాదు. ఇది యపవిత్రమైన పాపకార్యమని నీకుఁ దోఁచినయెడల మానివేయ వలసినదని చెప్పు. నీమాట ధర్మశాస్త్రముగా నేను శిరసావహించెదను."

"వితంతువు పునర్వివాహము చేసికొనుటలో దోషమెంతమాత్రము లేదు. మన సనాతనధర్మశాస్త్రములు, మన యాచారములు సమ్మతించినదే యిది. ఇటీవల నేటి కాలమునందే అది చేయఁగూడదని జనులకు దాని విషయమై వ్యతిరేకాభిప్రాయము కలిగినది.

"దానిసంగతి అటులే అయినపక్షమున, తప్పులేనిదియు తప్పక మేలు కలిగించునదియు నైన యీశుభకార్యమును మన మీమాత్రపుఁ బిచ్చియభిప్రాయములకే మానవలసినవారమా? ఏఁబదియేండ్ల క్రిందట సముద్రము దాటి వెళ్ళఁగూడదని మన పెద్దలందఱభిప్రాయపడినారు. కాని యీదినములలో వందలకొలఁది యాంధ్రులు మగ

వాండ్రను ఓఢ్రదేశమునకు, బర్మాకు, చెన్నపట్టణమునకు, సింహళమునకుఁ బ్రతివారము సముద్రముమీఁద బోగయోషలెక్క వెళ్ళుచున్నారు. దీని పేరే యభివృద్ధి; మార్పు బొత్తిగా లేకపోవుటచేత చైతన్యరహితమై జాతినాశము నొందను"

"శరచ్చంద్రుఁడా! నీవు మంచిబుద్ధిమంతుఁడవు. చక్కనియాలోచన గలవాఁడవు. విను; ఈవిషయమంతయు మర్మము లేకుండ నీ యెదుట విప్పిచెప్పెదను. మనస్స్వభావ మొకప్పు డాకస్మికముగా నత్యుత్సాహపూరితమై యుండును. అది యావజ్జీవము వెనుకటి బలిమి గలిగి స్థిరముగా నుండదు. యౌవనప్రాదుర్భావమునకు సహజమైన యనురాగాతిశయముతోఁడను గాఢదయతోఁడను నీవు సుధను వలచుచుంటివని నే నెఱుఁగుదును. వయసుముదిరిన కొలఁదివలపు నేఁడున్నంత దృఢముగా నుండకపోవచ్చును. ఇది అసంభవము కాదు. నామాటకడ్డము రాకు. నేను చెప్పఁదలఁచుకొన్న దేవో తుదముట్టఁ జెప్పనియ్యి. సావధానముగా విను. సుధపై నీకు నిజమైన గాఢానురాగము కలదా లేదా యని సందేహించెదను. అయినప్పటికి నేఁటికున్న నీ వలపు సన్నగిల్లవచ్చును. తొందరపడి చేసినకార్యము యావజ్జీవ దుఃఖహేతువు కావచ్చును. నిన్ను వెలివేయుదురు. ప్రాతపద్ధతివారు నీకుటుంబముతో సంబంధబాంధవ్యములు మానుకొందురు. నీకూఁతురుకును వరుఁడు దొరకరు. పదిమంది చుట్టాలుకలసి కూర్చుండినచోటికి నీకొడుకులను జేరనీయరు. పడుచుతనములో తొందరపడి సాహసకార్యముచేసి యుండకపోయిన పక్షమునను, మిక్కిలి నాప్తులైన ప్రియమిత్రుల హితోపదేశములవిని యుండిన పక్షమునను, జీవితముయొక్క యవసానదశయందు బంధువైరము, బహుదుఃఖము కలుగకుండ మాకు విశేషసుఖము, విశ్రాంతి కలిగి యుండుననియు, స్త్రీపుత్రపౌత్రులు బహిష్కరింపఁబడి నిరాదరింపఁబడక, కావలసినవారిచే గౌరవింపఁబడి యాదరింపఁ బడుదురనియు ముసలితనములో నీవు వ్యర్థమైన పశ్చాత్తాపము నొందవచ్చును. చిన్నవాఁడవైనను నీవు స్వయముగా నెల్లవిషయములు, తెలిసికొనుటకుఁ దగినయీఁడు గలవాఁడవు. కలకత్తాలో ననేక కాయస్థగృహములలో సుధను మించిన చక్కనిపిల్ల లెందరో యున్నారు. నీవంటియల్లుఁడు దొరకినప్పుడు కన్నులనద్దుకొని స్వీకరించని మామగారు కాయస్థులలో లేఁడు. ఇదసిద్ధమని నిర్ణయించుటకు ముందు లెస్సగా నాలోచించుము. తొందరపడకు. చిరకాలము బ్రదుకఁదలఁచిన వాఁడవు. ముందుమాట గట్టిగా నాలోచించుకో. పద చురినకుండ వివేకముతో వర్తించి ముసలితనమునకై సుఖము మూటకట్టి దాచికొనుము"

ఆమాటలన్నియు శరచ్చంద్రుఁడు శాంతముతో నాలకించి మెల్లఁగా నిట్లు బదులు పలికెను. "హే మామా! నన్ను నమ్ము. ఆకస్మిక మనోవికారముచేతఁ గాని, గ్రుడ్డివలపు

చేరఁగాని నే నీవ్యాపారములో దిగలేదని మున్నాటికి వచ్చును. నాయీవయాత్రలో సుఖపడఁ గోరుచున్నానుగాని పోనాడఁ దలఁచుకొనలేదు. వార్ధకమందు నాకుఁగలుగఁ బోవు పశ్చాత్తాపమును గూర్చియు నీవు చెప్పినావు. నలుప్రక్కలఁ బరికించి యొకసారి చూడుము. మనజాతిలో గౌరవపాత్రములైన ప్రముఖులెందఱున్నారో? చిన్నతనమందు ధైర్యముతోడను గౌరవముతోడను నమ్మినట్లు లాచరించి వార్ధకమున వగచి పశ్చాత్తాపము నొందినవాఁడొకఁడైన వారిలోఁ గలఁడా? హిందూదేశములో సత్యములైన మతధర్మములు బోధించినందుకు బహిష్కరింపఁబడినవారు పలువురు గలరు. ప్రతిష్ఠ, పాండిత్యము, మహాధికారము, గొప్పపదవి, మొదలగునవి సంపాదించుటకై యూరోపు ఖండమునకు వెళ్ళినవారనేకులు గలరు. సంఘసంస్కరణము ప్రారంభించి తమ గృహములయందు, తమ కుటుంబములయందు దానిం బ్రవేశపెట్టి కార్యశూరులై ఘనకీర్తిఁ గాంచిన వారనేకులు గలరు. ప్రశస్తతరమైన సంఘజీవనమును సంస్థాపించిన యీ మహాత్ములలో నొక్కఁడైన బాల్యకాలమునఁ దాను జూపిన ధైర్యసాహసములకు వగచి పశ్చాత్తాపము నొంది బాధపడినవాఁడు గలఁడా? వెలివేయఁబడినందుకు విచారించినవాని నొక్కనిని వేలు మడిచి చూపఁగలవా? బహిష్కారమునకిప్పుడంత భయము లేదు. మునుపటిబాధ లిప్పుడుండుటకు వీలులేదు. ఇప్పుడు బహిష్కరింపఁబడినవానికి ధర్మకార్యము నిమిత్తమై బాధలు పడిరిగదా ఇదే చాలునని సంతోషించుటకైన నవకాశము లేదు. తుపాకిమందుఁ గనిపెట్టిన తరువాత, అమ్ములు విండ్లు మూలఁబడినట్లే పూర్వాచారపరాయణులచేత గొప్ప యాయుధమైన బహిష్కార మిప్పుడు మూలఁబడి త్రుప్పు పట్టుచున్నది. యూరోపుఖండములో విద్యనేర్చుటకుఁ బంపని గొప్పకుటుంబము కలకత్తాలో నేఁటికాలమున నొక్కటైనలేదు. వారిని వెలివేయువాఁడెవఁడు? దేశమందున్న ఋజువర్తనులను బుద్ధిమంతులను వెలివేసినపక్షమున సంఘములో నిక యోగ్యులు, తెలివితేటలు మిగులనేమిగలవు? మనల నడిపించువారు మనకు విద్య నేర్పువారు, మనకై శాస్త్రములు వ్రాయువారు, సంఘసంస్కరణముకై పాటుబడువారు, రాజకీయ విషయములలో మనయభివృద్ధికై పోరాడువారు హిందూ సంఘములోనుండి బహిష్కరింపఁ బడదగినవారై యుందురా? ఇంతెందుకు? హేమచంద్రుఁడా! వీరెఱుఁగవా? ఎవరిపరిశ్రమ మనజాతి పురోవృద్ధికి మూలాధారమో యభివృద్ధిమార్గమున నడచునపుడు మనకెవ్వరి ఋజువర్తనము మార్గదర్శియై మంచి ప్రోత్సాహము కలిగించి, మనచేతఁగూడ ధీరకార్యములు చేయించునో ఆమహాత్ములందఱు, ఆ నాయకులందఱు వారే. మహానుభావుఁడైన విద్యాసాగరుఁడు, మనీషావంతుఁడైన మధుసూధనదత్తు, మహోత్సాహ పూరితుఁడైన

కేశవచంద్రసేనుఁడు, దేశాభిమాని యగు సురేంద్రనాథ బెనర్జీ మున్నగువారిని మనవారి దినములలో, బేరునకు మాత్రము వెలివేసినారు. ఈ నాయకులను దలఁచుకొనకుండ హిందూసంఘముమాట లెవ్వరు తలఁచుకొందురు? ఈ నాఁటి హిందువులలో మిక్కిలి గొప్పవారుగా శ్రేష్ఠులుగా వీరిని పేర్కొని గర్వింపని హిందువుఁ డెవఁడున్నాఁడు? నా పిచ్చిమాటలు పాటింపక మన్నింపుము. ఈ సంబంధములో సంస్మృతులైన యా మహాత్ముల నామధేయములఁ బేర్కొన్నందుకు నన్ను క్షమింపుము. నేను నవనాగరికుఁడనుగాను. నాయకుఁడనుగాను, పేదవిద్యార్థిని. స్వసౌఖ్యముఁ జూచికొనునట్టి యాత్మలాభపరాయణుఁడను కాని యీదినములలో వెలివేయుట పిచ్చిప్రయత్నమని మాత్రము చెప్పఁదలచుకొన్నాఁడను. అధర్మము కానిదియు, అగౌరవము కానిదియు నైన కార్యమొకటి చిన్నతనమందుఁ జేసినందుకుఁ జెడిపోయిన వాఁడెవఁడును లేఁడు."

"నీవు మిక్కిలి సమర్థతతో లెస్సగా వాదించినావు. నీవు తొందరపడలేదనియు బుద్ధివలపునకుఁ జిక్కి పరవశుఁడవై పనిచేయలేదనియు నీ నిశ్చితాభిప్రాయమును బట్టి, ఎంతయు సంతసించుచున్నాను. నామాట వినుము. స్వయంకృతాపరాధములచేతను సాహసములచేతను మన దుఃఖములను మనమే తెచ్చిపెట్టుకొందుము గాని లోకము మనకు దుఃఖము తెచ్చిపెట్టజాలదు."

"హేముఁడా! నే నాలోచించఁ గలిగినంత నిమ్మదిగ నాలోచించి చూడఁగాఁ దేలిన వ్యవసాన మేమనఁగా, నేను దుర్దృష్టములు తెచ్చుటకుఁ బ్రయత్నించుటలేదు. సౌఖ్య సంపాదనమునకే నేను ప్రయత్నించుచుంటిని. ఆమెను నే ననేక దినములు, అనేక మాసములు పరిశీలించి చూచితిని. ఆమె నా[illegible] చేసిన పక్షమున నన్నందఱికంటె నెక్కువ ధన్యునిఁ జేయఁగలదు. ఆమె యమాయకత్వమును బట్టియు, విశ్వాసమును బట్టియు, ఆమె నియమములను బట్టియు, భక్తిని బట్టియు, ఆమె సత్యాసక్తిని బట్టియు, పవిత్ర చరిత్రమును బట్టియు, నే నామె వలపు నిలిపితిని. ఎవని హృదయము నెవని జీవనము తన యనురాగమునఁ యామె యనుగ్రహించునో అతనిని భగవంతుఁడు సైత మనుగ్రహించును. హేముఁడా! నేనెంతో నిమ్మదిగాను మోహావేశ శూన్యముగాను మాటాడుచున్నాను. ఈ యాఱు మాసములనుండియు నాహృదయమును బ్రదలుచేసి తలఁచుకొన్నప్పుడెల్ల నాకు శక్తి యుత్తించినట్టి యావికార భావములను నేనిప్పుడు నామనస్సు చెంతకు రానిచ్చుటలేదు.

కాని యొక్కమాట మాత్రము చెప్పెదను. ఏమనఁగా ఈవిషయములో నామనోరథము భిన్నమై నాయాశ లడుగంటె నేని నాప్రయత్నములు వ్యర్థములు. నాజీవనము నిష్ప్రయోజనము. నేనెందుకు బనికిరాను. నేనింకఁ బ్రయత్నింప వలసిన విషయమే యుండదు. సంతోషరహితమై పరమార్థశూన్యమైన యీబ్రతుకు నేనేమిచూచికొని బ్రదుకుదును ?”

“శరచ్చంద్రుఁడా! సిగ్గు సిగ్గు! అలాగనబోకు. దేహమనోదార్ఢ్యములు గల నీవంటి పడుచువాఁడు తాను వలచినకన్య తనకుఁ జిక్కలేదని జీవితపరమార్థములను భ్రష్టములు చేసికొని, ప్రయత్నములు భగ్నములు చేసికొని పాడగుట భావ్యమా? సుధ నీకు చేజిక్కనది కాదని అటువంటిమేధను అటువంటిశక్తిని, వ్యర్థము చేసికొని యావజ్జీవము చేయఁ దలఁచిన మహాకార్యము లన్నిఁటిని మానుకొని ఆశలడుగంటఁ ద్రొక్కికొని చెడిపోవచ్చునా ?”

“హేముఁడా! నీనిశ్చయ మిదా? ఎంతదృఢమైన హృదయమైనను, జీవయాత్రలోఁ దనకుఁ జేదోడు వాదోడుగా నుండి కాపాడుటకుఁ బరసహాయ మపేక్షించు నన్న మాట నీవు మఱచితివి. ఆశమీఁదనే మనుష్యుఁడు బ్రదుకుచుండును గాని బానిసవలె నిరర్థకముగా పనిచేయఁడు. నీవిదివఱకే ఏదోపక్కగా నిశ్చయించుకొన్న పక్షమున నావాదము వ్యర్థము. అందుచేత నీకును బిందుకును నేను చేసిన యపరాధము మఱచి పొమ్ము. చేయవలెనని నేనేయపరాధమును జేయలేదు. గావున నాతెలివి తక్కువను మన్నింపుము. మనయూరిలో నేను చిన్న పిల్లవాఁడనైనప్పటినుండి నామీఁద నీవు చూపుచువచ్చిన యాప్రేమతోనే నన్నప్పుడప్పుడు తలఁచుకొనుము.”

అని శరచ్చంద్రుఁడు బాష్పబిందువులు వెడలుచున్న తనకన్నులు వాని కగపడకుండ జేయుటకై తన మొగమావలకుఁ ద్రిప్పికొనెను. హేముఁడు మెల్లగా తనపై జేయి వైచి యిట్లనియె. “నీమనస్సునకు నొప్పి కలిగించితినేని నన్ను క్షమింపుము. నీవు తొందరపడి క్షణభంగురమైన మనోవికారముచేత నిటుల చేయుచుంటివేమో కనుఁగొనుట సుధకు నీకుఁ గూడ క్షేమమే యని తలంచితిని. నీవు సంపూర్ణముగా నాలోచించి, యిది మంచిదేయని తలంచిన పక్షమున నీధైర్యమునకు నేను మెచ్చుకొనుచున్నాను. నీదయకు నేనాశ్చర్యపడుచున్నాను. నీవివాహమును నేను హృదయపూర్వకముగ నంగీకరించుచున్నాను. నాభార్యతనకీవిషయ మంగీకారమే యని తననోటితో తానే నీతో స్వయముగాఁ జెప్పుటకై మేడమీఁద నీకోసము కనిపెట్టుకొని యున్నది. అపారకరుణా

సముద్రుఁడగు భగవంతుఁడు పాపము మందభాగ్యురాలగు సుధయొక్క జీవనమునకు సంతోషము, సౌఖ్యము ప్రసాదించి యనుగ్రహింపఁ దలఁచుకొన్నపుడు నాభార్యయు నేను దానికడ్డముగా నిలిచి చెడగొట్టుదుమా? పరమేశ్వరుఁడు మీకెల్ల ప్రేమ మొప్పి నిరంతరానందమిచ్చి రక్షించుగాక!”

ఆమాటలకు శరచ్చంద్రుఁడు ప్రత్యుత్తరము చెప్పలేకపోయెను. శరచ్చంద్రుఁ డంతవరకుఁ బిగఁబట్టి యుంచిన బాష్పబిందువులు హేమునిచేత నాపఁబడెను. హేముఁడు మాఱుమాటాడక మేడమీఁదకు వెళ్ళుమని చేతితో సంజ్ఞచేసెను.

బిందు మేడమీఁద నాముదముదీపము పెట్టి నేలఁ జాపవైచికొని కూర్చుండెను. అప్పుడు శరచ్చంద్రుఁడు కలతపడిన మనస్సుతో, సిగ్గుతోఁ జెడు మొగముతో నామె కడకుఁ బోయెను. తన కృతజ్ఞతను గౌరవమును దెలియఁజేయుటకై యతఁడు దాని పాదములకు నమస్కరించెను.

“అంధకార బంధురమగు నాజీవనముమీఁద సూర్యప్రభ జిమ్మితివి. ఇందుకు నేను నీ కేమి ప్రత్యుపకారముఁ జేయఁగలను, బిందూ!”

మన దేశములో స్త్రీలు తోఁబుట్టువుల భర్తలగు బావలను, మఱఁదులను హాస్యముచేయునట్టి యాచారము కలదు గావున బిందు శరచ్చంద్రుఁడు తన చెల్లెలికి మగఁడై, తనకు మఱఁదియైనట్టే భావనచేసి యిట్లు పరిహాసోక్తులు పలికెను. “అబ్బాయీ! శరచ్చంద్రుఁడు! నాకోఁకరాకు; నాపాదములకు నమస్కరింపవద్దు. ఈవిధముగా బతిమాలుకొని అనుగ్రహము సంపాదించుటకో వలసినవారు వేరే యున్నారు. నేను కాను”

శరచ్చంద్రుఁడు సంతోషపారవశ్యమునుండి తెలివిఁ దెచ్చికొని కృతజ్ఞతాసూచకముగా మరల నిట్లనియె. “నీవు నాపక్షముఁ బూని నీమగనితో వాదము చేసినావు. ఈ కార్యమున కతనిసమ్మతి పుచ్చికొన్నావు. యావజ్జీవ సుఖప్రదానము చేసినందుకు, నేను నీఋణ మేలాగునఁ దీర్చుకొనఁ గలను?”

“నాసమ్మతి యెందుకు నాయనా! పెండ్లికొడుకు తానే మనసిచ్చి ముందుగా పెండ్లికూఁతురిని వరించినాఁడు. పెండ్లికూఁతురు పెండ్లికొడుకుమీఁదఁ దన కటాక్షమిదివఱకే సమ్మతించినది. మధ్య సమ్మతించుటకు మానటకు మే మెవరము?”

“బిందూ! నీమాటిపోటిమాట లొక్కనిమిషము కట్టిపెట్టు. ఇందుకు సమ్మతించితి నని మనఃపూర్వకముగాఁ జెప్పి మా యిద్దరిని దీవించవమ్మా! ఈ భూలోకములో అన్ని విషయములకంటె నీదీవననే యెక్కువగా భావించుకొందును! సుధ ఇప్పటికిని చిన్నపిల్లే కదా? అప్పగారు తెలపీయకుండ ఆమె యేలాగున సమ్మతింపగలదు?”

“అది ఇప్పుడు చిన్నపిల్ల కాదు. చిన్నదైనను ఈ విషయములు మాకంటె దానికే బాగుగాఁ దెలుసును. అమ్మయ్యా! అదెక్కడి! చిత్రవిచిత్ర గ్రంథాలు చదువుకొనఁగలదు. పలుపులు గిలుపులు దానికిచక్కగా తెలియును.”

“వేళాకోళము కట్టిపెట్టి కొంచెము నీవు వ్యవహారసరళిగా మాట్లాడవమ్మా! నీకు దండమూపెట్టెదను”

“నన్నీలాగున బతిమాలుకోవలెనయ్యా! మీ యావిడ కోప పడగలదు. నా చెల్లెలికి కోపము తెప్పించుట నా కిష్టములేదు. ఆమె వ్యవహారములలో జోక్యము కలుగఁ జేసికొని పెత్తనము వహించుట అంతకంటె ఇష్టములేదు.”

“నే నోడిపోయినా నమ్మా! ఈ యత్యంతక్లిష్టసమయమున మీ సలహా పుచ్చుకొని వ్యవహారము పరిష్కరించుకోవలెనని యనుకొన్నాను. కాదేమో కాని నీవతి కఠినముగా నున్నావు! ఎంతబతిమాలుకొన్నను మెత్తఁబడకున్నావు”

“వ్యవహారము పరిష్కరించుకో. ఎవరడ్డమున్నారు? పెండ్లికొడుకు పెండ్లికూఁతురు గలసి రహస్యముగా వారిష్టము వచ్చినట్లు వ్యవహార మిదివరకే పరిష్కరించుకొన్నారని నే ననుకొన్నానే! ఇఁక పురోహితుఁడు వచ్చి పీటలమీఁద కూర్చుండఁబెట్టి పెండ్లి చేయుటే తరువాయి. మఱచిపోయినాను; కాలేజీలలో చదువుకొను పిల్లవాళ్ళు మంత్రములు మానివేసి పురోహితుని పిలువక వివాహములు స్వయముగా తామే చేసికొందురేమో! ఆఁడవాళ్ళు చేయవలసిన లాంఛనములు కొన్నియున్నవి. అవి మేము చేయ వచ్చునా? లేక పెండ్లికూతురే చేసికోగలదా? సుధను పిలుతునా? పోనీ, ఇప్పుడే వివాహము జరిగించుకోవచ్చును.

బిందుయొక్క హాస్యరసప్రసంగమున కారాత్రి విరామములు కనఁబడక పోవుటచే శశిచంద్రుఁడు విసిగి వెళ్ళిపోవుటకై లేచి కడసారి యొకవిన్నపము చేయఁదలఁచుకొని, యామెచేతులు రెండు పట్టుకొని యిట్లనెను. “నీవు కఠినముగాను నిర్దయగాను

మాటలాడు చున్నావు గనుక నేను వెళ్ళిపోయెదను. నేను వెళ్ళకముందు దయతో ఒక్కమాటమాటాడి మా వివాహము 'సరే, మంచిదే' యని దీవింప వచ్చా! నీదీవన, నీ ప్రేమ నాకీలోకములో అందరి దీవనలకంటె, ప్రేమకంటె యెక్కువ. నీ వంటివారు నాకీలోకములో లేరు,"

ఆ విన్నపము విని బిందు మెత్తపడి సామాన్యధోరణి నీ విధముగాఁ బలికెను.

"దయాసముద్రుఁడైన భగవంతుఁడు నా చెల్లెలికి వివాహసౌఖ్యము ననుభవింపననుగ్రహించి నప్పుడు నేను దానికడ్డము నిలుతునా? దిగఁబడినవారి కూఁతకోలయై లేనిసత్తి నిరుపేదలను నెవరులో రక్షించునట్టి భగవంతుఁడు నా చెల్లెలికి సుఖము గలుగఁజేసి రక్షించుగాక! ఇటువంటి దృఢమైన హృదయము, దయాస్వభావము గల మనుష్యునకు ఎటువంటి గొప్పదశ దగియుండునో అటువంటి గొప్పదశ, అభివృద్ధి ఐశ్వర్యము నీకు కూడా భగవంతుఁ డీయవలెనని కోరుచున్నాను. సుధ నీకు విధేయురాలై, పతివ్రతయై పదిమందిలో ఇటువంటి ఆఁడది లేదనిపించుకొనునట్లు నడచుకొని నీకు సుఖము కలుగఁ జేయవలెనని కోరుచున్నాను"

ఈ సంభాషణ ముగునప్పటికి రాత్రి ప్రొద్దుపోయెను. శరచ్చంద్రుఁడు బిందువద్ద సెలవు పుచ్చుకొని వెళ్ళెను. వెళ్ళునప్పు డతఁడు తనంతటి యదృష్టవంతుఁడు భూలోకములో లేఁడని యానందించెను. అతఁడు మెల్లమెల్లఁగా మేడమెట్లుదిగి ముందటి నాకిటి లోనికి వచ్చెను. వచ్చునప్పటి కొక కేకో [illegible] వినఁబడెను. వినఁబడఁగానే అతఁడు కదలక అక్కడ నిలిచెను. ఆమె ముసుగు వేయక [illegible] చేతిలో [illegible] పట్టుకొని [illegible] కొట్టుచున్న తాళము వేయుచు సుధ నాకిఁక గపడెను. [illegible] ఆ సుందర విగ్రహమును శరచ్చంద్రుఁడు సరిగా రెండు మాసములనుండి చూచుటలేదు. అందుచే నతఁడు తన మనోరథమై, తన వలపుల కాణాచియై వెలయుచున్న యా యువతీమణి విగ్రహమును రెప్పపాటు లేక చూచుచు, నిశ్చేష్టుఁడై నిలుచుండెను. అతఁ డెక్కువ మాటలాడఁజాలక నిలువఁబడినప్పుడు మనోజ్ఞమైనకైవు తిలకక్కి నట్లు [illegible] వర్ణించుటకు వీలులేనితలఁపులు తండోపతండములై యతని యంతరంగమునఁ బ్రవేశించెను.

సుధ తలుపు గొళ్ళెము వైచి, తాళము తగిలించి రెండడుగులు ప్రక్కకు నడచెను. మరలిన ప్రక్కను నిశ్చేష్టుఁడై నిలిచి మాటాడఁజాలక తన్ను జూచుచున్న శరచ్చంద్రుని [illegible] సుధ శరచ్చంద్రునిఁ జూచెను. ముద్దులుమూటగట్టు నామె మొగము సిగ్గులొలికెను.

ఆసిగ్గున దలవంచికొనెను. శరచ్చంద్రుని దృష్టిప్రసారమునుండి తన మొగమును గప్పి పుచ్చుటకు మొదటిసారి యామె మేలిముసుఁగు కన్నుల కడ్డముగాఁ దీసికొనెను. నిలువఁబడినప్పు డామె మేనువడఁకెను. నులివెచ్చని నెత్తురు పైకి ప్రవహించి మొగమునకును, మూసికొనిన కన్నులకును సుందరమైన యరుణకాంతినిఁ గలిగించెను. అంతట నామె దీపమాఁది యార్పివైచెను. అర్పివైచిన సిగ్గుగలిగించుచున్న యాయవస్థనుండి తప్పించుకొనుటకై మరియొక మూల కరిగి దాగి యుండెను.

భరతఖండములో వధూవరుల కింతకంటె యెక్కువ సమావేశములు, సంభాషణలుఁ గలుగవు.

పదునాల్గవ ప్రకరణము

మాతృశాసనము.

అర్ధరాత్ర మయ్యెను. పండుగురాత్రి 'వెలిగించిన జ్యోతులు క్రమక్రమముగా నాఱిపోయెను, సంతోషములోఁ గలిసికొన్న మనుష్యులగుంపు లదృశ్యము లయ్యెను. ఆసమయమున శరచ్చంద్రుఁడు నిర్జనములైన మాటుమణఁగి సందులగొందులనుండి మాఱుమూలనున్న తనబసకుఁ బోయెను. నాఁటిరాత్రి జరిగిన వృత్తాంతములు తలఁచుకొన్న కొలఁది వానిగుండె దడదడఁ గొట్టుకొన సాగెను. ఈమహాసౌఖ్య మనుభవించు నదృష్ట మతనికిఁ బట్టునా లేక యాపండుగరాత్రి వెలిఁగించిన దీపములు జ్యోతులు క్రమక్రమముగ నారిపోయిన తరువాత నంధకారబంధురమగు ప్రపంచమువలెనే, యాసలన్నియు నడుగంటిపోవ నతని హృదయము మునుపటికంటె నధికముగ దుఃఖభాజన మగునా?

అడుగులు చప్పుడు కాకుండ నతఁడు తన బసఁజేరెను. చేరఁగానే సేవకుఁ డొకఁడు జాబొకటి తెచ్చి చేతిలో బెట్టెను. పెట్టఁగానే ముందతఁడు వడఁకెను. మేడమీఁద దీపములేదు. అతఁడు మేడమెట్లు మెల్లమెల్లఁగా నెక్కుచుండ నేవో క్రొత్తకీడు తనకు మూడఁ దలచుకొన్నదని గొప్పభయ మతనిమనస్సు నావరించెను. కడచిన రెండుమాసములనుండియు నతఁడున్న వ్యాకులముచేత నతని నరములు బలహీనములయ్యెను. అతఁడు

దీపముకడకుఁ బోయి జాబు జదువ సమకట్టునప్పటికి వాని చేతులు వడఁకెను. దానిమీఁద కాశీ టపాముద్ర చూడఁగానే అతని కంపము మఱింత వృద్ధియయ్యెను.

ఆజాబు వానితల్లివద్దనుంచి వచ్చెను. అందులో నిట్లుండెను.

“బిడ్డా! శరచ్చంద్రుఁడా! నీవు నిరంతరారోగ్యముఁ గలిగి చిరంజీవి వగుటకు, నీప్రయత్నములు మనోరథములు సిద్ధి పొందుటకు, నీకెల్లప్పు డానందము కలుగుటకు భువనేశ్వరస్వామిని నే నెల్లకాలము ప్రార్థించు చున్నదానను.

కుమారా! నీవిషయమై నే నొకచెడ్డవార్తను విని మిక్కిలి ఖేదపడు చున్నాను. నీవు నాకు సుపుత్రుఁడవు. నీతల్లిమీఁద నీకు మిక్కిలి ప్రేమ. నీమీఁద నెంత చెడ్డవార్తను పుట్టించినను నేనది నమ్మను. భర్తను గోల్పోయి దుఃఖించు చున్న తల్లిని మఱింత దుఃఖ పెట్టవని నే నెఱుఁగుదును.

ఆవిధవపిల్లను సుధను నీవు పెండ్లియాడుదువని ఇక్కడ అందఱు చెప్పుకొను చున్నారు. అది పాపకార్యము. అందువల్ల నీతండ్రిగారి కప్రతిష్ఠయు, నామనస్సునకు మేర లేని దుఃఖమును సంభవించును. నీవు వినయవిధేయతలు గలవాఁడవు. మాతృభక్తికల వాఁడవు. గనుక తల్లిమనస్సు నొప్పింపవు.

నాయనా! ఈప్రపంచములో నే నెన్నోకష్టములు పడి యున్నాను. మీతండ్రి గారు నన్ను దుఃఖసముద్రములో ముంచి వెళ్ళిపోయినారు. నీచెల్లెలికొఱకు నే నెంత దుఃఖపడు చుంటినో నీవే యెఱుఁగుదువు. నీవే నా నిక్షేపము. నీవే నాప్రాణాధారము. నేను నీమీఁద పుట్టెడాస పెట్టుకొని యున్నాను. నేను బ్రదికి వన్నాళ్ళు బ్రదుకఁ బోను. కాబట్టి యీముసలితనములో బ్రదికియున్న నాలుగు దినములు నన్ను దుఃఖ పెట్టకు నాయనా!

నా తండ్రీ! నా తలమీఁద ఎన్ని వెండ్రుకలున్నవో అన్ని సంవత్సరములు బ్రదుక వలెను. దయాసముద్రుఁడైన విశ్వేశ్వరుఁడు నిన్ననుగ్రహించి, నీమనస్సు పవిత్రమైనమార్గము మీఁద నిలుచునట్లు చేయుఁగాక! ఇంతకంటె తల్లి కుమారుని నిమిత్తము వేఁడదగిన దే మున్నది? నాయనా! నిన్నొకసారి చూచిపోవలె నని త్వరపడి కలవరిస్తూ వచ్చితిని.”

శరచ్చంద్రుఁ డాజాబు మొదటనుండి చివరవఱకుఁ జదువుకొనెను. అంతలోఁ దృప్తినొందక నాలుగుసారులఁ జదువుకొనెను. అంతట జాబు పట్టు లేక చేతులనుండి

బారికింపబడెను. శరీరము కంపించెను కన్నులు చీకట్లు గ్రమ్మెను ఒడలు తెలియక మూర్ఛిల్లి నేలం బడెను తెలివి యెప్పుడు వచ్చెనో యతం డెఱుంగఁడు. అతఁడు లేచి కిటికీతలుపులు తెఱచి, చీఁకటివైపుఁ జూచుచు నిశ్శబ్దముగా గవాక్షములోఁ గూర్చుండెను. అప్పుడతని యంతరాత్మలో మహావేదన ప్రారంభమయ్యెను. నోరు మెదపక, బొమ్మ ముద్దై నిలిచి కదలక యొక్క దిక్కుఁ జూచుచున్నప్పుడు, ప్రేతకళ యావహించినట్లుండెను.

తన యుత్సాహము భగ్నమైనందున కలవరింతగా విచారింప లేదు. జీవితమందలి సకల సౌఖ్యములను, వలయునోగల స్థైర్యమతని కుండెను. సంతోషరహితమై, వికాసశూన్యమై, నిష్ప్రయోజనమై, నిరుత్సాహకరమైన జీవయాత్ర తాను చేయఁగలఁడు. కాని హేమసుందరి బింబము దలఁచుకొన్నప్పుడు, తన యందు విశ్వాస ముంచిన యమాయకురాలగు సుధను దలఁచుకొన్నపుడు, నతని గుండెలు నీరై పోవఁజొచ్చెను. ఈవాడుక దేశమంతట వ్యాపించి నట్లతం డెఱుంగును. తాను మొదట మాట యిచ్చి, పిదప సుధను జేకొనక వెలిపెట్టినప్పుడు లోకమంతయు నిష్కళంక మైన యాకుటుంబమును నిందించి కాకులు పొడిచినట్లు పొడుచునని యతం డెఱుంగును. నిర్వ్యాజప్రేమతోఁ దన నాదరించిన తోషమెట్టిదో యెఱుంగని తన జీవితమును సౌఖ్యభాజనము సంతోషము చేసిన యాకుటుంబమునకు అప్రతిమానిలయమునకు న్యాయముగాఁ దానే పరాభవము కలిగించుట భావ్యమా యని యతనికిఁ దోఁచెను. తోఁబుట్టువుకంటె నెక్కువగాఁ దన్ను జూచినవారికిఁ దల్లిదండ్రుల కన్న నెక్కువగాదరము చేసిన హేమమునకు తాను చేయవలసిన ప్రత్యుపకారముగా నిదియా యని తలంచెను. ఇంటిలోనికేగి యింటివారినందఱిని గలసి, ఉంచి, పిదప మెల్లమెల్లగా నాపదకు ద్రోకి పాఱిపోవు కోడెత్రాచువలె, మొదట నంతి నమ్మఁ బల్కి, యాంతరంగికగ్రంథము జరిగించి, చిట్టచివరకు వారినందఱి నపకీర్తిపాలు చేసి, కుటుంబనాశనము జేసి నట్టుండుటకన్న మహాపాపము లేదని విచారించెను. “అమ్మా! ఒక్కవిషయములో నేను నీమాట వినజాలనందున క్షమింపుము. నేను వారిని మోసపుచ్చ జాలను.” అని తల్లి నుద్దేశించి శరచ్చంద్రుఁడు డగ్గుగా బలికెను.

అనంతర మతఁడు మాయామర్మ మెఱుంగనిసుధను, నిర్మలహృదయము గలసుధను, దన్ను నమ్మినసుధను దలంచితలంచి విచారించెను. ఆఱు మాసముల క్రిందట నామె దుర్గుణము లెఱుంగక యుండెను. ఏపాప మెఱుంగని యాచిన్నదాని మనస్సునకు తాను క్రొత్తక్రొత్తయాసలు గొల్పెను. ఆమె పవిత్రహృదయము నతఁడు నవసంతోషరసముతో నింపెను. అట్టి పసికూన నిప్పు డతఁడు వదలవేయ వలసినదా? యావజ్జీవము అపనింద

పాలై పుట్టినింటను దిక్కుమాలినదై యామె యుండవలసినదా? మొదలు వితంతువు వివాహము చేసికొ దలచుటయే నింద. ఆనింద యెట్లో యోర్వవచ్చు ననుకొనగా, చేసికొందు ననుకొన్న పురుషుడు చేసికొనక, కారణము చెప్పక, యకస్మాత్తుగా మాని కొనుటచే నేదో దోషము దానికడ నుండబట్టి యతడు వదలివేసె నని లోకులు వ్రేలు పెట్టి చూపి కలకాలమామెను నిందింతురు. ఆమె పేరు సంసారిస్త్రీ లెత్తకూడని పేరుగా నెంచి యమ్మలక్కలు గుసగుసలాడుదురు. ఇట్లు పరిత్యక్తయైన యామందభాగ్యురాలు గడినోర్వలేక, మనోవ్యాధిపీడితయై మంచమెక్కవచ్చును. వెలికిబుచ్చుటకు వీలులేని దుఃఖ భారముచేత గ్రుంగి యనేకులు గతించినట్లు యామెయు నకాలమృత్యువువాత బడవచ్చును. ఈతలంపులతో నతని తల గిఱ్ఱున దిరిగెను. ఆరేయి వీచుచున్న చల్లనిమంద మారుతములు తనపై బ్రసరించి సేద దేర్చవచ్చునని యతడు తల కిటికీలోనుండి యావలకు బెట్టెను. లోకమంతయు నిద్రించుచుండెను. అంధకారము భూమి నంతయు నావరించెను. ఆశరత్కాలరాత్రి యందు లెక్కకు మీఱినచుక్కలు సమ్మోహనము జెందిన విశాల ప్రపంచమును జూచుచుండెను.

కాలక్రమమున తూర్పుదెసయందు దెల్లనిరేఖలు పొడసూపెను. అంతలో నతనికి దల్లి జ్ఞప్తికి వచ్చెను. దుఃఖసముద్రములో మునిగియు దన్ను మితిలేని గారాబమున బెంచి, బ్రదికి నన్నాళ్ళు బ్రదుకజాలక, జీవిత శేషమందు సంరక్షకుడుగా, నూతకోలగా, నేడుగడయుగా దన్నే నమ్ముకొని యున్న మాతృదేవత మనఃపథమున జొచ్చెను. “ఓతల్లీ! నీవు చెప్పినమాట వినక, నేను నీయెడల దుర్వినయము జూపవలసినదా? నీమనసునకు నేను నొప్పి గలిగింపవలసినదా? ఈభూమిమీద నీవుండవలసిన కడపటి దినములలో నీకే సౌఖ్యము లేకుండజేసి నిన్ను నేను బాధింపవలసినదా? శతవృద్ధవైన నీమనస్సు క్రొత్తదుఃఖములతో నింపి, నీజీవితకాలము హ్రస్వముచేసి నీకు నేను శీఘ్ర మరణముఁ గలిగింప వలసినదా? నాతల్లి మాటదాటిన తరువాత నేను బ్రతికి యెందుకు? చచ్చి పోవలసినదే.”

అట్లు తలంచుచు నతఁడు గవాక్షము మీఁదనే తల పెట్టుకొని యుషఃకాలము నంతటి చల్లనిమందమారుతములు మేను సోఁక నిమేషకాలము నిదురించెను. ఉదయకాల సూర్యమండలములనుండి లేంజిగురాకులవంటి యరుణకిరణములు గదిలోఁ బ్రవేశించుటకు నతఁ డావిధమున నిదురించి కొండొక వడికి మేలు కాంచి యెట్టయెదుట వెలవెలబారు

మొగములో దయారసము గ్రక్కుచున్నఁ చూడ్కులఁ బ్రసరింపఁజేయుచు నిలిచి యున్న యొక యవ్వను జూచెను.

"నాయనా! నీ మొగమున నెత్తురు లేదు. వెలవెలఁ బాఱుచున్నది. బెంగ పెట్టుకొన్నట్లున్నావేమి? రాత్రి యంతయు ఎందుకు మేలుకొన్నావు తండ్రీ! పరుపుమీఁద పండుకో. కొంచెము ప్రొద్దెక్కునదాక నిద్రపో." అని తెల్లవారు జామున బండిదిగివచ్చిన తల్లి శరచ్చంద్రునిపైఁ జేయివైచి పలికెను.

తల్లి మాటలు చెవినిఁ బడగానే యతని హృదయము మీఁద పన్నీరు చిలికి నట్లయ్యెను. వెంటనే యాతఁడు కూర్చుండినచోటునుండి లేచి యామె పాదముల వద్ద గూర్చుండి కన్నీరులో మాతృపాదారవిందముల కభిషేకము జేసి గద్గదస్వరముతో మాటలాడెను. "అమ్మా! నీమనస్సునకు నేను నొప్పి కలిగించినపక్షమున నాబుద్ధిహీనతను మన్నింపుము. నేను నీమాట జవదాటను."

అని తల్లి యెదుటఁ బ్రియపుత్రుఁడు మాటలాడ వలసిన భయభక్తులతో మాటలాడెను. హిందువుల మనస్సులో సమస్తభావములకంటె మాతృదేవత యెడల భక్తి భావము మిన్నయై వెలుఁగుచుండును గదా!

తన ముసలికన్నులు బాష్పబిందువులతో నిండి క్షణకాలము గ్రుడ్డి వగునట్లు లాయవ్వ యిట్లు లనియె. "అబ్బాయీ! కాఁటికి కాళ్ళు చాపుకొని యున్న తల్లిని బాధపెట్టవని నే నెఱుఁగుదును. పుట్టి బుద్ధి యెఱిగిన తరువాత నామాట దాఁటి యెఱుఁగవు. భగవంతుఁడు పాలించి నీ కన్ని సౌఖ్యములు కలుగఁజేయును."

ఇది జరిగినయొక వారము తరువాత నొకనాఁటిరాత్రి యొక పడుచువాఁడు హౌరా రైలుస్టేషనుకడకు వెళ్ళుటకు హుగ్లీనదిమీఁది వంతెన మీఁదుగా నొక్కఁడు బోవుచుండెను. బాటసారులు గుంపులుగుంపులుగా నతనిప్రక్కనుండి పోయిరి. ఎడతెఱపి లేక బండ్లు వేనవేలు పరంపరగా నడచెను. అనేకకంఠముల ధ్వని నభోమండలమంత వ్యాపించెను. కాని యా పడుచువాఁడు వంచినతల యెత్తక తనదారిఁ బోయెను. వంతెన మీఁద వెలిఁగించిన దీపములు క్రింద నీటిలోఁ దళతళ మెఱసి సంచలించెను. హిందూ దేశమంతటితో నత్యధికవ్యాపారము గల యాస్టేషనువద్దనుండి సరకుబండ్లు కట్టుకట్టుగుని నడిచి, మహాపట్టణమునఁ బ్రవేశింపఁ జొచ్చెను. కాని శరచ్చంద్రుఁడు దాని వంకఁ జూడనే లేదు. అతని మనసు విచారముతో నిండి యుండెను. అతని యడుగులు మెల్లమెల్లగాఁ బడెను.

దీపాలపండుగు తరువాత మహావిచారపీడితుఁడై యతఁడు కలకత్తాలో నొక వారము గడపెను. అతఁడు మిత్రులను జూడవెళ్ళక మూసికొని గదిలోనే కూర్చుండెను. కాని యొకనాఁడైనఁ జదివి యెఱుఁగఁడు. పుస్తకము తెఱువలేదు. మూసిన పుస్తకములు మూసినట్లే యుండెను. అతని మనస్సున కేవ్యాపారము సంతోషముఁ గలిగింప లేక పోయెను. ఏలయన జీవన మతనికంధకార బంధురమై, సంతోషరహితమై ప్రయోజనము లేనిదయ్యెను. తన్నిమిత్త మతఁడు స్వార్థము విడిచెను. ఆస్వార్థత్యాగమువల్ల నతని యాశాబంధము లెల్ల దెగిపోయెను. అతని ప్రయత్నములు వ్యర్థములయ్యెను.

తన భర్తకు అస్వస్థత యధికమయ్యెననియు, నందుచేత మగనిని వెంటబెట్టికొని తాను రాణీగంజికిఁ బోయి యుండె ననియు సోదరి యగు కాళియొద్ద నుండి యతనికి జాబులు వచ్చెను. ఆజాబులు మఱలమఱలఁ జదువుకొనఁగా నతని మనస్సునకుఁ గ్రొత్త తలంపు తట్టెను. తాను రాణీగంజికిఁ బోయి తన బావ కుపచారము చేయవలెనని యతఁడు నిశ్చయించుకొనెను. తాను వలచిన వలపులాడికి దూరముగా నుండవచ్చునని యతఁ డీపనికి దొరకొనెను. ఒకరు వెడలఁ గొట్టకుండ తనంతట తానే దేశభ్రష్టుఁడై ఇందందు సంచారము చేసి కాలక్షేపము చేయవలయునని యతఁడు సంకల్పించెను. తన జన్మస్థలములో నెవరికి జ్ఞప్తికి రాకుండ, బంధుమిత్రులస్మరణమునకుఁ దగులకుండఁ గడు దూరమున హిందూదేశమం దేదో మూల నుండుట కతని కిచ్ఛ పొడమెను. అట్టి యేకాంత జీవనమువల్ల కలకత్తాలోఁ దాను గడుపుచున్న దుఃఖజీవనమునుండి తనకు విమోచనము కలుగునని యతఁడు నమ్మెను. భూలోకములో నిరంతసంతోష మెదియు లేదు. గావున నట్టి ప్రవాసమే యతనికి దుఃఖోపశమనమై యుండును.

"అమ్మా! నన్ను వెళ్ళనీ. పాపము కాళి దుఃఖములోనున్నది. మహాసత్రమువంటి యీ యింటిలో దానిమగనికి సరిగా మందిప్పించి యాదరించువా రెవరున్నారు?" అని శరచ్చంద్రుఁడు తల్లితోఁ జెప్పెను.

"నాయనా! కలకత్తాలో నన్నొక్కర్తెను విడిచి నీ వెట్లు వెళ్ళెదవు! మాట పలుకు టనువారలేక, నా అన్నవారలేక, కాశీలోనుండక, కొడుకు దగ్గఱలేక, ఈ మహాపట్టణములో ఒక్కదానను నేనెట్లాగున నుండఁగలను?"

"అమ్మా! నీవొక్కర్తెవు యుండనక్కఱలేదు. నేను లేనప్పుడు హేమఁడే నీకొడుకు; బిందు నీ కూఁతురుకన్న నెక్కువగా నుపచారము చేయును."

"నీవు చదువుమాని యేలాగున వెళ్ళెదవు? పరీక్ష దగ్గఱకు వచ్చుచున్నది కాఁబోలు నే?"

"అమ్మా! ఈ సంవత్సరము పరీక్షకు వెళ్ళను. ముందుసంవత్సరము వెళ్ళెదను. కాలిమగనికి మనమిప్పుడు సరియైన వైద్యము చేయింపక యశ్రద్ధచేసితిమా, యావజ్జీవము విచారింపవలసి వచ్చును."

ఈ ప్రశ్నకామె యుత్తరమియ్యక యతఁడు పోవుట కంగీకరించెను. రాణిగంజి నుంచి యల్లునకు నెమ్మదిగానున్నవార్త తెలియువఱకుఁ గొన్నివారములామె కలకత్తాలో నుండి పిమ్మట వారణాశికి వెళ్ళఁ దలఁచుకొనెను.

ఇందునిమిత్తమే హుగ్లీపంతెనమీఁదనుండి శరచ్చంద్రుఁ డొకనాఁటిరాత్రి హౌరాస్టేషనునకు వెళ్ళెనని యింతకు మీరు చదివియుండిరి. అతడు వెళ్ళిపోవునప్పుడు హేమునకుఁగాని బిందునుగాని చూచి తన ప్రయాణవార్త చెప్పలేదు. అట్లు మర్యాద నతిక్రమించి వెళ్ళినందుకు హేతువు వా రూహించికొనఁ గలరని యతఁడెఱుఁగును. తనయెడఁ దప్పున్నపక్షమునఁ దనయందు దోషారోపణముచేసి నిందింపక, వారు భగ్నమనోరథుఁడైన మందభాగ్యుని దురవస్థకు జాలిఁదలఁచి, విచారింతురని యతనికి గట్టి నమ్మకము గలదు.

ఎఱిఁగినవారి కెవ్వరికిఁ గనఁబడకుండ బండిలో నెక్కవలెనని శరచ్చంద్రుఁడు నిశ్చయించుకొనెను. అందు ముఖ్యముగా హేమునకుఁ గనఁబడకుండ వెళ్ళవలెనని యతని సంకల్పము. ఏలయన హేమునిదర్శనము వెనుకటిమాటలు జ్ఞప్తికిఁదెచ్చి బాధకలిగించును. కాని యాలాగున జరుగలేదు. స్టేషనుదాటి యరుఁగుమీఁదకు వెళ్ళఁగానే యతనికి మొదట గనఁబడినమనుష్యుఁడే హేముఁడు.

కనఁబడఁగానే హేముఁడు శరచ్చంద్రుని కిష్టము లేకపోయినను దనచేతితో వానిచేయిపట్టుకొని యిట్లనియె "ఏమది? నాకుఁ గనబడకుండ మొగము చాటుచేయు చున్నావేమి? ముఖ్య స్నేహితులను జూడకుండ వెళ్ళివచ్చునా? ఇంత తేలికగా స్నేహబంధము విడగొట్టుకొనుటకు మాకీ లోకములో మఱెవ్వరైన స్నేహితు లున్నారా?"

"హేముఁడా! కారణములు నీకుఁ దెలియవు గనుకనా? నన్నడుగబోకు. నా నీచపుగుణములును, నా పిఱికితనమును నాకు మఱల జ్ఞాపకము చేయకు."

"ఆర్యా! శరచ్చంద్రుఁడా! లోకులు నిందించుచున్నారని నిన్ను నీవు నిందించికొనకు. నీవు మునుపు మంచి మనోబలము గలవాఁడవు. నీవుచేసినదానిలో దోషమేమియు లేదని నీవు భావించినపక్షమున నీ దౌర్బల్యముపోయి యెప్పటి మనోబలము నీకుఁ గలుగును. పెద్దది, మాతృదేవత. ఆమె కిష్టములేకుండ సుధను వివాహము చేసికొనుట ధర్మమని నీవు తలంచుచున్నావా? నీతల్లి గుండెపగిలి, యేడ్చి, బెంగపెట్టుకొని త్వరగా చచ్చిపోవునట్టి కార్యము చేయుటకు మేము మాత్ర మొప్పుకొందుమని నీ వనుకొనుచున్నావా? నీ ధర్మము నీవు నెఱవేర్చితివా, లోకములో నెవరికి జడియనక్కరలేదు. పేరునకు నీసోదరుఁడనని అనిపించుకొనుటకు వీలులేకపోయినను, నిజమైన సోదరప్రేమ నీమీఁదఁజూపి నిన్నాదరించిన మంచిస్నేహితుఁ డీలోకమున నీకొకఁడు గలఁడని నీ వెన్నఁడు మఱచిపోకుము."

అప్పుడు చిట్టచివరగంట వాయించిరి. ఆమాట లన్నిఁటికిఁ దగిన యుత్తరములు చెప్పుట కవకాశము గాని, శక్తిగాని శరచ్చంద్రునకు లేకపోయెను. "సోదరునికంటె నెక్కువవాడవు. నే నెక్కడ ఉండినీ. ఎన్నఁటికి, నీదయను, నీప్రేమను మఱచిపోను. మా అమ్మకు నా నమస్కారములు చెప్పుము. నామాట జ్ఞాపకముంచుకొమ్మని బిందుతో మఱిమఱి చెప్పు. నన్నెప్పుడు జ్ఞాపక ముంచుకొమ్మని—" అని యింక నేమో చెప్పఁబోవుచుండ జల్లుమనికూసి బండి వెళ్ళిపోయెను. అందుచేతఁ గడపటిమాట చెప్పుటకు వీలులేకపోయెను.

పదునైదవ ప్రకరణము

మగని విచారము.

హేమునిగృహము సందడిలేక సంతోషశూన్యమై చిన్నబోయి యుండెను. అందుచేత నతఁడు స్వగ్రామమగు తొల్పుకారునకుఁ బోవఁగోరుచుండెను. శరచ్చంద్రుఁడు వెళ్ళిపోవుటవలన హేమునిగృహమున కెంతో వెలితి గలిగెను. ఆవెలితి కందఱు విచారించుచుండిరి. తమ్మునికంటె నెక్కువగాఁ జూచుకొనుచున్న ప్రాణమిత్రుని వియోగమునకై హేముఁడు మనస్సున మిక్కిలి దుఃఖపడెను. శరచ్చంద్రుని యున్నతములైన యాశయములను సగర్వముగా విని, రసవంతములైన యతని సంభాషణములను సంతోష

పూర్వకముగా నాలకించు చుండుటచేత బిందుయొక్క యాలోచనలు దీర్ఘములైన యాశీతకాలపు సాయంకాలములయందు వానిమీఁదికి బోవం జొచ్చెను. అంతకుఁ బూర్వము జరిగిన కార్యములంబట్టి హేమునిగృహము కొద్దికాలముక్రిందట మరణము సంభవించిన గృహమువలె నిశ్శబ్దమై శోభాహీనమైయుండెను. ప్రాణసమానుఁడైన యామిత్రుని యెడఁబాటు వారికి బంధుమరణమువలె దుఃఖము కలిగించెను.

సుధ యెన్నఁడు నధరస్పందము చేయలేదు! ఆమె యుదయమునందు సాయంకాలమునందుఁ దన యప్పబిడ్డలకు సంరక్షణ సేయుచుండెను. తక్కిన వేళల నింటి పనిపాటల నెడతెఱపిలేక చేయుచుండెను. పూర్వవృత్తాంత సంబంధమైన తలఁపు హృదయమున నుండినను, వాగ్రూపమున దాని నామె యెన్నఁడు వెలిఁబుచ్చలేదు. ఆమె కన్నులయందు వెనుకటి ధాళధళ్యము లేదు. మనోజ్ఞమైన బాలికావిలాసము పోయి "ప్రారబ్ధకర్మ మనుభవింపక తప్ప" దను వైరాగ్య ముదయించెను. అయినప్పటికిని ముద్దులు మూటగట్టుచున్న యామెముఖము దీర్ఘవిషాదమును సూచించు చుండెను.

కలకత్తా నివాసము తనకు దుఃఖహేతు వయ్యెనని భావించి, తన కనుకూలమైన స్వగ్రామవాసముఁ జేయుటకై వారు ప్రయత్నములు చేయఁజొచ్చిరి. ఒక నాటి సాయంకాలము బిందు పనిచేత నలసి, చెక్కునఁ జేయిఁ జేర్చికొని యేకాంతమునఁ దన గదిలోఁ గూర్చుండ నొకజాబు వచ్చెను. పైపేరు చూడ నది యుమ వ్రాఁతవలెఁ గనఁబడెను.

అనుకూలమైన శీతకాలపుగాలి తగిలినతోడనే యుమయొక్క దేహస్థితి బాగుపడెను. ఆమె తిరిగి యారోగ్యదశ నొందెనని బిందుకు వర్తమానము వచ్చెను. కాని జాబువిప్పి చూచినకొలఁది విచారసూచన లామె నేత్రములలోఁ గనఁబడెను. ఇటువంటి దని యూహింపరాని భయావేశమున నామె హృదయము కొట్టుకొనెను. ఆజాబు చిన్నది. అం దిట్లుండెను.

"అక్కా! బిందూ! నిన్ను చూడవలెనని యున్నది. ఈసాయంకాలము రాఁగలవా!"

"కొన్నివారములనుండి చిత్రవిచిత్రములైన యూహలు నాతలలోఁ బ్రవేశించినవి. ఎన్నఁడు లేని నిశ్చయమొకటి నామనస్సు నాందోళపెట్టు చున్నది. అది యేమో నీ కిప్పుడు తెలియదు. అది నీకు ముందుముందు తెలియఁగలదు. చిన్ననాటినుండి నాకు

నీమీఁదఁ గల సోదరప్రేమతో నేటిసాయంకాలము నిన్ను గట్టిగాఁ గౌఁగలించికొనవలెనని యున్నది.”

“ఇప్పటి నాబ్రదుకు తలచుకొన్నప్పుడు పిచ్చి యెత్తు నేమోయని యొకప్పుడు నాకు భయము వేయుచుండును. అలాటప్పుడు కొల్పుకొరలో మనము చిన్నప్పుడాఁడు కొన్న ఆఁట పాటలు, ముచ్చటలు జ్ఞాపకము చేసికొందును. కొంత దుఃఖము దానితో నుపశమించును. మనలను సృష్టించినవాఁడు మనకు సుఖము గలుగఁజేయక పోఁడు. లేదా మనకు శాంతియైన నియ్యకపోఁడు. బిందూ! అంతేనా?

“నీకు నామీఁద గల ప్రేమ నాదుఃఖమును బోఁగొట్టు చుండును. నామీఁద నీకున్నంత ప్రేమ మాఅమ్మకైనను లేదు. అందుచేతనే ఈ సాయంకాలము నిన్ను చూడవలెనని నాకంత గట్టికోరిక. తప్పక రావలెను సుమీ.”

ఆమె యాజాబు నొకమారు చదువుకొని తనివి నొందక మరల మరలఁ జదువుకొనెను. చదువుకొన్న కొలఁది నామె కేదో యిట్టిదనరాని భయము తోఁచెను. అది యాకస్మికముగ వచ్చుటచేతను, దానిశైలి యసందర్భముగ నుండుటచేతను నామెభయము మఱింత యెక్కువ యయ్యెను. అంతటి యాత్మగౌరవము కలిగినది, యంతటి మితభాషిణి యైనది, బాధ లెన్ని పడు చుండినను నంత నిశ్శబ్దముగా భరింపఁజాలినది యైన సుమ యీ విధముగా నెట్లు వ్రాయఁగలిగినది? ఆ చిత్రవిచిత్రములైన యూహ లేమి? ఆమెకు గలిగిన యానిశ్చయ మేమి? ఈశ్వరునివల్ల నపేక్షించుచున్న యా శాంతియేది? అని తలంచుచున్న బిందు మనస్సున భయంకరములైన భావములు పొడకట్టెను. ఆమె మేనువడఁకెను.

ఆమె లేచి చెల్లెలిం బిలిచెను. “అమ్మాయీ! సుధా! పిల్లలను గొంచెముజూచి, అన్నము పెట్టి రాత్రి పండుకొనఁ బెట్టఁగలవా? ఉమ పాపము మనోవ్యాధితో బాధపడుచున్నది. దానిని నేను చూచుటకు వెళ్ళవలెను. నాకోసము కనిపెట్టుకొని యుండవద్దని, నేనొకవేళ ప్రొద్దుపోయి వచ్చినప్పటికీ ఎవ్వరు రాలేదని తలుపు పెట్టుకొనవద్దని మీ బావతో చెప్పు. ఉమ యెంతోకష్టములో నున్నది. నామనస్సులో విశేషము భయముగా నున్నది.”

ఉమ జాబులోఁగూడ నొకపల్లకిఁ బంపినందున బిందు దాని నెక్కి వెళ్ళిపోయెను.

ఉమయొక్క గృహము ప్రవేశించుచుండఁగా నామె గుండెయులు టకటకఁ గొట్టుకొనెను. కాని యుమను చూడఁగానే యా భయము కొంతవఱకు ఉపశమించెను. బిందు పోవునప్పటికి నామె నెమ్మదిగా బట్టలు సర్దుకొనుచుండెను. బిందును జూడఁగానే యామె చిఱునవ్వుతో సమీపించి, కౌఁగిలించికొనెను. మనోవ్యాధినిగాని దుఃఖమునుగాని పిచ్చినిగాని సూచించు చిహ్నము లేవియు నామె మొగమునఁ గనఁబడలేదు. అంతకు మున్ను జబ్బుపడుటచేతఁ గాఁబోలు మొగ మించుక తెల్లగానుండెను. ఎందుచేతనో గాని యామె కన్నులలో నదివఱకెన్నఁడు పొడకట్టని మెఱుపు కనఁబడెను. బిందు ప్రేమ యుట్టిపడునట్లు నామెను గాఢాలింగనము చేసికొని సహజ మృదుమధురమైన విధమున మాటలాడెను.

“అమ్మాయీ! ఉమా! నీజాబు చూడఁగానే నేను కొంచెము భయపడితిని. అందులో నీతప్పు లేదు. నాదేతప్పు. నేను తఱచుగా నిన్నుఁ జూచుటకు రావలసినది. ఆవిధముగా నేను వచ్చినపక్షమున నీమనసులో నీ విధముగా చిత్రవిచిత్రములైన ఆలోచనలు పుట్టకపోవును. ఏమోగాని మనకుఁగూడ కష్టములు సంభవించినవి. అందుచేత దుఃఖములపాలైనాము. నిన్నుఁ జూచుటకు నేను తఱచుగా రాకపోయినందువల్ల నీమనస్సునకు నొప్పి కలుగఁజేసితి నేమో యని నేననుకొనుచున్నాను. అట్లయిన పక్షమున నన్ను క్షమింపవలయునుసుమీ? ఉమా! నీమీఁద నాకున్న ప్రేమ ఎన్నటికి మాఱిపోదమ్మాయి! ముమ్మాటికి మాఱిపోదు.”

“నీకు నామీఁద నెంతో ఆపేక్ష యున్నదని నేనెఱుఁగుదును. మీరు పడుచున్న బాధలుగూడ నేనెఱుఁగుదును. ఈవేళ నిన్ను చూడవలెనని నాకెంతో అంతమనస్సైనది. అందుచేతనే నీకు జాబు వ్రాసితిని. నీవు తప్పక వత్తువని నేనెఱుఁగుదును. అంతటిదయ నామీఁద నీకెప్పటికి ఉన్నది. పాపము సుధ యేలాగున్నది? శరచ్చంద్రుఁడు కలకత్తాను, మిమ్మందఱినికూడ వదలివేసి వెళ్ళినాడు కాఁబోలేమి?”

“అదికాదే, ఉమా! మనసుధబ్రతుకు అచ్చటలు ముచ్చటలు లేనిదైపోయినదని దానిమాట తలచుకొన్నపుడెల్ల నా కెంతో దుఃఖము వచ్చుచుండును. శరచ్చంద్రుఁడు ఇల్లు వాకిలి వదలిపెట్టుకొని దేశములపాలై పోయినాడు.”

“ఈ వ్యవహారము అతని తల్లికి తెలియుదా? అర్థములేని పిచ్చఆచారమేకో యున్నదని పట్టుపట్టి కొడుకును యావజ్జీవము పెండ్లిపేరంటములు లేకుండచేసి నిర్భాగ్యుని జేయవలెనకొన్నదా యేమిటావిడ!”

"అతనితల్లి తప్పేమున్నదమ్మా! యిందులో, అంతకన్న భూదేవత లోకములో లేదు. కాని మనమతస్థు, ధర్మశాస్త్రము, అటువంటి వివాహము లొప్పుకొనవని ఆమె నమ్మకము. మత విరుద్ధమైనపని కొడుకు చేసినపక్షమున ఆబిడగుండెపగిలి చచ్చిపోవును. అందులో మాదేతప్పు మేము తొందరపడినాము, పడినందుకు ఫలమనుభవించినాము."

"మేలు చేయవలెననే చేసినావు. మన మెంతజాగ్రత్తపడినను, ఎంత దూరదృష్టితో పనిచేసినను, మూడదలచుకొన్న కీడులు రాకుండ ఆపలేము. భగవంతుని సంకల్ప మక్కయ్యా! చేతగానిమనుష్యులము మనమేమి చేయగలము? ఒకప్పుడు విశేషబాధ, మన మనుభవించలేనంత విశేషబాధ మనకు గలుగుచుండును. మనము పడవలె. అలానే పడవలె."

"అమ్మాయీ! ఉమా! నీకడుపులో బాధేమిటో కొంచెము నాకుచెప్పవమ్మా? నీవు పడగలిగినబాధకంటె ఎక్కువబాధే పడుచున్నావు. నీవలె ఎంతో ఓరిమితో సాధారణముగా ఏయాడది యటువంటి కష్టము పడలేదు."

"అక్కయ్యా! ఈకష్టమొకకష్టముకాదు. నాకష్టములన్నిటిని నేనుజయించగలను?"

"ఈమధ్య జబ్బు పడినావుకదా! పూర్తిగా నిమ్మళించినదా జబ్బు? కొంచెము బలము చేరినదా?"

"బలము చేరకేమి? దయ్యము లాగున్నాను. ఒకప్పుడు దయ్యమువలె క్రూరముగా నుండవలెనని నామనస్సులో సంకల్పము కలుగుచుండును."

ఈమాటలనుచుండ నామెముఖ మెఱుపువన్నె వాడెను. కన్నులు తళతళ మెఱసెను.

"ఉమా! అలాగనకే. నీమాట వినగానే నాకు భయము వేయుచున్నది. పిచ్చి పిచ్చిఊహలు ఊహించుకొనకు. ఈచిన్న యూహల కొసముకాదు బ్రతికియుండుట. దుఃఖభారములు ఓరిమితో భరించుటకోసము."

"కాని అక్కయ్యా! ఒకప్పుడు మిక్కిలి బలవంతునకు కూడ పడ లేనంతకష్టము వచ్చినప్పుడు ఆకష్టము ఎలాగో ఒకలాగున సహించుకొన్నట్లు పుస్తకములలో చదివినాను.

యజమానుఁడు కొరడా పుచ్చుకొని నీవు బ్రద్దలగుచున్నట్లు కొట్టుచున్నప్పటికి దెబ్బలు తినునట్టి నీచపు బానిసవాఁడు నిరాశచే నవ్వుచుండునఁట."

"నీవేమో పిచ్చిపిచ్చి మాటలాడుచున్నావే ఉమా! నీవెప్పటి లాగున మాట్లాడుటలేదు. భూలోకములో నేయాఁడువాండ్రకు లేనంత ప్రేమ నీకున్నది. ఏయాఁడువాండ్రు పడనంత కష్టము నీవు పడుచున్నావు. నీవల్లదోష మున్నదని నేనేలాగున ననఁగలను? ఒకమూల ప్రేమ మనస్సులో నిలుపుకొని, ఒక మూల బాధపడుచు, మనకు భగవంతుఁడు విధించిన ధర్మము మనము చేయుచుండవలసిన దని నీమనస్సే నీకు చెప్పఁగలదు. మనభార మవతల పారవేయఁకూడదు. మఱియొక ఆలోచన చేయఁగూడదు. ఈజీవనమందు మనము పడు బాధలు కష్టములు దుర్బలమైన స్త్రీస్వభావము సహింపలేనంత వేదన కలుగఁ జేయుచున్నప్పటికి దేహములో శక్తియున్నంతవఱకు మనము తప్పటడుగులు పెట్టుచు నైనను, నిశ్వ్యప్రయత్నముచేసి మన ధర్మము మనము నడపవలయును. మన పాలఁబడిన ధర్మము మనశక్తివాచన లేకుండ యథావిధిగా నెఱవేర్చి, ఆటమీఁద యేచెట్టుక్రిందపడి గ్రుక్కెడు ప్రాణము వదలినను సరే. ఇటువంటి ధర్మములు తల్లిపాలతో కూడ మన కబ్బినవి. ఈ ధర్మములు మఱచి పోకుండ నీవెప్పటికి మనసులో పెట్టుకో వలసినవి."

"అక్కా! బిందూ! నీవు చెప్పినమాట లెప్పటికి సరియైనవే. నీవెప్పుడు మంచిదానవే. మనము చిన్నపిల్లలమైనప్పుడు ఈ బుద్ధులే నీవు చెప్పుచువచ్చితివి. పెద్దదానవైన తరువాతఁ గూడ నవే నీవు జ్ఞాపకముంచుకొని యాదరించుచున్నావు. ఏమోకాని ఈరాత్రి యవి నాతలకెక్కుటలేదు. అక్కయ్యా! ఆసంగతులు మాని వేరేసంగతులు నాతో మాటలాడు నా కింతమాత్రము తోఁచుటలేదు. నామనస్సు కుదురుగాలేదు."

"ఉమా! అది నే నెఱుఁగుదును. ఆజాబువల్ల నేను తెలిసికొంటిని. విచారకరమైన యీస్థలమువిడిచిపెట్టి మరొక చోటికి వెళ్ళుటకెందుకు ప్రయత్నము చేయవు?"

"అక్కయ్యా! నేనెక్కడికి వెళ్ళుదును?"

"ఎక్కడికా, మీయమ్మదగ్గఱకు వెళ్ళు. ఆవిడను ఇక్కడకురమ్మని నేను వర్తమానము పంపఁదలచుకొన్నాను. కాని నన్ను నీవు వర్తమానము పంపనీయవుకద. నీశరీరములో నెమ్మదిగానున్నది. గనుక ఒకసారి తొల్పుకారు గ్రామమునకు వెళ్ళు. మనోహరమైన యీశీతకాలమునందు గ్రామము నవనవలాడుచు మనస్సున కుల్లాసముఁ గలిగించుచుండును."

"వెఱ్ఱిదానవుకో; అమ్మగారియింట విశేషకాలము నేనుండుటకు వీలుపడునా? నీవెఱుంగవంటే అక్కయ్యా! అత్తింటికోడలు ఎంతకాలము పుట్టింట నుండగలరు? పెనిమిటిని వదలిపెట్టి విశేషకాలము పుట్టింట నున్నపక్షమున ఊరివారందఱు అమ్మను, నన్ను కాకులు పొడిచినట్లు పొడవరా?"

"అలాగైన పక్షమున మీయత్తవారి తండ్రితాతలు పూర్వము కాపురముండిన ధనపురము వెళ్ళరాదా? అక్కడ కావలసినంతమంది చుట్టాలు, బంధువులు ఉన్నారు. అక్కడ ఈలాగున నొక్కర్తెవు నుండనక్కరలేదు. కలకత్తాలో ఉన్నంత విచారకరముగా నుండదు నీబ్రదుకు."

"అక్కయ్యా! అక్కడ అంతకంటె నెక్కువ విచారముండును. ఏమంటే ధనపురములో మాయిండ్లు ఎంతో పెద్దవి. చావళ్ళు విశాలమైనవి. గదిలో మాటలాడితే ప్రతిధ్వనులు బైలుదేరును. అవి నేను వింటినా, ఆధ్వనులు దయ్యముల మాటలలాగున భయపెట్టుచుండును. అక్కయ్యా! ఆపాడుకొంప నాకువద్దే తల్లీ! నేనొక్కర్తెను దిక్కులేని దానవై ఆయింటికి మరల వెళ్ళుట నాకిష్టములేదు."

"అయ్యో! ఏమే అమ్మా! ఈలాగున బాధపడుచున్నదానికి నే సహాయము చేయలేక పోవుచున్నాను. పోనీ, కొన్నాళ్ళు మాయింటికి వచ్చియుండగలవా? మేము స్వగ్రామము వెళ్ళిపోవువరకు మాతో నుండవచ్చును. నీకాప్తులైన దగ్గఱ చుట్టాలతోను బంధువులతోను కొన్నాళ్ళు హాయిగా నీవు గడుపవలచుకొంటే మీవారు మాత్రము ఒప్పుకొనరా?"

"అక్కయ్యా! మీకష్టాలకు సాయము నేనెందుకు? మీ రెక్కడ నున్నప్పటికి మీ మనస్సునకు సుఖమున్నది. మీయింట విచారము లుండవు. నేనువచ్చితినా, మీ సుఖముకూడ చెడిపోవును. నావిచారములు నాకష్టములు మీరు ఈదవలసివచ్చును. నామనస్సునకు వినుగుపుట్టినదాక, నాకిల దిక్కెక్కడనగా నేనెటువంటి యాలోచనలే చేసినాను. కాని నాకష్టము గట్టెక్కించగల ఉపాయము కనపడలేదు. అయినప్పటికి నావిచారములు జయించగలనని ధైర్యమున్నది. చూచికొని తెలిసికొనగలిగితే దిక్కుమాలిన ఆడదానికి శరణము లేక పోలేదు."

ఈకడపటి మాట వినునప్పుడామె మొగమున లేనవ్వుతోచెను. కన్నులలో స్వభావవిరుద్ధమైన మెఱుపు కనబడెను.

"అమ్మాయీ! ఉమా! నీమనసులో నున్నదేమిటో ఇప్పటికి నాతో నీవు చెప్పలేదు. నేను నీకు మనసుపట్టినదానను కానా? చిన్నప్పటి స్నేహితురాలను గదా, ఇంతమాత్రము నమ్మఁగూడదా?"

"నామనసులో ఇప్పటి కేనిశ్చయము చేసికో లేదే అక్కయ్యా! ఆలోచనలు ఒకదానినొకటి తఱుముకొని వచ్చినట్లు మనసులో నిండి పోవుచున్నవి. నాకు తల విసుగు పుట్టినది. ఈరాత్రి నీపరిపూర్ణదయ, నీప్రేమ నామీఁదఁజూపి ఓదార్పు, నీదయ కావలసినసమయ మిదే. నామనసులో నేమున్నదో అదియావత్తు కొద్దికాలములోనే నీకుఁ దెలియఁగలదు."

"సరే. అలాగే కానియ్యవే ఉమా! నేను మఱల నిన్ను చూచుటకు త్వరగానే వచ్చెదను. ఆవచ్చినప్పుడు నీమనసులో నున్నదేమిటో వినిగాని వెళ్ళను. ఇప్పుడు రెండు జాముల రాత్రి అయినది. నేఁక వెళ్ళవలెను. భగవంతుఁడే నీకు శరణమై నిన్ను రక్షింపవలె నని నాకోరిక."

"దేవుఁడే మన కెప్పటికి శరణము." అన మాటలే ఉమనోటనుండి కడపట వచ్చెను.

బోయలు పల్లకి మేడక్రిందఁ బెట్టుకొని కనిపెట్టుకొని యుండిరి. బిందను సాగనంపుటకై యుమ మేడమెట్లు దిగివచ్చెను. అక్కడ వా రొండొరులను మఱల బిగ్గఁ గౌగిలించుకొనిరి. ఉమ బిందుకడుపులోఁ దనతలఁ బెట్టుకొని కొంచెముసేపు విచారించెను. అంతకాలమునుండి యామెహృదయములో గట్టితాళమువైచి బంధించిన దుఃఖమంతయు నొక్కమారు పొంగిపొరలి పైకుబికెను. కన్నీటివఱదలు వివృతద్వారములై ప్రవహించెను. ఆమె చాలసేపు మాటలాడ జాలక వివశయై వెక్కివెక్కి యేడ్చెను. గుండెపగిలిపోవునా యన్నట్లాయువతీరత్నము నిట్టూర్పు విడిచెను. అట్లు దుఃఖపడుచు నామెతనయందత్యంత ప్రేమయు నభిమానముఁ గలిగి యాప్రాణమిత్రమును వదలలేక మాటిమాటికి బిగియారఁ గౌగిలించుకొని, యేమి తోఁచెనో కాని యాకస్మికముగా బిందును విడిచి చివాలున మేడ మెట్లెక్కి తన గదులలోనికిఁ బోయెను.

"దుఃఖపడకు. తల్లీ! దుఃఖపడకు. ఈలాగున దుఃఖపడవలసిన దని భగవంతుఁడు నీనొసట వ్రాసివేసినాఁడు," అని బిందప్పుడు ఓదపేకి పల్లకిలోఁ గూర్చుండెను.

తరువాత గంటసేపటికి గాయుము నెమ్మదిగాఁ దనబట్టలు, నగలు సర్దుకొను చుండెను. సుందరమైన కంఠమునుండి యామె కంటె దీసివేసెను. మనోజ్ఞహస్తముల నుండి మురుగులు, పాదములనుండి యందెలుకూడ తీసివేసెను. అంచుచీర విడచి వితంతువులు కట్టుకొను నైనుపంచె తాల్చెను. గదిలోని దీప మార్పివేసెను. అవ్వల నెంత మాత్రము చప్పుడు కాకుండ బొటనవ్రేళ్ళమీద నడిచి యావలకుఁ బోయెను.

విశాలమైన యాగృహము నిశ్శబ్దమై యంధకారబంధురమై యుండెను. సేవకు లందఱిదివఱకే పండుకొని నిద్రపోవు చుండిరి వాకిట నున్న దీపములు సైత మార్పివేయఁ బడెను. ఆమె మెల్లమెల్లఁగా ననేక ద్వారములు దాటి, నడిమివాకిలి దాటి చప్పుడు కాకుండ వీధితలుపుగడియ తీసెను. తలుపు తీయఁగానే చలిగాలి జివ్వన వచ్చి తాకెను. చీకటిలో నుండి వచ్చియుండుటచేత వీధిలోని దీపములన్నియు నామె కన్నులలో మెఱపులట్లు మెఱసెను. ఒకనిమిషమువఱ కామె చేష్టలు దక్కి యుండెను. మఱి యొక్కనిమిషము గడపపై నిలిచి వెనుకకు తిరిగిచూచెను. ఆనిమిషము గడచిపోయెను. ఇరువదిరెండేండ్ల ప్రాయంపు జవ్వని, భాగ్యవంతుఁ డగునొక గొప్పజమీందారుని యిల్లాలు మహాంధకారబంధుర మగు శీతకాలపు రాత్రివేళ నేకతంబ కాలినడకను వీధులవెంబడి సంచరించుచు, నంతఃపురము విడిచి బాహ్యప్రపంచమునం బడియెను.

అరగంటనడచునప్పటి కామె యలసిపోయెను. ఆమె అలసిపోయి రాజవీధిప్రక్క నున్నయొకచెట్టుచాటున నిలువఁబడెను. నిలువఁబడి చలి కోర్వలేక గజగజ వడఁకెను. ఆసమయమున మఱల నామె కధైర్యము తోఁచి గుండె కొట్టుకొనెను. మఱల నింటికి బోవఁదలఁచుకొన్న యత్నమున నామెకు గావలసినంత వ్యవధియుండెను. ఆమెయింటికి దారి తెలియుఁగను. వీధితలు పప్పటికిఁ దెఱచి యుండెను. ఆమె యిల్లుజేరి, యెప్పటియట్ల కాపురము సేయవచ్చును. తాత్కాలికమైన యీయున్మాదావస్థ రెండవ కంటివానికిఁ దెలియదు. వీరు చేసిన ధర్మోపదేశములు, మందలింపులు చెవులలో గింగురు మని యామె కిప్పటికిని వినఁబడు చున్నట్లే యుండెను. ఏదో యొకానొకశబ్దము మంద స్వరముతో స్త్రీధర్మముల నామెహృదయమున నుపదేశము చేసినట్లామెకు దోఁచెను. ఆ చలిగాడ్పులు మీఁదవీచి వణకించినప్పు డాయెలనాగ యాగి సందేహింపఁ దొడఁగెను. అప్పుడు సైతమామెయే గృహదేవత? ప్రపంచము శూన్యము.

అప్పుడు నల్లగుఱ్ఱములు లాగుచుండిన గుఱ్ఱపుబండి యాదారిని వెళ్ళెను. దాని దీపములు తళతళ మెఱసెను. ఆ బండిలో స్త్రీలు నవ్వినచప్పుడు వినబడెను. తెల్లని

గోడుగుఱ్ఱములు లాగుచుండిన మఱియొకబండి వెంటనే యాదారిని నడచెను. అది యామె కత్యంతసమీపమునుండి పోయెను. ఆ బండిలోని దీపములకాంతి తళతళ మని పూర్తిగా నామె మొగముపైఁ బడెను. ఆమె చటుక్కునఁగదలి యాచోటు విడిచి చెట్టువెనుక దాగెను.

బండిదీపముల నిమిషమాత్ర తేజములో నామె మొగము కనబడఁగానే బండిలో గూర్చుండిన మనుష్యులలో నొకఁడుకూడ లేవఁబోయెను. అతనిమిత్రుఁడది కనిపెట్టి, చెట్టుమఱుఁగున దాగిన మానవతివంకఁజూచి "ఆమె మిక్కిలి చక్కనిది. అంత అందమైన కన్నులు నేనెప్పుడు చూడలేదు" అని పలికెను.

"ఆమె చక్కఁదనముమాట నేనాలోచించుటలేదు. వెలవెల బాఱుచున్న యామెమొగము చూడఁగానే నేనెఱిఁగిన స్త్రీయొకర్తె నాకు జ్ఞాపకము వచ్చినది. ఆమె యీమెవలెనే యుండును. చాలకాలమునుండి నేనామెను జూచియుండలేదు. మొగమును బోలిన మొగము లుండుననుమాట నిజము. పోలిక చిత్రముగా నున్నది" అని రెండవయతఁడు బదులు చెప్పెను.

బండ్లు గబగబ వెళ్ళిపోయెను. చెట్టువెనుకనుండి యుమ యావలకుఁ బోయి దాటిపోవుచున్న బండ్లవంక, దీపములవంక విరుద్ధముగాఁజూచెను. "ప్రాణేశ్వరా! నీకు వేయినమస్కారములు. క్రుంగిపోవుచున్న నా హృదయమును మీరు పురికొల్పితిరి. ఏమి చేయవలెనో నాకిప్పుడు తెలిసినది." అని తనలో ననుకొని యామె యాచోటు విడిచి పోయెను.

మఱునాఁ డుదయమున ధనంజయునిగృహమున గొప్పకలవరము సంభవించినది. పెద్దపెట్టున నేడ్పువినఁబడెను. ఎప్పటియట్ల పనికత్తెలకామె పరుపుమీఁదఁ గనఁబడలేదు. పరిచారికలు నూతిదగ్గఱ, నడిమివాకిలిలోను జూచిరి. గాని యామె యెక్కడను గనఁబడ లేదు. వాకిలి తుడుచునట్టిదాసి యామెదాల్చు ప్రాఁతసేలువ నడిమివాకిలిలో దొరికినదని పట్టుకొనివచ్చెను. వీధితలుపుతీసి యున్నదని ద్వారపాలకులు చెప్పిరి. చాలసేపిట్టట్టు వెదకిరి. కాని యామె కనబడలేదు. గృహయజమానురా లదృశ్యయయ్యెను.

వెదుకవలసినదని పట్టణమం దన్నిచోట్లకు మనుష్యులు పంపఁబడిరి. అన్వేషణార్థమై ప్రతిబంధువుని యింటికి, ప్రతి మిత్రునియింటికిని పలువురు మనుష్యులు వెళ్ళిరి. అట్లు వెళ్ళిన మనుష్యులందఱు యజమానురాలి వృత్తాంతము తెలియలేదని యెక్క

కొక్కరు దిగులుపడుచు వచ్చిరి. బంధు గృహములకు వెదకఁబోయిన మనుష్యులు నిశీథము వఱకుఁ గడచినరాత్రి యుమ యింటిపద్ద నుండెనని మఱలివచ్చి చెప్పిరి.

ధనపురమునకు, వర్ధమానమునకు, తాల్పుకారునకుఁ గూడ మనుష్యులను బంపిరి. యజమానురాలి వృత్తాంత మెంతమాత్రము తెలియలేదని వారా సాయంకాలమే కాళ్ళీడ్చుకొనుచు వచ్చి చెప్పిరి.

ఉమ కనఁబడలేదని కలకత్తా పోలీసువారికి సమాచారము తెలియఁజేయఁబడెను. ధనము పోలీసువారిని విచారణకుఁ బురికొల్పును గావున సొమ్ము కర్చుపెట్టిరి. కాని పోలీసువారి విచారణలుకూడ వ్యర్థమయ్యెను. తెలిసికొనుట కాధారమేమియుఁ దెలియలేదు.

భయంకరములైన యనుమానము లంతరమనస్సులలోఁ దోఁచెను. చెఱువులు నూతులు వెదకిరి. అది వ్యర్థమయ్యెను. దిక్కులేనివారి శవములను జెట్టుచోటికి సేవకులు పోయి వెదకిరి. ఆమె శవమక్కడఁ గనఁబడలేదు.

ధనంజయుని గృహము నిరాశచే దుఃఖభాజనమయ్యెను. ఏడ్పు కొంతసేపటికి కణఁగిపోయెను. పీనుఁగు వెళ్ళిన యిల్లువలె గృహము పాడువారి యుండెను. ప్రొద్దు నిలువని శీతకాలపు దినమిట్టె వెళ్ళిపోయెను. కళాహీనమైన యా గృహముమీఁద వెఱపుఁ గొలుపునట్టి సాయంకాలచ్ఛాయలు వ్యాపించెను. చేసిన భోగట్ట యంతయు వ్యర్థమయ్యెను. వెదుకవెళ్ళినవా రందఱాశ వదలుకొని వెనుకకు వచ్చిరి. ఆమెను గుఱించి యేమియుం దెలియలేదు.

దీపములు పెట్టినతరువాత నుదికినబట్టలు దీసికొని యింటిచాకలిది వచ్చెను. యజమానురాలిని గూర్చి చాకలిదేమో చెప్పఁదలఁచుకొన్నందున విలపించుచున్నవారు దానిచుట్టుఁ జేరిరి; కాని దానికథ స్వల్పము. విచారకరము.

కలకత్తానగరమునందలి స్త్రీలు తెల్లవారుజామున హుగ్లీనదిలో స్నానము చేయుటకై పోవు వేళకుముందే యజమానురాలు నదియొద్దున నొంటిగఁ దనకుఁ గనఁబడినట్లది చెప్పెను. పట్టణము మేలుకొనకమునుపే పెందలకడ స్నానముచేసి వెళ్ళుటకై యామె తెల్లవారుఝామున నదియొద్దనకు వచ్చి యుండవచ్చునని చాకలిది తలంచి

యొకటి రెండు మాటలుమాత్రమే యామెతో మాటలాడి తన దారింబోయెను. అది మొదలు నామెను జూడలేదు.

చాకలి దీకథఁ జెప్పుచుండగాఁ వినువారు నోట మాట లేక చూడఁ జొచ్చిరి. తమయజమానురాలు కలకత్తాలో నేవిధముగా జీవించెనో వారంద రెఱుఁగుదురు. ఆమె హృదయములో నెట్టితలంపు లుండెనో వారికిఁ దెలియును. చిరకాలక్లేశ మనుభవించు చున్న మందభాగ్యురాలగు తన యజమానురాలు తెల్లవారుజామున స్నానము చేయుటకుఁ గాక నిరంతరాయమగు వేదననుండి విముక్తిఁ బడయుటకై పరమపావనమగు భాగీరథీమాతృగర్భమున శాశ్వతనివాసము చేసికొనుటకై నదీతీరమునకు వెళ్ళి యుండు నని వారి మనంబునఁ జనించెను. జనించినతోడనే గొల్లుమని యేడ్వఁబట్టు కేడ్చిరి.

కడచినరాత్రి ధనంజయుఁడు విలాసధామము లగు తన మిత్రులతోడ గుఱ్ఱపుబండ్లమీఁద నూరుబైటకు షికారుపోయి మిక్కిలి ప్రొద్దుపోయిన తరువాత మరలి వచ్చెను. అతఁడు బండి దిగునప్పటికి మద్యపుమైకమువలఁ గలిగిన యెఱుపు మొగమునుండి జారలేదు నడచునప్పుడు డడుగులు నిలువక తడబడెను. సేవకులు చేయూతయిచ్చి మేడలో నతని గదిలోనికిఁ దీసికొనివెళ్ళి యతనిభార్య కనఁబడుట లేదనువార్త మెల్లగాఁ జెప్పిరి. ఆదిపిడుగుపాటువలె నాకస్మికమై భయంకరమై యతనిపైఁ బడి నిర్విణ్ణునిఁ జేసెను. మద్యపుమత్తుచేత నదివరకే తలతిరిగి తూలుచున్న యావయువకుఁ డది విని నిశ్చేష్టుఁ డయ్యెను.

అనంతరము భార్యగదిలోనికి వెళ్ళి మిణుకుమినుకు మను దీపపువెలుఁగున నేమియుం దోఁచక తెల్లవారునంతకు నిటటు పచారు చేసెను. అతని హృదయము పూర్వము దయావంతమైన దగుటచే నతఁ డప్పు డెంత దుర్వృత్తుఁడైనను దురంతమైన యాదుర్వృత్తినము వాని హృదయమునుండి జారిని వెడలఁగొట్ట లేకపోయెను. తాపపూరితములైన యాలోచనలచేత మద్యప్రకోప మెగిరిపోయెను. మగనిలాలనకుఁ బాత్రమైనవోధ యెట్టులున్ననుఁ సల్లలితవిలాసయై, లావణ్యరాశియై కెంజిగురాకువలె మెత్తనై కృపారసనిలయమై యామె యతనిం జేరెను. నూతనసమాగమమైన యాదినములలో స్త్రీసహజమైన యామె గాఢానురాగము, మధురవిలాసము, మనోజ్ఞమనోరథములు, రహస్యభాషణములు, శృంగారచేష్టలు, చిఱునవ్వులు నతని యధీనమే చేసెను. అతనికంటె నామెకుఁ బ్రేమస్థానము లేదు. అంతకంటె నన్యుఁ జూచి యెఱుగదు. తలచి యెఱుఁగదు. ప్రతిరాత్రి యామె లజ్జాగమన నతని ప్రక్కను గూర్చుండి, తనహృదయమారాని వక్షమునం జేర్చి మనోజ్ఞములైన

తనయాలోచనలను, తనకోర్కెలను, తన కష్టసుఖంబులను నతనిచెవిలో రహస్యంబుగఁ జెప్పి యతనిమన సుప్పొంగఁజేసెను. అతని కన్నులముందటనే యాచిగురుబోడి బాల్యమును విడిచి మిసమిసలాడు నిండుజవ్వని యయ్యెను. అలరుఁదీగ క్రమాను నల్లుకొను తెఱఁగున నామె యతని వలపుననే తగులుకొని యుండెను. అంతే కాదు. ప్రాణాంతమువఱకు నప్పరమసాధ్వి యాగదియుం బోలె కుయ్యో, మొఱ్ఱో యనక, యెట్టిపరాభవములు ప్రాప్తించినను, నేమియు ననక కన్నులప్పగించి శాంతముగ వానిననుభవించెను. ప్రియురాలులేని యాశూన్యగేహముఁ జూచినకొలఁది నతనికన్నులనుండి చుక్కవెనుక చుక్క పాఱెను, యెఱ్ఱని చెక్కులనుండి దిగజారఁ జొచ్చెను. తాను మొగముఁ జూడక పోయినప్పటికి, నాత్మహత్య గావించి తాన తలసినంత దురవస్థకుఁ దోలినప్పటికిఁ దన్నే దైవముగా నమ్ముకొని ప్రేమించిన యాకాంతపై నతనితలఁపులు పాఱెను.

బండిదీపముల తళతళకాంతులు ప్రసరించునప్పుడు వీధిలో దనకుఁ గనఁబడిన యావెల్లమొగము మనస్సున మఱల నిలిచెను. ఆనడుమ జబ్బుపడినందున రోగచిహ్నము లామె ముఖమును బాయలేదు. కాని దీర్ఘ విచారచ్ఛాయలు బలవత్తరములై, రోగచిహ్నములం గప్పివైచెను. ఆమె కన్నులు బండిలోఁ గూర్చుండి పోవుచున్నప్పు డొక్కనిమిష మతనిపై నిలిచెను. ఆనిమిషమం దామెకు మనసులో నించుకయాశ వొడమి యుండవచ్చును. అది ప్రేమాస్పదమైన నిమిషము. ఆకన్నుల కతఁడు తగిన ప్రత్యుత్తర మీయలేదు. అందుచేత నవి శాశ్వతముగా ముకుళించుకొని పోయెను.

దీర్ఘ విషాదమున గుండె పగిలిన యాకాంత సర్ది చక్కగా నమర్చిన ముద్దినుసు చీరలను ధనంజయుఁడు మఱల సర్దెను. కాపురము చేసిన యెనిమిదేండ్లు ధరించి చిట్టచివరకుఁ దన ప్రాణనాథునికే విడిచిపోయిన నగల నతఁడు పైకిఁ దీసెను. ఆమె చక్కని నెన్నొసటిపై నున్న వెలయుచుండిన వజ్రాల పాపటబిళ్ళను, నామె వక్షస్థలము నలంకరించుచు వచ్చిన యాణిముత్యాలహారమును, పునస్సంధానము నాఁటి రాత్రి తాను స్వయముగా నిచ్చిన కంకణాలును, మఱికొన్ని యితరాభరణములును, నొక్కొక్కటిగాఁ, దీసి వరుసగాఁ దనయెదుటఁ బెట్టుకొనెను. అందులో నొక్కొక్కదానిని జూచినప్పు డతని కొక్కొకపూర్వ వృత్తాంతము జ్ఞప్తికివచ్చెను. ఒక్కొక్క మహామనోజ్ఞ సమయము తలఁపునకుం దట్టెను. ఎన్నో మాసములనుండియుఁ గొన్ని సంవత్సరములనుండియు నతనిని విడిచిపోయిన తలంపులు తండోపతండములుగా నప్పుడు వచ్చి యతని

మనను నాక్రమించెను. భార్యాభర్తలుగాఁ గాఁపురమునకు వచ్చినప్పుడు తన హృదయమును మధురముగాను పవిత్రముగాను జేసిన యనేకవిషయములు, పలుతావులు వాని శూన్యమనస్సున కప్పుడు జ్ఞప్తికి వచ్చెను.

తండ్రిపేరు పాడుచేసి, తల్లి మందలింపులు సరకుసేయక యతఁడు యథేచ్ఛముగా సంచరించెను. పితృపితామహార్జితమైన ధనము దుర్వ్యయముచేసెను. వీధులలోని మురికికాలువలలోనుండు బోదురుకప్పలకన్న నీచులగు స్త్రీ పురుషులతో నతఁడు సహవాసము చేసెను. స్త్రీజన సహజమైన హృదయపూర్వకానురాగముతోఁ దనచెట్టఁబట్టివచ్చిన ప్రాణమిత్రముయొక్క ప్రేమను నిష్కారణముగా చెందనాడుకొనెను. ఆతఁడు భార్యాభర్తల కుండవలసిన ప్రేమబంధములనెల్లఁ ద్రెంపివేసెను. మానవహృదయమునందుండు దయాధర్మములను దగ్ధముచేసెను. ఉన్నతభావములనెల్ల నీచపఱచెను. తన్ను నమ్మి, వలచి యిలుఁజొచ్చిన పరమసాధ్వియైన భార్యను బహుమాసములు, బహుదినములు బాధపెట్టి, మనోవ్యథపాలుజేసి తుదకు బలవన్మరణము చేసికోవలసిన దుస్స్థితిపాలుచేసెను. తాను తెచ్చిపెట్టిన వినాశనమును దలఁచితలఁచిచూచి నా త్రాగుబోతునకు, నా ధూర్తవిటునకుఁ బశ్చాత్తాపము కలుగఁజొచ్చెను. ప్రియురాలిసంబంధమైన వస్తువులలో నప్పటికి మిగిలియున్న చీరలమీఁదను, నగలమీఁదను, శూన్యమందిరములోని గోడలమీఁదను వాని దృష్టి ప్రసరింపఁగానే పట్టలేనంత దుఃఖమతని మనంబునఁ బొడమి మనస్సు బ్రద్దలుచేసికొని పైకివచ్చి మందిరమందుఁ బ్రతిధ్వనించెను.

ప్రభాతకాల సంబంధములైన తెల్లనివెలుఁగులు గదిలోఁ బ్రవేశించి దుఃఖమలినమైన యాతని మొగముమీఁదను గుంటలుపడిన యతని కన్నులమీఁదను బడెను. ఆ వెలుగునఁ బ్రియురాలి చేతిపుస్తకములలోఁ తెల్లని వస్తువొకటి యతనికంటఁబడెను. అది యొకజాబు. ధనంజయుఁడు చెదరిన తలవెండ్రుకలను వెనుకకు సర్దుకొని, వడఁకుచున్న హస్తములతోఁ బ్రియురాలు వ్రాసినయాజాబునందుకొనెను. ఆలేఖమీఁద నది వ్రాయునప్పుడు భార్య కంటనుండి పడిన బొప్పబిందువుల డాగులప్పటికినిఁ గానంబడుచుండెను. ఆ జాబునం దిట్లుండెను.

“భర్తగారూ!—నేను మీ దృష్టికిఁ జిరకాలమునుండి భార్యను గాకపోయినను నేను వెళ్ళిపోవుచున్నదానను గావున మధురమైన యా పేరుతో మిమ్ము కడసారి పిలుతును.

నేను మీయింటికివచ్చి, మీయన్నముదిని, యెనిమిది సంవత్సరములపాటు మీయిల్లాలనిపించుకొని, మీప్రేమ సంపాదించుకొని యుంటిని. పల్లెత్తి యొక్క పరుషవాక్యమైన పలుకక, కోపాలోచనము కొంచెమైన గుండెలలో నిలుపక నేనిప్పుడు మిమ్ము వదలిపెట్టి వెళ్ళదలచుకొన్నాను. నా ప్రాణము 'హరీ' యనువఱకు నేను మునుపటి ప్రేమనే మీమీద నిలిపి మిమ్మే తలచుకొనుచుందును. మీరును మునుపు ప్రేమించిన చిన్నదానిని జ్ఞాపకముంచుకొనుటకై ప్రయత్నింపుడు.

క్రొత్తగా నేను కాన్పురమునకువచ్చిన దినములలో నేను మీకంటికి కసహ్యముగా నుండక ప్రేమాస్పదురాలనై యుంటిని. ఆ మంచిదినములనే తలచుకొని నేనిప్పుడు చనిపోయెదను. నేను మీపాదముల సన్నిధిని గూర్చుండి కరుణారసమొలుకు మీ నేత్రములవంకకు దనివితీరక చూచుచు, వలపులు గులుకు మీ పలుకులచే నా చెవులకు విందుచేసికొనుచు నెప్పటికి నీ రాత్రియే యుండవలయును గాని తెల్లవారకూడదని కోరుకొనుచు దీర్ఘములైన యా శీతకాలపు రాత్రులనే తలచుకొనుచుం బోయెదను. పగలెల్ల పాటుపడియో, పయనముచేసియో శ్రమపడి మీరువచ్చి మిక్కిలి మక్కువతో నన్ను దగ్గఱ కౌగలించికొన్నప్పుడు మీ బాహుమధ్యమునకంటె స్వర్గము విశేషసౌఖ్యప్రదముగా నుండదని నేననుకొంటిని. అట్టి నిమిషములను గొన్నిటిని నేనిప్పుడు స్మరించికొనియెద.

ఆ యానందము శాశ్వతముగా నేననుభవింతు ననుకొంటిని. కాని దైవనిర్ణయము మఱియొకలాగయ్యెను. అందుకు నేను చింతింపవలెను. నా హృదయమెంతో పరితపించినది. నాతల దిమ్ముపట్టినది. ప్రపంచమంతయు జీకటికొనియై సంతోషశూన్యమైనందున దిక్కులేక నేను భగవంతునే శరణుజొచ్చితిని.

నేనెంతెంత మనోవ్యధ పడుచున్నను పతివ్రతాధర్మము నడుపుటకై ప్రయత్నించితిని. నేను తెలిసియో తెలియకయో యెన్నడైన నాధర్మము తప్పియుంటినేని ప్రాణేశ్వరా ! మీరు నన్ను క్షమింప వలయును. మనసు విరిగి పోయినపుడు కోపోద్రేకముచే ననరానిమాటలాడినపక్షమునను, మనోవ్యధాభారమున నేను మీ మొగముం జూడక విసువుకొన్న పక్షమునను, ప్రాణేశ్వరా ! మీరు నన్ను క్షమింపవలయును. ఈ జీవితములో నేను మిమ్ము కోరునట్టి నా కడపటికోరిక యిదియే. బాష్పపూరితములైన కన్నులతో మిమ్మీకోరిక కోరుచున్నాను. మఱియొకకోరిక కోరుటకు నేను బ్రతుకను.

నేను పోయినతరువాత మీరు సుఖింపుఁడు. మీరు గొప్ప కుటుంబములోఁ బుట్టివారు. మీరన్న దేశమందంతట గౌరవము కలదు. మీశక్య మగునేని మీవెనుకటి పిచ్చి జీవనమును మఱచిపొండు. మిమ్ము నాశనముచేయుచున్న మిత్రులను విడిచిపెట్టి స్వతంత్రముగా బ్రతుకుఁడు. మీహృదయము మిక్కిలి మంచిది. అంతఃకరణశుద్ధిగా నడుచుకొనుఁడు.

ఆపద్బాంధవుఁడైన పరమేశ్వరునిపైపునకు మీయాలోచనలను బ్రసరింపఁజేయుఁడు. వర్ధమానపట్టణమున నొక పావనస్థలము కలదు. అక్కడనూటయేఁబది దేవాలయములు కలవు. అవి యొకదానిప్రక్క నొకటిగా నున్నవి. ఒక్కొక్క దేవాలయమున నొక్కొక్క విగ్రహము కలదు. అప్పుడప్పుడా దేవాలయములకుఁ బోయి విగ్రహరూపముతో నెవ్వనిని గనఁబఱుచుటకు మనము వ్యర్థముగాఁ బ్రయత్నింతుమో యట్టి లోకేశ్వరుని భక్తితో నారాధింపుఁడు. మంచివా రనిపించుకొనుటకు, గొప్పకార్యములు చేయుటకుఁ బ్రయత్నింపుఁడు. మీకు సుఖజీవన మగుఁగాక! దుఃఖభాజనమైన తన జీవితముయొక్క తుదవఱకు మిమ్ము బ్రేమించిన మందభాగ్యురాలగు నీ స్త్రీని జ్ఞాపకముంచుకొనుఁడు."

వణఁకుచున్న యాతనిచేతులనుండి యాజాబు క్రిందఁబడెను. ఆ మందభాగ్యుఁడు తలతిరుగుటచే ముందుకుతూలి హస్తములు చాచి నేలఁబడి మూర్ఛిల్లెను.

సుధా శరచ్చంద్రము

మూఁడవ భాగము.

పదునాఱవ ప్రకరణము

దేవాలయము.

స్వప్నము

పవిత్రవగ్రమైన కాళి రాణీగంజిలో భద్రమైన జగత్కిశోరరాయలకు శ్రద్ధతో సంరక్షణ సేయుచుండెను. అది కలకత్తానగరమున కగుపను రైలుమార్గమున నూటయిరువది మైళ్ళదూరమున నున్నది. అక్కడ బొగ్గుగను లుండుటచేత రమారమి యేఁబది సంవత్సరములనుండి రాణీగంజి ముఖ్యప్రదేశ మైనది. ఇంగ్లీషు కంపెనీలు బొగ్గుగనులలో బనిచేయునిమిత్తము కూలివాండ్రను విశేషసంఖ్యలుగఁ బెట్టి దేశమునకుఁ గావలసిన బొగ్గుఁ దీను త్రవ్వించి సిద్ధము చేయుచున్నవి. ధనవంతులై, వ్యవహారకుతూహలు రైన హిందూదేశస్థు లనేకులుకూడ స్వయముగా గనులు త్రవ్వించుటకుఁ బ్రారంభించిరి. ఎన్నో చిన్నగనులలో వారి పెట్టుబడి మీఁదనే పని జరుగుచున్నది. గనులలోనుండి త్రవ్వితెచ్చినబొగ్గు హిందూదేశములో నున్న పొగబండ్లనిమిత్తము పొగయోడల నిమిత్తము నుపయోగపడుటయే కాక కలకత్తా మొదలగునగరములలో వంటకట్టెలకు మాఱుగా గృహములలో నుపయోగింపఁ బడుచున్నది.

గను లున్న యితరస్థలముల వలెనే రాణీగంజియు మురికిపట్టణము. అక్కడి గాలి బొగ్గుధూళితో నిండియుండును అయినను నేల మిట్టపల్లములు గలిగి మొత్తముమీఁద నెత్తుగా నుండును. స్వాస్థ్య బలము కలిగించునది. గనులకు దూరముగా మంచిమంచి భవనములున్నవి. అవి శీతకాలములో మిక్కిలి సుఖప్రదముగా నుండును. కలకత్తానుండియు, వర్ధమానపట్టణమునుండియు జనులనేకులు తమదేహస్థితి

చక్కఁజేసికొనుటకై రాణిగంజికిఁబోయి యీ భవనములలో నివసించు చుందురు. జగత్కిశోరరాయలునిమిత్తము పెద్దభవన మొకటి యద్దెకుఁ బుచ్చుకొనిరి.

ఆ రోగియొక్క దురదృష్టముచేత నతనివెంట తల్లి, భార్య గాక ముగ్గురు మేనత్తలు వారికొందఱు దూరపుఁజుట్టములు చాలమంది పిల్లలు వచ్చిరి. వారందఱు తమ్ము రానిమ్మని బతిమాలుకొని రోగివెంట వచ్చిరి. అతని భార్యతోఁ గలిసి యతని కుపచారము చేయవలయు ననియే వారి ముఖ్యసంకల్పము. తనమీఁద వారి కంత దయ యుండినందుకు జగత్కిశోరరాయలు సంతసించెను. కాని పెద్దకుటుంబపు గొడవ మంచ మెక్కి ప్రశాంతినిఁ గోరుచున్న యా రోగికి సరిపడక రోగము తిరుగఁబెట్టెను. తిరుగఁ బెట్టినప్పుడు జీవించునా లేదా యని యెల్లవారికిని భయము కలిగెను.

ఆ స్థలమందున్న యింగ్లీషువైద్యుఁడు క్రమముగా వచ్చి రోగినిఁ జూచి, శ్రద్ధతో మందిచ్చుచుండెను. కాని యింట్లోనున్న యాఁడవాండ్రు పలుమాఱు కవిరాజులను పిలిపించియు, సన్యాసులను రప్పించియు, శాస్త్రవేత్తలను పిలిపించియు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులను రావించియు సలహా యడుగుచుందురు. బంగాళాదేశములో వైద్యులను కవిరాజు లందురు. ముసలమ్మలు చాలమంది కిశోరరాయని తల్లిఁ జూచి, తీర్థయాత్రలు చేసినందువల్ల మహాద్భుతముగా వనేకులకు రోగములు కుదురునని చెప్పుచుందురు.

అందులో నొక్కతె యిట్లనియె.

“అమ్మా! రాణిగంజిలో నున్న యింగ్లీషుడాక్టరుకు శస్త్రవైద్యము బాగుగాఁ దెలియును. అకస్మాత్తుగా వచ్చినరోగములకు నింగ్లీషువైద్యము పనికివచ్చుట గాని మన దీర్ఘవ్యాధుల సంగతి ఆ డాక్టరుకుఁ దెలియదు. తల్లీ! నా మాట నమ్ము. మన కవిరాజులు పెద్దవాండ్రు. లోకానుభవము గలవారు. రోగ లక్షణములను చక్కగా గ్రహించి నెమ్మదిగా వైద్యముచేసి, కొంచె మాలస్యమైనప్పటికి రోగములు నిశ్శేషముగా కుదిర్చివేయఁగలరు. ఎన్నో నెలలు వర్ధమానపు మన్నెజ్వరము పట్టుకొని మా కుఱ్ఱవానిని పీల్చి పిప్పిచేసినది. మొదట నింగ్లీషువైద్యునివద్దకు వెళ్ళగా క్వయినా, పాషాణము మాత్రమే యిచ్చినాఁడు. ఎప్పటి కదే మందు. క్వయినా కొన్నాళ్ళవరకు జ్వరము నణఁచిపెట్టినది. కాని రోగము నిశ్శేషముగా మానలేదు. చిట్టచివఱకు నేను మా పిల్లవానిని పనాతిల్బటీలో నున్న కవిరాజువద్దకుఁ బంపితిని. ఆయన మందులు మహాద్భుతములు. ఆయనపేరు దేశమంతట మ్రోఁగుచున్నది; ఆయన మా కుఱ్ఱవాని నాఱుమాసము లింటఁబెట్టుకొని, పథ్యపానములు స్వయముగాఁ జూచి నడిపి మంచిమందు లిచ్చినాఁడు,

మా పిల్లవాని శరీరము వజ్రశరీరమైనది. హాయిగా నింటికి వచ్చినాఁడు. అప్పుడున్నంత బలముగాను, ఆరోగ్యముగాను, మావాఁడు మఱెప్పుడు లేఁడు. మన కవిరాజులలోఁ బెద్దవారి నెవరినైన నడుగు తల్లీ! మన దీర్ఘవ్యాధులు వారెఱుఁగుదురు. క్షణములో కుదిర్చివేయుదురు. పరమేశ్వరుఁడే మీ కుమారునకు దీర్ఘాయువిచ్చి, సిరి, సంతతినిచ్చి రక్షించఁగలఁ డమ్మా!"

కిశోరరాయుని కెట్లున్నదో విచారించుటకు వచ్చిన మఱియొక యవ్వ యందుకొని యిట్లు చెప్పెను.

"వైద్యు లేమిచేయఁగల రమ్మా! చావు బ్రతుకులు సర్వేశ్వరుని చేతిలోనున్నవి. రోగములు తెచ్చిపెట్టఁగలవాఁ డతఁడే. కుదర్పఁగలవాఁ డతఁడే. ఎన్ని సంవత్సరములో నేను శూలనొప్పివల్ల నానాబాధలు పడిపడి, అన్ని మందులు మ్రింగలేదమ్మా? మందుల వల్ల కుదిరినదా నాకు? చిట్టచివర కొక సన్యాసివచ్చి తారకేశ్వర క్షేత్రమునకు యాత్ర వెళ్ళవలసిన దని చెప్పినాఁడమ్మా. నేను కాశీవదలి నే నా క్షేత్రమునకు వెళ్ళి అక్కడ తీర్థవిధులు చేసికొని, వెండ్రుకలు తీయించుకొని వచ్చితిని. మూఁడవనాఁడు రాత్రి తారకేశ్వరుని దయవల్ల నే నొక కలగంటిని. ఆ కలలో నా కెవరో యింత ప్రసాద మిచ్చిరి. ఇచ్చిన పురుషుఁడు కనఁబడలేదుగాని చేయి కనఁబడెను. అదే నా కన్నిమందుల కంటె నా కెక్కువమందైనది. తారకేశ్వరములో నే నొక వారముండి క్రొత్తదాననై వచ్చితిని. నాటికి నేటికి శూలనొప్పి రాలేదు. అనుగ్రహము వచ్చెనా భగవంతుఁడే మన రోగముల నన్నిఁటిని మాన్పఁగలఁడు. మీ కొడుకు కెంతోమందిని బోషించుచున్నాఁడు. ఎంతోమందికి సహాయము చేయుచున్నాఁడు. భగవంతుఁ డాయనను జబ్బుకుదిర్చి బాగు చేయకపోఁడు."

తన యిద్దఱు పిల్లలను వెంటఁబెట్టుకొని వారిం జూచిపోవుటకు వచ్చిన మూఁడవ ముసలమ్మ యీలాగనెను.

"తీసికొని పోఁగలవాఁడు భగవంతుఁడే. ఇవ్వఁగలవాఁడు భగవంతుఁడే. జగన్నాథస్వామి వారి యనుగ్రహము లేకపోయిన పక్షమున నాకీ పిల్లకాయలు దక్కుదురా? ఎందుకమ్మా, నేను [illegible] పెళ్ళినతరువాత పుట్టిన ప్రతి పిల్ల ఏదో రోగపడి, చచ్చిపోయినది. ఇల్లు వల్లకాడై పోయినది. సంతోషము లేమిటో యీ మొగమున కెన్నఁడు లేదు. అలాగుండఁగా జగన్నాథమునుండి ఒక పండా మాయింటికి వచ్చినాఁడు.

ఆయన మాగొడవవిని భయములే దని చెప్పి దీవించి, జగన్నాథస్వామి యొక్కఁడే రక్షింపఁగలఁడు గాని యితరులకు సాధ్యముకాదని చెప్పి, జగన్నాథయాత్ర చేవలసిన దన్నాఁడు. అమ్మా! జగన్నాథమంటే చాలదూరము. రైలుమీఁద కలకత్తా వెళ్ళినాము. అక్కడనుంచి పొగయోడనెక్కి సముద్రము దాటినాము. సముద్ర మింతో అల్లకల్లోలముగా నుండినది. కెరటము లెత్తుగా లేచినవి. కూర్చున్న గదులలోనికి నీరువచ్చినది. నాలుగుప్రక్కల వల్లనీళ్ళసముద్రమును చూచినప్పుడు నేను మఱల జన్మమధ్యములో నిలచూతు ననుకో లేదు. కాని నేను జగన్నాథస్వామినే నమ్ముకొని రాత్రి నాలుగు జాములు ఆయనపేరు స్మరణచేసికొనుచుంటిని. మఱునాఁడు దైవదయామాన మేము క్షేమముగా రేవుజేరితిమి. తరువాత ఏడుఁపగళ్ళు, ఏడురాత్రులు పుణ్యసరస్సులలో నేను స్నానములుచేసి, స్వామివారి రథోత్సవమును జూచితిని. ఏడవనాఁటి రాత్రి జగన్నాథస్వామి నాకొకస్వప్నము కనిపించెను. తరువాత నేను మాయూరికి వచ్చితిని. ఆవల ఈరెండు కాయలు కాచినవి. ఈఁగడియవఱకు ఈబిడ్డల మొగము చూచుకొని సంతోషించఁగల అదృష్టము పట్టినది. పెద్దపిల్లవానికి కేడేండ్లు. చిన్నపిల్లవానికి అయిదేండ్లు వయస్సు. అమ్మా! నాబిడ్డలనిద్దఱిని దీవింపు నీవు పుణ్యాత్మురాలవు తల్లీ! భగవంతుఁడు నీదీవనలు విని, మావంశము నిలిపి యీ యిద్దఱు పిల్లలను రక్షించును."

చూడవచ్చినవా రా యవ్వను విడిచి పోవునప్పటికి మిక్కిలి ప్రొద్దుపోయెను. రాత్రులు సరిగా నిద్రింపక కొడుకుమంచము కనిపెట్టుకొని, యతని యవస్థ చూచుచు పగలతని పథ్యపానములు చేయించుచు నొక్కనిముస మైనవిశ్రాంతి యెఱుఁగక కష్టపడు చుండినప్పటికి కిశోరరాయనితల్లి దేహస్థితి యించుకేనియుఁ జెడలేదు. ఈమెకే కాదు. హిందూదేశమందలి కనేకవృద్ధవితంతువులకు రోగపీడితులైనవారి కుపచారము చేయుటయే పరమార్థము. ఆరాత్రి ప్రొద్దుపోయినప్పటికి నామె చూడవచ్చినవారితో మాటాడి సాగనంపి కుమారుఁడు పండుకొన్నగది లోనికి వెళ్ళెను. కుమారుఁడు నిద్రించుచుండెను. కోడలు మగనిపాదములవద్ద కొంగుపఱుచుకొని పండుకొనెను. అనంతర మామె తనగది లోనికిఁ బోయి కొంతసేపు మేలుకొని తెల్లవారుజామునఁ గన్నుమూసెను.

వేకువ నామె కొకస్వప్నము వచ్చెను. రోగపీడితుఁడైన కుమారుని విషయమై యత్యంతము తపించుచున్న యామెహృదయమున కాకల యమృతప్రాయమయ్యెను. ఆకల యిట్టిది. భయంకరమైన చీఁకటి రాత్రివేళ నామె యొక్కయడవిలోఁ దన కుమారునివెంటఁ బయనమై వెళ్ళుచుండెనఁట. ఘాతుకమృగములు చింత నిప్పులవంటి

పెద్దకన్నులు తెఱచి, యామెపంకఁ జేతిపాఱచూచు చుండెనఁట. దూరమునుండి నక్కలు కూయుచుండెనఁట. ఆమె దారితప్పి కాళ్ళు పొక్కులెక్కినట్లు మిక్కిలి శ్రమపడి నడిచి కొడుకుతోఁ బయనము చేసెనఁట. కాని మార్గము దొరక లేదఁట. ఆదుఃఖములో నామెదుఃఖించి బిగ్గఱగా జగన్నాథస్వామినిఁ బిలిచి వేడుకొనె నఁట వెంటనే తూర్పున వెలుఁగు కనబడెనఁట. దూరమునుండి యెవ్వరో చేయెత్తి "ఇదిదారి. ఇటు రండు, రం" డని, పిలిచి రఁట. అప్పు డామెకు ధైర్యము కలిగెనఁట. అంతట వారందఱు మహారణ్యము గడుచువఱకు, లేతసూర్యునియెండ పొలములమీఁదను గ్రామముల మీఁదను వ్యాపించువఱకు, నడిచి రఁట. తరువాత నామె కుమారుఁడు రోగముపోయి, బలముకలిగి సుఖముగా నింటికి నడిచివెళ్ళె నఁట. కాని యామెతన్నుఁ బిలిచినపురుషునిఁ బూజించె నఁట. అప్పుడీవిధమైనధ్వని యామెకువినఁబడెనఁట. "అవ్వా! సముద్రతీరము నందుఁ గాపురమున్నవాఁడను నేనే" అంతలో మెలఁకువవచ్చెను. ఆమె కన్నులు తెఱచి చూచునప్పటికి జాలకములలోనుండి సూర్యునివెలుఁగుగదిలోఁ బ్రవేశించు చుండెను. మెలకువ వచ్చినప్పటికి స్వప్నములో వినఁబడిన మాటలధ్వని యామె చెవిలో ఖంగు మని కొంతసేపటివఱకు వినఁబడునట్లే యుండెను.

ఆమె తనకల గృహమందున్నవారి కందఱకుఁ జెప్పఁగానే, యింటిలోఁ బెద్ద కలవలము పుట్టెను. అడిగినవారి కందఱకు విసుగు లేక యామె తాను కన్న కలతెఱంగు మఱలమఱలఁ జెప్పెను. విన్నవారలందఱు లెందఱో కన్నుల నానంద బాష్పములుగారఁ జగత్కిశోరరాయనకు శీఘ్రకాలములోనే యారోగ్యదశ ప్రాప్తించు నని చెప్పిరి. జగన్నాథస్వామివారి యాలయమునకు జగత్కిశోరరాయలు యాత్ర చేసినపక్షమున నతఁడే రోగబాధ నివారింపఁజేయు నని, స్వప్న ఫలము చెప్పుటకై వచ్చిన పురోహితులు పండితులు కల విప్పి చెప్పిరి. కిశోరరాయనితల్లికి స్వప్నమువల్ల కలిగిన ఫలము కుమారుని యారోగ్యము బాగుపడుటయే గాక మఱియొక విశేషముకూడ సంభవించునని తోఁచెను. కాని యామె తనయభిప్రాయము నెవ్వరికినిఁ జెప్పలేదు.

ఆ దినమందుఁ జూడామణినాఁడే కలకత్తానుండి రాణిగంజికి వచ్చెను. రాఁగానే తోఁబుట్టువు విరచ్చంద్రునితో స్వప్నవృత్తాంతము చెప్పెను. అది విని విరచ్చంద్రుఁడు భయపడెను. "అమ్మయ్యా! జగన్నాథస్వామికి మనమీఁద ననుగ్రహము వచ్చినది అందు కొకటలేదు అనుమానము. ఈయనకెల్లుండి నేను సహాయము చేసి పెండ్లి చేర్పవలెను."

"కాని, అక్కయ్యా! ఇది పిచ్చిపని. శరీరములో దబ్బెత్తు బలమైనను లేనప్పుడు నీ మగనిని తీర్థయాత్రకు దీసికొనిపోవుట కేవలము పిచ్చిపని. అది దీర్ఘప్రయాణము. ప్రయాణపు బడలిక బావను జంపివేయును."

"కాదు. తమ్ముడూ! అలాగుకాదు. జగన్నాథస్వామి అనుగ్రహించిన పక్షమున ప్రయాణపు బడలికయే యుండదు. ఆయన తల్లికి ఈయాత్ర యిష్టము. మేనత్తలకిష్టము. మీ బావగారు కూడ వెళ్ళ నిశ్చయించుకొన్నారు. తమ్ముడూ! నీవు సహాయము చేయవలెను. మాలో కెల్ల దృఢమైనవాడవు నీవే. నీ సహాయము లేనిదే యీ పనికాదు. ఈ తీర్థయాత్ర మాచేత నీవు చేయింపవలెను."

ఆ మాటలు విని శరచ్చంద్రు డాశ్చర్యపడెను. రోగికి దనచేత నైనంతసాయము చేయుటకు, మంచివైద్యము చేయించి బ్రతికించుటకు గంపంతయాశతో నత డక్కడకు వచ్చెను. కాని యొక ముసలమ్మకన్న పిచ్చి కలను బట్టి యామె యాజ్ఞాప్రకారము తీర్థయాత్రచేసి, రోగిప్రాణము దీయుటకై యొక పన్నుగడ బయలుదేరెను.

ఆ యాత్ర నాపివేయుటకు దనశక్యము కాదని యత డెఱుగును. అయినను తన శక్యమైనంతవఱ కాపన్నుగడ సాగకుండ జేయుటకును, బావగారికి దీర్ఘప్రయాణము చేయుటకు శరీరదార్ఢ్యము గలుగువరకు యాత్ర నిలుపుచేయుటకును సర్వప్రయత్నములు విధిగా నతఁడు చేయదలచుకొనెను.

మధ్యాహ్న మతడు రాణిగంజిలోనున్న యింగ్లీషు డాక్టరును జూడబోయెను. రోగి విషయమై యతడు పుచ్చుకొనుచున్న జాగ్రత్తకును శ్రద్ధకును శరచ్చంద్రు డతని యెడ తనకుగల కృతజ్ఞతను జూపుచు బ్రశంసించెను.

"ఊ—దానికేమిలెండి. అందుకు నన్ను బ్రశంసింప నక్కఱలేదు. మా శక్యమైనదేదో మేము విధిగా జేయుదుము. మీ బావగారికి శీఘ్రముగానే నెమ్మదిగా నుండును. పెద్దవాడు కాడు గనుక కుదురుటకు సందేహము లేదు."

"అయ్యా! మీరు సమర్థులు. శ్రద్ధచేసి యెట్లయినను రోగము మాన్పగలరని నేను నిశ్చయముగా నెఱుగుదును. కాని—కాని—" అమీద శరచ్చంద్రుడు మాటాడ లేక పోయెను.

కాని కాని యని శరచ్చంద్రుఁ డాగుటచేత సందేహము కలిగి వైద్యుఁడు "నే నుదయమున జూచి వచ్చినతరువాత రోగము తిరుగఁ బెట్టెనా యేమి?" యని యాశ్రమములో నడిగెను.

"అయ్యా! తిరుగబెట్టుటే నయము. అంతకంటె వధమైనపని జరుగుచున్నది. వైద్యమువల్ల రోగములు మానును. కాని బుద్ధిపూర్వకముగ జేసినతప్పులు మానవు."

"రోగి యజాగ్రతచేత దేహస్థితి పాడుచేసికొనెనా యేమి?"

"తల్లి యేదోకల గన్నదట. అందుచేత జగన్నాథయాత్ర తనజాడ్యము కుదుర్చు నని రోగి తలచుచున్నాడు."

"జగన్నాథయాత్ర! జగత్కిశోరుఁడు మిక్కిలి నీరసముగా నున్నాఁడే. జగన్నాథ మెంతదూరము? ఏలాగున ప్రయాణము చేయఁదలచుకొన్నాఁడు?"

"రైలుమీఁద కాదు, స్టీమరుమీఁద కాదు. రాణిగంజినుండి పూరీజగన్నాథము వఱకు రాచబాటమీఁదనే ప్రయాణము. శరీరస్థితి సరిగా లేనివానికది బాధాకరమైన దీర్ఘప్రయాణము. అది మాబావ మరణమునకే వచ్చినది." అని శరచ్చంద్రుఁడు తలవంచి యొకటి రెండు బాష్పబిందువులు విడిచెను.

వైద్యుఁడు కూర్చున్నచోటునుంచి లేచి, యిట్టటు పచారుచేసెను. బంగాళాదేశ మతని గదిగోడమీఁద వ్రేలాడుచుండెను. ఆ పటములో రాణిగంజి జగన్నాథపు రాజబాటను సూచించునట్టి పొడవుగీతను వ్రేలితోగీసినట్లు స్పృశించి పిమ్మట బల్లమీఁదనున్న కొన్ని వైద్యగ్రంథములు తెఱచి యేమో చదివి, మూసివేసి, శరచ్చంద్రునికడకువచ్చి తన స్థానమున మెల్లఁగాఁ గూర్చుండెను.

"ఈ పిచ్చిప్రయత్నము మాన్పించుటకు మీరు నాకు సహాయము చేయవలెను. డాక్టరుగారూ! శరీరస్థితి యీవిధముగా నున్నప్పు డిటువంటి ప్రయాణముచేయుట చేతులార ప్రాణము తీసికొనుటయే అని మీసహాయముతో నేనాయనకు నచ్చజెప్పఁగలను."

"నేనాలోచించుచున్నాను. ఈ ప్రయాణమువల్ల నతని ప్రాణరక్షణము కావచ్చు నేమో అని నేనాలోచించుచున్నాను." అని వైద్యుఁడు ప్రతిమాటదగ్గఱ నిలుచుక యాగుచు మెల్లఁగా బదులు చెప్పెను.

"విశ్వాసబలము రోగము మాన్పఁగలుగునని మీరాలోచించుచున్నారా?" అని శరచ్చంద్రుఁ డాశ్చర్యముతో నడిగెను.

"నేను దానినిగుఱించి యాలోచించుటలేదు. విశ్వాసబలము రోగనివారణ చేయవచ్చును. గాని వైద్యులము ఆమాట తలచకొనము. నేను మీ బావకు సరిగా ఒకనెల మందిచ్చితిని. ఆయనరోగము పట్టుబడినదని నా నమ్మకము. పైగా ముసలివాఁడు కాఁడు. నలువదియేండ్లకంటె నెక్కువ లేదనితలఁచెదను. అనేక సంవత్సరములు వర్థమానపట్టణమందలి మన్నెజ్వరము శీర్ప పిప్పిఁజేసి నీరసపెట్టినది. జాడ్యము కుదురుట కష్టము. కుదురునని నేను నిశ్చయముగాఁ జెప్పలేను. నీరసమే ఆయనయిప్పుడు క్రమక్రమముగాఁ జంపుచున్నది. సంవత్సరమంతటిలో మిక్కిలి మనోజ్ఞమైన యీ శీతకాలములో బంగాళాదేశమందు మిక్కిలి యారోగ్యప్రదములైన జిల్లాలలోనుండి దగ్గఱదగ్గఱమకాములు చేసుకొనుచు నేనాఁటి కానాఁడే క్రొత్తస్థలములఁ జూచుచు దీర్ఘప్రయాణము చేసినపక్షమున సంపూర్ణారోగ్యముఁ జెందుటయే గాక మీబావ క్రొత్త మనుష్యుఁడై, మందనేకసంవత్సరముల వఱకు జాడ్య మన్నది యేమో యెఱుఁగక యుండును."

ఆమాటలు విని శరచ్చంద్రుఁడు మహాశ్చర్యము నొంది, "ఈప్రయాణములో చలి తగులకుండ నతనినిఁ దీసికొని వెళ్ళుట సాధ్య మగు నని మీరుతలంచు చున్నారా?" యని వైద్యు నడిగెను.

"అట్టిజాగ్రత నీవే పెట్టవలెను. ఇట్టి జాగ్రతపెట్టుటకై నమ్మకము గల మనుష్యుఁడు కిశోరరాయునివెంట నే నెఱింగినంత మట్టుకు నీవు తప్ప మఱెవ్వరును లేరు. నీ వాయనతో వెళ్ళఁ దలఁచుకొంటే గాని, ఆయన యీప్రయాణము చేయుటకు నే నంగీకరింపను."

"అయ్యా! నా కిది యిష్టమే."

"మంచిది. జగన్నాథప్రయాణము చేయుటే నిశ్చయము. రాత్రివేళ ఆయనను వెచ్చనిగదిలో నుంచుటకుఁ బ్రయత్నము చేయుఁడు. గాలి తగుల కుండఁ జేయవలెను. పచ్చడములు ఒత్తుగాఁ గప్పవలెను. సూర్యాస్తమాన మైన తరువాత గాని రాత్రి గాని ప్రయాణము చేయవద్దు. ప్రతిదినము సూర్యోదయ మైనతరువాత నొకగంటకు బైలుదేఱ

వలెను. చిన్నచిన్న మకాములమీఁద వెళ్ళేఁడు. ఆయన పల్లకిలోనే ప్రయాణము చేయును కదా?".

"డాక్టరుగారూ! ఆవిషయమంతయు నేను చూచుకొందును లెండు"

"సాధ్యమైనంతవఱకు ఆయనతో జనము తక్కువగా నుండవలెను. ఇంటిలో నిజముగా మంచితలకాయ యున్నది. ఎవరంటే ఆయనతల్లి. ఆమె చాల పెద్దది. ప్రతి విషయములో నామె ఏర్పాటు లెంతో ప్రయోజనకరములు. ఆమె తప్పక వెళ్ళవలెను కదా! భార్య అంటే నీ తోబుట్టువే భార్య. పెనిమిటి కుపచారము చేయుటలో రాత్రి, పగలు విసుగులేకుండ, బద్ధకించకుండ అంతిజాగ్రతగ, అంత శ్రద్ధగ, అంతభక్తిగ పనిచేయునటువంటి యిల్లాలిని ఈదేశములోనే కాదు; మా దేశములోనే కాదు; నేనెక్కడ చూడలేను. ఆమె లేనిదే క్షణము జరుగదు. కాబట్టి తప్పక వెళ్ళవలెను. సరే, నీవుమూడవ వాడవు. కొందఱు నౌకరులు తప్పమఱెవ్వరిని ఆయనవెంట వెళ్ళనివ్వవద్దు."

"రోగి మేనత్తలమాటేమి? వారు కూడ జగన్నాథక్షేత్రము చూడవలెనని ఉబలాటపడు చున్నారు."

"పాపము! ప్రేమ గల మేనత్తలు పిల్లలమందలతో వచ్చి గొడవపెట్టి, రోజావ కంగులిమంగులిము చొప్పున మీబావను జంపివేయు చున్నారు. ఆకొంపలో నున్నంత మందిజనములో రోగను కుదుర్చుకొనుటకై స్థలము మార్చి ప్రయాణము చేయువాఁడు మఱియొకఁ డుండఁడు. నామాటకు మీరు కోపగించుకొనవద్దు. మీమనస్సునకు నొప్పి కలిగించవలెననినే ననుటలేదు. మీసమిష్టికుటుంబముల ఫక్కి మిక్కిలి మంచిదని నేను నొక్కిచెప్పగలను. నిరుపేదలైన యెందఱో ఆఁడవాండ్రు, ఎందఱోమగవాండ్రు దిక్కుమాలినవారై దురవస్థలపాలు గాకుండ ఈసమిష్టికుటుంబములే రక్షించుచున్నవి. ఆవిషయమై వ్యతిరేకముగా నేనేమియుఁ జెప్పఁ దలఁచుకొనలేను. కాని రోగి మావద్దకు వచ్చినప్పుడు వైద్యులము గనుక మేముకొన్ని సంగతులు చెప్పవలసియుండును. కాని నాయభిప్రాయ మేమనఁగా జబ్బుగానున్న సమయములో జగత్కిశోరరాయలను పెద్ద సత్రమువలె నున్న ఆకొంపలో ఆగొడవలో పెట్టి మీరు చంపివేయుచున్నారని, నేనాయనను జూడవచ్చినప్పుడు శుద్ధిమైనగాలి గదిలోకి వచ్చుటకు సాధన మేదియైన నున్నదాయని వెదకుచుందును. గాని సాధ్యముకాదు. ఆపేక్ష గలచుట్టాల గొడవలోను, ఎద్దుముద్దు స్వరూపములైన నౌకరులగోలలోను, మంచివానికైన వెఱ్ఱియెత్తునట్లు పిల్లలు చేయుగడబిడలలోను రోగి కొక్కనిమిషమైన విశ్రాంతిలేదని నేను కనిపెట్టితిని.

అయ్యా! అది యెప్పటికి సరిపడదు. నిజముగా నుపచారము చేయఁగలిగి తెలివిగల కొద్దిమంది మనుష్యులను దీసికొని నిరంతరము స్థలముమార్పులు గల దీర్ఘ ప్రయాణము చేయవలసిన దని నేను చెప్పుట కదొక ముఖ్యకారణము."

"అయ్యా! డాక్టరుగారూ! మీయభిప్రాయ మేమిటో సరిగా నాకుఁ దెలిసినది. మీసలహాప్రకారమే నడిచెదను. ప్రయాణములో రోగినిఁ గనిపెట్టి యుండుటకు కిశోరరాయనితల్లి కవిరాజా నొక్కనిని వెంటఁ దీసికొని పోవఁ దలఁచు చున్నది."

"అది మానిపించు మీ కవిరాజులలో గట్టివారు కొందఱున్నారు. మేమింత వఱకు వాడి యెఱుఁగని కొన్ని మూలికలు, మందులు వా రెఱుగుదురు. నేలవేము మొదలైన కొన్ని వేళ్ళు పనిచేయుటచూచి, మా మందులలోఁ జేర్చి మేము వాడు చున్నాము. కొన్ని దీర్ఘవ్యాధులలో నవి మిక్కిలి యుపయోగించుచున్నవని నేనెఱుఁగుదును. నా మిత్రుఁడొకడు పురాణగ్రహణివల్ల చిరకాలమునుండి బాధపడుచుండెడి వాఁడు. ఇన్ని మందులుపెట్టుకొని, మేమాయన రోగము కుదర్పలేకపోయినాము. అది కొంతవఱకా రోగినిబట్టికూడ నున్నదిలెండి! రోగులలో నంత పనికిమాలినవానిని నేనెక్కడఁ జూడలేను. చప్పిడిభోజనముఁ జేయుమని మేము విధించి యుండగా భక్షింపఁగూడని వస్తువులు కచేరిపెట్టెలో దాచుకొని, యెవ్వరుచూడకుండఁ దినుచుండెడి వాఁడు. అయినప్పటికి గట్టి కవిరా జొకఁడు అతనినిఁ జేరదీసి కఠినపథ్యము చేయించి, ఆఱువారములలో జబ్బు కుదిర్చినాఁడు. కాని మీ కవిరాజులలో ననేకులు ప్రజ్ఞలేని వారు. బూటకపు వైద్యులు. మీ బావ విషయమై వేఱే కవిరాజు అక్కఱలేదు. కడచిన నెలలలో కావలసినన్ని మందులు మ్రింగినాడు. ఇఁక మందులు వేయనక్కఱలేదు. పరిశుద్ధమైన గాలి తగులనిచ్చి గొడవలు, గోలలు లేకుండఁ జేయుఁడు. మందు లక్కఱ లేకుండ ప్రకృతియే అతనిరోగము కుదుర్చును."

"డాక్టరుగారూ! మీరు మా కెంతో యుపకారము చేసినారు. మేము మీ ఋణము తీర్చికొనలేము. మీ సలహాప్రకార మేర్పాటులు చేయుదును. మేము యాత్రకు వెళ్ళునప్పుడు మా బావగారి మేనత్తలను వర్ధమాన పట్టణమునకుఁ బంపెదను."

"ముసలమ్మ లందఱిని వర్ధమానపట్టణములోనున్న కిశోరరాయల పిత్రార్జిత గృహమునకుఁ బంపివేయుము. అది వారి కుండదగిన చోటు. నామాట తప్పు పట్టుకొనవద్దు. ఆ ముసలమ్మలమీఁద నాకెంతో గౌరవము గలదు. నేను రోగినిఁజూచి తిరిగి వచ్చు

నప్పుడు పాప మా ముసలమ్మలు త్రోవలో నన్నాపి, తెఱచాటునుండి కిశోరరాయునికి నెమ్మదిగా నుండునా లేదా యనియు, సరస్వతీ పూజనాఁటి కారోగ్యము కలిగి పీట మీదఁ గూర్చుండి పూజ చేయఁగలఁడా లేదా యనియు, రోగము కుదిరిన తరువాత వంశము నిలుచుటకై సంతానము కలుగునా లేదా యనియు నెన్నో ప్రశ్నలడుగుచుం డెడివారు. మేము చదువుకొన్న చదువులను బట్టి, ఆ ప్రశ్నలలో నొకదాని కైనను మేము నమ్మకముగాఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలము. వారు పాపను నాకు కొన్ని పుష్పములు పచ్చిబటానీలు తోటలోనుండి పంపుచుండెడివారు. నా భార్య వాటినెంతో సంతోషముగా గ్రహించుచు వచ్చినది. ఏమైన నేమి, రోగి మంచముచద్ద మాత్రము వీ రుండఁదగినవారు కారు. ఆయనతో జగన్నాథమునకు నీవు, నీతోఁబుట్టువు, రోగి తల్లిమాత్రమే వెళ్ళవలసినది. ఈ మాట మనసులో పెట్టుకో. మఱి యేచుట్టాలు వద్దు. ఏ స్నేహితులు వద్దు. ఏ కవిరాజులు వద్దు. ఏ మంత్రులువద్దు."

వైద్యుని కంతో కృతజ్ఞుఁడై శరచ్చంద్రుఁ డా స్థలము విడువఁదలచెను. పూరీ జగన్నాథమునకు వెళ్ళుటవలన జగత్కిశోరరాయులు సంపూర్ణారోగ్యముఁ బడయవచ్చు నని కోరుచు వైద్యుఁడు శరచ్చంద్రుని హస్తము స్పృశించి పంపెను.

పదునేడవ ప్రకరణము.

యాత్ర.

రాణిగంజినుండి జగన్నాథ దేవాలయము వరకు గొప్ప రాచబాటకలదు. అది మూఁడువందల మైళ్ళు నిడివిగలిగి యుత్తరదక్షిణములకు వ్యాపించియున్నది. ఇది మిక్కిలి మంచిబాట. ఈ బాటకుఁ దూర్పున నంతములేని వరిపొలములతోను, గొప్ప పట్టణముల తోను, లెక్కింప నలవిగాని జనసంఖ్యలతోను నిండియున్న బంగాళాదేశపు సమ భూములు కలవు. ఈ బాటకుఁ బడమటగా నేల క్రమక్రమముగ నెత్తుగనుండును. అందు గొన్ని కొండలు గలవు. ఆ కొండలమీఁద సాలవృక్షములతో నిండిన పురాతన మహా రణ్యములు, మహారణ్యముల మధ్య సాగుబడికి వీలైన స్వల్పభూములు, భూములచుట్టు చిన్న కొండపల్లియలు కానఁబడుచుండును. తూర్పు దిక్కున నిరుపమానమైన నాగరకత

గలిగి యార్య మహాజనుల కళలు పారిశ్రామిక విద్యలు నేర్చిన హిందూమహమ్మదీయ జాతులు కలవు పశ్చిమ భాగమున సౌతలులవంటి యాటవిక జాతులు కలవు. వీరు మొదట ననార్యులైనను సగమువరకు హిందువులై యున్నారు. వీరి వృత్తి యిప్పటికిని వేటయే. అనార్యమైన వారి స్వంతభాషనే వారు మాటాడుచుందురు. ప్రాగ్భాగమున దేశచరిత్రలో ప్రసిద్ధికెక్కిన వర్ధమానము, నవద్వీపము, ఢక్కా, జెస్సోరు మొదలగు జిల్లాలు కలవు. ఈ జిల్లాలు కళాస్థానములు అనియు, విద్యానిలయము లనియు బహు శతాబ్దములనుండి పేరుపడి యున్నవి. పశ్చిమమున చోటానాగపూరులోఁ జేరిన మిట్ట ప్రదేశములును, నుత్కలదేశములోఁ జేరిన స్వదేశసంస్థానములును గలవు. ఈ సంస్థానములలోని జనులు యుగయుగంబులనాఁటి మోటయాచారములు, మూఢవిశ్వాసములు గలిగి సగమునాగరకతఁ గలిగియున్నారు. హిందూదేశమునందలి యితరభాగములయందు వలెనె బంగాళాదేశమందుఁ గూడ నార్యనాగరకతాతరంగము వనపర్వత ప్రాంతముల ననార్యజాతులకు వారి సంతతులకు వదలి పర్వతశూన్యములైన సమభూములమీఁదనే ప్రవహించెను. రాణిగంజినుండి పూరీనగరమునకుఁబోవు బాటసారిగాని, తీర్థవాసుఁడు గాని సమభూములకు, పర్వతభూములకు నడుమను, నాగరకులైన హిందూమహమ్మదీయ జాతులకును, విద్యాగంధశూన్యులైన యాటవికజాతులకును నడుమ సరిహద్దుగానున్న యీ రాజమార్గము మీఁదనే నడువవలసి యుండును.

డిశెంబరు నెలలో నొకనాటి యుదయమున జగత్కిశోరరాయలు తన పరివారముతోఁ గలిసి యీ బాటమీఁదఁ బ్రయాణముఁ జేయ నారంభించెను. దట్టమైన గవిసెనగలిగి, రోగి కవసరములైన యేర్పాటులు గలిగిన యొక పల్లకిలో కిశోరరాయలు గూర్చుండెను. మఱియొక పల్లకిలో నతని తల్లియు, భార్యయుఁ గూర్చుండెను. శరచ్చంద్రుఁడు గుఱ్ఱముమీఁద పయనముచేసెను. గుఱ్ఱ మంత మంచిస్వభావముకలది గాకపోయినను, దినమున కనాయాసముగా ముప్పదిమైళ్ళ ప్రయాణ మొక్కొకనాఁడు జేయఁగలిగినట్టి దేశవాళిమోటకట్టు. రెండెడ్ల బండ్లు రెండుమూఁడు గలవు. అందులో వంటసామానులు వేసికొని నౌకరులు పయనము చేయుచుందురు. ఈ బండ్లమీఁద సేవకులు రాత్రివేళ బైలుదేరి తెల్లవారునప్పటికి ముందు మజిలీకవెళ్ళి, యుదయమున బయలుదేరి కిశోరరాయలు మొదలగువారు వచ్చునప్పటికి బసయేర్పాటులు మొదలైనవి చేసి, వంటచేసి సిద్ధముగ నుందురు. రైలుబండ్లు రాకమునుపు హిందూదేశములో గొప్పవారు పయనము చేయునట్టి విధానము లివి. ఇనుపదారి పడని భాగములయందు నిప్పటికిని గొప్పవారి పయనము లీవిధముగనే జరుగుచున్నవి. పేరైన వర్ధమానమును, [illegible]

కాలినడకను బోయి మట్టమధ్యాహ్నము వేళను, రాత్రివేళను, బాటలకు సమీపముననున్న పూటకూళ్ళ యిండ్లలోగాని, యంగళ్ళలోగాని బసచేయుదురు. అక్కడ మూఁడణాల దబ్బులకు వారికి బస భోజనము కుదురును.

రాణిగంజినుండి రెండుమైళ్ళలోపుగాఁ బయనముచేసి యీ జనము దామోదర నదీతీరముఁ జేరెను. ఈనది పశ్చిమమున జనియించి కొంతవఱకుఁ దూర్పుగాఁ బ్రవహించి పిమ్మట దక్షిణముగాఁ బాఱి, బంగాళాఖాత సమీపమున హుగ్లీనదిలోఁ బడుచున్నది. వర్షకాలమున దామోదరనది పొంగి యనేక క్రోశములవఱకు దేశము నాక్రమించును. అట్టిసమయమునఁ బల్లియలు, చెట్లు జలావృతములై మెట్టసముద్రమందలి దీవులవలెఁ గాన్పించి నేత్రములకుఁ బర్వము చేయుచుండును. ఉత్తరపువైపున గొప్ప పోతికట్లబారు వర్ధమానము మొదలగు పట్టణములను వరదభయమువలన రక్షించుచున్నది. దక్షిణవైపున నెన్నిమాఱులు గట్లు వేసినను, నది గట్లుఛేదించుకొని పొంగి పారలుటచే నావైపున గట్ల ప్రయత్నము వదలుకొనఁబడెను. అందువల్ల వర్షకాలమున శ్రావణభాద్రపదాశ్వయుజ మాసములలో దామోదరనది దక్షిణపువైపున నిరంకుశముగా వ్యాపించి రైతులు చల్లుకొన్న విత్తనము లంటకుండఁజేసి, పొలము లన్నిఁటిని నీటితో ముంచి విశేష నష్టమును గలిగించుచుండును. దీని సమాజఫలము చిత్రమై పొడకట్టుచున్నది. దక్షిణపువైపునఁ గల నేలయంతయు నదీప్రవాహముతో వచ్చినయొండుమట్టివలన క్రమక్రమముగా నెత్తగుచుండుటయు, నుత్తరభాగమున నున్న ప్రదేశమంతయు మన్నెపుజ్వరములకు నివాసమైన పల్లపు నేలగా నుండుటయు సంభవించుచున్నది. ఇంజనీరింగుశాఖలోని యుద్యోగస్థులను, దేశపరిపాలనాధ్యక్షులగు నధికారులను నిరంతర దీర్ఘాలోచనపాలు చేయునట్టి గొప్ప సమస్యలలో నిటువంటి చంచలనదుల విషయములు ప్రధానములైనవి. ఈనదులు వానకారులో బహుదూర వ్యాప్తములై దుర్నిరోధములై యుండి శీతకాలము నాటికే మిగుల సన్నగిలి దారములట్లు దృశ్యాదృశ్యములై యిసుకతిన్నెలసందున దాగుడుమూత లాడుచుండును.

అది డిశంబరు నెలయగుటచే జగత్కిశోరరాయలు సపరివారముగ దామోదరనది ననాయాసముగ దాఁటెను. ఒక రేవుపడవ పల్లకులను గుఱ్ఱములను నెక్కించికొని లోతునీరు దాటించెను. తక్కిన నదీభాగము కొన్నిచోట్ల నట్టిసుకతిప్ప, మఱికొన్నిచోట్ల రెండడుగులలోతుగల స్ఫటికస్వచ్ఛమైన నీరు గలిగియుండెను. నది నుత్తరించి యీబాటసారులు శీతకాలపు టెండలో మఱలఁ బ్రయాణ మారంభించిరి.

రోగముచేత మంచ మెక్కి బందెలోఁ బడియున్నట్లు రేయుంబగళు గదిలోఁబడియున్న యారోగికి నిర్మలమైన యావాయువు, వెచ్చవెచ్చని యెండ సుఖప్రదముగా నుండుటం జేసి బైలుదేఱి కొలఁదిదినము లే యైనను నప్పటికే యామార్పువలన నతఁడు మునుపటికంటె శరీరదార్ఢ్యము కలిగినట్లు కనఁబడెను. అతనితల్లికిని భార్యకును గూడ నా ప్రయాణము సంతోషదాయకమై యాశాప్రేరకమై యుండెను. కంటికగపడిన ప్రతివస్తువు క్రొత్తదే. ఇసుక తిన్నెలతోడనదియు, బహుదూరవ్యాప్తములగు నరణ్యములు, పశ్చిమభాగమున నున్నతమై కనఁబడుచున్న దేశము వారికి నేత్రపర్వాయమానమై యుండెను. అన్నిఁటికంటె జగత్పావనమైన జగన్నాథస్వామి యాలయము సందర్శింపనగునన్న యాశ వారి హృదయముల నానందభరితములు చేసి, మనస్సుల నుత్సాహ పూరితములు చేసెను.

శరచ్చంద్రుని గుఱ్ఱము బావగారి పల్లకివెనుక మెల్లమెల్లఁగా నడచిపోవు చుండుటచేత నతఁడా ప్రకృతి సౌందర్యమును గన్నులపండువుగాఁ జూచి మహానందము నొందు చుండెను. అందువలన నా ప్రయాణము శరచ్చంద్రునకుఁ గలుగఁ జేసినంత యానందము తక్కినవారి కెవ్వరికిని, జగత్కిశోర రాయులకు సైతము కలిగించి యుండదు. ఇట్టి యానందము నొందుచుండినప్పటికి శరచ్చంద్రుని మనస్సునుండి యతనికి గలిగిన యాశాభంగము నిర్మూలింప బడదయ్యెను. కాని కలకత్తాలోఁ దనజీవితమును మిక్కిలి దుఃఖభాజనమును జేసిన విషయము లిక్కడ లేవు. ఇచ్చట నేకాంతముగ నతఁడు తన పూర్వవిషాదకరచరిత్రమును గూర్చి తలపోయఁ జొచ్చెను. నిరాశను నిశ్శబ్దముగ నిబిడము చేసికొనఁ గలిగెను. తన పూర్వస్థితికిఁ ప్రస్తుతస్థితికి నడుమ మహాంతరాయములు ప్రవేశించెను. జీవించుట వ్యర్థముగాఁ దోఁచెను. గంటగంటకు నతనియెదుట నొక భువనమోహన విగ్రహము నిలిచి క్షణకాల మతని కూరటఁ గలిగించుచు వచ్చెను. కాని యావిగ్రహము స్పృశియించుటకు వీలులేని పవిత్రదేవతావిగ్రహమై, యామరణస్మరణీయమై యుండెను. అందుచేత నతఁడు దృఢతరోత్సాహపూరితులయ్యు విఫలమనోరథులైన యనేకయువజనులవలె యావజ్జీవ మామెనే స్మరియించుకొనుచు దేశద్రిమ్మరియై యుండ నిశ్చయించుకొనెను.

రాణిగంజినుండి పదియైదు మైళ్ళుదూరమున గంగాజలఘాటీ యను చిన్న గ్రామ ముండెను. ఆ బాటసారు లాదినమున నెక్కడ నిలిచిరి. శరచ్చంద్రుఁడు గుఱ్ఱము దిగి, చేయూఁత యిచ్చి కిశోరరాయలను బల్లకిలోనుండి మెల్లఁగా దింపెను. కాళి బసలో పక్క వేసి భర్తను గనిపెట్టుకొని యుండెను.

సూర్యాస్తమయమైన కొంతసేపటి కతఁడు నిద్రించెను. అతనితల్లి వంటయింటిలో పని తెమలక యచ్చటనుండి రాకపోవుటచే రోగిదగ్గఱఁ గనిపెట్టుకొని శాలీ శరచ్చంద్రులు మాత్రమే యుండిరి.

"తమ్ముఁడూ! నీవు సుధను వివాహము చేసికొనవలెనని ఆలోచించుచున్నావఁట నిజమా? పాపమది యాధీనము తప్పినపిల్లకదా? పితృతుల్యుని వివాహమాడ వచ్చునా? మనవంశమున కది కళంకము తెచ్చును సుమీ!" యని యామె పల్కెను.

"అమ్మకూడ నట్లేయన్నది. అందుచేత నాసంబంధము విడఁగొట్టుకొన్నాను. చలచిత్తుఁడని, పొరపాటుచేసినాఁడని నీతమ్మునిమీఁద ప్రేమ నీవు కోసివేసికొందువా అక్కయ్యా!" యని యాతఁడు బదులుచెప్పెను.

"తమ్ముఁడా! నీమీఁదిప్రేమను నేను కోసివేసికొనఁగలనా? అమ్మయు నాన్నయు నన్ను గన్నట్లే నిన్నుమాత్రము గనలేదా? తమ్ముఁ డక్కకు ప్రేమాస్పదుఁడు గాక మఱియొకలాగుండునా?"

మనోవేదన గలిగించు నావిషయమై యక్కకుఁ దమ్మునకు జరిగిన సంభాషణ మంతే శాలి యామాట మరల నెన్నఁడెత్తలేదు.

మొదటినాఁటి యుదయమువలెనే రెండవనాఁటి యుదయము కూడఁ బ్రభావంతమై యానందకరమయ్యెను. చెట్లమీఁదను గడ్డిమీఁదను నాణిముత్యములవలె మంచుబిందువులు వెలయుచుండెను. మంచుకురియుట మానినతోడనే వెచ్చని సూర్యరశ్మి వ్యాపించినతోడనే బాటసారులగుంపు గంగాజలఘాటినుండి బైలుదేరెను.

బాట క్రమోన్నతమైన దేశముగుండఁ బోవుటచేతఁ బ్రకృతి సౌందర్యము నేత్రమునకు మనోజ్ఞమై, దర్శనీయమై యుండెను. పల్లపుభూమి యంతయు జాగ్రతగా సాగుబడి చేయఁబడెను. చేలు పసుపుపచ్చవర్ణము కలిగి పొట్టలు పోసికొని కోఁతకు సిద్ధముగా నుండెను. తక్కిన నేల బీటినేలయై యుండెను. ఆనేలలోఁ గనుచూపుమేర నెక్కడఁ జూచిన నడవియే. ఆయడవులలో నెద్దులు దున్నపోతులు తమ కఱ్ఱగంటలు టక్కుటక్కు మని ధ్వనిచేయ, నాకుగుబురుల నడుమఁ గానఁబడకుండఁ బచ్చికమేయు చుండును. అక్కడక్కడ సాగుబడి చేసిన పొలములు గల గ్రామములు కనఁబడును. కొన్నిచోట్ల గుడిసెలుమాత్రమే కానవచ్చును. తీర్థయాత్రాపరులకు, బాటసారులకు,

గావలసిన సరకు లన్నిండియంగళ్ళు దూరదూరముగా బాటప్రక్కల నక్కడక్కడఁ గొన్ని కలవు. పడమటిదెసను పదియైదు మైళ్ళదూరమున నున్న నుసూనియా పర్వతము సుందరముగా వారి కగపడఁ జొచ్చెను. దాని కవ్వల నంతకంటె నెత్తయిన పాచెటు మాన్భూ కొండలు, వాని శృంగములు నభోభాగము నావరించెను.

మూఁడుగంటలు ప్రయాణము చేయునప్పటికి వారు తారకేశ్వర నదివద్దకు వచ్చిరి. ఇదియుఁ బడమటిదెస జనించి హుగ్లీనదిలోఁ గలియుటకై మొదటఁ దూర్పుగాఁ బ్రవహించి తరువాత దక్షిణముగా దిరిగిన యొక చిన్ననది. ఇది దామోదర నదికంటె సన్నముగా నుండును. ఈ నదిదాటి మన బాటసారు బంకూరాజిల్లాకు ముఖ్యప్రదేశమైన బంకూరాపట్టణమును జేరిరి. ఇటుకలతోఁ గట్టిన యిల్లొకటి సౌఖ్యప్రదమైనది జగత్కిశోరరాయని బసనిమిత్త మా గృహయజమానుఁ డిచ్చెను. ఆనాఁటికి వారక్కడ నిలిచిరి.

పదునెనిమిదవ ప్రకరణము

ఆటవికబాలిక.

వర్ధమానవు జమీందారుఁ డగు జగత్కిశోరరాయల పేరు బంకూరాపట్టణములోఁ బ్రసిద్ధము. పగటిపనులెల్ల ముగిసిన తరువాత సాయంకాలపుదీపములు పెట్టిన తోడనే గొప్పకుటుంబములోఁ జేరిన స్త్రీలు కొందఱు కిశోరరాయునితల్లి దర్శనము చేయుటకు నొక్క రొక్కరుగా వచ్చిరి.

"తల్లీ ! నీవు మంచిపని చేసితివి. మీ కుమారుని జగన్నాథము తీసికొనిపోవుట లెస్సయైన పని. మనుష్యుల మందులు పనిచేయ లేనప్పుడు జగన్నాథదేవుఁడే జాడ్య నివారణ చేయఁగలఁడు. రోగబాధలు పడినవా రనేకు లాయనకటాక్షమువల్ల బాగు పడిరి." అని చూడవచ్చిన వారిలో నొకర్తె చెప్పెను.

"అమ్మాయీ ! ఆ జగన్నాథస్వామి యనుగ్రహించి నా కొడుకునకు రోగ నివారణ చేయవలెనని మీరందఱు దీవించి పొండి. నా కుటుంబమున కాధారము వాఁడే కదా !

వాఁడెంతో బాధపడినాఁడు. ఈ వంద మందనక యన్నిమందులు మ్రింగినాఁడు. వ్యర్థమైనవి. నేఁటికి మహానుభావుఁడు జగన్నాథస్వామి యీ యాత్ర చేయవలసినదని యుత్తరువు చేసినాఁడు" అని కిశోరరాయనితల్లి పలికెను.

"అమ్మా! మీరు కలగన్న సంగతి మాకుఁ దెలిసినది. భగవంతుని కట్టియనుగ్రహము కలిగినది. కనుక మీ రెంతో యదృష్టవంతులు. భగవంతుని యుత్తరువు ప్రకారము మీరు నడుచుకొనఁ గలిగిరి. కనుక మీరు నిక్కముగ యదృష్టవంతులు. జగన్నాథస్వామి కోవెల చూచుభాగ్య మందఱికిఁ బట్టునా? ఆ యాత్ర మేము కూడ చేయవలె నని చిరకాలమునుంచి యుబలాట పడుచున్నాము. కాని మేము పేదవారము. కాక ప్రయాణము చాలకాలము పట్టును. ఖర్చెక్కువగును.

"అవు నది దీర్ఘప్రయాణమే. ఈ ప్రయాణ మేలాగున సాగునా అని నేను గంపెడు బెంగ పెట్టుకొన్నాను. భగవంతుని దయవల్ల మేము ప్రయాణమెట్టులో యారంభించినాము. ఇప్పటికి మా అబ్బాయి మనసుపటికొన్న బాగున్నాఁడు. పాప మా కోడలికి నెలదినాలనుండి రాత్రినిద్ర లేదు ఒక్క నిముషము పగలైన విశ్రాంతిలేదు. దానికి మగఁడంటే యింతింత భక్తిగాదు. నా కెంతో విధేయురాలు. నా మాట జవదాటదు. అటువంటి కోడండ్రు ఈ కాలములో సాధారణముగా నుండరు. అహో రాత్రములు నిద్రాహారములు లేక కనిపెట్టుకొని యుండుటచేత, అది చాలీపోయినది. శరీరములో రక్తమాంసాలు లేవు."

"నీవంటి అత్తగారికి భూదేవతవంటి అటువంటి కోడలు దొరకక మఱొకర్తె దొరకునా? ఆమె వంశపు విత్తుకట్టు మంచిది. ఈకష్టములో మిమ్ముఁ గనిపెట్టి మీవెంట వచ్చుటకు మీ కోడలితమ్ముఁడు చదువుమానుకొని వచ్చినాఁడని విన్నాను."

"అవునమ్మా! శరచ్చంద్రుఁడు మంచివాఁడు. వినయవిధేయతలు గలవాఁడు. అటువంటివానిని మనము సాధారణముగాఁ జూడజాలము. కాని పాడుకాలాలు వచ్చి కూర్చున్నవి. కాలేజీలో మనపిల్లలు రేపేమి బుద్ధులు నేర్చుకొందురో తెలియదు" అనుచుండ శరచ్చంద్రుని విషయమై యామెవిన్న లోకవాద మొకటి జ్ఞప్తికి వచ్చెను. వచ్చినతోడనే యామె మొగ మించుక మాడెను. ఆ తలఁపంతలోనే యంతరించినంగున నామె మఱల నిట్లు పలికెను. "అవునమ్మా! శరచ్చంద్రుఁడు బాగుండెవాఁడు. పట్టణవాసమువల్ల గలుగు పాడలవాటులు దరికి రాకుండఁ గొట్టినాఁడు. ఎల్లప్పుడు నా కొడు

కును గనిపెట్టుకొని యుందును. తమ్ముడు సైత మంత జాగ్రతగాఁ జేయఁడనుకో. అటు వంటి కొడుకును గన్నతల్లి అదృష్టవంతురాలు. శోకబాధ పడుచున్న నా కొడుకును శరచ్చంద్రుఁడు కనిపెట్టుకొని యుండి యుపచారము చేయుట చూచినప్పుడు నాకన్నుల నుండి నీళ్ళు కారును."

"అటువంటి జాగ్రత యూరకేపోదు తల్లీ! అనాఁటి కానాఁడు మీ కుమారుడు బాగుపడి జగన్నాథస్వామి దయవల్ల పూరినుండి వజ్రశరీరముతో హాయిగా మరలి వచ్చును. తరువాత మనుమలు పుట్టినదాక నీవు బ్రతికియుందువు."

"అమ్మాయీ! మమ్మనుగురించి యిటువంటి మంచికోరికలు కోరినందుకు నీమీఁద దేవునికి దయ యుండవలెను. నేను పెద్దదానను. మా అబ్బాయికి జబ్బుకుదిరిన తరువాత మా యింటిపెత్తనము మా కోడలే చేయవలెను. నేను జగన్నాథస్వామివారి పాదముల వద్దనే యింకమీఁద బ్రతికియున్న నాలుగురోజులు గడపెదను."

"అమ్మా! మీరు బంకూరాలో ఎంతకాల ముందురు? తిరిగి రేపువచ్చి మీదర్శనము చేయఁగల మమ్మా!"

"ఇక్కడెంతోకాల ముండుటకు వీలులేదమ్మా! పూరి చాలా దూరమున్నది. మా అబ్బాయి దేహస్థితినిబట్టి చిన్న చిన్న మజిలీలు చేసికొనుచు వెళ్ళవలెను. పూరి వెళ్ళుటకు పదియేను దినములు పట్టునని చెప్పుచున్నారు. అటువంటి యాత్ర వెళ్ళదలంచు కొన్నప్పుడు దారిలో ఆగుటకు వీలెట్లుండును?"

ఈ విధమున నెడతెంపులేని యీ సంభాషణము రాత్రి ప్రొద్దుపోవువఱకు జరుగు చుండఁ జూడవచ్చిన స్త్రీలొక్కొక్కరుగా జారిరి. అప్పుడు కిశోరరాయునితల్లి వంట యింటికిఁ బోయెను. ఒకర్తెమాత్రము వెళ్ళక కనిపెట్టికొనియుండెను. అది పదునాలుగు, పదియైదు సంవత్సరముల వయస్సుగల బాగ్దీజాతి బాలిక. అది తక్కువజాతిది గావున లోపలికి వెళ్ళలేక గుమ్మము ముందఱనున్న వసారాలోఁ గూర్చుండెను. వర్ధమానపట్ట ణమునుండి గొప్ప కుటుంబము యాత్ర వెళ్ళుచున్నదని విని యామెగూడ వారినిఁ జూచి దండముపెట్టి పోవుటకు వచ్చెను.

అప్పుడు జగత్కిశోరుఁడు గాఢనిద్రలో నుండెను. గుమ్మమువద్ద నెవరో బాలిక కూర్చున్నదని మగని పక్కవద్దనుండి కాళి గ్రహించి యామెవద్దకుఁ బోయి, కృపారస మొలుకు సహజమృదు భాషణములతో నామెను బలుకరించెను.

కాళి యడిగిన మాటల కామె యిట్లనియె.

"అమ్మగారూ! నేను బారిజాతి పేదదానను. మీరు వర్ధమానమునుండి వచ్చుచున్నారని జగన్నాథము యాత్ర వెళ్ళుచున్నారని విన్నాను. అమ్మా! నేను మిమ్ము చూడవలెనని యనుకొన్నాను. నా పెనిమిటి వర్ధమానములోనే పనిచేయుచున్నాడు. నేనిక్కడ పొట్ట గడుపుకొనలేక ఒంటిగా నున్నాను. పెనిమిటి దగ్గఱకు వెళ్ళవలెనని యున్నది."

"బిడ్డా! నీకథ యేమిటో చెప్పు. సంసారములో బాధలు మనకందఱ కున్నవే. నాచేత నైనయెడల నేను సాయము చేయుదును."

"అమ్మగారూ! మీ రెంతో మంచివారు. లేకపోతే బారిజాతిదానితో చనువిచ్చి మాటలాడుదురా? పూర్వము మేము కొంచెము కలిగి యున్నవాండ్రమే. మా నాయన పడమట యుండినాఁడు. అమ్మా! ఈ పట్టణమునుండి సుమారియాకొండ మీరు చూడఁగలరు. అక్కడనే మేము చిన్నపల్లెలో ఉన్నాము. మా నాయన పొలము దున్నుకొని జీవించినాఁడు. నేను చిన్నపిల్లనైనప్పుడు మా యమ్మ నన్ను దీసికొనివెళ్ళి పొలములలోఁ బనిచేయుట నాకు జ్ఞాపకమున్నది."

"పిల్లా! మీయమ్మ ఆఁడదికదా పొలములో ఏలాగునఁ బనిచేయఁగలిగినది?"

"అమ్మగారూ! ఎఱుఁగరు కాఁబోలు. బారిజాతి ఆండవాండ్రము గనుక మేమెల్లప్పుడు పొలములలోఁ బనిచేయుచుందుము. మేము హిందువుల స్త్రీలవంటివారము కాము. పొలములలోఁ బనిచేసికొని బ్రదుకుచుందుము. మా మగవాండ్రు నేలదున్నుట మొదలైన మోటపనులు చేయుదురు. తొలకరించిన తరువాత ఊడుపురోజులు వచ్చినప్పుడు ఊడుపుపని మాకు వదలివేయుదురు. బారిజాతి ఆఁడవాండ్రవలె ఆరూఢ్యగల వారు మగవాండ్రలోఁ గూడ లేరు. మేము మోకాలులోతు నీళ్ళలో నిలువఁబడి హోరున వానగురియుచున్నను, పెళ్ళున ఎండగాయుచున్నను ప్రొద్దున సాయంకాలము వంచిన నడు మెత్తకుండ ఊడ్పఁగలము."

"అలాగే నేనును విన్నాను. బంకూరాలో బారిజాతివాండ్రు ఎక్కువగా నున్నారు కాఁబోలు?"

"అవును నిజమే. ఈ జిల్లా బారివాండ్రకు నివాసము. తక్కినజాతివారికంటె మా జాతివారే యిక్కడ ఎక్కువయున్నారు. మా నాయన మాజాతిలోకెల్ల మంచివాఁడు. వాఁడు మా యూరికి పెత్తనదారు. వాడు నేలదున్నుకొని పన్ను లిచ్చుకొనెను. అమ్మగారూ! అదెల్ల పోఁగొట్టుకొన్నాము"

"ఏలాగున పోయినది ?"

"అమ్మగారూ! ఎలాగునా? పదేండ్లక్రిందట ఆ కాశముమీఁదనుండి వాన ఒకచుక్కైన పడలేదు. అప్పుడు దేశములో గొప్పకఱువు వచ్చినది. మానాయన దుఃఖములో మునిఁగిపోయినాఁడు. వాఁడు బాధ తప్పించుకొనుటకు, పని సంపాదించుకొనుటకు గ్రామము విడిచి వెళ్ళిపోయినాఁడు. వెళ్ళినతరువాత ఒకవారము చూచినాము, ఒక నెల చూచినాము, అతనిజాడ మాకుఁ దెలియలేదు. ఇంటిదగ్గఱ మేము ఉపవాసము చేసినాము. కొన్నాళ్ళు పోయినతరువాత ముసలివాఁ డొకఁడు మానాయన చచ్చిపోయి నాఁడని వార్త చెప్పినాఁడు. ఉత్తరదేశములో ఎక్కడో సర్కారువారు కఱువుగొట్టు వాళ్ళకుఁ బెట్టినసత్రములో పడి చచ్చినాఁడంట."

"పాపము నీవు చిన్నప్పుడే తండ్రి లేనిపిల్లనైతివి కాఁబోలు ?"

"అవును నాకప్పుడైదేండ్లున్నవి. అప్పుడు మాయమ్మ ఇంటింటికి వెళ్ళిబిచ్చమెత్తి మమ్ము రక్షించినది. దొరకిన తిండి తిని లేనప్పుడు పస్తుపండుకొని ఎన్నో నెలలు గడపినాము. ఏదోతిని దినము గడుపుకొనవలెనని మేమెన్నోసారులు కాయలు దుంపలు తెచ్చుకొనుటకు అడవులకుఁ బోయితిమి. అలాగుండగాఁ గొన్నాళ్ళకు కఱవుకాలము వెళ్ళిపోయినది. మంచిరోజులు వచ్చినవి. భాడుదయవల్ల భూములు తెగపండినవి.

"పిల్లా! ఈభాడును మీరు పూజ చేయుదురు కాఁబోలు! అతఁడెవరు ?"

"అమ్మగారూ! మాపంటలు పండించుదేవుఁడే అతఁడమ్మా! మాకన్నము బట్టయిచ్చి తనబిడ్డలలాగున మమ్ము రక్షించువాఁ డాయనే. మాజాతి ఆఁడవాండ్రు పంటకాలములో ఆయనమీఁద రోజారోజా కావలసినన్ని కీర్తనలు పాడుదురు, ఆయనకు మేమెన్నో యుత్సవములు చేయుదుము."

"పిల్లా! ఏపేరుతో పిలచిన నేమి? మీకన్నవస్త్రము లిచ్చి పంటలిచ్చి మిమ్ము రక్షించునట్టి ఆదేవుఁడు మీమొఱ లాలకింపఁడా ?"

"వినకేమితల్లీ! ఆయన జాలిగుండెవాఁడు. మనమే పాపాత్ములము. పాపములు చేసి మనబాధలు మనమే తెచ్చికొందుము. పంటకాలములో మా మగవాండ్రందఱు తెగ త్రాగుదురు. పండినపంటలు, తెచ్చుకొన్నడబ్బు త్రాగుడు క్రిందనే పాడు చేయుదురు. మామగవాండ్రు సారా త్రాగుట మానుకొనువఱకు మేము హిందువులవలె మంచివాండ్రము కాలేము."

"వాండ్రు త్రాగునది వంటసారాలా?"

"అవునుతల్లీ! అదే వాండ్రను పాడుచేసి చంపివేయునది. పూర్వకాలమున వారి వాండ్రు తమ సొంతగ్రామములో మంచి కల్లు తీసికొని త్రాగుచుండెడి వారని మానాయన చెప్పుచుండెడివాఁడు. అది యంతచెడ్డదికాదు. అది తక్కువ యెత్తించినను దానివల్ల బలముకలుగుచుండెడిది. అదొకవిధమైన యాహారమే. ఈ రోజులలో అయిదు మైళ్ళకొకచోట, పదిమైళ్ళకొకచోట, సారాదుకాణము. మామగవాండ్రు ఎక్కువ నిషా గల సారా త్రాగుటకే ప్రయత్నింతురు. సారాబలముచేయదు. అది యాహారము కాదు. అది విషము. అది మనుష్యులను జంపివేయును."

"పిల్లా! నీమాట నిజము. మీవాండ్రు ఎంతత్వరగా త్రాగుడు మానివేయుదురో అంతమంచిది. హిందువులలో మహమ్మదీయులలోను పంటకాపులను, కూలివాండ్రను చూఁడు; వారు త్రాగరు. అందుచేత సొమ్ము పోగుచేయుదురు. మీరడవిమనుష్యులు. హిందువులు తురకలు చేసినట్లే మీరుకూడ చేయవలెను."

"మాయమ్మ బ్రతికియున్నప్పుడు ఈలాగుననే చెప్పుచు వచ్చినది. అది నాపెండ్లి చేసినదాక బ్రతికియున్నది. నాపెనిమిటి పెండ్లికాఁగానే మాయూరు విడిచి పోయి నాఁడు. నాఁటికి నేఁటికి మఱలఁగనఁబడ లేదు. పాపము నాతల్లికూడఁ జచ్చిపోయినది. నేనిప్పుడేకాకిని, దిక్కెవరును లేరు." అని యాపేద బాలిక చీర మొగముపై వైచికొని యేడ్చెను.

"పిల్లా! ఎందుకేడ్చెదవు? నిజముగా నీపెనిమిటి బ్రతికియున్నాఁడా? నీకతఁడు కనఁబడునా?"

"అమ్మగారూ! బ్రతికియున్నాఁడు. వర్ధమానములో నున్నాఁడు అని వర్ధమానమునుండి వచ్చినమనుష్యులు చెప్పినారు. అతఁడక్కడ కాపుర ముండఁబోలు.

అందుచేత నన్ను మఱచిపోయెదరేమో? అమ్మగారూ! మీరు తిరిగి వర్ధమానము వెళ్ళుదురు కదా? ఈపేదదాని యవస్థ కొంచెము మనస్సులో జ్ఞాపక ముంచుకొంటిరా మీవల్ల నా కెంతో సాయమగును."

"పిల్లా! నాచేత నైనపక్షమున అలాగే చేసెదను. నీపెనిమిటి నిన్ను రమ్మని కోరినపక్షమున నీవు వర్ధమానము వత్తువా?"

"అమ్మగారూ! తప్పక వచ్చెదను. ఈ యూరిలో నా మొగము చూచువారే లేరు. నేను బంకూరావఱకు నడిచి వచ్చినాను. ఈపైకి వెళ్ళలేను. నాదగ్గఱ డబ్బులేదు. పైగా నా పెనిమిటి నన్ను గుర్తుపట్టునో లేదో. మీరు వర్ధమానము తిరిగి వెళ్ళినతరువాత ఈ పేదబారిదానిమాట కొంచెము జ్ఞాపక ముంచుకొంటిరా మీ కెల్లప్పుడు బాగుండవలెనని దేవునకు దండములు పెట్టుకొందును."

"ఇటువంటి మంచికోరికలు కోరినందుకు దేవుఁడు నిన్ను రక్షించును. పేదవాండ్ర మొఱలు భగవంతునకు దేవాలయములలో మంత్రములకంటె ముందుగా వినబడును. పిల్లా! ఈరూపాయి పుచ్చుకో. మేము జగన్నాధమునుండి వచ్చువరకు ఈరూపాయి ఖర్చు చేసికొని బ్రదుకు. నాపేదబాలిక స్నేహితురాలిని నేనుమరచిపోనులే."

పందొమ్మిదవ ప్రకరణము

అడవికోట

మాండవనాండాబాటసారులగుంపు రమారమి యెదుగంటలు దీర్ఘప్రయాణము చేసి విష్ణుపురము జేరెను. ఈయూరుచిరకాల మొకచిన్న రాజ్యమునకు రాజధానియై యుండెను. ఇప్పు డది యొకకుగ్రామము. అందలికోట యడవిలో మాటుపడియున్నది. చుట్టు నున్న కందకము నానావిధములైన మొక్కలతో నిండియున్నది. పురాతన దేవాలయములు, రాచనగళ్ళు నాశనములైనవి. ఉన్నతములైన బురుజులు, విశాలములైన ద్వారములు నాశనములో సైతము ఒకవిధమైన గాంభీర్యమును జూపుచుండును. హిందూదేశ మిప్పటికి నిట్టిపాడుకోటలతో నిండియున్నది. ఇవియన్నియుఁ బూర్వపు

రాజుల యౌన్నత్యమును, బరస్పర యుద్ధములను జ్ఞప్తికిఁ దెచ్చుచుండును అటువంటి పాడుప్రదేశములలో విష్ణుపురములో మనస్సునకు నచ్చునదిగంభీరమైనది మఱియొకటిలేదు.

ప్రశాంతమైన యీగ్రామమునందు హిందూసబ్ మేజిస్ట్రేటొకఁడు కచేరితీర్చి యుండెను. అతఁడు పూర్వము జగత్కిశోరరాయుల నెఱిఁగి యుండుటచేత సకుటుంబముగా నాయన 'జగన్నాథయాత్ర' వెళ్ళుచున్నవార్త విని, వారిని సగౌరవముగాఁ దన యింటికిఁ దోడ్కొనివచ్చి వారికి సకలసౌఖ్యములు కలుగునట్లేర్పాటుచేసెను. అతఁడు ప్రత్యేకముగా స్త్రీలకొకగది యిచ్చి రోగికి మరియొకగది యేర్పాటుచేసెను. మరి యొకగది లేకపోవుటచేత నారాత్రి శరచ్చంద్రునిఁదనగదిలోనే పండుకొనఁబెట్టుకొనెను.

సాయంకాలము చల్లఁబడినతోడనే మేజిస్ట్రేటు శరచ్చంద్రుని దోడ్కొనిపోయి పాడుకోట చూపెను. అది పూర్వము పెద్దపట్టణము. దానిచుట్టు రమారమి యేడు మైళ్ళప్రాకారముండెను. నడుమనడుమ బురుజులనేకములు గలవు. ఈచుట్టుగోడల లోపల పట్టణముండినది. పాడుపడుచున్న యిటుక మేడలు మిద్దెలిప్పటికినిఁ గానఁబడుచున్నవి. ఈపాడుపట్టణములో సగము పాడుపడి, యడవిమొక్కలతో నిండిన దేవాలయము లెన్నోగలవు. శోధించి త్రవ్వి వెదకువారికిప్పటికి గొప్పగొప్ప ధాన్యపుగాదులు కట్టినచోట్లు కనఁబడును. సమీపారణ్యములోఁ బండ్రెండుగులన్నరపొడవు గలిగి పదియొకండంగుళముల పాతిక కైవారముగలకన్నము గలిగిన ఫిరంగియొకటి యున్నది. ఈఫిరంగి సగమిసుకలోఁ గప్పఁబడియున్నది. కాని రెండువందలయేండ్లనుండి గాలితాకులు, వానదెబ్బలు తగిలినను లేశము త్రుప్పుపట్టలేదు. చేతి చెడిపోవలేదు.

ఆవనప్రదేశములలోఁ దిరిగి, లోపలిపట్టణముయొక్క సింహద్వారముదాటి వెళ్ళునప్పటికి వెనుక ననేకశతాబ్దములాపట్టణమేలిన రాజులవంశస్థుఁడొకడు శరచ్చంద్రునకుఁ గనబడెను. అతఁడిప్పుడాస్థలమందే కాపురముండెను. కాని రాజ్యహీనుఁడై, దీనుఁడై యుండెను. పూర్వమతిప్రబలమై యుండిన రాజవంశముయొక్క మొలకయై, శిథిలమైన తమ పూర్వరాజధాని యొక్క పాడుగోడలలోనే వసించుచుండిన యాపేదపురుషునిఁ జూచి యాతని పితృపితామహుల యాత్మ లెంతశోకించుచున్నవో కదా! విష్ణుపురరాజ్యము దానికి సంబంధించిన భూములుకూడ నన్యాక్రాంతములైనవి. అందుచేత జగమెల్ల మఱచిపోయిన యారాజవంశముయొక్క సంతతివాఁడగు నీపురుషుఁడు దారిద్ర్యముతో దినములు వెళ్ళఁబుచ్చుచుండెను. బ్రిటిషు గవర్నమెంటువారతని కొక చిన్న యుద్యోగము

నిచ్చిరి. మూర్ధాభిషిక్తులవంశస్థుఁడైన యాపురుషుఁడు ప్రస్తుత ప్రభుత్వమువారనుగ్రహించి తనకుఁ జేసినమహోపకారమున కెంతయుఁ గృతజ్ఞుఁడగుచు, దినమంతయుఁ బాటుపడి తనయుద్యోగధర్మమును శ్రద్ధతో నెరవేర్చు చుండును.

ఆచిన్న యుద్యోగస్థునిఁ జూచి శరచ్చంద్రుఁ డెంతో జాలిపడెను. అతనిని మేజస్ట్రీటు రాత్రి తన యింటికి భోజనమునకు రమ్మని పిలిచెను. మూఁడు దినములు ప్రయాణము చేయునప్పటికి జగత్కిశోరుని దేహస్థితి యెంతో బాగుపడెను. మేజస్ట్రీటు పూర్వరాజవంశపు సంతతివానిని వెంటఁబెట్టుకొని సాయంకాల మింటికి వచ్చునప్పటికి కిశోరరాయలు పడకకుర్చీమీఁద గూర్చుండెను.

వారు రాఁగానే యతఁ డిట్లనియెను. "ఈపూర్వసంస్థానముల చరిత్రలు కనుగొన వలెనని నాకభిలాష మెందు. కాని యాపాఁతకోటగోడ లన్ని చూచుటకు నాకు శక్తి లేదు. ఇటువంటి యుత్కృష్టహాతిశేషములు గలరాజవంశములు బంగాళాదేశములో మిక్కిలి స్వల్పములు."

అనవుఁడు రాజవంశస్థుఁడు "మామీఁద మీ కెంతోదయ యుండుటచేనట్లను చున్నారు. మామందిరములు నేలమట్టములైనవి. మా దేవాలయములు దిబ్బలగుచున్నవి" యని పలికెను.

"ఈపాడుదిబ్బలే మీవంశముయొక్క గొప్పతనమును జ్ఞాపకము చేయుచుండును. రెండువందలయేండ్లక్రిందట వర్ధమానరాజకుటుంబము, వీరభూమి రాజకుటుంబము, విష్ణుపుర రాజకుటుంబము బంగాళానవాబుక్రింద విశేషరాజ్యములు సంపాదించి గొప్ప ప్రభుత్వ ములు చేసియుండెననియు, నందులో విష్ణుపుర మెవరికిఁ దీసిపోక విశేషప్రఖ్యాతిఁ బడసె ననియు వింటిని."

"మీరట్లనుకొనవచ్చును గాని వర్ధమానవీరభూమి సంస్థానములను మాసంస్థాన ముతోఁ బోల్చి జూచినప్పుడు నిన్న మొన్నటివి."

"మీసంస్థాన మంతపురాతన మైనదా? దానిచరిత్ర మీనోట న వినవలెనని కుతూ హలపడు చున్నాను. ఎందుచేత ననఁగా దానిపూర్వవైభవము చక్కఁగాఁ దెలిసినవారు, చెప్పగలవారు మీరే."

"అయ్యా! ఆచరిత్ర మిక్కిలిదీర్ఘమైనది. అదియుఁగాక మావంశచరిత్రనే చెప్పుకొనుట భావ్యము కాదు."

"కాదు కాదు. నేను మీవలననే వినఁగోరుచున్నాను. నేను కుర్చీమీఁదఁ గూర్చుండఁగలిగి చాలకాలమైనది. పుట్టెడురోగపడి లేచినవాని కించుకవినోదముఁ గలిగించుటకై యీపురాతనచరిత్ర నాకెంతేఁగింపుఁడు. ఒకగంటకాలము దీనిక్రిందఁబోవును. అంతలో మీభోజనముకూడ సిద్ధమగును. నాకు నిద్రవేళకూడనగును."

రాజవంశస్థుఁడు తనవంశచరిత్రము చెప్పుటకది నూరవపర్యాయమైనను వినుగులేక చెప్పఁదొడఁగెను. జగత్కిశోరుఁడు కుర్చీమీఁదఁజేరఁబడి వినెను. ప్రాచీనవైభవసూచకము లగు జీర్ణశేషములను శరచ్చంద్రుఁడప్పు డప్పుడే చూచి వచ్చుటచేత మిక్కిలి తమకముతోఁ జెవి యొగ్గి సావధానుఁడై గురువు చెప్పు పాఠము విను విద్యార్థివలె శ్రద్ధతో నాలకించెను. పూర్వకాల చరిత్రలువిను కుతూహలమున జగత్కిశోరుని తల్లియు భార్యయుఁ దెరచాటునఁ గూర్చుండిరి.

అతఁడు కథ యిట్లు ప్రారంభించెను.

"మావంశ చరిత్రము పుక్కిటిపురాణములతో నిండి యున్నది. కాని మాసంస్థానపు గాథలలో నెట్లున్నదో యట్లు చెప్పెదను. అంతయు విన్నతరువాత కల్పితకథ లేవో, సత్యచరిత్ర లేవో మీరు తెలిసికొనవచ్చును.

వందలకొలఁది సంవత్సరముల క్రిందట ఉత్తరహిందూదేశమందలి మధురాపుర ప్రాంతములయం దుండెడియొకరాజు పూరీక్షేత్రమునకు యాత్రార్థమైవచ్చెను. అతఁడు తిరిగి పోవునప్పుడు దైవవశమున గర్భవతి యగు వానిభార్య దారి తప్పిపోయి యేకాకినియై సంచరించి యొక చెట్టు క్రింద ప్రసవమై కుమారునిఁ గనియెను.

కనినతోడనే యామె చనిపోయెను. ఏవిధమునఁ జనిపోయెనో యెవరికిని దెలియదు. పసిపిల్లవానిని కాస్మీతియూనాగ్గి యనుకాఁపువాఁడు తీసికొనిపోయి సంరక్షించి తనకొడుకట్లు పెంచుకొనెను. పిల్లవాఁడు క్రమక్రమముగాఁ బెరిగి పెద్దవాఁడయ్యెను. ఈ ప్రాంతముల వసియించు బ్రాహ్మణుఁ డొకఁడు బాలకునిఁ దన సేవకునిగాఁ దీసికొని పనులకాపరిఁజేసెను.

ఆచిన్న పసులకాపరి యానాటున నున్నవాగ్దిజాతి పిల్లలతో నాడుకొనుచుండెను. ఒకనాఁడతఁడు వనములోఁ దిరుగుచు, దారితప్పి యింటి కరుగులేక యలసి సొలసి నేలఁ బండుకొని నిద్రపోయెను. చెట్లయాకులసందునుండి సూర్యరశ్మి యతని ముఖముపైఁ బడెను. స్నేహితులు వానిని వెదకికొనుచు నచ్చోటికి వచ్చిరి. వచ్చిచూచు నప్పటికి ద్రాఁచుబా మొకటి నానావర్ణములుగల తన పడగ విప్పి బాలున కెండదగుల కుండ గొడుగుగాఁ బట్టెను. ఇది మహారాజ చిహ్నమగుటచే నది చూచినవారందఱు ముందుముం దితఁడు రాజా కాఁగల డని నిశ్చయించిరి.

ఆ బాలునిపేరు రఘునాథసింగు. అంతలో నీదేశ మేలుచున్న ముసలిరాజా మృతినొందెను. అతని కుత్తరక్రియలు మిక్కిలి గొప్పగాఁ జేయఁబడెను. అవి చూచుటకు జనులు గుంపులుగుంపులుగా బోయిరి. చూడవచ్చిన జనులలో రఘునాథుఁడొకఁడు. అప్పుడు రాచయేనుఁగు జనసమూహ మధ్యమునకుఁబోయి తొండముతో నా బాలుని నెత్తి ముసలిరాజా మృతిచేత శూన్యమైన సింహాసనమునఁ గూర్చుండఁబెట్టెను. అప్పుడు జనులయుక్కజ మేమిచెప్పుదును ? బ్రహ్మాండము ప్రతిధ్వనించునట్లు జనులందఱు ప్రతిధ్వనులు చేసిరి. అంతట మంత్రులు సామంతులు రఘునాథుని రాజుగా నెన్నుకొనిరి. పట్టాభిషేక సమయమున నతఁడాదిమల్లుఁడని బిరుదువహించెను.

కథ సాయంకాలము ప్రొద్దుపోవువఱకు జరిగెను. ఆకథకుఁడు రఘునాథుని యనంతరమున సింహాసనమునకు వచ్చిన రాజులను గుఱించి చెప్పి, వారు యుద్ధములు చేసిన తెఱంగు, నిరుగుపొరుగురాజుల గెల్చినవిధంబు, రాజ్యమును నలుదెసల వ్యాపింపఁ జేసిన భంగియు వర్ణించెను. అనేకాటవికజాతులతోడను, పురాతన మహారణ్యముల తోడను నిండియుండిన యా ప్రాంతభూముల కన్నిఁటికి విష్ణుపురిరాజులే ప్రభువులై యధికారము చేసిరి.

శతాబ్దము తరువాత శతాబ్దము వచ్చెను. కాని యా వంశముయొక్క మహాధికారము రవంతయు సడలక నానాఁటికి దృఢమయ్యెను. బంగాళాదేశమును బాలించిన యాఫ్ఘను ప్రభువులు సరిహద్దులలో నున్న యీ సంస్థానముపేరే యెఱుఁగరు పటానుల విజయధ్వజమెన్నఁడు విష్ణుపురముఁ జొచ్చి యెఱుఁగదు. బహుదేశ పరివ్యాప్తమై, క్రమసన్నాహ సమేతమైన మొగలాయి చక్రవర్తుల యధికారము దాదాపుగ నుత్తరహిందూస్థానమం దంతట నాటఁబడెను. మహాపురుషుఁడైన యక్బరు చక్రవర్తి పదియాఱవ శతాబ్దమున హిందూస్థానమును బాలించినపుడు చక్రవర్తియొక్క

బంగాళాదేశ ప్రతినిధికి విష్ణుపుర సంస్థానము పేరునకు మాత్రము. కొంచెము కప్పము కట్టెను. కాని మొగలాయిరాజ్యము నానాటికి క్షీణింపఁగానే వారి సరిహద్దులలోనున్న విష్ణుపురరాజ్యము మఱల నొకసారి విజృంభించి సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించెను.

తరువాత పదునెనిమిదవ శతాబ్దమున మా వంతువచ్చినది. తత్క్షణమున మహారాష్ట్రులు విజృంభించినపుడు ఫలవంతములైన బంగాళాదేశపు బయళ్ళను జయించుటకై యరణ్యమార్గద్వారమున రఘోజీభాన్స్లే యసంఖ్యాకములైన తన గుఱ్ఱపు దళములను బంపెను. మేము మడమదిప్పక నిలిచితిమి. ఎన్నిసారులో పోరాడితిమి. కొండదారులు కాచుటకై కాపరుల నియమించితిమి. వారి పేరు ఘాట్వాలాలు. ఆదినములలో మహారణ్యము లహర్నిశము యుద్ధరవములచేఁ బ్రతిధ్వను లిచ్చెననియు కూసీనదీతీరమందలి దట్టంపుటడవులయందు, మఱి యితర వనములందును బలుమాఱు సందడికయ్యములు జరిగిన వనియు పెద్దలు చెప్పుదురు.

రఘోజీభాన్స్లేయొక్క సేనాపతి యగు భాస్కరపండితుఁ డొకనాఁడబ్బాటుగ విష్ణుపురద్వారములవద్ద సైన్యసమేతుఁడై నిల్చెనఁట. అప్పుడు మేము కోటతలుపులు మూసితిమి. బురుజులమీఁద మనుష్యుల నెక్కించితిమి. ఫిరంగులుదట్టించి బారుచేసితిమి. ఆఫిరంగులలో నొకటి నేఁటికిసైతము భూమిలో సగము కప్పఁబడియున్నది. మహారాష్ట్ర సేనానాయకుఁడగు భాస్కరపండితుఁ డా ఫిరంగిదెబ్బ తగిలి రణరంగమున బడి చచ్చెనఁట. అది నిజమే.

కాని మహారాష్ట్రులు భయంకరశత్రువులు. వారితోఁ బోరాడుట కష్టము. ఏలయన మరాటి గుఱ్ఱపురౌతులు మెఱుపుతీగెలు, లేడిపిల్లలు. వారు మావలెనే కొండకనుమ లన్నియు నెఱుఁగుదురు. వారికి దెలియనిగొందులు లేవు. ఉప్పెనవలె వారు విజృంభించి వచ్చి వెంటనే మాయ మగుదురు. అయినప్పటికి మేము వెనుకంజ యిడక వ్రాళ్ళవలె నిలిచితిమి. ఏలయన మా బురుజులు గట్టిగానున్నవి. ఫిరంగులు కాల్చువారు గురి తప్పని వారు. మా శత్రువులు మహారాష్ట్రులు మాత్రమే కారు. మాకు సహజశత్రునైన వర్ధమాన సంస్థానముతోఁ గూడ మేమనేక యుద్ధములు చేయవలసివచ్చెను. మహారాష్ట్రులు మామీఁదికి వచ్చినప్పుడు వర్ధమానరాజు సమయమదేయని మానాశనము నిమిత్తము వారితోఁ గలసి కుట్రఁజేసెను. ఇట్లనేక శతాబ్దములు ప్రభుత్వముచేసి విష్ణుపురసంస్థాన మిద్దఱు విరోధుల యిరుకునఁ బడి నశించినది. విస్తీర్ణమైన మా సంస్థానము కొంతవఱకు వర్ధమాన ప్రభువుల పాలఁబడెను. తక్కినది శత్రుప్రభువులు పంచుకొనిరి. మా వంశము

యొక్క యధికార మంతరించినది. మారాజధానియొక్కయు కోటగోడలయొక్కయు శేషములు వాని పూర్వవైభవమును మాత్రము చాటుచున్నవి."

శరచ్చంద్రుఁడు చెవులు దోరఁబెట్టుకొని వినెను. కాని యారాజవంశస్థునికథ జగత్కిశోరుని నిద్రపుచ్చెను.

ఇరువదవ ప్రకరణము.

బంధుగృహము.

రెండుదినములు ప్రయాణముచేసి యాబాటసారులు మిధునపురము జేరిరి. మిధునపురము మిధునపురమండలమునకు ముఖ్యపట్టణము. చుట్టుప్రక్కల నుండు పల్లియలలోని జనంబు లదరిపడునట్లు బోయలు శ్రమనివారణార్థము విసుగు లేక చేయునోంకార ధ్వనులతోఁ బల్లకులు పట్టణసమీపము చేరునప్పటికి మెరియలవంటి దృఢకాయు లాఱుగురు మనుష్యులు ప్రక్కదుకాణము మీఁదనుండి వచ్చి పల్లకుల కడ్డముగ నిల్చి యాగవలసినదని కేక వేసిరి వారి మోటవాలకములం బట్టియు, వారు చేతులం దాల్చినదుడ్డుకఱ్ఱలం బట్టియు విచారించితిమా పూర్వకాలమున వారు దారులుగొట్టు దొంగ లనుకొనుట కేవిధమైన సందియ ముండదు. కాని దినములు మారిపోయినందున వారు దొంగలు గాక, మిధునపురవాసులలో ముఖ్యపురుషుఁ డగు బిపినబిహారిదత్తుయొక్క సేవకులై యుండిరి.

వర్థమానపురవాసి యగు జగత్కిశోరరాయలకును, మిధునపురవాసి యగు బిపినబిహారిదత్తునకును ముఖపరిచయము లేదు కాని యొకరిపే రొక రెఱుఁగుదురు. అంతియె గాక వారిద్దరు కాయస్థశాఖలోనివా రగుటచే నేదోమూల వారికి బాంధవ్యము కలిసియుండునని వారు నమ్మియున్నారు. జగత్కిశోరరాయలు మిధునపురమునకు వచ్చునట్టి దినము శరచ్చంద్రుఁడు ముందుగా బిహారిదత్తునకుఁ దెలియజేసి తగినబసయు గావలసిన యేర్పాటులు చేయవలసిన దని వ్రాసెను. అందుచేతనే బిహారిదత్తుయొక్క సేవకులు యజమానుని యాజ్ఞప్రకారము బాటసారులను దత్తుగారి విశాలగృహమునకు దీసికొని పోవుటకై వచ్చిరి. బిహారిదత్తు కిశోరరాయల నిమిత్తమై ముందుగ మంచము పఱుపు

వేయించి వీధిగుమ్మమువద్ద నిలిచియుండి పల్లకి రాగానే కిశోరరాయలను జేయూత యిచ్చి దింపి మెల్లగాబాన్పుజేర్చి, స్త్రీలనిమిత్తమై యేర్పడినగదులలోనికి జగత్కిశోరుని యూడువాండ్రను దీసికొని పోవలసినదని తనదాసీజనము నాజ్ఞాపించెను. వారందఱు కొంచెము విశ్రమించి ఫలాహారము తిని కూర్చుండిన తరువాత దీపములు పెట్టిరి. అప్పుడు బిహారిదత్తు స్వభావమధుర మైన శీలముతో గుశలప్రశ్న చేయుటకై వారికడకుబోయెను.

“అమ్మా ! పూరీయాత్రకుఁ బోవుచు మీరు మాపట్టణమును మాగృహమును పావనము చేసినందుకు నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. నేను మీకుమారుని గుఱించి విశేషముగా వినియుంటిని. వర్ధమానములో నింతటి గొప్పస్థితిలో మఱియొకరు లేరు. ఆయనను చూడవలెనని చిఱకాలమునుండి కోరుచుంటిని. నాయదృష్టముచేతనే ఆయనయిక్కడకు విజయము జేసిరి. మీరు నాయిల్లు మీయిల్లుగా భావించి కొంతకాల మిక్కడ నుండవలెనని కోరుచున్నాను.” అని యతఁడు రాయుల తల్లినుద్దేశించి పలికెను. అప్పుడు నామె మేలిముసుఁగు వైచికొని యిట్లనియెను.

“నాయనా ! నీవు మిక్కిలి మంచివాఁడవు. మామీఁద నెంతో దయఁ జూపితివి. నీకిటువంటి శ్రమ కలుగఁ జేయవలెనని తలఁచుకొన లేదు. మేము మిథునపురములో నొక్కరాత్రిమాత్రమే నిలువఁ దలఁచితిమి. ఆరాత్రికి మీయింటిసమీపమున నేదో బసకుదురు వనుకొంటిమిగాని నీవిబ్బందిపడి మీయింటిలోనే బసయేర్పఱుతు వనుకొనలేదు.”

“అమ్మా ! ఏదో బసా ? మాపట్టణముగుండ మీరు ప్రయాణము చేయుచున్నప్పుడు మీ కేదో అద్దెకొంప తగినబస యగునా ? నేను కొంపకట్టుకొని గ్రామములో కాపురము చేయుచుండఁగా నాకుఁ గలిగిన కొంతె గంజియన్నము పెట్టఁగలిగి యుండఁగా మీరు నాయింట బసఁజేయక వేఱొకచోట దిగినపక్షమున నాగృహమున కవమానము కాదా ? నాకుటుంబమున కప్రతిష్ఠ కాదా ? [illegible]”

“అట్లాగె కానీ నాయనా ! నీవును నాకు కుమారుఁడవే. [illegible] గొప్పగాదు. [illegible] రాజ్యము [illegible] నాయనా !”

“అమ్మా ! [illegible] నీకు నాకు మంచియారోగ్యము కలిగి [illegible] వెళ్ళును. [illegible] మహోన్నత మైనదశ [illegible] మా కుమారునితోఁ [illegible] వచ్చిన [illegible] గొప్పవాఁడు. [illegible]

మొగము మీఁదనే వ్రాసియున్నది. అమ్మా! ఆశరచ్చంద్రునిఁ జూచినప్పుడు మాతమ్ముఁడు భీరాదుఁడు జ్ఞాపకము వచ్చును. అచ్చముగా నితనిది వాని వయస్సే. అతనివలెనే యితను గూడ మిక్కిలి మంచివాఁడు. కలకత్తాలో వీరి కిద్దఱకు పరిచయము గల దని నానమ్మకము."

"నాయనా! వారిద్దఱు దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లవలె. నేనుచూచినంత వఱకు శరత్తు మిక్కిలి జాలిగుండెవాఁడు. ఈ ప్రయాణములో నాకతఁడు కుమారునికంటె మిక్కిలిగా సకలోపచారములు చేసినాఁడు. కాని పడుచు పిల్లవాండ్రకుఁ గలకత్తా నగరము మిక్కిలి యపాయకరమైనస్థలము. కాలేజీపిల్లలు తాము చేయుచున్నపని యేమో తెలియక నడుచు చుందురు. ఎందుకు? మీ తమ్ముఁడు నీవు వెళ్ళినాఁడు కాదా, అతఁడు వచ్చిన తరువాత కులములో చేరునా? భగవంతుఁడు పరిపాలించవలె నాయనా! కాటికి కాళ్ళు చాపుకొనియున్న నావంటిముసలిది యింక నెన్నాళ్ళు బ్రతుకఁ గలదు. ముందుముందెట్టి విడ్డూరములు పుట్టునో చెప్పలేము."

"అమ్మా! విచారించవద్దు. ఆ విషయమై బెంగపెట్టుకొనవద్దు. కుఱ్ఱవాండ్రెప్పుడు కుఱ్ఱవాండ్రే. వాండ్రు తమకుఁ దోఁచినట్లుగాని చేయరు. వారు మంచివారై సరిగా నడుచుకొన్న పక్షమున దేవుఁడే వారికి సాయము చేయును. అమ్మా! నామాటనమ్ము. శరచ్చంద్రుఁడు దేశమున కిల కారుఁడై గొప్పవాఁడై యుండఁగా నీవు చూచెదవు. అంత వఱకు నీవు బ్రతికియుందువు. మా తమ్ముఁడు దేశస్థులలో మొదటివాఁడై పేరుప్రతిష్ఠలు సంపాదించువరకు మాతండ్రికూడ జీవించి కుమారునివైభవము చూచునని నా నమ్మకము. అమ్మా! వారు వెఱ్ఱిచేష్టలు చేసినను పెద్దదానవు. వారినాశీర్వదింపుము. సజ్జనుల యాశీర్వాదములు వ్యర్థములు కావు."

"నేను వారిని మనఃపూర్తిగా దీవించెదను. భువనేశ్వరుఁడైన జగన్నాథస్వామి శరచ్చంద్రుని, మీ తమ్ముని దీర్ఘాయుష్మంతులను జేయుఁగాక! వారు వృద్ధిలోనికి వచ్చి సుఖపడుదురు గాక!"

"అమ్మా! మీరిక్కడ కొన్నిదినము లుందురు గాదా? రాణీగంజినుండి చాల దూరము వచ్చినారు. జగన్నాథము మీఁదవచ్చినంతకంటె ఎక్కువ దూరమున్నది."

"నాయనా! మే మైదుదినములనుండి ప్రయాణము చేయుచున్నాము. మేము స్వగ్రామమునకు వెళ్ళవలెను. అందుచేత రేపు ఉదయమే బయలుదేరవలె ననుకొనుచున్నాము."

“అమ్మా! అలాగనవద్దు. ఐదుదినములు ప్రయాణము చేసినతరువాత మీకుమారుఁడు కొంచెము విశ్రమింపవలెను. మిథునపురములో నెన్నో దేవాలయము లున్నవి. తీర్థవాసు లిక్కడిదేవతలను దర్శింపకుండ వెళ్ళరు. అధమపక్షము రెండుదినములైన నిలిచి యిక్కడ దేవాలయములను క్షేత్రములను చూచి పొండు. ఈ రెండుదినములలో శరచ్చంద్రునకు మాపట్టణములోఁ జూడవలసిన చోట్లు చూపెదను. మీకుమారుఁడు రెండుదినములు విశ్రమించిన పిదప వాఁడంతదార్ఢ్యము కలిగి ప్రయాణము సులభముగాఁ జేయఁగలఁడు,”

అతని కోరికప్రకారము వారు రెండుదినములు నిలిచిరి. మరునాఁ డుదయమున బిహారీదత్తు శరచ్చంద్రుని దన గుఱ్ఱపుబండిమీఁద నెక్కించుకొని షికారు తీసికొని పోయెను. మిథునపురములో నున్నట్లు బండిషికారున కనువైనబాటలు బంగాళాదేశములో మఱియొక పట్టణములో లేవు. ఎందుచేత ననఁగా జిల్లాలో సగము కంకర నేల. కాఁబట్టి బాటలు మెత్తగ నుండును. పశ్చిమభాగమునఁ జాల దూరము పోయినతరువాత కంకరబాట నిమ్నోన్నత ప్రదేశమున వేయఁబడుటచే నొకచో నెత్తుగ నొకచోఁ బల్లముగ నుండును. చుట్టుప్రక్కల స్థలము లడవివాలకము కలిగియుండును. ప్రశాంతి పూర్వకాలమున నెవఁడో యొకానొకరాజు కొండమీఁద కట్టినయొకకోట యీపాడుచోటున కొక వింతగౌరవము గలిగించుచుండెను. ఆకొండక్రింద “కూసీ” నది శిలాసైకతమయమైన తన గర్భముమీఁద గలగల ప్రవహించుచుండెను. బిపినబిహారీదత్తు మిథునపురవాసులలో ప్రధానపురుషుఁడు. అప్పటిగవర్నరు జనరలుగారగు రిపన్ ప్రభువుగారు విశ్వాసపాత్రము లయినజనులమీఁద పట్టణపరిపాలనాభారము కొంతనిలిపి క్రొత్తశాఖలఁ గొన్నిటి నేర్పఱిచి యుండిరి. దత్తు నిర్వహించుచుండిన కార్యభారము లనేకములు గలవు. మిథునపురము మునిసిపాలిటీకి బిహారీదత్తు చేర్మన్ గా నియమింపఁబడుటచే నతనిపై మఱియొక క్రొత్తభారము పడెను. షికారువెళ్ళి తిరిగి వచ్చునప్పు డతఁడు మ్యునిసిపల్ కచ్చేరివద్ద నాగెను. ఆజిల్లాలోని యూరోపియన్ మేజస్ట్రీటు ప్రాతఃకాలమున షికారు వెళ్ళి తిరిగి వచ్చుచుండెను. అప్పుడు బిహారీదత్తు ఆయనను జూచి పలుకరించెను.

ఆజిల్లామేజస్ట్రీటునకు బిహారీదత్తుమీఁద నిష్టము, గౌరవము కలదు. అందుచేత నతడు గుఱ్ఱము దిగి మ్యునిసిపల్ కచ్చేరి పరీక్షించుటకును నించుక సేపు సల్లాపము సేయుటకును లోనికి వెళ్ళెను.

"దత్తూ ! ఈ నడుమ హిందూదేశమునందుఁ బ్రతిభాగమున గొప్పయుత్సవములు చేయుచున్నారని పత్రికలలోఁ జదువుచున్నాను కాదా ?"

"ఔనయ్యా ! హిందూదేశవాసులు కృతజ్ఞులు. వారి మేలుకోరుటకు పాటుపడు నట్టి యుదారశీలుని యెడఁ గృతజ్ఞులయి గౌరవ మెట్లు చూపవలెనో వారెఱుఁగుదురు. రిపన్ ప్రభువువలె జనులహృదయానురాగములు వడసిన రాజప్రతినిధి యీ దేశమున లేఁడు. అట్టి మహాపురుషుఁడు హిందూదేశము నుండి వెళ్ళిపోవుసమయము సమీపించుచున్నది. గావున ప్రజలు తమ విశ్వాసమును దగినవిధముగాఁ జూపఁగోరుచున్నారు"

"ఓ సరిసరి. మఱచిపోయితిని. నీవు రిపన్ పక్షపాతివిఁ గావా ?" యని నవ్వుచుఁ బలికెను.

"అయ్యా ! నేను రిప్పన్‌గారియెడ సంపూర్ణ పక్షపాతినిగాను. సగము పక్షపాతిని. ఏలయన నీమధ్య కలకత్తాలో రిపన్‌గారివిషయమున గొప్పగొప్ప యుత్సవములు జరిగినవి. అవి చూచుటకు వెళ్ళనైతిని కాని నేను నా పిల్లల నంపితిని. కలకత్తానగరములో నదివరకెన్నఁడు లేనివిధమున వీధు లలంకరింపఁబడెను. బాణసంచ కాల్పఁబడెను. దీపములు వెలిగింపఁబడెను. మాపిల్ల లుదయాస్తమయము లదేగోడవఁ జెప్పుకొందురు. వారిసంభాషణ విన మనకెంతో ముచ్చటగును."

"ఈ యుత్సవము లేల జరుగుచున్నవో మీపిల్లలకుఁ దెలియునా ?"

"అయ్యా ! ఏడేఁడ్లవయస్సుగల చిన్నపిల్ల నొకదానినిఁ బిలిచి ఈ యుత్సవము లెందుకని నేనడిగితిని. "ఎందుకా ? రిపన్‌ప్రభువు జనులయెడ దయగలవాఁడని, న్యాయవంతుఁడని, యీయుత్సవములు చేయుచున్నారు." అని యా పిల్ల సందేహింపకుండ నిట్టిబున నుత్తరము చెప్పెను. ఆయుత్సవము చూచిన మగవాఁడు కాని, యాఁడుదిగాని పసిబిడ్డగాని యీ కారణమేమో యెఱుఁగకుండ నుత్సవముఁ జూచియుండలేదు. అయ్యా ! పసిబిడ్డనోటనుండి వెడలిన యాముద్దుపలుకులు శిలాక్షరములై మాదేశచరిత్రము నలంకరించును"

"రిపన్ ప్రభువు నేఁడు మహానందభరితుఁడై యుండును, [illegible]. ఈ పట్టణమునకు సమర్థుఁడైన మ్యూనిసిపల్ చేర్మనునిచ్చి రిపన్‌ప్రభువు నా కుపకారము చేసినాఁడు. ఈ రిపన్‌ప్రభువువల్ల చేర్మనుల నెన్నుకొనుట కధికారమియ్యఁబడిన పట్టణము

యు బికి నబిహారిదత్తు ంటి సమర్థులనే యెన్నుకొన్న పక్షమున రిపన్ ప్రభువు చేసిన మ్యునిసిపల్ స్వపరిపాలనా వ్యవస్థ సంపూర్ణముగాఁ బ్రయోజనకారి కావచ్చును."

"మీకు నామీఁద దయగలదు గనుక నట్లనుచున్నారు. నా శక్యమైనంతపని శరీరము దాఁచుకొనక నేను చేయుచున్నాను. కాని, హిందూదేశజనులు పూర్వ కాలమున బుద్ధికుశలతయందుఁగాని సామర్థ్యమందుఁగాని కొఱవడినవారు కారు. ఇంగ్లీషుకళాశాలలలోను, తకాలలలోను మూఁడు తరములనుండి చదువుకొని విద్యా వంతులమైన తెలుఁగువారి సేవ ను మా దేశపరిపాలనావిషయములలో బోధ్యము కలుగఁజేసి కొనుటకు సమర్థులముకాక పా యిన పక్షమున నిజముగా నధమస్థితిలోఁబడి యుందుముఁ బనికిరానివారమై పోయితిమని నమ్మవలసినది."

"నీమాటకొంతవఱకు నిజమే. అధికకృత్యములు మీకు మేమప్పగించినకొలఁది మీవల్ల మేమధికమైనపని పుచ్చుకొనఁగలము. రిపన్ ప్రభువుగారి వ్యవస్థనుబట్టి యేర్పడిన డిస్ట్రిక్టుబోర్డులకు నెన్నుకొనఁబడి వచ్చిన సభ్యులందఱు పనిచేయుటకిష్టము గలవారై మిక్కిలి యుపయోగకారులై యున్నారని నేను చెప్పఁగలను."

"అంతకన్న నెక్కువమాట నే చెప్పఁగలను. రాజనీతిలో నిటువంటి యుదారభావ ప్రదర్శనము జనులమనములలోనున్న యసంతుష్టినిఁ దొలఁగించి హిందూదేశములో బ్రిటిషుసామ్రాజ్యమును స్థిరముగా సంస్థాపించును. మానవప్రకృతి యెల్లచోటుల నొక రీతిగానే యుండును. పరిపాలనలోఁ గొంతభాగము మా కప్పగించినయెడల మేము రాజభక్తిఁ గలిగి రాజ్యతంత్రనిర్వహణము చేయుదుము. అధికారము లేమియు మా కొసఁగక మమ్ము దూరముగఁ దోలినపక్షమున మేము రాజభక్తిశూన్యులమై విరుద్ధ విమర్శకుల మగుదుము. బ్రిటిషు సామ్రాజ్య చరిత్ర మనము చదివితిమా, దేశస్థులను వ్యవహారదూరులుగఁ జేసినప్పుడెల్ల రాజభక్తిశూన్యత, యసంతుష్టి బయలుదేఱిన పని మనము తెలిసికొనఁగలము. వారి దేశవ్యవహారములలో వారికిఁ గొంతభాగ మప్పగించినప్పుడు సంతుష్టి, రాజభక్తి మొదలగునవి తప్పలములై యుండును."

"దత్తూ ! నీ వింగ్లాండులో నున్న పక్షమున నీవు గొప్పవక్తవై వేదికలమీఁద మహోపన్యాసములు చేయఁగలవని నాకుఁ దోఁచుచున్నది."

"నేను మహావక్తను గాను. నేనెన్నఁడు నింగ్లాండు వెళ్ళియుండలేను. కాని, నాగరికత గల యే దేశములోను దేశస్థులచేతులలోఁ గొంతవఱకైన వారి దేశపరిపాలనము

లేకపోయిన పక్షమున నది మంచి దొరతనము కాదని నాయభిప్రాయము. దేశమున్న దేశపరిపాలనవిషయమున నది గొంత ప్రవేశ ముండినగాని యాదేశవ్యవహారములు చక్కగా సమర్థింపఁబడవని నానమ్మకము."

"ఇది ప్రశస్తమైన ధర్మవాక్యము. ఉదాహరణలు వ్రాసిన యే గ్రంధములో నుండియో నీవీమాట యేరి తెచ్చితివని నే నెఱుఁగుదును. వాదములు విడిచి యథార్థ విషయములు మాటాడుకొందము. మొగలాయిచక్రవర్తులు, మహారాష్ట్రులు హిందూ దేశసామ్రాజ్యము నిమిత్తము పోరాడుకొన్న కాలమునను, దొరతనము లేకుండ, నొకరిసెలవు లేకుండ నెవరికివారె యజమానులై పిండారిమూకలు దేశమును కొల్లగొన్న కాలమునను మీదేశములో స్వపరిపాలన ముండినదా?"

"పదునెనిమిదవ శతాబ్దమున హిందూదేశములో జరిగిన కార్యములను దలఁచుకొనకుము. ఏలయనిన యూరపుఖండమునందుఁగూడ నా కాలమున ననేకదేశము లట్లే యుండెను. కొన్ని మాదేశముకంటె హీనస్థితిలో నుండినవి. పందొమ్మిదవ శతాబ్దమున యూరపుఖండములోని దేశములస్థితిగతులు మునుపటికంటె బాగుండుటకుఁ గారణ మేమన, ప్రజాసంబంధములుగల ప్రభుత్వములు స్థాపింపఁబడుటయే. హిందూదేశములో మేముకూడ నటువంటి ప్రభుత్వమే కావలయునని కోరుచున్నాము కాని ధర్మగర్భితమైన నిరంకుశాధికార మంగీకరింపము."

"దత్తూ! నీవు తెలివిగల న్యాయవాదివి. నీవు గవర్నమెంటుప్లీడరుగా నుండి నా పనికి మిగులఁ దోడ్పడితివి. యూరపుఖండములోని దేశములు మిక్కిలి హీనస్థితిలో నున్నప్పుడు సైతము స్వపరిపాలన బీజములు కలిగియుండెను. అటువంటి బీజములు మీ హిందూదేశములో మొగలాయీలకాలమునను, మహారాష్ట్రుల కాలమునను నున్నట్లు నీ ఉదాహరణములు జూపఁగలిగితివేని నీవింతకంటె నెక్కువ తెలివిగలవాఁడవని నేనొప్పుకొందును."

"మాకు పూర్వము పార్లమెంటులు లేవు. జనప్రతినిధుల సంఘములు లేవు. డిస్ట్రిక్టుబోర్డులు లేవు. కాని దేశములో నున్న సేనాధిపత్యము, పరిపాలకత్వము మొదలగున గొప్పపదవులన్నియు హిందూసంఘనాయకులకును, మహమ్మదీయ సంఘనాయకులకును సమానముగా నియ్యఁబడుచుండెడివి. జమీఁదారులు వారిసంస్థానములను వారే సరిగాఁ బరిపాలించుకొనెడివారు. గ్రామపంచాయతీలు గ్రామవ్యవహారములను

జక్కఁబెట్టుచువచ్చి ... వి. చక్రవర్తి తన దర్బారులోఁ గూర్చుండి తెలివిగానో తెలివి
తక్కువగానో పరిప ... లించుచుండెడివాఁడు. అతని ప్రతినిధులు దేశమందలి నానాభాగ
ములను బరిపాలించ ... చుండెడివారు. మహాజనమంతియు బల్లెటూళ్ళలోనే యుండుచు
వచ్చినది. ఆమహాజ ... నము పంచాయతీ మూలమున తన వ్యవహారము తానే చక్కఁబెట్టు
కొనుచు వచ్చినది.'

"ఓహో! ... నీవు గ్రామపంచాయతీలమాట నెత్తుచున్నావా! నిజమే! మా ప్రభుత్వ
ములో గ్రామ పం ... చాయతీలు నశించిపోయినవని నేనప్పుడప్పుడు విచారించుచుందును."

"అయ్యా ... గ్రామపంచాయతి యనాగరిక పద్ధతి కావచ్చును గాని, ప్రపంచ
ములో మనుష్య ... లెఱిగిన స్వపరిపాలన లన్నిఁటికంటెఁ బురాతనమై పొగడ్తఁ గన్న
స్వపరిపాలన వ్యవ ... యని నిస్సందేహముగాఁ జెప్పగలను. ఈనవనాగరిక వ్యాప్తిచేతనది
నశించినది. కాఫ్ ... జనులు తమవ్యవహారములను దాము చక్కఁబెట్టుకొనుటకై దాని
స్థానమున దేశీయ ... కటువంటిపద్ధతి యొకటి మరల దలనూపవలెనని మేము కోరుటసహ
జము కదా! బ్రి ... టిషు ప్రభుత్వము మాదేశములోఁ బుట్టి పెరిగిన స్వజాతీయప్రభుత్వము
గాని మేమంతేఁ ... ంచుట కిష్టపడుచున్నాము. కాని, మీరు బ్రిటిషు ప్రభుత్వమును
విదేశీయ ప్రభుత్వ ... ముగాను, మాకింపరానిదిగాను జేయుటకై శక్తివంచన లేక పాటు
పడుచున్నారు. ... ఇట్లు మీరు చేసినంతకాలము బ్రిటిషు సామ్రాజ్యము మాదేశములో
దృఢముగా నుం ... డదు."

"ఇంగ్లీషు ... పరిపాలకులు మీ కోరికలను, మీ యభిప్రాయముల ననుసరించి నడుప
రని మీ య ... భిప్రాయమా?"

"... వారట్లు ... చేయఁదలచు కొన్నను చేయఁజాలరు. ఎందుచేత ననఁగా బ్రిటిషువారు
హిందూదే ... శములో జనులతోఁ గలసి మెలసి యుండక వేఱై యింగ్లీషు ప్రపంచములో
నుందురు. ఈలాగ ... న మీరే నాతోఁ ... చెప్పియున్నారు. వారు తఱుచుఁగా
గొప్పగొప్ప సెలవు ... లు తీసికొని మాటిమాటికి యూరోపుఖండమునకుఁ బ్రయాణములు
సేయుచు హిందూ ... దేశప్రజలతో నెంతమాత్రము గలసి మెలసియుండరు. వారిలో
నెక్కువ ... మందికి జన ... ంబులపై మిక్కిలి తక్కువసానుభూతి. వారిలో నధికసంఖ్యాకులకు
మాయభి ... ప్రాయము ... లమీఁద నల్పగౌరవము. ఇన్ని మాటలెందుకు? ఈ నాటియాంగ్లే
యోద్యో ... గస్థులు ప ... ర్వకాలమందుండిన మన్రో, మాల్కమ్, ఎల్ఫిన్‌స్టన్ మొదలగు పరి

పాలకులకంటె నెన్నోరెట్లు తక్కువవారై యున్నారు''

"ఔను ! మేము పూర్వ మున్నట్లుగాక నేఁటికాలము దారిఁబోవు పక్షుల వలె మీ దేశములో నివసించుచున్నామన్నమాట నిశ్చయము.

"అందుచేతనే హిందూరాష్ట్రముయొక్క కార్యనిర్వాహక సభయందును, దేశపరిపాలనయందును మాకు ముఖ్యపటికంటెఁ గొంత యధికారము [illegible]ండవలసిన యవసరము వచ్చినదని నావాదము. మేము బ్రిటిషుపరిపాలన మంగీకరించి యున్నాము. బ్రిటిషు ప్రభువుల యదృష్టమే మా యదృష్టము. అందుచేతనే పరిపాలనము స్వజాతీయమై యుండవలయును గాని, విజాతీయమై యుండఁగూడదు.''

"దత్తూ ! నీవిషయము నీవు కడుసమర్థతతోఁ జర్చించితివి. ఇది నీయభిప్రాయమే కాదు. విద్యావంతులైన మహాపురుషులయొక్క యభిప్రాయ ముం[illegible]యు నట్టిదే. నీవంటి పెద్దమనుష్యులు బ్రిటిషుపరిపాలనముతో నభేదభావమూని దానిలో నైక్యమొందిరనియు, బ్రిటిషుపరిపాలనము శాశ్వతముగా సాగుటవలన మీకుఁ గలిగెడు లాభము లేవో, తెలిసి అనుభవసిద్ధముగా మీరు మాట్లాడుచున్నారనియు నామట్టుకు నే నేనునమ్ముచున్నాను. కాని దత్తూ ! తమమీద నభిమానములేని మూర్ఖులు, మోట వాండ్రను పలువురు దేశమునందు గలరని నావలెనే నీవు నెఱుఁగుదువు.''

"దేశస్థులను గొప్పయుద్యోగములలోనికి రానియ్యక, ప[illegible]రిపాలనవిషయములు వారికందనీయక మీరు నిష్కారణముగా నటిమూర్ఖులకు, మోటవా[illegible]డకు వా[illegible] మూర్ఖత విడంబనమున కవకాశము కలిగించుచున్నారు. మీరు దేశస్థులయంద [illegible] విశ్వాస[illegible] ముంచుట వలన, వారిని నమ్ముటవలన మంచియుద్దేశము గలవారని, మతాభి[illegible] గాఢము [illegible] గలవారని సమాదరింపవచ్చును. [illegible] [illegible] వచ్చును. [illegible] [illegible] [illegible] [illegible] వచ్చును. అట్లుచేయుట [illegible] [illegible] [illegible] [illegible] పావును [illegible] రాజభ[illegible] [illegible] [illegible] [illegible] గౌరవహీనులఁ జేయుదురు. [illegible] రాజద్రోహము లైన [illegible] మాటలు [illegible] దరు. ఇదిసఱకెన్నఁడు [illegible] [illegible] [illegible] మీరే నిర్ణయిం చుకొందురు. నుంచివారి ద్రోహకులో, చెడ్డవారి ద్రోహకులో మీ యిష్టము. [illegible] యము వచ్చినది.''

ఆపలుకులు విని జిల్లామేజిస్ట్రేటు నిమిష మాగి యాలోచనపూర్వకముగాఁ మెల్లగ నిట్లనెను. "జతూ! నీ మాట సరి కాదని నేను నిశ్చయముగా జెప్పజాలను. ఇంగ్లీషువా రొక్కసారి మంచి పని యని దేనినైన భావించినప్పుడు వారు పట్టుదలతో దానిని తుదముట్టింతురు గాని వెనుకకు దిరుగరు. నాగలి చేతబట్టిరా చివరవఱకు వారు దున్నవలసినవారే. మీకు స్వపరిపాలన మవసర మని వారికి నచ్చవలెను. నచ్చెనా, వారి నాపజాలము. నచ్చువఱకు వారిని గదపజాలము. ఐనను నేనిది చెప్పగలను. హిందూదేశమునకు స్వరాజ్యము వచ్చితీరును. కాని యిది కాలక్రమమున బ్రాప్తించును. సరే! నేనింక వెళ్ళెదను, సలామ్. మా కచ్చేరి నేను తనిఖీచేయలేను. మాటలతో నాలస్యమైనది. నిన్ను జూచినతరువాత మాటలాడక పోజాలను. నీయొద్ద నేదో మంత్రమున్నది. నీవు నన్ను గలిసికొన్నప్పుడు నాకేపనియు దోచదు."

ఇరువది ఒకటవ ప్రకరణము

సామంతరాజు

మిధునపురమునుండి బయలుదేఱి రెండుదినములు ప్రయాణముచేసి యాబాలసాములు సువర్ణరేఖానదీతీరమును జేరిరి. ఈనది బంగాళాదేశమునుండి ఓఢ్రదేశమును వేఱుచేయుచున్నది. ఈనదికి నుత్తరమున నున్నవారు బంగాళీభాష మాటలాడుదురు. దక్షిణమున నున్నవారు ఓఢ్రభాష మాట్లాడుదురు. ఓఢ్రమనంగా సంస్కృతభాష పుత్రికలలో నొకటి. పదమూడవశతాబ్దమున నీనదికుత్తరమున నున్న దేశము పఠానులచే బరిపాలింపబడు చుండెను. కాని, నదికి దక్షిణమున నున్నదేశము పదునారవ శతాబ్దము తుదవఱకు హిందూరాజులయేలుబడిలోనే యుండెను. తర్వాత మహమ్మదీయు లుత్కలదేశమును జయించిరి. కాని వారు స్వల్పకాలముమాత్రమే పాలింపగలిగిరి. ఏలయన, పదునెనిమిదవశతాబ్దమున మహారాష్ట్రు లాభాగమును జయించి మరల హిందూరాజ్యమును నెలకొల్పిరి. పందొమ్మిదవ శతాబ్దమున బ్రిటిషువా రాదేశమును స్వాధీనము చేసికొనిరి. ఈ విధముగా గడచిన నాలుగుశతాబ్దములలో నీనదియొద్దనేల యనేక మార్పులను బ్రత్యక్షముగఁ జూచెను, ఓఢ్రులను, మహమ్మదీయులను, మహా

దీయులకు మహారాష్ట్రులకు, మహారాష్ట్రులకు బ్రిటిషువారికి జరిగిన సంగ్రామము లన్నియు నీప్రాంతముననె జరిగెను. ఈసరిహద్దులయుద్ధములు జరుపవలసినకాలము గతించినది. సువర్ణరేఖానదీజలము తన పూర్వగౌరవమును స్మరించుకొనుచు నడచుచున్నదియుంబోలె మెల్లమెల్లఁగా సాగరమున సంగమించుచున్నది. జగత్కిశోరరాయలు సపరివారముగ దాటుచున్న సమయమున నుదయకాలప్రభాకరుని యరుణారుణకిరణములు సువర్ణరేఖా జలములపైఁబడి తళతళలాడఁజొచ్చెను. జగన్నాథక్షేత్రము సమీపించినకొలఁది తైర్థికుల సంఖ్య క్రమక్రమముగ నధికమయ్యెను. ఉత్తర హిందూస్థానమునుండియు, బేహారుదేశము నుండియు దృఢశరీరులగు మనుష్యులును, బంగాళాదేశపు బల్లియలనుండియు బట్టణముల నుండియు గుంపులుగుంపులుగ స్త్రీలును, జగన్నాథము బోవుచుండిరి. హిందూప్రపంచము యొక్క దూరప్రదేశములనుండి స్త్రీలు పురుషులనక సమస్తవిధములైన జనులు సముద్ర తీరమందున్న యా క్షేత్రమునకు మందలుగఁ బోజొచ్చిరి. ఒకహస్తము నేకమాసముల వఱకెత్తి పట్టుకొని దానిలోని యెముక కొయ్యబారి చెయివాల్చుటకుఁగాని కదుపుటకుఁ గాని వీలులేని యవస్థలోనుండి రెండవ చేతితో సకలకార్యములు చేసికొనుచున్న యోగులు కొందఱు, జగన్నాథస్వామికి మ్రొక్కుకొని నడువక యే నేల యుదయము మొదలు సాయంకాలము వఱకు చాగిలంబడి సాష్టాంగనమస్కారములు చేయుచునే పందలకొలఁది మైళ్ళదూరము ప్రయాణముచేయు రోగబాధితులు కొందఱు, శరీ మందంతట బూడిదఁ బూసికొని పొడుగుజడలు తలలనుండి వ్రేలాడు తావళములు ద్రిప్పుకొనుచు నెవ్వరితోఁ బలుకక కన్నులు మూసికొనుచు ధ్యానముచేయుచు నయా చితముగా జనులుపెట్టు భిక్షములవలనఁ బొట్టఁబోసికొను భిక్షులు కొందఱు.

పండ్రెండు పదమూఁడు పదునాలవశతాబ్దములలో యూరపుఖండములో వ్యాపించియుండిన సమస్తనిష్ఠలు, సమస్తనియమములు, దేహపీడనములు, తపములు మొదలగునవన్నియు నేటికాలమున హిందూదేశములోఁ గానఁబడుచున్నవి. దీర్ఘ వ్యాధులవల్ల నొప్పులవల్లఁ జిరకాలమునుండి బాధపడు రోగులు, దగ్గఱచుట్టములను ప్రియబంధువులను గోల్పోయి దుఃఖపడుచున్న జనులు, దేహయాత్రయొక్క చరమా వస్థలోనున్న వృద్ధజనులు, హృదయకోశములయందు నిజవాంఛితములఁ గప్పిపుచ్చిన లేతకన్నియలు, పడుచుభార్యలు, బాధావిముక్తి నిమిత్తము, మోక్షము నిమిత్తము, మనోరథసిద్ధినిమిత్తము లండోపతండములుగ జగన్నాథక్షేత్రమును జేరుదురు. కారణ మెఱుఁగని యీ మూఢవిశ్వాసమును జూచి తత్త్వశాస్త్రపారంగతులు నవ్వవచ్చును.

కాని దుఃఖకాలములందును, దుర్గతులసమయములందును బహుశతాబ్దములనుండి యైకమత్యముగొలిపి మహాజనులను రక్షించినది విశ్వాసమే కాని తత్త్వశాస్త్రము కాదు. పూర్వచారిత్రములలో ప్రశస్తప్రకరణములని చెప్పఁదగిన మహోత్కృష్టకార్యములను మహాజనుల చేకముఖముగాఁ ద్రిప్పివేయించినది విశ్వాసమేగాని తత్త్వశాస్త్రము కాదు. గాలి సుఖప్రదముగా నుండినందున జగత్కిశోరుఁడు సపరివారముగా నది దాటి మధ్యాహ్నము కొంచెము సేపొకచోటమాత్రము విశ్రమించి యావద్దినము ప్రయాణము చేసెను. అరుణభానుమండల మస్తగిరిమీఁద నిలుచునప్పటికి వారు బాలసూరు పట్టణముఁ జేరిరి. ఇది యుత్కలదేశములో జగన్నాథమునకు వెళ్ళుమార్గమందున్న పట్టణములలో మొదటి గొప్పపట్టణము. ఈ పట్టణము బంగాళాఖాతమున కెంతో దూరములో లేదు. ఇక్కడి సముద్రపుగాలి మనోహరమై యుండునందున నిది నివాసయోగ్యమైన తావయ్యెను. అందుచేత బంగాళాదేశమందు మన్యపుజ్వరము వ్యాపించియున్న మండలములలోని ప్రజలు కొంచెము మార్పునిమిత్త మప్పుడప్పుడీ స్థలమునకు వచ్చుచుందురు.

అతిథిసత్కారతత్పరుఁడైన బాలసూరు జమీందారు పేరెన్నికఁ గన్న యాత్రికులను దనయింటికిఁ బిలుచుకొని పోయెను. అతిథిపూజయే హిందూగృహిణికిఁ బరమకర్తవ్యమని సనాతనధర్మము విధించుటచేత నాజమీందారుని రాణివాసపు జనము కిశోరరాయలతల్లికి భార్యకు లెక్కలేనన్ని యుపచారములు చేసిరి. ఆజమీందారుని రాణివాసపుస్త్రీల మాతృభాష యోఢ్రమైనను వారు బంగాళీ భాషఁగూడ మాట్లాడనేర్చిరి. కిశోరరాయలతల్లికి భార్యకు నోఢ్రముగూడ వచ్చును. అందుచేత రాత్రి ప్రొద్దుపోవు వఱకు రెండుభాషలలో యథేచ్ఛమైన సంభాషణ మంతఃపురములో జరిగెను. తరువాత నుత్కలదేశసాంప్రదాయసిద్ధమైన విందు పిండివంటలతో జరిగెను. కచేరిచావడిలో జమీందారు శరచ్చంద్రుని, జగత్కిశోరరాయలను విడియించెను. ఆసమయమునందే యుత్కలదేశ సంస్థాన ప్రభు వగు నొక సామంతరాజు జమీందారుని దర్శనము చేయుటకు వచ్చెను. ఉత్కలదేశము రెండుభాగములుగ విభజింపఁబడియున్నది. ఈ భాగములను నైసర్గిక స్వరూపములే సూచించుచున్నవి. బంగాళాఖాతతీరమున ననఁగా దూర్పు భాగమున నున్న సమభూములలో విద్యావంతు లయిన జనులు కాపురమున్నారు. వీరు ప్రత్యక్షముగా బ్రిటిషుపరిపాలనలో నున్నారు. పడమటివైపునఁ బర్వతమయ మైనయాటవిక ప్రదేశ మున్నది. అక్కడి జను లనాగరకులు. ఆదేశమును బ్రిటిషువారికి లోఁబడి హిందూసామంతరాజులు పరిపాలించుచున్నారు. ఈకొండరాజులలోనొకఁడు బాల

...రులో నున్న యూరోపియన్ మేజిస్ట్రేటు గారిదర్శనము చేయవచ్చి, పిమ్మట జమీందారునిఁ జూడవచ్చి, యచ్చట సాయంకాలమున జమీందారుతోడను, శరచ్చంద్రుని తోడను, జగత్కిశోరరాయుల తోడను, సంసల్లాపము లాడఁజొచ్చెను. ఆసియా ఖండవాసులు తాల్చు వంటి దుస్తులతఁడు ధరించెను. అతని తలపాగయున్నతమై యుపరంజి నగిషీపనులతో నిండి యుండెను. శరీరచ్ఛాయ నలుపు. కాని, విగ్రహము పౌరుషసూచకమై యుండెను. వయసుముదిరినవాఁడు నతఁడు విశేష దేహదార్ఢ్యమును గౌరవాస్పదమైన వర్చస్సును దాల్చి యుండెను. బంగారుపని జేసినదువ్వాలువలు ధరించి యతని కొడుకులిద్దఱుఁ దండ్రికిఁ జెరియొక ప్రక్కఁగూర్చుండ గది కావల చేతులలో వెండి కఱ్ఱలు దాల్చి స్వదేశసంస్థానప్రభువు యొక్క యంగరక్షకుల మఱియొకవిధమైన గర్వము పూని కొందఱు సేవకులు నిలిచి యుండిరి. క్రిందవాకిటిలో వెండిబొంగులు నెఱ్ఱటికుచ్చులు గలిగి మిక్కిలి డాబుగా నున్నపల్లకులు మెఱయుచుండెను. వాటి చుట్టును వాటిని మోయుబోయులు, సామంతరాజసేవకులు నిలిచియుండిరి. పూర్వపద్ధతి సిపాయిలు కత్తులు, డాలులు చేతఁ బట్టుకొనిరి రాజలాంఛన మగు వరుణఛత్రముదాల్చి కొందఱు, చామరములుదాల్చి కొందఱు ఠీవితో నిలువఁబడిరి. రాజుగారుతిరిగి ప్రయాణము చేయుటకుఁ గొందఱు చాకలివాండ్రు కాగడాలు సిద్ధముచేయుచుండిరి. కొందఱు సేవకులు చుట్టలు త్రాగుచు మాటాడఁజొచ్చిరి మఱికొందఱు కాళ్ళుఁ జాపుకొని వెల్లికిలఁబండుకొనిరి. జమీందారునిఁ జూడవచ్చిన యీ గొప్పరాజును చూడఁగానే వాని వృత్తాంతము కొంత తెలిసికొనవలె నని కుతూహలము పుట్ట జగత్కిశోరుఁ డిట్లనియె.

“రాజా! నీ ప్రజలు బ్రిటిషువారి దేశములలో నున్న ప్రజలవలె నుందురా? వారుకూడ నోఢ్రిభాష మాట్లాడుదురా?” అనవుడు సామంతరా జిట్లనియె. “అవును! నా ప్రజలలో ననేకు లోఢ్రులు. వారోఢ్రభాషే మాట్లాడుదురు. బ్రిటిషు వారి క్రింద నున్నయోఢ్రదేశములోని కాఁపులవలెనే నేల దున్నుకొని బ్రతుకుదురు. కాని, యతి దూరమున నున్న కొండలలోను నడవులలోను వెనుకటి యాటవిక జనులసంతతివా రున్నారు. వారి స్వాంతభాషలే వారు మాటలాడుదురు. వారి పూర్వాటవిక జీవనము నిప్పటికిని వదలిపెట్టరు. వారి గ్రామము లనఁగా నట్టడవులలోఁ గొన్ని గుడిసెల గుంపులు. వారి యాచారవ్యవహారము లన్నియు సృష్టి కాదియం దుండినవని చెప్పవచ్చును. నా సంస్థానములో విశేషభాగమున నాతండ్రి కాలమున నీయాటవికులే నివసించుచు నుండిరి ఇప్పుడు తక్కినచోట్ల యందువలెనే వారంతకంతకుఁ బలుచనగుచున్నారు.

ఏలయనఁ దమకంటె యెక్కువ నాగరికులగు పార్ధులు వచ్చి చేరచుండుటచేత నీయాటవికులు వెనుక వెనుకకు వనఁగా దట్టమగు నరణ్యములలోనికిఁ బోయి నివసించుచున్నారు."

"మీసంస్థానపరిపాలనము బ్రిటిషుదేశపరిపాలనమువంటిదే కాదా?"

"మేము బ్రిటిషువారిపరిపాలనమునే యనుకరించుచున్నాము. నారాజధానిలో నొక న్యాయస్థానము, నొక కచేరి, యొక పాఠశాల, యొకధర్మవైద్యశాల కలవు. కాని, మేము సాధారణముగ జనులను వారియిచ్చవచ్చినట్లు వదలివేయుదుము. వారు నెమ్మదిగా నడుచుకొన్నంతకాలము వారి గ్రామవ్యవహారములలో మేము జోక్యము కలుగఁజేసికొనము. వారివ్యవహారములలో మేము జోక్యము తక్కువ కలిగించుకొంటిమా వారి గ్రామపరిపాలన మిక్కిలి బాగుండును. మొత్తము మీఁద నెమ్మదిగలవారు. రాజానందు భక్తిగలవారు. కాని, మీసంస్థాన ప్రజలు కొన్ని సంవత్సరముల క్రిందట తిరుగుబాటు చేసిరని విన్నాము"

"ఔను! నిజమే ఆదులో కొంతవఱకు మాయుద్యోగస్థులదే తప్పు. వారు ప్రతిగ్రామమునుండి కొంతధాన్యము, కొన్ని పశువులు, పన్నుక్రింద మాకుఁ బంపుట యాచారము. మాయుద్యోగస్థులు వారు దున్నుకొనుచున్న భూములను గొలిచి ధాన్యమునకుఁ బశువులకుమారుగాఁ గొంతసొమ్ము పన్నుగా విధించి పుచ్చుకోవలయునని తలంచిరి. ఆదిమపద్ధతులయందే యభిమానము గలయజమానులకు మాక్రొత్తపద్ధతు లగత్యమైనవి కావు. పాప మావెఱ్ఱివాండ్రు తమవిండ్లు, నమ్ములుఁ దీసికొని తిరుగఁబడిరి. కాని పితూరీ వెంటనే యడఁగి పోయెను."

"అట్లయిన నేలకొలత మీరు మానుకొన్నారా యేమి?"

"మానుకొనలేదు. నాగరికులు కాఁపురమున్నచోట్ల నేలకొలత వేయించితిమి, వెనుకఁబడియున్న యామార్గులను వారిష్టమువచ్చినట్లు బ్రతుకనిచ్చుటే మంచిదని తోఁచినది. నానాఁటికి నవనాగరిక పద్ధతులు వానియంతట నవేవచ్చి దేశములలోఁ బ్రవేశించును. అతిబలవంతముగా వానిని దేశములోఁ బ్రవేశపెట్టుట లాభకరమని నేను తలంపను"

"మీరు చెప్పినది సరియైనమాట. బాలమూరు మేజస్ట్రేటుగారుకూడ మీయభిప్రాయమునే బలపఱచుచున్నారని కూడ వింటిమి. ఆయన తఱచుగా మీసంస్థానమునకు వచ్చి చూచుచుండునా?"

"ఆహా! సంవత్సరమున కొకసారిరో రెండుసారులో, ఆయన మాయందు మిక్కిలి యభిమానముగల పరిపాలకుఁడు. ఆయన మా సంస్థానమునకు వచ్చినప్పుడు మా మందిరములోని కాయనను నేను సంతోషపూర్వకముగా రానిచ్చి మా చెఱసాల, మా దర్బారు, మా యింటిలోని వాహనశాలలు చూపుచుందును. ఆయన మంచి వేటకాఁడు. ఆయనయు నేనును గలిసి కొన్ని సార్లు వేఁటలాడుదుము."

"మీరు సాధారణముగా తుపాకులతో వేటిని వేఁటాడి కొట్టుదురు?"

"అడవులలోఁ బ్రతిజాతిజంతువు కలదు. పెద్దపులులు మునుపటి యంత యెక్కువగా లేవు. కాని, చిఱుతపులులు సామాన్యముగాఁ గనబడుచుండును. ఎలుఁగుగొడ్డులు కనఁబడనిదినమె యుండదు. ఒకప్పుడు మేము వనవిజంతువుల వేఁటకై కాలినడకనే పోవుదుము. కాని సాధారణముగా మేము చెట్లలో దాగి యుందుము. అడవిమనుష్యులనేకులు గుంపుగా నిలిచియుండి గొప్పచప్పుడు చేయుదురు. అప్పుడు జంతువులు జడిసి పైకివచ్చి మా దృష్టిపథమునఁ బడును. నిరుడు మేస్త్రీటు చిక్కని యెలుఁగుగొడ్డు నొకదానినిఁ బట్టుకొని తెచ్చినాఁడు. దాని కూనలిప్పటికి నాయన యింటిలోనే యున్నవి."

"మీ పెద్దపిల్లవాఁడుకూడ మంచిగురిగల వేఁటకాఁడని నేను విన్నాను."

"ఔను! అతఁడు తుపాకి కడు నేర్పుతోఁ బట్టుకొనఁగలఁడు. కొద్దికాలములోనే యాతఁడు నేరుగాంచెను. అతఁడు కొంచె మింగ్లీషు నేర్చుకొనవలసిన దని నా కోరిక. ఈదినములలో దేశపరిపాలన కింగ్లీషు చాల తోడుపడును. మే మింగ్లీషువారి చట్టములను సూత్రములను నవలంబింపఁ దలఁచుకొన్నాము; గనుక ఇంగ్లీషుభాష వారిని దరిసి కొనుటలో మాకు మిక్కిలి సహకారి మగును."

"స్వదేశసంస్థానప్రభువులు ఇంగ్లీషుభాష నేర్చుకొన్న పక్షమునఁ జెడిపోవుదురని కొందఱనుచున్నారు."

"వారిని పాడుచేయున దింగ్లీషుభాష కాదు—కాని, యింగ్లీషుభాష ప్రజలకు రాజునకుఁ బరస్పరసంబంధము పోఁగొట్టును. ఒకరికొకరు దూరమగుదురు. యుక్తవయస్కులు కాని రాజకుమారులు కటకములో విద్యాభ్యాసము చేయుచున్నారు. అందుచేత వారనేక సంవత్సరములు సంస్థానములలో నుండకపోవుట సంభవించును. అందువలన

అందువలన వారు ప్రజలనడుమనుండి వారితోఁ గలసి మెలసి యుండరు. వారు యుక్తవయస్కులై మరల సంస్థానములకు వచ్చినప్పుడు ప్రజలకు వారు క్రొత్త; వారికి ప్రజలు క్రొత్త. ఇది మిక్కిలి శోచనీయము. మీరు కావలసినంత యింగ్లీషు వారికి నేర్పింపవచ్చును. ఎంతఎక్కువ చదువుకొంటే మన కంత మంచిది. కాని, నడుమ నడుమ సంస్థాన ప్రజలతోఁ గలసియుండు నట్లేర్పాటులు చేయవలెను. వారిమధ్యఁ గాపుర ముండవలెను. వారితోఁ గలసి మెలసి తిరుగవలెను. వారు తమ ప్రజలని తెలిసికొనవలెను. తెలిసికొని వారి కష్టసుఖములు తమవని భావింపవలెను. ఆపదలలో వారికొఱకై విచారింపవలెను. అట్లు చేయుటచేత రాజు ప్రకృతిజనరంజకుఁ డగును. శ్లాఘ్యపరిపాలకుఁ డగును. దయమాలి తిమా భయంకరులగు నాటవికులుకూడ లొంగిపోవుదురు.”

“ఈస్వదేశరాజులలో ననేకులు తమ ప్రజలమీఁద నిజమైనదయఁ జూపుదురని మీరు తలంతురా?”

“చూపుదురనియే నేను నమ్ముదును. ఉత్కలదేశములో నిరువదిసామంత రాజ సంస్థానములు కలవు. నేను విన్నదానినిబట్టి దాదాపుగా సంస్థానాధిపతు లందఱు ప్రజారంజకులే. రాజులు మార్పుల నవలంబించుటలో సాధారణముగాఁ జాగరూకతనముఁ జూపుదురు. అట్టివిషయములలోఁ గొంత బద్ధకించి వెనుకఁబడి యుందురు. అది మంచిగుణ మని నేను వాదింపనుగాని, క్రొత్తనిబంధనలు, నవీన పద్ధతులు నాగరికత లేనిమాయాదిమ ప్రజలకు భయము చిత్తక్షోభము గలిగించును. బ్రిటిషుదేశములో సంస్కరణ విషయమున మీరెంత తలబిరుసుగా వెళ్ళినను భయము లేదు. అనేకసహస్ర సంవత్సరములనుండి వచ్చిన ప్రాచీన నాగరికత కలది. విశేషించి మీకు నాఁటి మహోన్నతి మైనిక్యము విజ్ఞానము కలదు. మాసంస్థానప్రజలు తక్కినవారికంటె నవనాగరికులు. మేము మెల్లమెల్లగాఁ గదా మార్పులు చేసికొందుము. ప్రొద్దుపోయినది. ఇంక నాకు సెలవు దయచేయ వలయును.”

మరునాఁ డుదయమున జగత్కిశోరుఁడు సపరివారముగాఁ బ్రయాణ మారంభించెను. ఆనైరికమార్గమున రెండుదినములు నడచినతరువాత వారు పవిత్రమైన వైతరణీ తీరమును జేరిరి. ఈనది బ్రాహ్మణీనదితో గలసి గొప్పవర్షములు కురిసిన సంవత్సరమున నుత్కలదేశములో విశేషభాగమును వరదతో ముంచి యెత్తును. పడమటికొండలలోను మెట్టనేలలలోను బుట్టి యీ సంస్థానము నక్కుచెల్లించునవలెఁ బయనముచేసి సమభూముల లోఁబడి దొరలివాలి యొకచోఁ గలసి లోతును వెడల్పుగల యేకనదిగా నేర్పడి

వెంబడి పెక్కునదులు సాగరసంగమము జేయును. శీతకాలములో నీరింకునదులు సన్నమైపోవును చుట్టు విశాలమైన యిసుకతిన్నె యుండును. కాని, వానాకాలములో వర్షము లారంభింపగానే నదులు రమారమి యిరువదినాలుగు గంటలలో సంపూర్ణముగ నిండిపోవును. వెనుకటిదినమున బచ్చనిచేలతో నిండియుండిన ప్రదేశమంతయు మరునాడు సాయంకాలము జలమయమై సముద్రమట్లుండును. గొప్పవర్షములు కురిసిన సంవత్సరములందు గ్రామములు పల్లియలు వరదలతో మునిగియుండును. మందభాగ్యులైన యా గ్రామవాసులు స్త్రీలతో బాలురతో వృద్ధులతో మట్టిదిబ్బ లెక్కి, పచ్చిబియ్యముతిని, నీరు తీసిపోవునంతకు, వారిగుడిసెలు వాసయోగ్య మగునంతకు నానావస్థలపాలై ప్రాణసంరక్షణము చేసికొనుచుందురు. ఈ తూర్పుసముద్రతీరమందు ప్రకృతివైపరీత్యములు బలవత్తరములై బహుకష్టములు కలిగించుచుండును. అనావృష్టిసంవత్సరమున దేశమందు సగముభాగమున బంట లుండవు. మరుచటిసంవత్సర మతివృష్టిచేత గొంపలు మునిగి పొలములు జలమయములై మరియొకవిధమున బాటలుచెడి జనులు శ్రమపడుదురు.

జగత్కిశోరరాయులు వైతరణి బ్రాహ్మణితో సంగమించెడితావునకు మీదుగా నొకచోట వైతరణిదాటి పెద్దబాటవిడిచి కొంతకాలముత్కలదేశమునకు రాజధానియైన జాజిపురమును, జాండగోరి ప్రక్కబాటను మరలెను. వేయి సంవత్సరములనాటి శిల్పములు కొన్ని యా పట్టణమున గలవు. అవి దాని ప్రాచీనగౌరవమును జాటుచుండును. ఏకశిలతో జెక్కబడిన ఇంద్రాణీవిగ్రహము, కాళీవిగ్రహము, వారాహీవిగ్రహము నచ్చటగలవు. జగత్కిశోరునితల్లి భయభక్తులతో నింద్రుని రాణియైన నింద్రాణికి వరాహదేవుని భార్యయైన భూదేవికి, మహాశక్తియగు కాళికి నమస్కరించెను. ప్రస్తుతము శిథిలావశిష్టమైన యా ప్రాచీనపట్టణమందలి పెదయిల్లమీద గుడిసెలమీద నక్షత్రములు నిర్మలముగ వెలుతురు జిమ్ముచున్న యా రాత్రికాలమున నవనాగరికుడగు శరచ్చంద్రుడు సైతము గొప్పతనమెల్ల గోల్పోయిన విస్మృత ప్రాచీన సామ్రాజ్యము యొక్క యాశేషభగ్నముల నక్కజముపడిచూచుచు దీర్ఘాలోచనతత్పరుడై చాలసేపు వానియెదుట నిలువబడియుండెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

మఠములు — దేవాలయములు.

మరునాఁడు జగత్కిశోరుఁడు జాజిపురము విడిచి రాచబాట నెక్కి బ్రాహ్మణీ నదిని దాఁటి దినమెల్ల దీర్ఘప్రయాణము చేసి యుత్కల దేశమునందలి నదులలో మహానది యని చెప్పఁదగిన మహానదీతీరమును జేరెను.

పడమటికొండలలోఁ బుట్టి శిలామయములైన స్థలములలో నెంతవఱకుఁ బ్రవహించి పిమ్మట సమభూములలోఁ బడి మిక్కిలి విడివియైన యనంతరము రెండు పాయలైనది. ఈ రెండుపాయలనడుమనున్న ద్వీపమునందుఁ బూర్వకాలమునందే కేసరి వంశపు రాజు [illegible] కట్టెను. కటకము నాఁటనుండియు నుత్కలదేశమునకు రాజధాని యయ్యెను. ఆ కాలములో నుండియు నదిమట్టము కంటె నెత్తుగా నిరువదియడుగుల యెత్తుగల రాతికట్టు పట్టణము చుట్టు నొక్కవైపున నున్నది. వర్షకాలమునందు నదిపొంగి పట్టణముమీఁదఁ బడకుండ నీకట్టు కాపాడుచుండును. పూర్వపు హిందూరాజులచేతను మహారాష్ట్రులచేతను నిర్మింపఁబడిన యీ గొప్పకట్టు బ్రిటిషుగవర్నమెంటువారుగూడ జాగ్రత్తగాఁ గాపాడుచున్నారు. ఎట్టియన నగరరక్షణకదియే యాధారము. వర్షకాలమున వరదలు వచ్చినప్పుడు పలుమారులు [illegible] భయముతో గజగజ వణఁకుచు [illegible] చూచుచుండును. [illegible] గొప్ప [illegible] నీరు నెత్తుగా రాతికట్టు మునుఁగ వచ్చును. అప్పుడు జనులు మిక్కిలి [illegible] వేదనతో దినములు గడపి రాత్రి నలుజాములు కన్నులు మూయక కాచుకొని యుందురు. [illegible] మహానది [illegible]. అనేక శతాబ్దముల [illegible] హిందూరాజులు [illegible] నదికట్టు [illegible] చిక్కిన [illegible] వచ్చిన [illegible] రాజులు [illegible] నుండెను. [illegible] నగర [illegible] కాలేదు. కొన్ని దినములు [illegible] నగరమునందు [illegible] యుండెను. మిక్కిలి [illegible] మతము [illegible] ప్రవాహ [illegible] మార్గము [illegible]

బల్లియలలోను గల యిండ్లకప్పులను బళువులను బచ్చికలను సంగ్రహించుకొని సాగరముం బ్రవేశించును. నదియెంత త్వరగాఁ బొంగినదో యంతత్వరగాఁ దీసిపోవును. గత దినసాయంకాలమెంతో యపాయకరముగా నున్నది యొకప్పుడు మరునాఁడు తెల్లవాఱునప్పటికిఁ బూర్తిగాఁ దీసిపోయి నగరవాసుల కఖండానందము గలిగించును. వర్షకాలమున నతి భయంకరమై బహుదేశపరివ్యాప్తమైన యా మహానది శీతకాలపు సాయంకాలమున సన్నగలి ముసుగుగాఁ దనయిసుకతిన్నెయ పాన్పుమీఁద నిద్రించుచున్నదో యనునట్లు పాఱుచుండెను. జగత్కిశోరుఁడు సపరివారముగా నుత్తరమువైపు నుండి నది దాటెను. కటకపురమందు హరివల్లభబోసు నాయకపురుషుఁడు. అతఁడు పలుకుబడి యెక్కువ కలవాఁడనియు, ధనవంతుఁడనియుఁ బేరుపడయుటయే గాక యతిథి సత్కారమందు మితిలేనియభిలాష కలవాఁడని ప్రతిష్ఠ గాంచినవాఁడు. అతఁడుగూడ జగత్కిశోరరాయల కులమువాఁడే. దూరపుఁ జుట్టఱికముండిన నుండవచ్చును. అతఁడు వర్ధమానపు జమీందారును దనయింటఁ దప్ప మఱియొకచోట బసచేయనీయఁ దలఁచుకొన లేదు. అతని సేవకులు ముందుగానే యుత్తరపు గట్టునకుఁ బోయి పల్లకులమీఁదఁబడి మనుష్యులను దింపకయే యా పల్లకులను రేవుపడవలమీఁదఁ బెట్టించిరి. బోయలు నది దాటిన తరువాత మరలఁ బల్లకుల మోయంబోదఁగిరి. పురజనులను జూచినతోడనే తమయాయాస మానాటికి కడముట్టినదని సంతోషించుచు బోయలు మఱింత యుత్సాహముతో నోంకారధ్వనులు చేయుచుఁ బట్టణములోనికిఁ బోయిరి. అనుకొన్నవేళ వారు గమ్యస్థానము జేరిరి. హరివల్లభబోసు జగత్కిశోరరాయలను, శరచ్చంద్రుని స్వాగతపూర్వకముగ నాదరించి స్వగృహమును బ్రవేశింపఁజేసెను. అతని యింటి స్త్రీలుకూడ మిత్రకుటుంబము నందలి స్త్రీలువచ్చినప్పుడు నడపవలసినధర్మము మఱువక జగత్కిశోరునితల్లిని, భార్యను మిక్కిలి గౌరవముతో నెదుర్కొని లోనికిఁ దీసికొనిపోయిరి.

కిశోరరాయునితల్లి మంచి తెలివికలది. ఇంటివారిమాటలం బట్టి హరివల్లభుఁడు కొన్ని దినములవఱకుఁ దమ్ముఁ గూడ నుండుటకై నిలుపఁ దలఁచుకొన్నాఁడని గ్రహించి ముందుపడి హరివల్లభుఁడు తన్ను జూడవచ్చినప్పుడు మఱునాఁ డుదయమున తాను పూరి జగన్నాథమునకు వెళ్ళవలెనని చెప్పెను.

ఆమెకు హరివల్లభుఁ డిట్లనియె. "అమ్మా! మేము పూర్వపద్ధతిమనుష్యులము. మా మర్యాదలు కూడఁ బూర్వపద్ధతివే. మీ కుమారునివంటి, మీవంటి యతిథులు మమ్ము గ[illegible] మాగృహమునకు వచ్చుట [illegible] భాగ్యము కాదు.

చండబలిదేవునగ్గజ సాగరసంగమమునుఁ జేయును. శీతకాలములో నీరంతయు నదులు సన్న కాలువలైపోవును చుట్టు విశాలమైన యిసుకతిన్నె యుండును. కాని, జూలైనెలలో వర్షము లారంభింపఁగానే నదులు రమారమి యిరువదినాలుగు గంటలలో సంపూర్ణముగ మారిపోవును. వెనుకటిదినమున బిచ్చపుచేలతో నిండియుండిన ప్రదేశమంతయు మఱు నాఁటి సాయంకాలము జలమయమై సముద్రమట్లుండును. గొప్పవర్షములు కురిసిన సంవత్సరములందు గ్రామములు పల్లెలు వఱదలతో మునిగియుండును. మందభాగ్యు లైన యీ గ్రామవాసులు స్త్రీలతో బాలురతో వృద్ధులతో మట్టిదిబ్బ లెక్కి, పచ్చి బియ్యము తిని, నీరు తీసిపోవునంతవఱకు, వారు పడు నారోగ్యహానులకును నానావస్థల పాలై ప్రాణసంకటము పొసఁగొనుచుందురు. ఈ తూర్పుసముద్రతీరమందు ప్రకృతి వైపరీత్యములు బలవత్తరములై బహుకష్టకరములు కలుగఁజేయును. అనావృష్టి సంవత్సరమున దేశమందు సగముభాగమునఁ బంట పండదు. మరుచటిసంవత్సర మతి వృష్టిచేతఁ గొంపలు మునిగి పొలములు జలమయములై నానావిధములఁ బాటులుపడి జనులు శ్రమపడుదురు.

జగత్కళోరాజులు వైతరణీ బ్రాహ్మణితో సంగమించెడితావునకు మీఁదుగా నొకచోట వైతరణీనది కుడియొడ్డుపైని కొంతకాలము కళింగదేశమునకు రాజధానియైన జాజపురమును, జాజపురి ప్రసిద్ధముగా నున్నది. నేఁడు సంవత్సరములనాఁటి చిహ్నములు కొన్ని యీ పట్టణమునఁ గలవు. అవి దాని ప్రాచీనగౌరవమును జాటు చుండును. ఏకశిలతోఁ జెక్కఁబడిన చాముండావిగ్రహము, కాళీవిగ్రహము, వారాహీవిగ్రహము నచ్చటఁ గలవు. జగత్కళోయనతల్లి దయాదృష్టులతో సింహగమని రాణియైన ఇంద్రాణికి మహాదేవుని భార్యయైన పార్వతికి, మహాశక్తి యగు కాళికి నమస్కరించెను. గ్రంథము నామావశిష్టమైన యీ ప్రాచీనపట్టణమును దేవయోగినులనందఱు గుడిలో నిలిచి నక్షత్రములు నిర్మలముగ వెలుగుచుండ జగన్నాథుని యీ రాత్రికాలమున నమస్కరించుచు శరచ్చం ద్రుఁడు శ్రీము గొప్పతనము నెఱిగి, నన్ను విస్మృతి ప్రాచీన సామ్రాజ్యము నొక్క యీ శేషశక్తి గముల నక్కజమునఁ జిహ్నములు ప్రాచీనతత్వగర్భములై మాలసేవ నాఁటిదిగా నిలువఁబడియుండెను.

———

నతఁడు బోయి సోఫాపైనె చెట్టుక్రిందఁ గూర్చున్నప్పుడు కలువరేకుల నేలుకన్నుఁగవతో, ముద్దుగారు మొగముతో నను వారె వెంటవెంటఁ దిరుగు దినము లతనికి జ్ఞప్తికివచ్చెను. కాలక్రమమున నను వివాహితనై యుక్తవయస్కనై భర్తతోఁ గాపురము చేయ జొచ్చెను. ఈమె ధనపూర్ణమగు పుట్టినింటికి వచ్చినదనువార్త గ్రామమున వ్యాపించి నప్పుడెల్ల జనులావిడను జూచుటకై గుంపులు గుంపులుగా నామె పుట్టినయింటికడఁ గూడుచుందురు. ఆభాసురగాత్రి యుపదేశ స్మరించుటచేత, నాదీప మారిపోవుటచేత కాంచనగ్రగుని మనోవీధి యంధకారబంధుర మయ్యెను.

ఈశాన్యలదేశము యొక్క పశ్చిమ భాగమందలి కొండలలో శరచ్చంద్రుఁడు గుఱ్ఱ మెక్కి పయనము చేయుచుఁ బలువురు మిక్కిలి యనాగరికదశలో నాదిమ పద్ధతుల ననుసరించి బ్రతుకుచున్న యాటవికులగుడిసెలసమీపమున నుండి పయనము సేయు చనెను. రాత్రులు ఘోరతమస్సునకుఁ బుట్టినిల్లైన దట్టపు వెదురుపొదల నతఁడు పలుమారు ప్రవేశించెను. ఉన్నతమగు పర్వతము లెక్కి వానిశిఖరముల నుండి తన యెదుటఁ బటము పఱచినట్లు కనఁబడుచుండిన యీశాన్యదేశపు సమభూములలోని పట్టణములను, వనములను, నదులను జూచి సంతోషించుచుండును. దర్శనీయములైన యిటువంటితావు లతని కానందప్రదములయ్యెను. కటకములో నున్న కాలమున నతఁడు పట్టణమువదలి పడమటివైపున నున్న మెట్టనేలలుఁ జూచుకొన్కొని నతిదూరము వెళ్ళుచు వచ్చెను ఒకమాఱతఁడు ఢేంకనాల్ సంస్థానము ప్రవేశించెను. ప్రవేశించి యొక మెట్టనేలపై నిలిచి చుట్టుపక్కల నడవులతో నిండినకొండలు పచ్చని కనుమలు, పసిమిచాయలు వెదజల్లు పరిపాలకులు గలుగు ద్రవిని మహారంగమును జూచు నప్పటి కతనిహృదయ మదివఱకు కనేక వారములనుండి యనుభవించి యెఱుఁగనియొక విధమైన విశ్రాంతియు నానందము నతఁ డనుభవించెను. అంతేకాదు, అంతకంటె మఱియు లోపలిభాగమునకు వనములను గుట్టలను గడచి యరిగి హిందాల్ సంస్థానము నాసింగపూర్ సంస్థానము ప్రవేశించి, హిందూదేశమంతటిలో పేరువడసిన బర్మ్యాల్ కొండసడమఁ గూడఁ జొచ్చెను. మహానది టీకర్పర మొదలుకొని బర్మ్యాల్ నడుమ పాఱు నప్పుని కొండదాటిబడి ప్రవహించును. నదికిరుప్రక్కల వనములతో నిండిన కొండలు నిలువుగా గోడలు పెట్టినట్లు నిలిచియుండును. మయూరములు వనమందుఁ దరచుగాఁ గానఁబడు చుండును ఏనుఁగులు మొదలగు వన్యమృగములు దారితెరువు లేని యాయడవులలో నిరంతరము సంచరించుచుండును మనుష్య శబ్దము వినఁబడుటరుదు. పర్వతావృతమై నిర్మలజలసమేతమైన యామహానదీ ప్రాంతముల నెన్నఁడు మనుష్యుఁ

పడఁగొట్టిన జాడలేదు. బర్మాదేశపు కొండలు కొంతవెనుకకు వెళ్ళెను. అందుచేత నది యచ్చోట వెడల్పైనది. ఖలఖలయని స్రోతస్సు నాదముతోగన్న యొక్కయొక తత్పరిణామమున కలకలమనవృథ్వివన్నెల్లె ప్రవహించి సముద్రమును కలియుచున్నది. ఈనది యొద్దనే మహారాష్ట్రులు 1804 సంవత్సరమున బ్రిటిషువారితో గజపతి యుద్ధమునకు నోడిపోయిరి. ఈసందర్భములో నుత్కలదేశము మహారాష్ట్రులు గోలుపోయిరి.

హిందూదేశమునందు తప్ప వేరుమాసినదియు నుత్కలదేశమందు ముఖ్యమైనదియు, వేడుక పుట్టించునదియు నగు మతియొక స్థానముకలదు. అది ఖండగిరి. దానిమీద బౌద్ధవిహారములు, భువనేశ్వరుని యాలయములుగలవు. జగన్నాథుని తల్లియౌ దేవాలయములఁ జూడఁగోరినయెడల హరిభక్తిభూయిష్ఠమగు పయనముచేసి వారినక్కడికి బంపెను. అది కటకమునకు దక్షిణమునఁ గలదు. మైళ్ళదూరములో నున్నది రెండువేల సంవత్సరముల క్రిందట నుండి హిందువుల స్థానమునఁ గలదు. జైనబౌద్ధమత యశోధరులు బంగాళాదేశమును విస్తరించిన ప్రాచీన సామ్రాజ్యమునందుండినప్పుడొ నెను. అతఁడు శ్రీకృష్ణదేవరాయల కాలములో, నాటిబౌద్ధాశ్రమములు, భిక్షుకులు మహావ్యక్తి చేయఁదలంచి యీదేశమునఁ జొచ్చి నేటివఱకు నిలిచియున్న యాలయము లెన్నిఁటిని నిర్మించిరి. అక్కడనున్న గుహలు మొదలుకొని చిన్నగుహలెన్నో కొండలలోఁ ద్రవ్వఁబడియున్నవి. ఇవి పూర్వకాలపు జైనులు తమ తపస్సుచేయు నేకాంత శ్రమములై వాసస్థానములు. వీని ప్రక్కనే గణేశగుంఫ మొదలైన విశాలగుహలు కలవు. ఇవి పూర్వకాలమున బౌద్ధులు సభలుగాఁ గూడి యారాధనలుసలుపు స్థలములు. ఇక్కడ రాణీనూరుల రాతిమహలొకటి కలదు. దానిపేరు రాణీనూరు. దీనిలో నెన్నో గదులున్నవి. ఎన్నో పంచపాళులున్నవి. తలుపులమీదఁ జాతిబొమ్మలెన్నో, చెక్కఁబడియున్నవి. ఈమహా హిందూదేశములోఁ బూర్వకాలమున వ్రాయఁబడియుండిన శిల్పులయొక్కయు, చిత్రకారుల నిర్మాణాలయొక్కయు, ప్రజ్ఞావిశేషంబుల నేటి నాగరకులకు నయితము సాటిచేయుటకు నిలిచియున్న ప్రతిమాకృతులవలె భాసిల్లుచున్నది. పాడుపడిన యీ బౌద్ధవిహారములలో చాలసేపు తిరిగి యక్కడనుండి భువనేశ్వరదేవాలయములు చూచుచున్న స్త్రీలు వానిని రమ్మని ప్రస్తావన ముంచిరి. అందుచేత నతఁడు వెడలిపోయెను.

ఈ భువనేశ్వరమందే సింహవంశపురాజులు నివసించిరి. ఇట్టి మహోన్నతమైన స్థానములుండబట్టియే వారుత్కలదేశము నైదవశతాబ్దము మొదలుకొని పండ్రెండవ శతాబ్దమువఱకుఁ బాలింపఁగలిగిరి. వారి రాజధానియగు భువనేశ్వరము ప్రాముఖ్య

హిందూదేశమునం దా కాలమునందున్న నగరములకు శిరోమణియై యుండవచ్చును. అక్కడి దేవాలయములలో గొప్పది ఏడవశతాబ్దమునఁ గట్టఁబడెను. ఇంకను వందలకొలఁది చిన్న దేవాలయములున్నవి. ఇందులో కొన్ని పాడుపడకుండ మంచిస్థితిలో నున్నవి. ఇవియెల్ల రాజవంశస్థుల ప్రతాపమును గొప్పతనమును ఘోషించుచున్నవి. ఈనాఁటి తైర్థికులు బాటసారులు పాడుపడి యున్న నీ పట్టణమును మిక్కిలి యక్కజంపడి చూచి పారములేని పరిశ్రమతోడను, నిరుపమానమగు నేర్పుతోడను మలచఁబడి చిత్రింపఁబడిన రాతిపలకలతో నిర్మింపఁబడినట్టియు నూఱడుగులయెత్తునను రెండువందల యడుగుల యెత్తునను నేకశిలాఫలకములచేతనే యమర్పఁబడిన పైకప్పు కలిగినట్టియు బురాతన మహాభవనముల యెట్టయెదుట నోట మాటలేక నివ్వెఱపడి నిలిచి యుందురు.

ఆఁడువాండ్రా మహాదేవాలయముయొక్క యంతర్భాగమును జొచ్చిరి. భువనేశ్వరుఁడైన భువనేశ్వరునకు నేటికిసయితము యథావిధిగాఁ బూజానమస్కారములు జరుగుచున్నవి. ఆలయమునందలి మహాగోపుర మొక్కటి మహోన్నతమై యున్నది దాని మీఁద విగ్రహములు విశేషముగా చెక్కఁబడి యున్నవి ఒక్కొక్క రాతిమీఁద నొక్కొక్కవిధమైన చిత్తరువు చెక్కఁబడి యున్నది శిల్పిహస్తకౌశలము, బుద్ధికుశలత దెలియఁజేయుని విగ్రహ మొకటైనను లేదనుట యతిశయోక్తి కాదు.

అప్పుడు జగత్కిశోరునితల్లి శరచ్చంద్రునితో నిట్లనియె. "ఇది దేవాలయముల పట్టణమని నాకు దోఁచుచున్నది. ఈలాగున కట్టగలవారు దేవతలుగాని మనుష్యులు కారు. ఇటువంటి రాతిగుళ్ళు మన బంగాళాదేశములో విశేషముగా లేవు."

అనవుడు శరచ్చంద్రుఁ డిట్లనియె: "ఈ పురాతనపట్టణ మిటువంటిమహోన్నత దేవాలయములతో నిండియుండుటకు మనపూర్వులయొద్ద నతిమానుషమైన యుత్సాహము నతిమానుషమైన ప్రజ్ఞ యుండి తీరవలయును. అమ్మా! పూర్వులు జన్మమున కేదో పరమార్థము పెట్టుకొని యుండెడివారు. దేవాలయము కట్టించుటో, సత్రము వేయుటో, సరోవరము త్రవ్వించుటో వారిపరమార్థము. ఈ దినములలో మనమందరము పరమార్థమేమియు లేక బ్రతుకుచున్నాము."

"నాయనా! నీ మాట నిజము. విశ్వాస మున్నవారు విశేషకార్యములు చేయగలరు. ఇటువంటి యాలయములు కట్టించినరాజులకు దేవతలు తప్పక సహాయము చేసెడి

వారు. బిడ్డలారా! పడుచువాండ్రును దేహదార్ఢ్యము కలవాండ్రును జన్మములు చరితార్థములగునట్లు పరమార్థమునిమిత్తమై పాటుపడుఁడు. విశ్వాసముంచి యేదో పరమార్థము చేయవలెనని సంకల్పించుకొనుఁడు. అదే గురిగాఁ బెట్టుకొని పనిచేసిన పక్షమున మీ దేశమునకు మీరుకూడ నీదినములలో సయితమేదో కొంత యుపకారము చేయఁగలరు."

ఇరువదిమూఁడవ ప్రకరణము.

ప్రతిజ్ఞ.

జగన్నాథక్షేత్రమునకుఁ గడపటి మజిలీయైన కటకపట్టణమునుండి జగత్కిశోరరాయలు సపరివారముగా బయలుదేఱినప్పటికి మేఘాచ్ఛాదనములేని శీతకాల సూర్యమండలము వ్యాపారబాహుళ్యముచేత జనసమ్మర్దమధికముగాఁ గలిగిన యా నగర వీధులలోఁ దేజఃపుంజమువెదజల్లి మెఱయుచుండెను. వారుమహానదియొక్క దక్షిణపుపాయను దాటిరి. ఈ పాయ కొన్ని మాసములక్రిందఁ బొంగి దేశమును ముంచిపెట్టి ప్రస్తుతము చిన్న చిన్న కాలువలుగామాఱి రెండడుగుల లోతైనలేక యిసుకనదియని చెప్పఁదగి యుండెను. గుఱ్ఱములు, పల్లకులు రేవుపడవ సాయముక్కఱలేకయే నదినిదాటి, జగత్ప్రసిద్ధికెక్కిన పూరీక్షేత్రమునకును, నదీతీరమునకును గల యిరువదిమైళ్ళమార్గము ప్రయాణము చేయునప్పుడు దేశాచారమునుబట్టి యామధ్యనొకచోట మంచిబోయలను పెట్టిరి. మధ్యాహ్నము నడిదారిలో భోజనమునిమిత్తము కొంతసేపాగవలసివచ్చినను మొత్తముమీఁద సాయంకాల మగునప్పటికి బాటసారులు తమ గమ్యస్థానమును జేరఁగలమనినమ్మి యుండిరి.

హిందూదేశముయొక్క ప్రతి భాగమునుండి వచ్చునట్టి తైర్థికుల సంఖ్య క్షేత్రము సమీపించినకొలఁది యడుగడుగున కధికము కాఁజొచ్చెను. వర్షకాలములో నెనఁగా జగన్నాథస్వామివారి రథోత్సవసమయమునఁ బ్రతిదినము వేల కొలఁది మనుష్యులీదారిం బోవుచుందురు. ఆయుత్సవసమయమునఁ గాలస్థితి బాగున్న సంవత్సరములలో రెండు మూఁడులక్షలమంది జనులు చేరుదురు. తక్కిన ఋతువులలో జనసంఖ్య యంతవిశేషముగా నుండదు. కాని పన్నెండు మాసములలోను ముఖ్యముగా మనోజ్ఞమైన శీతకాల

మందు తైర్థికప్రవాహ మెండిపోక యేదోవిధముగాఁ బ్రవహించుచుండును. దూరమండలములనుండి స్త్రీలు, పురుషులు, రోగులు, భోగులు, భిక్షుకులు, బైరాగులు, కుంటివాండ్రు, గ్రుడ్డివాండ్రు, పిన్నవాండ్రు, పెద్దవాండ్రు, దేహము చాలించులోపల నెన్నడో యొక్కసారి చూచితీరవలయునని కోరుచుండెడి జగన్నాథ క్షేత్రమునకు నెట్టెటో కాళ్ళీడ్చుకొని నానాశ్రమలు పడి పోవుదురు. విదేశప్రయాణము, నూతనస్థలదర్శనము మొదలగునవి నేటికాలమున యూరపుఖండములో మతసంబంధము విడిచి లౌకికవ్యవహారములోఁ జేరిపోయినవి కాని హిందూదేశములో నిప్పటికినవి మతముతో నవినాభావమును బొంది జనులకు విధిచోదిత ధర్మములుగా నేర్పడినవి.

మధ్యాహ్న భోజనము నిమిత్తము విశ్రాంతినిమిత్తము జగత్కిశోరుఁడు సపరివారముగ బాటప్రక్కనున్న యొకయంగడిలో విడిసెను. పేదబాటసారు లట్టి విశ్రమస్థానముల నపేక్షింపరు. వారు చెట్టుక్రిందనే బ్రోయిఁ బెట్టుకొని యొకగంటలో నిత్తడిపాత్రతో గాని కుండలో గాని కావలసినయన్నము కూరలు వండుకొని తిని తిరిగి పయనము చేయుచుందురు. వాయవ్యమూలనుండి వచ్చు దృఢకాయులగు తైర్థికులు తరుచుగా నన్నమే వండుకొనరు. గోధుమపిండి పెరుగుతోడనో, పాలతోడనో గలిపి భక్షించి సంతుష్టులగుదురు. ఒకగంటలో వంట మొదలైన యెల్లపనులు ముగియును. వంటకుండ లోపలఁ బాఱవేయుదురు. బ్రోయిలో నిప్పైనసరిగా నారిపోకమునుపే మూటలు ముల్లెలు భుజముల వేసికొని, కడపటి మజిలీ నుండి జగన్నాథక్షేత్రమునకు బోవుపట్టు మరల నెక్కడ బసదిగక యన్నపానములమాట దలపెట్టక తలవంచికొని యేకదీక్షతోఁ బయనము చేయుదురు.

అట్లు చనుచున్న తైర్థికులకు గొన్నిమైళ్ళదూరమునందే లోకానందకరమైన జగన్నాథస్వామివారి గోపురశిఖరము నేత్రపర్వమహత్తమై గానఁబడెను. అప్పుడు పవిత్రులైన తైర్థికులు ముందుకడుగు పెట్టక నిలిచియుండి చిరకాలమున లబ్ధమైన యాదేవాలయముయొక్క ప్రథమదర్శనమైనందునఁ బరమానందభరితులై తమ సంకల్పము [illegible]నందుకు జగన్నాథస్వామికి జయము, జయమని కేకలు వేయుదురు. ఆధ్వని నలుప్రక్కల నిండి మిన్నువయిన ట్లగయును. తమ సన్నకంఠములతో స్త్రీలుకూడ సానందపారవశ్యమువనే కేకలు వేసి ధ్వనిని స్థూలము చేయుచుండిరి. జగత్కిశోరునితల్లియు భార్యయు తాము ఘోషాస్త్రీలన్నమాట మఱచి సాంప్రదాయవిరుద్ధముగాఁ బల్లకితలుపు లంచుకొని తెఱచి జగన్నాథస్వామి వారిగోపుర శిఖరము [illegible] స్వామిని [illegible] గొంటు

కతో వేఁడుకొనిరి. బంగాళదేశమునుండియు, ఉత్తరహిందూస్థానమునుండియు, బహు దూరములనుండియు, బహుమాసములనుండియు, దీర్ఘప్రయాణములు చేయుచుండిన మనుష్యులు తమపూర్వజన్మపుణ్యములు ఫలించిన వనియు, దమకోర్కె తీఁగెలు చిగిరించిన వనియు నమ్మి సంతోషింతురు. ఏలయన మనసారదర్శింపఁగోరిన పరమేశ్వరుఁడు దూరమున గోపురశిఖరములోనుండి కనబడుచు దమమార్గాయాసము నపనయించుచున్నాఁడని వారు భావించుచుందురు. జగన్నాథస్వామికి జయము జయ మను కేకలు నాఁటి నాఁటికి భూనభోంతరములు నిండునట్లు వ్యాపించెను. అదిమొదలు శరచ్చంద్రుఁడు తనమనసు పట్టలేక పరుగు మాన్పించి గుఱ్ఱమును మెల్ల మెల్లగా కేకలువేయుజనుల గుంపునడిమికి దీసికొనిపోయి యాయానందము తానుగూడ ననుభవింప జొచ్చెను. దేశమందలి కోటానుకోట్లజను లనేకమతస్థులుగా నేకజాతిగా యాలయమునే చేసినపక్షమున, దేహయాత్ర జరుపు మానవకోటి యొద్దారిం దెలిసికొన లేక యజ్ఞానాంధకారమున దడవులాడు కొనుచుండుటకో యట్టి యఖండతేజస్సు యొక్క నూఱుమూల కిరణము లైన వారివ్యాప యములలో ప్రవేశపెట్టగలిగినలక్ష్యమున హిందూ [illegible] దేశాభిమానము [illegible] నిత్యప్రయోజనములు కావని శరచ్చంద్రుఁడు తలంచెను. "జగన్నాథ జీకీ జయ్" యను కేక తైర్థికుల కంఠముల మీద నొకచిత్రమైనపల్లవి యయ్యెను. ఎట్టకేలకు వారు జగన్నాథముసమీపమున నున్న క్రొత్తవంతెనమీఁదికిఁ వచ్చునప్పటికి జయజయ ధ్వనులు బయలుదేరెను. మహానందముతోడను, సంతుష్టితోడను వారు పట్టణముఁ బ్రవేశించు నప్పటికి సంధ్యాకాలచ్ఛాయలు నలుదెసలు వ్యాపించెను.

పూరీపట్టణము రాకముందే జగత్పురిలో రాయుల పరివారమును గొందఱు పండాలు కలిసికొని వారివృత్తాంత మడిగిరి. వేలకొలఁది పండాలు జగన్నాథ క్షేత్రముచుట్టుఁ దిరుగుచుందురు. వీరిలో గొందఱు క్రమముగా విశేషదూర ప్రయాణము చేసి తైర్థికులను వెంటఁబెట్టుకొని వత్తురు. [illegible] మాకు రావలెనని వారిలోవారు [illegible] ఇట్టి [illegible] రాయుల విషయమునఁగూడ జరిగెను. [illegible] నుండి [illegible] జగత్పురిలో [illegible] [illegible]

జెప్పి వారిచుట్టములలో నెవ్వరెవ్వరు జగన్నాథయాత్ర చేసిరో వారిపేరు లుగ్గడించి తన కుటుంబమునకు వారి కుటుంబమునకుఁ గల సరియైన సంబంధము చెప్పి తన కెక్కువ యధికార మున్నదని స్థిరపరిచి యా పావనక్షేత్రమున వా రున్నంత కాలము వారిం దానే కనుగొనుటకు సమ్మతించి వారిం దన యధీనము చేసికొనెను.

గవర్నమెంటువారి చట్టము ప్రకారము లైసెన్సు చేయఁబడిన గృహములలోనికి సామాన్య తైర్థికులను సామాన్యులైన పండాలు తీసికొని పోవుదురు. భాగ్యవంతుఁడైన వర్ధమానపు జమీందారుని విషయమున నట్లుగా లేదు. పురవాసియొకఁడు విశాలమైన తన భవనమును జమీందారుని యుపయోగము నిమిత్త మిచ్చివేసెను. మఱియొక పండావచ్చి తన న్యాయమైన హక్కును హరించికొని పోకుండునట్లు పండాబ్రాహ్మణుఁడు రాత్రి యంతయు నక్కడనే పండుకొని తిన్నగా నిద్రింపఁ జాలఁడయ్యెను.

జగత్కిశోరరాయుని తల్లిమాత్రము నిద్రబోలేదు. పూజ్యురాలైన యా యవ్వ కాళితోఁ గలసి దీపముదగ్గఱ గూర్చుండి శరచ్చంద్రున కిట్లనియె. "నాయనా! నా కొక్కమాట చెప్పు? నీవు వెనుకటి సంగతు లెఱుఁగుదువు. ఈ గొప్పగుడి యెప్పుడు కట్టినారో చెప్పు? మహామాయమున సముద్రతీరమున జగన్నాథస్వామి యేల వెలసినాఁడో యా కారణముగూడ చెప్పు? నేనీ రాత్రి నిద్రపోను. జాగరము చేసెదను. నీకుఁగూడ నిద్ర సరిగా రాదని నేనుఁ దలఁచెదను. ముసలమ్మకోరిక తీర్పుము. జగదీశ్వరుఁడైన జగన్నాథస్వామివారి వృత్తాంత మంతయుఁ జెప్పుము."

ఆమెకు శరచ్చంద్రుఁ డిట్లు బదులుచెప్పెను. "ఆ కథలు నాకంత బాగుగా దెలియవు. భువనేశ్వరుఁడను పేరుగల శివు నారాధించు నుత్కలదేశ ప్రభువులు సింహవంశపు రాజులు కట్టించిన భువనేశ్వర దేవాలయములు చూచితివిగదా? అవి యంతకంటెఁ బ్రాఁతవి. సింహవంశపురాజుల యనంతరమున గంగవంశపురాజులు సింహాసన మెక్కి యీ దేశమేలిరని చరిత్ర చెప్పుచున్నది. కాని వారు విష్ణుభక్తులు. ఆ వంశమందలి మొదటి రాజులలో నొకఁడీ కోవెలఁ గట్టించెను."

"అదెప్పుడు నాయనా! ఈ మహాదేవాలయమును గట్టించి పుణ్యము గట్టుకొనిన యా గొప్పరాజు పేరేమి?"

"అనంగభీముఁడని యతనిపేరు. అతఁడు రమారమి యేడువందల సంవత్సరముల క్రిందట సింహాసన మెక్కెను. జగన్నాథుఁడైన విష్ణుదేవుఁడా రాజునకు స్వప్నములోఁ

గనఁబడి యుత్కలదేశపు రాజధానీనగరములను విడిచి దక్షిణముగా సముద్రతీరమునందలి యిసుకనేలలకు బయనమై పోవలయుననియు నక్కడఁ దనకొక గుడి కట్టింపవలసిన దనియు నాజ్ఞాపించినట్లొక కథ గలదు. ఆనందభీముఁడు భగవంతుని యాజ్ఞ శిరసావహించి యీగుడి కట్టించెనఁట. ప్రాచీన రాజధానులు క్రమక్రమముగాఁ బాడుపడియెను. శివునియెడ భక్తి నానాఁటికి క్షీణించెను. క్రొత్తకోవెలయైన జగన్నాథస్వామి యాలయము, విష్ణుభక్తి, కాలక్రమమున నభివృద్ధినొందెను."

"శివుఁడు, విష్ణుమూర్తి యనునట్టివి వట్టి నామభేదములే గాని భగవంతుఁడొక్కఁడే. ఏ పేరుతో మనము బూజించినను బూజ నందుకొనును. పుణ్యక్షేత్రములలో నగ్రగణ్యమైన వారణాసిలో నేటికిని శివపూజయే జరుగుచున్నది. అక్కడ మీతల్లి చరమదినములు గడపఁదలఁచుకొన్నదికదా! అక్కడ ముఖ్యదేవాలయములన్నియు శివాలయములే. ఇక్కడ పూరీలో కోవెల విష్ణుకోవెల. దేవుఁడు విష్ణుదేవుఁడే. జగన్నాథస్వామి యను పేరుతో నున్నాఁడు. నేనేమియుఁ దెలియని యాఁడుదానను నాయనా! కాని తెలిసినవారు శివుఁడు, విష్ణుమూర్తి, యొకటేయని నాతోఁ జెప్పినారు. అతనికే యెన్నో పేరులు పెట్టి జనులు పూజింతురు."

"అమ్మా! ఆ తెలిసినవారు చెప్పినది నిజమే. ప్రపంచమందలి యెల్లజాతులు సమారాధించునట్టి భగవంతుఁడొక్కఁడే కాని యజ్ఞానముచేత మనుష్యులు నామభేదములను గ్రహింపక యొకరినొకరు జంపుకొని రక్తములు ప్రవహింపఁజేసిరి."

"నాయనా! పుణ్యాత్మురాలైన మీతల్లి హృదయము వారణాసిమీఁదనే యుంచి యా పుణ్యక్షేత్రములోనే దినములు గడప నిశ్చయించుకొన్నది. మనము చక్కగా దేహయాత్ర గడపి ప్రపంచవ్యవహారములలోనుండి, సంసారపు గొడవలలో నుండి మరలవలసిన కాలము వచ్చినప్పుడు మన శాస్త్రములు విధించిన ధర్మమిదే. జగన్నాథస్వామి నా కుమారున కెప్పటియారోగ్య మిచ్చువలె నాయనా! విధేయురాలైన మా కాళిని బిడ్డలతల్లిజేసి దానియిల్లది దిద్దుకొనునట్లు చేయవలెనాయనా! భూలోకములో నేను జేయవలసిన పని యయిపోయినది. ఎంతెయైన జీవితశేష మీక్షేత్రమునందే గడపఁ దలఁచి స్వామివారి యిష్టప్రకారము నడుచుకొన్న పక్షమున జగన్నాథదేవుఁడు నామొఱ భక్తురాలిగా నంగీకరించునేమో!" ఈచిట్టచివర మాటలో నున్న గభీరమైన యర్థము విచారించి కాళి వడఁకెను.

మఱునాఁడుదయమునఁ దూర్పుదిక్కున భానుమండలము ప్రభావంతమై యుదయించి వెలయఁజొచ్చెను. సూర్యోదయము కాఁగానే యాలయము యొక్క కవాటములు తెఱువఁబడెను. తెఱచినతోడనే తైర్థికప్రవాహములు పావనావరణములోఁ జొఱఁబడెను. అది విశాలమైన చతుర్స్థలము. పొడవు వాఱువందల యేఁబదియడుగులు. వెడల్పాఱువందల ముప్పదియడుగులు. ఆయావరణము నిండ నెన్నో చిన్న దేవాలయములు, దేవతాపీఠములుకలవు. వాటినడుమ కైంకర్యములుజరిగెడు భోగమండపముతోడను గానవినోదములుజరిగెడు నాట్యమందిరముతోడను, తైర్థికులు గుమిగూడునట్టి జగన్మోహనమందిరముతోడను, జగన్నాథస్వామివారి విగ్రహములుండెడి విమాన మనియెడు గర్భగుడితోడను మహాలయము భాసిల్లుచుండెను. సంవత్సరమున కొకసారి రథోత్సవ కాలమున నీవిగ్రహములు కోవెల విడిచి వసంత మైత్రావనమునకుఁ దీసికొని పోఁబడును. ఉత్కలదేశ సామంతరాజులు కలపఁ బంపుదురు. ఆ కలపతో మూఁడు గొప్పరథములు కట్టఁబడును. సంపన్నులగు భక్తులు పట్టుబట్టలు, జరీబట్టలు స్వామికిఁ బంపుదురు. విగ్రహములు మూఁడు; ఆ విగ్రహములు మూఁడు. జెప్పు జగన్నాథ విగ్రహ మొక రథముమీఁదను, బలభద్రవిగ్రహ మొక్కరథముమీఁదను, సుభద్రావిగ్రహ మింకొక రథముమీఁదను బెట్టుదురు. వేలకొలఁది తీర్థవాసులు రథము త్రాళ్ళఁబట్టుకొని లాగుదురు. ఆ సమయమున విశాలమైన వీథియు, దేవాలయ శిఖరములు, గృహముల పైకప్పులు, మనుష్యుల మయములై జనసముద్రమట్లుండును. రథములు కదల నారంభింపఁగానే చప్పటు లాకాశము బీటలువాఱునట్లు బయలుదేఱును. ఆ ధ్వనికి భేరీభాంకారములు తోడునూఁదును. నిరుపమాన మహోత్సవములు జరుగు ప్రాగ్దేశములలో నైననిట్టువంటి యుత్సవము లుండునాయని సందియము తోఁచునట్లు రథోత్సవము నిరుపమాన వైభవముతో జరుగును.

రథములు దినదినము కొంచెము కొంచెముగా నడచును. తీర్థవాసులు మరునాఁటి యుదయమున మఱింత యుత్సాహముతో త్రాళ్ళఁబూని పవిత్రమైన వాటుపనికై సంతోషపూర్వకముగాఁ గుమిగూడుదురు. విగ్రహములను వసంతగృహమును జేర్చుటకు యుత్సవమిట్లే రమారమి యొక వారమునకు జరుగుచుండును ఒకప్పుడింతకంటె నెక్కువకాలము పట్టును. ఈ దినములలో తీర్థవాసులు పట్టణములోనున్న కోవెల లన్నిటిని జూచి సముద్రములోనో, పుణ్యతటాకములోనో స్నానమాడి, స్వామివారికి భోగముచేసి నైవేద్యము చేసిన మహాప్రసాదమునే భక్షించుచుందురు. దినమునకు ఎప్పుడును నలుబదివేలమంది దేవతాదర్శనము చేయుటకు ముందు సముద్రములో స్నానము

చేయుదురు. రమారమి లక్షజనులు ప్రతిదినము దేవాలయమునుండి దేవతానివేదనమైన భక్ష్యభోజ్యములు దెచ్చుకొని తినుచుందురు. ఈ ప్రసాదము మిక్కిలి పవిత్రమైనది. ఇది వర్ణభేదము, జాతిభేదములేక యెల్లవారికిఁ బంచిపెట్టఁబడును. మహాప్రసాదము గ్రహించుట కగ్రవర్ణమువారు సైత మంత్యవర్ణమువారి ప్రక్కను నిస్సంకోచముగా గూర్చుందురు. వర్ణభేద మవశ్యమని నమ్మువారక్కడ మాత్రము మినహాయింపు గలదని చెప్పుదురు. ఈ మినహాయింపు మఱి యేస్థలమునను మఱి యేసమయమునను జనులొప్పుకొనరు.

ఈ యుత్సవమైన తరువాతఁ దీర్థవాసులనేకులు పట్టణమువిడిచి పోవుదురు. ఎక్కువ భక్తికలవారు స్వామిరథములు మఱలివచ్చునప్పుడు వాటిని లాగి సాయము చేయుటకై మఱికొంత కాలముందురు. మొత్తముమీఁద రథములరాకపోకలకు మూఁడు నాలుగువారములు పట్టును. వర్షాకాలమందలి యీ మూఁడునాలుగు వారములు సంవత్సరమంతటిలోను జగన్నాథ క్షేత్రమున మిక్కిలి పవిత్రమైన దినములు.

తైర్థికులల్పసంఖ్యాకులుగా సంవత్సరము పొడుగున నీక్షేత్రమునకుఁ బోవుచుందురు. జగత్కిశోరరాయలు వచ్చినప్పుడు చాలమంది తైర్థికులు చేరిరి. సూర్యోదయము కాకమునుపు మిక్కిలి పెందలకడలేచి, జగత్కిశోరునితల్లియు, భార్యయు భక్తితత్పరలై పండా చెప్పిన చొప్పున నడువసాగిరి. ఆ క్షేత్రములో మూఁడు పవిత్రసరస్సులు కలవు. ఇంద్రద్యుమ్నసరస్సు, మార్కండసరస్సు, శ్వేతగంగయని వాటిపేళ్ళు. సూర్యోదయము కాకమునుపు వారిద్దఱా సరస్సులలో నొకదానిలో స్నానముచేసి యా దినమున శుచిత మగునట్లు పట్టుబట్టలు కట్టుకొని నానాదేవాలయములు చూచుచుఁ గాలినడకను పట్టణమందు దిరుగఁజొచ్చిరి. కపాలలోచను దేవాలయము, జంబుకేశ్వరునిగుడి, లోకనాథుని కోవెల దర్శించి జగన్నాథాలయమున కావలనున్న మఠముల సందర్శించిరి. ఒకవీధినుండి యొకవీధికి, నొక యాలయమునుండి మఱియొక యాలయమునకుఁ బాదచారియై పోవుచున్నను, జగత్కిశోరునితల్లి గాళ్ళనొప్పులు కాని, యాయాసము గాని యెఱుఁగదయ్యెను. తీర్థవాసిని కుదయించునావేశము, బలము కాళ్ళయందుఁగూడ నుదయింపఁజేసి యామెయు నలగ లేదు.

ఆ స్త్రీలిద్దఱు మఠముల బసకు వచ్చునప్పటికి సూర్యబింబము నెత్తిమీఁదికి వచ్చెను. ఆలయమునుండి మహాప్రసాదము వచ్చును గనుక వారు బసలో వేఱే వంటఁజేసికొనలేదు. ఈ మహాప్రసాదము చేయుటలోఁ దమచేతులు కొంతపడునేని తమకు పుణ్యమని భాగ్యవంతులగు తైర్థికులు భావింతురు. ఒక్కదినమందే యేబదియాఱు పిండివంటలుండి రాసులు

రానులుగాఁ బోయెదురు. ఇందునిమిత్తము ప్రతిదినము వేలకొలఁది రూపాయలు వ్యయము చేయఁబడును. ఆపిండివంటలు స్వామికి నివేదనము చేసి చుట్టుప్రక్కల పల్లియలలోని జనులకుఁ బంచిపెట్టుదురు. జగత్కిశోరుని పండాబ్రాహ్మఁడాయనవద్దనుంచి పెద్దమొత్తమును లాగివేసెను. జగత్కిశోరుఁడు స్వామియాలయము ప్రవేశించునప్పటికిఁ బదిగంట లయ్యెను. శరచ్చంద్రుఁడు తనచేయి బట్టుకొని తీసికొనివచ్చెను. అతనితల్లియు భార్యయు గూడవచ్చిరి. ఆయందఱు చిన్నచిన్న గుళ్ళవద్దఁ గొంతధనమిచ్చుచు వచ్చి, యందఱు కలసి జగన్నాథస్వామియాలయము సమీపించిరి. ముందుగా వారు భోగమందిరమును దాటి పిమ్మట గాన మందిరము నతిక్రమించి పలువురు తీర్థవాసులు పరివేష్టింప జగన్మోహన మందిరమున నిలువంబడిరి.

వారియెదుట మందిరములోనే రమారమి పదియేనుగజముల దూరమున మణిమయ మైనరత్నవేదిక యుండెను. దానిమీఁదనే దేవతావిగ్రహములు మూఁడును కలవు. ఆవిగ్రహములు తీర్థవాసుల దృష్టిపథమునఁ బడఁగానే పావన మైన యానంద పారవశ్యముచేత వారినోటనుండి కేకలు బయలుదేఱెను. పరమభక్తులహృదయ పుటములనుండి ప్రార్థనలు మెల్లఁదిగాఁ బయలుదేఱెను. ఎంతోయభిలాషయు, నెంతో యాత్రముఁ దెలుపుచూపులతో నంధకారమయ మైనగర్భగుడిలో నున్న యావిగ్రహములను జూచి మూర్ఛావస్థలో నున్నట్లు మైమఱచిరి. నానాశ్రమల కోర్చి మెట యాత్రచేయునప్పుడెన్నో మాసములు హృదయమందు వర్ధిల్లినయాశలు సఫలము లైనవి. పావనహృదయముల యందు గర్భితము లైనకోరికలు నెరవేఱినవి. భక్తిచేత సాష్టాంగనమస్కారములు చేయునప్పు డానందబాష్పములు భక్తులకన్నులనుండి స్రవించు చుండెను. ఎట్టకేలకు నియమిత సమయము వచ్చెను. ప్రధానార్చకుఁడు సంజ్ఞచేసెను. అప్పుడందఱు స్వామి సమీపమునకుఁ బోవచ్చును. అంతట తైర్థికులు నిశ్శబ్దముగా నడుగులు ముందుకువేసి, భక్తులతో రత్న వేదికాసమీపమునకుఁ బోయిరి. ఆచీకటిగుడి నిశ్శబ్దమై యుండెను. భక్తులు పెదవి గదపక యూరకుండిరి వెలవెలబోవుచు దీపములు మంద కాంతిఁ జిమ్ముచుండెను. కాలుచున్న సుగంధద్రవ్యములపొగ మేఘములుగాఁ బైకి లేచుచుండెను. స్వామిదర్శనము చేయఁదలఁచి వచ్చినయాడువాండ్రు పాదములు తడబడ వడఁకుచు నిలువంబడ, పండాబ్రాహ్మణులు వారిని స్వామిసన్నిధికి దీసికొని పోవుచుండిరి. ఆ యుఁగవలు తమ్మెక్కడికిఁ దీసికొని పోవుచున్నారో యెఱుఁగక గోడలు, స్తంభములు మూడక పండాలవెంటఁ బోయిరి. పవిత్ర మైన దివ్యస్థలమున నుంటి మన్నమాటమాత్రమే యెఱిగి

యుండిరి. నోటమాట లేక సాష్టాంగ దండప్రణామము చేయునప్పుడు దేవతావిగ్రహము లను మనసారఁ జూచుచుందురు.

నమస్కారమైన తరువాత భక్తులు తాము తెచ్చిన కానుకలు వేదిక మెట్ల మీద సమర్పణము చేయుదురు. బిహారుదేశమునుండియు, నుత్తరహిందూస్థానము నుండియు, వచ్చిన పేదకూలివాడు ధోవతికొంగున గట్టినమూట విప్పి రాగిడబ్బులు సమర్పించెను. వర్తకునిభార్య బుటేదారుచీర సమర్పించెను. చిల్లరవర్తకుని యిల్లాలు పూవులనర్పించెను. భాగ్యవంతు లగు స్త్రీలు రత్నఖచిత మైన కంకణములు, కంఠాభరణములు సమర్పించిరి. జమీందారులు మొహరీల నిచ్చిరి. సమస్తవిధము లైన కానుకలను సమస్తవిధములైన జనులు సమర్పించి తమతమభక్తివిశేషమును వెల్లడిచేసిరి. జగత్కిశోరుని తల్లి యందరి కంటె జట్టుచివర గర్భగుడి వదలివెళ్ళెను. ఆమె గుడి విడుచునప్పుడు బాష్పములు కన్నుల నుండి ధార గుమారుని యొక్కయు, కోడలియొక్కయు శిరస్సులు స్పృశించి చిర కాలమునుండి హృదయమున వర్ధిల జేయుచున్న యాప్రతిజ్ఞను బయలుపుచ్చెను. ఓజగ న్నాథా! ఓలోకనాయకా! నాకుమానవకు దేహారోగ్య మిచ్చి యైశ్వర్య మిచ్చి కాపాడుము. నాకోడలు కమపెకుబిడ్డలతల్లియై గృహయజమానురాలై మనుమల మనుమ రాండ్ర నెత్తవలెను. ఈలోకములో నేను డెబ్బదిసంవత్సరములు బ్రతికినాను. నాపని యైపోయినది. నేడు మొదలుకొని నేను నీసేవజేసెదను. నాశరీరము నీకర్పించెదను. ఈపట్టణములోనే యుండెదను. ఈముసలి దానికి నీవే శరణంబవు. ఈ సముద్రతీరమున నున్నవాడవు నీవే. నాహృదయమున నున్నవాడవు నీవే.

ఈప్రతిజ్ఞ వినఁగానే యక్కడనున్న వారి కందఱకు మేను కంపించెను. తల్లి కట్టిరహస్య మనోరథ మున్నదని జగత్కిశోరునకుఁ గాని, కాళికిగాని తెలియదు. ఆమె సంసారము నెంతో నేర్పుతో దిద్ది చక్కఁబెట్టుచువచ్చెను. ఆమె లేనిచో గృహమున సంతోషమే యుండదు. అటువంటి మాతృదేవతను బ్రతిజ్ఞావిముక్తురాలుసజేసి మరల వెంటఁబెట్టుకొనిపోవుటకు జగత్కిశోరదంపతులు తనకున్న యావద్ధనమునైన నియ్య సిద్ధముగా నుండెను. ఆమె ప్రాణముకంటెఁ గొడుకునకుఁ గోడలికిఁ బ్రియమైన దగుటచే నామెను దోడుకొని పోకుండ నింటికి మరలి పోవుట యనఁగానే వారిహృదయములు శూన్యములయ్యెను. కాని చేయునదిలేదు. ప్రతిజ్ఞ నోటనుండి వచ్చెను.

అప్పుడు కాళి యేడ్చుచు వర్తగారికిట్లనియె. "అమ్మా! మిమ్ముఁ దీసికొని పోకుండ మేము వర్ధమానము వెళ్ళము. గృహయజమానురాలు లేకుండ మాకు గృహమేమిటి?"

"బిడ్డా! నీవే గృహయజమానురాలవు కమ్ము! నీవంతు వచ్చినది. పెద్దతల్లివి కమ్ము! జగన్నాథస్వామి నా మొఱ లాలకించినాఁడు. భూమిమీఁద నేనుబ్రతికవలసిన కాలమెంతో లేదు. చరమావస్థలో మావంటి ముసలివాండ్రు దైవభక్తి గలిగి, యూర్ధ్వలోక ప్రయాణమునకుఁ బ్రయత్నము చేసికొనుచు నుండవలెనని ధర్మశాస్త్రములు వాదించుచున్నవి. ఈ ప్రపంచములో నేను వచ్చినపని యైనది. నామాట నేను చెప్పివేసినాను."

సుధాశరచ్చంద్రము

నాల్గవ భాగము

ఇరువదినాల్గవ ప్రకరణము

సరస్సు.

పశ్చాత్తాపము

శరచ్చంద్రుని[illegible] కలకత్తాకు వచ్చి యచటనుండిన దినములు సంతోషసౌఖ్యములుగా [illegible] గడుపవలసివచ్చెను. పుణ్యక్షేత్రమైన కాశిలోఁ దన జీవితశేషమును ధర్మమార్గమున భక్తితత్పరయై గడప నామె యెంతో యభిలాషపడెను. కాని ప్రాపంచిక పాశములు మరల నామెను సంసారగోష్పదములలోనికి లాగుకొని వచ్చినవి. వాటిబారినుండి తప్పించుకొని యెట్లైన వారణాసిక్షేత్రమునకు మరలవెళ్ళి పడవలెనని యామె కోరుచుండెను. జగత్తారిణీరాయలను గురించియు నతని భార్యను గురించియు శుభవార్తలప్పుడప్పుడు సరిగా తెలియుచుండెను. వారిద్దరు సుఖముగా మరల వృ[illegible] మానమును జేవలయునని[illegible], దాను సంసారబంధములనుండి వెండియు విముక్తి[illegible] చివరనాళ్ళలో గడపవలసిన ధర్మము [illegible] కలుగఁజేయవలసిన [illegible]నియు, నాడయాస్తమునాములు [illegible].

[illegible] యంత్యకాలము పుణ్యక్షేత్రమునందే గడుప[illegible] [illegible] యెంతో [illegible] మెను [illegible]. అది [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] స్త్రీ మిక్కిలి [illegible]. [illegible] [illegible]

లారఁజూచి సంతోషించినది. ఇప్పుడామె భక్తిమార్గమునఁ బడిపోయినది. అటువంటి యుత్తమజన్మము, ధార్మికవృత్తితోనే యంత మగుట యేమి యాశ్చర్యము! ఓ పరమేశ్వరా! నేను నీనిర్ణయ ప్రకారమే నడుచు చున్నయెడల నన్ను నీసేవకురాలనుగా నంగీకరించి, దుఃఖమగ్నుఁడైన నాకుమారుని సముద్ధరింపుము."

కుమారునిమాట జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల పాప మావృద్ధవితంతువు మొగము వెలవెలఁబాఱుచు లోనున్న బెంగఁ దెలియఁజేయు చుండును. ఆమెయాజ్ఞ శిరసావహించి శరచ్చంద్రుఁ డాత్మసౌఖ్యమును గోల్పోయినాఁ డని యామె యెఱుఁగును. మాతృవాక్యపరిపాలనము వలన నతనికిఁ గలిగినకష్టము గూడనామె యెఱుఁగును. శరచ్చంద్రుఁడు తల్లికి వ్రాసినజాబులు తక్కువ. వానిలో విషయముగూడ సంక్షిప్తముగా నుండును. ఎప్పుడు వ్రాసినను బావమాట, తోఁబుట్టువుమాటేగాని తనమాటేమి వ్రాయఁడు. కలకత్తాకు మరలఁబోయి విద్యాభ్యాసము చేయఁదలఁచుకొన్నట్లు జాబులవలనఁ గనఁబడెను. ఒకనాఁడు సాయంకాలము శరచ్చంద్రునితల్లి దీపముదగ్గఱ నొంటిగాఁగూర్చుండి కుమారుని యొద్దనుండి వచ్చినసంక్షిప్తలేఖలను దిరుగవేయుచుండెను. అపు డామె హృదయము శూన్యముగ నుండెను. ఆమెమనస్సును భయ మాపహించెను. ఆమె మనోగతములైన యాలోచనల నెవ్వరికి విప్పి చెప్పలేదు. వానిని హృదయమునందే నిక్షిప్తము చేసి పలుమాఱు తనలో తానే వితర్కించుకొనుచువచ్చెను. గంభీరుఁడు, దయాశాలియు నగు తనకొమరుని జీవితము తనయాగ్రహమువల్లను, దన లోకజ్ఞానములేమి వల్లను భగ్నమైన దని యామె భయపడి వడకఁ జొచ్చెను.

కూఁతురు డబ్బాటుగ నదృశ్యురాలయినదని విని యుమాయోగ్యత తల్లి కలకత్తాకు వచ్చెను. ఆమె పలుమాఱు శరచ్చంద్రునితల్లినిఁ జూచుచుండెను. దిన దినము వారికి నేకవిషయములగూర్చి దీర్ఘసంభాషణలు జరుగుచు వచ్చెను. తన కూఁతురు తనకుఁదక్కక బెంగ పెట్టిపోయినందు కామె సహజమైన దుఃఖముతోఁ జెప్పుకొని యేడ్చెను. అపేక్షను దలఁచుకొనినప్పుడెల్ల మనస్సుదుఃఖపూరితమై కన్నులు బాష్పపూరితములై యుండుననియు, నామెమాట యనుక్షణము స్మరణకు రాకమానదనియుఁ జెప్పి నగచి యిట్లనియెను: "అమ్మా! దైవమును నిందింపనేల? నేను చల్లనివిత్తనములపంట కోసికొనక తప్పునా. ఈ జన్మములో నిటువంటి ఘోరదుఃఖము సంప్రాప్తించుటకు నేను పూర్వజన్మములో నెన్నిపాపములు చేసితినో. విశ్వాసమునఁ జూచి, కన్నులు పొరలు గ[illegible] ప్రోత్సహ[illegible] నన్ను పద మానసిక నొప్పను గట్టిపెట్టితిని. గాని,

మఱి యే పేదవాని చేతిలోఁ బెట్టినను, నాతల్లి నాయమ్మ పెద్దతనములో నాకు సంరక్షణ సేయుటకును, నాకు మనస్సంతోషము గలుగుటకును గంజియన్నము నిచ్చు నైన బ్రతికి యుండును గదా?''

ఆమెకు శరచ్చంద్రునితల్లి యిట్లనియె. "అక్కా! నిన్ను నీవు తిట్టుకొనవద్దు. భగవంతుఁడే మన కార్యముల నిర్ణయించును మన మాయనచేతిలోని పనిముట్లము. నిన్నుఁ దిట్టుకొనవలసిన యవసరములేదు. ఎందుకంటే, మనయుమకు వివాహమైనప్పుడు దాని మగఁడు చెడిపోలేదు. తప్పుదారులుఁ ద్రొక్కలేదు. అందఱివలెనే చదువుకొని బుద్ధిమంతుఁడై బాగుపడుననుకొన్నాము. అతఁడు మనయందఱియిండ్లు కొనివేయఁ గలిగినంత భాగ్యవంతుఁడైనప్పటికి నడుమనడుమ తొల్పుకారు గ్రామమున కేలాగు వచ్చెడివాఁడో, వచ్చి గ్రామములో నున్న పెద్దవారి నందఱను జూచి యేలాగు నమస్కారములు చేసి పోయెడు వాఁడో మనకన్నులతో మనము చూడలే దటమ్మా! ఆదినములన్నియు నాకు జ్ఞాపకమున్నవి. గ్రామమునకు వచ్చినప్పుడు ధనంజయుఁడు నన్ను జూడక వెళ్ళెడు వాఁడు కాఁడు. పాపము! ఉమనన్ను పిన్నీయని పిలుచు చుండుటచేత ధనంజయుఁడు నన్ను త్తగారూ యనిపిలుచు చుండెడివాఁడు. నీయల్లుఁ డాదినములలో నేను చూచిన పిల్లలందఱిలో బుద్ధిమంతుఁడు" ఉమతల్లి యామె కిట్లనియె: "ఆ గోడలు త్రవ్వకమ్మా! నాగుండె పగిలి పోవును అక్కా! నిజమే నీ వన్నమాట. మాధనంజయుఁడు జాలిగుండె గలపిల్లవాఁడె. అప్పుడుగా దిప్పటి కైనజాలిగుండెవాఁడె. ఏమైననేమి? పెద్ద గోతిలో దిగి చెడిపోయినాఁడు. నాతల్లిని బలిపెట్టినాను."

"అక్కా! విచారింపవద్దు. ఉమకష్టములు గట్టెక్కినవి. తొల్పుకారు గ్రామములో మొన్నటిదాక నాతొడమీదఁ గూర్చుండి నాప్రక్కనాడుకొని నన్ను పిన్నీ, పిన్నీ యని యెంతో ప్రేమతోఁ బిలుచుచు ముద్దుల మూటగట్టు చుండిన యాబిడ్డను దలఁచుకొన్నప్పుడు పిచ్చియెత్తిపోవు నేమో యని నాకు భయము వేయును. నాకన్నుల నుండి నీటిబొట్లు రాక నెత్తుటిబొట్లే రాలును. దానికి నేఁటికి శాశ్వత విశ్రాంతి కలిగినది. బ్రతికియున్న వాళ్ళము మనమే దుఃఖములపాలై కష్టము లనుభవింపవలెను. విశ్వేశ్వరుఁడు నా కొమరున కాయురారోగ్యములిచ్చి రక్షించవలెను. బాధలతోను దుఃఖములతోను నిండిన యీ ప్రపంచపు గొడవలలోనుండి నేను మరలిపోయి కృష్ణా రామా యనుకొనుచుఁ గూర్చుండవలె."

"అక్కా! దేవుడు నీ కుమారుని రక్షించును. ఏమంటే శరచ్చంద్రునివలె మంచితనము దయాదాక్షిణ్యములుగల పిల్లవానిని నా కన్నులతోనేఁ జూచితేను. అతఁడు హేమునకు, బిందునకు, సోదరునికంటె యెక్కువగా నున్నాఁడు. మీ యల్లుఁడు యాత్రకు వెళ్ళుచున్నప్పుడతని సంరక్షణకొఱకు మీవాఁడు చదువుసహితము మానుకొన్నాఁడు. అక్కా! అతఁడు త్వరలోనే వచ్చి నీ ముసలితనమందు నీకుఁ జేయూతయై నీ కానందము గలిగింపఁ గలఁడు."

ఈమాట వినఁగానే శరచ్చంద్రునితల్లి నిట్టూర్పువిడిచి సన్నని యెలుఁగున నిట్లనియె. "అతని గుండెమీఁద గొప్పబరువున్నది. వానిబ్రతుకు సుఖములేని దైపోయినది. అదే నాకు దుఃఖము.

"ఓహో! పాపము సుధను మీవాఁడు వివాహము చేసుకోవలెనని తలపెట్టిన మాటా నీ విప్పుడనుమానించితివి? అక్కా! ఆమాటైతేను. ఆకథ మనము మఱచిపోదము: హేముఁడు చిన్నవాఁడు. బిందు వానికన్న చిన్నది తెలివితక్కువపిల్లవాని మాటలు పాటిచేసి తెలివితక్కువ యాలోచనఁ జేసినారు. ఇదివఱకైనదానికే బిందు విచారించు చున్నది. ఇప్పుడు పొరఁబాటుచేతనైన నామె యాప్రసంగ మెత్తదు. అక్కా! ఈ యపనింద నీ కొడుకునకు బాధించదు. అతఁడు మగవాఁడు అతనికేమి? అటువంటి సంగతులు ఆఁడువాండ్రకు మనకు బాధకలిగించును. బిందు మరల నట్టిమాటే తలపెట్టదు. పాపము! సుధ యావజ్జీవనము తీరని యపనింద పాలైనది అక్కా! సుధ మునుపటిసుధ కాదు సుమా పాపము! చిక్కిశల్యమై పోయినది కన్నులు గుంటలు పడినవి. మొగము పాలిపోయినది. నెత్తురుచుక్కలేదు. అట్టె మాటాడదు. పగలెల్ల నేదో పనిపాటలతోనే కాలక్షేపము చేయును. అది యెంతో సుకుమారి. పాపమీనింద కడచి యది యెట్లు బ్రతుకునో తెలియదు."

"అయ్యో కూతురా! సుధను తలఁచుకొంటినా నాబాధలు నేను మఱచిపోదును. చిన్నతనమందే వితంతువైపోయినది కాదా. ఈ వృత్తాంతము జరిగినతరువాత వైధవ్య దుఃఖము రెట్టింపగును. కుఱ్ఱ పాపకట్టు, దానిలోపమేమున్నది? ఎవరిలోపమని చెప్పఁ గలను? నాకొడుకు దానిని వివాహ మాడవలెనని కోరినప్పుడు బిందు దురుద్దేశము లేకయే సమ్మతించెను. ఈమధ్య కలకత్తాలో వితంతువివాహములెన్నో జరిగినవి. మన శాస్త్రము లటువంటి వివాహముల నొప్పుకొనుచున్నవని పండితులు చెప్పుచున్నారు. అందుచేత నటువంటి వివాహము తప్పుకాదని బిందు తలచియుండవచ్చును. చెల్లెలు

శరచ్చంద్రుఁడు కలసి యనుకూలదాంపత్యము కలిగియుండిన పక్షమున లోకములోని యెవరికి కావలెనని యామె తలఁచియుండును. శౌనక్కా! బిందు మంచి యుద్దేశముతోనే చేసినది. ఆమెను నేను నిందించను. సుధను తీసికొని నాయొద్ద కొకసారి రమ్మని చెప్పు. ఒకసారి వాండ్రను జూడవలెననియున్నది. ఎంతో శాంతము వినయములుగల పిల్లలు; వాండ్ర మొగములు జూచినయెడల నాకన్నులు చల్లఁగా నుండును."

"శౌనక్కా! వచ్చి నిన్ను జూడవలసినదని తప్పక వారితోఁ జెప్పెదను. కాని వాళ్ళకు పగలెల్ల పనులే యుండును. నేను పెద్దదాననైనాను. నేను వాండ్రకేవిధమైన సహాయము చేయఁజాలను. నేనేపని చేయవలెనని చేయిపెట్టినను ముందుగా నాకును మాటే జ్ఞప్తికి వచ్చును. కన్నులు నీళ్ళుగ్రమ్మి కనబడవు. కూర తరుగుకొనునప్పుడు నాకును జ్ఞప్తికి వచ్చును. ఆపనియంటే దానికెంతో యిష్టము. బియ్యము ప్రాయిమీద పడవేసితినా, యనుజ్ఞాపకము వచ్చును. వంటలో నా కడియొంగో సాయము చేయుచుండెడిది. నేనిప్పుడు పనికిరానిదాననైనాను. ఇప్పుడు నాకు సుధాబిందులుతప్ప మఱి దిక్కెవ్వరున్నారు? దైవము వాండ్రకైన దీర్ఘాయుర్దాయమిచ్చి కాపాడవలెను."

"వాఁడు నాకు మా కాళీ శరచ్చంద్రులవంటివాఁడే. భూమిమీఁద నేనెన్ని దినములు బ్రతుకనని సుధాబిందులతోఁ జెప్పు. చిన్నప్పటినుండి నేను ప్రేమించినవారిని ముసలితనములో మఱచిపోనని చెప్పు."

ఆ మరునాఁడు సాయంకాలము శరచ్చంద్రునితల్లి బిందును జూడవచ్చెను. సుధా శరచ్చంద్రుల వివాహ సంకల్పము చెడిపోయినతరువాత వారికుటుంబము నామె చూచుట కదే మొదలు. హేముడు పూజ్యురాలయిన యాయవ్వ నసాధారణమైన గౌరవముతో ప్రీతితో సన్మానించెను. పల్లకిలోనుండి చేయూఁతయిచ్చి యామెనుదించి జాగ్రత్తగా బిందున్న గదిలోనికామె నతఁడు తీసికొనిపోయెను. ఆమెను జూచి బిందు వినయముతో నెమరుగావచ్చి పాదములంటి నమస్కరించి యొక పీటమీఁదఁ గూర్చుండఁబెట్టెను. ఆ యవ్వ రాక సుధయుఁ జూచెను. గాని యా వృద్ధాంగనయొక్క దయానురాగములకుఁ దగనిదియుంబోలె నామె నేరముచేసిన దానివలె సిగ్గుపడి తలవంచికొని గదివిడిచి యావలకుఁ బోయెను.

"అమ్మాయీ బిందూ! యింతకాలమునుండి నన్నుఁజూచుట కొక్కసారియైన వచ్చినదానవు కావేమే? పిన్నీ, పిన్నీయని యెంతో ప్రేమతోఁ బిలచెడుదానవు. ఆ ముసలమ్మను మఱచిపోయినావా యేమి?"

"లేదు పిన్నీ. నేనెప్పుడును మరచిపోను. కలకత్తాలో మాకెన్నోచిక్కులు, రోగములు సంభవించినవి. మీరెఱుఁగరా? తాల్పుకారు వెళ్ళఁదలఁచుకొన్నాము. అక్కడ మావంటి పేదవాండ్రు స్వేచ్ఛగా సుఖముగా నుండవచ్చును."

"నిజము నిజము బిందూ! ఈ పెద్దపట్టణము ద్రవ్యవంతులకు నుద్యోగస్థులకుఁగాని బీదవారికిఁ గాదు. ఇక్కడ నేనుకూడ నొంటిగనున్నాను. సంతోషములేదు. వారణాసి యెప్పుడు వెళ్ళుదునా యని కోరుచున్నాము. భూలోకబంధములు భేదించుట మిక్కిలి కష్టము. నాపని అయిపోయినది. నావంటి పెద్దదానికి దైవభక్తి, ధర్మకార్యములు జరిగినవి."

"పిన్నీ! నీవు ధన్యురాలవు. జీవముయొక్క ధర్మములు చక్కఁగా నెఱవేర్చితివి. నీ జీవనమంతయు మొదటనుండి చివరవఱకు భక్తిమయము. వారణాసిలో నీవు జీవితశేషముఁ గడపుట నీవెనుకటి పవిత్రచరిత్రకుఁ దగియున్నది. మేము సంసారపుగోడవల మధ్యను బడియున్నాము. నీ యుదాహరణము పాపమార్గమునఁబడి పోకుండ మావంటి వారికి మార్గదర్శకమగుఁ గాక! కాళీ సుఖముగానున్నట్లు వార్త తెలిసినదా?"

"తెలిసినదమ్మా! భగవంతుని యనుగ్రహమున్నది. మా అల్లుఁడు జగత్కిశోర రాయులు జగన్నాధస్వామి యనుగ్రహముచేత రోగము కుదిరినది బాగుపడినాఁడు. వారు మరల వర్ధమానమునకు వచ్చియున్నారు. నా కొడుకుకూడ నాకు జాబులు వ్రాయుచున్నాఁడు. కాని, తఱచుగా వ్రాయఁడు. తాను తిరిగి కలకత్తాకు వెళ్ళుటను గుఱించి యేమియు వ్రాయఁడు."

ఆ మాటలకు బిందు ప్రత్యుత్తరమియ్యక యూరకుండెను.

"అమ్మాయీ బిందు! నా కొమరుఁడు కలకత్తా వచ్చువఱకు నేను కనిపెట్టుకొని యిక్కడ నుండఁజాలను. సర్వజ్ఞుఁడైన భగవంతుఁడే నాబిడ్డను నడిపింపఁగలఁడు. శరచ్చంద్రుఁడు పెద్దవాఁడైనాఁడు. తల్లిసాయ మపేక్ష్యము. నేనుండవలసినచోటు వారణాసిగాని యీ స్థలముకాదు. దోక్యము కలుగఁజేసికొనుటవలన వానికి నష్టము కలుగును గాని లాభము కలుగదు."

బిందు దానికి బదులు చెప్పలేదు.

"ఏది యెట్లయినను జాగుసేయక నేను వారణాసికి మరలి పోఁదలఁచినాను. బిందూ! మిమ్ము మరలఁ జూడను గనుక నిన్ను, సుధను జూచి దీవించి వెళ్ళవలెనని

వచ్చినాను. మీరు తల్లిలేని పిల్లలు. నీమీఁద మీతల్లి కెంతప్రేమో, నాకునంతే ప్రేమ. మీరు సుఖపడునట్లు సేయుటకు నాకు భగవంతుఁడు తోడ్పడుఁగాత !"

ప్రేమరసపూరితములైన యామాటలువిని బిందు కన్నీరు విడిచెను. కాని యప్పటికి మాటాడలేదు.

"పరమసాధ్వియైన సుధయెక్కడ? దాని నొక్కసారి పిలు. నేను వెళ్ళకముందు దాని నొకసారి కౌఁగలించికొని దీవించవలయునని యున్నది."

బిందు సుధను దీసికొని వచ్చెను. తొల్పుకొరుగ్రామములో శరచ్చంద్రునితల్లి చూచినప్పటికంటె సుధ పొడవెదిగి మిక్కిలి పలుచబడెను. ఆమె మెత్తని చెక్కులు తెల్లఁబడెను. కన్నులు దీర్ఘవిచారమును సూచించెను. చేతులు సన్నగా పొడవుగా నుండెను. చిన్ననాఁటి చిఱునవ్వు లామె పెదవులను విడిచి యెందోపోయెను. అతి బాల్యమున సంప్రాప్తమైన దీర్ఘవిచారము మొగమున నెలకొనియున్నట్లు స్పష్టముగఁ గనఁబడుచుండెను. ఈ మార్పులుచూచి శరచ్చంద్రునితల్లి భయపడెను. సుధ తలక్రిందకు వంచి యా యవ్వచరణము లంటినప్పుడు విచారజనితములో, పశ్చాత్తాపజనితములో బాష్పము లామెకన్నులనుండి బాలికశిరస్సుమీఁదఁ బడెను.

"బిడ్డా ! దగ్గఱరమ్మా. నన్నుఁ గౌఁగిలించికొమ్మా ! మనఃపూర్తిగా నంతఃకరణ శుద్ధిగా దీవించనిమ్మా. ఈ యైదాఱునెలలలోనే యెంతచిక్కిపోతివే తల్లీ ! చిన్నతన మందే నీకుఁ దగనిదుఃఖము వచ్చిపడినదే యమ్మా. చిఱునవ్వువెన్నెలలు గాయు నీ మొగము దుఃఖ మొందఁదగినది కాదు. నీ సుందరనేత్రములు దుఃఖబాష్పములకుఁ దగినవి కావు."

రాత్రి బిందు చుట్టముదగ్గఱ సుధను గూర్చుండఁబెట్టి బిడ్డలను బండుకొనఁ బెట్టుటకు వెళ్ళెను. చమురు లేక దీపము మినుకుమినుకుమని జొచ్చెను. సుధ పిల్లి కూనవలె జంకుచుఁ జిన్ననాఁడు తొల్పుకొరులో నున్నప్పుడామె యొడిలోఁ గూర్చుండునట్లే యాయవ్వదగ్గఱఁజేరి కూర్చుండెను. ఆయవ్వమనస్సు పూర్వదినములను బూర్వవృత్తాంతములను దలఁచుకొనియెను. పేదవితంతువైన సుధతల్లి సుధనుదమయింటికిఁ దీసికొనివచ్చుటయు, సుధ వచ్చియురానిమాటలతోఁ దమ్ముఁ బ్రేమించువారి కొఱకు సులభముగాఁ బోవునట్టి శిశుసామాన్య సహజలక్షణముతోఁ జేతులుచాచి దనమీఁదఁ బడుటయుఁ దా నెత్తుకొని ముద్దాడుటయు నామెకు జ్ఞప్తికివచ్చెను. తల్లిపోయినను తనవాత్త

సుధ మాతాపితృవిహీనయై తానెప్పుడైనఁ బిలిచి యాదరించి నప్పుడు తల్లి పిలుపున కానందించినట్లే యానందించినదినమునుకూడ నామెకు జ్ఞప్తికివచ్చెను. అంతేకాదు. సుధ బాలవితంతువై తన దురదృష్టమును దెలిసికొన లేక బాల్యచాపలముతోను, ప్రేమతోను దన గృహమును, దన హృదయమును వెలయింపఁ జేసిననాఁటి దినములుకూడ నామెకు జ్ఞప్తికి వచ్చెను. తాను వారణాసి వెళ్ళెడునాఁడు సుధయేడ్చుచుఁ దనపాదములువిడువక, తన మనస్సు కరగించిన కథగూడ నామెకుమనోహర మయ్యెను. తల్లిలేని యాపిల్ల యాయవ్వ ప్రేమచేతను, దయారసముచేతను వర్ధిల్లెను. ఇప్పుడు సైతము నాపెయాశ లడుగంటఁజేసి యామె జీవనమును దుఃఖభాజనముచేసిన భయంకర వృత్తాంతములను మఱచిపోయి, చిన్న బిడ్డవలె నత్యంతవిశ్వాసముతో, మితిమీఱిన యనురాగముతో, నామెదగ్గఱ జేరెను. కొన్నివిషయము లాయవ్వహృదయమునకు నొప్పిగలిగించెను. ఆమె హృదయమున గొప్ప బెంగ బయలుదేఱెను ఆబిడ్డను దగ్గఱచేసి యామె కౌఁగిలించికొని మెల్లగా నేదో ప్రార్థనము చేసెను. "భగవానుఁడా! నేను పెంచినబిడ్డను నాచేతిలోఁ గొట్టకూఁడదు. అల్పజ్ఞానముచేత నే నింత దోసముచేసితిని. పరమేశ్వరా! నన్ను క్షమింపుము. నీయనుగ్రహము నాపైఁజూపవలెను."

ఇరువదిఅయిదవప్రకరణము

ఘాటము.

కలకత్తానగరమున దక్షిణపు దిక్కునం గలపేటలలో నాది గంగాతీరమున జగత్ప్రసిద్ధమైనకాళీఘట్టదేవాలయము గలదు. పూర్వకాలమున గంగానది కాళీఘట్ట సమీపమునుండి సముద్రమునం బ్రవేశించు చుండిన దనియు నదిచేత భువన పావనమైన భాగీరథితీరమున శ్రీకాళికాదేవాలయము నిర్మింపబడిన దనియు లోకులు చెప్పుకొందురు. గంగానది యీవైపునుండి ప్రవహించుట మానెను. అందుచేతఁ గాలక్రమమున నాదిగంగ యని పేరుపడినయీపాయ తప్పవేసికొని పోయెను. ఐన సిద్ధులనుపూర్వకాలమందువలెనే నేఁడుసైతము పుణ్యక్షేత్రముగా గణింపఁబడు చున్నది. కలకత్తాయను పేరు [illegible] ఘట్టము [illegible] యుత్పన్నమయినది. [illegible] పవిత్రముగా శ్రీ కాళికాదేవి వసించుచోట్లు [illegible] లెక్కను

లీపురాతనదేవాలయమునకుఁ దమభక్తిసూచకముగా నెన్నో కానుకలఁ బంపుచుందురు. ఉత్సవదినములలోఁ గలకత్తానగర స్త్రీలతో దేవాలయము చుట్టునున్న సందుగొందులు నిండియుండును. ఆలయసమీపమున నున్న పావననదీజలము పావనత్వముగోల్పోయి ప్రొత్తనీరు రాక నిలువయుండుటచేత హేయమైనను జనులందులోనే మునిఁగి పవిత్రుల మైతిమని భావించి పట్టుబట్టలు తాల్చి మడికట్టుకొని యాలయమునకుఁ బోయి స్తవములు చదివి బలి సమర్పించి పూజలు చేసి వత్తురు. మతసంబంధములైన కర్మలు దీర్చిన తరువాత యాపావనక్షేత్రమునఁ జేరునట్టి కొనవేలుభిక్షుకులకు దమయొద్దనున్న సొమ్ము వెచ్చపెట్టి యన్నాతురుల కన్నము పెట్టించి సేవలకుఁ దనకుఁ దోచినంతసహాయము చేసి పుణ్యము గట్టుకొందురు.

శీతాకాలమున మనోహరమైనయొకనాటి యుదయకాలమున శరచ్చంద్రుని తల్లి పల్లకియెక్కి కాళీఘట్టమునకు వచ్చెను. ప్రొద్దునెత్తిమీఁదికి రాకమున్నె యాసాధ్వి స్నానముచేసి దేవతాదర్శనము చేసి యర్చనము ముగించుకొనెను. తరువాత మార్గప్రదర్శ కుఁడుగా నుండుటకు తోడ్కొని వెళ్ళినయొక ముసలి పండా బ్రాహ్మణుని సహాయమున దేవాలయమును విడిచి జనసమ్మర్దము గలబజారును దాటి కొంతదూరమరిగి యొకచిన్న కుటీరము జేరెను. ఆకుటీరము చల్లని నీడలనిచ్చు చెట్లనడుమనుండెను. ఆకుటీరపుగుమ్మము ముందర నామె నిలిచి యుండెను. పండా బ్రాహ్మణుడు లోనికరిగెను. కుటీయొక వృద్ధబ్రాహ్మణుఁడు వెలుపలికి వచ్చెను. డెబ్బది వర్షములు మున్నె దీర్ఘమైయుండిన యాతని నెరసినకాయము పండిపోయి వానివిశాలఫాలభాగము ముడుతలపడియెను. ఆతనిగడ్డము [illegible] కలిసెను. పిలకజుట్టు వెనుక వ్రేలాడుచుండెను. దేవతానామములు ముద్రింపబడిన యొకరుమాలు నతఁడు పైన వేసికొని [illegible] నిలువఁబడెను. తాల్పుకారు గ్రామమున నున్న ఘోషకుటుంబమున కీ వృద్ధబ్రాహ్మణుఁడు గురువు. అతనిలోఁ గూడ కొంత [illegible] వచ్చెను. ఆతఁడు [illegible] నుండెను. అతని ముఖము [illegible] పావనత్వమును మతసంబంధమైనవిష్ణువు నారాధించు [illegible]. అతఁడు కాషాయవస్త్రములు ధరించెను. అతని శరీరము సౌష్ఠవము కలిగి దృఢముగా నుండెను. అతని కన్నులు [illegible]. వెండ్రుకలు జడలుగా [illegible] గా నుండెను. అతఁడు కాశీనుండి వచ్చిన బ్రహ్మచారి. శరచ్చంద్రుని తల్లి వెంటనే గురుపాదములకు సాష్టాంగనమస్కారము చేసి పిమ్మట బ్రాహ్మణునకు [illegible]

చేసెను. వారామెను లేవనెత్తి యాశీర్వదించి కుటీరములోనికిఁ దీసికొని పోయిరి. "మానాయనగారు దేహారోగ్యము గలిగి సుఖముగా నున్నారా" యనియామె నడిగెను.

"అమ్మాయీ! భగవంతుని యనుగ్రహముచేత నేను సుఖముగా నున్నాను. నాబిడ్డకూడఁ సుఖముగా నున్నదా? పిల్లలు సుఖముగా నున్నారా? గృహము సుఖాస్పదముగా నున్నదా?"

"నాయనా! పరమదయాకరుఁడైన భగవంతుఁడు నాకు దీర్ఘాయుర్దాయము పోసినాఁడు. ఈలోకములో మనశ్శాంతి యెవరి కున్నది? నేను కలకత్తాలో నొంటిగా నున్నాను. కాశీపురము వెళ్ళఁగోరుచున్నాను. కాశీపట్టణమందె నాకు మనశ్శాంతి కలదు. నాయల్లుఁడు జగన్నాథయాత్ర వెళ్ళినాఁడు. నాకూఁతురు గొడుకు వానివెంట జనినారు."

"అమ్మాయీ! వారు మంచిపనిచేసినారు. జగన్నాథస్వామి యాయురారోగ్యములిచ్చి వారిని రక్షించును. బిడ్డా! భగవంతునే నమ్ముకో. ముసలితనమందు నీకతఁడే మనశ్శాంతిని సుఖమును ప్రసాదింపవలెను."

"అయ్యనపాదములనే నేను నమ్ముకొని యున్నాను. భగవద్విశ్వాసమే నన్ను రక్షించుచున్నది. కాని యాఁడుదానను గనుక అప్పుడప్పుడు నా హృదయము చలించుచుండును. ఆఁడుదానిబుద్ధి యపమార్గములు పట్టించును. తండ్రీ! నాకుఁ గలిగినకష్టములలో సాయము చేయవలయును. మహానుభావుఁడైన యీబ్రహ్మచారిగూడ నాకు దగిన సలహా నిచ్చి తోడుపడవలెను."

అనవుడు బ్రహ్మచారి యిట్లనియె. "అక్కా! నావల్లనైన సాయము నేను తప్పక చేసెదను. నీవు నన్ను జూడకపోయినను వారణాసిలో నేను నిన్ను పలుమారులు చూచి యుంటిని. తొల్పుగాయి గ్రామమునకు నేను క్రొత్తవాఁడను గాను. ఉమను బిందును [illegible]ళిని వివాహములు కాకమునుపు చిన్నప్పటినుండి నే నెఱుఁగుదును."

"అందులో బిందు సుఖముగా మగనితోఁ కాపురము చేయుచున్నది. అది యిద్దఱుపిల్లలతల్లి. పాపము! ఉమ పోయినది."

"ఉమ పోయినదా యేమి? గ్రామమునందఱ్ఱరుముద్దుబిడ్డ గదా! అనాఁడు [illegible] పరమానందమును గలిగించుచుండెగదా.

తళతళలాడుచున్న దానికన్నులు ముగ్గులు మూటకట్టుదాని మొగము నాకింకను బాగుగ జ్ఞాపకమున్నవి. ఆముద్దులబిడ్డ ఆచిన్నపాప యింత స్వల్పకాలమునఁ బోయిన దన్నమాట. నమ్మఁజాలకున్నాను. అక్కా! అది యేలాగునఁ బోయినది? ఎప్పుడు పోయినది?

"రమారమి నెలక్రిందట అది యిల్లువిడిచి పోయినది. మఱి కనఁబడలేదు. వివాహ విషయమున నది మందభాగ్యురాలు. దానికదే దీర్ఘవిచారము. తన దురదృష్టమును గూర్చి యెల్లప్పుడు విచారించుచుండెడిది. తనకష్టములనంతము జేసికొనుటకది యేటిలోనికి దచ్చినదని చెప్పుకొనుచున్నారు."

"అక్కా! నే నామాట నమ్మను. అది నదిలో మునిఁగి చచ్చుచుండఁగా నెవ్వరు చూచినవారులేరు. ఆమెకష్టములు గట్టెక్కువఱకు బాల్యకాలమున నామె జీవితము నాచ్ఛాదించిన దుఃఖమేఘములు విడిపోవువఱకు నామె నేదేవాలయమునందో నేపుణ్యక్షేత్రమునందో జనులకన్నుల కగపడకుండ భగవంతుఁడే దాఁచియున్నాడని నాయభిప్రాయము."

"బ్రహ్మచారీ! నీమాటలు వేదవాక్కులవలె సత్యములు కావలె నాయనా! పాపము ఆమతల్లి నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కావలెనని కోరి నీ పేరుచెప్పుకొని బ్రతుకును."

"బిందు కిద్దఱుపిల్లలా? పాపమామె సుఖముగా నుండవలె. తాల్లుకారులోఁగల బాలికలందఱిలో మిక్కిలి సాధువై, మంచిదై యెల్లవారికిఁ దలలో నాలుకవలెనున్న యా బిందు మొగము నాకు బాగుగా జ్ఞాపకమే. దానికొక చెల్లెలుండవలె. నేను చూచినప్పుడది పసిపిల్ల."

"అన్నయ్యా! దాని కర్మముకూడ కాలినది. చిన్నప్పుడే అది యాఁడితనముతప్పి పోయినది."

"అక్కా! ఇది మిక్కిలి విచారకరమే. ఈ విధముగా దుఃఖసంతాపములతో నిండిన ప్రపంచములో నెవఁడు జీవింపఁగోరును? పాపము దానితల్లి యెంతో మంద భాగ్యురాలు. బిడ్డ తల్లికన్న మందభాగ్యురాలైనది. ఈడు రాకముందే వితంతువైనదా. సర్వేశ్వరుఁడు సర్వజ్ఞుఁడు. అట్టివారి కతఁడే తోడుపడవలె."

"అన్నయ్యా! నీ మాటలు సత్యములు కావలయు. పాపము! ఆ దిక్కుమాలిన పిల్లనుగురించియే నేను మిమ్మును మా నాయనగారిని సలహాయడుగ వచ్చితిని. నా

మనమ్ము మనస్సులో లేదు. నేను కష్టములోనున్నాను. నేను మీ సహాయ మపేక్షించి మీతో నాలోచించుటకు వచ్చినాను."

ఆ మాటలు విని గురు విట్లనియె. "అమ్మాయీ! సందేహింపక చెప్పు. నేనీ ప్రపంచపు గొడవలు మానుకొంటినని నీవెఱుఁగుదువు. అందుచేత నాయాలోచన నీకంత ప్రయోజనకారి కాదు. ఐనను నేను నా శక్తివంచనలేక నీకు సహాయము చేసెదను. కావలసిన యాలోచనము చెప్పెదను మన వేదశాస్త్రములలో గొప్ప పరిజ్ఞానులైన మహానుభావులు నవద్వీపములలో ననేకులున్నారు. లోకవ్యవహారములన్నిటిలో వారాలోచనచెప్పి యభిప్రాయము నిచ్చుచుందురు. నిత్యకృత్యములలో ధర్మాధర్మములను దెలిసికొనఁగోరువారు వారియొద్దకు వెళ్ళుచుందురు. నాకాలము చెల్లిపోయినది. ఈ చరమకాలములో నేను ప్రశాంతముగా దినములు గడుపవలయునని సంకల్పించు కొన్నాను."

"నాయనా! అది నిత్యకృత్యముల వ్యవహారమైన పక్షమున నే నింతమారము శ్రమపడి వత్తునా? మీనిష్ఠకు భంగము కలిగింతునా? నేను దుఃఖములో నుంటినిగనుక యీయాటనిమిత్తము మీవద్దకు వచ్చితిని. మీరు మా కులగురువులు. నా మామగారికి మీ రాప్తులు. మావారికి మీరు పురోహితులు. నాకు మనశ్శాంతియు సాయమును గావలసివచ్చినప్పుడు మీయొద్దకురాక మఱియెవరియొద్దకుఁ బోదును?"

"అమ్మాయీ! విచారింపకు. నీకు నా చేతనైనంత సహాయము చేసెదను. కాశినుండి వచ్చిన యీ చిన్నవాఁడు నాకు స్నేహితుఁడు. వేదములు గట్టిగాఁ జదివినవాఁడు. నీ వతని నెఱుఁగకపోయినను అతఁడు నిన్ను, నీ వృత్తాంతమును చిన్ననాఁటనుండి యెఱిగినవాఁడు. అతఁడు కూడ శక్యమైన సహాయము చేయఁగలఁడు. నీవె కదలి నాయొద్దకు వచ్చుటకు నీ మనసులో నెంతో విచారముండి తీరవలయును. నిస్సందేహముగాఁ జెప్పు."

"నాబాధ విశేషముగానే యున్నది. అది చెప్పుటకుఁగూడ నాకు శక్యము గాకున్నది. మహాత్ముఁడైన యీ బ్రహ్మచారి బింగుచెల్లెలను గుఱించి మాటలాడినాఁడు. అది చిన్ననాఁడే వితంతువైనది. దానికిప్పుడు యుక్తవయస్సు వచ్చినది. నా కుమారుఁడు శరచ్చంద్రుఁడు దానిని వలచియున్నాఁడు. దానినే గాని వివాహము చేసికొనవని పట్టుపట్టి కూర్చున్నాఁడు. ఈ వివాహము మీ రంగీకరించితిరా వారి జన్మము సార్థక

మగును. సుఖముగ జీవితురు. నిషేధించితిరా వారీ భూమిమీఁదఁ జిరకాలము జీవింపరు."

ఈ సంభాషణ చెవినిబడఁగానే మఠాధిపతి నిర్ఘాంతపోయెను. అతఁడు శరచ్చంద్రుని తల్లిని వివాహకాలమునుండి యెఱుఁగును. హిందువుల యాచారముల మీఁదను, సాంప్రదాయములమీఁదను నామె కమితగౌరవము కలదనియు నెఱుఁగును. కుమారుఁడు వితంతువివాహము చేసికొనఁదలచుకొన్నాఁడని యామె చెప్పినప్పు డతఁడు మహాశ్చర్యరసమగ్నుఁ డయ్యెను.

"అమ్మాయీ! హిందువుల యాచార ప్రకారము వితంతువివాహము నిషిద్ధమని నీ వెఱుఁగవా? బ్రాహ్మణులు, మహాపండితులు చెప్పఁగా వినలేదా? వినుట యెందుకు? నీవు నెఱుఁగుదువు"

"ఈనాఁటి యాచార మెట్టిదని తెలిసికొనుటకు నే మీయొద్దకు రాలేదు. ఈ మాటనిపించు కొనుటకు నేను మీయొద్దకు రావలెనా? ఆచారమునకు, లోకాభిప్రాయమునకు విరుద్ధముగా నడుచునట్టి సమయములు ప్రతి మనుష్యుని జీవితములోను నుండును. ఇది మనయాచారములకు విరుద్ధమైనను దోషము గాకపోయిన పక్షమునఁ జేయఁదగిన దగునా కాదా? ఇది మతవిరుద్ధమా? భగవంతుని కాగ్రహము కలిగించు కార్యమా? ఈ సంగతులు మీవలనఁ దెలిసికొనుటకై వచ్చితిని. తండ్రీ! ఆడుదాని దుఃఖకర వృత్తాంతము శ్రద్ధతో వినుము."

అని కన్నీరు విడుచుచు నామె వెనుక జరిగిన వృత్తాంత మంతయు నతనితోఁ జెప్పెను. చెప్పుటలో నామె తన గృహవృత్తాంతము శరచ్చంద్రుని చరిత్రము దెలిపి యుమయొక్క కథను నామె తల్లియొక్క కథను నెఱిఁగించి పిమ్మట హేమునియొక్కయు, సుధాబిందులయొక్కయు వృత్తాంతములు తెలిపెను. తెలిపి వెండియు సుధాబిందులు కలకత్తానగరమునకు వచ్చిన తెఱంగు శరచ్చంద్రుఁడు దినదినము వారి యింటికి వెళ్ళి సేమ మరసి వారి సౌఖ్యములకై పాటుపడుచు నాదరించిన విధంబు నటులుండ నతనిహృదయంబు సుధపై నిలిచిన ప్రకారంబు మొగుపఱచ నెఱిఁగించెను. తరువాత సుధపై నపవాదములు పడుటయు నామె కవమానములు సంభవించుటయు, శరచ్చంద్రుని హృదయ మాశాభగ్నమై విషాద పూరిత మగుటయు నాయన్వ బాష్పపూరిత నేత్రియై విన్నవించి చనినకాలములోఁ దనజీవితముచుట్టుఁ గ్రమ్ముచున్న దుస్సహా దుఃఖాంధకారమును జ్ఞాన

తేజోమూర్తులగు గురువులు కటాక్షవీక్షణ కిరణములచేత దవ్వుగ బొందోలి కుటుంబమును రక్షించి తన సంకట గలిగింపవలసిన దని వేఁడుకొనెను.

వేఁడుకొని మఱియు నిట్లనెను. "ధనము మనయల్పజ్ఞానమునుబట్టి నడచుచుండును. ప్రపంచధర్మము వేఱు. సత్యము వేఱు. ఉమయొక్క తల్లి బిడ్డను వర్ధమాన పట్టణమందు మిక్కిలి భాగ్యవంతున కిచ్చి వివాహము చేసెను. చేసినందుకు దాని గతియే మైనది? నాప్రక్కను గూర్చుండి కంటికి నేలకు నేకధారగా నహోరాత్రములు దుఃఖించుచున్నది. ఆదుఃఖ మామె హృదయమున గొప్పపిడుగువలె బడినది. నేను గూడ గొంతకాలము గర్వము గలిగి యుంటిని. అందుకు నాకిం దగినప్రాయశ్చిత్తమైనది. ప్రపంచము నాకంధకారమయమై సంతోషశూన్యమైయున్నది. నాయాశ లన్నియు శరచ్చంద్రుని మీఁదను నాకూఁతురు శారిమీఁదను, సుధాబిందులమీఁద నున్నవి. వారల తల్లి చచ్చిపోవునప్పుడు వారిని నాకప్పగించి పోయినది. సుధాశరచ్చంద్రులనురాగ బంధమును నేను త్రెంపివైచితిని. కాని యాచిన్న పిల్లలబ్రతుకు దిక్కుమాలినదానను నేను పాడుచేసితి నని నామనస్సు బాధపెట్టుచున్నది. తండ్రీ! మనశాస్త్రము లేమనుచున్నవో చెప్పుము. తల్లి నైనందుకు నేను చేయవలసినవిధి యేమో చెప్పుము."

తల్లి కుమారునిదీన చరిత్రమును జెప్ప విని కరుణామయుఁ డగు గురువు జాలిపడి బాష్పములు విడిచెను. వైధవ్యదుఃఖభారవినమ్రయై యిడుములు గుడుచుచున్న సుధ నెత్తిమీఁద నిందలు పడిన వని వినినప్పుడు బ్రహ్మచారి కన్నులు కోపముచే నెఱ్ఱపడెను. ఇద్దఱు క్షణమాత్ర మూరకుండిరి.

ఎట్టకేలకు గురువు తనమిత్రుఁ డైనబ్రహ్మచారినిఁ జూచి యిట్లనియె. "కుమారా! చెప్పుము. కాశీదేవాలయములలో నున్న పుణ్యగ్రంథము లన్నింటిని నీవు శోధించితివి. సాధువులయొక్కయు బ్రహ్మచారుల యొక్కయు ముఖములనుండి యనేకధర్మములు విని యుంటివి. నీదృష్టినుండి మనవేదశాస్త్రము లొక్కమాటయైన దాచ లేవు. సరస్వతీదేవి నీకు వరప్రసాదము చేసినది. నీకు వశమైనట్లు వాగ్దేవి యీకాలమం దెవ్వరికిని వశవర్తిని కాలేదు. అతిదుఃఖపడుచున్న నీసోదరికి మనంబున నూరట గలుగునట్లు దయాగర్భితములై ప్రేమ చిలుకునట్టి పలుకులు పలుకుము. మనమనోగతములైన తలంపులను నాకంటె నీవుస్ఫుటముగాఁ జెప్పఁగలవు. అందుచేత నీవే పలుకుము."

“అక్కా! నీవు నావల్ల నేమి తెలిసికొనఁ గోరుచుంటివి? నేను నీకెట్లుసాయము చేయఁగలను?”

“చిరకాలమునుండి కలియఁగోరుచున్న యీ యువదంపతుల సమాగమ మశాస్త్రీయమైన యధర్మమేమో చెప్పుఁడు. వితంతు వివాహములు జరుగఁగూడదని భగవంతుఁడు శాసించినాఁడేమో చెప్పుఁడు.”

“ఈశ్వరుని శాసనములను మన మతని కార్యములవలన నూహింపఁగలము గాని యిది యాతని శాసనమని నిర్ణయింపఁగలమా? వేదములు పరమేశ్వరుని శాసనమునకుఁ బ్రతిధ్వనులు.”

“అన్నయ్యా! అట్లేకానీ. వేదము లేమనుచున్నవో నాకుఁజెప్పు.”

“వివాహితలైన స్త్రీలు భర్తృమరణానంతరమున మహాపతివ్రతలై బ్రహ్మచర్యలు నడుపవలసినదని వేదములు చెప్పుచున్నవి కాని, చేసికొనఁ దలఁచుకొన్న వితంతువులు పునర్వివాహము చేసికొనఁ గూడదని శాసించుటలేదు. చిన్నబిడ్డగా నున్నప్పుడు భర్తను గోల్పోయిన సుధవంటి వితంతువునకు శాస్త్రములుస్పష్టముగా వివాహము నంగీకరించుచున్నవి. ఈశ్వరకృపావిశేష మట్టి వివాహములను నిషేధింపదు. ప్రపంచమిదివఱకే దుఃఖపూరితమై యున్నది. మనుష్యుల బుద్ధిహీనత దానినిమఱింతదుఃఖభాజనము సేయుచున్నది.”

“అన్నయ్యా! అమృతప్రాయములైన యిటువంటిమాటలు నీనోటవచ్చినందుకు నీకు వేయినమస్కారములు. కాలానుసారముగా మనము నడవవలసి వచ్చినపక్షమున జనాభిప్రాయము పూర్వాచారము మొదలగునవీ దినములలో మనల నాపఁగలవా?”

“అక్కయ్యా! ఔను. సత్యమార్గమున నడుచువానిని జనాభిప్రాయము, పూర్వాచారము నిలుపఁజాలదు. నీవు వినియుంటివిగదా? మహానుభావుఁడైన విద్యాసాగరుని గుఱించి వింటివిగదా! అతఁడు విద్వాంసులకంటె విద్వాంసుఁడు. దయాళువులకంటెఁ బరమదయాళుఁడు. పావనులకంటె పావనుఁడు. మన శాస్త్రములు వితంతువులు [illegible] వైధవ్యదుఃఖ మనుభవింపవలసినట్లు శాసించుట లేదని యతఁడు వాదించినాఁడు. మన ప్రభువులు విదేశీయులైనను జ్ఞానవంతులై వితంతువివాహములు శాస్త్రీయములని ప్రశస్తమైన ధర్మశాస్త్రములు నిర్మించినారు. [illegible] వితంతువు లెందరో

వివాహములు చేసికొని పతివ్రతలై పరమసంతోషముతోఁ గాపురములు చేయుచున్నారని నీవు వినియుంటివి. నీ కుమారుఁడు తన యిచ్చవచ్చిన విధమున వివాహము చేసికో వచ్చును. దయామయుఁడైన పరమేశ్వరుఁడు దోషరహితులై చిత్తశుద్ధిగల సజ్జనుల కలయికను సౌఖ్యభాజనములు చేయును."

అప్పుడు గురు పిల్లనియె. "అమ్మా! బ్రహ్మచారి సరిగాఁ జెప్పినాఁడు. వెళ్ళి యతని యాజ్ఞాప్రకారము చేయుము. లోకులు కాకులు. ఇష్టమువచ్చిన ట్లనెదరు. నీవు నేను నటువంటి లోకులమాటలను నిరాకరింపవలసిన కాలము వచ్చినది నీవు నీ కుమారునకు సుధకుఁ జేయవలసిన ధర్మము చేయుము. పరమ దయాళుడైన భగవంతుఁడు భూమి మీఁదఁ బుట్టిన తనపుత్రికలు పారములేని దుఃఖ మనవసరముగ ననుభవింపవలసినదని కోరఁడు. అతఁడే వారి కూరట గల్గించు సౌఖ్యప్రదమైన మార్గములఁ జూపుచున్నాఁడు"

"తండ్రీ! చిత్తమున కూరటగలిగించు మీ పలుకులచేతను, బ్రహ్మచారియొక్క వచోవిశేషములచేతను నా మనంబు తేరినది. ప్రాణము చల్లఁగానున్నది ఇటువంటి పరమ పావనుల యుపదేశబలమునఁ దల్లి బిడ్డలయెడ నెంతపని చేయఁగలదో యంతపనియు నేను జేసెదను. నమ్ము నామాట. నేను చిరకాలము జీవింపను. సుధా శరచ్చంద్రులు వివాహమాడి యన్యోన్యానురాగము గలిగి చిరకాలము సుఖముగ జీవింపవలయునని నేను కడసారి ప్రార్థనఁ జేయుచున్నాను"

ఇరువది ఆరవ ప్రకరణము.

రాజగృహావం.

సుందరమైన వర్ధమానపట్టణమును విషాదమేఘము లావరించెను. బంగాళాదేశ మండలి గొప్పసంస్థానములలో వర్ధమానసంస్థానమొకటి. ఆసంస్థానప్రభువు రోగపీడితుఁడై మరణమునకు సిద్ధముగానుండెను. అతనికి సంతతిలేదు. బజారునందు దర్బారునందు నంతఃపురమునందు బదిమంది చేరినచోటులయందు నెల్లవారిమనస్సులను సంక్షోభ పెట్టు నట్టిప్రశ్నయొక్కటే. ఈయన మరణానంతరము రాజెవ్వరు? రాజుగారిభార్య యెవరినైన చుకొనును? రాజ్య త్రిష్ణ యట్టిపెంపు నకు ఏకరము నా?

సంతతిలేక యే గొప్పరాజయిన మృతినొందునప్పుడు హిందూదేశస్థుల మనంబు లటువంటిప్రశ్నలు కలఁతపెట్టుచుండును. మృతినొందినరాజునకు పుత్రసంతానము లేకపోయినయెడల వానిభార్య మఱియొకపిల్లవానిని దెచ్చి దత్తస్వీకారము జేసికొనవచ్చునని యనేక సహస్రవర్షములనుండి వ్యవహారములను బోధించుచున్న ధర్మశాస్త్రము లధికారమిచ్చుచున్నవి. అది యాచారమైన రాజకుటుంబములలోనే గాక సామాన్యకుటుంబములలో నైతము వర్తించుచున్నది. ఆ దత్తుఁడు ధర్మశాస్త్రమును బట్టియు నాచారమును బట్టియు మృతినొందినవానికిఁ బుత్రుఁడై యతని సర్వస్వమునకు వారసుఁడై యుండును. పెంపుడుతల్లి యతనిని వయ యుక్తికిఁ దీనికొనవచ్చి పెంచును. కుటుంబ సాంప్రదాయము లంబట్టి యతని నడపించును. అనుకూలమైన యీ వ్యవసల్ల సంతతి లేక నశించవలసిన యనేక రాజకుటుంబములు పారంపర్యముగ నిగిడి ప్రఖ్యాతములై యున్నవి. ఈ దత్తస్వీకారములవల్ల జ్ఞాతులలోఁ బోరాటములు నశించును. రాజ్యములకు వెన్నెముకయటి లేదు. అన్యబాధ లనేకములు తగ్గిపోవును. సంస్థానప్రభువు పురుషసంతాన శూన్యుఁడై చనిపోవునప్పుడు తాను స్థాపించిన [illegible] వంశము పారంపర్యముగ [illegible] సంస్థాన [illegible] ననియు [illegible] సంతుష్టులు కలిగి చావవచ్చును. ప్రయోజనకరమైన యీ వ్యవస్థను మత మే యంగీకరించుచున్నది. సంతానశూన్యుఁడై మృతినొందిన వానియాత్మ "పుత్రస్య గతి ర్నాస్తి" యను నార్యోక్తికిఁ బట్టి యుత్తరక్రియలు చేయువారు లేక సంతోషశూన్యమై పరలోకమున తిరుగును. దత్తపుత్రుఁడు నౌరసపుత్రునివంటివాఁడే. గనుక నుత్తరక్రియలలోప మెంతమాత్రము నుండదు. ఆ విధముగ నాత్మశాంతి కలుగును.

ఆంగ్లేయ ప్రభుత్వము హిందువుల [illegible] నంగీకరించెను. హిందూదేశమును దవచి తెమువచ్చినట్లు [illegible] దలచినయొక గవర్నరు [illegible] స్వదేశసంస్థానప్రభువులు చనిపోను [illegible] కనుక లేకుండబోయిన సంస్థానములను [illegible] చేసికొనవలయు [illegible] దాళాసనము నేర్పఱచెను. బుద్ధిహీనమైన [illegible] 1857 సంవత్సరమున జరిగిన గొప్పసిపాయిల పితూరీకి ముఖ్య కారణము. [illegible] మైన [illegible] గొప్పరాజు [illegible] ప్రభుత్వము [illegible] 1858 వ సంవత్సరమున జేసిన మహాప్రకటన ద్వారా [illegible] పారంపర్యముగ [illegible] స్వదేశ

సంస్థాన ప్రభువులు దత్త స్వీకారము చేసికొన వచ్చునని శాసించి యెల్లవారికి నమ్మిక గలిగించెను.

వర్ధమానసంస్థాన ప్రభువులు బలుమాఱు సంతానశూన్యులై దొరతనమువారిచ్చిన యీహక్కు నుపయోగించుకొనిరి. అప్పుడు వర్ధమాన మేలుచుండిన పడుచురాజా సంతతిలేక మృతినొందుటకు సిద్ధముగ నుండినను రాజెవ్వఁ డగు నన్న ప్రశ్న క్రొత్తగాఁ బుట్టినది గాదు. అదివఱకు సంస్థానముల నట్టి ప్రశ్న పెక్కుసారులు పుట్టి జనుల మనంబులను కలఁత పఱచినది.

ఒకనాఁడుమధ్యాహ్నము పట్టణమందు ముఖ్యులైన పురుషులు మువ్వురు రహస్యముగా నొకగదిలోఁ జేరి యాలోచనఁ జేయఁ దొడఁగిరి.

వర్ధమానపట్టణమందు బ్రిటిషు ప్రభుత్వమువా రేర్పఱచిన కమీషనరొకఁడుండును. ఇతఁడు మిక్కిలి గొప్పయుద్యోగస్థుఁడు. అతఁడు వర్ధమానసంస్థానమును రమారమి కోటి జనులు గల మఱియైదు జిల్లాలను బరిపాలించుచు నధికారము సేయుచుండును. అతఁడు వర్ధమానమునందే కాపుర ముండి తక్కినమండలములను సంవత్సరమున కొకసారి చూచి యామండలముల సరిగా నుంచుటకుఁ దానుపూఁచీ పడియుండును. అతఁడు జనులందఱితో నత్యంతసంబంధము కలిగి యుండును. ఆమండలములలోని విషయము లన్నియు నతని కడకే దీర్పునిమిత్తము వచ్చును. బహువ్యవహారసంబంధము లైన కాగితములు కట్టలు కట్టలుగా వచ్చిపడి యతని కాలము విశేషముగా నాక్రమించును. కలకత్తాలో నున్న ఇండియా గవర్నమెంటుతో నతనికి నిరంతరము సంబంధముండుటచేత నతఁడు తన యధికారమునందున్న జిల్లాలకు నిండియా గవర్నమెంటువారితో నాలోచించి యుత్తరువులు పంపుచుండును. పంపినయుత్తరువులు సరిగా నమలు జరిగినవో లేదోగమనించుచుండును. పని తొందరగలయొకదినమున నెడతెంపు లేని కార్యభారముచేత విసికి మధ్యాహ్నకాలమున నతఁడు తేయాకునీళ్ళు పుచ్చుకొన్న తరువాత వర్ధమానసంస్థానమును గూర్చిన విషయములను జర్చించుటకై తాను చేసినయేర్పాటు చొప్పున తనకచేరి గదిలోఁ జేరి యున్న పెద్ద మనుష్యులను గలసికొనుటకై యాగదిలోనికిఁ బోయెను.

అట్లు వచ్చినయుద్దఱు పెద్దమనుష్యులలో ముఖ్యుఁడు వనవిహారుఁడు రాజ్యకుటుంబము నకుఁ గలబంధువులలో నితఁ డత్యంతసమర్థుఁడు, బలాఢ్యుఁడు. వనవిహారుఁడు స[illegible]ముచేత న[illegible]ప్రసిద్ధుఁడు. ఆజిల్లాలలో నతనికంటె గొప్పగ [illegible]వారు లేరు.

అతనికంటె గొప్పవేటకాడు లేడు. అతనికంటె నేర్పుతో నాలుగుగుఱ్ఱముల బండిని మిక్కిలి యపాయకరములైన స్థలములందును సన్నని దారుల నడుమను నడుపగలవాడింకొకడు లేడు. వేటయందతనికిష్టము సహజమైనది. ఆంగ్లేయులు విందులు చేసి కొన్నప్పుడతఁడు సరిగ నాంగ్లేయుఁడువలెనే వ్యవహరింప నేర్చెను. అందుచేత నచ్చోట నున్న యూరోపియన్ స్త్రీలు సత్ప్రజ్ఞలుగల యాక్షత్రియుని సహజమైన నీతిని మెచ్చి కొనియాడఁజొచ్చిరి. ఈసుగుణసంపదలకుఁ దోడు వానికడ వ్యవహారములు చక్కఁబెట్టుటకుఁ గూర్చుండి పనిజేయుటకు మిక్కిలి యభిరుచి యుండెను. అట్టియోపికయు నట్టి దమకము నుండుటచేత జిరకాలానుభవముగల గొప్పయుద్యోగస్థులుకూడ వానియుక్తికి కచ్చెరువడి వర్ధమాన రాజకుటుంబమునం దక్కఁబడు వచ్చినట్టి మనిషి యతఁడే యని నిరూపింపఁ జొచ్చిరి. అతఁడచిరకాలమునకె సంస్థానవ్యవహారములఁ జక్కఁబెట్టుటలోఁ గొంత ప్రధానస్థాన మాక్రమించెను. సంస్థానవిషయములైన తీర్పులన్నియు నవవిహారుని సమ్మతిఁ బడయకుండ జరుగుటలేదు.

అతనితో వచ్చిన రెండవపెద్ద మనుష్యుఁడు నెమ్మదిగలవాఁడు, మంచి యాలోచన గలవాఁడు. ఏజోక్యమునకుఁ బోనివాఁడు. దుర్బలశరీరుఁడు. చిన్నప్పుడే తల నెఱసినది. అతనిపేరు సత్యచరణుఁడు. అతఁడు వర్ధమానములో గొప్పన్యాయవాది. బంగాళాదేశములో నతని సమానులు అరుదుగా నుందురు. అతఁడు మితభాషి. అడిగిన ప్రశ్నములకు మాత్రము సరిగా నాలోచించి తగిన ప్రత్యుత్తరములు చెప్పును. అతఁడు పదిమందిలో దిరుగుట కిష్టముగలవాఁడు కాఁడు. విందులకు సభలకుఁ దఱుచుగాఁ బోయెడివాఁడుకాఁడు. తనపని యేమో తనగొడవయేమో. ఆపనిలో నతనిని మించినవాఁడు లేనేలేఁడు. సమానులు స్వల్పసంఖ్యాకులుండవచ్చును. ఆస్థానమందలి గొప్పగొప్ప యుద్యోగస్థులు వానిసలహా లేకుండ ధర్మశాస్త్రసంబంధములైన వ్యవహారములలో దిగెడువారుకారు. బంగాళాదేశమందలి గొప్ప ధర్మశాస్త్రవేత్తలు సత్యచరణునితో బరిచయము గలిగియుండి వానిని మిక్కిలి గౌరవింతురు.

పరిచారకుఁడు తేయాకు నీటిపాత్రలు తీసివేసినతరువాత వారికి ముఖ్యమగు సంభాషణ మారంభమయ్యెను. కమీషనరు ముందుగా నిట్లనియెను. "మనకిప్పుడు మూల నొక పెద్దబెడదవచ్చి పడినది. వర్ధమానరాజ్యము తిరిగి గొడవలలోఁ బడునని తోఁచుచున్నది."

"ఔను. అలాగే కనుపించుచున్నది. ఈ రాజ్యముయొక్క యావత్తు చరిత్రము మొదటినుండియు నిట్లే చిత్రకథవలె జరుగుచున్నది." యని వనవిహారుఁడు బదులు చెప్పెను.

"సరిగా నాలాగే జరుగుచున్నది. రెండువందల సంవత్సరములకంటెఁ బూర్వము నుండి దీని చరిత్ర కలదు కదా?"

"ఔను! మహాసాహసుఁడైన అబూరాయులు పంజాబు దేశమునుండి వచ్చి వర్ధమానమునఁ గాపురముండి 1667 సంవత్సరమున నీ సంస్థానమును స్థాపించెను. కంపెనీ ప్లాసీయుద్ధమును గెలుచుటకు సరిగా నూరేండ్లకుముందు సంస్థానమును స్థాపింపఁబడినది. కాని యాబూరాయుల పుత్రుఁడైన కృష్ణరాయుని కాలములో రాజ్యము వృద్ధిఁ బొందినది. అతఁడు రాజ్యమునకు క్రొత్తప్రదేశములకలిపి మొగలాయి చక్రవర్తి వద్దనుండి తనయధికారము స్థిరముగాఁ జేయు ఫర్మానాలు సంపాదించెను. అతని కాలమందు జరిగిన పితూరీకథ మీరెఱిఁగి యుండవచ్చును. ఏలనఁగా నది యాంగ్లేయుచరిత్రతో సంబంధముకలది."

"అంత చక్కఁగా దెలియదు. మాకు మా యాంగ్లేయుచరిత్రము తెలిసిన దానికంటె నుద్యోగస్థులతో బ్రతికినచో జరుగునట్టి యుత్తముల వ్యవహారము బాగుగా దెలియును."

"ఎఱుఁగరా? సుబ్బసింగను వాఁడు పితూరీచేసి యుద్ధమునందు కృష్ణరాముని జంపెను. ఈ పితూరీలో యింగ్లీషువారు కలుగఁజేసికొన్న తమ సాకుల కోటచుట్టు గోడపెట్టుకొని బలపఱచుకొనిరి. ఆ పితూరీచరిత్ర చిత్రకథవలె సమాప్తినొందినది. సుబ్బసింగు కృష్ణరాముని కూఁతురు సౌందర్యముఁ జూచి యామెను బలవంతముగఁ గౌఁగిలించుటకుఁ బ్రయత్నము చేసెననియు, నుత్తమ క్షత్రియాన్వయమైన యా యువతీమణి పితృఘాతుకుఁడైన యా దురాత్మునిహృదయము రోసి వానిని ఖడ్గములోఁ బొడిచి చంపెననియు వాడుకగలదు."

"అది చిత్రమైన వచనకావ్యము కాఁగలదు. వనవిహారుఁడా! నీ వా కథ నేల వ్రాయఁగూడదు."

"వ్రాత నాకుఁ దగినపని కాదు. అందులో నేర్పుగలవారికా విషయము నేను విడిచివేయుచున్నాను."

"నీవు చెప్పినది సరే! వ్రాత నీ పని కాదు. నీవు గొప్పకార్యములు చేయుటకు జన్మించితివి కాని గ్రంథకర్తవగుటకు జనింపలేదు. ఈ సమయమందు నీకు గావలసినంత

పనియున్నది. కానీ, చెప్పుచెప్పు. కృష్ణరాముడు, సుబ్బాసింగు ప్రపంచమునుండి యదృశ్యులైన తరువాత వర్ధమానము రాజ్యమువారేమైనది?"

"కృష్ణరాముని మనుమడైన కీర్తిచంద్రునిలో నీ వంశము నిజముగా ప్రాముఖ్యమైనది. తూర్పునను నుత్తరమునను నతడు చాలాభాగములను సంస్థానములలో గలుపుకొనియెను. వానికి నిజమైన పక్షమునం బడమటి దిక్కున నడవిలో నెదో మూలనున్న విష్ణుపుర వృద్ధరాజుకూడ వాని మూలమునం గొంత నష్టపడియెను. కాని కీర్తిచంద్రుడు తన సంస్థానమును వృద్ధిజేసికొనుటతోం దనివోందక స్వదేశరక్షణార్థమై కూడ నడుము గట్టుకొని నిలిచెను. మహారాష్ట్రులు బంగాళముమీదికి దండెత్తి వచ్చినప్పుడు బంగాళము నేలుచుండిన మహమ్మదీయుని పక్షమున నిలిచి కీర్తిచంద్రుడు పలుమారు పోరాడెను. 1740 వ సంవత్సరమున కీర్తిచంద్రుడు మృతినొందినప్పుడు వర్ధమానరాజ్యము బంగాళాదేశములో నంతట ముఖ్యమైనదయ్యెను."

"తరువాత నేమి జరిగినది?"

"ఆ కథ మిక్కిలి దీర్ఘమైనది సంగ్రహముగాం జెప్పెదను. ఆంగ్లేయులు బంగాళాదేశమునకు సర్వాధికారులైన వెనుక తేజచంద్రుడను వాడు వర్ధమానపు రాజయ్యెను. అతడు కీర్తిచంద్రునకు మూడవ తరమువాడు. పాపము! తేజచంద్రుని దృష్టికప్పటి గవర్నరుజనరలైన వారనుహేస్టింగ్సుచే నియమింపబడిన కలెక్టరులు పూర్వపు మహారాష్ట్రపు కలెక్టర్లకంటెను తురకకలెక్టర్లకంటె నధికతరబాధకులై యుండిరి. మీరు వారనుహేస్టింగ్సు యొక్క చరిత్రమును, రాజులు సరిగా గడువునాటికి శిస్తు చెల్లింపంజాలనందుకు వారినతడు చెరసాలలో నుంచిన కథలు మీరెరుంగుదురు కదా!"

"ఎరుగుదును గాని అప్పుడు వారన్‌హేస్టింగ్సు ప్రాణములమీదికే వచ్చినది. అందుచేత నతడు రాజులనుబట్టి సొమ్ముకొఱకు పీడింపవలసి వచ్చెను. కాని యతని యనంతరమున గవర్నరుజనరలైన కారన్‌వాలీసు ప్రభువు వానికంటె నుపకారుడై పరిపాలనమునందుం గల లోపముల నన్ని సవరించెను."

"నిజమే! 1793 వ సంవత్సరమందు కారన్‌వాలీసుప్రభువు నేలపన్ను ప్రతి సంవత్సరము మార్పుచెందకుండ శాశ్వతముగ నొకేకొంత యియ్యవలసినదని యేర్పాటు చేయుటచేత బంగాళాదేశపు రాజకుటుంబములు నాశనమొందకుండ నిలిచెను. నేంటి కాలమున నేల విశేషముగం బండినపక్షమున నది యంతయుం బ్రజలకే పోవును.

హిందూదేశమందలి పరగణాలన్నిటిలో బంగాళాదేశము మిక్కిలి భాగ్యవంతమై యైశ్వర్యమున కాస్పదమై యున్నది."

అవ్వుడు నవ్వి కమీషన రిట్లనెను — "మీ జమీందారులు 1793 వ సంవత్సర మందు నేలపన్ను విషయమై జరిగిన శాశ్వతవ్యవస్థకు సంతోషింతురు. కాని మాదృష్టి కది మఱియొక లాగున నున్నది. గవర్నమెంటువారికి రావలసిన శిస్తునకు హద్దు నేర్పరుచుటచేత సర్కారువారి కది నష్టము కాదా? రావలసినసొమ్ము రాకపోవుచుండుట లేదా? మీరు జమీందారులు కనుక మాదృష్టితో మీరు చూడలేరు. కాని సత్యచరణునివంటి లాయరు దీని విషయమై యేమి యభిప్రాయపడును?"

అంతసేపటినుండియు సత్యచరణుఁడు మాటలాడక వారిసంభాషణ వినుచుండెను. అప్పుడు కమీషనరు తన యభిప్రాయ మడిగినందున నధరస్పందము చేసి మెల్లన నిట్లనెను "అయ్యా! గవర్నమెంటు ప్రజలమేలు నిమిత్తమై యున్నది. ప్రజల హితమునకు విరుద్ధములైన హక్కులు గవర్నమెంటువారి కుండజాలవు."

"నీ వన్నది సరే! కాని కృషి వృద్ధిచెందినకొలఁది భూములమీఁద శిస్తు హెచ్చు కట్టి దొరతనమువారు సొమ్మెక్కువ తీయుట ప్రజలకుఁగూడ లాభకరము కాదా?"

"కాదయ్యా కాదు! అది హిందూదేశములోఁ బనికిరాదు. హిందూదేశములో మానేతపనులు, తక్కిన చేతిపనులు క్షీణించినవి. మావాణిజ్యమంతయు యూరోపియను వర్తకులచేతిలో నున్నది. మాదేశమందలిగను లన్నిటిలో యూరోపియను వర్తకులే పెట్టుబడిపెట్టి పనిచేయించుచున్నారు. కాఁబట్టి మాజాతికి జీవనాధారము భూమిమీఁదఁ బండినపంట యొక్కటే. మాదేశపుజనసంఖ్యలో నైదువంతులలో నాలుగువంతులు నేలదున్నుకునే బ్రదుకుచున్నారు. ఆవిషయములో గవర్నమెంటువారు కొంతహద్దు నేర్పరచి యంతకంటె నెక్కువ పుచ్చుకోమని నియమమేర్పరుచు కొన్నపక్షమున జనులు క్రమక్రమముగ బాగుపడి భాగ్యవంతులగుదురు. ఆలాగున మీరు బంగాళాదేశములో నేలపన్నుకు హద్దు నేర్పరచినారు. అందుకే బంగాళాదేశము బాగున్నది. చెన్నపురి రాజధానియందును, బొంబాయి రాజధానియందును, ఉత్తరహిందూస్థానమందును నీవిధముగా నేలపన్నుకు శాశ్వతవ్యవస్థ నేర్పరుప లేదు. కాఁబట్టి యాపరగణాలు నిరంతర దారిద్ర్యమునకు నెలవులై యున్నవి."

"సత్యచరణుఁడా! అది నీవేలాగున ఋజావు చేయఁగలవు" అని కమీషన రడిగెను.

"కాటకముల చరిత్రములే నామాట ఋజావు చేయును. శాశ్వతవ్యవస్థయున్న బంగాళాదేశములో క్షామములు మిక్కిలి తక్కువ. కడచిన నూరుసంవత్సరములలో ప్రాణాపాయములు కలిగించిన కాటకములు లేనే లేవు. తక్కినభాగములలో క్షామములు మెండు. ప్రాణనష్ట మధికము. 1877 సంవత్సరమం దనఁగా ధాతసంవత్సరపు కరువునకు చెన్నపురి రాజధానిలో నేబదిలక్షలమంది చచ్చిపోయిరి."

"కాని, బంగాళాదేశములో గవర్న మెంటువారు శిస్తునకు హద్దు నేర్పరుచుటచేత జనుల కెట్లు సహాయము కలుగునో నాకుఁ దెలియకున్నది. నామిత్రుఁడైన వనవిహారుని వంటి జమీందారుల కాపద్ధతి యుపయోగకరముగా నున్నది. వారు విశేషధనము ప్రోగుచేసి తెలివిమాలిన పనులకుగాను వ్యయము చేయుదురు. కాని జనుల కేమి లాభమో చెప్పు?"

"అయ్యా! పంట విశేషముగా బండినప్పుడు బంగాళా జమీందారుల కేమియు లాభములేదు. అట్టి పంటవలన లాభము సామాన్యముగ జనులే యనుభవించి బాగుపడుదురు. బంగాళాదేశమందలి పాటకపుజనులు, సామాన్య సంసారులుకూడ దాదాపు కొన్ని సొమ్ము భూములమీఁదఁ బెట్టుచుందురు. పంటలు బాగుగా బండినా దానివలన మఱింత బాగుపడుదురు. కారనువాలీసు ప్రభువుయొక్క ధర్మకార్యము చిరసౌఖ్యప్రదమై కొద్దిమందికి మాత్రమే గాక కోటానకోట్ల జనులకు నుపకారమై సౌఖ్యము నాపాదించుచున్నది. ఇండియాకు వచ్చిన రాజప్రతినిధులలో లారెన్సుప్రభువు, కానింగు ప్రభువు మిక్కిలి గొప్పవారు. వారిద్దఱు గూడ హిందూదేశమందలి యెల్లభాగములలో నేలపన్ను విషయమై శాశ్వతవ్యవస్థ నేర్పరుపవలయునని పాటుపడిరి. వారి ప్రయత్నములు కొనసాగియుండిన పక్షమున నేఁటికాలమున మన మిన్ని కరువులమాట వినక పోయి యుందుము."

"సత్యచరణుఁడా! కొంతవఱకు నీమాట సరియే. నీవు దెలిపినట్టు పన్నులలోని యంతరువులు, విభాగములు నాకుఁ దెలియవు. కాని భూమిమీఁదఁ బంటలు విశేషముగఁ బండినప్పుడు దానిఫలము గొప్పవారు మొదలుకొని కొదివారివఱకు నెల్లవారు సమానముగా ననుభవింపవలసినదని మీరు చెప్పెడి పక్షమున మీ మాట నే నంగీకరించెదను.

కాని జనులందరు విశేషఫల మనుభవించు చున్నప్పుడు గవర్నమెంటువారుకూడ దానిలో గొంతభాగ మనుభవింపఁగూడదా ? గవర్నమెంటు జనుల మేలుకొఱకే యున్నదని మీ యంతట మీరే యన్నారుగదా! గవర్నమెంటువారికంతు వచ్చెడు లాభమంతయు జనుల మేలు నిమిత్తమే యుపయోగపడును. ఆ ధన మేదోరూపమున మరల జనులకే వెళ్ళి పోవును. అందువలన జనులవర్తకము చేతిపనులు వృద్ధిపొందును."

"అయ్యా! మా దురదృష్టవశమున హిందూదేశములో నట్లు కా విధముగా జరుగదు. రమారమి ముప్పదికోట్ల రూపాయలు అనఁగా మాదేశస్థులు గవర్నమెంటువారికిఁ జెల్లించెడు శిస్తులో సగము ప్రతిసంవత్సరము మీ యింగ్లాండుదేశమునకు మా దేశము నుండి పోవుచున్నది. దానికిఁ దగిన ప్రతిఫలము మీ దేశమునుండి మాకు వచ్చుటలేదు. మేము పన్నులక్రింద నిచ్చుదానిలో సగము దేశములోనుండి వెళ్ళి జనులకే రూపము నను వచ్చుటలేదు. నేటికాలమున భూమండలమున నే దేశ మీ విధమున నష్ట మనుభవించుటలేదు. ఇటువంటి నష్టము ప్రపంచములో నే దేశము సహింపలేదు. ఇట్లు నష్టపడుచున్న దేశమున దారిద్ర్యముండక, క్షామములుండక మరేమి యుండును? ప్రాచీనకాలమందు రోమురాజ్యము గాలుదేశమును, ఈజిప్టుదేశమును, సిసిలీద్వీపమును, పాలెస్టయిను దేశమును దోచుకొని వాటిని దరిద్రదేశములుచేసి తాను బాగుపడెనని మీరు నిందించుచున్నారు. అమెరికా ఖండమును, హాలండుదేశమును దోచుకొని తాను భాగ్యవంతురాలైనదని స్పెయినుదేశమును మీరధిక్షేపించుచున్నారు. ఇంగ్లండు హిందూదేశములో నటువంటి పద్ధతులే యవలంబించినమాట తాను తెలిసికొనలేకున్నది. హిందూదేశమును గొప్ప కరువులకునికిపట్టుగా, దారిద్ర్యమునకు జన్మభూమిగాఁ జేయుటయే గాని యీ విధమైన ధనసంపాదనమువల్ల నింకెంత బాగుపడినదో ఇంగ్లాండు నంతే బాగుపడును. స్పెయిను కెంత మంచికాలము వచ్చినదో మీ దేశమంత ముందరకువచ్చును. నా యభిప్రాయము నేను దాచక చెప్పినందుకు నన్ను క్షమింపవలెను. కాని యీ విషయము మీరు మేము కూడ గట్టిగా నాలోచించవలసిన విషయమే."

"మీరు నా యభిప్రాయములను న్యాయముగఁ జెప్పినారు. అందుకు మిమ్ము నేను మెచ్చుకొనుచున్నాను. నేను మీతో నేకీభవింపఁజాలను. కాని కొన్ని విషయములలో మీ వాదమే సరియై యుండవచ్చును. నా మట్టుకు నేనెప్పుడును మితవ్యయమే చేయవలయునని చెప్పుచుందును. ఎటులైన హిందూదేశమునుండి ధన మీవిధముగాఁ బోవుట నాకిష్టములేదు. కని ప్రస్తుతప్రయోగము మారుచున్నది. కాని నాలోను

ప్రభువు బంగాళాదేశమునందు శాశ్వతవ్యవస్థ చేసినప్పుడు తేజచంద్రుఁ డుండినాడని యతని కాలపు సంగతులు వనవిహారుఁడు చెప్పుచుండెను. అది యేమో విందము.”

“ఔనండి! కాని యింక నేను చెప్పవలసినది విస్తారము లేదు. 1832 సంవత్సరమందు తేజచంద్రుఁడు మృతినొందెను. అప్పు డొకదొంగవాఁడు బయలుదేరెను. అతఁ డొక గొప్పవ్యాజ్యము తెచ్చెను. అది దేశమున గొప్ప సంక్షోభము కలిగించెను. కాని యాదొంగవారసులు చివర కోడిపోయిరి. దత్తపుత్రుఁడైన మహాతాబుచంద్రుఁడు గెలిచెను. గొప్ప సంస్థానమునకు గొప్పప్రభువై యతఁడు వ్యవహార మెంతచక్కఁగాఁ జేసెనో, 1855 సంవత్సరమందు బయలుదేరిన సంతాలుజాతివారిపితూరీలో గవర్నమెంటువారి కతఁ డెట్టిరాజభక్తితో సాయము చేసెనో, 1857 సంవత్సరమందు జరిగిన శిపాయి పితూరీలో నతఁ డేరీతిని గవర్నమెంటువారి పక్షము నవలంబించి తోడుపడెనో, యెట్టకేలకు 1894 సంవత్సరమందు గవర్నమెంటువారు రాజప్రతినిధిగారి శాసననిర్మాణసభలో సభ్యుఁడుగా నేర్పరచి యతని నెట్లు గౌరవించిరో మీ కందఱకు దెలిసిన విషయమే. సుప్రసిద్ధమై దీర్ఘమైన యాతనిజీవనము ముగిసిన తరువాత నిప్పటిరాజు సింహాసన మెక్కెను. అతనిసద్గుణము లేమియు నితనివద్ద లేవు కదా! ఇతఁ డేలినదే స్వల్పకాలము. సంస్థానము పాడుచేసెను. అధికారము దుర్వినియోగము చేసెను. అప్పుడు మిక్కిలి చిన్నతనమందే తన దురాచారములకు బలియై మంచ మెక్కి మరణమునకు సిద్ధముగా నున్నాడు.”

“వనవిహారీ! ఇది నిజముగా విచారకరమే! నాకు మిక్కిలి దుఃఖముగా నున్నది. బంగాళాదేశపు జమీందారు లందఱు మహాతాబుచంద్రునివలె బుద్ధిమంతులై తమ తమ సంస్థానములను బాగుచేసికొని మంచివారై యుండవలయు నని బ్రిటిషు గవర్నమెంటు వారు కోరుచున్నారు. ఇప్పుడు పెంచుకొనఁబడు చున్నపిల్లవాఁడు క్రమమైన విద్యాభ్యాసము కలిగి చిన్నతనమందుఁ జెడిపోకుండ కట్టుదిట్టముగ నుండవలె నని కోరుచున్నాము. ఎవరిని పెంచుకొనఁదలఁచుకొన్నారో మీ రేమైన జాడకట్టితిరా?”

ప్రశాంతమై సుస్థిరమైన యాతని ముఖము నుండి సుందరియు [illegible] యును బట్టి యతని యుగ్రత [illegible] సాధ్యము కాదు. అతఁ డిట్లు బదులు చెప్పెను. “అది చిన్న రాణిగారియొక్క [illegible] నున్నది. [illegible]

ఆమె తనయిష్ట ప్రకారము చేయునట్టి స్వభావము కలది. అత్తగారిమాట కోడలు మన్నించును."

"రాజుతల్లి మంచిపిల్లవాని చేరి తీసికొని వచ్చునా?"

"అయ్యా! తీసికొనివచ్చు నని నమ్మకము కలదు. ఆమె మంచిమనస్సు కలది. చనిపోయిన మహాత్ముడగు రాజునకు రెండవభార్య. ఆమె నన్నుఁ జన్మనాటనుండి యెఱుఁగును. అప్పుడీరాజకుటుంబమే నన్ను బోషించినది. ఆమె నన్నెప్పుడు మిక్కిలిదయతో నాదరించుచు వచ్చినది. కాలక్రమమున నామెకు నామీద గలగౌరవము తగ్గిపోయినను నే నామెయెడ ధర్మము తప్పినకార్యము చేసిన పాపమునఁబోను. ఆమె యెడ గౌరవ విహీనమైనమాట నానోట నెన్నఁడు వెడలదు."

"వనవిహారీ! నీవంటివాని యొద్దనుండి తద్వ్యతిరేకమైన కార్యము వచ్చు నని మేమనుకొనము. కాని ముఖ్యాంశము విచారణచేయుదము. మీపిల్లవాఁడు మిక్కిలి చక్కనివాఁడు కదా? వర్తమానములో నతఁ డెవరికంటె తెలివిగలవాఁడు చురుకైన వాఁడు. ఇప్పటిరాజుగారును మీరును ఏకజాతివారును ఏకశాఖవారును కదా? రాణికి మీపిల్లవానిమీఁద నభిమాన మనియు, నతని నే పెంచుకొనుననియు వాడుక గలదు. అదినిజమైన పక్షమున మీరే యతనికిఁ జదువు చెప్పించి విద్యాబుద్ధులు నేర్పవచ్చును. కాలక్రమమున నతఁడు బాగుపడి మహారాజు కాఁదగినవాఁడై ప్రసిద్ధిఁ గాంచును. నేనూహించిన దానిలో నసంభవ మేమైన నున్నదా?" అని కమీషనరుదృష్టి యతనిమీఁద నిలిపెను. కాని వనవిహారుని మొగము మునుపటివలెనే దుర్భేద్యమై తలంపులను వెలిబుచ్చలేదు.

"రాజుగారితల్లి నాకుమారునిపై నభిమానము నిలుపు నని నే ననుకొనను. చిన్న రాణీ నాకుమారునిఁ బెంచుకొన నిశ్చయించు నేని రాజుగారితల్లి పెంపు చెల్లగూడ దని కోర్టులలో దిగి పోరాడవచ్చును."

"ధనప్రయోగమువలన మార్గము సుగమము కాదా? రాజగృహమందలికొల్లు సొమ్ముతో నిండియున్న వని వాడుక. రాజుగారితల్లి కభిమానము గల బాలకు లెవరైన నున్న పక్షమున వారికిఁ గావలసినధనమామె యిచ్చివేసి మీ కుమారుని దత్తత కంగీకరించిన బాగుండును."

"రాజుగారితల్లి యున్నతమనస్కురాలు. ఆమె ధనము పాపభూయిష్ఠముగాఁ జూచును. [illegible] తనమాటయు [illegible] చేసినను ఆమె దానిని గడ్డిపరకగాఁ జూచి

రమేశమ్మనకో, దేబంధువునకో యిచ్చివేయును. ఆమె చక్కది. పుణ్యాత్మురాలు. ఆమెకు సొమ్మక్కఱలేదు. ధన మామె కాశను గలిగింపలేదు.''

ఆసంభాషణము మఱియొకగంటసేపు జరిగెను. కాని యిదమిద్ధమని కార్యనిశ్చయము కాలేదు. చిన్నరాణి యెవరిని దెచ్చుకొనునో యని వర్ధమానపురవాసు లందఱు మిక్కిలి యాతురముతో గనిపెట్టియుండిరి. దత్తతకు గల బాలకుండ్రయొక్క గుణాగుణములు, భాగ్యాభాగ్యములు చాటుగ దుకాణములలోను, లాయరుల కచ్చేరులలోను చర్చింపబడజొచ్చెను. ఇట్టి తలంపులలో బట్టణమంతయు రెండుభాగములయ్యెను. చిన్నరాణి చేయబోవు కార్యనిశ్చయము నెల్లవారు మిక్కిలి యాతురముతో నిరీక్షించుచుండిరి.

కవిభూషణుడుగూడ నామె చేయు కార్యనిశ్చయమున కెదురుచూచుచుండెను. ఆసాయంకాలము వనవిహారుడును, సత్యధనుడును సెలవుతీసికొని పోవునప్పుడతడిట్లనియె. "ఆమె యెవరిని దెచ్చుకొన్నను సరే. ఆ దత్తపుత్రుడు తన కృత్యములను జాగ్రత్తగా నెఱవేర్చుటకు గావలసిన విద్యాబుద్ధులు జాగ్రత్తగా నేర్పించవలెను. యుక్తవయస్కుడగువఱకు నా బాలకుని సంస్థానము ట్రస్టీలు గవర్నమెంటువారు చక్కబెట్టుచుందురు. గొప్ప మహారాజులకు గావలసిన విద్య, బుద్ధి, కార్యశక్తి మొదలగునవి యలవడుటకే ప్రయత్నములు కావలెనో యా ప్రయత్నములన్నియు దొరతనమువారు తప్పక చేసి బాలకుని బాగుచేయుదురు."

ఇరువదిఏడవ ప్రకరణము

సాయంకాలపు విందు.

కవిభూషణుడుదగ్గఱ సెలవుపుచ్చుకొని వనవిహారుడు జగత్కిశోరరాయుల గృహమునకు గుఱ్ఱపుబండిమీద వెళ్లెను. కిశోరరాయులు వనవిహారుని, మఱికొందఱు మిత్రులను సాయంకాలమున జిన్న విందునకు బిలిచెను. జగత్కిశోరరాయులు జగన్నాథక్షేత్రము నుండివచ్చెను. అతని దేహస్థితి చక్కబడుటచే నతడు క్రొత్తమనుష్యుడువలె నుండెను. మునుపటికంటె శరీరమునకు బలమువచ్చెను. బలమేకాక సంతోషము మనమునకుగూడ వచ్చినట్లుండెను. అతని మేనత్తలు, తమ్ములు, మఱి యితరబంధువు లనేకులు విశాలమైన వాని

పైతృకగృహమునందు నివసించుచుండిరి. కాని జగత్కిశోరరాయలు మాత్రము పట్టణమందు మిక్కిలి తెరపిగా నున్నచోట భార్యాసమేతుఁడై తోటలో నొకయింటఁ గాపురము సేయుచుండెను. రాణిగంజిలో నున్న యతనివైద్యుఁ డా విధముగాఁ జేయవలసిన దని యుపదేశము చేయుటచే నతఁ డా హితోపదేశము ననుసరించుట మంచిదని తలంచెను.

జగత్కిశోరుని యొక్కయు, భార్యయొక్కయు, బంధువులలో నొక గొప్ప మార్పు కలిగెను. అతఁడు రోగపీడితుఁడైన దినములలో భార్య చూపినశ్రద్ధకు, జాగ్రత్తకు నిద్రాహారములు లేక చేసినసేవకు నతఁడు కడు మెచ్చెను. అతని మనస్సు కఱఁగి పోయెను. అందుచే నతఁడు మహాపతివ్రతయై పరమభక్తురాలైన భార్యయెడ మునుపటి కంటె నధికానురాగముఁ జూపి యెక్కువదయను గలవాఁడై యుండెను. తాను జబ్బుపడి యున్నపుడు తననిమిత్త మెప్పటికప్పుడు పాలు కాచి గిన్నెలోబోసి యిచ్చుచు, తనకు నిద్ర పట్టువఱకు మెల్లగ నేదో చల్లనిమాటలుచెప్పి లాలించుచు, తెలువారి పాదము లొత్తుచు రాత్రి ప్రొద్దుపోవువఱకుఁ దనసంరక్షణమే యామె చేయుచుండుట యతఁడు కనిపెట్టి చూచెను. తనకు మెలఁకువవచ్చి చూచినప్పు డామె తనప్రక్కనే కూర్చుండి తనకు నిద్ర పట్టినదో లేదో యని యామె యాతురపడుచుండుట నతఁ డెన్నోసారులు చూచెను. దాదాపుగా రాత్రి యంతయు మేలుకొని నాలవజామున జేఱఁగొంగుఁ బఱచుకొని తన పాదములయొద్ద బండుకొనుటయు నతఁడు స్వయముగఁ జూచెను. తెల్లవారఁగానే యామె స్వసౌఖ్యము జూచుకొనక తన పథ్యపానములు చేయుచు, తన సౌఖ్యముల నిమిత్తము పాటుపడుచు నుండుటయు నతనికి స్వానుభవమైన విషయమె. అవి యన్నియు జూచిన పిదప మగని కాయిల్లాలిమీఁద నతిశయప్రేమ పొడమెను. అట్టి భక్తిగల భార్య మీఁద ననురాగము గలుగుట యాశ్చర్యమా!

భార్యాభర్తలిద్దఱు ప్రత్యేకముగాఁ గాపురము సేయుచున్న యింటికి రమారమి యిరువది సంవత్సరములు వయస్సుగల యొక బాలిక యజమానురాలై యిల్లు దిద్దుకొను చుండెను. అతఁ డామెను తఱచుగాఁ గలిసికొని తనవ్యవహారములలో నామె యాలోచన నడుగుచు శీతకాలమున రాత్రులు ప్రొద్దుపోవుటకు మనోజ్ఞములైన యామెపలుకులు విని యానందించుచుండెను. వారి సంగతి యీ రీతి దినములలో మిక్కిలి బాగుగా దెలిసెను. అందువలన వారి హృదయములు కలిసిపోయెను. వివాహమైన తరువాతఁ జిన్న పెండ్లి

కూఁతురు పదునాల్గవ వర్షము కలిగి యుక్తవయస్కురాలై సంపూర్ణయువతియై గృహారాజమానురాలైనప్పుడు హిందూదేశములో నీ విధముగా భార్యాభర్తల కన్యోన్యానురాగము కలుగుచుండును. మొదట బాలికయై కాపురమునకు వచ్చి పతిభక్తి మొదలైన యుత్తమలక్షణములు నేర్చుకొని యువతియైన పిదప లభించినట్టి యనురాగమును జూపును. అట్లుగలయుంచిన యనురాగము యావజ్జీవము నిలుచును. లేతప్రాయమున నేర్చుకొన్న పతిభక్తిని భార్య జన్మమధ్యమున నెన్నఁడు మరువదు. భర్తయు బాలికయై మొదటఁ దనవద్దకువచ్చి తన బిగియారు కౌఁగిళ్ళ నణఁగి పెనఁగి, తన శిక్షలో బెరిగి విలాసవంతురాలై, యనురాగవతియై యువతీరత్నమైన యా భార్యను జన్మాంతమువరకు గాఢానురాగములోఁ జూచును.

ఆ సాయంకాలమున జగత్కిశోరరాయలు కచేరీచావడిలోఁ దానుపిలిచిన పెద్ద మనుష్యుల నెదుర్కొని సన్మానించుచుండగా సుఖముగా జగన్నాథయాత్ర చేసివచ్చి నందుకు బహూకరింపవచ్చిన యువకులతో గలసి కాళీ యింటిలోపల ముచ్చటలాడుచుండెను. అధికారములోను, పలుకుబడిలోను క్రమక్రమముగా వృద్ధినొందుచున్న వనవిహారుని జగత్కిశోరుఁడు హృదయపూర్వకముగ సన్మానించి యాదరించెను. అతనికే కాదు తన యాహ్వానమంగీకరించి యొక్కరొక్కరుగా వచ్చిన మిత్రులందఱు యథోచితముగ సత్కరించి గౌరవించెను.

కిశోరరాయలు హృదయపూర్వకముగా సల్లాపములు చేయుచు వనవిహారునితో నొకమూల గూర్చుండెను. అప్పుడు బహుదీపములతో వెలయుచున్న యా విశాల మందిరమున వీణావాదము, గాత్రగానము వ్యాపించెను. వనవిహారునకు లాలాసాహెబని రెండవపేరు కలదు. మిత్రులా పేరుతోఁ దఱచుగాఁ బిలుచుచుందురు. "లాలాసాహెబు! నిన్ను మరల జూచెడిభాగ్యము నాకుఁ గలిగినందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. నేను వర్ధమానపట్టణము విడిచివెళ్ళినప్పుడు మరల బ్రతికివత్తునని తలంపలేను."

"జగత్కిశోర! నిన్నిటువంటి మంచిదశలోఁ జూడఁగలిగినందులకు సంతోషము నొందితి. నీ కింకను నలువదియేండ్లయిన నిండలేదు. నీ వింక ననేక సంవత్సరములు సుఖముగా జీవింపవలెనని మేము గోరుచున్నాము. ప్రయాగము, స్థలమార్పు నీ కెంతో మేలు చేసినది. నీవు మునుపటికంటె బడుచువాఁడవులాగునఁ గనబడుచున్నావు."

"ఔను! లాలాసాహేబూ! ఈ ప్రయాణము నాకెంతో మేలుచేసినది. ఇల్లు విడచి వెళ్ళుట కెన్నడిష్టపడని జనులకు మనకు ప్రాచీనమహర్షులు తీర్థయాత్రలు విధించి నప్పుడు కేవలము మతసంబంధములైన కర్మలు చేయించుటయే వారి యుద్దేశ్యముకాదు. అంతకంటె నధికములైన యుద్దేశములేవో యుండితీరవలయును. తీర్థయాత్ర యనగా స్థలము మార్పు, ప్రయాణము, నూతనప్రదేశ సందర్శనము. తీర్థయాత్ర మన దేహస్థితిం జక్కజేయును. జీవితకాలము వృద్ధియగును."

"ఔను! అది నిజమే. కాని పూజ్యురాలయిన మీతల్లి పూరీక్షేత్రములోనే యుండిపోవుటకు నిశ్చయించుకొన్నదట!"

"ఔను. ఆమె లేనివెలితి ప్రతిదినము మాకుఁ గనబడుచున్నది. కాని యామె చరమకాలమును ప్రశాంతముగా గొడవలు లేకుండ గడుపుటయే మంచిది. ఎందుచేత ననఁగా మా సంసారమువంటి గొప్పసంసారము చక్కబెట్టుటచేత నామె దేహస్థితి యిదివరకే చెడిపోయినది. ఆమె పూరీక్షేత్రములో నెక్కువకాలము బ్రతుకును. ఎక్కువ సౌఖ్యముగ నుండును. ఆమె క్షేమ మెప్పటికప్పటికి నాకుఁ దెలియుచున్నది."

"ఔనది యాలాగే! మీ యాబిడకూడ నీ తీర్థయాత్రాసుఖము సంపూర్ణముగా ననుభవించినదఁటకాదా? ఆబిడ యెవరినో యెదవివాండ్ర కన్యను వెంటదీసికొని వచ్చినది. దాని నెక్కడనుండి పట్టితెచ్చినది? అది బారివాండ్ర పిల్లకాదా? దాని మొగము చక్కగా నున్నది. గొప్పయింటి హిందువుని మొగమువలె నున్నది. మీ యాబిడయొద్ద పనికత్తెగా నుండుటకు నాతి యే జాతిలోనుండియు నిటువంటిపిల్ల దొరకదని నేను నిశ్చయముగాఁ జెప్పఁగలను."

"ఔను! ఆ కుఱ్ఱది బారివాండ్రపిల్ల. నాభార్య బందరునుండి తీసికొని వచ్చినది. దానికొక పెద్దకథ యున్నది. దానిని మగఁడు విడిచిపెట్టినందున దిక్కులేక యున్నది ఆ మోట మగనిని వెదకికొనుటకది యిక్కడికి వచ్చినది."

"నిజముగానే? ఎవఁడా మూర్ఖుఁడు? ఇటువంటి చక్కని గొల్లచిన్నదానిని వదలిపెట్టి దేశములవెంటఁ దిరుగుచున్న యీ నిర్భాగ్యుఁ డెవఁడు?"

"లాలాసాహేబూ! అదే నీతో నేను సరిగాఁ జెప్పఁదలఁచుకొన్న సంగతి. మేము వానిని కనుగొన్నాము. వానిపేరు మధుబాగి. అతఁడొక లోటవాఁడు. వాఁడే యీ

విశ్వాసఘాతకుఁడు. ఆ గులాము తన భార్యను తిరిగి చేపట్టునట్లు మీ యావచ్ఛక్తి వినియోగించి చేయవలెను."

"మనము యావచ్ఛక్తి వినియోగింపనక్కఱలేదు. వాఁడు తన భార్యను గలసికొన్న పక్షమున మిక్కిలి యదృష్టవంతుఁడె. తా నింటియొద్ద విడిచిపెట్టివచ్చిన చిన్న పెండ్లామును మరలఁ దీసికొనివచ్చుటకు బంకూరా వెళ్ళవలెనని పలుమాఱు వాఁడు నాతోఁ జెప్పుచువచ్చెను. అది నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. ఈ యడవి మనుష్యులసంగతి నీవెఱుఁగవా? వీళ్ళు దేశద్రిమ్మరులు. వాండ్రకు దూరముననున్న పెండ్లముకంటె దగ్గఱనున్న సారాగిడ్డంగి మిక్కిలి ప్రియమైనది."

"ఆ విషయములోఁగూడ మేము పెండ్లికూఁతునకు మాట యిచ్చినాము. వానిని మనము కనిపెట్టి యుండవలెను. పోషింపవలసిన భార్యయుండఁగా వాఁడు తెచ్చిన సొమ్మంతయు పాడుచేయఁదలఁచుకొన్న పక్షమున మన మూరకుండఁ గూడదు."

"ఆపని మన మాపడుచుపెండ్లామునకే యప్పగింపవచ్చును. కొందఱు యువతుల ముఖారవిందములు మధురలావణ్య సమేతములై యుండినను మనస్సులు దృఢములై యుండును. కొందఱు పడఁతుల చేతులు నవపల్లవకోమలములై యుండినను బండితనమునకుఁ జేరువడి కొరగానిమోటుమగలను నినుప దుడ్డుతోఁ గొట్టినట్లదంచి వంగఁదీసి గడగడ వడంకఁజేయును. ఎట్టకేల కాబందతుగులు దయదలంచి రక్షింపుమని భార్యలపాదాక్రాంతులగుదురు. ఈపడుచువారి పడంతి తన యింటికి మహమానరాలై కొలఁది కాలములో తనమాట చెల్లించుకొనకపోయినఁ మొదల నాపేరు మాఱుపేరు పెట్టుము. మొగములను బట్టి నేను గుణములను చెప్పగలనని నాకుఁ పేరు కలదు. ఆపేరు నేటితోఁ బోవలసినదే. తప్పిపోయిన మగనిని బట్టుకొనుట కాకుండ కాళ్ళీడ్చుకొనుచు బంకూరానుండి వచ్చి మగఁడు చేయి చిక్కిన తరువాత వానిపొగ్రు లొంగఁదీయవలెనో తెలియకుండునా? మధుబారి యీసారి సారాగిడ్డంగిలోఁ గనబడెనా ఏపందెమువేయుమన్నా నాపందెము వేయుదును."

"లాలాసాహేబూ! రాజుగారి దివానాములో నామిత్రుఁడైన హేమచంద్రునకు నుద్యోగ మిచ్చినందులకు నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. అతడు మర్యాద గలవాఁడు. తగినవాఁడు, కాని మదిమందిలోకి వచ్చి గొడవలలోఁ బ్రవేశించునట్టి స్వభావము కలవాఁడు కాఁడు. పదారుమాసములు కలకత్తా నగరమున నుండియుఁ దినసరి

సంపాదించుకొనలేకపోయినాఁడు. మీ రతనిని నమ్మి యుద్యోగమిచ్చి సహాయము చేసినారు. హేముఁడు మీవిశ్వాసమునకుఁ బాత్రుఁడు. అతనిని నేను చక్కఁగా నెఱుఁగుదును."

"జగత్కిశోర! ఇటువంటి పెద్దమనుష్యుని నాకు నిఘాను చేసినందుకు నేనే మీయెడలఁ గృతజ్ఞుఁడనై యుండవలెను. సంస్థానములో నేను కొంతకాలమునుండి పని చేయుచున్నాను. మనుష్యుల తెలివితేటలు కనిపెట్టుటలో నాకుఁ గొంత ప్రజ్ఞ కలదు. ఈహేమచంద్రునికంటె మంచివానిని నే నిదివఱకెన్నఁడైన దివాణములో నుద్యోగమునకుఁ దీసికొని వచ్చితినో లేదో సందేహమే. ఇంత యేమిటికి? అదివఱకు నాపరగణా యంతయు మిక్కిలి యల్లరిగా నుండినది. ఇతని నక్కడకుఁ బంపినతరువాత మునుపటి యల్లరి యడఁగి ప్రశాంతముగా నున్నది. దివాణపు మొహరువేసిన వ్రాతకాగితముల మీఁదకంటె హేమచంద్రుని నోటిమాటమీఁద రయితులకు విశ్వాస మెక్కువగానున్నది. సంస్థానములలో జఱిగెడు గడబిడ లన్నిటికి సంస్థానాధిపతులు వారిచేతఁ బంపఁబడిన యుద్యోగస్థులు ముఖ్యకారణ మని నాయభిప్రాయము. హిందూదేశపు రైతులకంటె మెత్తని కృషీవలులు, రాజభక్తిగలకృషీవలులు ప్రపంచమందు మఱెక్కడను లేరు. కాని వారిని మనము ధర్మము తప్పకుండ దయతోఁ జూచినంతకాలమే యట్లుందురు."

"మీ రెంతపరిశీలించినను ఈ క్రొత్తయుద్యోగస్థునికంటె జాలిగుండె గలవాఁడు, న్యాయదృష్టి గలవాఁడు, మఱియొకఁడు కనఁబడఁడు. తాల్పుకారు గ్రామములో నితని యిల్లు కోర్టువలె నుండును. రైతులలో పన్నువివాద లన్నిటి నితఁడు పరిష్కరించును. ఆపరగణాలోనున్న 'జను లెక్కడను' కొందఱుతప్ప సాధారణముగ వ్యాజ్యములు వేసికొని కోర్టుకెక్కరు. హేముని భార్యనుగూడ నే నెఱుఁగుదును. ఆ చుట్టుప్రక్కల ఆ మాత్రపు తెలివైనది, సాధువైనది మఱియొకతె లేదు. తెలివిమాలిన రైతులు సరిహద్దును గుఱించియో, బీడునేలను గుఱించియో వివాదపడుచున్నప్పుడు హేముని భార్య రైతులభార్యలను బిలిపించి వాండ్రతో మాటలాడి తానే యావ్యవహారము కొంతవఱకుఁ జక్కఁబెట్టును. వెంటనే వివాద మడఁగిపోవును. ఆతెలివిమాలిన మొద్దులు మగవాండ్రు తగినకారణము లేకయే పోరాడుచున్నామని తెలిసికొని యిండ్లకుఁబోదురు."

"నిజముగ వారి దనుకూలదాంపత్యము. వర్ధమానసంస్థానపు టుద్యోగస్థుల విశ్వాసమునకుఁ బాత్రములై వారు చిరకాలము సుఖింపవలయును. హేముని [illegible] తలఁచి

నప్పుడు నీభావమెట్లుండి శరచ్చంద్రునిమాట నాకు జ్ఞప్తికివచ్చును. అతఁడు హేముని మిత్రుఁడు. అతనిమాట యేమి చేసినావు ?"

"అతఁడు మాతో జగన్నాథము వచ్చినాఁడే. మమ్ము బాలసూరులో గలసి కొన్న యుక్కలిదేశపు సామంతరాజు వానిమీద మిక్కిలి ప్రీతి గలిగి తన సంస్థానములో బనియిచ్చి దగ్గఱ నిలుపుకొన్నాఁడు. అతఁడు చాకచక్యముగల పనుపువాఁడు. క్రొత్తతావులు చూచుటలోను, క్రొత్తపనులు పట్టుదలతో జేయుటలోను మావాని కభిలాష మెండు. ఈస్వల్పకాలములోనే మావాఁడెన్నో దురాచారములను తొలగించి యాసంస్థాన మెంతో వృద్ధి చేసినాడని చెప్పుకొనుచున్నారు. అతఁడు సంస్థానములో నున్న ప్రతికొండమీది కెక్కెను. ప్రతిచరియలోను దిగి చూచెను. అడవులలోను నిర్జనములై భయంకరములైన కొండకనుమలలోను దిరుగుటన్న నతనికెంతో సంతోషము. సంస్థానములో నున్న వేటకాఁడు కాని, సగము మృగప్రాయుఁడగు కొండదొర కాని యెవఁడైనను సరే అతఁడు తన స్నేహితుఁడే యని భావింపనివాఁడు, అతఁడు తన మిత్రుఁడని విశ్వసింపనివాఁడు, సత్పరిపాలకుఁడని యతనిని గౌరవింపనివాఁడు నిశ్చయముగ లేఁడు."

"సరే! ఇది యంతయు శరచ్చంద్రుఁడు మంచివాఁడని చాటుచున్నది. జనుల జవయాత్రలో క్రొత్తపుంతలు గల్పింప సామర్థ్యము గలవారు, మంచినడత గలవారు, చాకచక్యము గలవారు మనకుఁ గావలయును. కాని జగత్కిశోరా! మీవాఁడు స్వగృహము విడిచి, మిత్రులను బాసి, యత్యంతప్రేమ గల తనసోదరిని విడిచిపెట్టి యడవులలో నుండుటకు వనభూములలోను పర్వతప్రాంతములలోను నివసించుటయు ననునభిలాషయే కారణమా? లోకములో నున్న వానికి నిజమైనపక్షమున నతని ప్రవాసము నకు వలపే మూలకారణము. వలపు సఫలము కాక భగ్నమగుటచే నతఁడు దేశములపాలై పోయినాఁడని వినియుంటిని."

"ఓహో! లాలాసాహేబూ! అని నిజమే చదివినావా? నీ కీసమాచారము లెట్లాగున తెలియుచున్నవో, నీ కింతగా జ్ఞాపకముండుకొంటినో యని నేనాశ్చర్య పడుచుంటిని."

"మిత్రుఁడా! నా యునికి ఎప్పటి కప్పుడే యుపాయములతోఁ గూడినదని నీ వెఱుఁగుదువు. నన్ను జూచి చిన్నవర్తమానములు చెప్పువారిలోను, నా ముద్దుబిడ్డ కొలువు సేయు

వారిలోను నేను శ్రేయోదయమున చెడిపోయినను సంతోషించు వారనేకులు కలరు. కాబట్టి నేనెల్లప్పుడు నా కన్నులు తెఱచి చూచుచుండవలెను. నాచెవులు దోరఁబెట్టి యెల్లమాటలు వినుచుండవలెను. మీకుఁ దెలియని దారులనుండి నాకెన్నో సమాచారములు చిత్రకథలు ప్రతిదినము తెలియుచుండును."

"అలాగుండవలసినదే! మా బావమఱఁదిమాట చెప్పెద వినుము. అతఁడు కలకత్తాలో నొక చిన్నదానిని వలచినమాట నిజము. ఆ చిన్నది హేముని మఱఁదలు. కాని యది వితంతువు. వితంతువు మరల వివాహము చేసికొనుట మతలో తప్పుగదా?"

"మనవాఁడు హిందూ వితంతువులు పునర్వివాహములు చేసికొనుట లేదా? మన వేదశాస్త్రములట్టి వివాహముల నొప్పుకొనుచున్నవని గొప్పగొప్ప పండితులు చెప్పుచున్నారు. ఆ ధర్మశాస్త్రముల యొప్పుదలనుబట్టియె బాలవితంతువుల తలిదండ్రులు కొన్ని వివాహములు చేసినారు. శరచ్చంద్రుఁడు గట్టిగా వివాహము చేసికోఁదలఁచుకొన్న పక్షమున నతనిదారినతని నెందుకు వదలివేయఁగూడదు? మనోరథసిద్ధి భంగమైన కారణముచేత నెంతో యక్కఱకు వచ్చునట్టి కుఱ్ఱవాఁడు తన బ్రతుకంతయు పాడుచేసికొని చెడిపోవుచుండఁగాఁ జూచుట న్యాయమా? అది యెంతో విచారకరము."

"లాలాసాహేబూ! నీవు సంఘ సంస్కర్తవలె మాటాడుచున్నావే?"

"జగత్కిశోర! అట్లు కాదు. నేను లోకవ్యవహార మెఱిఁగిన మనుష్యుఁడువలె మాటాడుచున్నాను. మన వేదశాస్త్రములంటే నాకుఁగల గౌరవముకంటె మఱి యెవ్వరి కెక్కువలేదు. ఆ శాస్త్రములు మనలను నడిపించుట కేర్పడినవి కాని మనకు సంకెళ్ళు వేయుట కేర్పడలేదు. ప్రపంచమంతయు ముందుకుఁ గదలుచున్న యీ కాలమున మనముగూడ ముందంజ వేయవలదా? జగత్కిశోర! నామాట నమ్ము. మనకు వ్యతిరేకముగా నెందఱెన్ని చెప్పినను జెప్పనీ. హిందువులము, కార్యవాదులము, కావలసిన కార్యము చల్లఁగాజేసికొని పోదుము. మనము సోమరులముకాము కాని మెల్లమెల్లగాను జాగ్రత్తగాను నభివృద్ధిఁ జెందుచున్నాము. రామమోహనరాయుల నాఁటనుండి కాలానుసారముగా మనవలెఁ దమ యాచారవ్యవహారములను మార్చి చక్కజేసికొన సాహసించిన జాతివారు ప్రపంచమున మఱియొకరుండుట యరిది. మన మభివృద్ధిచెందుచున్న పూర్వాచార పరాయణులము. ఈ రెండును పరస్పర విరుద్ధములైనమాటలని నీ వనుకొనవచ్చును. కాని యట్లు గాదు."

"లాలాసాహేబూ! నీవు చెప్పినదంతయు నిజమే, కాని యెవరియభిప్రాయము లను మనము మిక్కిలి గౌరవించుచుందుమో యట్టిపెద్దలనేకు లిప్పటికిని వితంతు వివాహము పేరుచెప్పిన నెంతమాత్ర మొప్పుకొనరు."

"శరచ్చంద్రుఁ డాపిల్లను వివాహమాడుట కెవరొప్పుకొనలేదు? మీతల్లికిష్టము లేదా యేమిటి?"

"కాదు కాదు. ఆమె కీలోకవ్యవహారసంబంధమే లేదు. ఆమె మనస్సు, హృదయము జగన్నాథస్వామి పూజమీఁదను, పూరీక్షేత్రము మీఁదను నిలిచి యున్నది."

"అట్లయిన శరచ్చంద్రునితల్లికే యిష్టములేదా యేమిటి?"

"ఔను! మా యత్తగారే కాశినుండివచ్చి ఈ వివాహము చెడఁగొట్టినది. కాని తనమూలమున కుమారునకుఁ గలిగినబాధ క్రమక్రమముగా నామె తెలిసికొని తల్లిప్రాణ మగుటచేత జాలిపడి విచారించి, పుణ్యాత్ములైన పెద్దలతో నాలోచించి యావివాహము వెంటనే జరిగింపవలసిన దనియు, జరిగినతరువాత కొడుకును కోడలును దన యాశీర్వాదము బడయుటకు వారణాశికిఁ బంపవలసినదనియు, మమ్మాజ్ఞాపించినది. వర్తమాన మంపి యామె కలకత్తావిడిచి కాశికి వెళ్ళిపోయినది."

"అట్లయిన వివాహమున కాటంక మేమున్నది? తమ్ముఁడు వితంతువివాహము చేసికొనుట మీయాఁడవాండ్ర కిష్టములేదా యేమిటి? సోదరుఁడు భగ్నమనోరథుఁడై చెడిపోయి యావజ్జీవము కష్టపడునట్లు నీయాలియే కోరినపక్షమున నామె చక్కఁగా నాలోచింపలేని దని నే ననుకొనవలసి వచ్చును."

"నాభార్యకు వేఱెయభిప్రాయము లేదు. తల్లి యభిప్రాయమే యామె యభిప్రాయము. మా యాలియే పరమసాధువు మెత్తనిస్వభావము గలదియైనను సోదరుని సుఖమునిమిత్తమై యెందుకైన నొడఁగట్టఁదలఁచుకొన్నది. కాని నాకే ధైర్యములేదు. నేను సందేహించుచున్నాను.

"ఛ! ఏమిమాటయ్యా అది. మగవాఁడవైనందుకు ధైర్యముఁ జూపుము. ఆఁడవాండ్రకే తెగింపిచ్చిపిచ్చి భయములు నీకుండఁదగునా? ఆభయమును బారఁద్రోలుము. నేను శరచ్చంద్రుని జూచినాను. మనుష్యులస్వభావములను జూడ గట్టుటలో నేను కొంత

వటుకు గట్టివాఁడను. అతఁడు గొప్పదేశసేవకుఁడు. మహాత్కార్యములను జేయ సమర్థుఁడు. అట్టివాఁడును చిన్నతనమందు భగ్నమనోరథుఁడై కాలము పాడుచేయఁ గూడదు. జగత్కిశోర ! నీవు దీనికొడంబడి చేతిలో చేయివేయుము. ఈరాత్రి నేను బాలసూరుకు తంతివార్త పంపెదను. ఉత్కలదేశపుసామంతరాజును నే నెఱుఁగుదును. నా నిమిత్తమతఁడు డాకులవానిని విడిచిపెట్టును. నేను వర్తమాన మంపిన రెండుదినముల లోపుగా గాని లేక పొగరోడదయో, పొగబండియో దసికొని రాఁగలిగినంత వేగముగా గాని యతఁ డిక్కడికి వచ్చును. అట్లు రాకపోయిన మొదల పడుచువాండ్ర మనోగతములు నే నెఱుఁగ నన్నమాట యథార్థమే."

"లాలాసాహేబూ ! నీ ప్రజ్ఞకుఁ దగినసలహా చెప్పితివి. నీసలహా నావంటివారికి దౌర్బల్యము పోఁగొట్టి ప్రోత్సాహము కలిగించుచున్నది. గొప్పతనమునకుఁ దీసికొని పోవుమార్గమున నీవు సాహసించి నడచుచున్నావు. నీకు మిక్కిలి గొప్పపదవి కనిపెట్టుకొని యున్నది. నీకుమారుఁడు వర్ధమానపురాజగు కాలము, గవర్నమెంటువారి వల్ల నీకు రాజబిరుదము వచ్చుకాలము నేను చూచెదను. నేను నీసలహా నొప్పుకొంటిని. ఇదిగో ! చేతిలో జెయి వేయుచున్నాను. నీ మొదల నే నెప్పుడును కృతజ్ఞుఁడనై యుందును."

ఇరువదియెనిమిదవ ప్రకరణము

పశ్చాత్తాపము.

విందులకు వచ్చినమిత్రులు పోవుచుండుటచే గానధ్వని క్రమక్రమముగ సన్నగిల్లెను. పందిరిమునందలి దీపము లార్పివేయఁబడినవి. జగత్కిశోరరాయలు లోపలి కరిగి భార్యప్రక్కను గూర్చుండి శరచ్చంద్రునకు వనవిహారుఁడు పంపఁ దలచిన తంతివార్తను గురించి గుసగుసలాడెను. పరమసాధువైన కాళి యాసంతోషవార్తనువిని భర్తకు దివ్యకృతజ్ఞతను దెలియఁజేయుటకు దగ్గఱఁ జేరెను. దేశములపాలై పోయిన తన ప్రియ సోదరుఁ డింటికివచ్చి సుఖ మనుభవింపఁ గలఁడనియు, దిక్కుమాలి కడు దుఃఖ మనుభవించుచున్నసతి ధర్మపత్నియై గృహయజమానురాలై ప్రసాదింపఁగల

సకలానందములకు నునికిపట్టయి యుండెననియు నొకతలంపు తనమనంబునఁ బొడఁగానే కాళికన్నులనుండి బాష్పములు వెడలెను. అప్పుడాని కొక్క సంతోషము ప్రేష్యు దాటును కాళియొక్క కొంతెమనస్సు తన సోదరునకుఁ బుట్టఁగలబిడ్డల ముద్దు మొగములఁ జూచినట్లు, తప్పటడుగు లిడుచు నాల్గేండ్ల పిల్లలు తనయొద్దకువచ్చి వచ్చియురాని ప్రొక్కునుడులతో అత్తా అత్తా యని పిలుచుచుండినట్లు, వాండ్రు దుమ్ములో నాడు కొనివచ్చి యాదుమ్ము తనమీఁదఁ బడునట్లు మీఁదనెక్కి ప్రొక్కినట్లు, తాను ముద్దు లాడినట్లు భావించుకొనఁ జొచ్చెను. ఆసంకల్పాంగమున నామెకు బిందురూపము కనఁబడెను. బిందుమాట స్మరణకు రాఁగానే చనిపోయిన యమునమాట జ్ఞప్తికివచ్చెను. దానితో విషాదచ్ఛాయ వచ్చి మేలుకొని యుండియు స్వప్నములు గనుచున్న యామె మనంబును గ్రమ్మెను. ఆముగ్గురుబాలికలు చిన్ననాటనుండియుఁ గలసి తిరిగిరి. హతశేషులైన యిరువురు చెలికత్తెల హృదయములయందు ప్రియమిత్రమైన యమునయవస్థ మఱపురాక యెప్పటికప్పుడే క్రొత్తయై విషాదజనకమై యుండెను.

అటులుండ రాత్రి రెండవజాముగూడ గతించెను దీపము మినుకుమినుకు మనఁ జొచ్చెను. భార్యాభర్తలు తమసంతోషపు తలఁపులను, విచారతలంపులను తెంపులేక చెప్పుకొని గుసగుసలాడుచుండిరి. అప్పుడు వీధితలుపు నెవరో కొట్టినట్లు చప్పుడయ్యెను. జగత్కిశోరుఁడు చెవియొగ్గి వినెను. ఆచప్పుడు మఱల వినఁబడెను.

ఇంత ప్రొద్దుపోయినప్పుడు వచ్చి పిలిచెడివారెవరు ? నౌకరు లందఱు పండుకొని నిదురపోయినారు. నేనే వెళ్ళి తలుపుతీసెదనని జగత్కిశోరరాయలు పలికి వెలుపలికి నడచివెళ్ళెను. భార్య యతనివెంట నడుగులు చప్పుడు కాకుండ మనంబున నేదో యిట్టిదనరాని యాసఁ బెట్టుకొని మెల్లఁగా వెళ్ళెను.

క్రొత్త మనుష్యుఁడు లోపలికి వచ్చెను. వెలుఁగు మందముగా నుండుటచే జగత్కిశోరుఁ డతనిని గుర్తుపట్టలేదు. కాళి తటాలున వెనుకకుఁ దిరిగి ప్రక్కగదిలోనికిఁ బోయి తన ఘోషాస్థలములో నిలిచి క్రొత్తమనుష్యుని వైఖరి కనిపెట్టుచుండెను.

“అయ్యా ! మీ రెవరు? ఈ యర్ధరాత్రము వేళ నేమిగావలసి వచ్చినారు?” అని జగత్కిశోరుఁ డడిగెను.

"జగత్కిశోర! పూర్వ మొకానొకప్పుడు నేను నీ మిత్రుఁడను. నేనిప్పుడు నీ మిత్రుఁడ ననిపించుకొనుటకుఁ దగను. మన పూర్వస్నేహమునుబట్టి యీ రాత్రి యిక్కడ తలదాచుకొనుటకు వచ్చితిని. రేపు ఉదయమున నాదారిని నేఁబోయెదను.

ఆ కంఠధ్వని మఱచుటకు వీలులేనిది. ఐశ్వర్యాధికారము గలిగి మున్ను గొప్ప వాఁడై యుండిన ధనంజయుఁ డావిధమునఁ బాఱిపోవుచుండుటచూచి జగత్కిశోరుఁడు మహాశ్చర్య మొందెను. మొగము కృశించెను. కన్నులు గుంటలుపడెను. తలవెండ్రుకలు చిఱకాలమునుండి చమురెఱుఁగక మోటబారి చీకాకుబడి మొగమువీఁద బడుచుండెను. అతని వాలకము మృత్యుదేవత కాశ్రయమైనట్లు కనఁబడెను. ఆ ధనంజయుని చరిత్రమును సాధువైన యమచరిత్రమును దలఁచుకొనఁగానే జగత్కిశోరుని మనంబున నొకవిధమైన రోషవుట్టెను. కాని సహజమైన గృహస్థధర్మ మాయేవను జయించెను. జగత్కిశోరుఁడు దయాపూర్వకముగా నతనితో మాటలాడెను. "ధనంజయా! ఏమిది? మనము కలిసికొని చిఱకాలమైనది నీ విటువంటి దుర్దశలోనికి వచ్చితివా? కొన్నిమాసముల క్రిందట నీవీ దేశములో మిక్కిలి గొప్పవారిలో నొకఁడవై యుంటివి. మీయూరిలో నెంతగొప్పవాఁడైనను మీ దర్శనముచేయుట యెంతో గౌరవమని తలంచుచుండెడివాఁడుకదా? అదియెల్లఁబోయి చివరకింతగతిపట్టినదా? తలదాచుకొనుట కిల్లులేక నేఁడు దేశద్రిమ్మరివై యుంటివా? కాని ధనపుంజములో నీకు గొప్పభూములు మేడలు మిద్దెలు యున్నవి కావా? అవెవరు చూచుచున్నారు? నీవీలాగున నెందుకుఁ దిరుగుచున్నావు?"

"మా తండ్రియున్నప్పుడు మా వ్యవహారములు చూచునతఁడే విశ్వాసము కలిగి యిప్పుడుగూడ మాయిండ్లు భూములు చూచుచున్నాఁడు అవి మాయల్లునకు వెళ్ళిపోవునవే కావా? నావంటి నిర్భాగ్యునకవి యుండఁదగవు నేను ఘోర పాపము చేసినాను. దానిఫలము పూర్తిగా ననుభవించినాను. నాకు విశ్రాంతి కావలయును కాని యది ప్రపంచములో దొరుకుటలేదు. నా చిన్నతనములో నాకుఁ గొందఱుస్నేహితు లుండెడివారు. వారిలో మిక్కిలి సాధువైనది భార్యయొకతె. చచ్చిపోయిన నా భార్యకు నీ భార్య తోఁబుట్టువుకంటె యెక్కువగ నుండెడిది. నేను తొల్పుకారు వెళ్ళినప్పుడు నీభార్య నెన్నిసారులో చూచి పలుకరించుచు వచ్చినది. పరమసాధువై యతి దయాశాలిని యగు నీభార్య నేనిభాగ్యగతుఁడనై యీ రాత్రి యిక్కడికివచ్చి యుండుటచేత నన్ను దీవించి మంచిమాటలాడి యామె నన్నాదరింప వచ్చును. నేను రేపువెళ్ళెదను. ఇఁకముందామె కన్నుఁడును కనుపడను. బాధపెట్టను."

అతి దీనములగు నతని పలుకులు విని కాళి దుఃఖము భరింపలేక యతఁడున్న చోటునకు సత్వరముబోయి మేలిముసుంగుక్రిందఁ గన్నీరు వలవల గారుచుండఁ జిన్నతనమందువలనే యాతని చేయిఁ బట్టుకొని లోపలి గదిలోనికిఁ దీసికొనిపోయి యొకచో గూరుచుండబెట్టి గద్గదకంఠయై భర్తకిట్లనియె. "భర్త మనయింటికివచ్చి గౌరవింపఁబడలేదని యుమ యాత్మవిషాదము నొందునేమోకదా. అతఁడిటువంటి బ్రతుకు బ్రతికినను మా యుమ మగఁడే కదా. మీ కాతని ప్రక్కను గూర్చుండి యోదార్చవలయు. ఇతఁ డేదేని యాహారము కావలసియున్నాఁడు. మిక్కిలి దుర్బలుఁడుగా నున్నాఁడు. నే నీ లోపున మిక్కిలి త్వరగా నేదేని యాహారము సిద్ధముచేసి పట్టుకొనివచ్చెదను."

అని చెప్పి కాళి వంటయింటిలోనికి వెళ్ళెను. కిశోరీరాయ లభ్యాగతి ప్రక్కను గూర్చుండెను. ధనంజయుఁడు చదువరు లిదివఱకెఱింగిన దీనవృత్తాంతమంతయు నతనితో జెప్పి యిట్లనియె.

"ధన నష్టమునకు నే నంతగా గుందుటలేదు. ఏమన నేను ధనము విశేషముగా గోలుపోయినను నా మాన్యములు, ముఖాసాలు నిలిచియున్నవి. మిత్రులు నన్ను వదలి వేసినారను విచారముగూడ నంతగాలేదు. పూర్వము నాకు మిక్కిలి యాప్తులుగా నుండునట్టి స్నేహితులు వ్రేలుచాపి నన్నొరులకు జూపించి నన్ను దిరస్కారభావముతో జూచి నన్నుగురించి గుసగుసలాడుచున్నారు. ఈ యేకాకిత్వములోనే నా యవమానమునుగూడ నిర్విచారముగ భరింపగలిగి యున్నాను. కాని నా జీవితమును కేవలము నరకవాసప్రాయముగ జేయుచున్న యా మహాదుఃఖ మొకటి యున్నది. మహాపతివ్రతయై నిష్కలంక చరిత్రయై నన్నే ప్రేమించి, నన్నే నమ్మియున్న పరమసాధ్విని నానా బాధలుపెట్టి క్రౌర్యము కలిపి చంపివేసితినన్న యాలోచన చావకున్నది. అదే నా హృదయమును గాల్చుచున్నది. నెత్తురుచుక్కలేక పాలిపోయిన యామె మొగము రేయుంబగల్ నన్ను వేధించుచున్నది. స్వప్నములలో సైతము తెల్లని మొగముగల యొకానొక యువతి రెప్పవేయక కన్నులు నాపైనిగుడ్చి చూచుచున్నట్లు కనఁబడును. నేనంతో భయపడి కేకలువేయుచు సుభాలున నిద్రలోనుండి లేచుచుందును. స్త్రీహత్యామహాపాతకము నావెంబడి వంటియున్నది. దానివలననే నేనున్మత్తుఁడనైతిని. ఈ మనఃక్లేశము నేనింక చిరకాల మనుభవింపఁజాలను."

"ధనంజయా! నీవు ధైర్యముఁ దెచ్చుకొనవలయును. నీవు గొప్ప పాపముచేసితి వన్నమాట నిజమే. మన శాస్త్రము లేమిచెప్పుచున్నవో యెఱుఁగుదువా? స్త్రీలు సౌఖ్య

పడిన పక్షమున భగవదనుగ్రహములేక యాకుటుంబములు నశించునని చెప్పుచున్నవి. కాని యెంత ఘోరపాపమైనను ప్రాయశ్చిత్తము లేనిపాపములేదు. నీ ప్రాయశ్చిత్తము మిక్కిలి భయంకరమై చిరకాలమునుండి నీచే ననుభవింపఁ బడుచున్నది. ఈశ్వరుని నమ్ముకొమ్ము! నమ్ముకొంటివా నీకు మనశ్శాంతి కలుగును."

ఈ మాటలు ధనంజయుఁడు సరిగా వినకయే తన మిత్రులతో మాటలాడక తనలోఁ దానే యిట్లు మాటలాడుకొనఁ జొచ్చెను. "నేనొకసారి తాల్పుకారు గ్రామమున మా యత్తగారి యింటియొద్ద నుంటిని. అది వెన్నెలరాత్రి. గ్రామవాసు లందఱు గాఢముగ నిద్రించుచుండిరి. అప్పుడు మెయు నేనును వెన్నెలలో షికారువెళ్ళి చెఱువుగట్టుమీఁద కూర్చుండి నీళ్ళకేసి చూచితిమి. అప్పుడామెను నేను బిగియారఁ గౌగిలించుకొని హృదయము హృదయముతోఁ జేర్చి మేలిముసుగుదీసి మొగము మొగముతోఁ జేర్చిముద్దాడి యానందలహరిలో నోలలాడితిమి. అపుడు "నిన్నొక్క నిముసమైన నేనెడఁ బాయఁజాలను. మనప్రేమకు చుక్కలతో నిండిన యాకాశము సాక్షి. నా జీవితాంతము వఱకు నిన్నిట్లే ప్రేమించెద"నని యామెతో నంటిని. చంద్రప్రభాప్రసారణముచే నత్యంత శోభాయమానమైన నాఁటి యామెముఖము తెల్లబారినను కృశించినను నాకన్నులకుఁ గట్టినట్లు కనఁబడుచున్నది. కనఁబడి మా ప్రేమకు సాక్షియైన సనక్షత్రాకాశమువంక వేలుపెట్టి చూపుచున్నది. నేను చేసినప్రమాణముఁ దప్పితిని. ఆకాశవాణి దృష్టిలో నేనసత్యవాదినైతిని."

"ఆకథల నన్నిటిని జ్ఞాపకము చేసికొనకు. నీకుఁదప్పక పిచ్చియెత్తును."

"నాకొకసారి జబ్బుచేసినప్పుడామె పుట్టినంటినుండి ధనపురమునకు వచ్చెను. నాకు మందిచ్చిన వైద్యుఁడు పెదవివిఱిచి తెల్లబోయి దగ్గఱనున్నవారి చెవులలో గుసగుసలాడెను. మాతల్లి నా యవస్థఁజూచి వ్యాకులమునొంది నాయెదుట నేడ్చినపక్షమున నేను భయపడి జంగిపెట్టుకొందునేమో యను భయమున గదవిడిచి యావలకుఁబోయి పలుమారేడ్చుచు వచ్చెను. కాని యామె యెంతచేతనో మిక్కిలి ధైర్యముగలిగి యుండెను. ఆమె హృదయము చలింపలేదు. ఆమె రాత్రియనక పగలనక నాప్రక్కనే కూర్చుండి యెన్నోసారులు నా చెవిలో భయపడవద్దు. భగవంతుఁడు మనల నిద్దఱను కలుచేయఁడని ధైర్యము చెప్పుచు వచ్చినది. ఆమె యనురాగాతిశయముచేత నాకెంతో ధైర్యము కలిగి జీవింతుననుయాసపుట్టెను. ఆ నాఁటిస్థితి నాకన్నులయెదుట నిప్పుడు

కనఁబడుచున్నది. నిశ్శబ్దమై మూసినతలుపులు కలిగి చీకటిచీకటిగానున్న యాగదిలో మగని మంచముప్రక్కను గూర్చుండి యుపచారము చేయుచుండిన విసుగులేని యా యిల్లాలిని బరమశాంతురాలైన యా యిల్లాలిని నేనిప్పుడు సయిలము చూచుచున్నాను. భార్యను జంపుటకు గాబోలు ఆ పాడుభర్త బ్రదికెను.”

“ధనంజయా ! నీ పుణ్యమాయెను. ఆ గొడవలో దిగకు.”

“అన్నిటిలో దారుణమైనది కలకత్తాలోని యా కపటరంగమే. నా గుఱ్ఱపుబండి వెళ్ళుచున్నప్పుడు బాటమీఁద చెట్టుప్రక్కను చలిచేత వడకుచుండిన యొక దీనురాలిం జూచితిని. దీపపువెలుతురామె మొగమున తళుక్కుమని ప్రకాశించెను. ఆమె కన్నులు నాపై నిలిచి నిశ్శబ్దమైన ప్రార్థనము చేసెను. కాని పెదవులు కదలలేదు. ఆ చీకటిలో నామెను విడిచి బండి సాగిపోయెను. కలకత్తా నగరమందలి యాటకత్తె యొకతె నా ప్రక్కను బండిలో నపుడు గూర్చుండెను. అది చక్కనిదే కాని వట్టిపాడుముండ. నా చేత బరాభూతియైన నా భార్య యా చలిలో నిలిచియుండి నశించిపోయెను.”

కాళి యుపాహారములు సిద్ధము చేసికొనివచ్చి ధనంజయుని యున్మత్త ప్రలాపములు వినుచు నొక్క ఘడిగంట యావల నిలిచెను. విని విని యామె దుఃఖము తట్టలేక మేలిముసుగు దీసి యావల బారవైచి మితభాషిత్వమును వదలి చిత్తసంక్షోభముచేత గద్గదమైన కంఠముతో నిట్లనియెను.

“నీచే నట్లు పరాభవింపబడిన యా పరమసాధ్వి నీ వలన మహా ప్రాయశ్చిత్తము గోరుచున్నది. ప్రాయశ్చిత్తమే మనగా విశుద్ధమైన బ్రతుకు బ్రతుకుట. గతించిన దోషమునకు బశ్చాత్తాపము నొందుట. ఆమెను దలచుకొని యామె పేరు నీవు గౌరవింతువేని యామె కిష్టమైన సత్ప్రవర్తనము సదాచారము గలిగి నీ విక ముందు నడతువేని స్వర్గస్థురాలైన యును వెనుకటి తప్పులు క్షమించును.”

హృదయభావమును సంపూర్ణముగా వెలిబుచ్చిన యామె దృఢస్వరము విని ధనంజయుఁడు త్రుళ్ళిపడి తన యున్మత్తప్రలాపములు మాని మృదుస్వరముతో నెమ్మదిగా నామె కిట్లనియె. ‘‘కాళీ ! నిశ్చయముగా నీ వట్లు తలంతువా ? స్వర్గములోనున్న యాయమ నా తప్పులు క్షమించునా ?”

కన్నీరు పెట్టుకొని కాళి యిట్లనియె. "తప్పక క్షమించును. నీవు మంచినడత గలిగి బ్రతికితివా తప్పక క్షమించును. బ్రతికియున్నప్పుడుమె యెంతబాధ పడినదో భగవంతున కెఱుక. నేను దానిని జక్కఁగా నెఱుఁగుదును. అంత బాధ పడుచున్నప్పటికి దాని కెవ్వనిమీఁద రవంతయైన కోపములేదు. నీమీఁద మొదలే లేదు. భూదేవత కదా మాయుమ. అది నీవు చేసిన యపకారము లన్నిఁటిని మఱచిపోయి స్వర్గమునందుండి నీ కెంతో మేలుచేయును. నీవు దానినే నమ్ముకొన్న పక్షమున నిన్నుఁ గాపాడును."

ఈ పలుకులు విని ధనంజయుని సంక్షుభిత హృదయముమీఁద నమృతవర్షము కురిసినట్లయ్యెను. కొంతసే పందఱూరకుండిరి. చిన్నబిడ్డవలె నతఁడు కాళి యెక్కడికి వెళ్ళిన నక్కడికి వెంటవెళ్ళెను. ఆమె యాజ్ఞాప్రకారము కొంచె ముపాహారము పుచ్చుకొని, యొకచో విశ్రమించెను. మంచముమీఁదఁ బండుకొనఁగానే బాష్పప్రవాహము కన్నులనుండి స్రవించి హృదయస్థితమైన దుఃఖభారమును డింపుపఱచెను. పశ్చాత్తాపముఁ జెందిన యా పాపకర్ముఁడు నిర్విచారముగా నిర్మలముగా గాఢనిద్రఁ బోయెను. ఉమ తన్నుఁబాసినది మొదలు అటువంటి సుఖనిద్ర యతఁ డెన్నఁడు బోయి యెఱుఁగఁడు.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

అన్వేషణము.

ఉమ దబ్బాటుగ నదృశ్యురాలు కాకమునుపు వ్రాసియుంచిన జాబును మఱునాఁ డుదయమున ధనంజయుఁడు జగత్కిశోరరాయలకుఁ జూపెను. జగత్కిశోరుఁడు దానిని భార్యకుఁ జూపెను. ఆమె బాష్పాకులలోచనయై దానిం జదివెను.

అది చదువఁగానే కాళియొక్క మనస్సునఁ జిన్న యాశాంకురము మొలకెత్తెను. ఎత్తుటయు నామె యిట్లనియె. "ఉమ గంభీరమైనది. బేలది కాదు. మత విషయములు బాగుగాఁ దెలిసినది. సామాన్యపు మందభాగ్యురాలివలె మాయుమ కూడ చులకనగాఁ బ్రాణత్యాగము చేసికొనునా? కాళీఘట్టమునం దగుపడిన బ్రహ్మచారి మహాయత్నతో మన మనుకొనిన నాఁకములు తెలిసిపోవుటకుఁ బ్రయత్నముఁ జేయుటకు నే ప్రయ్య

క్షేత్రమునకో మారువేసము వేసికొని యుండిన యుండవచ్చునని సందర్భవశమున బలుకలేదా? మహానుభావుఁడైన యా బ్రహ్మచారిమాటలు సత్యము కాఁగూడదా? ఆమె వ్రాసిన యీ జాబులో వర్తమానపట్టికయందలి మాటమొదలుకొని దేవాలయముల మాట యామె యెత్తినది. ధనంజయుని భార్య యచ్చోట బ్రతికి యుండవచ్చునా? మహాదోషభార మాతని హృదయమునుండి దింపివేయఁబడుట కాధార మందవచ్చునా?"

ఈ యాశ పునాదిగా జేసి వారా దినమంతయు నల్లికల్లి యల్లిక యల్లి యచ్చట నుండవచ్చు, నిచ్చట నుండవచ్చునని యూహింపఁజొచ్చిరి. సాయంకాలమునఁ గిశోరరాయలును, భార్యయు నతనిని దేవాలయమునకుఁ గొనిపోయిరి. ఆ యాలయములను మహాత్మచంద్రరాజు కట్టించెను. ఉన్నత గోపురములతో నవి యొకదాని ప్రక్క నొకటి వరుసగా నుండెను. మహాత్మచంద్రుఁడు పూర్వ మక్కడికివచ్చి మోకుకలు నొప్పియెత్తు వరకు మొగమునఁ జెమటకాల్వలు గారునట్లుఁ బ్రదక్షిణముచేసి ప్రతి దేవాలయము ముందట సాష్టాంగ నమస్కారము చేయుచుండెడివాఁడు. రాజుగారి తల్లి నేఁటికి నైతిమీ దేవాలయములకుఁ బోయి దేవతారాధనముఁ జేయుచుండును. ఆ దేవాలయముల వ్యయమంతయు సంస్థానపు ధనము నుండియే. ఇతర స్థలములనుండి వర్తమానమునకుఁ దండోపతండములుగా వచ్చెడు తైర్థికులు పూర్వరాజుల భక్తి మూర్తిభవించినట్లున్న యా యాలయంబులకుఁ బ్రదక్షిణములు చేసి, దేవతలం గొలిచి పోవుచుందురు.

జగత్కిశోరుఁడును, భార్యయు భక్తిశ్రద్ధలతో దేవతలను దర్శించి నమస్కరించి యర్చించిరి. ధనంజయుఁడు మఱియొకసారి కన్నీరువిడిచి దుఃఖోపశమనముఁ జేసికొనెను. పాపుఁబ్రతుకు బ్రతికి చేసిన మహాపాతకములను భక్తి మొదలగువానిచేఁ బోఁగొట్టుకొన వచ్చునని భార్య కట్టకడపట జాబులోఁ జేసిన హితోపదేశము నతఁడు జ్ఞప్తికి దెచ్చుకొని యా యాజ్ఞ యీశ్వరాజ్ఞఁగా నెంచి దాని ననుసరించెను.

సాయంకాలము కొంత ప్రొద్దుపోయిన తరువాత గాలి పవిత్రుఁడైన దేవాల యార్చకుఁడుండు కుటీరమునకుఁ బోయెను. అతఁడు మిక్కిలి వృద్ధుఁడు. అతనిం జూచి యామె వందప్రణామములం జేసి యాశీర్వాదముల బడసి యిట్లు పలికెను. "తండ్రీ! ఈ విగ్రహముల నర్చించుచు చిరకాలమునుండి మీ రిచ్చటనే జీవించినారు. అనేక తైర్థికులను మీరు దీవించినారు."

"బిడ్డా! నీ వట్లనవచ్చును. ఈ దేవాలయములు నా యధీనము జేసినవాఁడు మహారాజుచంద్రుఁడు. ఆ వృద్ధరాజును నేను పలుమాఱు ఒక దేవాలయమునుండి మఱి యొక దేవాలయమునకుఁ దీసికొనివెళ్ళి విగ్రహములఁ జూపితిని. ఆయన నిజముగా మిక్కిలి గొప్పవాఁడు. మన యాంగ్లేయప్రభువులుగూడ నతని ప్రభావ మెఱుఁగుదురు. ఎఱుఁగుటచేతనే బిరుదులిచ్చి గౌరవించిరి. గొప్పతన మేమిటందువేమో? అతని మనస్సెప్పుడును మతము మీఁదనే యుండెడిది. వార్ధకదశలో నతఁడొక్కనాఁడైన నిక్కడకు రాకుండ దేవతాదర్శనముఁ జేయకుండ నూరకయుండలేఁడు. కాని యేమి లాభము? వెళ్ళిపోయినాఁడు అతనితోఁ బోయినదా? ఆయన యనంతరమువచ్చిన యీ చిన్నరాజుగూడ మనలను విడిచి వెళ్ళిపోవుచున్నాఁడు."

"తండ్రీ! ఇక్కడ దేవతాపూజఁ జేయువారు రాజులుమాత్రమే కారు"

"కాదు బిడ్డా! కాని పరమశివు నాలయములు పవిత్ర హృదయములతో వచ్చునట్టి భాగవతోత్తము లందఱకు సమానముగానే ప్రవేశింపఁదగినవి."

"జీవితములో దుస్సహమగు దుఃఖోపశమనము మతమువలనఁ గాంచవలయునని దుఃఖభారముక్రిందఁబడి నలిగిపోయిన హృదయములతో నిక్కడకు వచ్చియుండిన భక్తుల ననేకులను మీరు చూచి దీవించి యుందురు గదా?"

"అవును! అప్పుడప్పుడట్టివారి నెందఱినో నేను కలిసికొనియుంటిని. ఎందుచేతనన మందభాగ్యులకు మహాదేవుని చరణములుదప్ప యన్యథా శరణ మెక్కడనున్నది."

"అట్టివారిలో నొకదానికథ మీకు జ్ఞాపకమున్నదా? అది వయస్సునఁ జిన్నది. ముఖము లక్షణమైనది. అదికూడ వచ్చి తన దీనచరిత్రము మీతోఁ జెప్పికొని దుఃఖతారకమైన మీయాలోచనమడిగి యుండవచ్చును. ఎంతో కాలమైయుండదు. కొన్ని వారముల క్రిందటనే."

"అబ్బో! ఇద్దరా, ముగ్గురా? అటువంటి వాండ్రెందఱో వచ్చుచుఁ బోవుచుందురు. కాని నాకటువంటి చిన్నదాని నొకదానిని జూచినట్టు జ్ఞాపకమున్నది. అది మిక్కిలి యందకత్తె. మొగముఁజూడఁగానే మహావిచారములో నున్నట్లగపడినది. నేనామెవంక నెన్నోసారులు చూచిచూచి దుఃఖకారణ మడిగితిని. అది బాలవితంతువు. గుండెపగిలి తెగయేడ్చినది."

"తండ్రీ! దాని విషయమై కాదు నేనడుగుచున్నది? ఇది పెండ్లియైనదే. ఏబాలవితంతు వెన్నఁడు ననుభవించి యెఱుఁగని ఘోరదుఃఖము ననుభవించి యిది భర్తను విడిచిపెట్టి వచ్చినది. ఆ మహాదుఃఖముచేత నదికూడ మీదగ్గనము చేయుటకు వచ్చియుండునని నేననుకొంటిని."

"బిడ్డా! నీవు జ్ఞాపకము చేయుటవలన జ్ఞాపకము వచ్చినది. నేను చెప్పినది బాలవితంతువుమాట కాదు. మఱచిపోయినాను పెండ్లియైనదానిమాటే. వితంతువువలె నది యించుకేనిపంచె కట్టుకొని వచ్చినది. దండలకుఁగాని చేతులకుఁగాని మెడలోఁగాని, నగలు లేవు. కాని కాలువలుగట్టు కన్నీరు తుడుచుకొనుట కామె చేతులెత్తినప్పుడు పుణ్యస్త్రీలయొద్ద గనఁబడు ఇనుపబిళ్ళ నాకుఁ గనఁబడినది. అన్నినగలు తీసివేసినను పుణ్యస్త్రీ యదిమాత్రము తీసివేయదు. వితంతువు మగఁడు పోఁగానే దానిని తీసిపాఱవేయును. దానివాలకమునుబట్టి, కట్టినబట్టనుబట్టి యది వితంతువని నేను భ్రమించితిని గాని యది నిజముగా మగఁడు బ్రతికియున్న యాఁడుదై యుండవచ్చును."

"తండ్రీ! ఈమాత్రము మాటలు చెప్పి మాకు ధైర్యము కలిగించితివి. భగవంతుఁడు నిన్ననుగ్రహించుఁగాక! నీ జీవిత మెంత పవిత్రమో నీ చరమకాలముకూడ నంత సుఖాస్పదమగుఁగాక! కాని యామె మీతో తనబాధలు చెప్పికొన్నదా? చెప్పు తండ్రీ! చెప్పు. వినుటకుఁ జెవులు తొందరపడుచున్నవి. ఏదో మంచివార్త వినఁబడునను నాసచేత నా హృదయ ముబ్బిపోవుచున్నది."

"బిడ్డా! నే నెఱిఁగిన దంతయుఁ జెప్పెదను. ఆమె తన గోడువేమియుఁ నాతోఁ జెప్పలేదు."

"తాల్పుకారునుండి గాని ధనపురమునుండి గాని వచ్చినట్లయిన జెప్పలేదా."

"ఎక్కడనుండి వచ్చినదో యామాట చెప్పనే లేదు."

"కలకత్తాలోఁ దన కొక చుట్టము పక్కము లేకుండ, స్నేహితులు లేకుండ నేకాకియై యెంతో దౌర్భాగ్యస్థితి ననుభవించినట్లయిన జెప్పలేదా?"

"ఆమె స్నిగ్ధవిగ్రహముచేత దౌర్భాగ్యస్థితిలో నున్నదని నే నూహించితిని గాని నోటితో నేమియుఁ జెప్పలేదు."

"మగఁడు తన నిమిత్తము వెదకుకొనుచు వచ్చినప్పుడు తా నీ దేవాలయములలో నుందుననియైనఁ జెప్పలేదా ?"

"మగనిమాటే యెత్తలేదు. తిరిగి వచ్చుటమాట యంతకుముందే లేదు."

"ఎక్కడికి వెళ్లఁదలఁచుకొన్నదో, ఎక్కడఁ గనఁబడునో చెప్పినదా ?"

"పుణ్యనదీతీరములందున్న దేవాలయములఁ జూచుచు నెండలో నర్థివానులక్కడ నుండి యిక్కడకు నిక్కడనుండి యక్కడకుఁ దిరుగుచుందురు. ఆమెయు వారివలెనే యొకచోట నిలువక దివ్యస్థలము లన్నిటికిఁ బోవు చుండును."

"తండ్రీ ! దానిగురించి మీకేమియుఁ దెలియ దన్నమాటే. ఏమాత్రము జ్ఞాపక మున్నను సరే, చెప్పుఁడు. ఏమి యానవాలు చెప్పినను సరే, సందర్భవశమున నాడినమాట యేదియైనను సరే, ఎందుకంటే దానిభర్తయొక్క సుఖము, బ్రతుకు, సమస్తము మీమాటలనే యాధారము చేసికొని యుండును."

"బిడ్డా ! ఒకమాటయైన నాడలేదు. ఒక్క యానవాలైనఁ జెప్పలేదు. అందరి వలెనే వచ్చినది. దేవతాదర్శనము చేసినది. కాని యెందుచేతనో తెగయేడ్చినది. మరునాఁ డుదయమున వెళ్లి పోయినది."

ఆయనవద్ద సెలవు పుచ్చుకొని కాళి దడదడ గొట్టుకొను గుండెలతో భర్త యొక్క సన్నిధికి వచ్చి యర్చకుఁడు చెప్పిన స్వల్పవృత్తాంత మతని కెఱిగించెను. జగత్కిశోరరాయలు మిక్కిలి యాత్రలోఁ బ్రతిదేవాలయమునకడకుఁ బోయి ప్రతి పూజారిని, కంటి కగపడిన ప్రతిసేవకుని యేవో కొన్ని ప్రశ్నలడుగఁ జొచ్చెను. ఒక చక్కని చిన్నది వితంతువేషము వేసికొని యాదేవాలయములో నొకనాఁటిరాత్రి తల దాచుకొని మరునాఁ డుదయమున నెక్కడికో యాత్ర వెళ్లినదని వారందఱుఁ జెప్పిరి. వారిలో నొక సేవకురాలిట్లనియె. "పాప మా యిల్లాలిమగఁడు అప్పటికి స్వల్పకాలము క్రిందటనే పోయి యుండును. ఏమంటే, మొగము మీఁద కుంకుమబొట్టు పెట్టుకొన్న యానవాలు కనఁబడుచునే యున్నది."

"కాని యామెతోఁ గలసి వెళ్లినతైర్థికు లెవ్వరు ? వర్ధమానమునుండి యెవరైన వెళ్లిరా ?" యని జగత్కిశోరుఁ డడిగెను. ఆయూరిలోనే కాపుర ముండునట్టి యొక పిల్లవాఁ డక్కడఁజేరిన గుంపులోనుండి యిట్లనియె. "లేదు. వారందఱు క్రొత్తవారే.

గోవిందునితల్లి మాత్రము సేసెటిగినది. ఆమెది గోయిపురము. ఆమెకూడఁ దీర్ఘయాత్ర వెళ్ళినది. ఆమె తిరిగి వచ్చినది."

కాళి దేవాలయము విడిచి పల్లకియెక్కి యింటికి వెళ్ళునప్పటి కర్ధరాత్రమయ్యెను. కాని జగత్కిశోరరాయలు మాత్ర మింటికిరాలేదు. అతఁడు ధనంజయునితోఁ గలసి గోయిపుర గ్రామమునకు వెళ్ళెను. రాత్రి యంధకారమయమై యుండెను. కాలినడక కనుకూలములైన చేలగట్లు మిక్కిలి సన్నముగా నుండెను. పైగా వాటిమీఁద శీతకాలపు మంచు కురిసియుండుటచే నవి తడిసి యుండెను. మిక్కిలి యాత్రము గల యాబాట సారులమీఁద నక్షత్రములు గగనమునుండి మిణుకుమిణుకు మను కాంతులతో స్వల్పతేజ మును బ్రసరింపఁ జేసెను.

తెల్లవారక ముందే వారా గ్రామముఁజేరి గోవిందునితల్లిని మేలుకొలిపిరి. ఆమె విశేషమేమియుఁ జెప్పలేదు. ఆచిన్నది తన ప్రక్కను గూర్చుండి యెంతోయేడ్చిన దనియు, తన దురవస్థ యేమో యెవరికిం జెప్పలేదనియు, నామె చెప్పి కన్నుల నీరు పెట్టుకొని యెట్టకేల కిట్లనియె. "అది యెంతో మంచిది. నాయనా! చిన్నపిల్ల. కాని దైవము తిన్నఁగాఁ జూడలేదు. అందుకనివిధంతువై పోయినది. కాలినడకను, రైలుమీఁద మే మెన్నోరోజులు కలసి ప్రయాణముచేసి యెన్నో క్షేత్రములు చూచితిమి. కాషాయ వస్త్రములు కట్టుకొన్న యోగినులగుంపులలో నామె తిరచుగాఁ గలిసి యుండెడిది. వారివలెఁ దాను గూడ కాషాయవస్త్రములు గట్టుకొని వారితో పోవలె నని కోరిక యున్నట్లు చెప్పుచు వచ్చినది. మే మందఱము బాటప్రక్కన గూర్చున్నప్పుడామె చెట్టుక్రింద వంట చేసి కొన్నది. వంటసంగా మ కేమియులేదు. ఏదో పట్టి యున్నము గంజి. అప్పుడు నీ దురవస్థ యేమిటమ్మా యని నేనడిగితిని. అడిగినందుకేమైనఁ జెప్పి నదా? ఏడ్చి యూరకుండినది. తన తల్లిదండ్రులు తొల్పుకారులో నున్నారనియు, అత్తవారి యూరు ధనపురమనియు మాత్రము చెప్పినది."

తొల్పుకారు ధనపురి గ్రామముల పేరులు వినఁగానే ప్రశ్నలు వేయువారి మనస్సులలో నాశాకిరణము మఱియొకటి బయలుదేరెను. ఆతీర్థవాసిని నిశ్చయముగా నుమయేయని వారు నమ్మిరి.

"ఆమెను మీరు కడసారి యెక్కడఁ జూచితిరి? ఆమెను మీరెక్కడ విడిచి వచ్చితిరి? చెప్పుమమ్మా చెప్పు. మీమాటలవల్ల మా కామెజాడ తెలిసినపక్షమున ధనపురి

మందలి కొట్లలోని ధనవంతులు మీ కాళ్ళవద్దకు వచ్చియుందురు. భార్యావియోగముఁ జెంది విలపించుచున్న భర్త యావజ్జీవము మీయెడలఁ గృతజ్ఞుఁడై మిమ్ము దీవించుచుండును" అని ధనంజయుఁడు పలికెను.

"అయితే నాయనా! దానికి మగఁడున్నాఁడా? ఆపిల్ల వితంతువుకదా? అయ్యో! పాప మెంతదిక్కుమాలినదై పోయినదయ్యా! దేశాలపాలై పోయినది. నేననుకొన్నాను. దానికెంతో మొగమాటము, చేటుసిగ్గు. ఒకరితో మాటలాడ నిష్టము లేనిది. ఏదోమూల నొంటిగాఁ గూర్చుండుచు వచ్చినది. కుంకుమబొట్టు పెట్టిన యానవాలు మొదముమీఁద కనఁబడు చుండినది. కాని మే మెన్నోదినములు కలసి ప్రయాణము చేసినను మగనిమాట యామె యెత్తనేలేదు."

అనవుడు ధనంజయుఁడు గుండెలు కొట్టుకొన నిట్లనియెను. "అమ్మా! అది యటుండనిచ్చి, ఆమెను మీరెక్కడ విడిచిపెట్టితిరో, ఆమెను మీ రెక్కడ కడపటిసారి చూచితిరో ఆ స్థలము చెప్పుడు?"

"మే మిద్దరము వేఱుకాలేదు. నేనామెను విడిచిపెట్టలేదు. మే మందరము కలసియే తిరిగి వర్ధమానమునకు వచ్చితిమి. ఆమె నాతో కలసి మాయూరువచ్చి మా యింటిప్రక్కనున్న కుటీరములోఁ దనవంటదానే చేసికొని కొన్ని దినము లుండినది. కాని జనులందఱు ఈమె యెవ రీమె యెవరని యెన్నోప్రశ్న లడుగఁజొచ్చిరి. ఆ బాధ పడలేక రెండుదినములక్రిందటనే యీ యూరు విడిచి పెట్టి గయవెళ్ళుచున్న యాఁడువాండ్రలో గలసి వెళ్ళిపోయినది. కాషాయవస్త్రములు ధరించి యోగినులలోఁ గలసిపోదునని చెప్పినది."

అప్పుడు ధనంజయుఁ డిట్లనియె. "మిత్రుడా! నాపని యైపోయినది. ఇఁకమీఁద నేను నాభార్యాసమాచార మడుగుటలోనే కాలము పుచ్చెదను. ఈజీవితములో నాకు మఱియొకపనిలేదు. ఇల్లు వాకిలి విడిచిన దేశదిమ్మరినై నన్ను నీభార్య దయతో నావరించినది. సజ్జనుల యాదరణమునకు, సహాయమునకు, నేను తగనివాఁడ నైనను మీరు నన్నాదరించి సహాయముచేసితిరి. నాహృదయము మీఁదనుండి గొప్పభారము దిగినది. మహాదోష కళంకము నా యాత్మమీఁదనుండి తుడిచివేయఁబడినది నాభార్య యిప్పటికి జీవించి యున్నదని నే నిప్పుడు తెలిసికొంటిని గనుక నాకిప్పు డెంతో బలము వచ్చినది. ఆమె నాకగపడువఱకు నే నీవిధముగా వెదకికొనుచు వెళ్ళెదను. లేదా, యీ యన్వేషణములో నశించి పోయెదను."

వర్ధమాన పట్టణమునుండి బంకిపురమున కొకరాత్రి ప్రయాణము. బంకిపురమునుండి ప్రత్యేకముగా నొకశాఖామార్గ మున్నది ఆమార్గముమీఁద రైలుబండియెక్కిన పక్షమున గయాక్షేత్రమునకుఁ బోవచ్చును. ఆ నగరమునిండ దేవాలయము లున్నవి. తైర్థికులైన హిందువులు గుంపులుగుంపులుగఁ బ్రతిదిన మిక్కడకువచ్చి చచ్చిపోయిన పితృపితామహాదులకు, బంధువులకు పిండములు వేయుదురు. గయలోనున్న ఫల్గునదిమీఁద స్నానఘట్టములు కట్టబడి యున్నవి. అక్కడ నుదయాస్తమయములు మాతాపితృభక్తులగు పుత్రులు, దుఃఖార్తులైన బంధువులు, మృతినొందినవారి యాత్మలకు శాంతి గలుగఁజేయుటకు శ్రాద్ధకర్మములు చేయుచుందురు. మృతినొందినవారి మీఁద హిందువుల కున్నంత భక్తియు, గౌరవము మఱి యే జాతివారికి లేదు. గయాక్షేత్రమునఁజేయు శ్రాద్ధకర్మములకంటె పితృదేవతాకములైన పుణ్యకార్యములు వేఱులేవు.

ఆపట్టణమునకుఁ దైర్థికులు ప్రతిదినము తండోపతండములుగావచ్చి యొకనాఁడో, యొకపూటయో యచ్చట విడిసి, తాము వచ్చి పోయినట్లు రవంతైనను గుర్తు నిలుపక వెడలిపోవు చుందురు. అట్టినగరములో దనపే రెవ్వరికి జెప్పక ప్రచ్ఛన్నముగా వచ్చి ప్రచ్ఛన్నముగా వెళ్ళిపోయిన యొకానొక యాఁడుదాని సమాచారము తెలిసికొనుట యసాధ్యము కదా! ఐనను ధనంజయుఁడు ధైర్యము విడువలేదు. భార్యాన్వేషణమే యతని జీవితముయొక్క పరమార్థము. అపరాధమునకు దగిన ప్రాయశ్చిత్తము చేసికొనుటయే యతని సంకల్పము.

ఎండలో మిక్కిలి యలసిపోయియున్న మధ్యాహ్నకాలమున ధనంజయుఁడు గయలో మనుష్యులుండుచున్న వీధులవెంబడి దిరుగఁ జొచ్చెను. అతఁడు ప్రతిసత్రము దగ్గఱ భోగట్ట జేసెను. రాతి చిప్పలకు రాతిపళ్ళెములకు గయ ప్రసిద్ధి. తన భార్యను గుఱించి యతఁడు డాక్టరుల నెన్నో ప్రశ్నలు వేసెను. దేవాలయము లెక్కడ నుండెనో గొందులలో నిత్తడివిగ్రహముల నమ్మెడు స్త్రీలను పురుషులను విసుగులేక సమాచార మడిగెను. వీధిమూలలయం దతఁడు కొంచెముసేపు నిలువఁబడి దేవాలయములలోనుండి వచ్చెడి మనుష్యులగుంపులను పరిశీలించి చూచెను. పూజారులను, బాటసారులను, ప్రశ్నలు వేయుచు నేటిగట్టుమీఁద నెన్నోసారులు తిరిగెను.

సాయంకాలము గడచి రాత్రి ప్రారంభ మయ్యెను. కాని యన్వేషణము ముగియలేదు. బాటప్రక్కన నొకయంగడిలో నతఁ డటుకులు కొని తిని ఫల్గునది జలము

కొంచెము త్రావి శ్రమ దీర్చికొనుటకు మెట్లమీద గొంతసేపు కూర్చుండెను. దేవాలయ ఘంటానాదము సాయంకాల సేవాసమయమైన దని ఘోషించెను. సాయంసమయ మందమారుతములు నదిమీదనుండి వచ్చి చల్లగా వీచెను. ధనంజయుడు తిరిగి తిరిగి యున్నందున కాళ్ళు నొప్పులుపట్టి యలసిసొలసి దుఃఖభారమున గుంది రాతి స్తంభము నకు జేరబడి నిద్రపోయెను.

అది చీకటిరాత్రి; అర్ధ మప్పటికి నిర్మానుష్య మయ్యెను. క్రమక్రమముగా దేవాలయమునందును బజారునందును ధ్వని మందగించెను. చల్లగాలి యంతకంతకు జలి గాలిగా మారెను. అట్టిసమయమున నెవరోవచ్చి కనుదప్పిన యాబాటసారిని జేతితో మెల్లగ స్పృశించిరి. అప్పుడు యతనిని మేలుకొలిపెను. అతఁడు కన్నులు దెఱచి తన యెదుట మెట్లమీఁద నిలిచి యున్నయొక ముసలి బ్రాహ్మణుని జూచెను. ఆబ్రాహ్మణుఁ డతని కిట్లనియె.

“నాయనా ! నీవెవ్వరు ? తైర్థికు లందఱు బసలకు వెళ్ళి పండుకొనిరి. ఈయర్ధ రాత్రమువేళ నీ విక్కడ నొంటిగా నెందు కున్నావు ?”

“తండ్రీ ! నేను వర్ధమానమునుండి వచ్చుచున్నాను. రెండుదినముల క్రిందట నిక్కడి కొకబాటసారులగుంపు వచ్చినది. ఆగుంపును వెదకికొనుచు వచ్చినాను. ఆగుంపుతో నొకచిన్నది వచ్చినది. ఆమెను దీసికొని పోవలెనని భర్త కోరుచున్నాఁడు”

“ఆగుంపులో నున్న మనుష్యుల పేళ్ళెఱుఁగుదువా ?”

‘అవు ! తెలుసును.’

“ఐతే నీవు కష్టపడి వెదకికొన నక్కఱలేదు. నాతో రా.”

ఆబ్రాహ్మణుఁ డతనిని దేవాలయమునకుఁ దీసికొనిపోయెను. వందలకొలఁది పండాలు దేవాలయావరణములోఁ గాపుర ముండిరి. ఆయన్వేషణము గురించియు, వెదకితెచ్చినవారికి వచ్చుగొప్పబహుమానముల గురించియు విని వారందఱుగుంపుగూడిరి. ఆ పేర్లు కనుగొనుటకై పండా లందఱు తమతమపుస్తకముల కట్టలు తిరుగవేసిరి. గయలో వదుగుపెట్టిన తైర్థికు లందరి పేళ్ళు చిత్రగుప్తుని లెక్కవంటి యాపండా బ్రాహ్మణుల పుస్తకములలో నెక్కియుండును.

"కనఁబడినది. కనఁబడినది అదిమొదలుగురు మనుష్యుల తండా; తల్లి, తండ్రి, పెండ్లి యైన కుమార్తెలిద్దరు, వారితో నొకవితంతువుబిడ్డలు వచ్చిరి." అని యొకపండా చెప్పెను.

"ఆవితంతువు పేరేమి ?" యని ధనంజయుఁ డాత్రముతో నడిగెను.

"అది నా పుస్తకములో లేదు. ఆబిడపేరు లేమియుం జెప్పలేము. తాలూకాలో జన్మించిన దఁట, ధనపుర మత్తవా రఁట."

'ధనపురమా యేమిటి మీయభిప్రాయము ?'

"ఐయుండవచ్చును. వ్రాతసరిగా లేదు, అలుకుకొని పోయినది."

"ఆతండా యిప్పుడెక్కడున్నది ?"

'ఇప్పటివఱకు గయలోనే యున్నా రని నే దలంచెదను. నేను వారిని వెంటఁ బెట్టుకొని దేవాలయము లన్నియుఁ జూపితిని. సాయంకాలమునందు వారు చేయవలసిన దానములు జేసి, తాము బసదిగినయంగడిలో నిద్రింపఁబోయిరి.'

'ఆయంగడి యెక్కడ ?'

"అది మిఠాయి గోపాలునియంగడి."

"అయ్యా ! త్వరపడుము. త్వరపడుము. ఆతండా యిప్పటికి నచ్చట యుండెనా నీకు మంచిబహుమానము దొరకును."

అయర్ధరాత్రము మిఠాయి గోపాలుఁడు గాఢనిద్రనుండి మేలుకొల్పఁబడి కన్నులు నలుపుకొనుచు, "ఇదేమిటయ్యా ! అపరాత్రమువేళ, నిద్రపోవు చున్న మర్యాదస్థులైన పేదసంసారులను లేపఁగొట్టి తీసికొనివచ్చు చున్నా రేమి ? మీరు పోలీసువారా యేమిటి ? కూనీ యేదైన జరిగినదా యేమిటి పట్టణములో ?' నని సణుగుకొనుచు వచ్చెను.

తళతళ లాడుచున్న తెల్లని రూపాయయొకటి శత్రుణము వానిచేతిలోఁ బడెను. అది సణుగులను గొణుగులను నిమిషములో నంత మొందించెను.

"ఈ రాత్రి నీయంగడిలో నిద్రపోవుచున్న తండా మనుష్యులలో నేను కొంచెము మాటలాడవలసి యున్నది. నిన్నింతో సేవు మేలుకొల్పను." అని ధనంజయుఁ డతనితోఁ బలికెను.

"అది యేతండా?"

"ఎఱుఁగవా! ఒక మగవాఁడు, నలుగు రాఁడువాండ్రు గలసివచ్చినతండా. వారు వర్ధమానమునుండి వచ్చిరి. వారిక్కడ రెండు దినములనుండి యున్నారు."

"అయ్యో! వారు సాయంకాలము భోజనము కాఁగానే వెళ్ళిపోయిరి. ఒక జామైనది బయలుదేఱి."

"అయితే వారెక్కడికి వెళ్ళినారయ్యా?"

"అది నే జెప్పలేనండి! నే నేమి పోలీసువాఁడనా పెద్దమనుష్యులు బోవుచున్నప్పుడు మీ రెక్కడికి వెళ్ళుచున్నారని యడుగుటకు?" అని వారందఱక్కడ నుండఁగానే గోపాలుడు తడికెలు దింపి యంగడి మూసివేసి లోపలికిఁ బోయెను."

"ఒక్కనిముస మాగిపోయి. నీ యంగడి విడిచి వారేలాగున బోయిరి?" యని ధనంజయుఁ డడిగెను.

"వారనాముని యెద్దుబండి యద్దెకుఁ గుదురుచుకొని పోయిరి. ఆఁడువాండ్రు నలుగురు బండెక్కిరి. మగవాఁడు వెనుక నడచుచు పోయెను" అని యతఁడు లోపలనుండి చెప్పి పండుకొనెను. చూఁకనగా చేతిలో బిళ్ళకుడుమువలె రూపాయి పడినంగున సంతోషముగా నిద్రపట్టెను.

"అయ్యో! మేము చేయవలసిన దింతికన్న నేమున్నది? ఈపాటికి వ్యర్థమైన ప్రయత్నములు మాని యింటికి వెళ్లుఁడి. తప్పుదారి త్రొక్కిన యా యిల్లాలు తిరిగి తిరిగి విసికి వేసారి బుద్ధితెచ్చుకొని మరల మగనికడకుఁ దానే పోవును. దేశ దిమ్మరియైన యాఁడదానిని, గాలిని, పట్టుకొని యెవఁడు బంధింపఁ గలఁడు!" యని యాపండాపలికెను.

"అయ్యో! నీవనవసరమైనమాటలాడకు. మనపని యింకను దీరియ లేదు. ఆ బండివానియిల్లు కనుగొందము" అని ధనంజయుఁడు కొంచెము విసిగికొని పలికెను.

తిరిగి తిరిగి వారు బండివాని యిల్లు తెలిసికొనిరి. చప్పట్లు గట్టిగా కొట్టగా కొట్టగా, తలుపులు తట్టగా తట్టగా, పాపము! బండివానిభార్య మేల్కొనెను. మేలుకొని తన మగఁడు పన్నులియ్యవందున వానిని బట్టుకొని తీసికొని పోవుటకై వచ్చిన సర్కారు బంట్రోతులు వచ్చియుండిరనుకొని భయముతో గడగడవడఁకుచు నామె తలుపులు తెఱచెను. తెఱచి యేడ్చుచు "బాబయ్యా! ఆయన యింట్లో లేడండి" యని బదులుచెప్పెను.

"నీమగఁడు మనుష్యుల నెక్కించుకొని యేదో యూరికి రాత్రి బండి తోలుకొని పోయినవాఁడు కాదూ?" యని ధనంజయుఁ డడిగెను.

"వెళ్ళినాఁడు బాబూ! కాని, సరకారువారిపన్ను లెగవేయఁడండి. పెద్దమనిషి బాబయ్యా!" యని వడఁకుచున్న యా పడఁతి ప్రత్యుత్తర మిచ్చెను.

"అమ్మా! సర్కారు పన్నులకోసము రాలేదు మేము. ఒక యాఁడది తప్పిపోయినది. ఆమెను వెదకికొనుచు వచ్చినాను."

"అయ్యో దేముఁడా! నా పెనిమిటి పని యేమవుతుందో కదా; బాబూ యెవరి భార్యను? యెవరి కూఁతురిని? మా మగమనిషి యెఱిఁగిఉండి దాచఁడండి బాబయ్యా. నేరక చేసినాఁడండి బాబయ్యా! అలాటి ఆఁడమనిషిని నా కొంపలోనికి చేరనియ్యనండి బాబయ్యా. మేము పేదవాళ్ళమే కాని బాబయ్యా, పరువు గలవాళ్ళము. సీమరాణిగారి అనుగ్రహమువల్ల బ్రదుకుచున్నాము బాబయ్యా!"

"అది మే మెఱుఁగుదుమమ్మా నీ పెనిమిటిమీఁద మేము నేర మేదియు మోపలేదు. ఆ తప్పిపోయిన యాఁడదాని పెనిమిటి ఆబిడ యేలాగున వెళ్ళినదో తెలిసికొని రమ్మని మనుష్యులను బంపినాఁడు. అందుకోసము హరినామునిబండి యే వైపువెళ్ళినదో, యేయూరు వెళ్ళినదో యని తెలిసికొన వచ్చినాము" అని ధనంజయుఁడు పలికి యామె చేతిలో నొకరూపాయి పెట్టెను.

ఆమె ధైర్యము తెచ్చుకొని యిట్లనియె. 'అది నేఁ జెప్పలేను బాబయ్యా! మా మగమనిషి తీసికొనిపోయిన మనుష్యుల నైనా నేను చూడలేదు. ఈ రాత్రి యెనిమిది గంటలకు బండి గోపాలుని దుకాణము దగ్గఱకు తీసికొని వెళ్ళినాఁడు బాటసారు లక్కడనే బండెక్కినారు.'

"అతఁడు తిరిగి యెప్పుడు వచ్చును? ఎంతదూరము వెళ్ళుచున్నాఁడో ఎప్పుడు తిరిగివచ్చునో నీతో జెప్పకపోవునా?" యని పండా బ్రాహ్మణుఁ డడిగెను.

'రేపు పొద్దు నెత్తిమీఁదికి వచ్చేటప్పటికి కూఁడు తయారుగా నుంచమన్నాఁడండి బాబయ్యా. మద్దినాలకు బుద్ధగయనుండి రాఁగల నని చెప్పినాఁడు."

అనవుఁడు ధనంజయుఁడు మహోత్సాహముతో దాపున నున్న పండాబ్రాహ్మణుని జేయిబట్టి బుద్ధగయకు వెళ్ళుబాటవైపునకు లాగి యిట్లనియె. 'చాలు; బుద్ధగయ

యిక్కడి కెంతో దూరము లేదు. బండి జాముక్రిందటనే బయలుదేఱినది. పండాజీ! ధైర్యము తెచ్చుకో! మనము తెల్లవారకముందే బుద్ధగయఁ జేరఁగలము. త్వరగా నడిచి తిమా త్రోవలోనే బండిని కలసికొనఁగలము.”

అని పలుక వాఁడా బ్రాహ్మణుఁడు తనపడిన శ్రమకు గొప్పబహుమానము లాగివేయ వచ్చునని దృఢముగా నమ్మి ‘అలాగే చేయవచ్చును లెండి’ యని బదులు చెప్పి తనలో ‘భర్తను విడిచిపెట్టి మఱికొందరుభార్యలీ లాగున లేచివచ్చి మాపాలఁ బడినపక్షమున వారొట్టచేతిలోఁ బడును గదా’ యనుకొనెను.

గయాబ్రాహ్మణు లందఱివలెనే యాపండాకూడ దృఢదీర్ఘకాయుఁడు. ధనంజయుఁడు దేహబల మంతగా లేకపోయినను నీవిషయమున గట్టిమనోనిశ్చయము కలిగి యున్నవాఁడు. ఆచీఁకటిరాత్రి మైలు తరువాతమైలు వారు విసవిసనడిచిరి. అప్పుడప్పుడు నేల నిమ్నోన్నతముగా నున్నచోట్ల నడుగుజారి పడుచుండిరి. ఒకరితోనొకరు తరచుగా మాటాడుటలేదు ఒకటిరెండెద్దుబండ్లు తమ కెదురుగా వచ్చినప్పుడు వాగనాముని బండినిగూర్చి వారడిగిరి. కాని, వారిప్రశ్నలకుఁ దగినయుత్తరములు రాలేదు. దారిఁ బోవు ప్రతిమగవానిని, ప్రతియాఁడదానిని వారు ప్రశ్నలు వేయఁజొచ్చిరి. కాని యావర్ధమానపురతండా సంగతి తెలియ లేదు.

అలసిసొలసి బాటసారులు బుద్ధగయఁ జేరునప్పటికి నుదయకాల సంధ్యారాగ మగ్నిజ్వాలవలెఁ బ్రదీప్తమై పొడుపుకొండ నలంకరించెను. తైర్థికులబండ్లు నిలిచెడు చోటు, బండియెద్దులకు మేతవెట్టుచోటు కనుగొనుటకు వారంతగా శ్రమపడలేదు. కొంత ప్రొద్దు భోగట్టా చేసినతరువాత బండిమనుష్యుఁడైన వాగనాముని వారుకనుగొనిరి. అతఁడు రాత్రి యంతయుఁ బయనము చేసి చల్లగాలిలో నుండుటచే నప్పుడు చుట్టగాల్చుచు హాయిగాఁ జలిమంట కాగుచుండెను.

అతని జూచి పండా యిట్లనెను ‘ఓయీహరినామ్! గయనుండి బుద్ధగయకు రాత్రి యతాయకీని బండి గట్టుకొని వచ్చినందుకు మంచికిరాయి దొరికినది కాఁబోలు.’

“పండాజీ! లేదు. లేదు. తీర్థవాసులు పూర్వమిచ్చి నట్లిప్పుడు డబ్బిచ్చుటలేదు. అదిగాక మునుపటియంతమందికూడ వచ్చుట లేదు. ఇంతకు మాబండివాండ్ర గ్రహచార మది. మాతండ్రి తాతలు బండితోలి బ్రతికినారు గదా యని మేమును విడువలేక తోలుచున్నాము. లాభములు లేవు. నే నేమాత్రమో మీకు బాకీయున్నాను. జ్ఞాపకమున్నది.

వడ్డిలోఁగూడ సంవత్సరము లోపుగా మీ కిచ్చివేయక మానను. కాని యీరోజున నాసలపాదన కొంచెమే. ఇది మీకిచ్చిన పక్షమున నా పెండ్లము బిడ్డలు పస్తు పడ వలసినదే."

"నీపెండ్లము మంచిది. పస్తుండ లేదు. ఈమధ్యాహ్నము నీవు వెళ్ళునప్పటికి మాచిటూర వండి నీకన్నము సిద్ధముగా నుంచును. నా కియ్యవలసిన బాకీ వసూలుచేసి కొనుటకు నేనిక్కడకు రాలేదు. ఈతీర్థవాసుఁడు మిక్కిలి దయగలవాఁడు. ఈయన నీకేదోబహుమాన మియ్యఁదలఁచుకొన్నాడు. అది నీకెప్పించుటకు వచ్చితిని. ఈడూపాయి పెట్టి నీభార్యకు మంచికోక కొని తీసికొనిపో. నీవు రాత్రి తీసికొనివచ్చిన మనుష్యు లెక్కడ నున్నారో చెప్పు" బండివాఁడు కన్నులు మిక్కిలి యాశ్చర్యముతోను సంతోషముతోను మెఱయనిట్లనియె. "పండాజీ! భగవంతుఁడుమీకు మేలుచేయువలె. నా పెండ్లము బిడ్డలు మీపాదములకు మ్రొక్కుచుందురు. నాయనా ! ఇప్పుడే కాదు, మీరుమాకనేక సారులు దయగలిగి యుపకారము చేసితిరి. కాని నేను తీసికొనివచ్చిన మనుష్యు లెవరో నేను బాగుగా నెఱుఁగను. బండిలో నలుగురాఁడవాండ్రు కూర్చుండిరి. ఒకమగవాఁడు వెనుక నడచివచ్చెను.

"సరే ! అదియంతయు మే మెఱుఁగుదుము. మీరెందా రేస్థలమునుండి వచ్చినదో చెప్పు ? ఆయాఁడవాండ్రేలాగున నున్నారో చెప్పు."

"బంగాళా దేశములో గొప్పయింటి యాఁడువాండ్రవలెనే వారు దుస్తులు ధరించినారు. అందులో నొకాబిడ పెద్దది. ఆమె కిద్దరుకూఁతు లున్నారు. వారు పెండ్లిలేని వారే. వారుకట్టిన బట్టలనుబట్టి నేను పెండ్లయిన దనుకొన్నాను. నాలుగవయాబిడ కొంచెము దూరముగాఁ గూర్చున్నది. ఆమెచేతులకు కాళ్ళకు నగలులేవు. పండాజీ! ఈతీర్థముల కెంతమందో చిన్న వితంతువులు వచ్చుచుందురు."

"వారిక్కడికి వచ్చి యెంతసేపైనది ? ఎక్కడికి వెళ్ళియుందురు ? నీబండిలో వారుతిరిగి గయకు వెళ్ళుదురా?"

"లేదు పండాజీ. నా కిరాయి యిచ్చి నన్ను పంపివేసినారు. అయితే వారిక్కడ ఒకరోజో రెండురోజులో ఆగుదురని నే ననుకొను చున్నాను. మేమువచ్చి యొక గంట యైనది. బుద్ధగయ పెద్దగ్రామము కాదు. వెదికితిరా మీకు వారు తప్పక కనబడుదురు. దాటిపోవుటకు వీలులేదు."

అప్పుడు ధనంజయుఁ డిట్లనియెను. "పండాజీ! నీవు చేయవలసినపని సమాప్తమైనది. రాత్రి మీరుచేసిన సహాయమున కివిగో యీ రూపాయలు తీసుకొనుడు! తక్కినపనినాకు వదలివేయండి! ఇంతవఱకు సాయము చేసిన భగవంతుఁడు ముందుగూడ నాకుసాయము చేయక పోఁడు!"

పండాబ్రాహ్మణుఁడు హరనాథుని బండియెక్కి గయకుఁబోయెను. ధనంజయుఁడు తన యన్వేషణము సాగించెను. తూర్పున రేఖలు తోఁచినది మొదలు సూర్యోదయము వఱకు తైర్థికులు మూగునట్టి ప్రతి యంగడియందుఁ ప్రతి స్థలమునందు నతఁడు భోగట్ట చేసెను. అట్లు చేసిచేసి యెట్టకేల కతఁడు వర్ధమానపు తండాను గనుగొనెను. అతఁడా మెను జూడగానే యతని హృదయ మాశాబద్ధమై దడదడ కొట్టుకొనెను. ఆ తండాలో మగవానిం జూచి యతడిట్లు పలుకరించెను.

"అయ్యా! మీరు వర్ధమానపు పురవాసులఁట! మీకు నమస్కారము. నేనుగూడ వర్ధమానపు వాడనే. మీరీయాడవాండ్రు నీపుణ్య క్షేత్రమునకు యాత్ర నిమిత్తము తీసికొని వచ్చితిరి గాఁబోలు. పరమేశ్వరుఁడు వారి హృదయములకు మిక్కిలి ప్రియములైన కోరికలను బ్రసాదించుఁ గాక! కాని మీపండా మీతో మఱియొక చిన్నది వచ్చినదని చెప్పినాఁడు. ఆమె నాకిక్కడ కనఁబడ దేమి?. ఆమెయెక్కడికి వెళ్ళియుండును.?"

ఆ మాటలు విని యతఁడిట్లనియె—"మహాప్రభూ! నమస్కారము. నాచత్వారపు కన్నులతో నేను సరిగాఁ జూచుచున్నానో లేదో కాని, మీరు మా ధనపూరు జమీందారుగా రని తోఁచుచున్నది. మీ గ్రామములలోనే మా కాపురము. నా పూర్వపుణ్యమువల్ల నేను మిమ్మీరోజునఁ గలిసికొనఁగలిగితిని. ధనపురము జమీందారుగారికి వంగి నమస్కారము చెయ్యండే!" అని భార్యతోను బిడ్డలతోను చెప్పెను.

ఆ స్త్రీలట్లు వంగి నమస్కరించిరి. భార్య భర్తతో నేమో గుసగుసలాడెను. అనంతర మతఁడు గట్టిగా నిట్లు పలికెను. "ఏలినవారిభార్య కలకత్తాలో మృతి నొందినట్లు మాయావిడ చాల విచారించు చున్నానని మనవిచేయు చున్నది. ఏలినవారు తిరిగి సుఖముగా వివాహము చేసికొని కొడుకులను గని మనుమల నెత్తి చిరకాలము జీవింపవలెనని భగవంతుని వేఁడుచున్నది. మీ కొడుకులు, మనుమలు మీ వంటిమంచివారై సంస్థానము నిలుపవలె ననిగూడ కోరుచున్నది." అప్పుడు ధనంజయుఁడు "దిక్కుమాలిన కోరికలు. నీ కోరికలు తగలబెట్ట" యని తనలో ననుకొని పైకి మృదువుగా నిట్లనియె

"అమ్మగారికి నా నమస్కారములు చెప్పండి. అటువంటి మంచి కోరికలు నా విషయమై యామె కోరినందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. కాని మీతో వచ్చిన యా చిన్నదానిని గురించి మీ కేమి తెలియునో చెప్పండి."

అని నవ్వుచు పడుచు జమీందారునివంక ననుమానముతో నెగాదిగఁ జూచెను. ఎందుచేత నన, మునుపు కలకత్తాలో ధనవంతుఁడగు జమీందారు చేసిన చేష్టలుకొన్ని యతఁడు వినెను. అందుచేత యాత్రనిమిత్తము గయకుఁ బారిపోయివచ్చిన చిన్నదానిని గురించి యా జమీందారు భోగట్టా చేయుట యతని కంత యిష్టముగా లేకపోయెను. కాబట్టి యతఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"అయ్యా! ఆమెను గురించి నేను విశేషముగఁ జెప్పలేను. ఆమె బాలవితంతువు. తీర్థయాత్ర చేయుటకై మాతండ్రితోఁ గలిసి వచ్చినది. అందుకని మేము మాతో దీసికొని వచ్చినాము. ఆమె గురుదేశములతో వచ్చెనా? పాలించుటకు భగవంతుఁడే యున్నాఁడు. మే మెంతవరకో [illegible] గృహస్థులము. అటువంటి వాండ్రతోఁ బ్రయాణము చేయుట కష్టతరము. ఆమె [illegible] దొంగను విడిచిపెట్టినదో, యెక్కడికి వెళ్ళినదో కనుగొనవలసినంత యవసరము మాకు లేదు."

[illegible] జమీందారు మహాశోకాక్రాంతుఁడై, కోపముచేతను నావిష్టుఁడై పెదవి [illegible] కొరికెను. [illegible] పోయెను. అతఁడు దాతృండాను విడిచి [illegible] [illegible] పోయి [illegible] కూర్చుండెను.

అప్పుడొక గ్రామస్థుని కూఁతురు దాపున నున్న పశువుల సాలనుండి పాలు దీసికొని [illegible] వెళ్ళుచుండెను. [illegible] పైన యా చిన్నదానిమీఁద దాని కన్నులు పడెను. అది యక్కడ నిలిచి తెలిసికొనుటకై [illegible]. స్త్రీ జాతికి సహజమైన జాలి యుప్పొంగ నా [illegible] యామెను [illegible] మీఁద [illegible] నాకు [illegible]. అతఁడు [illegible] యున్నవాఁడయి [illegible] నెట్టివేసెను. "అయ్యా! నేను బ్రాహ్మణుల పిల్లను.

గ్లాసుచెంబుతో మీరు త్రాగవచ్చును." అనియతని ప్రక్కనుగూర్చుండి పాలచెంబు డస్సిన మార్గస్థుని నోటికడబెట్టెను. అతఁడా పాలుత్రాగి మెట్లమీఁదనే నిద్రపోయెను.

ముప్పదవ ప్రకరణము.

తపస్విని.

హిందూదేశమునందలి నానా పుణ్యక్షేత్రములలో బుద్ధగయవంటి పరమపావన స్మారక చిహ్నములు కలది మఱియొకటిలేదు. క్రీస్తుశకమునకు రమారమి యైదువందల సంవత్సరములక్రిందట భూమిమీఁద జీవకాలము తిరిగితిరిగి వేసారిన యొక బాటసారి యొప్పుడు ధనంజయుఁడు విపన్నుఁడై పండుకొనినచోటనే కూర్చుండి పాపకర్ములై సద్గతిభ్రష్టులగుచున్న మనుష్యుల దుర్గతినిఁగూర్చి విచారించి వారికి మోక్షప్రాప్తిగల్గు నుపాయ మెద్దియని వితర్కించి మనోవేదన నొందుచుండెను. ఆ బాటసారి గౌతమ బుద్ధుఁడు. అతఁడు బోధించినమతము బౌద్ధమతము. ఆ మతమీ కాలమునఁ బ్రపంచములోఁ గలమానవజాతిలో నాల్గవవంతు జనులచేత ననుసరింపఁబడుచున్నది. పాపరహితమైన పరిశుద్ధజీవనము, సర్వభూతదయ, మనలఁగొట్టి బాధించువారియెడ క్షమ, మనలను ద్వేషించు వారియెడ గాఢప్రేమ మొదలగు సత్కృత్యధర్మముల నా మహాత్ముఁడు హిందువులకు, హిందువులకే గాదు తోడిమానవులకు బోధించెను. ఆధర్మములను హిందూదేశమందలి పేదలు సాదలు విని యవలంబించిరి. అవి చీనాదేశమునను, జపానుదేశమునను బర్మా దేశమునను, సింహళద్వీపమందును గలజనులచేత నంగీకరింపఁబడినవి. భారతఖండమున కనతిదూరమున నున్న తార్తారుదేశము, సైబీరియాదేశము మున్నగుచోట్లను వ్యాపించెను.

హిందూదేశ చక్రవర్తులలో నగ్రగణ్యుఁడని చెప్పఁదగిన యశోకుఁడు క్రీస్తుశకము నకు ముందు మూఁడువందల సంవత్సరముల క్రిందట బౌద్ధమత మవలంబించి యామత ధర్మములను బోధించుటకు [illegible] బోధకులను [illegible] ప్రపంచము యొక్క కొట్టకొనలకు బంపెను. ఈ బౌద్ధమత బోధకులు [illegible] వాసులకు క్రొత్తమతము [illegible] గలిగించిరి. పాలస్త్రీ, సిరియా, మాసిడోనియ, గ్రీసు, ఎపిరసు ఏసియామైనరు మొదలగు పశ్చిమరాజ్యములలో బౌద్ధమత బోధనము విపులముగాఁజేసిరి. ఏసుక్రీస్తు

పుట్టినప్పు డతనిజన్మస్థానమగు పాలస్టయిన్ దేశములో భూతదయ యను గొప్పదగు నుత్తమధర్మములను జనులకు బోధించుచు బౌద్ధసంఘములు నివసించుచుండెను.

మహాత్ముఁడైన యశోక చక్రవర్తి గతించినతరువాత ననేక సంవత్సర శతములు చెల్లిన పిదప శివాభిమానపూరితుఁడైన మహాత్ముఁడు హిందువుఁ డొకఁడో మున్ను మహానుభావుఁ డగుగౌతమబుద్ధుఁడు సర్వభూతదయాత్మకమైన మతము మనంబునం దొలుదొల్త భావించినస్థాన మాచంద్ర తారార్కసంస్థాయిగా నుండునట్లు జగత్ప్రసిద్ధమైన యాదేవాలయమును గట్టించెను. ఆగొప్పదేవాలయము పూజానమస్కారములు లేక కాల వశమున శైథిల్యము పాలయ్యెను. ఈకథా కాలమునకుఁ గొంచెముపూర్వము బ్రిటిషుగవర్నమెంటువారు దయారసప్రేరితులై భరతఖండముయొక్క ప్రాచీనౌన్నత్యమునందుఁ గల గౌరవముచేత గుడిమరమ్మతు చేయించి మంచిస్థితియం దుంచిరి. ఆదేవాలయపు మెట్లమీఁదనే పాపము! ధనంజయుఁడు నిద్రించి హృదయవేదన మఱచెను.

ఉదయకాల ప్రభాకరుఁడు దేవాలయముయొక్క యున్నతశిఖరమును దన యరుణతేజముచే మెఱయఁజేసి నలుదెసలఁ గాంతులు వెదజల్లెను. బౌద్ధమతసంబంధము లగు విగ్రహములు బొమ్మలు నానాఁట దొరకినప్పు డెల్లదెచ్చి దేవాలయ సమీపమున నొకచోట జాగ్రత్త పెట్టిరి. సింహళద్వీపమునుండియు బర్మాదేశమునుండియు బుద్ధగయా క్షేత్రమును సందర్శింప వచ్చిన బౌద్ధతైర్థికులను గాషాయ వస్త్రములను దాల్చిన శ్రమణుఁ డొకడు దివ్యస్థలములకుఁ దీసికొనిపోయి దర్శనీయములను చూపుచుండెను. హిందూమతస్థు లగుతీర్థవాసులు గూడ నిందుఁ దిఱిగి చెట్లక్రిందపడుకొనుటకై నిప్పులు రాజవేసిరి. కొందఱువర్తకులు తమకొట్లు తెఱచి సరకులు వెలుపలికిఁ దీసిరి. తీర్థవాసులకు మిక్కిలి ప్రియములగు బొమ్మలు మొదలగు చిత్రవస్తువులను గొందఱు విక్రయింపఁ దొడఁగిరి. దట్టము లగుచెట్లతో, గడ్డియిండ్లతో, భవంతులతో నిండిన చిన్నగ్రామము బుద్ధగయ, దేవాలయమును జుట్టియుండెను.

గుడి మెట్లమీఁద నిద్రించుచున్న ధనంజయునిప్రక్క నొకయంగన కూర్చుండెను. కాషాయవస్త్రములు ధరించినను నా యువతి బౌద్ధశ్రమణి కాదు. ఆమె హిందూమతస్థురాలు. సన్యాసినియై యుండవలె లేక తపస్వినియై యుండవలె. ఆమె తలవెండ్రుకల నెఱ్ఱరుమాలులోఁ గట్టుకొనియెను. ఆ రుమాలులో నొకభాగము మొగము భుజముల మీఁదను వ్రేలాడుచు నామెకు మేలిముసు గయ్యెను. ఆమెశరీరము నిండ నట్లాషే

యెత్తినియుంగరకా దోచిగి యొక కాషాయవస్త్రము నతనికు గట్టుకొనియెను. సన్యాసినులు ధరించుదండ మామె చేతిలో నుంచెను. పాదములకు నగలు లేవు. అలసి మేనుమఱచి నిదురించుచున్న యా బాటసారివంక నామె యొక్కసారియు చూచెను. అప్పుడామె కన్నులు బాష్పపూరితము లయ్యెను.

ఆ నిద్రితుఁడు మేల్కొనునప్పటికిఁ జాలప్రొద్దెక్కినది. తన నేత్రములనంటి జూచుచున్న యా నేత్రములను జూచినతోడనే యతఁడు మహోద్భుతమునొంది కన్నులుమూసికొని చేతులు రెండుఁజైకెత్తి భగవంతునిట్లు వేడుకొనెను. 'ఓ దయామయా ! పరమేశ్వరా ! ఇది స్వప్నమే యైనపక్షమున నాకు మెలఁకువ రాకుండఁ జేయుము'

“స్వామీ ! ధనపురప్రభూ ! నన్ననుసరించి మీ రిక్కడకేల వచ్చితిరి ? ఇల్లు లేక దేశద్రిమ్మరినైన నన్ను మీరనుసరింపఁగలరా ?” తపస్వినీముఖమునుండి వెలువడిన మాటలు పూర్వగాధలను, బాల్యకాలములను జ్ఞప్తికిఁ దెచ్చునట్టి మనోజ్ఞమైన పాటవలె నాతని చెవులకు విందొనరించెను.

“నాయాత్మ నంటియున్న పాపకళంకమును భగవంతుఁడు తుడిచి వేసెనా ? నా ప్రాణమా ! నా ఉమా ! నా ప్రియురాలా ! నిన్ను ప్రాణములతోఁ జూడ గలిగితినా ?”

“మీ యుమ గాను. మీ ప్రియురాలు గాను. మీ భార్య గాను. ఓ ధనపురప్రభూ ! నే నేమనుష్యునకు భార్యగా నుండుట మానుకొంటిననియు, నామనస్సు, నా హృదయము, నా శరీరము, నా ప్రాణము భగవంతునకే యర్పణ చేసికొంటిననియు నా మేనునున్న కాషాయవస్త్రములే చెప్పుచున్నవి” అని యా యంగన మెల్లఁగాఁ బ్రత్యుత్తర మిచ్చెను.

ఇద్దఱు నొకనిముస మూరకుండిరి. కొంతసేపటికి ధనంజయుఁ డిట్లనియె. “ఉమా ! నీ చేతులు నా చేతులమీఁదఁ బెట్టుము. చెడిపోయిన నాతల పిచ్చిపిచ్చి తలంపులఁ దలంచి నీవు బ్రతికి యున్నట్లూహించుకొనుట లేదనియు, నిజముగా జీవించి నీవు యున్నావనియు, స్వానుభవమువలన నన్నుఁ గ్రహింపనిమ్ము.”

అన నుమ తన హస్తముల మీఁదవైచి చిరపరిచితమైన యా స్పర్శచే మేను గగుర్పొడువ నింతక వడఁకెను. వడఁకుటయు నామె వెంటనే తన చేతులను వెనుకకు లాగుకొనెను.

"ఊరడుము. ఊరకుము! ఉమా! నన్ను నీపాదములు స్పృశింపనిమ్ము: క్షమింపుమని నిన్నుఁ వేడుకొందును. ఎరుఁగుదువా? చిన్నప్రాయమున నీకు నేను గలుగఁజేసిన కష్టము లిన్నియన్ని కావు. నా హృదయమునుండి నిన్ను దరిమివేసితిని. హృదయము నుండియే కాదు. నా యింటనుండికూడఁ దరిమివేసితిని. నా స్వాంతకాంతనైన నిన్ను దేశ ద్రిమ్మరిఁ జేసితిని."

అని యతఁడాయమ రెండుపాదములు పట్టుకొని గడగడవణఁకుచు గన్నీటితో నామె పాదములను దడుపుచుండెను. వణఁకుచున్న యా పురుషుని పట్టుదప్పించుకొని తన పాదముల నావలికి దీసికొనుచు నామె గజగజ వణఁకుచు నెట్లో యావలఁబడెను. పడి యీసారి యతని దగ్గఱనుండక కొంచెము దూరమున నిలిచి సన్నని యెలుఁగుతో నిట్లనియె. "స్వామీ! ధనపురప్రభూ! పూర్వాశ్రమవృత్తాంతము స్మరణకుఁ దేవలదు. గతం నాస్తి. అది మనయిరువురకును భూషణము కావలసినదే. ఎవ్వఁడు మన పాప కళంకములనెల్ల గడిగివేయ సమర్థుఁడో యాతని క్షమార్పణము వేడుఁడు."

"అహా! ఆతఁడే నా పాపములను క్షమించుఁగాక! ఆతని కరుణారసమే నా కిప్పుడు విశేషముగఁ గావలసియున్నది. నేనెంత చిత్తక్షోభము నొందితినో నీవు తెలిసి కొన్నపక్షమున నీవుగూడ నన్నుఁ దప్పక క్షమింతువు. గతవృత్తాంతము మిగుల భయంకరమై ఘోరమై పవలును రాత్రియు నన్ను వేధించినది. నాకంటికి తల యేఱుపట్టినది. దృష్టి మందగించినది. నే నధఃస్థితిలోఁ బడితిని. అందుచేత నాకూపిరి సలుపలేదు. నాయెడల దయఁజూపువారు లేరైరి. ఘోరమరణము నావల్లగలిగెనని, స్త్రీహత్యచేసిన మహాపాతకుండనని, దివారాత్రములు కుందితిని. నామనసు మండిపోయెను నా నెత్తురు పేరుకొనిపోయెను. నాగుండె కొట్టుకొనుట మానెను."

"కటకటా! మీరు మహాదుఃఖ మనుభవించినారు. దుఃఖార్తులకు దయామయుఁడగు పరమేశ్వరుఁడే శరణము."

"అర్ధరాత్రమున హత్యలు నాయెదుట జరిగినట్లు నేను స్వప్నములు గాంచితిని. ఆ ఘోరస్వప్నములోనుండి నేను మేల్కొని భయకంపితుఁడనై కేకలువేయుచు గుభాలున లేచితిని. అనంతరము నవవధూహృదయము నాశనము చేసితి ననియు మధుర జీవనము మంటిపాలు చేసితి ననియు నేను గ్రహింపఁగలిగితిని. గ్రహించి బిగ్గఱగా నేడ్చితిని. నా మొఱ్ఱ వినువారెవ్వరు? నాపై జాలిపడు వారెవ్వరు?"

"ఓ ధనపురప్రభూ! అలాగనవద్దు. తాను పరిత్యజించిన జీవితముయొక్క పూర్వ వృత్తాంతమును గాని, తత్సంబంధములైన సుఖములుగాని దుఃఖములుగాని తపస్వి చెవులం బడరాదు."

"ఓహో! భక్తిమార్గమునం బడినయెడల మనస్సున కూరట గలుగునని నీవు సంసార సంబాధములైన సుఖములు దుఃఖములు వదలుకొంటివి కాంబోలు. ఇంక నా యవస్థ యెట్లుండెనో చూడు! నీవు విడిచిపెట్టివచ్చిన ప్రతివస్తువు, పూర్వ పరిచితమైన ప్రతి పదార్థము సూదులవలె నా కన్నులలో గ్రుచ్చికొని నాకు బాధ గలిగించెను. ఆబాధ పడలేక యెట్టకేలకు మిక్కిలి యసహ్యమైన యా కలకత్తా గృహము విడిచి తలదాంచుకొనుటకైన ప్రశాంతిమయిన యిల్లు దొరుకునా యని వాడవాడలం బడి తిరిగితిని. నేనొక సారి మన బిందుగారి యింటికి వెళ్ళితిని. ప్రపంచములో నెక్కడనైన శాంతి యుండినపక్షమున నది యామె గృహమందే యున్నది. ఆమె హృదయమునందే యున్నది. చిన్నతనములో నీవంటే ఆమె కెంతో ప్రేమ. అలాటిప్రేమ మఱియెవ్వరికి నుండదు. నీ పేరామె కిప్పటికి జ్ఞాపకమే. ప్రాత స్నేహితులమాట అంతచక్కగా జ్ఞాపకముంచుకొనువారు మఱిలేరు. ఆమె యనుగ్రహమును నేను వేడుకొంటినా, ఆమె నన్ను క్షమించి మనస్సున కూరట గలిగించునని నే ననుకొంటిని."

ఉష కన్నులు తడి యయ్యెను. మరలం గలసికొను నాశలేక తాను విడిచివచ్చిన బాల్యస్నేహితురాలియొక్క మాట వినంబడంగానే కాషాయవస్త్రముల యడుగున మాటువడియు హృదయము శోకావిష్టమయ్యెను.

"నేను బిందుగృహమునకు వెళ్ళియుంటిని! కాని యామె కలకత్తా విడిచి తాల్పుకారునకు వెళ్ళినది. అక్కడకు వెళ్ళుటకు నాకు మొగము చెల్లినది కాదు. అప్పుడు కాళి మాట జ్ఞాపకము వచ్చినది. ధనపురమున బయలుదేఱి వర్ధమానమువఱకు రాత్రింబగలు నడచితిని. రాత్రులు పల్లెలలో గుడిసెలలోం దలందాచుకొనుచు గడ్డిపాన్పులమీదం బండుకొనుచుం బయనము చేసితిని. ఒకనాటి రాత్రి మిక్కిలి ప్రొద్దుపోయిన తరువాత వర్ధమానముచేరి వడకుచున్న చేతితో జగత్కిశోరుని తలుపు తట్టితిని. వారు జగన్నాథయాత్రచేసి క్రొత్తగావచ్చి యిల్లుచేరిరి. వారు నన్నెంతో దయతో నాదరించిరి. కాళి నాదుఃఖములు శ్రద్ధతో వినెను. సహజముగా మిక్కిలి మృదువైన యామె హృదయము జాలిచే గరగిపోయెను. ఆమె చిన్నప్పుడు పట్టుకొన్నట్లే నాచేయి బట్టుకొని గదిలోనికి దీసికొనిపోయి నీపేరు గౌరవించి నీయిష్టప్రకారము నేను నడచినపక్షమున నీవు నన్ను

దప్పక క్షమింతువని నాతో నొక్కి చెప్పినది ఆమాటలు బహుసంతోషమునపురుగుచున్న నాహృదయముమీఁద నమృతవర్ష బిందువులవలెఁ బడెను. నీవు వెళ్ళిపోయిన తరువాత నేను హాయిగా నిద్రించినరాత్రి యారాత్రియే. ఆమె చూపినదయకుఁ బ్రేమకు భగవంతుఁ డామెను రక్షించుఁ గాక !”

అట్లు చెప్పి ధనంజయుఁడొక్క నిముసమాగెను. రెండు కన్నీటిచుక్కలు చెలియొక్క కంటినుండి దిగి చెక్కులమీఁదఁ బడి జారెను. పిమ్మట నతఁడు మునుపటికంటె నెమ్మదిగాఁ దనకథ వినిపించెను.

“ఉమా ! నీప్రణయమునకు గడపటిగుర్తుగా నీవు విడిచిపోయినజాబు నిరంతరము నాహృదయమునం దున్నది. ఆజాబునుబట్టి నేను నూటతొమ్మిది దేవాలయముల కేగితిని. కాళియు నామెమగఁడు వచ్చునప్పటికి నావెంట వచ్చిరి. నిన్ను గురించి వారేమియు నెఱుఁగరు. వారు నన్ను గోయపురమునకుఁ బంపిరి. నీవు గయకు వెళ్ళితివని నాకక్కడ దెలిసినది. నేను నిన్న గయకువచ్చితిని. నీకొఱకు గుడిలోను బజారులోను వెదకితిని. నది ప్రక్కను నీమీఁద నొకకల గంటిని. ఇంకనధికముగాఁ జెప్పవలెనా? భగవంతుఁడు నాయుమను నాకిచ్చినాఁడు నాప్రాణము నాకిచ్చినాఁడు. నాయాత్మ నాకిచ్చినాఁడు.”

తపస్విని వేషముక్రిందనున్న యా స్త్రీహృదయము మఱియొకసారి శోకపూరిత మయ్యెను. ఆ స్త్రీనేత్రములు మఱియొకసారి బాష్పపూరితము లయ్యెను. గద్గదస్వరముతో నాతపస్విని యిట్లనియె. “ఓధనవ్జ ప్రభూ ! మనుష్యమాత్రులకు క్షమించుటకు శక్తిలేదు. భక్తవత్సలుఁడగు పరమేశ్వరుఁడే మనజీవితములు పరిశుద్ధములుగఁ జేయఁగలఁడు. కాని పనికిమాలిన యాఁడుదాని ప్రార్థనలు ప్రయోజనకరము లగునని మీనిమిత్తమా ప్రార్థనలు రేపుమాపు కరుణాసముద్రుఁడు, పతితపావనుఁడు నగు పరమేశ్వరుని సన్నిధిఁ జేయుచుందును. మీరు దారుణదుఃఖ మనుభవించినారు. అది దీర్ఘకాలము సహించి యనుభవించినారు. పూర్వకృతదోషము మీరు భయంకర ప్రాయశ్చిత్తములఁ జేసికొన్నారు. ఈనా హృదయము మీయెడల రవంతయైన క్రోధము గలిగియుండదు. నేను జీవించి యుండినంతకాల మిట్లే ఇందుకు భగవంతుఁడే సాక్షి.”

“ఉమా ! దయారసపూరితములైన యా పలుకులకు నన్ను భగవంతుఁడాశీర్వదించు గాక ! నేను నీయెడల దోషములు చేసితిననియు, నీవు యోగ్యురాలవై నన్ను క్షమించితి వనియు నేను జీవితాంతమువఱకు జ్ఞాపకముంచుకొందును. దోషములు చేసి మానవస్వాం

తుఁడనై నేను నిన్ను మఱలఁ జేరితిని. వాదోషాపహరణార్థము నీవు భగవంతుని ప్రార్థించితివి. ఇక్కడికి నాకథ ముగిసినది. నీ దుఃఖవృత్తాంతము చెప్పు ! నీ వేకాకివై యిట్లు సంచరింపనేల ? చెప్పు !

“ధనపురప్రభూ ! కాదు. నా వృత్తాంతము దుఃఖకరమైనది కాదు. తన్ను శరణు జొచ్చువారికి పరమేశ్వరుఁడు దుఃఖములుబాపి యూరట గలిగించునుగదా ? తపస్వినీ శీలము గ్రహించి తీర్థయాత్రలు చేయుచు ధర్మకార్యముల నెఱపుచు భక్తిపరులై జీవయాత్ర గడుపునట్టి యంగనలీ దేశమున నెంతోమంది కలరు. అట్టివారి నెందఱినో గలసికొంటిని. వారు దేశమంతటఁ దిరిగి మానవనేత్రములు సాధారణముగాఁ జూడజాలని యనేక పుణ్యక్షేత్రములను సేవించినారు. గంగామాతకు జన్మభూమైన గోముఖ మందలి మంచుదిబ్బలు కన్నులారఁ జూచినారు. కాశ్మీరమునందలి మంచుకొండలలో దాగియున్న దివ్యస్థలములు మెట్టినారు. దక్షిణాపథంబున సీతారాముల నివాసముచేతఁ బావనమైన గోదావరీసరంబుల కఱిగినారు. కృష్ణాకావేరీతీరములం దున్న ప్రాచీన దేవాలయముల సందర్శించినారు. సర్వవ్యాపకుఁడైన దేవదేవుని, నరులచేతఁ గట్టఁబడిన దివ్యస్థలములలో దర్శించుటయు, దుఃఖార్తులై, రోగపీడితులై వేదనపడుచున్న యాదేవదేవుని భక్తుల నాదరించి యథోచిత సహాయము చేయుటయు వారి పవిత్ర సంకల్పము. వారి జీవనము యోగినీజీవనము. అనదయైన యీపేదరాలినిఁగూడ వారు దీవించి తగు సహాయముచేయుట కొడంబడిరి. వారిసాంగత్యముచేత సంసారసంబంధములైన దుఃఖములను మనోవేదనలను నేను మఱచి పోవుదును. వారితపస్వినీవేషము నేను ధరించితిని. వారివలె మిక్కిలిపవిత్రజీవనమును గడుపుటకై ప్రయత్నించెదను. అట్టి పవిత్ర జీవితము నందే నిజమైన యానందము కలదు.”

“ఉమా ! నీసంకల్పము మిక్కిలి గొప్పది. అది నీపూర్వవృత్త చరిత్ర కనురూపమై యున్నది. కాని భగవంతుఁడు తన దివ్యస్థలములను దర్శించి సేవించువారి పూజా నమస్కారములను మాత్రమే పరిగ్రహించునని నీవు తలంచుచున్నావా ? సంసారముఁ జేయుచు, దుర్బలు లగు స్త్రీపురుషులకుఁ జేయూత నిచ్చువారిని, నిరుపేదలను, దుర్గతులను రక్షించువారిని, సంతోషచిత్తులై పరితోషంబును నొసఁగువారిని, భగవంతుఁడు చూడఁడని నీయభిప్రాయమా ?”

“కాదు ! సంసారముఁ జేయుచు ధర్మమార్గమున నవలంబించువారు దేవాలయముల లోని కైంకర్యములకంటె నెక్కువ కైంకర్యమును, యజ్ఞకోటికంటె మీఁద నిచ్చు బలికంటె

నెక్కువ బలిని దేవదేవప్రీత్యర్థమై చేయుమన్నా రని మన గ్రంథములలో వ్రాయబడి యున్నది. సంసారయాత్రకుఁ దగనియాడువాండ్రు దగనివారగువాండ్రు గదా దుర్బలత్వము చేతఁ దాపసవృత్తి నవలంబించుచున్నారు. ధనపుర ప్రభో! అట్టి దుర్బలత్వముచేత బాధ పడువారిలో నేనొకఁడను. సంసారధర్మముల నేను సరిగా నడుపఁజాలనైతిని. ఇంక సన్యాసమే నాకుఁ బాగుగ."

'ఉమా! సంసారధర్మములు నీవు సరిగా నడుపకపోలేదు. మహారణ్యములలోను నిర్జనస్థలములలోను తపస్సుచేసిన మునులలోను బ్రహ్మచారులలోను నీకంటె నెక్కువ క్లేశము నొందినవారుండరు. నీవలెఁ బరమశాంతితో మహాధైర్యముతో దుఃఖముల ననుభవించినవారుగూడ నుండరు. సంసారధర్మములను సరిగా నడుపజాలనివాఁడను నేను. పవిత్రపదార్థములమీదికి హృదయమును ద్రిప్పినవాడను నేను. దుర్బలుడగువాడను నేను కాబట్టి చేయూత గావలసినవాడను నేను. సహాయము కావలసినవాడను నేను. తప్పుదారిపట్టిపోయిన మగని యందనురాగము చేయూతయిచ్చియతనిని మంచిదారిని నడిపించుటకు దోడుపడఁగూడదా?'

"ధనపురప్రభూ! నన్ను తప్పుదారిని దింపవద్దు. ఆమె దానికినన్ను మిక్కిలి సుస్థిరమైనది. అది సాధారణముగా మంచిదారిని నడుపనే నడుపును. నడుచుచున్న దారిని మీరు మార్పవద్దు."

"ఉమా! నామాట యటుండనిమ్ము. పాపము పుత్రికావియోగముచేత నత్యంత వైక్లబ్యమునొందిన మీతల్లినైనఁ జూడవలదా? ఆమె పెద్దదైనది. ఏకపుత్రికానిమిత్తము. పెత్తనములో నామె కూతురుఁ గలుగజేసికొనుట ముక్తిప్పను లేదుకదా! కాలమారవలెనా మైనప్పుడు నీవు వచ్చిపోవువారు లేరుకదా! నిన్ను కని పెంచినందుకిదియా ప్రతిఫలము! ఆమె జీవితమస్తమించుకాలమున నామెకు దివంత యాత్రానము నీవు గలుగ జేయకూడదా?"

"ప్రాణేశ్వరా! నేను రాజాలనని తెలిసియు నన్ను వదలివేయఁగూడదా?"

"అక్కటా! ఎన్నియోదినములనుండి నీవు జూచినంత ప్రేమ నీపైఁజూపి నిన్నిప్పటికిని ప్రేమించి జూడఁగోరుచున్న నీ ప్రియపుత్రిక బిడ్డను గౌఁగిలించుకొనుటకైన నొకసారి రాకూడదా? బిడ్డ పిల్లలనొకసారి యెత్తుకొని ముద్దాడరాదా? లేక పెనఁప్రాంతలో ముద్దులు మా సిన్నియమ్మ, మా సిన్నియమ్మ యని ముద్దుముద్దుమాటల గిట్టనట్లు పలుచుండగా నీవు ప్రియమిత్రమైన కాలీనగ్గడలకరి వెయకటి సోదరిమైత్రి నెఱపవలదా? పాపము! అల

చెడి దుఃఖసముద్రనిమగ్నయైన సుధ నూరార్పగూడదా? ఇంటియొద్దకఱిగి చేయవలసిన యీ ధర్మములకంటె సన్యాసిని ధర్మములు మిక్కిలి యుత్కృష్టములని నీవనుకొనుచున్నావా?

బంధుమిత్రజనముల తలంపులు మనస్సున బాదరగా వెక్కివెక్కి యేడ్చుచు ఉమ 'నాకిల్లులేదు వాకిలిలేదు' అనెను.

అనవుడు ధనంజయుఁడిట్లనియె "ప్రియురాలా! నీకిల్లులేకేమి? పశ్చాత్తప్తుఁడైన నీ మగని హృదయమే నీకు దివ్యభవనమైన యిల్లు. క్రొత్తగా నీవు కాపురమునకు వచ్చిన నాఁటి కాలముఁదలచుకొ! నా కన్నులకు నీవెంతప్రేమమై యుంటివి. కర్మవశమున నేను తిప్పుదారుల పట్టితిని. నేను భ్రష్టుఁడనైతిని. ఘోరపాపము చేసితిని. కాని ఉమా! నమ్ము నామాట. నీ యనురాగము నేనెన్నఁడు మఱువలేను. క్రొత్త పెండ్లికూఁతురవై యెక్కుడు మనోహరమైన దానవై, యెక్కుడు మధురమైనదానవై కనఁబడుచున్నావు. నవోఢవై మా యింటికివచ్చి నా శిక్షలోనె పెరిఁగి నిండు జవ్వనముదాల్చిన నాటికంటె వేదనాదోదూయమానమైన నాహృదయమున కిప్పుడెక్కువ ప్రియమును గూర్చుచున్నావు. ఇఁకమీఁదట ధర్మార్థ కామములయందు నిన్నతిచరింపను. ఈ ధర్మపరిపాలనము నాచేఁ జేయింపుము! నాయందు దోషారోపణము లేకుండ నన్నుఁగాపాడిన పరమేశ్వరునియెడల నేను కృతజ్ఞుఁడనై యుండెదను."

ఉమ మేను కంపించెను. కన్నీటిచేఁ గంఠము పూడిపోయెను. మానవ హృదయములోఁ బ్రభవించు ప్రతిరసమును లోఁబఱచుకొని యడఁచివేయవచ్చును. జ్ఞాపకమున్న ప్రతి విషయమును జెరిపివేయవచ్చును. కాని పతివ్రతయైన కాంత తాను మున్ను మనసార వలచి ప్రేమించిన యా మనోనాథుని యనురాగము మాత్రము మఱపజాలదు. మృదువైన స్త్రీ హృదయమునుండి బయలుదేఱుచున్న ప్రేమరసచిహ్నముల నడఁచి కప్పిపుచ్చుటకై యా తపస్విని యెంతో ప్రయత్నము చేసెను. ఎట్టకేలకామె మాటలాడినప్పుడు మనోదౌర్బల్య మెంతదాచినను దాగక స్పష్టమయ్యెను. "ఓ ధనపురప్రభూ! దుర్బలురాలైన యాఁడుదానిని వదలివేయుము. మనము కలసికొన్నాము. విడిపోయినాము. ఎవరు త్రొక్కినపుంతలో వారు నడుచుట మంచిది. పరమేశ్వర కైంకర్యమునందు నాకభిలాష యున్నది. దానిచే నాకు దుఃఖోపశమన మగును. సంసారములో నాకట్టి యభిలాష కలుగలేదు. ధనపురస్వామీ! మీకు ముఖ్యముగ గొప్ప కర్తవ్యాంతరములు గలవు. మీ పేదరైతులకు సాయము చేయవచ్చును. మీ స్థితికిఁ దగినట్లు మీదేశమునకు, జాతికి సేవచేయవచ్చును. ఉత్కృష్టధర్మములు మీచేతఁ జేయించుటకు మిమ్ము గాపాడిన పరమే

శ్వరుని గొలువవచ్చును. స్త్రీలోలతకంటె నివి మహోత్కృష్టములైన ధర్మములు కావా? స్వామీ! ఈ ధర్మముల నెఱవేర్చి దీనురాలైన యీ యాఁడుదానిని దాని యిచ్చవచ్చిన తెఱంగున బోవుటకు వదలివేయరాదా? ఇట్లు చేయుట బాగుండును. తరువాత నాతల నరసినప్పుడు సుఖము గలిగెనంటిమేని మనము మొదట దేనిలోఁ బ్రవేశించి కృతకృత్యముగా లేకపోతిమో యీ సంసారసంబంధమైన సమాగమమును సుఖము నపేక్షింపక కేవల మిత్రములవలె నుండవచ్చును."

"ప్రియురాలా! ఉమా! నేను కృతకృత్యుఁడను కానిమాట నిజము. నీవు నాప్రక్క మఱియొకసారి నిలుతువేని దైవసహాయమున నేనీసారి కృతకృత్యుఁడను గాఁగలను. నేను నీకపకారముఁ జేసితిని. అపమార్గములు పట్టితిని. తిరిగి గృహస్థుఁడ నగుటకు నాకుఁ దోడ్పడుము. దేవునియెదుట చాగిలంబడి మ్రొక్కుట మఱచిన నేను నీయెదుటఁ జాగిలపడి మ్రొక్కెదను. ఓ నాదేవతా! నాకు సహాయము చేయుము. నీకుఁ దగినవాడను నేననిపించుకొనుటకుఁ దోడ్పడుము."

"ప్రాణేశ్వరా! లెండు లెండు. నేనెల్లకాలము నీభార్యనే యనిపించుకొందును. నామాట నమ్ము! నేను జీవించినంతకాలము, నేను నీభూమిమీఁద దిరిగినంతకాలము, నా హృదయమున మీపైఁ బ్రేమ నిలిచియుండును. ప్రాణేశ్వరా! ఇందు మోసమేమియు లేదు. నా జీవితము పరమేశ్వరుని కర్పణము చేయుచున్నాను గనుక సన్న్యాసుదానినిగఁ జేసిన యీ పరమేశ్వరుఁడు అతఁడు తన హృదయములో భక్తివిషయమునఁ బెంపవలసిన ప్రేమరసమును బెంచుగాక! నా మనసులోనున్నది నిష్కల్మషముగా నొప్పుకొంటిని గావున నేనేర్పరుచుకొన్న పద్ధతిప్రకారము నడుచుకొననిండు. నా హృదయమున మీ విగ్రహమే యుండునని మీరెఱుఁగుదురు. మఱుగులేక మన తలంపుల నెఱుఁగజాలిన పరమేశ్వరునకు నేనుజేయు ప్రార్థనలో మీపేరుగూడ గలిపి చేసెదను. కాషాయవస్త్రధారణము చేసినపిదప మరల సంసారమునం దెట్లు ప్రవేశింపఁగలను?" అని యుమ యేడ్చుచుఁ బలికెను.

"కాదు. ఓ ప్రియురాలా! ఓ స్త్రీశిరోమణీ! నీ హృదయము నాఁటిధర్మాచరణమునందు నిశ్చితమైయున్నదేని యీ కాషాయవస్త్రధారణము నిన్ను వారింపదు. వివాహమునాఁటి రాత్రి నీవు భుజముపైఁ గట్టుకొన్న యాయినుపబిళ్ళ నీవు తీసి పారవేయలేదు. అశుభచిహ్నమింకను ధరించుటవలన నీవు తపస్వినీశీలము సంపూర్ణముగా గ్రహింపలేదనియు, నిప్పుడిప్పుడే దానినిఁ జవిచూచుచుంటివనియు నేనెఱుఁగుదును.

ఏకీభవము సంభ్రమైన మార్గమునకుఁ జేరినవారు మరలఁ బూర్వాశ్రమములకు వెళ్ళవచ్చును. ఆకస్మికవివాహమువలన నీవు నాదానవైయుంటివి గావున నేను నిన్నుఁ దీసికొనిపోవుటకు శక్తి గలదు. నీమీఁది ప్రణయ మెన్నఁడు విడువనట్టిదగు, ప్రపంచమునందలి స్త్రీలకెల్ల శిరోభూషణమవై, పరమపావన చరిత్రవై, మధురశీల నిధివై వెలయుచుండెడు నిన్ను దగవిధిగ యాదరించుకొనుటకుఁ బ్రయత్నము సేయఁ దలఁచునట్టి పురుషానుగ్రహము జేయుము. హృదయపీఠ మధిష్ఠింపుము."

హిందూదేశమందలి శీతకాలపు సూర్యమండలము ప్రభావంతమై కొండలమీఁదను నాగవనములమీఁదను నిజకాంతిపుంజములు వెదజల్లి, పరిసర ప్రదేశంబులు రంజిల్లఁజేసి నిజ స్వామి స్త్రీవలెఁ బ్రణయము జూపి నిర్మలమైన స్త్రీ వలె క్షమగల్గిన యా స్త్రీ రత్నమునకు సుస్నిగ్ధ కాంతులు గురిసెను. సమీపమందున్న గుళ్ళలో గంటలు కంగుకంగుమని యా యుదయకాలమున మ్రోఁగుచుండఁ [illegible] గృహము విడిచి తిరుగుచున్న యొక యంగన పిదప పశ్చాత్తాపముచేత మరలఁ గృహిణియయ్యెను. తిప్పుదారి త్రొక్కిన యొక మానవునకు భార్యాప్రణయామృతము రక్షింపఁబడెను.

ముప్పదియొకటవ ప్రకరణము

తాల్పుకారు గ్రామము.

తాల్పుకారు గ్రామమున వసంతకాలము నెలకొనియెను. లేఁతవెదురు చెట్టుమీఁదఁ బచ్చనియాకు మృదులమై కనఁబడెను. ఉన్నతమైన రావిచెట్లు పాతయాకుల విడిచి మెత్తనికెంజిగుళ్ళు దొడిగెను. మామిడిచెట్లు పూచెను. చుట్టుప్రక్కలనున్న ప్రదేశ మంతయుఁ గ్రొమ్మావి పూగుత్తులలో గమగమలాడుచుండెను. మల్లెతీఁగ సువాసనల వెదజల్లు చెల్లుగ్రొమ్మొగ్గలు దొడిగి నేలపై మొలిచిన మొక్కలమీఁద నక్షత్రములు రాల్చినట్లు శోభనొసఁగుచుండెను. హిందూదేశజనులకు మిక్కిలి ప్రియమైన తామరపువ్వు ప్రతిష్ఠియ చెఱువునందు వికసించెను.

హేమునకు బిందుతోఁ గలిసి స్వగ్రామమందు స్వగృహముఁ జేరెను. చెఱువాలలో [illegible] తోఁ గొంతకాలము వసించి వచ్చినతరువాత స్వగృహావాసము వారికి [illegible] కొనినట్లుండెను. హేమచంద్రున కిప్పుడు చేతినిండ బనియుండెను.

క్రొత్తగా వచ్చెడు కట్టించినచావడి యొక్కయాస్తనముఖములు పరిమళ పత్నీకై తైతులలో నిండియుండెను. ఉత్సాహ సూర్యాస్తమయమున నగర వాసము లన్ని కలసి నిర్బంధములు లేక బిందు స్వేచ్ఛగా బంధుమిత్రులకు, నిగనిగ పోరుగు వాడియుండెడు బోయుమాయు చుండెను. సూర్యోదయము కాగానే యామె గంగా స్నానమునకుఁ బోయి స్నానము చేయుచుండెను. మధ్యాహ్నకాలమున మగఁడు పత్నీకాపురముతోఁ బనిగలిగియున్నప్పుడు తలుచుగా నామె పిన తల్లిం జూడఁబోయి యచట జీవించి యున్నందుకు, దాని మగఁడు దాని ననురాగముతోఁ జూచు చున్నందుకు సంతసించి యానందబాష్పములు విడుచు చుండెను. బిందుయొక్క చిన్నబిడ్డలు తనయొద్దనున్నప్పుడు చుట్టుఁ జేరి ముద్దుపలుకులు పలికి, యామెను ముద్దుపెట్టుకొని, తలవెండ్రుకలు లాగి, యామెహృదయము సంతోష పూరితము జేయుచుందురు.

శరచ్చంద్రుఁడు సుధను వివాహము చేసికొని నవవధూసమేతుఁడై స్వగృహవాసము చేయ నారంభించినది మొదలుకొని యనేక దినములు మాసములు వివాహవేదనా దోషాయమానములై భగ్నమనోరథములై యుండియు నన్యోన్యప్రీతిని విడువక యుండిన యాయువతీహృదయము నవసమాగమ సౌఖ్యాంబుధియం దోలలాడెను. సుధయొక్క కాటుక కన్నులు మరల నొకసారి మెఱసెను. ఆమె చెక్కులు మునుపటివలెఁ గృశించినవి కాక స్నిగ్ధములై సంతోషసూచకములై యుండెను. గతసంవత్సరమున వేసవికాలములోఁ దన యప్పగారియింటఁ బిల్లికూనలం బెట్టుకొని యాడుకొన్న యాచిన్నబిడ్డ నేఁడు వలపులకు మక్కియై, సొగసులు తిరుగొత్తి క్రొత్తదియై మెఱయుచుండెను. ఆమెయెంత యడంచుకొన్నను నడఁగని హాస్యమయిన యానందము హృదయమున నిండి యుండెను. ఆమె గృహకృత్యములందుఁ దగిలి యింటికి నవ్వుదెచ్చుకొని మగనికి వంట జేయును. శరచ్చంద్రుఁడు పగలెల్ల పనిచేసి గృహమునకు వచ్చినప్పుడు సుధదగ్గరక యతఁడు పెట్టుకోఁదలఁచిన ముద్దు తప్పించుకొనుటకో లేక గదిలోనికి వచ్చి ముద్దుపెట్టుకొమ్మని యాహ్వానము చేయుటకో సిగ్గున గదిలోనికిఁ జనును.

ఆగ్రామవాసులు పునర్వివాహము చేసికొన్న యువతి యని సుధ నప్పుడప్పు డనాదరణముఁ జేయు చుందురు. సనాతనునిభార్యకూడ మధ్యాహ్నము తీరికయైనప్పుడు బిందు గృహమునకు వచ్చి యానాటి క్రొత్తపద్ధతులను గూర్చివిచారించు చుండును.

ఒకనాఁ డామె యేడ్చుచు నిట్లనెను "అక్కా! అప్పుడు నేను చెప్పలేదా! కలకత్తావెళ్ళితే మీకేమియుండదని చెప్పి కల్లుగట్టుకొని పోలేదూ? అమ్మాయి సుధ

ఏకీలము సంద్రైన సూర్యనపుగాఁ జేరినవారు వరకుఁ బూర్వాశ్రమములకు వెళ్ళవచ్చును. అనుశ్వరివిహ్నమువలన నీవు నాదాసవైయుంటివి గావున నేను నిన్నుఁ దీనికొఱకు పోవుటకు హెచ్చరించెదను. నీవిఁకమీఁద ప్రణయ మొప్పఁదా విడువక పట్టికొని, ప్రపంచమునందలి స్త్రీలకెల్ల శిరోవతంసమై, పరమపావన చరిత్రవై, మధురశీల సీమవై వెలయుచుండఁగ నిగవధి గ్ర యాచింపఁ గొనుటకుఁ బ్రయత్నము చేయఁ దలఁచువట్టి పురుషునిగృహము జేరుము. హృదయపీఠ మధిష్ఠింపుము."

హిందూదేశమందలి శీతకాలపు సూర్యబింబము ప్రభావంతమై కొండమీఁదను గోపురముమీఁదను నిజకాంతిపుంజములు వెదజల్లి, పరిసర ప్రదేశంబులు రంజిల్లఁజేసి నిజ ప్రియుని స్త్రీవలెఁ బ్రణయము జూపి నిజప్రియుని స్త్రీవలె క్షమగల్గిన యా స్త్రీరత్నముపై నస్తమయంతులు గురిసెను. సమీపమునందున్న గుళ్ళలో గంటలు కంగుకంగుమని యా యస్తమయకాలమున మ్రోయుచుండ [illegible] గృహము విడిచి తిరుగుచున్న యొక యంగన మిగిలి పశ్చాత్తాపముచేత మరల గృహిణియయ్యెను. అప్పుడారి ప్రోక్కిన యొక మాన పురుషు భార్యాగ్రహణయోగ్య శరణముచే రక్షింపఁబడెను.

ముప్పదియొకటవ ప్రకరణము

తాల్పుకారు గ్రామము.

తాల్పుకారు గ్రామమున వసంతకాలము నెలకొనియెను. లేఁతచిగురు చెట్లమీఁదఁ బచ్చనియాకు మృదుతరమై కనఁబడెను. ఉన్నతమైన రావిచెట్టు పాతయాకుల విడిచి మెత్తని కెంజిగుళ్ళు దొడిగెను. మామిడిచెట్లు పూచెను. చుట్టు ప్రక్కలనున్న ప్రదేశ మంతయుఁ గ్రొమ్మావి పూగుత్తులతో గమగమలాడుచుండెను. మల్లెతీఁగ సువాసనల వెదజల్లు తెల్లని క్రొమ్మొగ్గలు దొడిగి నేలపై మొలిచిన మొక్కలమీఁద నక్షత్రములు రాల్చినట్లు శోభనొసఁగుచుండెను. హిందూదేశజనులకు మిక్కిలి ప్రియమైన తామరపువ్వు ప్రతిష్ఠయ చెఱువునందు వికసించెను.

హేమయు బిందుతోఁ గలిసి స్వగ్రామమందు స్వగృహముఁ జేరెను. చెఱసాలలో [illegible] కొంతకాలము వసించి వచ్చినతరువాత స్వగృహావాసము వారికి [illegible] చేసినట్లుండెను. హేమచంద్రునకిప్పుడు చేతినిండ పనియుండెను.

క్రొత్తగా వతఁడు కట్టించినచావడి యంతయు నాస్తరణములు పరిమళ పుష్పాది ప్రైతులలో నిండియుండెను. ఉత్తరపు మగ్గానను నగీనానము కలసఁ గాగిన నిర్బంధములు లేక బిందు స్వేచ్ఛగా బంధుమిత్రులతో, సిగ్గుపోవఁగా వాడియుండెడుఁ బోయుచుండు చుండెను. సూర్యోదయమున కాలముననే యామె గంగకుఁ బోయి స్నానము చేయుచుండెను. మధ్యాహ్నకాలమున మగఁడు పనికాపుతోఁ బనిగలిగియున్నప్పుడు తఱుచుగా నామె పినతల్లిం జూడఁబోయి యుప జీవించి యున్నందుకు, దాని మగఁడు దాని ననురాగముతోఁ జూచుచున్నందుకు సంతసించి యానందబాష్పములు విడుచుచుండును. బిందుయొక్క చిన్నబిడ్డలు తమయున్నన్నుచుట్టుఁ జేరి ముద్దుపలుకులు పలికి, యామెను ముద్దుపెట్టుకొని, తలవెండ్రుకలు లాగి, యామెహృదయము సంతోష పూరితము జేయుచుందురు.

శరచ్చంద్రుఁడు సుధను వివాహము చేసికొని నవవధూసమేతుఁడై స్వగృహవాసము చేయ నారంభించిన నాఁటినుండి అనేకదినములు మాసములు నిరవాకేదనా దోషము మానములై భగ్నమనోరథములై యుండియు నన్యోన్యప్రీతిని విడువక యుండిన యాయువతీహృదయము నవసమాగమ సౌఖ్యాంబుధియం దోలలాడెను. సుధయొక్క కాటుక కన్నులు మరల నొకసారి మెఱసెను ఆమె చెక్కులు మునుపటివలెఁ గృశించినవి కాక స్నిగ్ధములై సంతోషసూచకములై యుండెను గతసంవత్సరమున వేసవికాలములోఁ దన యప్పగారియింటఁ బిల్లకూనలం బెట్టుకొని యాడుకొన్న యాచిన్నబిడ్డ నేఁడు వలపులకు మక్కియై, చెక్కులు తళుకొత్త క్రొత్తదియై మెఱయుచుండెను. ఆమెయెంత యడంచుకొన్నను నడఁగని హాస్య మయిన యానందము హృదయమున నిండి యుండెను. ఆమె గృహకృత్యములందుఁ దగిలి యింటికసవూడ్చుకొని పగటికి వంట జేయును. శరచ్చంద్రుఁడు పగలెల్ల పనిచేసి గృహమునకు వచ్చినప్పుడు సుధవద్దగాక యతఁడు పెట్టుకోదలఁచిన ముద్దు తప్పించుకొనుటకో లేక గదిలోనికి వచ్చి ముద్దుపెట్టుకొమ్మని యాహ్వానము చేయుటకో సిగ్గున గదిలోనికిఁ జనును.

ఆగ్రామవాసులు పునర్వివాహము చేసికొన్న యువతి యని సుధ నప్పుడప్పు డనాదరణముఁ జేయుచుందురు. సనాతనునిభార్యకూడ మధ్యాహ్నము తీరికయైనప్పుడు బిందు గృహమునకు వచ్చి యానాటి క్రొత్తపద్ధతులను గూర్చి విచారించుచుండును.

ఒకనాఁ డామె యేడ్చుచు నిట్లనెను "అక్కా! అప్పుడు నేను చెప్పలేదా! కలకత్తా వెళ్ళితే మీకిష్టముండదని చెప్పి యిల్లుగట్టుకొని పోలేమా? అమ్మాయి సుధ

యేమైనదో చూడు ! నాతియ్యాని పెరుగంటే యెంతో యిష్టముకదా ! నవ్వ్యాకూడా ఆయమ్మకు ఊసే రాదుగదా. చిన్నప్పుడే పెనిమిటి పోయిన ఆపిల్ల తిరిగి పెండ్లాడునని యెవరను కొన్నారు. ఏమమ్మా అక్కా ! నేనప్పుడు నీతో చెప్పలేదూ. కాలేజీలలో చదువుకొను పిల్లలు నెంతకైన సాహసులే, బ్రతికి యున్నవారిని గొంతుకలుకోసి చంపివేయ గలరు. వాళ్ళు." నవ్వుచు నామెకు ఒండిట్లనియె. "శరచ్చంద్రుఁడు మాచెల్లెలి గొంతుకింకను కోయలేదు. అతడు దానిని వివాహము చేసికొని యావజ్జీవము సుఖపెట్టఁ దలఁచుకొన్నాడు."

"అది గొంతుకోయుటకన్న నన్యాయముకాదా ? అక్కా ! ఊరిలో నలుగురు ఏమి చెప్పుకొనుచున్నారో విన్నావా?" యని యామె పరిహాసముగాఁ బలికెను.

'అక్కా ! ఊరిలోనివాండ్రు నోరునొప్పి పెట్టినదాక యిష్టమువచ్చినట్లనుకొనీ ! మన మది లెక్కసేయఁగూడదు. శరచ్చంద్రునికంటె మంచివాఁడు మన గ్రామములో లేఁడు. మా సుధకంటె మంచియిల్లాలును లేదు. సజ్జనరక్షకుఁడైన భగవంతుఁడు వారిని వర్ధిల్లఁజేయవలెను."

"అక్కా ! ఔనౌను. పాపము సుధమంచిదే. నేను కాదనఁగలనా ? నాతియ్యా పెరుగంటే ఆబిడ కిప్పుడుకూడ ఇష్టమే. నన్నిప్పటికి అక్కయ్యా అని పిలుచుచునే యుండును. ఆచిన్నదానిని నారాయణమూర్తి కాపాడవలెనమ్మా !" అని కన్నీటిచుక్క విడిచి యామె యవలికిఁ బోయెను.

తక్కిన యిరుగుపొరుగువారుకూడ నట్లే చేసిరి. కాలము చెడిపోయిన దనియు యువయువతీ జనంబులు చెప్పినట్లు వినక విధేయతలేక పాడగుచున్నారనియు, వారు చెప్పుకొని విచారించిరి. విచారించినను శరచ్చంద్రుని యొక్కయు సుధయొక్కయు మంచి తనముమాత్రము వారు మరువఁజాలరయిరి. మంగలిది కోపముచేత కొన్నాళ్ళు సుధను చూచుటకు రాకపోయినను నొకనాఁడు చీకటి పడిన తరువాత వచ్చి చూచి యామె కాళ్ళమీఁదపడి యేడ్చెను. చాకలిది మొదట నిష్టము లేకపోయినను దరువాత వారిబట్టలుదుక నారంభించెను. పరువుగల యిండ్ల బుట్టిన స్త్రీలు వారియింటఁ జరుగు పండుగులకుఁ బబ్బములకు సుధను బిలువ సాహసింపరైరి. కాని యెవరిమీఁదను లేశమైనను క్రోధము నిలుపక యెల్లవారిని సమానప్రేమతోఁ జూచునట్టి యాపరమ సాధుశీలను జూచుట కెల్లవారు నామెయింటికే వచ్చుచుండిరి. హిందూదేశములో వెలి

యొక్క తీవ్రత మిక్కిలి తగ్గినది. పూర్వాచారములయం దభిమానము గలిగియుండినను జనులు కార్యవాదులు.

తారుణీమల్లికుఁ డొకనాఁడు వర్ధమానమునుండి స్వగ్రామమునకు వచ్చి శరచ్చంద్రునిఁ జూచి యిట్లనియె. 'కాలప్రవాహమున కెదురీత లాడినఁ బ్రయోజనములేదు. శరచ్చంద్రుఁడా! నీవు గట్టిమనోనిశ్చయము కలవాఁడవు. అనుకొన్నదేదో చేసితీరుదువు. దీని సంగతి సంగ్రహముగా మూఁడుముక్కలలోఁ జెప్పెద వినుము. బ్రాహ్మణులకు మంచి సంతర్పణము కావలెను. కాఁబట్టి గొప్పసంతర్పణ మొకటి చేయుదము.' ఆలాగునే తారుణీమల్లికునియింట నొక బ్రాహ్మణసంతర్పణము జరిగెను. తాల్పుకారు గ్రామములో నటువంటి దెన్నఁడు జరుగలేదు. దానితోఁ శరచ్చంద్రునిపై గలవిరుద్ధభావము కొంత మందగించెను.

ఉదయం నొకసారి తండ్రియింటికి వచ్చి చాలదినము లుండెను. ఆమె కాషాయ వస్త్రములు విడిచి ముత్యాలతోను రత్నాలతోను మెఱసెను. ఆమె తల్లికి మఱియొకసారి నమస్కరించి బిందును గౌఁగిలించుకొని హృదయములు సంతోషముతో నుబ్బజేసెను. ఆమె శరచ్చంద్రుని గృహమునకు బోయి కంఠములో బంగారపు గొలుసు, చేతులకు మురుగులు పెట్టుకొని తన్నుజూడవచ్చిన వారిం జూచి సిగ్గున దలవంచుకొని మాటలాడక యున్న సుధను గనుగొని యానందపారవశ్యమున బాష్పములు విడిచెను. విడిచి యామె సుధను గౌఁగిలించుకొని 'చెల్లెలా! భగవంతుడు రక్షింపవలె నమ్మా నిన్ను" అని యామె పేటలు గల ముత్యాలహారమును దన మెడలోనుండి తీసి సుధ వక్షస్థలమున వేసి "ఇది నీవు వేసుకో సుధా! నేను చిన్నప్పటినుండి నిన్ను నాచెల్లెలు లాగున చూచుకొన్నాను. చిన్నతనమందే నీవు వితంతువై హాయిగా నున్నందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. ఈముత్యాలహారము నీబావగారు ప్రథమప్రణయములో నాకిచ్చినది. భగవంతుఁడు పరమ దయాళువై నాకాయనను మరల దయచేసినాఁడు' అని పలికి యామె యంతకంటె నెక్కువ మాటలాడలేక పోయెను. సుధహృదయము తన హృదయముతోఁ జేర్చి కౌగిలించి యాసమయమున నామె విడిచినబాష్ప బిందువులు, నిజముగా మితిలేని దుఃఖమనుభవించిన స్త్రీ తనవలె మిక్కిలి దుఃఖము ననుభవించిన మఱియొక సోదరిమొదలఁ జూడవలసిన ప్రేమానుబంధమును వెల్లడి చేయుచు హృదయమును భేదించుకొని వచ్చిన వని చెప్పవచ్చును.

సుధ తనసోదరభార్యయైనదని విని కాని దానిఁజూచుట కెంతో యుబలాట పడుచుండెను. కాని ప్రస్తుత మామె ప్రయాణము చేయుటకు వలను పడకపోయెను. జగన్నాథయాత్రయు జగత్కిశోరరాయునితల్లి ప్రార్థనలు ఫలించిన వనియు, నచిర కాలములోనే జగత్కిశోరరాయుల కుటుంబము క్రొత్తశిశువు నలంకరింపఁబడు ననియు, జగత్కిశోరుని మేనత్తలు మితిలేని యానందముఁ దెలుపు వాక్యములతో నమకిల్లి కొక యుత్తరము వ్రాసిరి. అతని మేనత్తలు రాణిగంజలోనున్న ఇంగ్లీషు డాక్టరును బలిమాలి పిలిపించిరి. ఏమిపిల్ల పుట్టునని తెలిసికొనఁదలఁచిన వారి కెన్నోసాధలరిగిరి. ఆఁడుపిల్ల పుట్టక, తప్పక మగపిల్లవాఁడే పుట్టునని యాతఁడు దృఢముగఁ జెప్పలేనందున వట్టి పనికి మాలినవాఁడని యా ముసలమ్మలందఱు నిర్ధారణముచేసి పనికిమాలిన తనమునకు వాని జీవాట్లు పెట్టిరి.

వారములు దినములట గడచిపోయెను. ఒకనాఁడు వెన్నెలలేని రాత్రి సుధ తాళ్ళచెఱువునకు వెళ్ళెను. త్రాటిచెట్లు ఱెక్కలనుండి మట్టలను పైకెత్తుకొనియుండెను. ఆకులసందునుండి సన్ననిగాలి వెలుదేఱెను. నక్షత్రములకాంతి చిన్న తిలఁగలుగల నీటపైఁబడెను. నిశ్శబ్దమైన యా రాత్రికాలము నెవో మూరస్థ నికుంజమునుండి గండుఁ గోయిల సరసమైన పిన వాఙ్మాధుర్యమును గ్రుమ్మరింపఁ జొచ్చెను. సుధయొక్క మేలి ముసుగు తలనుండి జాఱి మెడమీఁద బడెను. తుమ్మెద ఱెక్కలవంటి నల్లని దట్టంపు కురులు ముఖారవిందము ప్రక్కనుండి జాఱి వక్షస్థలమునఁబడెను. ఆమె చీరచెఱఁగు సాయంకాలపు మందమారుతములచే నించుక యిట్టటు గొట్టుకొనెను. ఆ చెఱువుగట్టు మీఁద నిలువఁబడి ప్రకృతిసౌందర్యమును నిరీక్షించుచుండఁ నామె చెవులకేదో సన్నని చప్పుడు వినఁబడెను.

ఆమె భర్తయొక్క మనోహరమైన దీర్ఘకాయము పొదచాటునుండి కనఁబడెను. సుధ తిండె కేలఁబెట్టి పింపఁగాన్పుపటికె సహజమైన లజ్జ దన్నావేశింప ముద్దుగా మేలి ముసుగు మొగమున వైచికొనెను.

"నేఁ ముసుగు గొనెదవే? మసఁ ప్రక్క గిఁ బెట్టి చూమువా. కెవ్వరును లేరు ప్రియురాలా! మన మింక నొకరి యొకరిన్ల ప్రశ్నలను జేయవలసి యున్నాము. అది నీతోఁ జెప్పుటకే వచ్చితిని. ఇప్పుడయినను నీవు సిద్ధము కాకికే వెళ్ళవలెను. మాయమ్మను జూచి దాఁగొని యాంగ్లేయులను ఎదుర్కొనలేను."

"అలాగే చేయవచ్చును. ఎంత త్వరగా వెళ్ళిన నంత మంచిది. మన వివాహమైనది మొదలుకొని మీ యమ్మగారిని జూడవలెనని నా కెంతో యభిలాషయున్నది. మా యయ్యయైనను నామీద నింత ప్రేమ గలిగియుండలేదు. ఇప్పుడు పూర్వకాలపు సంగతులు నామనంబునకు జ్ఞప్తికి వచ్చుచున్నవి. అవి యొకప్పుడు వరుసగా వచ్చును. వసంతకాలపు సాయంకాలమున నే నిక్కడ నిలువబడియుండగా నా కొక్క సంగతి జ్ఞాపకము వచ్చుచున్నది. నేను చిన్నదాననైనప్పుడా పంద్రెండు సంవత్సరముల క్రిందట మా యమ్మతో గలసి నే నీచోటుకు వచ్చుచుండెడి దానను. నేను పిల్లనైనప్పుడే మా యమ్మ చనిపోయినది. భగవంతుడు నాయం దనుగ్రహము కలిగి అంత మంచిదానిని, అంత దయ దలదానిని, అంత ప్రేమ గలదానిని నాకు దయచేసినాడు. నన్ను వారికడకు దీసికొని పోయిన నా బాష్పజలముతో మీయమ్మగారి కాళ్ళు కడిగి యామె దీవన పొందెదను. అటువంటివారి దీవెనలు మన కీజీవితమున నెంతో సహాయము జేయును."

"సుధా! ఔను. నీవు నిజము చెప్పితివి. మహాఋషివంటి పెద్దల దీవెనలు మన మతమున కెంతో సహాయపడును. నీవు నాకల్లప్పుడు తోడునీడవై యుండుము. నాజీవితకాలముమీద నుదయించిన క్రొత్త జ్యోతివి. నీవు నాయానందము. నీవు నా కాధారము. నీవు నాకు గంభీరోపదేశమున కారణివి. నీవు నాదానవు"

అని శశిచంద్రుండు పలికె వికసించుచున్న మల్లెపువ్వువలె మనోహరముగా నున్న యా బాలిక మెడకు తన బాహువులు పెనవేసి ప్రేమయుక్తముగా నా యంగనముఖ మెంతోసేపు మూర్ధానించెను. ఆ పట్టు విడిపించుకొనుట కామె యెంతో ప్రయత్నముచేసి యెట్టకేల యాతని బాహువులనుండి తప్పించుకొని కంపించుచు మేనితో సిగ్గుదేలుపు నెమ్మొగముతో దడదడకొట్టుకొను గుండెలో నెట్లచాలుకని దాగొనుచుండెను.

రాత్రి నిశ్శబ్దము నుండెను. స్వచ్ఛందముగు తొల్పొకాంతి పూలపువుమీద

— ♦ సమాప్తము —

లక్ష్మీ ప్రెస్, ఏలూరు.